# శ్రీ విష్ణు సహస్రనామము

( సప్తమ భాగము  601-701 నామ వివరణ )



మాస్టర్ కె. పార్వతికుమార్

ఈ ప్రచురణ యొక్క కంటెంట్ సద్భావన చర్యగా మరియు వ్యక్తిగత ఉపయోగం కోసం మాత్రమే ఉచితంగా ఇవ్వబడుతుంది. దానిని అలానే ఉంచడం మన బాధ్యత.
ఏ విధంగానైనా లేదా ఏ ప్లాట్‌ఫారమ్‌లోనైనా వాణిజ్యీకరణ నిషేధించబడింది, అలాగే ప్రచురణకర్త యొక్క వ్రాతపూర్వక అనుమతి లేకుండా పంపిణీ, లేదా పూర్తిగా, లేదా కొంత భాగాన్ని ప్రచురించడం నిషేధించబడింది. అన్ని హక్కులూ గ్రంధకర్తవి, ప్రచురణకర్తవి.

# శ్రీ విష్ణు సహస్రనామము

( సప్తమ భాగము 601-701 నామ వివరణ )



మాస్టర్ కె. పార్వతికుమార్

ధనిష్ఠ

# ధనిష్ఠ

## స్వచ్ఛంద సేవా సంస్థ

**"ధనిష్ఠ"** అనగా ధనపూరిత దివ్యవాయువు. ధనమనగ దివ్య సంపద. అది కేవలము డబ్బుకాదు. డబ్బుతో సంపదను కొలువ లేము, కొనలేము. సంపద జీవన వైభవమునకు సంబంధించినది. మన శ్రుతులలో అగ్ని, వాయువు, ఇంద్రుడు, బృహస్పతి యిత్యాది దివ్య ప్రజ్ఞలను ధనమనిరి. ఆర్ష విజ్ఞానమే నిజమైన ధనము. అట్టి ధనమును కూర్పుచేసి వ్యాప్తి చేయుటకు "ధనిష్ఠ" 1992లో జన్మించినది.

**"ధనిష్ఠ"** మాస్టర్ పార్వతీకుమార్‌గారి వాక్కును సి.డి., ఆడియో, వీడియో క్యాసెట్ల రూపములోను, పుస్తకముల రూపము లోను భద్రపరచి సత్సాధకుల కందించునట్టి యజ్ఞార్థకర్మను చేపట్టినది.

**"ధనిష్ఠ"** ఒక చక్కని గ్రంథాలయమును, ధ్యాన మందిరమును సద్గోష్ఠికై వలసిన వాతావరణమును – "జగద్గురు మందిరము"గ ఏర్పరచి, ఆసక్తి కలవారికి ధ్యానము, స్వాధ్యాయము నేర్పుచున్నది.

# ముందుగా ఒక మాట

శ్రీ గురుదేవులు, మాస్టర్ కంభంపాటి పార్వతీ కుమారు గారు, శ్రీ విష్ణుసహస్రనామ వివరణ అనే జ్ఞానయజ్ఞాన్ని ప్రవచన రూపములో, 1993 లో విశాఖపట్టణములో, రాధామాధవ ప్రాంగణమున ప్రారంభించి, కొన్ని సంవత్సరములు కొనసాగించిరి. వారు శ్రీ విష్ణుసహస్రనామము లో గల అన్ని నామములకు వివరణ ఇచ్చినప్పటికి, కొన్ని నామముల వివరణ అందుబాటులో లేవు. అందుబాటులో ఉన్న నామములను ముద్రణ రూపము లో అందజేయవలెనన్న సదుద్దేశము శ్రీ గురుదేవులకు విన్నవించుట జరిగినది. వారు ముందుగా మన మాసపత్రిక 'నా వాణి' లో నామముల వివరణ ప్రచురించమనగా, శుభకృత్ ఉగాది సంచికతో ధారావాహికగా అవి ముద్రణ రూపము దాల్చుట మొదలైనది. వారి అనుమతి, ఆశీర్వచనములతో శ్రీ విష్ణుసహస్రనామముల వివరణ

e-Books రూపముగా పాఠకుల ప్రయోజనము కొరకు తీసుకుని రావడము జరుగుచున్నది. ఈ ప్రయత్నములో భాగమే ఈ సప్తమ భాగము.

ఈ పుస్తకములలో శ్రీ గురుదేవుల ప్రవచనములు వినబడినంత, అతికొద్ది సవరణలతో అందజేయడమైనదని గమనించగలరు. ప్రతి శ్లోకములో నామముల విభజనకు మాస్టర్ E.K. గారు ఆంగ్లములో వ్రాసిన విష్ణుసహస్రనామములో నామ విభజనను ప్రాతిపదికగా తీసుకొనుట జరిగినది.

ఈ ప్రయత్నములో పాల్గొనుచున్నవారందరికీ ఈ వివరణలు అత్యంత మరపురాని, ఆనందకరమైన అనుభూతులు కలిగించుచున్నవి. ఈ యజ్ఞములో పాలుపంచుకుంటున్న వారందరికి మాస్టరుగారి ఆశీస్సులు అందాలని మాస్టరుగారికి మా ప్రార్థన. ఈ పుస్తకము చదివిన వారందరికి గురుదేవులు అందించిన అమూల్యమైన విషయములు అత్యంత సులభముగా హృదయస్థమై, స్ఫూర్తినిచ్చి, సాధనకు మరింత ఉన్ముఖులను జేయగలవని మా నమ్మకము.

శ్రీ విశ్వావసునామసంవత్సరమున, 2026 జనవరి నెల మొదటి రోజున శ్రీ విష్ణు సహస్రనామ వివరణ ప్రవచింపబడిన పవిత్రమైన రాధామాధవ ప్రాంగణములోని, జగద్గురు మందిరములో ఈ సప్తమభాగము విడుదల చేయడము మనందరకూ అత్యంత ఆనందదాయకము. నామములకు శ్రీ గురుదేవులు ఇచ్చిన వివరణయే, మనందరి అక్షరాంజలిగా వారి పాదపద్మములకు సమర్పితము.

ధనిష్ఠ

# ఉపోద్ఘాతము

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు విష్ణుమూర్తి యొక్క అవతరణము మన దృష్టి యందు నిలబడాలి. నారాయణ మంత్రం చేసుకునేటప్పుడు ఆదిశేషుడు, దాని పడగ క్రింద వున్న నారాయణమూర్తి, నారాయణమూర్తి యొక్క వర్ణనము, ఆయన యొక్క రూపము, రంగు, శబ్దముల మీద దృష్టి ఉంచాలి. చూపుడు వేలంత రూపాన్ని మనసుకు తెచ్చుకోవాలి. అలా తెచ్చుకుంటే నీలమేఘశ్యామలమైన ఆయన శరీరము కనిపిస్తుంది. ఆయన ధరించిన ఆభరణములన్నీ బంగారు రంగులో వున్నట్లుగా కనిపిస్తాయి. క్రమముగా ఆయన ముఖము, బాహువులు, వక్షస్సు, పాదములు మనకి కనిపిస్తాయి. ఉత్తరీయంతో కప్పి ఉన్న భాగాలన్నీ మిసమిసలాడే మేలిమి బంగారంతో వున్న ఆభరణాలుగాను, వస్త్రములుగానూ దర్శించాలి. కప్పివుండని భాగము తేజోవంతమైన నీలమైన రంగుతో భావన చేసుకోవాలి. నారాయణమంత్రం చేసుకునేటప్పుడు, మస్తకం నుండి పాదం వరకు, భగవంతుని దర్శనం చేయాలి. ఆ తరువాత విష్ణుసహస్రనామం చదువుకునేటప్పుడు విష్ణువు యొక్క రూపం మన హృదయం నందు నిలబడడానికి అవకాశం వుంటుంది. ఆ అవకాశం ఏర్పడిన తర్వాత, విష్ణువు తన విశాలమైన నేత్రాల నుండి మనను చూస్తున్నట్లుగా భావన చేస్తూ, ఎంత సేపు వుండగలిగితే అంతసేపు ఉండాలి. ఎక్కువ సేపు ఉండలేము. మహా అయితే 2-3 నామాల వరకు వుండవచ్చును. ఆ తరవాత ఉండలేము. మళ్ళీ తెచ్చుకొంటూ వుండాలి. ఇది ఒక సాధన! అప్పుడు లోపల నుండి వికాసం రావడానికి అవకాశం వుంటుంది. ఎందుకంటే మనలో వున్న నిజస్వరూపం అంటే మన అసలు స్వరూపం విష్ణు స్వరూపమే కనుక! మనల్ని అంగుష్ట మాత్రంగా (చూపుడు వేలంత) విష్ణుమూర్తి రూపాన్ని హృదయమునందు ధ్యానము చేయమని భాగవతం షష్టమస్కంధంలో చెప్తారు. మనకి హృదయమునందు సింహము అనే భాగము వున్నది. ఉదరవితానాన్ని సింహాసనమని కూడా చెప్తారు. ఆ సింహాసనం మీద విష్ణుమూర్తి ఉన్నట్లు ధ్యానం చేసుకుంటున్న కొద్దీ, పెరుగుతున్నట్లుగా భావన చేయాలి. ఆయన నుండి వచ్చే నీలము, హిరణ్మయము అయిన కాంతులు మన హృదయాన్ని అంతా నింపుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. మన దేహమంతా పూర్తిగా నిండిన తరువాత, అవే కిరణములు బహిః ప్రపంచంలో వ్యాపనం చెందుతున్నట్లుగా ధ్యానం చేసుకోవాలి. ఇలా చేసుకోవాలంటే ముందు నారాయణ మంత్రం వుంటుంది.

నారాయణ మంత్రంలో మన శిరస్సు, నేత్రములు, శ్రవణేంద్రియములు, ప్రాణేంద్రియములు, గొంతు, భుజస్కంధములు, బాహువులు. హృదయము, ఊపిరితిత్తులు, రక్తనాళములు, గుండె, అలా దిగి

వెడుతూ మొత్తం దేహమంతా నారాయణ మంత్రంతో ప్రతిష్ఠాపన చేసికోవాలి. దేహమంతా నారాయణ భావనలో నింపాలి. అలా నింపిన తరువాత విష్ణుసహస్రనామం చేసుకునేటప్పుడు, నారాయణతత్త్వంతో నిండిన ఈ దేహంలో కేంద్రము నందు ఆదిశేషువు వెనకాల పడగ పట్టి ఉన్నచూపుడు వేలంత భగవంతుని ప్రతిమను, చతుర్భుజుడై ఒక చేతిలో శంఖము, ఒక చేతిలో చక్రము, ఇంకొక చేతిలో కమలము, మరియొక చేతిలో గద ధరించి నిలబడిన భగవంతుని, వక్షస్థలము నందు కౌస్తుభమును ధరించిన వాడిని, చిరునవ్వు గలిగిన వాడిని ఆవాహన చేసుకోవాలి. ఈ విధంగా చదువుకున్నట్లయితే జరగవలసిన మార్పులు మనలో సవ్యంగా జరుగుతాయి. ఈ భావనలో విష్ణుసహస్రనామం చేసుకోవాలి. లేకపోతే tape వేస్తే వెళ్ళిపోయినట్లు 1008 నామాలు అయిపోతాయి. ఈలోగా మనసు ఎక్కడో తిరిగి వస్తుంది. తిరిగి రావడం మనకి అభ్యాసమైన విషయం కాబట్టి, విష్ణుసహస్రనామం చేసేటప్పుడు మళ్ళీ మనసును అక్కడికి తెచ్చుకోవడమనేది అభ్యాసంగా మొదలు పెట్టి మనం ఆ రూపాన్ని మళ్ళీ దర్శనం చేయడం మొదలు పెడితే, అప్పుడు మనలో భక్తి ఉద్భవించడానికి అవకాశం ఏర్పడుతుంది. అప్రమత్తత వస్తుంది. శ్రద్ధ కలుగుతుంది. విన్న విషయాలు మర్చిపోవడం వుండదు. చెప్పిన విషయాలు గ్రహించడంలో లోటు ఉండదు. సహస్రనామం అనే సంప్రదాయము మనకి ఋషులు ఏర్పరిచారు. ఈ సహస్రనామములలో ముఖ్యమైన విషయము, ఏ నామము అయినా భగవంతుడిదే అని తెలుసుకోవడము. నామము ఏదైనా భగవంతుడిదే! 'సహస్ర' అనే సంఖ్య ఒకటి తరువాత మూడు సున్నాలుగా, 1000, మనకి కనిపిస్తుంది. భూః, భువః, సువః లోకాలుగా ఉన్న సృష్టి మూడు సున్నాలైతే, ఆ మూడింటిని వ్యాపించినది ఒకే ఒక తత్త్వము- 'ఒకటి'. ఒకటి లేకపోతే ఆ మూడు సున్నాలకి విలువ లేదు. ఒకటి ఉంటే ఆ సున్నాలకి విలువ ఉన్నది. అందుచేత ఎవరి వలన పదార్థమయము, శక్తిమయము, ప్రజ్ఞామయము అయిన లోకములు ఏర్పడ్డాయో, (Matter, Force, Consciousness అంటారు ఆంగ్లంలో) ఆ తత్త్వం ఆ మూడు లోకాలు వ్యాపించి ఉన్నది. మూడు లోకములలో వ్యాపించిన రకరకములైన రూపములకు నామములున్నాయి. ముందు రూపం ఏర్పరచి, తరువాత నామాన్ని అందించారు. రూపం లేకుండా నామం లేదు. ఒక నామం ఉందంటే ఆ రూపం ఉందిట అని అర్థం. అందుచేత మూడు లోకములలో ఉన్న నామాలన్నీ భగవంతుని కీర్తించడమే! భగవంతుని సంబోధించడమే! ఎందుకంటే రూపాలన్నీ భగవంతుడివే! భగవంతుడు కాని రూపం ఏదీ లేదు. అదీ భారతీయ జ్ఞానమునకు సంబంధించిన సమన్వయము. ఋషులు సమగ్రమైన అవగాహన పొంది, భగవంతుడు కానిది ఏమీ లేదు అని మనకు తెలియజేసారు. దేనిని చూసినా భగవంతుడుగానే చూడడం. మూడు లోకాలలో ఉండే సమస్త రూపములు,

వానికి ఏర్పరిచిన నామములుగా కనబడుతున్నదీ దైవమే! సృష్టి అంతా కూడా నామరూపాత్మకము అంటారు. అంటే రూపు ఏర్పడి, వాటిని గుర్తించడం కోసం ఒక నామం. పురుషసూక్తంలో ఏ విధంగా సృష్టి ఏర్పడింది, ఆ ఏర్పడిన సృష్టిలోని ప్రతి విషయానికి తరువాత ఎలా నామకరణం చేశారు, అనే విషయం తెలియపరుస్తారు. ఆరాధకులకు తెలియవలసిన ఒక ముఖ్య విషయము "సమస్తమూ దైవమే! సమస్త రూపములు దైవమే! ఆ రూపమునకు ఉన్న నామం కూడా దైవమే!". ఇది దీక్ష. ఈ దీక్ష పట్టి సహస్రనామాలు పారాయణ చేసుకోవాలి. ఏది చూసినా అందులో ఆ మొత్తం ఉంది అని తెలియాలి. నువ్వు కోరుకుని చూసిన దాంట్లోనే కాదు. కొన్ని రూపాల్లో దైవాన్ని చూస్తాం, కొన్ని రూపాల్లో దైవాన్ని చూడం. కొన్ని నామాల్లోనే దైవాన్ని చూస్తాం, కొన్ని నామాల్లో దైవాన్ని చూడం అనేది భారతీయ సమగ్ర జ్ఞానం కాదు. అటువంటి జ్ఞానాన్ని అందించిన ఏకైక భూమి భారత భూమి. అది మనం గుర్తించాలి.

జీవునకు రుచి ఉన్నది, జీవుని రుచి వెలుగు. కిరణం! అందుచేత భగవత్ ఆరాధన చేస్తున్నప్పుడు మనలో స్ఫూర్తి పెరిగి దైవం మీద రుచులు పెరుగుతూ ఉంటాయి. ఆ రుచులు పెరిగిన కొద్దీ వైవిధ్యంగా, వైభవోపేతంగా దైవాన్ని వర్ణన చేశాం, కీర్తనలు చేశాం, స్తోత్రం చేశాం. దైవము యందు ఆసక్తి వలన దైవం మీద రుచులు పెరిగి రకరకములుగా ఎన్నెన్నో ఆరాధనలు చేశాము. అవన్నీ మన పురాణాల్లో ఉన్నాయి. ఈ విధంగా ఇచ్చిన సహస్రాలు మనం రోజూ పారాయణము చేయాలనుకుంటే మనకు ఒక దీక్ష ఉన్నది. ఏంటంటే, కనపడుతున్నదంతా దైవముగా భావన చేయడము. అలా భావన చేస్తే సహస్రనామం సఫలీకృతం అవుతుంది. సిద్ధిని ఇస్తుంది. దైవానుభూతిని ఇస్తుంది. అలా కాక మన వంటింట్లో గూడులో పెట్టుకున్న చిన్న ప్రతిమ దేవుడనుకొని, అది కాక మిగతాదంతా వేరు అనుకునే వాళ్ళకి సహస్రనామం ఫలించదు. ఇది ముఖ్యమైన విషయం.

సహస్రం అనే పదం, అదొక మంత్రం. దీన్ని (శిరస్సుపైన) 'సహస్రారము' అంటారు. 'సహస్రదళ పద్మము' అంటారు. 'పరిపూర్ణ స్థితిని' సహస్రము అంటారు. అది ఒక మంత్ర శాస్త్రం. 'స' అనే అక్షరానికి; హ'అనే అక్షరానికి; మళ్ళా ' స్ర' అనే అక్షరానికి చాల వివరణ ఉన్నది. అది అలా ఉండగా సహస్రము అంటే 1000 అనే పద్ధతి తీసుకుంటే, మూడు లోకములూ వ్యాపించిన ఒకే ఒక తత్త్వానికి సంబంధించినది అనేది ఒక భావన. కాబట్టి ఈ మూడు లోకములకు సంబంధించిన ఏ రూపము అయినా సరే అది దైవముదే! దెయ్యము అయినా దైవము యొక్క రూపమే! అని తెలిస్తే దెయ్యం ఏమి చేయదు. పులైన, పామైన, తేలైన, నీ శత్రువైనాను. నువ్వు అనుకోవడం బట్టి శత్రువు! శత్రువులో కూడా దైవము ఉన్నాడు అనుకుంటే అంత బాధించదు. మహాత్ములు అట్లాగే జీవించారు. పులిలో కూడా దైవముందని

తెలిసిన వారే పులిని పిల్లి వలే చక్కగా సాకారు. పాములో దైవము ఉందని తెలిసిన వారే పామును సాకారు. పిచ్చి ఏనుగులో దైవమును దర్శించిన బుద్ధునికి ఏనుగు చిన్న కుక్కపిల్లలాగ పక్కన వచ్చి కూర్చుంది. ఇలా సమస్తమును దైవాన్ని దర్శించే పద్ధతి కోసం సహస్రనామాలు ఇచ్చారు. ఆరాధన అలా చేసుకోవాలి.

విష్ణుసహస్రనామ స్తోత్రం చేసేటప్పుడు ఇలాగ కూడా భావన చేసుకోవచ్చు. నక్షత్రములు 27. ఒక్కొక్క నక్షత్రానికి 4 పాదములు. ఒక్కొక్క పాదం ఒక్కొక్క శ్లోకం చొప్పున మొత్తం 108 శ్లోకాలు. మనం 4వ శ్లోకం చదువుతున్నామంటే మొదటి నక్షత్రంలోని నాల్గవ పాదంలోనే ఇంకా వున్నామని అర్థం. ఉదాహరణకు అశ్విని నక్షత్రం వాళ్ళు, వాళ్ళ యొక్క పాదాన్ని బట్టి దాని అర్థం ఎక్కువగా ఆకళింపు చేసుకొనవచ్చును. కాలం సద్వినియోగం అవడములో భాగంగా విష్ణుసహస్రనామం చదవడం 20 నిముషాలు పడుతుంది. 20 నిముషాలు సద్వినియోగం అవకుండా, విష్ణుసహస్రనామం కొన్ని వందల సార్లు చదివి ఉండవచ్చును. ఎందుకంటే tape చదువుతుంది. మనమూ చదువుతాము, మనం చదువుతున్నాము అనుకున్నప్పుడు మనం వినాలి. మనం వినాలి అంటే ఒక పద్ధతి వుంది. ఆ పద్ధతి ప్రకారం వినకపోతే ఏమీ కాదు. విష్ణుసహస్రనామం మంత్రం అనుకుంటే, మంత్రం శబ్దానికి సంబంధించినది. దాని యొక్క యంత్రం విష్ణువు యొక్క రూపం! మనం చదివే ప్రక్రియ అంతా కూడా తంత్రం. కాబట్టి ఈ తంత్రమంతా ఆ యంత్రాన్ని లోపల ఆవాహన చేసుకుని, శబ్దాన్ని వింటూ చదవకపోతే, దాని యొక్క వినియోగమేమీ మనయందు జరగదు. అంటే విష్ణువు యొక్క సాన్నిధ్యము, దానికి సంబంధించిన వికాసము, మన యందు కలగడానికి అవకాశం వుండదు. అందుకనే భగవంతుడు లేడేమో అనే భావన కలుగుతుంది. అందుకే ఏళ్ళ తరబడి విష్ణుసహస్రనామం చదివిన వాళ్ళలోనూ మార్పు రాదు. వాళ్ళ ఆలోచనలలోనూ మార్పు రాదు. ఈ మొత్తం కార్యక్రమం మన మనస్సు, ఇంద్రియములు, శరీరములలో వుండే రుగ్మతలు, మాలిన్యములు అన్నీ క్షాళనమై, భగవంతుని అనుభూతి చెందే అర్హత సంపాదించుకోవడానికి చేస్తున్నాం. ఆటువంటి ధృఢనిశ్చయం, resolution ఉండాలి. లేకపోతే 20 నిముషాలు దండగ. విష్ణువు యొక్క రూపము యంత్రము, విష్ణువు యొక్క నామము మంత్రము, మనం ఉచ్చారణ చేసి వినడం తంత్రము. ఈ మంత్రము, యంత్రము, తంత్రము కలిసినప్పుడే అది ఒక త్రిభుజాకారమైన వలయంగా ఏర్పడి, ఒకదాని నుండి మరొక దానికి శక్తి ప్రసారం (energy supply) వుంటుంది. లేకపోతే దైవశక్తి యొక్క ప్రసారానికి ఒక circuit complete కాదు. ఆ circuit complete కావాలంటే, ఏది చదువుకున్నా అలాగే చదువుకోవాలి.

విష్ణు సాన్నిధ్యము కొరకు, విష్ణు సాయుజ్యము కొరకు, విష్ణు సామీప్యము కొరకు, విష్ణు సారూప్యము కొరకు విష్ణువును మనం లోకంలో దర్శనం చేస్తూ ఉండాలి. దర్శనం చేస్తూ ఈ సహస్రనామాలను అవగాన చేసుకుంటూ ఉండడం వల్ల మనకి ఆశయ సిద్ధి కలుగుతుంది. విష్ణు సహస్రనామము అధ్యయనం చేసే వారందరూ కూడా లోకాన్ని విష్ణువుగా చూడటం అనే సాధన మరవకుండా చేస్తూ ఉండాలి. ఎందుకంటే లోకం రూపంలోనే విష్ణువు ఉన్నాడని 'విశ్వం విష్ణుర్వషట్కారో' అని విష్ణు సహస్రనామ ప్రారంభము లోనూ, 'విష్ణుండు విశ్వంబు విష్ణుని కంటెను వేరేమియును లేదు' అని భాగవతంలోనూ చెప్పబడినది కదా! లోకాన్ని చూస్తున్నప్పుడు విష్ణువుని చూస్తూ ఉండడం వలన మాత్రమే మనం విష్ణు దర్శనానికి క్రమశః అర్హత సంపాదించుకుంటాం. అలా చూడకుండా విష్ణుసహస్రనామం యొక్క అవగాహన చేసుకుంటే అది విజ్ఞానంగా మిగిలిపోతుంది తప్ప మన యందు సత్యమై నిలవదు. మనయందు దాని యొక్క అనుభూతి పరిపూర్ణం కాదు. దివ్యమైన విషయములను తెలుసుకోవడం ద్వారా మనకు వికాసం వస్తుంది. అందులో ఏమీ సందేహము లేదు. వచ్చిన వికాసం నిలబడాలంటే దివ్య కార్యక్రమాలలో పాల్గొన్నప్పుడు, కార్యక్రమానికి కార్యక్రమానికి మధ్య ఉండే interval లో, ఎంత వరకు విష్ణువుని చూస్తే అంత continuity ఉంటుంది. ఆ interval లో మనం విష్ణువుని చూడకపోతే continuity ఉండదు. మళ్లీ విష్ణుసహస్రనామం class లో మాత్రమూ మనకు మళ్లీ విష్ణు అందరి రూపాల్లో ఉంటాడు, అన్ని రూపాల్లో ఉంటాడు అన్నది నామాల అర్థాలలో కనిపిస్తూ ఉంటాడు. మనం లోకంలో చూడడం మొదలు పెడితే నెమ్మదిగా అక్కడో point, ఇక్కడో point ఉన్న వాటి మధ్య continuity ఏర్పడి, ఎప్పుడూ విష్ణువు యొక్క సాన్నిధ్యాన్ని అనుభూతి చెందడానికి అవకాశం ఉంటుంది. అది సాధన! ఇది ఆ సాధనకు ఏర్పరచుకునే సాధన సంపత్తి. ఇక్కడ మనం implements పోగేసుకుంటున్నాం. అవి మన life లో workout చేసుకోవాలి. లేకపోతే ఇది కేవలం ఒక విజ్ఞానంగా కొంతకాలమే ఉంటుంది. ఎందుకంటే ఇప్పుడు ఉండే వికాసం బయటకు వెళ్ళి పనులు చేసుకుంటూ ఉంటే, పనుల రూపంలో ఉన్న భగవంతుణ్ణి, ఎవరితో పనులు చేస్తున్నామో వారి రూపంలోని భగవంతుణ్ణి, ప్రదేశంలోని భగవంతుణ్ణి చూడకపోవడం వల్ల వికాసము తగ్గుతుంది. వికాసం తగ్గిన కొద్దీ ఇంకొంచెం తక్కువగా చూస్తాం. ఇంకొంచెం తక్కువ చూసిన కొలది ఇంకా వికాసం తగ్గుతుంది. మర్చిపోతాం. విష్ణువుని చూడడం మరిచిపోవడం తో విజ్ఞానం కూడా మాయమైపోతుంది. హరించుకుపోతుంది.

విష్ణుసాన్నిధ్య రూపంలో మనల్ని ప్రతి సన్నివేశంలోనూ ఉత్తీర్ణులను చేయాలంటే మనం లోకాన్ని విష్ణువుగా చూడాలి. విష్ణువుని కొంచెం

చూడడం మొదలు పెట్టి, అక్కడి నుండి కొంచెం ఎక్కువగా చూడటం అయ్యి, ఇంకా కొంచెం ఎక్కువ చూడ్డం, ఇంకొంచెం ఎక్కువ చూడ్డం మొదలు పెట్టాలి. ఇంక వేరే పద్ధతి లేదు. విష్ణు రూపంగా సృష్టి అంతా చూడ్డం అనేది ఒక essential prerequisite for experiencing Vishnu. ఇది ఒక practical instruction క్రింద తీసుకుని మనం వీలున్నంతవరకు ఆచరణలో పెట్టడానికి ప్రయత్నం చేయాలి. ఆచరణలో పెడితే తప్ప మనలో మార్పు రాదు. లేకపోతే వినడం- మర్చిపోవడం, వినడం- మర్చిపోవడం అయ్యి, మనం అట్లాగే ఉంటాం. ఎన్నిసార్లు భగవత్ తత్త్వ విషయాలు విన్నా మనం మారక పోవడానికి కారణం ఏమిటీ? చెప్పినవి వినడము, శ్రద్ధతో ఆచరించక పోవడమే! లోకంలా కనిపిస్తూ ఉండేదంతా విష్ణువే! లోకాన్ని చూస్తున్నప్పుడు దేవుడు గుర్తుకు రావాలి. మనం దేవుడిని చూడటం అంటే. లోకం కాక చూడడం అనే అభ్యాసం, పొరపాటు వల్ల ఏర్పరచుకున్నాం. దానివలన కనబడ్డ వాటిల్లోనే చూడడు, కనబడని వాటిల్లో వీడేం చూస్తాడని భగవంతుడు నవ్వుకుంటాడు. ఎదురుగా ఉన్నదే కనపడదుట. ఎవ్వరికీ కనబడని వస్తువు వెతకడానికి బయలుదేరాడట అంటే అర్థం ఏమన్నా ఉందా? ఆయన ఇన్ని రూపాల్లో కనిపిస్తుంటే, ఇన్ని రూపాల్లోనూ ఉన్న ఆయన్ను చూడకుండా, వీళ్లందరినీ నిర్లక్ష్యం చేస్తూ ఆకాశంలో చూస్తే శూన్యం కనిపిస్తుంది. పూర్ణం కనిపించదు. ఇక్కడ నుండి చూస్తే అక్కడి వరకు మొత్తం అంతా పూర్ణంగా కనిపిస్తుంది అని భగవంతుడు చెబుతున్నాడు. కనుక సాధనలో మనం రోజూ ఎన్ని సంఘటనల్లో, ఎన్ని ప్రదేశాల్లో, ఎందరు వ్యక్తుల్లో, ఎన్ని ఆకారాల్లో విష్ణువును చూడగలిగాము? ఎన్ని ఆకారాల్లో చూడలేకపోయాం? చూడడం అనేది ఒక అభ్యాసంగా చేసుకోనడం వలన మాత్రమే మనలో మార్పు వస్తుంది తప్ప, లేకపోతే ఎంత పెద్ద విషయాలు తెలుసుకున్నా రెండు మూడు రోజులు అయ్యాక అవి ఆవిరైపోతాయి. అవి మిగలవు. మళ్లీ freshగా మొదలు పెట్టడమే! ఎప్పుడు ఇమిడి ఉంటాయి అంటే ఈ చింతనలు ఉన్నప్పుడు ఇమిడి ఉంటాయి. అవసరమైనప్పుడు వాటంతటవే మనలోంచి వ్యక్తమవుతుంటాయి. అప్పుడు ఏదో చెప్పారండీ మీకు చెబుదామనుకున్నాను, అనే పరిస్థితి ఉండదు. ఎవరికన్నా చెప్పవలసి వచ్చిందనుకోండి 'పుష్కరాక్షః' గురించి, మనలో అంతా వికాసం చెంది మొత్తం బయటవాళ్ళకు అందుతుంది. ఎప్పుడూ? విష్ణు లోకంలో ఉండటానికి మనం ప్రయత్నం చేస్తే! లోకం విష్ణువే కనుక మనం విష్ణు లోకంలో ఉన్నాము అనుకోండి, అదే వైకుంఠంలో ఉండడం అంటే. వైకుంఠం అంటే ఎక్కడో అవతల ఉందనుకోవడం ఒక పద్ధతి. మనం ఎక్కడ భావన చేస్తే అక్కడ వైకుంఠం ఉంటుంది. మన భావన యందు భగవంతుడు స్థిరపడితే వైకుంఠం మనయందు, మన చుట్టూ ఏర్పడుతుంది. అది భగవంతుడు ఇచ్చిన పెద్ద రహస్యం. ఎప్పుడైతే భగవత్ చింతన మనలో ఉంటుందో మనకు

రాగద్వేషాలురావు. ఇలా కూర్చొని మంచి విషయాలు చెప్పకుంటుంటే ఆ కాసేపు రాగద్వేషాలు ఎందుకు రావు అంటే భగవత్ చింతన చేసుకుంటున్నాం కాబట్టి. మామూలు సన్నివేశాలలో కూడా ఎదురుగుండా ఉండే వ్యక్తులు, సమయాలు, ప్రదేశాలు ఇవన్నీ కూడా భగవంతుడే అని గుర్తు పెట్టుకోవడం అనేది అత్యుత్తమ సాధన. అది చేసుకున్నంత సేపు భగవత్ సంబంధమైన భావన తెరవెనుక ఉంటే, అంటే మన మనసు వెనక ఉంటే, ఆ భావన ఉండటం వలన రాగద్వేషాలు, కామక్రోధాలు, ఈర్ష అసూయలు ఉత్పన్నం కాకుండా ఉంటాయి. ఆ భావన తప్పకుంటే ఇవన్నీ కప్పేస్తూ ఉంటాయి. అందుకే లోకాన్ని విష్ణుపరంగా చూడాలి. అప్పడు మనం ఉంటున్నది విష్ణులోకం. అలాగే శివుడుపరంగా చెప్పకుంటే అది శివలోకం. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు. అలాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు. నారాయణుడు, వాసుదేవుడు, విష్ణువు, ప్రద్యుమ్నుడు అని ఒక వ్యూహం చెప్పకున్నాం కదా. అట్లాగే సదాశివుడు, పరమ శివుడు, శివుడు, ఈశ్వరుడు ఇట్లా చెప్పకుంటాం. అట్లాగే ఆదిశక్తి, ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి. ఎట్లా చెప్పకున్నా పేర్లే. అసలు విషయం ఏంటంటే ఉన్నది ఒక్కటే అని గుర్తు ఉండాలి. ఇన్ని రూపాలలో ఉన్నది ఒక్కటే అని గుర్తుండాలి. మనం అందరితో ప్రవర్తించినప్పడు అది గుర్తు ఉండాలి. అలా ఉంటే మనలో మార్పు వస్తుంది. మనల్ని మనం బాగు చేసుకోవడానికి చేసుకునే కార్యక్రమమే కదా ఇది. అంతేగాని this is not a favour to God. ఇది దేవుడికి ఉపకారం కాదు. ఇలా చేయకపోతే పాపం భగవంతుడు ఏమైపోతాడో అని కాదు కదా, మనం చేస్తున్నది. చేస్తున్న కార్యక్రమములలో నుండి మనలో ఉద్ధారణ కలగాలి. మనలో ఉద్ధరింపు రావాలి. దేనికి ? మన మనస్సు, ఇంద్రియములు, శరీరమునకు చక్కని అనుసంధానం ఏర్పడాలి. శమము ఏర్పడాలి. దేహంలో ఉన్నంత కాలం మనకు పరిపూర్ణమైన ఆనందం కలగాలి. దేహంలో ఉండడమే ఒక బందిఖానాలో ఉన్నట్లు అన్న పరిస్థితి భగవంతుడు సృష్టించింది కాదు. మనం చేతకాక చేసుకున్నాం. కాబట్టి దాన్ని మనం తెలుసుకోవాలంటే మనలో మార్పు రావాలి. మనలో మార్పు రాకుండా మేము ఇలాగే ఉంటాము మీరు అలా చెప్పకు పోతూ ఉండండి అంటే అలా చెప్పకు పోయే వాళ్ళు చాలామంది ఉన్నారు. మార్చుకోని వారు అలాగే బందిఖానాలో ఉన్నట్లుగానే బాధలు పడుతూ ఉన్నారు. ఈ మార్పు తెచ్చుకోవడాన్నే 'వ్యవసాయం' అంటారు. విశిష్టమైన పర్యవసానం చెందే దాన్ని వ్యవసాయం అంటారు. విశిష్టమైన పర్యవసానం మన దేహాదుల యందు ఏర్పడాలి. ఏర్పడితే then we can see better, we can listen better, we can speak better, we can understand better. Everything is better in ourselves when we are in this practice. Suppose there is no betterment it means there is no practice. Betterment, time తీసుకొస్తుందని

wait చేస్తే అవ్వదు. Time వచ్చి వెళ్లి పోతుంది. మంచిరోజు వచ్చినప్పడే తెల్లవారుజామున లేస్తానండీ అనుకుంటే ఎప్పటికీ లేవలేం. మంచిరోజుగా మనం తయారు చేసుకోవాలి. దానికి మనకు భగవంతుడు బుద్ధిని ఇచ్చాడు. దాన్ని వినియోగం చేసుకోవాలి. ఈ విధంగా చేసుకుంటే వ్యవసాయం అంటే విశిష్టమైన పర్యవసానం అంటే, మార్పు తీసుకొస్తుంది. ఎటువంటి మార్పు తీసుకు వస్తుంది? చిన్న గింజ కొన్ని వేల విత్తనాలుగా తయారుచేసే ప్రపంచంలో కొన్ని వేల మందికి ఆహారంగా చేసే పద్ధతి ఉన్నది. దీనికి ఏం చేస్తారు? భూమిని దున్నుతారు. విత్తనం వేస్తారు. నీరు పోస్తారు. దాన్ని పెంచుకుంటారు. దాన్ని పెంచేటప్పడు రక్షణ చేసుకుంటారు. తర్వాత ఇంటికి పట్టుకొచ్చుకుంటారు. తినేట్టు గా తయారు చేసుకుంటారు. తింటారు. ఇంత జరుగుతుంది. వేసిన గింజ ఆర్నెల్లు అయినా వేసినట్లే ఉంటే? ఏం చేస్తున్నావ్ అంటే పాతిన గింజ తీసి తింటున్నా అన్నట్లుగా ఉంటే ఎలా? అంటే గింజ గింజ గానే ఉండి పోయి, మొక్క అవకుండా దాంట్లోంచి ధాన్యం అవ్వకుండా ఎంతకాలం? ఎక్కువ మందికి భగవంతుని సాధన ద్వారా ఈ వ్యవసాయం ఎందుకు జరగదు? లోకమునందు ఈ విధమైన దృష్టి ఉండదు కాబట్టి! లోకమును కొంచెం తక్కువ చూస్తూ ఉంటారు. నిజానికి లోకమే భగవంతుడు. కాబట్టి లోకాన్నే భగవంతుడు గా చూడాలి. లోకాన్ని భగవంతుడుగా చూసుకుంటూ, విష్ణు సహస్రనామం అభ్యాసం చేసుకుంటే ఫలశ్రుతి బాగా ఉంటుంది. 'ఇతీదం కీర్తనీయస్య కేశవస్య మహాత్మనః' విష్ణు సహస్రనామం తర్వాత ఫలశ్రుతి ఉన్నది. అందులో భయం వచ్చే వారికి భయం తప్పిస్తాడు. ఆపద వచ్చే వారికి ఆపద నుండి తప్పిస్తాడు. మృత్యువులో వెళ్లే వాడికి మృత్యువు నుండి తప్పిస్తాడు-- ఇవన్నీ ఉన్నాయి. ఇవన్నీ ఎప్పడు వస్తాయి? ఈ నామాల్లోని సత్యాలు మన జీవితాల్లో అనుభూతి చెందినప్పడు కదా! ఈ సాధన, వేయి నామాలు జపించే లోపల పరిపూర్ణం కాకపోయినా కనీసం మొదలవ్వాలి.

విష్ణు సహస్రనామం గూర్చిన ప్రసంగములు వార, వారము ఏర్పాటు ఎందుకు చేసుకుంటున్నాము? ఈ వారం రోజులలో మనము అంతర్యామి యందు ఏ మాత్రం నిలబడి ఉన్నాము, అంతర్యామి పైన ఏర్పడుతున్న త్రిగుణముల యొక్క క్రీడ యందు ఎంత లోబడి జీవిస్తూ ఉన్నాము, అందరి జీవుల రూపంలోనూ ఉండే ఒకే ఒక అంతర్యామిని గుర్తు చేసుకొని సజీవమైన మూర్తులు అన్నీ కూడా మనము భగవంతుడుగా ధ్యానము చేసుకోగలుగుతున్నామా లేదా అని assess చేసుకోవడానికి, ఏర్పాటు చేసుకున్నాము. ఆ సాధన జరిగినప్పడు మనకి భగవంతుని యొక్క సాన్నిధ్యము మనకు లభించినట్లు! అలా కాక జ్ఞానము, విజ్ఞానము దాని యొక్క సేకరణ యందు నిమగ్నమైనట్లయితే, ఎన్ని జన్మలు గడిచినప్పటికీ కూడా మనలో భగవంతుని యొక్క అనుభూతికి అవకాశము ఉండదు.

నేర్చుకోవటం ముఖ్యం కాదు, గుర్తు తెచ్చుకొని గమనిస్తూ ఉండటం అనేది సాధన! నేర్చుకున్నవి మర్చిపోతాం. ఈ విధంగా చూడటం మొదలు పెట్టినప్పుడు మనము కూడా అంతర్యామిలో భాగంగా మనల్ని మనము అవగాహన చేసుకుని, శాశ్వతములమై, అక్షరములమై భగవంతుని అనుభూతిని ఎక్కువ పొందుతూ, సృష్టిని అంతా కూడా భగవంతుని క్రీడగా, వైభవంగా కొనియాడుతూ, దానియందు మనము అంటక జీవించడానికి అవకాశం ఉంది. భగవత్ భక్తులు అలా జీవిస్తూ ఉంటారు. అది వాళ్లకు ఎలా సాధ్యమైందంటే ఆ సాధనే! ఇది చేయక ఎంత ఆరాధన చేసినప్పటికీ ఆయన సాన్నిధ్యాన్ని పొందటానికి అవకాశం లేదు. ఈ సాధననే 'అనుష్టానం' అని కూడా అంటారు. శ్రీకృష్ణుడు 'నా మతము అంటే, అందరిలో ఉన్న నన్నే దర్శిస్తే నీకు గుణముల యొక్క ఆట అంటదు. నన్ను దర్శించకపోతే నీవు గుణములలో ఇరుక్కుపోతావు. నువ్వు బంధింప పడతావు, సుఖము కోరి దుఃఖ పడతావు, సౌకర్యములు కోరి అసౌకర్యములు అనుభవిస్తావు. లాభం కోరి నష్టం పొందుతావు. జయం కోరి అపజయం పొందుతావు' అని చెప్తాడు. అందుకని ఈ త్రిగుణములలో తేలేటటువంటి సృష్టికి ఏదైతే ఆధారమో దానిని దర్శనము చేయుట సాధన. అదీ అనుష్టానము! పుస్తకాలతో ఏమాత్రం సంబంధం లేదు. అది జీవితము అనే ఒకే ఒక పుస్తకముతో సంబంధం ఉన్న విషయము. ఆ జీవితము అనే పుస్తకములో మనకు ఒకొక్క రోజు ఒక్కొక్క పుట. సంవత్సరము ఒక chapter. ఒక chapter లో 365 pages ఉంటాయి. అటువంటి chapters ఒక్కొక్క సంవత్సరము ఒక్కొక్క chapter గా మనం చూసినట్లయితే మనమే ఒక పెద్ద గ్రంథం.ఈ గ్రంథములో రాసింది అంతా భగవత్ తత్వం గూర్చి రాసామా, భగవత్ తత్త్వమే అనుభూతిగా ఉన్నామా? చూసుకోవాలి. మాస్టర్ గారు 'అయస్కాంతం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము అయస్కాంతీకరణము చెందాలి కదా! వెలుగు గురించి ఎంత తెలిస్తే ఏమి లాభం వెలుగై ఉండాలి కదా' అంటూ ఉండేవారు. ఆహారం గురించి ఎంత తెలిస్తే ఏమి లాభము? తింటేనే కదా దాని యొక్క అనుభూతి. అందుకని అనుభవైకమైన జ్ఞానము, అనుభూతిపరమైన జ్ఞానము ఎక్కడి నుంచి వస్తుంది అంటే కనబడుతున్న దానికి ఆధారముగా ఉన్న దానిని గమనిస్తూ ఉండటం అనేది చేయగలిగిన నాడు. అది మాటిమాటికి గుర్తు తెచ్చుకోవడానికి ఇటువంటి క్లాసులు పెట్టుకుంటాము తప్ప విష్ణు సహస్రనామంలో ఎంత చెప్పారు, ఒక్కొక్క నామానికి ఎంతెంత వివరణ వచ్చింది, ఆ వివరణలో జ్యోతిష్యం ఎంత వచ్చింది, శబ్దాల గురించి ఎంత వచ్చింది, తంత్రం గురించి ఎంత వచ్చింది, మంత్రం గురించి ఎంత వచ్చింది అని కాదు. అంతర్యామిని దర్శనం చేయడం అంటే ఉదాహరణకి ఒక ఆయన మాట్లాడుతున్నాడు అనుకోండి ఆయనలోంచి మాట్లాడే వానిగా ఉన్న భగవంతుని దర్శనము చేయాలి. మాట యొక్క

అర్థము అనేది పైన తేలేది. లోపల ప్రవాహముగా సరస్వతి ఉన్నది కదా! ఎవరైనా మాట్లాడుతూ ఉంటే ఆ సరస్వతీ ప్రవాహము ఎలా ఉందో గమనించామా? అంతర్యామిగా ఉన్నది అక్కడ సరస్వతి ప్రవాహం under-current అంటాం. బహిర్గతంగా నదీ ప్రవాహం పై బోలెడన్ని పడవలు, బోల్లు దూలాలు, కర్రలు ఉంటాయి అలా అన్నీ తేలుతూ ఉంటాయి. తేలుతూ ఉన్న వాటిని చూస్తున్నామా, ప్రవాహమును చూస్తున్నామా? ప్రవాహం ఉండకపోతే ఈ తేలేవన్నీ ఏమీ లేవు కదా! అట్లాగే జీవితంలో మనము వస్తువు, పశువు, వృక్షాలు మొదలైన కనబడే అన్నిటి యందు అంతర్యామిగా ఉండే వాడిని గుర్తు తెచ్చుకొని ఆ మూర్తులతో ప్రవర్తించడము అనేది సాధన. అలా కానప్పుడు మనము ఎన్ని విషయాలు తెలుసుకున్నా మళ్లీ మర్చిపోతూ ఉంటాము. తెలియటం ముఖ్యం కాదు ఇక్కడ నేర్చుకోవడం ముఖ్యం కాదు. ఈ విధమైన అనుష్టానము ముఖ్యము. అన్నింట్లోనూ నన్ను ఈ విధముగా దర్శనము చేయటం అనేది నా మతము అని చెప్పాడు శ్రీకృష్ణుడు. ఆ సాధన మాత్రమే మనల్ని లోతుల్లోకి తీసుకు వెళుతుంది. లేకపోతే జీవితము కాసేపు మునుగుతూ ఉంటుంది, కాసేపు తేలుతూ ఉంటుంది, కాసేపు ఢీ కొట్టుకుంటూ ఉంటుంది, కాసేపు కిందకు పడుతూ ఉంటుంది, కాసేపు పైకి ఎగురుతూ ఉంటుంది, ఏవేవో అట్లా తమాషాలు జరుగుతూ ఉంటాయి. సాక్షీభూతుడిగా ఉండవలసిన జీవుడు, తన యొక్క చిత్త ప్రవృత్తులలో ఇరుక్కుని తనే బోల్తాలు కొట్టేస్తూ ఉంటాడు. ఈ చిత్త ప్రవర్తనాన్ని త్రిగుణాత్మకమైన వంటి రజస్సు, తమస్సు కారణముగా, వాటి యొక్క సమతూకము లేకపోవటము కారణముగా రకరకాల బాధలు అనుభవిస్తూ ఉంటాడు. అలా కాకుండా సమస్తము లో నిండి ఉన్న అంతర్యామిని దర్శించడానికి చేసే సాధనలే ఈ సహస్రనామ వివరణ కార్యక్రమము.

కంభంపాటి పార్వతి కుమార్

# విషయ సూచిక

601 నిర్వాణం ........................................ 1

602 భేషజం ........................................ 5

603 భిషక్ ........................................ 8

604, 605, 606, 607, 608 సన్యాసకృత్, శమః, శాంతః, నిష్ఠః, శాంతిః ........................ 9

609 పరాయణః ........................................ 10

610 శుభాంగః ........................................ 12

611 శాంతిదః ........................................ 16

612 స్రష్టా ........................................ 18

613 కుముదః ........................................ 26

614 కువలేశయః ........................................ 28

615, 616 గోహితః, గోపతిః ........................................ 29

617 గోప్తా ........................................ 37

618 వృషభాక్షః ........................................ 38

619 వృషప్రియః ........................................ 52

620 అనివర్తీ ........................................ 54

621 నివృత్తాత్మ ........................................ 57

622 సంక్షేప్తా ........................................ 62

623 క్షేమకృత్ ........................................ 71

624 శివః ........................................ 75

625 శ్రీవత్సవక్షాః ........................................ 76

626, 627 శ్రీవాసః, శ్రీపతిః ........................................ 78

628 శ్రీమతాం వరః ........................................ 82

629, 630, 631 శ్రీదః, శ్రీశః, శ్రీనివాసః ........................................ 85

632 శ్రీనిధిః .... 97

633, 634 శ్రీవిభావనః, శ్రీధరః .... 98

635 శ్రీకరః .... 98

636 శ్రేయః .... 99

637 శ్రీమాన్ .... 100

638 లోకత్రయాశ్రయః .... 103

639 స్వక్షః .... 106

640 స్వంగః (సు అంగములు) .... 107

641 శతానందః .... 109

642 నందిః .... 112

643 జ్యోతిః .... 113

644 గణేశ్వరః .... 114

645 విజితాత్మాః .... 117

646 విధేయాత్మాః .... 118

647 సత్కీర్తిః .... 122

648 ఛిన్నసంశయః .... 130

649 ఉదీర్ణః .... 133

650 సర్వతః శ్చక్షుః .... 140

651 అనీశః .... 143

652, 653 శాశ్వతః, స్థిరః .... 145

654 భూశయః .... 147

655 భూషణః .... 150

656 భూతిః .... 154

657 విశోకః .... 158

658 శోకనాశనః .... 159

659, 660, 661 అర్చిష్మాన్, అర్చితః, కుంభః .... 162

662, 663 విశుద్ధాత్మా, విశోధనః................................................ 170

664 అనిరుద్ధః................................................ 173

665 అప్రతిరథః................................................ 175

666 ప్రద్యుమ్నః ................................................ 176

667 అమితవిక్రమః ................................................ 177

668, 669 కాలనేమినిహా, వీరః ................................................ 182

670, 671, 672 శౌరిః, శూరః, జనేశ్వరః ................................................ 190

673 త్రిలోకాత్మా................................................194

674 త్రిలోకేశః ................................................194

675 కేశవః ................................................ 195

676 కేశిహా ................................................ 198

677 హరిః ................................................ 199

678, 679, 680, 681, 682 కామదేవః, కామపాలః, కామీ, కాంతః, కృతాగమః......202

685, 686 వీరః, అనంతః ................................................ 217

687 ధనంజయః................................................ 219

688, 689, 690, 691 బ్రహ్మణ్యః, బ్రహ్మకృత్, బ్రహ్మా, బ్రహ్మ................................221

692 బ్రహ్మవివర్ధనః ................................................224

693 బ్రహ్మవిత్ ................................................225

694 బ్రాహ్మణః................................................226

695 బ్రహ్మీ................................................228

696 బ్రహ్మజ్ఞః................................................229

697 బ్రాహ్మణప్రియః ................................................230

698 మహాక్రమః ................................................237

699 మహాకర్మ................................................243

700 మహాతేజాః................................................250

701 మహోరగః ................................................ 251

# 601 నిర్వాణం

బౌద్ధ మతస్తులు ఈ 'నిర్వాణ' పదం ఎక్కువ వాడతారు. మన ఆనందమయ లోకాన్ని వాళ్లు 'నిర్వాణ లోకము' అంటారు. నిర్వాణ, పరనిర్వాణ, మహా పర నిర్వాణ ఇలా అంటుంటారు. అన్నమయ లోకము, ప్రాణమయ లోకము, మనోమయ లోకము, విజ్ఞానమయ లోకము. బౌద్ధ మతస్తులు కూడా చెప్తారు. విజ్ఞానమయ లోకం తర్వాత ఆనందమయ లోకం అని చెప్తాం. ఎందుకంటే కేవలం ఆనందం తప్ప... వాడితో తానున్నాడు, వాడే తానుగా ఉన్నాడు. మొత్తం ఆ గానంలో, ఆ మాధురిలో అద్భుతంగా తను లయమై ఉంటాడు. ఆ ఆనందం ఇప్పుడు చెప్పకుంటే తెలిసేది కాదు. అనుభవిస్తేనే తెలుస్తుంది. సంగీతం గురించి తెలిస్తే ఆనందమేముంది, వింటే ఆనందం కాని. ఆ విధమైన ఆనందంలో వున్నవాడికి మిగతావి ఏమి వుండవు. తానున్నాను, అనే భావన కూడా కరిగిపోతుంది. అలా కరిగిపోయిన స్థితిని మన ఋషులు 'ఆనందమయలోకము' అన్నారు. బౌద్ధ మతస్తులు నిర్వాణమైనది, చచ్చాడు అన్నారు. ఏమిటి చచ్చింది? వాడి భావ సముదాయమంతా చచ్చింది. భావ సముదాయమంతా చావడం వల్లనే ఆనందం వుంటుంది. భావములలో ఆనందం కన్నా, భావములు దాటి ఆనందం ఎక్కువగా ఉంటుంది. అతడికి విజ్ఞానం కూడా పెద్ద రుచిగా ఉండదు. భగవత్ సాన్నిధ్యాన్ని మించి ఇంకే విజ్ఞానం అక్కరలేదు అనుకుంటాడు. మామూలుగా ఎక్కువమంది విజ్ఞాన లోకంలో బద్ధులై ఉంటారు. మనసుతో బతికే వాడికి విజ్ఞానం రుచి మొదలు పెడితే, దీని ఆనందం మనోమయ లోకం కన్నా వంద రెట్లు ఎక్కువగా ఉంటుంది. కాబట్టి ఆ రుచిలో పడి విపరీతంగా నేర్చుకోవడం ఉంటుంది. రామాయణం, భారతం, భాగవతం, జ్యోతిష్యం, పురాణాలు, వేదాలు, ఉపనిషత్తులు... మిగతా వాళ్ళకన్నా మనకు బాగా తెలిసినట్లుగా మనం చెప్తుంటే అవతలవాళ్ళు నిర్ఘాంతపోయి చూస్తుంటారు, అమ్మో ఎంత తెలుసో, అని. ఎందుకంటే వాడు మనోమయలోకంలోనూ, వీళ్ళు బుద్ధిమయ లోకంలోనూ వున్నారు. కానీ బుద్ధి లోకంలోని వెలుగునకు ఆధారమైనది ఒకటి వున్నది కదా. అందులోకి వెళ్ళినవాడు ఆనందమయ లోకంలోకి వెళ్తాడు. ఆనందమయ లోకంలోకి వెళితే ఇవన్నీ పోతాయి. పోతాయి అంటే దిగి వస్తే ఉంటాయి, లేకపోతే వాటిల్లోనే తిరుగుతూ ఉండడు. కొంతమంది కోరికలలోనూ, కొంతమంది ఆలోచనలోనూ గిరగిరా తిరుగుతూ ఉంటారు. బాగా ఆలోచిస్తాడనేది కూడా ఆలోచనే కదా! అంతకుమించి బుద్ధి లోకంలో ఉంటె, ఈ కనబడిన వాటి నుండి కనబడని వాటిని తెలుసుకునే స్థితి వస్తుంది. అంత మాత్రం చేత అది కూడా పూర్తి ఆనందం కాదు. ఈ తెలుసుకోవడానికి అంతులేదు. అంతులేక అలా తెలుసుకుంటూ, తెలుసుకుంటూ చచ్చిపోతాడు. నీకు కావలసిన నీళ్లు పుచ్చుకో, నీకు దాహం తీరుతుంది. ఈ సరస్సులో ఎన్ని నీళ్లు ఉన్నాయి, ఈ నీళ్లు ఎక్కడి నుండి వస్తున్నాయి? ఎంతెంత రోజుకు? ఎంత నీకు వస్తోంది? ఎంతెంత వాడుకుంటున్నారు? ఎంతెంత మిగులుతోంది? ఇలా లెక్కలు వేసుకుంటూ కూర్చుంటే విజ్ఞానం. ఈ లోపల గొంతు

ఎండిపోతే? అందుకే శ్రీకృష్ణుడు 'అంతా బాగుంది... సృష్టి గురించి, సరస్సు గురించి తెలుసుకోవడం అనేది, మనోమయ, కామమయ, భౌతికమయ లోకాల్లో ముడులు వేసుకుని ఉండే దానికన్నా మెరుగైన స్థితి. కానీ అదే అంతా కాదు. ఆ నీళ్లు నువ్వు తాగితే నీకు అనుభూతి కలుగుతుంది. ఆ ఆనందంలో నువ్వు ఉన్నప్పుడు బాగుంటుంది' అని చెప్తాడు. కృష్ణుడి వేణుగానం ఇలా ఉంటుందని చెప్పకున్నాం కొన్ని classes. చాలా బాగుంది అనుకున్నాం కదా. కానీ వేణు గానం విన్నామా? వినలేదు కదా! వేణుగానం వింటే, వేణు గానం ఇలా ఉంటుందని ఇంకెవరు చెప్పనక్కర్లేదు. పెద్ద నూజివీడు మామిడి రసాలు ఉంటాయి. వాటి గురించి రంగు, రుచి, రూపు అన్నీ లొట్టలు వేసుకుంటూ వీడు చెప్పాడనుకోండి. ఎన్ని చెప్పినా, ఆ పక్కన తిన్నవాడు ఉంటే 'ఏరా నేను అంతా చెప్పానా?' అంటే 'ఇంకా చెప్పలేదు' అంటాడు. ఏదైనా తిన్నవాడికి తిన్న రుచి మీద బాగా ఎక్కువ తెలిసి ఉంటుంది. తినకుండా ఊరికే దాని గురించి తెలుసుకున్నవాడు మధ్య మధ్యలో మరచిపోతుంటాడు. వాడు ఎక్కువ detail గా చెప్పగలడు. అంటే అంతా పారం చూసినవాడు అనుభూతి పొందిన వాడే కదా! కనుక అనుభూతి పొందిన వాడికి, అందులో ఉన్నవాడికి ఇంక విజ్ఞానం ఏమిటి? అందుకని విజ్ఞానం కూడా ఒక వెంట్రుక ముక్కలాగా పక్కన పెట్టేస్తాడు. ఎందుకంటే ఆ దివ్యసాన్నిధ్యంలో ఉంటే ఆనందంగా ఉంటుంది. అందులోంచి బయటకు వస్తే చిరాగ్గా ఉంటుంది. అదే ఉద్ధవుడు 'నాకేమీ విజ్ఞానం అక్కర్లేదు. నీ గానంలో నేను జీవిస్తుంటాను, కానిస్తూ ఉండు. నువ్వేదో అది కాదు, ఇది కాదు, ఇంకొక శరీరం ఉంది... ఇలాంటివి చెప్తాను అంటావేమిటి? నాకు వద్దు. నువ్వు సరాసరి నా ఎదురు గుండా ఉన్నావు. నువ్వు గానం నాకు అందించగలవు. నీ గాన మాధుర్యంలో నేను జీవిస్తాను. ఈ గానం ఇలాగే సాగనీ' అంటాడు. 'పురుషమేధం' లో చిట్టచివర ఉద్దవుడు కృష్ణుని కలుసుకున్న సన్నివేశం మాటిమాటికీ చదువుకోవాలి. అలా ఆ వేణుగానం వింటూ, ఆ అనుభూతిలో ఉద్ధవుడు కరిగిపోయాడుట. అలా కరిగిపోయినప్పుడు కృష్ణుడు అక్కడ నుండి లేచి వెళ్ళిపోయాడు. వెళ్ళిపోయినా ఉద్ధవుడికి ఆ గానం మిగిలిపోయింది. అంటే ఏం జరిగింది? తన గాన మాధుర్యం చేత అతనిలోని సామగాన మాధుర్యంలో, అతన్ని నిలబెట్టాడు, ఆయన వెళ్లిపోయాడు. ఈయన వింటూ ఉంటే తెల్లారిపోయింది. కళ్ళు తెరిచి చూస్తే కృష్ణుడు లేడు. అమ్మ! కృష్ణుడు లేడని బాధపడ్డాడు. కళ్ళు మూసుకుంటే లోపల మాత్రం గానం వినిపిస్తోంది. కృష్ణుడు లేకుండా గానం ఎలా వినిపిస్తున్నది? ఈ గానం రూపంలో లోపల ఉన్నాడని అనిపించింది అందుకే వినిపించే గానం వైపు ఉద్ధవుడు నడిచి వెళ్ళాడని ఇస్తారు మాష్టారు. అంటే భౌతికంగా బయటకు వెళ్లడం కాదు. తన హృదయంలోని దాన్ని పట్టుకుని, అలా చొచ్చుకుని లోపలికి వెళ్ళిపోయాడన్నమాట. వెళ్ళిపోతే మళ్ళీ లోపల ఈ గానం చేస్తున్న 'కృష్ణప్రజ్ఞ' కనిపించిందట. అప్పుడు కృష్ణుడు అంటాడు... 'ఇప్పుడు నువ్వు చూస్తున్నావే, అదే నేను చెబుదామనుకున్నాను. చెప్పడం అంటే బుద్ధిలోకం కదా! అది నువ్వొద్దన్నావు. అందుకని సరాసరి ఆ మాధుర్యం చేత అందులోకి నువ్వు రాగలిగావు'. అంటే ఆయనే పట్టుకొచ్చేస్తాడు. వింటూ ఆ గానంలో ఇమిడిపోవడం చేత ఆనందమయలోకంలో/ హృదయలోకం లో

శ్రీకృష్ణుని యొక్క శాశ్వత దర్శనం చేసుకుంటాడు. ఇది మళ్ళీ పోదు. ఎప్పుడూ ఉంటుంది అని చెప్తాడు. 'అంతకుముందు ఇన్నేళ్లుగా నువ్వు చూస్తున్నది పోతుందనే కదా, నువ్వు బాధ పడ్డావు. ఇది పోదు. ఇక నేను నీకు ఎప్పటికీ పోను. నువ్వు నన్ను ఎప్పటికీ వదలవు. నువ్వు నాకు annexe అయిపోయావు. ఇట్లా మనం ఎప్పుడూ ఉంటాము. ఇప్పుడు నీకు తృప్తేనా' అంటాడు. తృప్తే, అంటాడు ఉద్ధవుడు. అంతటి అద్భుతమైన సన్నివేశంలో మైత్రేయుడు కూడా అక్కడికి వచ్చి చేరతాడు. అప్పుడు బ్రహ్మజ్ఞానం గురించి కృష్ణుడు బోలెడు విషయాలు మైత్రేయుడితో మాట్లాడతాడు. ఉద్ధవుడికి ఇవేం పట్టవు. ఎందుకంటే ఆయన గానమాధుర్యంలోనే ఉంటాడు. ఇది మనకయ్యే పని కాదనుకుని వదిలేస్తాడు. చివరకు ఒకటి మాత్రం గుర్తు పెట్టుకుంటాడు. 'విదురుడు రాలేదు, అతడికి కూడా చెబుదామనుకున్నాను, మీకిద్దరికీ చెప్పాను, అతడికి మీరు చెప్పండి' అని కృష్ణుడు అంటే, విదురుడు దొరికిన తరువాత ఈ బుద్ధిలోకాలు మనకెందుకని విదురుణ్ణి తీసుకెళ్లి మైత్రేయుడికి అప్పజెప్పేసి, తను మాత్రం కృష్ణుడిలోనే వున్నాడు. ఉద్ధవుడి యొక్క భక్తి తాదాత్మ్యత అటువంటిది. అది ముట్టుకున్న తరువాత కావాలంటే ఇవన్నీ చేసుకోవచ్చు, కానీ ముందు ఇది ముట్టుకోవాలి. అక్కడికి వెళ్ళిన వాడికి తన గురించి ఇంకేమీ ఉండదండీ! వాడే తానుగా ఉంటాడు. ఇంక తను ఉండడు. ఎట్లా తను ఉండడు అంటే గొంగళి పురుగు సీతాకోకచిలుక అయినట్లుగా అయిపోతాడు. అంతకుముందు ఆ గొంగళి పురుగు ఎవరి ఒంటిమీద పడ్డా నానా బాధ. ఇప్పుడు మన జీవనం కొంతమందికి బాధ కలిగించే విధంగా, గొంగళి పురుగు లాగా ఉంటుంది కదా! మరి ఇదే గొంగళి పురుగు సీతాకోకచిలుక అవుతుందంటే మనం నమ్మగలమా! గొంగళి పురుగు తన చుట్టూ గూడు కట్టుకొని కొన్నాళ్లు ఉంటుంది. ఆ గూటిలోనే ఈ పురుగుకున్న గుచ్చుకునేవన్నీ రాలిపోయి, చక్కటి రెక్కలు వస్తాయి. ఆపైన ఉండే గూడు చితికిపోయి అందులోంచి అది బయటకు వస్తుంది. మనకి కూడా గుచ్చేతత్త్వాలు అన్నీ పోతాయి. ఇంకా మనం బయట గుచ్చుతున్నామట అంటే గొంగళి పురుగునే అర్థం. కళ్ళతో, మాటలతో, చేతులతో, విసుర్లతో గుచ్చుతాం. వచ్చిన వారిని చూడం. పైగా నేను అసలేమీ అనలేదంటాం. చూడకుండా గుచ్చేస్తావన్నమాట. ఇట్లా గుచ్చుకుంటూ గుచ్చుకుంటూ ఉండేవాడు అంతర్ముఖుడైతే ఈ గుచ్చే తత్త్వం పోతుంది. అప్పుడూ వాడు సీతాకోకచిలుక! చెట్టు మీద నుండి గొంగళి పురుగు రాలితే మనకు గగుర్పాటు, అసహ్యము కలిగి వెంటనే తీసిపారేస్తాం. ఓ సీతాకోకచిలుక వాలితే? ఎంత బావుంటుంది? దాన్ని చూసి మురిసిపోతుంటాం. ఇదే జరుగుతుంది. అంటే గొంగళి పురుగు చచ్చిపోయింది. సీతాకోకచిలుక బతికింది. అది అంతకుముందు గొంగళి పురుగు అని మాత్రం గుర్తుపెట్టుకోండి. జీవిలో ఆ విధంగా మార్పు రావాలి. అలా వస్తే 'నిర్వాణం' అన్నారు. వీడు చచ్చిపోయి, వాడు అట్నుండి వస్తాడు. గుహలోకి వెళ్ళినవాడు బయటికి వచ్చినప్పుడు 'వాడే గాని, వాడు కాదు' అంటారు. అదే రెండో పుట్టుక! ఈ పుట్టిన వాడికి తన పాత విషయములందు ఆసక్తి ఉండదు. అక్కడే ఉంటాడు, అలాగే ఉంటాడు. గొంగళి పురుగు సీతాకోకచిలుకలా మారినంత ప్రస్ఫుటంగా వీడు మారడు. బయట రూపు అలాగే ఉంటుంది. అందుచేత చూడలేని వారికి అట్లాగే

ఉంటాడు. చూడగలిగిన వారికి వీడు వాడు కాదు, మారాడు అని తెలుస్తుంది. రోజూ చూసేవారికి మార్పు తెలియదు. కానీ 10, 25 సంవత్సరాల తర్వాత చూసిన వారికి, వాడి ప్రవర్తనలో మార్పు చాలా కనిపిస్తుంది. ఏసుక్రీస్తు, మోసెసు అలా అయిపోయిన వారే. మహాత్ములందరూ అలా అయినవారే. మోసెస్ భార్య 'ఈ రోజు భగవంతుడు ఆ కొండమీదున్నాడు' అని చెప్తుంది. ఎందుకలా చెప్తున్నావంటే 'అక్కడ ఎర్రని మేఘం ఉన్నది. దాని సంకేతం దేవుడు అక్కడ ఉన్నాడని. కానీ అక్కడికి ఎవరూ వెళ్ళలేరు, భయం వేస్తుంది' అని చెప్తుంది. ఇతడికి భయం లేదు. తేల్చుకు వస్తానని బయలుదేరుతాడు. వద్దంటుంది భార్య. వినడు. కొండ మీదకి వెళతాడు. హృదయంలో దర్శనం జరుగుతుంది. మాట్లాడుకుంటాడు. Burning bush. చాలా అరుణారుణ కాంతులతో వెలుగుతున్నట్లు కనిపించిందట. తన లోపల దర్శనమే! అక్కడ 'ఎవరు నువ్వు?' అని అడుగుతాడు. 'నేనే' అంటాడు. 'నేనంటే?' అన్నాడు. 'నేనంటే నేనైన నేను. నేను నేనైన నేను' అన్నాడు. మరి నువ్వు అంటే 'నేనే నువ్వుగా ఉన్నావు, కానీ అసలు నీ పేరు 'నేనే' నా పేరూ 'నేనే'. నా పేరే నీది అని చెప్తాడు. విని, చూసి సాయంత్రానికి దిగి వస్తాడు. ఎవరికైనా, ఏ దేశం వారైనా సత్య దర్శనం ఇలాగ జరగవలసినదే. మతాన్ని బట్టి, కులాన్ని బట్టి విడివిడిగా ఉండదు. ఇతని భార్య చాలా సంస్కారవంతురాలు. భర్త కళ్ళలోకి చూస్తుంది. 'He is different, he has seen God' అంటుంది. అప్పటి నుండి ఆవిడ పరిస్థితి ఆయన యందు, ఆయన పరిస్థితి ఆమెయందు వేరుగా ఉంటుంది. ఎందుకంటే అక్కడ వాహిక, అదే Engine మార్చేశారు, లోపల engine transplantation అయిపోయింది అన్నమాట. కొత్త engine వేశారు. Car అదే. Car అదేనా అంటే అవునంటాడు. కానీ లోపల అది కాదు. దానికి supersonic jet engine ఉంటుంది. Car ఆకాశంలోకి వెళ్లిపోయేట్లుగా వుంటుంది. ఆ విధంగా మార్పు చెందితే అంతకు ముందు వాడు ఏమయ్యాడు? లేడు.చచ్చిపోయాడు. దీనినే మనవాళ్లు ఆనందమయ లోకంలోకి ప్రవేశించాడు అన్నారు. అందుకే అతను ఎప్పుడూ ఆ ఆనందంలో ఉంటాడు. మిగతావన్నీ మర్చిపోతాడు. అన్నీ గుర్తుంటాయి, గానీ జిగురు వుండదు. దేని మీదా జిగురుండదు. అదేంటి ఇది వరకు వుండేది కదా అంటే, ఇప్పుడు ఎండిపోయింది అంటాడు. అన్నీ చచ్చిపోతాయి. అన్నీ భగవత్ సంపదగా చూస్తాడు. కుటుంబాన్ని గాని, ఆస్తులు గాని, ఇతరులను గాని భగవంతుని సంపదగా చూస్తూ ఆ భగవంతుని కార్యం కోసం ఉంటూ, భగవంతుని ప్రతి విషయంలోనూ అనుసంధానం చెందుతూ, అనుభూతి చెందుతూ, ఆనందంగా ఉంటాడు. అది అతడి నిర్వాణం! త్రిసామా నుండి సామగః, సామః నుండి నిర్వాణంకి వచ్చాం. తను దివ్య ప్రణాళికలో చేయవలసినదంతా చేస్తుంటాడు. ఆ ప్రణాళిక అయిపోయిన తర్వాత ఆ శరీరం పడిపోవడానికి దానిలో ఉన్న జబ్బులు ఉపక్రమించి అప్పుడు పనిచేస్తాయి. అది ఉంటుంది. కానీ వాడినేమీ చేయదు. వెళ్లడానికి మరి ఏదో దారి కావాలి కదా. వెళ్లిపోవడానికి దారి కూడా శరీరంలో ముందే పెట్టి పంపుతాడు. శరీరంలో తాను వున్నా, శరీరానికి తాను అంటి ఉండడు. శరీరం మీద కూడా జిగురు లేదు. తన యందు తానుండడం చేత పూర్ణమైన స్వస్థతలో ఉంటాడు. అది ఇక్కడ భేషజం!

## 602 భేషజం

మన తెలుగులో తను కాని పద్ధతిలో ఇంకో విధంగా జీవిస్తుంటే 'వీడు భేషజం చూపిస్తున్నాడు రా' అంటారు. అది కాదు. నిజానికి భేషజం చూపడం అంటే స్వస్థానంలో తానుండడం. అంటే హృదయంలో ఉంటాడు. మనసులో ఉంటే office లో ఉన్నట్లు. మనం అంతా ఇంట్లో ఉండటం ఎప్పుడో మానేశాం. Office లోనే ఉంటున్నాం, తింటున్నాం, పడుకుంటున్నాం. అంటే ఆలోచనల్లోనే ఉంటున్నాం. ఇప్పుడు office లో కాకుండా ఇంటికి వస్తున్నాడండీ పడుకోవడానికి అన్నమాట. Triple shiftలో office లో వేలాడే వాళ్ళం, కాస్త ఇంటికి రావడం అంటే 'సామాన్ని' పట్టుకురావడమే. అలా మనం లోపలికి వస్తుంటే స్వస్థత వస్తుంది. స్వస్థత వచ్చాక ఇహ శరీరం గురించి అసలు ఆలోచన ఉండదు. అసలు శరీరం అర్థమే అది. అలా చీరల్లే చిరిగిపోతుందట. ఎంత బాగా వాడుకున్న చీరైనా చిరిగి పోతుంది. చివికి పోతుంది. అలాగే శరీరం నువ్వు ఎంత బాగా పెట్టుకున్నా పాడైపోతుంది. దాని స్వభావం అది. దాని గురించి ఇహ బాధపడకుండా, ఎంతకాలం వుంటే అంతకాలం చేయవలసిన పనులు చేస్తుంటాడుట. అంతేగానీ ఇది వుండదేమో అని బాధ వుండదుట. వుండడం వుండక పోవడం వాడిని బట్టి ఉంటుంది వాడికి వీడితో గల పనిని బట్టి వుంటుంది. ఇప్పటికైపోయిందనుకోండి ఇది మార్చేసి ఇంకొకటి ఇస్తారు. అద్భుతమైన సన్నివేశం ఒకటి చెప్తాను ఈ సమయంలో. అవధూతేంద్ర సరస్వతీ స్వామి ఒకాయన ఆంధ్ర, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాలలో రామనామాన్ని విపరీతంగా ప్రచారం చేసిన అద్భుతమైన రామభక్తుడు. ఆయనకు 15 సంవత్సరాలప్పుడు నాకు ఐదు సంవత్సరాలు. అప్పటినుండి నాకు తెలుసు. రామనామం జరుగుతుంటే ఆ 15 సంవత్సరాల కుర్రవాడు అలాగ లీనమైపోయేవాడు. కనుల నుండి అశ్రుధారాలు అలాగే వచ్చేస్తుండేది. ఆయనకు అన్నం, మంచినీళ్లు ఏమీ అక్కరలేదు. చుట్టూ అంతా భజన చేస్తుంటే ఈయన అలా వెళ్లిపోతాడు. ముందు ఆయన్ని 'రఘువరదాసు' అని పిలిచారు. మన రాష్ట్రంలో హనుమాన్ చాలీసా ప్రచారం చేసిందాయనే! కలిసంతరణ మంత్రమైన 'హరే రామ హరే కృష్ణ' మంత్రం ప్రచారం చేసిందాయనే! అపర చైతన్య ప్రభువు లాగా నాలుగు దశాబ్దాల పాటు అద్భుతంగా పనిచేశారాయన. ఆయన పాడుతుంటే విని కరగనివాడు రాయి. అంత అద్భుతంగా వుండేది పాట. మన దురదృష్టం కొద్దీ అప్పటికి మన దేశంలో ఈ tape recorders ఏవి లేవు. ఆయన ఏదైనా ఒక నామం పట్టుకుంటే ఆ ఒక్క నామం రకరకాలుగా ఎన్ని గంటలైనా పాడేవారు. 'శ్రీ గురు జయ గురు జయ గురు జయ గురు' అలా పాడుతుంటే, విన్న వాళ్లు అలా తన్మయత్వం చెందేవారు. సమయం తెలిసేది కాదు. ఏకాహం, సప్తాహం ఇలాగ చేసి, అనుస్యూతమైన భజనతో ఎంతోమందిని స్ఫూర్తిలోకి తెచ్చిన మహానుభావులు. వీరు మన రాధా మాధవం కూడా వచ్చారు. ఆయన మా నాన్నగారి కారణంగా మా కుటుంబానికి పరిచయం. ఆయన 1975 లో ఇక్కడికి రావడం జరిగింది. అక్కడ మాస్టర్ CVV, EK గార్ల photos చూశారు. 'నేను విన్నాను. కృష్ణమాచార్యుల గురించి. నీకు బాగా తెలుసా' అని అడిగారు. రామ్

నగర్లో మేము రామాలయ ప్రతిష్ట చేస్తుంటే వచ్చారు. ఫలానా ఆయన కొడుకు రామప్రతిష్ట చేస్తున్నాడని తెలిసి, ఆయనంతట ఆయన పొద్దున్నే వచ్చి ఆ రామ్ నగర్ లో కూర్చుని ఉన్నారు, మేం వెళ్లేసరికి. చాలా ఆనందం వేసింది. 'ఏంటి స్వామీ ఇక్కడికి వచ్చారు?' అంటే 'నీకోసమే. నువ్వు రామప్రతిష్ట చేస్తున్నావట కదా!' అన్నారు. అలా కాదు, మా ఇంటికి కూడా రావాలన్నాను. మా నాన్నగారు ఉన్నప్పుడు మా ఇంటికి వస్తుండేవారు. తప్పకుండా వస్తాను మీ ఇంటికి రావడం కన్నా నాకు ఇంకేం కావాలి, అని వచ్చారు. వస్తే, మాస్టర్ గారి ఫోటో చూశారు. చూసి 'ఈయన గురించి చాలా విన్నాను. చాలా అద్భుతమైన వైద్యులు అని కూడా విన్నాను. కలుద్దాం అని మనసులో ఉన్నది. ఒకసారి తీసుకువెళతావా?' అని అడిగారు. 'తప్పకుండా ఈరోజు మధ్యాహ్నమే వెళ్దాం' అన్నాను. మధ్యాహ్నం మాస్టరు గారి వద్దకు వెళ్లాం. ఆయన్ని చూడగానే మాస్టరు గారు లేచి ఆయన పాదాలకు నమస్కరించారు. ఆయన మళ్ళీ మాస్టరు గారి పాదాలకు నమస్కారం చేశారు. చేసిన తర్వాత మంచి విషయాలు మాట్లాడుకున్నారు. తర్వాత ఈ స్వామీజీ అన్నారు 'ఈ మధ్య రామ గానానికి అంతరాయంగా ఈ గొంతు జీరబోతోంది. ఏదన్నా మందు వేసుకుందామని మీ వద్దకు వచ్చాను. ఏదైనా హోమియో మందు వేస్తారా?' అని అడిగారు. అడిగితే మాస్టారు 'రామనామం కన్నా మించిన మందు లేదు. అది ఎలాగూ మీరు చేస్తూనే ఉన్నారు. మీకు మందు వేయాల్సిన అవసరం లేదు. నాలాంటి వాడు మందు వేయడం కూడా తప్పు. హోమియో వచ్చని మీకు ముందు వేయడమేమిటి? అలాగ వేయకూడదు. రాముడు ఎన్నాళ్లు పాడించుకుంటే అన్నాడు పాడించుకుంటాడు. రాముడి గురించి పాడడానికి రామాజ్ఞ ఉన్నంతవరకు ఆ గొంతు ఏమీ కాదు. గొంతుకి ఇబ్బంది వస్తే రాముడిష్టం అనుకుందాం' అన్నారు. నవ్వారాయన. 'సత్యమే! అయినా నా వంతు ధర్మం నిర్వర్తించాలని వచ్చాను.' అన్నారు. శరీరం విషయంలో తన కర్తవ్యం తన నిర్వర్తించాలి. వాళ్ల చేత, వీళ్ళ చేత ఎందుకు? కృష్ణమాచార్య గారి చేతి మందు వేయించుకుందామని వచ్చారాయన. సరే మందు వేశారు. వచ్చిన పనయ్యిందన్నారాయన. ఆ రోజక్కడుండి వెళ్లిపోయారు. మర్నాడు కలిసినప్పుడు 'చాలా అద్భుతమైన మహాత్ముడోయ్ ఆయన నాకు తెలుసు' అన్నారు. కృష్ణ, గుంటూరు జిల్లాలలో అందరికీ తెలుసు. కొన్నాళ్లు బట్టలు కూడా లేకుండా రామనామంలో తిరుగుతుండేవారు. రాళ్ళు వేసి కొడితే కొట్టించుకునేవాడట. ఆయన అవధూత! 'మీ ఇద్దరు కలిసి మాట్లాడుకున్నది బాగుంది మాస్టారు, ఆయన మీ చేత ముందు వేయించుకోవడం కూడా బావుంది' అంటే 'ఆయన మందు వేయించుకుందామనే మిషతో నన్ను చూద్దామని వచ్చారు. ఆయన్ని చూడడం నా భాగ్యం' అన్నారు. మందు వేశారు కదా, ఎలా ఉంటుందంటే ...మందా పాడా? అన్నారు. ఆయనకి తెలుసు వెళ్ళిపోతానని. నాకు తెలుసు ఆయన వచ్చిన పని అయిందని. మందు వేయించుకునే మిషతో నన్ను చూద్దామని వచ్చారాయన. అంతమాత్రం చేత మనం మందు వేసిన వాళ్ళం, ఆయన గొంతు నొప్పి తగ్గించిన వాళ్ళం అని వ్యామోహపడడానికి వీలు లేదు' అన్నారు. ప్రణాళిక వున్నంతవరకు వుంటాం, ప్రణాళిక లేకపోతే వెళ్ళిపోతాం అనే భావనలో జీవించిన వారు ఎప్పుడూ స్వస్థతలోనే ఉంటారు. జబ్బు గురించిన ఆలోచన వారికుండదు. భక్త

రాజ్ మహారాజ్ గారు కూడా అదే చేశారు. అందరూ వచ్చి ఈయనకి heart attack అని గోల చేస్తుండేవారు. ఈయనేమో doctors నీ, వాళ్ళని తెచ్చిన వారినీ కూడా హాస్యం పట్టిస్తుండేవారు. 'నాకు లోపల ఇది వుంది కదా కుమార్! ఇది పనిచేస్తున్నంత సేపు నేను వుంటానని నాకు తెలుసు. ఇది పనిచేయడం మానేస్తే నేను పోతాను. వీళ్ళేం చేయగలరు వీళ్ళ మొహం' అన్నారాయన. 'అదే నేను! అందులోనే నేనున్నాను! అది పనిచేసేనంత వరకు నేను ఉంటాను. మిగతాదంటావా, వుంటే వుంటుంది, పోతే పోతుంది. మనకేమిటి సంబంధం? ఇంత మందులు వేసేవారు timeకి ఎవరూ వుండరు. అవసరం లేనప్పుడు రోజు మందులు వేయడం, చేయడం చేస్తారు. నిజానికి వెళ్ళిపోయే timeకి వీరు ఎవ్వరూ రాలేరు, చేయలేరు' అని సరదాగా చెప్తుండేవారు నవ్వుతూ. అంటే ఆయన దీంట్లోంచి బయటకు వచ్చి, ఇందులో వుండేవారు. శరీరంలోంచి విడివడి, శరీరంలో వుండడం. వేరుశనగపప్పు తొక్కను అంటిపెట్టుకొని ఉన్నప్పుడు పచ్చిగా వుంటుంది. లోపల పప్పు కొంచెం ఎండితే తొక్కతో విడివడి వుంటుంది. లోపల పప్పు ఉన్నది, లేనిది కూడా తెలుస్తుంది ఇలా కదిలిస్తే. అదే పచ్చి కాయని ఇలా అంటే? తెలియదు. అలాగే మామిడి టెంక లోపల గింజ కూడా. పండు బాగా పండాక టెంక లోపల గింజ గలగల వినిపిస్తుంది. మామూలుగా అయితే అది, ఇది అన్నీ అతుక్కునే ఉంటాయి. పచ్చి మామిడికాయటంక, పండు మామిడి టెంక పగలగొడితే తేడా తెలుస్తుంది. అలాగే పచ్చి వేరుశెనగ. దాని తొక్క, గింజ చాలా అవినాభావ సంబంధం కలిగి ఉంటాయి. అదే కొంచెం ఎండిందనుకోండి, విప్పగానే గింజ విడి పడి పోతుంది. వేరు పడి అందులోనే ఉంటుంది. అలా ఉంటాడు నిర్వాణం చెందిన వాడు. అందులోనే వుంటాడు నిర్వాణం చెంది. అప్పుడు స్వస్థత కలిగి ఉంటాడు. తొక్క వెళ్ళిపోతుంది. గింజ దివ్య కార్యానికి పనికి వస్తుంది. మళ్ళీ మొక్కగా పెరగవచ్చు. లేకపోతే అంతర్యామిలాగ మళ్ళీ మన నోట్లోకి వెళ్ళిపోవచ్చు.

## 603 భిషక్

మార్గంలోకి వచ్చేసరికి నిర్వాణంలోకి వచ్చాం. నిర్వాణంలోకి వస్తే స్వస్థతలోకి వచ్చాం. ఇందులో వచ్చినవాడు 'భిషక్' అవుతాడు. అంటే Healer అని అర్థం. ఇతరులకు కూడా అలాంటి స్వస్థత ఇవ్వగలిగిన వాడని అర్థం. మందులు వేస్తాడని కాదు. అంటే ఈ doctor భవరోగానికి doctor. నిజమైన వైద్యుడు. ఏమిటీ వైద్యం చేస్తాడూ మిగతా వాళ్ళకి? నువ్వు కూడా ఇలా వచ్చేయమని. నీకు కూడా ఇదే దారి, నువ్వు కూడా ఇందులోంచి బయటకు వచ్చేసెయ్యి, అందులోనే ఉండు. చాలా అద్భుతంగా, చాలా బాగుంటుంది అని వాడికి, ఇతడు వాహిక అయినవాడు కనుక దీనికి సంబంధించిన స్ఫూర్తి ఇతడు నుండి అతనికి అందుతుంది.. ఇట్లా 'జ్యోత్ సే జ్యోత్ జలాతె చలో' అన్నట్లుగా ఒక దీపం నుండి ఇంకో దీపం, ఆ దీపం నుండి ఇంకో దీపం ఇలా కార్యక్రమం నడిపిస్తుంటారు. అందుకని ఈయన 'భేషజం' వచ్చాక 'భిషక్' అయిపోతాడు. అప్పుడు ఈయన నుండి అందుతుంది. అందిస్తుంటాడు వైద్యుడు.

## 604, 605, 606, 607, 608 సన్యాసకృత్, శమః, శాంతః, నిష్ఠ , శాంతిః

సన్యాస కృత్ అంటే సన్యాసం అనే సమ్యక్ న్యాసంలో వున్నాడు కదా! ఎప్పుడూ సమాన ప్రాణంలో ఉండి ఈ స్పందనంలో జీవిస్తూ ఉంటాడో, సమ్యక్ న్యాసం కలిగి వున్నవాడు అని అర్థం. ఇంకొక అర్థం దేనియందు మమకారం లేకుండా వుంటాడు. ఎందుకు మమకారం వుండదు అంటే... సమస్తము వాడిదే, మనం కూడా వాడి వారమే. మన వంతు పని మనం చేసుకుందాం. మనం అనుభవించగలిగినంత కాలం అనుభవిస్తూ వుందాం. ఏమిటి? వాడిని! ఈ శరీరం ఉండడంతో, లేకపోవడంతో సంబంధం లేకుండా అనుభవించడం గా వుంటాడు. అలా వుండడం చేత క్షమ, శాంతి, అన్ని automatic గా వచ్చేస్తాయి. మహాత్ముల క్షమ మనం ఊహించలేం. ఇదివరకు క్షమ చెప్పుకున్నాం, ఇక్కడిది ఎందుకు చెప్పారు మళ్ళీ అంటే ఈ మార్గంలో ఒకసారి ప్రవేశించాక ఏమిటేమిటి దక్కుతాయో చెప్తారు. ముందు చచ్చిపోయి, healer అయిపోయి. నీకు healing వస్తుంది. అసలు నువ్వు healing power లో వుంటావు. మిగతా వారికందిస్తూ వుంటావు. అక్కడి నుండి వాటిమీదా, వీటి మీదా మమకారం పోతుంది. దివ్య ప్రణాళికలో భాగంగా నువ్వు చేయవలసినది చేసుకుంటూ వెళ్ళిపోతుంటావు. క్షమ, నిష్ఠ వస్తుంటాయి. నిష్ఠ అంటే పనుంటే పనిచేయడం, లేకపోతే అందులోకి వెళ్లి కూర్చోవడం. ఎందులో? స్పందనలో! బుద్ధిమంతుడైన కుర్రాడు బజార్లు తిరగకుండా తొందరగా ఇంటికి వెళదాం అనుకోడూ? అలా తొందరగా 'హృదయం' అనే ఇంటికి వెళ్లి పోదాం అని చూస్తాడు. ఎలా వుంటుందా మార్గము? నిష్ఠ, శాంతి, శమము, క్షమ, సహనం అన్నీ వస్తాయి. అందులోకి వెళితే ఆ దారిలో దొరికేవే ఇవన్నీ.

## 601 పరాయణః

పరాయణం అంటే పర, అయనః. పరమునకు మార్గము అని అర్థము. 'అయనము' అంటే మార్గము అని అర్థం. నారాయణము... 'నా' అంటే ఇటు నుంచి అటు వెళ్లిపోయే మార్గం అంటే స్థూలం నుండి సూక్ష్మంలోకి వెళ్ళే మార్గము. 'రా' అంటే సూక్ష్మము నుండి స్థూలం లోకి వచ్చేది. 'అయనము' అంటే మార్గము. అంటే స్థూలం నుండి సూక్ష్మం లోనికి, సూక్ష్మము నుండి స్థూలంలోనికి వచ్చే మార్గము మొత్తమును 'నారాయణము' అన్నారు. పర ఆయనః అంటే చేసినంతకాలం చేస్తూ అలా ఉంటుంటాడు. ఆ తర్వాత పరుని లోనికి ప్రయాణం చేస్తాడు. అంటే సమాధి స్థితికి వెళ్తాడు. అంటే చచ్చిపోతాడు అని కాదు. సమాధి స్థితికి వెళ్ళినవాడు మళ్లీ దేశకాల పరిస్థితులను బట్టి తిరిగి వచ్చి పని చేస్తుంటాడు. మళ్లీ సమాధిలోకి వస్తుంటాడు, వెళ్తుంటాడు. శరీరంతో సంబంధం లేకుండా అలా చిరంజీవిలాగా జీవిస్తుంటాడు. ఇదంతా ఏమిటి? మనదైన ఆలోచనలు, మనసులో వున్నంత వరకు మనం ఆ దైవ సంపత్తికి దూరంగా వున్నాం. ఇక అక్కడి నుండి మనం శ్వాసను అందుకుని బయలుదేరి వెళితే ఇలా వెళ్లి వెళ్లి ---వైకుంఠపాళిలో చిట్టచివరన 'పరమ పదము' అని ఉంటుంది. దాన్నే పర అయనము అంటారు--- దాన్ని చేరుకోవడంగా వుంటుంది. కనుక ఈ నామం సాధనాపరంగా మనం చెప్పకుంటా కనుక పూర్తిగా శ్వాస మీద మనసు లగ్నం చేసి, అంతర్ముఖుడై హృదయంలోకి వెళ్లి, అక్కడ నుండి ఆ హృదయంలో తనకుండే భావనలు అన్నీ దహింపబడి, తను బతికి తన భావనలు చావడం జరిగి (నిర్వాణం అవుతుంది), అది ఆధారంగా క్షమను పొంది, శాంతిని పొంది, శమమును పొంది, నిష్టతో ముందుకు బయలుదేరి వెళ్లి పరతత్త్వాన్ని దర్శనం చేయడం. పరతత్త్వ దర్శనం అంటే ఏమీ లేదు... సూక్ష్మ స్పందనం కూడా లేని స్థితి. సూక్ష్మ స్పందనలోకి వెళ్ళగానే మన చేయి పట్టుకుని చూస్తే నాడి కొట్టుకోదు. చచ్చిపోయాడేమో అనిపిస్తుంది. లాహిరి మహాశయుడు అలా చేసి చూపించారు. షిరిడి సాయిబాబా అలా మూడు రోజులు చేసి చూపించారు. ఈ మధ్యకాలంలో CVV గారు అలా చేసి చూపారు. వీరు శరీరంతో సంబంధం లేకుండా, శరీరంలో ఉండడం గా తెలిసిన వారు. వీరు సూక్ష్మ స్పందనలో వుంటారు. సూక్ష్మ స్పందన కూడా సమస్తంలో ఐక్యం చెందడం జరిగినప్పుడు ఆ పరాయణం సిద్ధిస్తుంది. సిద్ధించినా అన్ని లోకాలలోనూ ఉండేది ఇక్కడే వుంది కాబట్టి ఇక్కడే అందరితో పాటుగా వుంటారు. అదీ వారి గొప్పతనం. పరాయణులు అంటే అది. దేనియందు పారమును చూశారో వారిని పరాయణులు అంటారు. వీరు తత్త్వము యొక్క పారము చూడడం వరకు జరుగుతుంది. ఈ మొత్తం దారి మనకి శ్వాస దగ్గరనుండి ఇన్ని మెట్లుగా వస్తున్నది భగవత్ తత్త్వమే, ఈ మార్గం అంతా భగవత్ తత్త్వమే అని తెలుసుకోవాలి. అక్కడెక్కడో భగవంతుడున్నాడని చేరడం అనీ కాదు. అసలు శ్వాస మీద మనసు పెట్టగానే హాయిగా అనిపిస్తుంది. అవీ, ఇవీ ఆలోచిస్తూ ఉంటుంది. ఎన్నో తలపులు, ఎన్నో ఆలోచనలు, ఎన్నో లంపటాలు అని కదా పాడుతుంటారు. ఈ లంపటాల నుండి

బయటకు వెళ్లడానికి కూడా మనసును తీసుకెళ్లి శ్వాస మీద ఉంచడం చేస్తే బాగా జరుగుతుంది. అది ఈ శ్లోకం అవగాహన.

## 610 శుభాంగః

చాలా శుభప్రదమైన దేహ భాగములు కలవాడు. ఈ సృష్టి అంతా భగవంతుని యొక్క దేహంగా భావన చెయ్యడం ఒకటి ఉన్నది. అది మొట్టమొదటి శ్లోకము 'విశ్వం విష్ణు ర్వషట్కారః' అనే దాంట్లో విశ్వమే విష్ణువనే భావం ఇవ్వబడి ఉన్నది. భగవంతుని యొక్క సృష్టిలో ఉండే అందాలని అనుభూతి చెందిన వాళ్ళకి శుభమైన అంగములుగా ఈ సమస్తమైన గ్రహగోళాదులు గోచరిస్తాయి. అది ఒక భావన. మరియొకటి సాధనపరంగా భగవంతుని శుభమైన అంగములు కలవానిగా మనం ధ్యానం చేసుకున్నట్లయితే మనకి శుభాలు కలుగుతాయి. అందుకనే భారతీయ సంప్రదాయంలో భగవంతుని చాలా దివ్యమైన, మనోహరమైన, ఆకర్షణీయమైన, అత్యంత సుందరమైన రూపంగా చిత్రీకరించుకుని ధ్యానం చేసుకుంటారు. అంటే భగవంతుని యొక్క పాదముల దగ్గర నుండి శిరస్సు, ముంగురులు వరకు కూడా చక్కటి పద్ధతిలో, మన ఊహకందినంతమేర అందంగా ఊహ చేసుకుని, శుభప్రదమైన అంగములు కలిగినవాడిగా ధ్యానం చేసుకోవడం అనేది భాగవత మార్గంలో చాలా ముఖ్యమైన ధర్మం. శ్రీకృష్ణ భగవానుడు ఉద్ధవుడికి ఈ ధర్మాన్నే ఇచ్చాడు. కలియుగంలో మానవులు అవ్యక్త పరబ్రహ్మ తత్త్వాన్ని తమయందు దర్శనం చేసుకోవడం కష్టమవుతుంది కాబట్టి, సుందరాకారునిగా నన్ను చిత్రించుకుని ధ్యానం చేసుకోవడం ద్వారా తరింపుమార్గం చెందవచ్చు అని. అందుకని మనం ఎన్నుకునే అమ్మవారు, అయ్యవారు చాలా అందంగా ఉండాలి. అది భావనలో చిత్రీకరించుకునే అందం కాబట్టి ఎంత అందంగా మనం తీర్చిదిద్దుకుంటే అంత అందం మనలో భాసిస్తుంది. ఎంత శోభాయమానంగా మనం తీర్చిదిద్దుకుంటే అంత శోభ మనలో ఉద్భవిస్తుంది. ఎంత ఆకర్షణీయంగా చిత్రీకరించుకుంటే మనలో అంత ఆకర్షణ పెరుగుతుంది. ఎంత వైభవాన్ని మనం ఆ విగ్రహానికి మనం లోపల సృష్టి చేసుకుంటే అంత వైభవం మనకి అబ్బుతుంది. ఎంత వెలుగు ఆ దివ్యమంగళ రూపానికి లోపల మనం ఆపాదిస్తే అంత వెలుగు మనకి అబ్బుతుంది. ఈ విధంగా శుభాంగుడైన భగవంతుని ధ్యానం చెయ్యడం వలన, మనకి కూడా శుభమైన అంగములు ఏర్పడే అవకాశం ఉంటుంది. ఆకర్షణీయము, ప్రేమ పూరితము, అయస్కాంతీకరణము చేసే చూపులు, నవ్వు, చేష్టలు ఇటువంటివన్నీ కూడా ఆయన భావన చేత మనకి అబ్బుతాయి. అందుకని భగవంతుని శుభాంగుడుగా భావన చెయ్యడమనేది ఒక ముఖ్యమైన సాధన. మైత్రేయ మహర్షి ఈసాధన గురించి చాలా వివరంగా చెప్తారు. ఆయన అష్టాంగ యోగంలో సిద్ధుడైనప్పటికీ కూడా ఆయన భక్తులకు చెప్పేదేమిటయ్యా అంటే అద్భుతమైన రూపునిగా భగవంతుని చిత్రీకరించుకుని చూడమని. అందుకనే భాగవతంలో, మనకి విష్ణుమూర్తి యొక్క వర్ణన అప్పుడప్పుడు మధ్య మధ్యలో గుర్తు చెయ్యడానికి ఒక గురువు, ఒక శిష్యునికి ప్రార్థన చేసుకోవడానికి ఎటువంటి రూపాన్ని ఆరాధన చెయ్యాలో చెప్పడం కోసం చెప్పినట్లుగా చెప్పి, అదే విషయాన్ని మళ్ళీ మళ్ళీ మనకి

గుర్తు చేస్తూ ఉంటాడు. ధ్రువునికి, వాసుదేవుని రూపం ఏ విధంగా ధ్యానం చేసుకోవాలో నారదమహర్షి ఆ విధంగా చెప్తాడు. అదేవిధంగా ఉద్ధవునికి శ్రీకృష్ణుడు చెప్తాడు. అదేవిధంగా చాలామంది భక్తులకి బ్రహ్మవేత్తలైన మహర్షులు భగవంతుని ఎటువంటి గుణ సంపద, కళ్యాణమైన మూర్తి కలిగినవాడిగా చిత్రీకరించుకుని ధ్యానం చేసుకోమంటారో మనకి భాగవతంలో వివరణగా వస్తాయి. మనం కూడా భగవత్ తత్త్వం అవ్యక్తమైనప్పటికీ, రూపం లేకపోయినప్పటికీ, దానికి నామం లేకపోయినప్పటికీ, అది ఏ రూపంలోకైననూ, ఏ నామంలోకైననూ మనం ఎలా పిలుచుకుంటే అలా వస్తుంది కాబట్టి, మనయందు కరుణ చేత మనం ఏర్పరచుకున్న రూపంలోకి దిగివస్తుంది కాబట్టి అత్యద్భుతమైన సుందరాకారునిగా, రమణీయమూర్తిగా, మనోహరంగా (మనస్సుని హరించే మూర్తి మనోహరుడంటే) ఉండే రూపాన్ని మనం భ్రూమధ్యంలోనో, హృదయంలోనో భావన చేసుకోవాలి. ఆయన యొక్క పాదములను భావన చెయ్యాలి. పాదములు చాలా సున్నితంగా ఉన్నట్టుగా భావన చెయ్యాలి. పాదముల గోళ్ళు చక్కటి గులాబి రంగులో తళ తళలాడుతున్నట్టు భావన చెయ్యాలి. ముట్టుకుంటే కందిపోతాయేమో అన్నంత కోమలంగా ఆయన పాదములు ఉన్నట్టుగా భావన చెయ్యాలి. ఆ తరువాత అక్కడ్నుంచి చీలమండలు, అక్కడ్నుండి పిక్కలు, అక్కడ్నుండి మోకాళ్ళు, అక్కడ్నుండి తొడలు, అక్కడ్నుండి కటిప్రదేశము ఇలా అంతా కూడా మంచి బంగారపు కాంతులీనుతున్న వస్త్రములు ధరించినట్టు భావన చెయ్యాలి. అక్కడ్నుండి నాభిప్రదేశం ధ్యానం చెయ్యాలి. ఆ నాభికి క్రిందుగా చక్కగా బాగా ధగధగా మెరుస్తున్న వడ్డాణం పెట్టుకున్నట్టుగా ధ్యానం చెయ్యాలి. ఆ తరువాత నాభిప్రదేశం ధ్యానం చెయ్యాలి. నీలమైన శరీరవర్ణాన్ని ధ్యానం చేసుకోవాలి. హిరణ్మయము, శ్యామలము అయిన వర్ణములను ఈ విధంగా ధ్యానం చేసుకోవచ్చు. హిరణ్మయమనే వర్ణాన్ని మనం ఎంత ధ్యానం చేసుకుంటే మనలో హృదయము అనే కమలము అంత చక్కగా విచ్చుకుంటుంది. శ్యామలమైన వర్ణం మనకి బాగా ధ్యానంలో నిలిచినట్టయితే ఆజ్ఞ అనే కేంద్రం బాగా విచ్చుకుంటుంది. ఆ విధంగా మనం చక్కగా ఆయన నాభి ప్రదేశాన్ని, హృదయమును, హృదయము మీద పుట్టుమచ్చను, పెట్టుకున్న ఆభరణాలని, ఆ చక్కని వనమాలికను, ఆ తరువాత చక్కటి సౌష్టవమైన భుజస్కంధములను, ఆపైన హస్తములను, మొత్తం చేతులు భుజాలన్నిటినీ, మోచేతులకి భుజాలకి మధ్యలో ఉండే ప్రదేశంలో అందమైన వంకీలు పెట్టుకున్నట్టు, అలాగే మణికట్టు ప్రదేశంలో చక్కటి ఆభరణాలు ధరించినట్టు, ఒక చేతిలో చక్రం ధరించినట్టు, ఒక చేతిలో శంఖం ధరించినట్టు, ఆ చక్రం గిర గిర గిర గిర గిరా తిరుగుతూ కాంతులు వెదజల్లుతున్నట్టు, శంఖము ఉం అని ఓంకార శబ్దాన్ని వినిపిస్తున్నట్టుగా, కాసేపు శంఖం మీద, కాసేపు చక్రం మీద, కాసేపు పద్మం మీద, కాసేపు ఆయన చేతిలో మురళీధరుడైనట్లుగా భావన చేసుకుంటే, ఆయన మురళీ నాదం చేస్తున్నట్టుగానూ, గదను పట్టుకున్నట్టుగానూ, రకరకాలుగా భావన చేసుకుంటూ, కన్నులు బాగా విచ్చుకున్న పద్మమువలె మనల్ని వాత్సల్యంతో చూస్తున్నట్టుగా చిట్టచివర భావన చేసుకోవాలి. ముక్కు సంపెంగపూవు వలె కోమలంగా అందంగా ఉన్నట్లు, పెదవులు చాలా

అద్భుతమైన ఎర్రటి రంగుతో దొండపండు వలె ఉన్నట్లు, చిరు దరహాసం ముఖంలో ఉన్నట్లు, కొద్దిగా దంతములు కనిపిస్తుంటే అవి చక్కగా దానిమ్మ గింజల వలె ఉన్నట్లు, అలాగే చివురుని కప్పి ఉన్న గిరజాల జుట్టు అట్లా ముందుకు పడి ఉన్నట్లు, కాస్త చెవులకు ఆభరణాలు ఉన్నట్లు మీ ఓపిక ఎంత చేసుకుంటే అంత. ఇలా భావన చేస్తూ భగవంతుని, లోపల ఇన్ని రకములైన కాంతులు వెదజల్లే వాడుగా అందమైన రూపాన్ని మీరు చూడడం మొదలు పెడుతూ ఉంటే, మీ లోపల ఉండే అందం బయటికి వస్తుంది. మనమంతా స్వతహాగా చైతన్య స్వరూపులమే కాబట్టి చైతన్యం యొక్క విన్యాసములే రకరకములైన వర్ణములు. కాబట్టి ఈ విన్యాసములన్నీ అన్ని కేంద్రాలలోనూ మనం దర్శనం చేసుకోవచ్చు. ఈ విధంగా ధ్యానం బాగా అంతర్ముఖంగా చేసుకున్నట్లయితే అలక్ష్మి అనేది మన నుండి బయటికి వెళ్ళిపోతుంది. అలక్ష్మి అంటే లక్ష్మీప్రదము కానిది, శుభము కానిది. శుభము కానిది మనలోంచి బయటికి వెళ్ళాలంటే శుభమైనదాన్ని మనలోకి ఆవాహన చేసుకోవాలి. అందుకని అమ్మవారిని ధ్యానం చేసుకున్నా అంత అందంగానూ, అంత కాంతిమయంగానూ, అంత శోభాయమానంగా ఉన్నట్లుగా భావన చెయ్యాలి. అయ్యవారిని అయినా అట్లాగే భావన చెయ్యాలి. ఏడుస్తూ ఉండే బొమ్మలు, క్రౌర్యంగా ఉండే బొమ్మలు, భీకరంగా ఉండే బొమ్మలు, లంఘించి ఎవరినెత్తినో మోదుతున్న ఆంజనేయస్వామి బొమ్మలు, పొట్ట చీలుస్తున్న నరసింహస్వామి బొమ్మలు ధ్యానానికి అంత మంచివి కావు. చక్కటి మందస్మితముతో కూడిన భగవంతుని యొక్క ధ్యానం చాలా శుభం కలిగిస్తుంది. మనలో కాంతి పెంచుతుంది. మనలో ఉండే అలక్ష్మి ఏదైతే ఉందో దానిని తీసేస్తుంది. అలక్ష్మి అంటే కోరికే! భౌతిక విషయముల యందు మనకు ఉండే ఆసక్తి కారణం చేత మనలో తమస్సు పెరుగుతుంది. ఆ తమస్సుని పారద్రోలాలంటే ఈ వెలుగు కిరణాలు మనలో ఉద్భవించాలి. క్షుత్, పిపాస అనే మలములు ఏవైతే ఉన్నాయో 'క్షుత్పిపాసామలాం జేష్టా మలక్ష్మిర్ నాశయామ్యహం' నాయందు ఉండే క్షుత్-ఆకలి, పిపాస-దాహం. ఏం చూసినా మనకి కావాలనే ఆకలి, అన్నీ మనం పొందాలనే దాహం, అవసరం లేకపోయినా ప్రతి విషయంలో దాహం, ప్రతి విషయంలో ఆకలి ఉంటుంది. అన్ని విషయాలలో ఆకలి, దాహం ఉండడం చేత జన్మంతా కూడా వాటికోసం తిరగడంలో దరిద్రంగా పరిణమిస్తుంది. నీ లోపలే ఉన్నది సమస్తమైనది, అందుకని ఈ ఆకలి దప్పులు పోగొట్టుకోవాలనుకునే భావన నీకు లోపల ఉన్నట్లయితే, ఈ శుభాంగుడయిన భగవంతుడిని మనం ధ్యానం చేసుకోవడమనేది నిర్వర్తించుకోవాలి. అది ఎంత చేసుకుంటే మనలో అంత కళ పెరుగుతుంది. చేసుకున్న వారికి చేసుకున్నంత మహదేవ. అది బయట మనం కళగా భగవంతుని అమరిక చేసుకోవడం కూడా ఇందులో భాగం. ఎంత కళగా మీరు అమరిక చేసుకుంటే అంత ఆనందం కలుగుతుంది కదా! బాగా పువ్వులు పెట్టుకుని, చక్కగా అగరవత్తులు వెలిగించుకుని, మంచి దీపాలు పెట్టుకుని, మనం పూజిస్తున్న భగవంతుని యొక్క విగ్రహములు బాగా మిల మిలా తళతళ్ళాడేట్టుగా కడుక్కుని, వాటికి వివిధములైన వర్ణములు కలిగిన పూవులు యొక్క అలంకరణ చేసుకున్న తరువాత చూస్తే మనకే అందంగా ఉంటుంది కదా! ఆ సమస్తం లోపలే దర్శనం

చేయవచ్చు. సింధూరం రంగు లోపల కనిపిస్తుంది, పచ్చటి పసుపు లోపల కనిపిస్తుంది, బంగారపు రంగు కనిపిస్తుంది, శ్యామల వర్ణం కనిపిస్తుంది, అందుకని ఈ బయట చేసిన ధ్యానం అంతా కూడా ఆ తర్వాత లోపల కూడా చేసుకోవాలి. బయట చూసిన విగ్రహాన్ని లోపల చూడాలి. అది చాలా ముఖ్యం. బయట కనులు తెరిచి చూసిన విగ్రహం లేదా చిత్రపటం ఏదైతే ఉందో, అదే రూపాన్ని కనులు మూసుకుని లోపల చూడాలి. లోపల చూసే చిత్రంలో ఉండే బంగారం బయట చూసిన దానికన్నా ఎక్కువగా మెరుస్తుంది. బయట కాగితం మీద ఉంటుంది కదా! లోపల? మనలో ఉండే చైతన్యమే ఆ విధంగా అక్కడ ఆవిర్భావం చెందుతుంది. అందుకని వజ్రకిరీటం వెంకటేశ్వర స్వామికి పెడితే మనం వెళ్ళి చాలా ఆనందపడి వస్తాం కదా! అబ్బా ఈసారి వజ్రకిరీటం పెట్టారు, చేతికి కూడా వజ్రాలు పెట్టారు అని ఆనందపడతాం. అదే లోపల చూశావనుకో 'జన్మ ధన్యత గాంచెన్'. ఎందుకంటే నీయందు అవన్నీ ఉన్నాయి. అవి బయట భౌతికంగా ఉన్నాయి. నీ లోపల సూక్ష్మంగా అంతకన్నా ఎక్కువ వెలుగు ధరించి ఉన్నాయి. కాబట్టి ఈ వెలుగు రూపాన్ని లోపల నువ్వు ఎంత ధ్యానం చేసుకుంటే, నీకు లోపల అంత అది సత్యమవుతుంది. దానియందు ఆకర్షణ/ఆనందం నీకు ఎంత పెరుగుతుందో, అంత శాంతి లభిస్తుంది. అది తర్వాత నామం శాంతిదః.

## 611 శాంతిదః

శుభాంగుడిని ప్రార్థన చేయడం వలన వచ్చే శాంతి ఇక్కడ. ఎందుకంటే ఆ లోపల ఉండే ఆ మూర్తి యొక్క ఆరాధన, ప్రార్థన కారణంగా విపరీతమైన ఆనందం లోపల జనించి అన్నిటియందు ముందు మనస్సు శమిస్తుంది. శమించి అందులోంచి శాంతి పుడుతుంది. అందులో కన్నులు మూసుకుంటే, అది దర్శనం ఇస్తుంటే దానిని చూసి ఆనందపడుతూ ఉంటాడు. ఇట్లా లోపలే రమిస్తూ ఉంటారు మననం చేసుకునే వాళ్ళు. ఆత్మారాములైన మునులు ఉన్నారు కదా! ఆత్మయందు రమించేవారున్నారు కదా! తమయందు తమ భగవంతుని యొక్క దర్శనం ఆ విధంగా చేసుకుంటూ, దానియందు వారు రమించి ఉండడం చేత బయట విషయముల యందు అట్లా ఆరాటపడడం తగ్గుతుంది. బయట ఆరాటం ఎప్పటికీ తెగదు. ఎంత పోరాటం చేసినా ఆరాటం ఆగదు. 'నీరాట వనాటంబులకు పోరాటంబెట్లుగలిగె' అని మనకి గజేంద్రమోక్షంలో ఉంది. ఏమిటా పోరాటం? నీరాటమే అని. నీరాటం అంటే అది తిరిగేది నీళ్ళలో. వనాటం అంటే అడవుల్లో తిరిగేది. అడవుల్లో తిరిగే ఏనుగు. నీళ్ళలో తిరిగే మొసలి. ఈ ఏనుగు ఆ నీళ్ళలోకి దిగడం అంటే, మనం బయట ప్రపంచంలో కోరికలకి దిగడం. ప్రతిదీ కావాలని దిగుతాము కదా మడుగులోకి. పొద్దున లేచిన దగ్గర నుండి దిగేదల్లా మడుగులోకే. ఏదో నిత్యావసరాల కోసం వరకు దిగితే మనకి ఇబ్బంది లేదు. అంతకుమించి చెలరేగి అందులో మనం వెకిలి వేషాలు వేసినప్పుడు పట్టేస్తుంది. గజేంద్రుడు స్నానం చేసివుంటే మొసలి పట్టుకునేది కాదు. గజేంద్రుడు సరస్సులో విపరీతమైన కల్లోలం సృష్టిస్తాడు. ఎందుకయ్యా అంటే తను ఎంత బాగా అక్కడ విన్యాసాలు చెయ్యగలడో చూపించడం కోసం. అక్కడ వెయ్యిమంది భార్యలు బయట ఆడఏనుగులు చూస్తుంటే వాళ్ళందరితో, ఆ ఏనుగులు కూడా ఈయనతోపాటు అందులోకి దిగితే, వాళ్ళ ముందు తన గొప్ప చాటుకోవడం కోసం ఏవేవో ఏవేవో చేస్తుంటే, వెయ్యి ఏనుగులు సరస్సులో పడి అట్లా గొడవ చేస్తుంటే, లోపల బాగా లోతుల్లో ధ్యానం చేసుకుంటున్న ఒక మొసలికి కొంచెం అంతరాయం అనిపించింది, ఏమిటీ గోల అని. వచ్చి టక్కున పట్టేసుకుంది. ఎంత ఏనుగు అంటే ఈ ఏనుగు దశ లక్ష కోట్ల ఏనుగులకు నాయకుడు. అంత గట్టివాడుట వాడు. ఓంకార స్వరూపుడు. గజేంద్రమోక్షంలో గజేంద్రుడు గురించి ఏం చెప్తారంటే, గుహలోంచి బయటికి వస్తాడని చెప్తారు. మనం అంతా కూడా పొద్దున్నే హృదయమనే గుహలోంచి మనస్సుతో, ఇంద్రియాలతో బయటికి వచ్చేస్తాం. బయటికొచ్చి చిందరవందరగా, చెల్లాచెదురుగా ఇష్టం వచ్చినట్టు ఆ కొమ్మలు విరిచి, ఈ కొమ్మలు విరిచి వనమంతా నానా ధ్వంసం చేస్తాము. ఆ తరువాత నీళ్ళలోకి దిగుతారు. నీరు అంటే కామం అని కూడా ఒక అర్థం. అందులో దిగి నానా గొడవా చేస్తుంటే, మనం కూడా కామలోకాలలోకి అట్లా దిగినప్పుడు కామమే మనల్ని పంచేంద్రియముల ద్వారా మకరమై పట్టేస్తుంది. మకరము అంటే ఐదు భుజములు కలది అని. ఐదు భుజములు కలిగింది పంచారం ఒకటి ఉంది. Five pointed star అంటారు. దానినే మకరం

అన్నారు. దానినే మొసలి అన్నారు. మనలో ఉండే మొసలి మన ఇంద్రియములే! కామపూరితమైన ఇంద్రియములు జీవుడ్ని శుభ్రంగా అందులో పట్టి నలిపేసి శుభ్రంగా పచ్చడి చేసుకు తినేస్తాయి. Grinder వేసి రుబ్బినట్టు రుబ్బేస్తాయండీ! జీవుడు ఎప్పుడైతే ఐదు ఇంద్రియాలకి లోబడ్డాడో అప్పుడు వాడి పని ఖాళీ. అలా నీరసిస్తూ, జన్మలు జన్మలు ఏడుస్తూ బ్రతకడం తప్ప ఆనందం అనేది ఉండదు. శాంతి అనేది ఉండదు. అందుకని ఈ మకరంలోకి మనం పడకుండా ఉండాలంటే ఈ శుభాంగుడిని ధ్యానం చేసుకోవాలి. శుభాంగః, శాంతిదః, స్రష్టః అన్నారు. ఇవన్నీ గొలుసుకట్టు నామాలు.

# 612 స్రష్టా

స్రష్టా అంటే విడుదల కలిగించిన వాడు అని అర్థం. మాస్టరుగారు స్రష్ట అంటే బ్రహ్మ అని ఇచ్చారు. మనకి చాలాచోట్ల అదేనామం వస్తూ ఉంటే అదే అర్థం చెప్పకోక్కర్లా. సంస్కృతంలో ఒకే నామానికి రకరకముల చోట్ల రకరకముల అర్థాలు మనకి గోచరిస్తాయి. వాడినటువంటి భావంలో, అప్పుడుండే ఆ గొలుసులో దానికి ఏమిటి ప్రత్యేకమైన స్థానం ఉందో మనం చూసుకోవాలి. అదే నామం వాడారు అనుకోకూడదు. అదే నామం కానీ ఇంకో అర్థం ఉంది అక్కడ. అందుకని ఇక్కడ మనం చెప్పకునే అర్థం సముచితంగా ఎట్లా ఉంటుంది అంటే, విడుదల చేయించేవాడు. దేన్నించి విడుదల చేయిస్తాడు? ఇంద్రియముల నుంచి విడుదల చేయిస్తాడు. కామపూరితమైన ఇంద్రియాల్లో ఇరుక్కున్న వాడిని విడుదల చేయించేస్తే ఎంత బావుంటుందో! గజేంద్రుడు ఒకసారి మొసలిపట్టు నుండి బయటపడి వచ్చిన తరువాత ఎంత హాయిగా, ఎంత ఆనందంగా ఉంటాడో. ఆ పద్యాలు చదువుకోవాలి ఒకసారి. పోరాడి పోరాడి అలసిపోయి ఇహ ఎందుకు అయిపోయింది ఇంకేం లేదు, అనుకునే సందర్భంలో భగవంతుని యొక్క ధ్యానం ఎంతో బాగా చేస్తాడు. గజేంద్రమోక్షణం లో ఇచ్చిన భగవంతుని ప్రార్థన అత్యుత్తమమైన ప్రార్థన. 'రావే ఈశ్వరా కావవే వరదా సంరక్షింపు భద్రాత్మకా' అని చివరికి కోరుకుంటాడు. అంతకు ముందు తన బలంకొద్దీ పెనుగులాడతాడు. మనం కూడా జీవితంలో చాలా పెనుగులాడుతూ ఉంటాము. తెమిలిందా పెట్టిందా? పెనుగులాటే ఉంటుంది. ఎన్ని సంవత్సరాలు పెనుగులాడాడో! మనమే! ఒక వెయ్యి సంవత్సరములు పోట్టాడాట్టండీ! మనలాగే. అంటే జన్మల తరబడి పోట్లాడ్డంలా మనం? ఎప్పటికీ అవవు. అవే గెలుస్తున్నాయి, మనం ఓడిపోతున్నాం. అప్పుడు ఇంక అనిపించిందిట. 'తనలావు వైరి బలమున్ చింతించి' చూశాడుట, అదే బలంగా ఉందిట. మనకన్నా కదా! మన శరీర ఆవశ్యకతలు మనకన్నా చాలా బలంగా ఉండి మనల్ని లాగెయ్యట్లా? ఎప్పటికప్పడు భయంకరంగా లాగేస్తాయి. 'మిథ్యా మనోరథ మింకేటికి' అనుకున్నాడట. ఇది మిథ్య. ఇదేదో మనం ఇంకా చక్కబెడదాం అనుకుంటున్నామే! అది మిథ్య మనం. చక్కబెడితే ఏమీ చక్కబడదు అని తెలుసుకుంటాడు. 'దీని గెల్వ సరిపోలన్ జాలరాదు' దీంతో గెలిచేంతటి ఎత్తులో నేను పోట్లాడలేను. బాగా వ్యధ చెంది, పూర్వ పుణ్యం కారణంచేత అప్పుడు ఒక్కసారి అటు తిరిగిందిట. అప్పటి నుండి 'ఎవ్వనిచే జనించు జగమెవ్వని లోపల నుండు' అని. మనకేంటంటే జీవుడుగా శరీరంతో చాలా పెనుగులాడుతూ ఉంటాం. ఏనుగుతో పెనుగులాడినట్టుగా ఉంటుంది మన పని. అదేమో ఉంగలు చుట్టేస్తుంటుంది, తిప్పి కొడుతుంటుంది. మనం దాంతో ఏదో పెనుగులాట. శరీరముతో, శరీర అవసరములతో, శరీర సంబంధితమైన విషయములతో జీవుడు పెనుగులాట, మొసలి ఏనుగు పోట్లాడుకున్నట్లు ఉంటాయి. అది ఎప్పటికీ తెమలదు. తెలివి ఏమిటయ్యా అంటే దీనితో మనం పోట్లాడలేము. దీనికీ, మనకీ కూడా ఇంకోడున్నాడు మొగుడు. ఇటు శరీరానికీ అటు జీవుడికీ ఇద్దరికీ ఒక

మొగుడున్నాడు. వాడిని పట్టుకుంటే, వాళ్ళిద్దరికీ వాడే పరిష్కారం. అందుకని మొసలికీ పరిష్కారం వచ్చింది. గజేంద్రుడికీ పరిష్కారం వచ్చింది. మనకి ఏమైంది? మన శరీరమే మనల్ని మొసలి వలే పట్టేసింది. మనకి ఏం మాట్లాడాలో, ఏం మాట్లాడకూడదో తెలియదు. అయినా మాట్లాడకూడనివి మాట్లాడుతూ ఉంటాం. ఏం తినాలో, ఏం తినకూడదో తెలియదు. అయినా తినకూడంది తింటూనే ఉంటాం. శరీరందే పై చేయి. ఏమి ఆలోచించాలో, ఏమి ఆలోచించకూడదో తెలుసు. అయినా మనసు ఆలోచింపకూడని విషయాలే ఆలోచింపచేస్తూ ఉంటుంది, ఏం చేస్తాడో చూద్దాం వీడు అన్నట్టుగా. మనం ఏదన్నా ఒకటి అనుకుంటే వెంటనే దానికి వ్యతిరేకంగా శరీరానికి ఒక సన్నివేశం వచ్చి చూపిస్తుంది, చూద్దాం నువ్వు గెలుస్తావో నేను గెలుస్తానో అని. ఇవాళ నుండి ఇట్లా చేద్దామనుకుంటే, వెంటనే ఏదో ఒకటి అడ్డు వస్తుంది కదా! ఇవాళ నుండి మనుషుల మీద అరవకూడదని పెట్టుకున్నామనుకోండి, తరువాత సన్నివేశములోనే అరవక తప్పని పరిస్థితి వచ్చేస్తుంది. అరిచేస్తాం. మనకి, మనము చేతకాని వాళ్ళం అని తెలుస్తుంది. గయ్యాళి భర్త, భార్య అనుకుంటామే, శరీరం కన్నా గయ్యాళిదేం లేదు. ఎందుకట్లా అయిందంటే, దాన్ని వాడుకోవడం చేతకాక, దాన్ని బాగా గారాబం చెయ్యడం చేత, అది ఇవాళ మన మాట వినదు. భగవత్ తత్త్వం బాగా అనుభూతి కావాలంటేట మూడు గంటలకి లేవాలిట రోజూ పొద్దున్నే. ఈ జన్మకి అయ్యే పనండీ అది? పండుగనాడు భోజనం చేసింతర్వాత మధ్యాహ్నం ఏ ఒకటిన్నర, రెండు గంటలకో పడుకున్నామనుకోండి! అప్పుడు మూడు గంటలకి లేవగలిగితే గొప్ప మన శరీరం. భగవత్ తత్త్వం మనలో అనుభూతి చెందాలంటేట మూడు గంటలకి లేచి, మూడున్నర నుండి ఐదున్నర వరకు సాధన చేసుకోమంటారు. చెప్పిన వాడికి బుద్ధి లేదేమో అనిపిస్తుంది మనకి. ఎందుకనిపిస్తుందంటే మన శరీరం సంగతి తెలిసే చెప్పాడా ఇది, అనిపిస్తుంది కదా! అంత పట్టు శరీరం మీద మనకి ఉంది. అదే మొసలి! మరి దాన్నుండి మనం రక్షింపబడాలంటే శుభాంగుడిని బాగా ధ్యానం చెయ్యాలి. అందుకనే మనకి భారతదేశంలో ఇచ్చినంత అద్భుతంగా భగవతారాధన ఎక్కడా ఇవ్వలేదు. ఏం సందేహం లేదు. ఎంత అద్భుతంగా ఉంటుంది మనోహరమైన కృష్ణుని యొక్క ధ్యానం చేసుకుంటే. అలాగే రాముని ధ్యానం, అలాగే అమ్మవారి ధ్యానం, విష్ణుమూర్తి ధ్యానం, ఎవరి ధ్యానం చేసినా తళ తళ తళ తళా, మిల మిల మిల మిలా మెరిసిపోయేట్టుగా ఉండే విగ్రహాలు కదండీ ఇచ్చారు. కళాకాంతులు పెంచుకునే పద్ధతిలో ధ్యానం చేసుకుంటూ ఉంటే, లోపల అది పెరుగుతూ ఉంటే, దాని యొక్క బలం ఇంద్రియాల్లోకి కూడా ప్రవేశిస్తుంది. ఏమిటి దాని బలమంటే, దానియొక్క వెలుగే దానియొక్క బలం. అంటే నువ్వు మనసుతో ఆ రూపం మీద కాంతులను ఆపాదించుకుని ధ్యానం చేస్తూ ఉంటే, అవి కాంతులీనుతూ ఉంటే, ఆ ఈనుతున్న కాంతులు ప్రసరిస్తూ ఉంటే, ఆ ప్రసరించే కాంతులు నీ మనసునంతా నింపి, నీ ఇంద్రియాల్లోకి కూడా అది జొరబడి పోవడం వలన, ఇంద్రియాల్లో ఉండే అలక్ష్మి పారిపోతుంది. లక్ష్మి రాగానే అలక్ష్మి పారిపోతుంది. ఇది అడుగుతాం శ్రీ సూక్తంలో. ఓ జాతవేదుడా నాకు ఆ లక్ష్మిని నాలోకి పంపించు. మమావహ-నన్ను ఆవహించేటట్టు చెయ్యమని కోరతాం. ఆ వెలుగు

ఆవహించినట్లయితే, అలక్ష్మి పోతుంది. అలక్ష్మి పోవాలి, అలక్ష్మి పోవాలి అనుకుని ఉపయోగం లేదు. లక్ష్మిని తెచ్చుకుంటే అలక్ష్మి పోతుంది. చీకటి పోవాలనుకుంటే వెలుగు తెచ్చుకుంటే చీకటి పోతుంది. దీపం వెలిగించుకుంటే చీకటి పోతుంది. చెడు అలవాట్లు మానుకోవాలి, అది మానుకోవాలి, ఇది మానుకోవాలి, చాలామంది చాలా మానుకోవాలి అనుకుంటారు మానుకో లేరు కదా! పిచ్చిపిచ్చి వేషాలు మనలో బోల్డుంటాయి కదా! అవన్నీ మనం మానుకుందామనుకుంటాము. అవదు మనవల్ల. మానుకోవడం వద్దని చెప్తారు తెలిసిన ఋషులు. ఇది మానుకుందాం అని అనుకోబోక. అది మానుకోవడం పక్కన పెట్టి, ఇది చేస్తే అది పోతుంది, చీకటి పోవాలి చీకటి పోవాలి అంటే పోదబ్బాయ్, Light వేసుకుంటే చీకటి పోతుంది అని చెప్పారు. రాజర్షులు చెప్పే మార్గం అది. ఒక చిన్న దీపం పెడితే చీకటి పోతుంది. దాని గురించి ఊరికే గింజుకుంటావేంటి? అందుకని లోపల దీపం పెట్టు. లోపల వెలుగు పెంచుకో. లోపల కాంతులు పెంచుకో. అదే శ్రీసూక్తమంతా కూడా. 'హిరణ్యవర్ణాం హరిణీం' అన్నప్పుడు అసలు ఈ విధంగా మాట అనంగానే లోపల భళ్ళున బంగారపు రంగు అట్లా వెలగాలి. ఏదో ఏడుస్తూ చదువుతూ ఉంటారు. ఎవడికీ ఉత్సాహం లేదు. స్ఫూర్తి అంతకన్నా లేదు. ఏం చదువుతున్నారో తెలియదు. అట్లా గానుగెద్దల్లే దాన్ని పూర్తి చేసేస్తారు టక టక టక టకా, ఛందోబద్ధంగా గానుగ చుట్టూ ఎద్దు తిరిగినట్టు. అక్కడ మనం 'హిరణ్య వర్ణాం హరిణీం సువర్ణ', సువర్ణం అంటే అద్భుతమైన వర్ణం అని అర్థం అది. అంటే రంగని అర్థం. కాంతులు వెదజల్లే రంగు అని. రజతస్రజాం-వెండి వెలుగుట, ఎంత వెలుగో. అసలు ఆ శ్రీసూక్తం నిండా వెలుగే. ఇంకేం లేదు. ఎంత వెలుగును పిలుస్తున్నాం తెలుసా? సంస్కృతంలో పిలవడం వల్ల మనకి తెలియట్లేదు. హాయిగా తెలుగులో పిలుచుకుంటే సుఖం. తెలుగులోనేమో ఇంత బాగా పిలవాలంటే గంటసేపు పిలవాలి. సంస్కృతంలో అయితే ఐదు నిమిషాల్లో అయిపోతుంది. 'చంద్రాం ప్రభాసాం' అన్నప్పుడు ఆ చంద్రుడు వెన్నెల అట్లా లోపల వెలగాలి. ఒక్కసారి అర్థం చదువుకోండి. శ్రీసూక్తానికి అర్థం పాతికేళ్ళక్రితం రాసిచ్చారు మాష్టారు. అర్థం చాలామంది రాశారు. అసలు అది ఏమిటో కొంచెం తెలుసుకుని, ఆ భావంలో ఉండి చదువుకున్నామనుకోండి, అలక్ష్మి ఎట్లా ఉంటుందండి? ఉండదు. ఊరికే మనకి రావాలి రావాలి అనుకుంటాం కదా! అనుకోవడం సహజం. మానవుడికి రావాలనిపించదూ? ఏదో డబ్బులు కావాలనిపిస్తుంది. ఆస్తి రావాలి అనిపిస్తుంది. కీర్తి రావాలి, ప్రతిష్ట రావాలి, అన్నీ ఇస్తానురా, 'కీర్తి మృద్ధిం దదాతుమే' కదా! కీర్తి కూడా వృద్ధి చేసేస్తుంది. అన్నీ చేసేస్తుంది నువ్వు లోపల ఆ వెలుగుని ఈ శుభాంగుడైన భగవంతుడిని నువ్వు బాగా లోపలికి తీసుకొచ్చుకుంటూ ఉంటే, ఓహ్.. పిచ్చిపిచ్చిగా వస్తాయి నీ దగ్గరకి. అయస్కాంతం దగ్గరకి ఇనుప ముక్కలు చేరడానికి ఏం భాగ్యమండీ! ఎన్నైనా చేరతాయి. చేరవా? రండి నా చుట్టూ మీరు చేరండి అని ఊరికే పీక్కొంటే వస్తారేమిటి? ఎవరూ రారు. చాలు చాల్లేవయ్యా అని పారిపోతారు. కొంతమంది దగ్గరకి అడక్కుండానే ఎందుకు పోతారు మనుషులు? అక్కడ చూడండి ఆ పుట్టపర్తిలో, వద్దురా బాబూ, మీ ఊళ్ళో ఉన్నా కూడా నేను దొరుకుతానురా అన్నా కూడా అట్లా వేలాది మంది వచ్చి వేళాడుతున్నారే, ఏమిటి ఎందుకు

వేళ్ళాడుతున్నారు? ఎంత ఉంది అక్కడ. ఒక మహాత్ముడి దగ్గర అట్లా ఉంటుంది అద్భుతంగా. ఎందుకు వస్తారో తెలియదు, వెళ్ళకుండా ఉండలేరు. తిరుపతి ఎందుకు వెళతారు? వెళ్ళకుండా ఉండలేరు. అది నీలో కూడా ఉంది. దాన్ని పెంచుకుంటే పెరుగుతుంది. లేకపోతే అక్కడే ఉంటుంది నిద్రపోతూ. ఇంట్లో గుడ్డి దీపం పెట్టుకుని జీవించవచ్చు. ఇంట్లో శుభ్రంగా ఒక Flashlight పెట్టుకుని బతకవచ్చు. నిర్ణయం నీకే వదిలేశారు. ఏముందండీ? ఏం చేస్తే ఏంటండీ? అంటాడు. ఏం చేస్తే ఏంటంటే చేసే పద్ధతిలో చెయ్యాలి. గుర్తుపెట్టుకోండి. ఒక్కసారి శ్రద్ధాత్రయ విభాగయోగం తీసి చదవండి. పూజలు కూడా మూడు రకాలు ఉన్నాయి. తమోగుణం పూజ ఉంటుంది, రజోగుణం పూజ ఉంటుంది, సత్త్వగుణం పూజ ఉంటుంది. తమోగుణం పూజ తత్తర బిత్తరగా ఉంటుంది. సరిగ్గా మంత్రం చెప్పడు, సరిగ్గా చెయ్యడు, విధానంగా చెయ్యడు. షోడశ ఉపచారములు చక్కగా శ్రద్ధాభక్తులతో చేసి, నువ్వు ఆరాధిస్తున్న ఆ దేవతా రూపాన్ని లోపల దర్శనం చేసుకుంటూ, ఓ పావుగంటో ఇరవై నిమిషాలో స్తోత్రం చేసుకో. మనం అన్నీ చేసి, చక్కగా అలంకరించి అన్నీ చేసుకుని ఆ తర్వాత కాసేపు ధ్యానం చేస్తాము కదా! అప్పుడు కళ్ళు మూసుకుని లోపల, ఆ బయట ఏ మూర్తి అయితే ఉన్నాడో, వాడికి పెట్టిన పువ్వులు, నగలూ అవీ లోపల దర్శనం చేసుకోవాలి. ఆభరణాం సమర్పయామి-దానికీ అక్షింతలే. వస్త్రం సమర్పయామి-అక్షింతలు. ప్రతిదానికీ, అలంకరణార్థం అక్షతాన్ సమర్పయామి. ఆభరణార్థం అక్షతాన్ సమర్పయామి. అన్నిటికీ అక్షింతలు వేసేస్తూ ఉంటే నీకేం వస్తుంది? నువ్వు చేసుకున్న భక్తి బట్టి వస్తుంది తప్ప లేకపోతే రాదు కదా! అసలు కొంతమంది వస్త్రం మంత్రమే చదవరు. స్నానం చేయించేస్తారు, బట్ట వెయ్యరు ఒంటిమీద. ఒరేయ్ కాస్త బట్ట వెయ్యరా అంటాడు. బట్ట మంత్రం చెపుతూ యజ్ఞోపవీతం వెయ్యడం, యజ్ఞోపవీతం మంత్రం చదువుతూ గంధం పూయడం, అసలు గంధం పూసే మంత్రం చదివే అప్పుడు ఇంకోటేదో చెయ్యడం ఇది తత్తర బిత్తరగా చేసేదంతా కూడా తమోగుణం. దానివలన ఏమవుతుందంటే, మనం ఎవరినైనా మనిషిని ఇంటికి పిలిచి, వాడిని కూర్చోబెట్టి, అడ్డదిడ్డంగా చేశామనుకోండి, వాడి మొహం మీద నీళ్ళు జల్లాం అనుకోండి ముఖే ఆచమనీయం సమర్పయామి అని, అట్లా నీళ్ళు చల్లితే ఎట్లా ఉంటుంది? తెలిస్తే పాదయోః పాద్యం సమర్పయామి, హస్తయోః అర్ఘ్యం సమర్పయామి, చేతులు కాళ్ళు కడుగుతాం. పిలిచి, ఇంటికి పిలిచిన వాడిని కూర్చో పెడతాం. కూర్చో పెట్టిన తర్వాత చేతులు కాళ్ళు కడుగుతాం. ముఖే ఆచమనీయం చెప్పడానికి మంచి నీళ్ళు ఇవ్వవా? వాడి గొంతు ఎండిపోయి ఉంటాడు. ఆ తరువాత మరి ఇంతంత ప్రసాదం, solid గా పెడితే, ఘనపదార్థం వాడు ఏం మింగుతాడు? ముందు కాస్త మంచినీళ్ళు ఇవ్వరా రాగానే. ఇంటికి వచ్చిన వాళ్ళకి మంచి నీళ్ళు ఇవ్వద్దా! ముఖే ఆచమనీయం సమర్పయామి-చెప్పరు. కొన్నేమో చెప్తారు. కొన్ని చెప్పరు. ఏదీ? ఇప్పుడు మనం చేసే పూజలో అట్లా ఉంటుంది. బాధ కలుగుతూ ఉంటుంది. అవన్నీ మనం పూరించుకోవాలి. ఎందుకంటే తమోగుణ పూజల వల్ల ఉపయోగం లేదు. శ్రద్ధ కావాలి పూజలో. నిజంగా నువ్వు ఆవాహయామి అన్నప్పుడు వాడు అక్కడకొచ్చినట్లు, ఇక్కడకొచ్చినట్లు (హృదయంలోకి) భావన చేయాలి. ఆసనం సమర్పయామి. ఎటువంటి ఆసనం

వేస్తున్నావు? సువర్ణ రత్న ఖచిత సింహాసనం అంటున్నాం కదా! ఏం పోయింది? ఏదో మానసికంగా వేసేదే కదా! రత్నాలతో పొదిగిన బంగారు సింహాసనం వేస్తున్నామండి అక్కడ. ఎందుకంటే ఈ హృదయంలో ఉన్న రంగు, దాని యొక్క రంగే అసలు బంగారం రంగు. ఆ.. వేసేయ్ ఒకటి శుభ్రంగా. సింహాసనం అది. సింహరాశికి సంబంధించినది. కూర్చోపెట్టు, కాళ్ళు కడుగు, చేతులు కడుగు, ఇవన్నీ మానసికంగా చేసుకోవచ్చు ఇంత ఆర్భాటంగా బయట చెయ్యలేకపోతే. అసలు నిజంగా మానసికంగా చేసుకునేదే ఎక్కువ నిలుస్తుందేమో అనిపిస్తుంది. తీరిగ్గా చేసుకో. చేతులు కడుగు, కాళ్ళు కడుగు, కాస్త మంచినీళ్ళు ఇవ్వు, ఆ ఇచ్చేదేదో మన ఇంట్లో లేకపోయినా మంచి వెండి గ్లాసుతో ఇవ్వు. ఎందుకంటే మానసికమే కదా! రెండు చేతులతో అందించు. మంచినీళ్ళు తాగాక గ్లాసు అక్కడ పెట్టు. ఆ తరువాత స్నానం చేయించు. స్నానం చేయించి బట్టలు ఇవ్వు. యజ్ఞోపవీతం ఇవ్వు, గంధం రాయి, బొట్టు పెట్టు, ఆభరణాలు పెట్టు, పువ్వులు అలంకరణ చెయ్యి, అప్పుడు స్తోత్రం చేసుకో. ఆ తరువాత ఫలహారమో, భోజనమో పెట్టు. దీపం-ఆయనకు దీపం పెట్టడం మనలో కళ పెరగడానికే. అన్నిటికీ ఒకటే కొట్టేస్తూ ఉంటే, ఏం చెయ్యకుండా మంత్రాలు చదివేస్తే అవదు. మంత్రంతోపాటు దానికి సంబంధించిన చేత అక్కడ జరగాలి. ఏ మంత్రం చదువుతున్నావో దానికి సంబంధించిన చేత అక్కడ ఉండాలి. అప్పుడే త్రికరణశుద్ధి ఏర్పడుతుంది. నీ నోటితో పలికే దానికి, చేత్తో చేసే దానికి తేడా ఉంటే ఎట్లా? ఇలా విధివిధానంగా, చెప్పిన విధానంగా చెయ్యకపోతే పూజ, దానివల్ల దుష్ఫలితాలు వస్తాయి. చెప్పాగా ఇంటికి మనిషిని పిలిచి, నీ ఇష్టం వచ్చినట్టు వాడితో నువ్వు ప్రవర్తిస్తే వాడు ఆనందంగా వెళతాడా? వెళ్ళడు కదా! అంతే దీనివల్ల నీ అశ్రద్ధే నీకు తీసుకువస్తుంది. అక్కడేం లేదు. నీ అశ్రద్ధ వలన, శ్రద్ధ లేక చేసే పూజలన్నీ తమోగుణ ప్రధానంగా ఉంటాయి. రజోగుణం ఎట్లా ఉంటుందయ్యా అంటే, ఊళ్ళో వాళ్ళందరికీ తెలియాలి మనం పూజ చేస్తే అని ఉంటుంది. ఎవడొచ్చాడు, ఎవడు రాలేదు చూసుకుంటూ పూజ చేస్తూ ఉంటాడు. ఎవరు రాలేదో వాళ్ళ మీద కోపం, ఎవరొచ్చారో వాళ్ళ మీద వాత్సల్యం, అసలు రాని వాడి మీద ఏ బాధా ఉండదు. వచ్చి మానేసిన వాడి మీద కోపం వస్తూ ఉంటుంది. ఎప్పుడూ రాలేదనుకోండి ఏం ఉండదు. కొన్నాళ్ళు వచ్చి మానేశాడనుకోండి, వాడి మీద వీడికి కోపంగా ఉంటుంది. తరువాత మనం పూజ చేసినట్టు వాడికి తెలియాలి. తరువాత పూజ బాగా జరిగిందని వాళ్ళంటూ ఉండాలి. ఆయన పూజలు బాగా చేస్తాడని ఊళ్ళో తెలియాలి. ఇటువంటి బాధలన్నీ, కీర్తి, ప్రతిష్ట, ప్రచారం ఇవన్నీ రజోగుణ దోషంతో కూడిన పూజలు. సత్త్వగుణంలో పూజ ఎట్లా ఉంటుందంటే, కూర్చుని పూజ చెయ్యడం మొదలుపెడితే వాడు, ఆ దేవత తప్ప ఇంకేమీ ఉండదు. దేవుడిని పూజ చేసుకునే వాళ్ళకి మిగతా ఆర్భాటం అంతా ఎందుకు? అందుకే ఒకసారి మాష్టారు గారు, మంద్రగీతలో శ్రద్ధాత్రయ విభాగయోగములో శ్రద్ధలో పోకడలు అని ఇచ్చారు మాష్టారు గారు చక్కగా. స్నానం చేసేప్పుడు ఎట్లా ఉండాలి శ్రద్ధ, పూజ చేసేప్పుడు ఎట్లా ఉండాలి శ్రద్ధ, దానం సత్త్వగుణం వాడు ఎట్లా చేస్తాడు, రజోగుణం వాడు ఎట్లా చేస్తాడు, తమోగుణం వాడు ఎట్లా చేస్తాడుఇలా అన్నీ ఇచ్చారు. ఒక్కసారి చూసుకుంటే మనం ఎందులో ఉన్నామో మనకి తెలుస్తుంది.

అలాగే గుణత్రయ విభాగయోగం, భగవద్గీతలో చూసుకుంటే మనలో తమస్సు ఎక్కువా, రజస్సు ఎక్కువా, సత్త్వం ఎక్కువా అని చూస్తే అసలు సత్త్వం తప్ప మిగతావన్నీ మనలో తప్పకుండా ఉన్నాయనిపిస్తుంది. చూసుకుని, తమస్సులోవి రజస్సులోవి పోగొట్టుకోవాలి అని భావన చేయకుండా, సత్త్వం లో ఉన్నవి ఏమన్నా తీసుకుని కొంచెం అలవాటు చేసుకోవడం మొదలు పెడుతుంటే అది పెరగడం చేత రజస్సు, తమస్సు కాస్త ఉపశమనం చెందుతాయి. ఎందుకు ఇదంతా చెబుతున్నానంటే పూజ ద్వారా పరమేశ్వరుని యొక్క అనుగ్రహాన్ని పరిపూర్ణంగా పొందడం, ఆయన దర్శనము, ఆయన స్పర్శనము, ఆయనతో సంభాషణము, ఆయనతో తాదాప్యము చెందుట అంటే తను అది అయిపోవటం, ఆయనలో ఉండే ఆ దివ్యకళని అలా చూస్తూ చూస్తూ, చివరికి భ్రమర కీటక న్యాయంగా మనం అది అయిపోతాము. ధ్యానం చేయకుండానే ధ్యానస్థితి వచ్చేస్తుంది. అందుకని, ఏకాదశ స్కందంలో ఉద్ధవుడు శ్రీకృష్ణుడ్ని ఓ ప్రశ్న వేస్తాడు, 'ధ్యానం బెక్రియ నిలచును?' అని. 'చాల్లేవయ్యా' అంటాడు కృష్ణుడు. ధ్యానమా? అయ్యే పని కాదు. కలియుగంలో అస్సలు కాదు. షోడశోపచార పూజ చేసుకో. పదహారు కళలు భగవంతునికి ఆపాదించుకుంటూ చేసుకో. నీలో ఆ పదహారు కళలు పెరుగుతాయి. ఎందుకంటే వాడికి ఏం అక్కర్లా. వాడికి చాలా ఉన్నాయి. నువ్వేం వాడికి పెంచక్కర్లా. వాడికి పెంచే కళల్లా మళ్ళీ నీకు తిరిగి ఇవ్వటానికే. నువ్వు తెచ్చుకోవడానికి. అద్దంలో మనం పూజ చేశామనుకోండి, మనకి చేసుకున్నట్టే ఉంటుంది కదా! అంతే భగవంతుడితో కూడా. అక్కడ మనం అప్పచెప్పినదల్లా మళ్ళీ మనకి తిరిగి వస్తుంది. అందుకని ఎంత చేసుకుంటే అంత పెరుగుతుంది. అందుకని ఈ 'శుభాంగః' అనే నామాన్ని మీ ఓపిక ఎంత అందంగా చేసుకుంటారో. కళ్ళు మూసుకుని లోపల అందమైన రూపాన్ని పరిపూర్ణంగా, అంగాంగములు చూసుకోగలగాలండీ! అట్లా పూజ చేసుకున్న తర్వాత మీరు కదిలి వెళుతున్నారనుకోండి, వాడు కూడా మీతో పాటు వస్తున్నట్టు భావన ఉండాలి. పూజ చేసేశా అని పూజ గదిలో వదిలేసి వెళ్ళిపోవడం కాదు. వాడికి ఊరేగింపుగా మీరు తిరగాలండీ! దేవాలయంలో దేవుడికి ఊరేగింపు చేస్తారు కదా! ఏమిటి ఊరేగింపు? నీలో వాడు ఉన్నాడు కదా! వాడిని పిలిచావు, అన్నీ చేశావు, వాడు నీలో నిలిచి ఉన్నాడు. నువ్వు బయట తిరుగుతూ ఉంటే వాడిని తిప్పడమే. వాడు నీకు సహాయంగా ఉంటాడు అప్పుడు. ఇట్లా దేవత సహాయంగా జీవించిన మహాత్ములు ఎంతోమంది ఉన్నారు. ఇంకేం కావాలండి? ఎప్పుడూ మన వెంట ఒకడుంటూ ఉంటే, నువ్వు ఒంటరి వాడివి కాదు కదా అప్పుడు. ఒంటరితనమేముంది? ఒంటరివాడని అనుకుంటే అయ్యావు తప్ప వాడున్నాడుగా. ఇది నువ్వు పూజ చేసి, నువ్వు పిలిస్తే, నీలోపలికొచ్చి, నీలోఉండి, నిన్ను నడిపించేవాడున్నాడు కదా! వాడితో మాట్లాడుకోవచ్చు తీరికున్నప్పుడు. వాడితో పోట్లాడుకోవచ్చు. ఊళ్ళో వాళ్ళతో పోట్టాడితే మనకి ఫలహేతువులు ఉంటాయి కదా! వాడితో లోపల పోట్టాడుకుంటే ఏం పరవాలా. ఏమయ్యా ఇట్లా చేస్తున్నావు నా పని నువ్వు, అని కావాలంటే తిట్టచ్చు, కొట్టచ్చు, కోప్పడచ్చు ఏమైనా చెయ్యచ్చు వాడితో పాపం. ఏదైనా ధ్యానం వాడి గురించే కాబట్టి పర్వాలేదుట. అట్లాగే కదా శిశుపాలుడు, కంసుడు వీళ్ళందరూ త్వరగా చేరిపోయారని చెప్తారు.

ఏదైనా భావం భగవంతుడి మీద ఏర్పడుతుంది. అలా నువ్వు పెంచుకుంటూ లోపల ముందు మొదలు పెడితే మొట్టమొదటి నీకు లభించేది 'శాంతిదః' శాంతి! అది కలుగుతుంది. వాడి కారణంగా నీ లోపల శాంతి. శాంతి ఎలా కలుగుతుందయ్యా అంటే స్రష్టః. ఇందాక చెప్పానే బాగా ఇంద్రియాల్లోకి, శరీరంలోకి కూరుకుపోయిన వాళ్ళం కాస్త బయటికొస్తాం. మనం ఎంత కూరుకుపోయాం అంటే, లేచినప్పుడు ఆకాశతత్త్వంగా లేస్తాం నిజానికి. అక్కడ్నుండి 'నేను ఉన్నాను' అనుకోంగానే ఒక గొట్టం లాగా తయారైపోతాము. మొత్తం అపరిమితమైన తత్త్వం ఒక tube light లాగా తయారైపోతుందండీ! అదే అహంకారతత్త్వం! ఒక గొట్టంలోకి వచ్చేస్తుంది. ఇహ అక్కడ నుండి నీ బుద్ధికి తోచిన ఆలోచనలు చేయడంగానే ఇంకొంచెం కూరుకుంటావు. బుద్ధి లోకాల్లోంచి స్వభావ లోకాల్లోకి వస్తావు. స్వభావ లోకాల్లోంచి ఇంద్రియాల్లోకి వస్తావు. ఇంద్రియాల్లోంచి శరీరంలోకి వస్తావు. అక్కడ నుండి గోతిలో పడిపోతావు. ఈ గొయ్యి అంతా మనకి మనస్సు, ఇంద్రియములు, శరీరము. ఈ మూడూ గొయ్యే. బుద్ధి అనేది ఆ గొయ్యికి అంచు. అంచు నుండి ఇటు గొయ్యి కనిపిస్తుంది, అటు ఆకాశం కనిపిస్తుంది. భగవంతుడు యొక్క భావన నీలో పెంచుకున్న కొద్దీ నువ్వు బుద్ధి లోకంలో ఉండడానికి వీలు పడుతుంది. అంటే ఏమైంది నీకు? ఒక వెసులుబాటు కలిగింది. ఒక విడుదల కలిగింది. ఒక మోక్షం కలిగింది. దేని నుండి? శరీరము, ఇంద్రియములు, మనసు అనే వాటి యొక్క పట్టు నుండి. అందుకని భగవంతుడు ఈ విధమైన భావనలో మనకి స్రష్టగా గోచరిస్తాడు. గజేంద్రుడిని ఏ విధంగా మకరం నుంచి రక్షించాడో, మనల్ని కూడా ఆ విధంగా రక్షిస్తాడు. ఎప్పుడయ్యా అంటే మకరంతో పోట్లాడడంగా కాకుండా భగవంతుని ధ్యానంలో మనం ఎక్కువ నిమగ్నమై ఉంటే! మనకొచ్చే పెద్ద సమస్య ఏమిటయ్యా అంటే ఏదన్నా సమస్య ఉన్నప్పుడు సమస్య గురించి ధ్యానం ఉంటుంది తప్ప, భగవంతుని ధ్యానం ఉండదు. భగవంతుని ధ్యానం కూడా సమస్య వలన చేస్తూ ఉంటాం. కాబట్టి చేస్తున్నంతసేపూ సమస్య గుర్తుంటుంది ఎక్కువ. కదా? ఒంట్లో బాలేదు నాకు అని అనుకున్నామనుకోండి, ఒళ్ళు చూసుకోవడం కన్నా దేవుడిని చూసుకో అని ఎవరన్నా చెప్పారనుకోండి, విష్ణు సహస్రనామం చదువుతున్నాం. విష్ణు సహస్రనామం చదువుతున్నంతసేపు ధ్యానం ఒంటి మీద ఉంటుందా? విష్ణువు మీద ఉంటుందా? ఇంట్లో వాళ్ళకి బాగాలేదు, ధ్యానం దేవుడు మీద ఉంటుందా? ఇంట్లో వాళ్ళ బాగా లేకపోవడం మీద ఉంటుందా? ఆర్థిక పరిస్థితులు బాలేవు, ఎక్కడ ఉంటుంది ధ్యానం? ఏదో మనం చేసిన పనిలో పొరపాటు వచ్చింది, మనకి దానివల్ల ఏదో ఆపద రాబోతోంది. ఎక్కడ ఉంటుంది ధ్యానం? వాటి మీదే ఉంటుంది కదా! వాటి మీదే ఉంటే, మనం ఇది చేస్తున్నా ఆ మొసలితో ఏనుగు పోట్లాడినట్టేనండీ! అసలుది మర్చిపోయాను. ఇంక ఈ మొసలితో మనమేం పోట్లాడేదేం లేదు. అని వదిలేసింది. ఏమైతే అది అవుతుంది. పోట్లాడి చూశాం కదా! అవలేదు కదా! రోజు రోజుకి ఇంకా నాసి అయిపోతున్నాము తప్ప బాగుపడడం లేదు కదా! కాబట్టి ఇది కాదు. ఇది వదిలేసెయ్ దీన్ని. అటు తిరుగుతా. I will Orient. Orient అవడం అంటే అదీ అర్థం. అంటే తూర్పు తిరగడం. Orientation అంటే to turn towards the East, where there is light. తూర్పున కదా

వెలుగుంటుంది.అందుకనే మనకి ఏ పరిష్కారం దొరక్కపోతే, ఎన్ని రకాలుగా సలహాలిచ్చినా వాడికి ఏమి అవట్లేదనుకోండి, వాడు మాటిమాటికీ మీరు చెప్పింది నేను చేశానండి అవలేదని చెప్తుంటే, వీడికీ నిస్పృహ వచ్చేస్తుంది. ఏం చేయమంటారు సార్ అని వాడు అడిగితే, ఇంకేం లేదయ్యా తూర్పు తిరిగి దణ్ణం పెట్టు, అని చెప్తాం. అంతే కదా! అంటే అర్థం ఏమిటంటే, సమస్యని వదిలేసెయ్, దేముడి వైపు మొగ్గు అని అర్థం. తత్త్వం వైపు మొగ్గితే దానికి సంబంధించిన వాడివే నువ్వు, దానికి సంబంధించినదే ఈ శరీరము, దానికి సంబంధించిందే శరీర సంబంధమైన సమస్తమైన జీవన సమస్యలు. కాబట్టి అటు తిరిగితే ఇవన్నీ కరిగిపోతాయి. అందుకని ఎక్కువ దేముడిలోకి చొచ్చుకుపోతూ ఉండాలి. సమస్య ఎక్కువయ్యేకొలది దేముడిలోకి ఎక్కువ పోవాలి. సమస్యలోకి ఎక్కువ పోకూడదు. ఎక్కువ పోకూడదంటే మానసికంగా పోకూడదని అర్థం. భౌతికంగా దానికి సంబంధించినది అది చెయ్యాలి. పారిపోకూడదు. భౌతికంగా దానికి చేయాల్సినవి చేస్తూ, ఏమీ చెయ్యాల్సిన అవసరం లేని సమయంలో సమస్య గురించి ఆలోచిస్తావే, ఆ ఆలోచన వలన నిస్సత్తువ వస్తుంది. చెయ్యవలసింది చేశావు, మళ్ళీ ఏదో చెయ్యాల్సింది వచ్చేవరకు ఈ interval లో సమస్యలో ఉండకుండా దేముడిలో ఉండు. అది గజేంద్రమోక్షంలో మనకి కనిపించే ఒక రహస్యం. ఇటు (దేవుడి వైపు) తిరిగాడు ఆయన. ఇటు తిరిగేసరికి అటు సుళువయింది. ఈయన ప్రార్థన చేస్తున్నంతసేపు అదేం లాగేసి ముంచెయ్యలేదుగా! ముందు పెనుగులాడుతున్నప్పుడల్లా అది లోపలికి లాగుతోంది, ఈయన బయటికి లాగడానికి ప్రయత్నం చేస్తున్నాడు. కాసేపు ఆపాడు, prayer చేశాడు, అది కూడా ఆగింది, అది చూడండి prayer చేస్తున్నప్పుడు బానే ఉంది, ఇప్పుడు లోపలికి లాగేయచ్చు అనుకోలేదు. గజేంద్రుడు కనీసం పావుగంట అన్నా prayer చేశాడండీ! ఎందుకంటే ఆ పద్యాలన్నీ భాగవతం తెలుగులో ఉన్నవి మనం చదువుకోవాలంటే పదిహేను నిమిషాలు పడుతుంది. పదిహేను నిమిషాలే చేశాడనుకోడానికి లేదు కదా! కానీ నిజానికి చాలా ఎక్కువ రోజులు చేశాడు. పదిహేను నిమిషాలే కాదు. మరి ఇన్నాళ్ళు ఈ మొసలి ఏం చేసింది? అది కూడా దానికి సంబంధించిందే కదా! అది కూడా ఆ ప్రార్థన ఆనందిస్తోందన్నమాట. ఆ తరువాత వాడు వచ్చాడు. శుభ్రంగా, దాన్నీ సంస్కరించాడు, దీన్నీ సంస్కరించాడు అయిపోయింది. అది జరగాలంటే మనకి ఈ దైవాన్ని లోపల పెంచుకోవడం జరగాలి. పెంచుకుంటే శాంతివస్తుంది. పెంచుకుంటే విడుదలొస్తుంది. పెంచుకుంటే కుముదః.

## 613 కుముదః

కుముదః అంటే ఆనందాన్ని నిండియుండడం అన్నమాట. గురుకులం. కౌముది అంటే బాగా కమలాలతో నిండివున్నది అని ఒక అర్థం. బాగా చంద్రుని కాంతులు వెదజల్లబడిన ప్రదేశం అని అర్థం. చంద్రుని కాంతి మనస్సుని అప్రయత్నంగా ఆహ్లాద పరుస్తుంది. సూర్యుని ఉదయమే అంటే సూర్యోదయమే అటువంటి ఆహ్లాదాన్ని కలిగిస్తుంది తప్ప, మధ్యాహ్నం ఎండ అటువంటి ఆహ్లాదాన్ని ఇవ్వదు. చంద్రుడు నడినెత్తి మీద ఉన్నప్పుడు మొత్తం భూమంతా చూశామనుకోండి, ఎంత ఆహ్లాదం కలిగిస్తుందీ? అంత ఆనందంగా ఉంటుంది కదా! మంచి వెన్నెల రోజులలో పౌర్ణమి నాడు ఒక కొండ శిఖరం మీద ఉండి, అదృష్టంకొద్దీ ఏ మేఘాలు లేకుండా ఉంటే ఆకాశంలో, ఆ చుట్టూ ఉండే ప్రదేశం అంతా చూస్తే ఎంత భయంకరమైన మనస్సు అయినా ఆనందపడుతుంది. మన లెక్కలో దరిద్రపుగొట్టు మనస్సు అంటామే అటువంటి వాడికి కూడా ఆనందం కలుగుతుందండీ! అదీ దాని యొక్క గొప్పతనం. ఈ విధంగా విశృంఖలాల నుంచి బయటపడ్డ వాడికి, తన శరీరంలో అటువంటి ఆహ్లాదం జరుగుతుందిట. అదీ ఇక్కడ భావం. మన శరీరమే మన్ని ముప్ప తిప్పలు పెట్టి ముప్పె చెరువులు నీళ్ళుతాగిస్తుంది కదా! ఎన్ని రకాలుగా బాధపడుతూ ఉంటాం మన శరీరంలో. కాలునొప్పి, చెయ్యినొప్పి, తలకాయనొప్పి, కడుపునొప్పి, కళ్ళు మంటలు, ఒళ్ళు మంటలు, blood-pressure, sugar అన్నీ బాధలే కదా! ప్రత్యేకించి కలియుగంలో శరీరం మరీ భయంకరంగా బాధ పెడుతుంది కదా! అటువంటి శరీరంట, అద్భుతమైన ఆనందాన్ని ఇచ్చేటటువంటి దానిగా తయారవుతుందిటండీ! ఏది? ఈ నాలుగో మెట్టు ఎక్కేసరికి. మొదట ధ్యానం శుభాంగుడిని. దానివల్ల శాంతి, దాంట్లోంచి విడుదల, అక్కడ నుండి అబ్బో ఏమి హాయో! ఎక్కడో మనం ప్రశాంతమైన ప్రదేశంలో కూర్చుంటే చాలా హాయిగా ఉంది, ఇక్కడుంటే బావుండనిపిస్తుంది, ఎక్కువసేపు ఉండలేము, మూడు రోజులు అయిన తర్వాత పోదామనిపిస్తుంది. తెలుసా? ఎంత ప్రశాంతమైన ప్రదేశమయినా సరే వెళ్ళంగానే ఎందుకూ ఎప్పుడూ ఈ ఊళ్ళల్లో ఉండే వాళ్ళు పల్లెటూరెళ్ళి, 'అబ్బ ఎంత హాయిగా ఉందండీ' అంటాం. మూడు రోజులు ఉండండి తెలుస్తుంది, నాలుగో రోజు నుంచి మన మనస్సు అక్కడ నెమ్మదిగా settle అయి 'నేను కూడా వచ్చా' అంటుంది. అందుకనే మహాత్ములందరూ కూడా మూడు రాత్రుల కన్నా ఎక్కడా నిద్రపోరుట. త్రిరాత్రం! మనక్కూడా పుణ్యక్షేత్రానికి వెళితే మూడు రాత్రుల కన్నా ఉండక, మూడు రాత్రులు చాలంటారు. ఎందుకంటే నాలుగో రాత్రికి మళ్ళీ మనది వచ్చేస్తుంది అక్కడికి. మన ఇంట్లో ఉండేవన్నీ అక్కడ ఉంటాయి. అట్లా మనకి ఇబ్బంది పెడుతుంది కదా! ఎంత అద్భుతమైన, రమణీయమైన ప్రదేశాలలో మనం ఉన్నా ఆ first impressions మనకి అందాన్నిచ్చేవి. ఇహ తరువాత నుంచి మామూలే. వెంటనే మన ఊరు, మన ఇల్లు, మన కందిపచ్చడి అన్నీ గుర్తొస్తాయి. కానీ ఈ విధంగా మనం ఉంటే మన శరీరంలో, మనం ఎక్కడ ఉన్నా అబ్బో ఒకటే ఆనందం. చంద్రుడు ఇస్తున్నాడుట ఈ ఆనందం. కౌముది అనే పదానికి చంద్రుడు

కాంతి అని కూడా అర్థం. కౌముది చంద్రుని నామం కూడా ఉంది. చంద్రుడు భూమిని ఎంత ఆనందపరుస్తున్నాడండి పౌర్ణమి నాడు! అలా మనస్సు కూడా. ఈ నామాల ద్వారా సాధనలో మనకి మనసంతా పూర్తిగా నిండిపోయింది. ఇంద్రియాలు కూడా పూర్తిగా నిండిపోయినాయి. దేనితో? భగవంతుని వెలుగుతో! ఆ వెలుగుతో నిండి ఉండడం చేత అంతా ఆనందంగా ఉంటుంది. వెన్నెల కురుస్తూ ఉంటుంది లోపల. ఆ వెన్నెల కురుస్తుంటే చల్లగా ఉంటుంది. అందుకని యోగం చేసుకున్న వాళ్ళకి ఒక స్థితిలో 'శీతలి' అనే ఒక సిద్ధి వస్తుంది. వాళ్ళ ఒళ్ళు చల్లగా ఉంటుందిట. వాళ్ళకి లోపల చల్లగా ఉంటుందిట. వాళ్ళని మనం ముట్టుకున్నామనుకోండి, 'అబ్బ చాలా చల్లగా ఉన్నారండి మీరు' అంటాం. అంటే చచ్చిపోయాడని కాదు. చల్లదనం వాళ్ళలో ఎందుకుందంటే, వాళ్ళలో ఈ నిజమైన ప్రశాంతత వెన్నెలగా ప్రసరిస్తూ ఉండడము చేత. కారణం తనలో 'వాడిని' పెట్టుకున్నాడు కాబట్టి. అది అలా ఆనందాన్నిస్తూ ఉంటుందిట.

## 614 కువలేశయః

మొత్తం శరీరం అణువణువునా కూడా అదే నిండి ఉంటుంది. కువలయము అంటే మొత్తం సృష్టివలయం అని చెప్పకోవచ్చు. అందులో చిన్నది మన భూమి వరకు. అందులో చిన్నది మన శరీరం వరకు. అంటే ఎక్కడ మొదలుపెట్టాం మనం ధ్యానంలో? ఊరికే చిన్న దీపం పెట్టడం మొదలుపెట్టాం లోపల. అది అలా పెంచి పెంచి పెంచి తల వెంట్రుక దగ్గర నుంచి కాలిగోరు వరకు వాడు నిండిపోతాడండి. మీలో వాడు అలా పెరిగిపోతాడు. మీరు వాడిలో ఉంటారు. ముందు మొత్తమంతా మనమే ఉన్నాము కదా మన శరీరంలో. వాడికి సింహాసనం వేసి కూర్చోపెట్టంగానే, వాడిని పెంచుకుంటూ పోవడం చేత వాడు పెరిగి, మనం తగ్గుతాం. నిజమైన భక్తుడు వాడు బాగా తగ్గుతూ ఉంటాడు. భగవంతుడిని పెరగనిస్తాడు తనలో. ఎంత తగ్గిపోతాడంటే తను ఉన్నట్టు కూడా తనకది గుర్తుండదు. వాడే ఉన్నాడు. వాడి కోసం వీడుంటాడు. వీడి కోసం వీడుండటం కూడా ఉండదు. వీడి గురించి వీడు మాట్లాడుకోవటం కూడా ఉండదు. ఎందుకంటే అదే అంతా నిండి ఉన్నది కాబట్టి వీడు చిన్నవాడైపోతాడు. వాడు పెద్దవాడైపోతాడు. మాట ఏమన్నా వీడి లోంచి వచ్చిందంటే వాడి గురించే వస్తూ వుంటుంది. అది చెప్పడానికే మీకు హనుమంతుడి గురించి చెప్తూ వచ్చాను ఇదివరకు. God infused personality అంటారు. 'తాదాత్మ్యం చెందిన భక్తుడు' అంటారు. 'తాను లేక తత్త్వము నిండిన స్థితి' అంటారు. అట్లా నిండిపోతాడు. నిండిపోతే ఈ విధంగా ఏమైంది మనకి? శుభాంగః, శాంతిదః, స్రష్టః, కుముదః-వెన్నెల, వెన్నెల కురవడంలో కువలేశయః మొత్తం అంతా. Upto the physical cell. దేహధాతువుల లోపల దిగిపోతాడు. ఇంకేముంది? వాడొక అయస్కాంతం అయిపోతాడు.

## 615, 616 గోహితః, గోపతిః

అప్పుడు ఇంద్రియములను అధిష్టించి ఉంటాడు. మామూలుగా అహంకారాన్ని అధిష్టించి ఉన్న ప్రజ్ఞ అహంకారంలోకి చొచ్చుకొచ్చి, అక్కడ నుండి బుద్ధి లోకాల్లోకి చొచ్చుకొచ్చి, అక్కడ నుండి ఆనందమయ లోకాల్లోకి చొచ్చుకొచ్చి, అక్కడి నుండి మనోమయ లోకాల్లోకి చొచ్చుకొచ్చి, అంతా అలా ఆనందం నింపుకుంటూ, అక్కడ నుండి ఇంద్రియాల్లోకి వచ్చి, అక్కడ నుండి శరీరంలోకొచ్చి, మొత్తం ఈ ఏడు లోకాలు వెలుగుతో నింపేస్తే మీకు దివ్యమైనటువంటి శరీరం ఏర్పడిపోతుంది. అది కారణంగా గో అంటే మనం ఇక్కడ చెప్పుకోవల్సింది ఇంద్రియములు. గో అనే నామానికి రకరకాల అర్థాలున్నాయి. గో అంటే సూర్యుడి కిరణం అని ఉంది. గో అంటే వేదములు అని అర్థం ఉంది. గో అంటే గోవులు అని అర్థం ఉంది. గో అంటే ఇంద్రియములు అని అర్థం కూడా ఉంది. ఇక ఇంద్రియములకు పతియై కూర్చుంటాడు కాబట్టి ఇంక కాముడు ఏం చేయడు. అదీ 'ఈశ్వరత్వం' అంటే. జితేంద్రియుడు అంటాం కదా! ఇంద్రియములు జయించడం అంటే ఇంద్రియాల్లో కూడా దేవుడిని దింపుకోవడం. అలా దింపుకున్నప్పుడు 'గోపతి' అవుతాడు. భగవంతుడు 'గోపతి'. ఎందుకంటే ఆయన ముట్టుకున్నదల్లా మారిపోయింది. ఆయన తిన్నదల్లా మారిపోయింది. ఆయన చంపినా అదే అయిపోయింది. ఆయన చూపులతో మార్చాడు కదా! ఆయన పలుకులతో మార్చాడు. సంహరించి మార్చాడు. తిని మార్చాడు. అట్లా రకరకాలుగా ఇంద్రియముల ద్వారా కూడా ఆ తత్త్వాన్ని ప్రసరింప చేస్తాడుట. అదీ భగవంతుని యొక్క తత్త్వం! అది ఎవరి యందు భాసిస్తే వాళ్ళందరూ తత్తుల్యులే! భగవంతుని యొక్క వాహికలే! శ్రీకృష్ణుడు అట్లా ప్రసరింప చేశాడు కదా! ఎంతో క్రౌర్యముతో, శత్రుత్వముతో కూడి ఉన్న వాళ్ళని కూడా తన చూపుల చేత వాళ్ళని శుభ్రంగా స్వస్థత పరచి, వాళ్ళ క్రౌర్యం, వాళ్ళ శత్రుత్వం అన్నీ కాసేపు అక్కడ ఏమైపోయినాయో తెలియదు ఈయన ఉన్నంత సేపు. మళ్ళీ ఈయన వెళ్ళిన తర్వాత వస్తాయి. అట్లా చేశాడు. రాముడు అట్లా చేశాడు. భగవద్భక్తులు చాలామంది అట్లా చేశారు. మీరు చూసి ఉంటారు 'Benhur' అనే సినిమా. చాలా అద్భుతమైన సన్నివేశం. బాగా చిత్రీకరించారు. తీసినవాడు చాలా భక్తుడు కాబట్టి బాగా తీశాడు. ఆ Benhur అనే ఆయనకి ఏవో కష్టాలు వస్తాయి. భగవద్భక్తుడు. చివరికి కొట్టి, తన్ని, చంపించేస్తూ దాహం వేస్తే మంచినీళ్ళు కూడా ఇవ్వరు. దాహం దాహం నాలుక పిడచకట్టుకు పోతుందన్నా కూడా ఎవరు ఏమీ, నీళ్ళు ఇస్తున్నట్టుగా వాడి ముందు జగ్గులతో తీసుకొచ్చి అట్లా పారబోస్తూ ఉంటారు. నీళ్ళు నాలుక దాకా వచ్చి అందకపోతే ఇంకా పెరిగిపోతూ ఉంటుంది దాహం. అంత భయంకరంగా చిత్రహింస పెడుతూ ఉంటే, అంత భయంకరమైన సన్నివేశంలోకి బలిష్ఠులు, సాయుధులైన Roman సైనికులు ఉండే కూటమిలోకి ఏసుక్రీస్తు అట్లా నడిచి వస్తాడు. చూడగానే అందరూ నిశ్చేష్టులై పోతారు. అలా చూస్తూ ఉంటారు ఆయన్ని. ఆయన వస్తాడు. అక్కడ నీళ్ళు ఉంటాయి. ఓ పక్కన ఒక జగ్గు ఉంటుంది. ఆ జగ్గు

లోంచి ఆ నీళ్ళు తీసుకుంటాడు. అతని దాహం తీరేటంతవరకు అతడికి నీళ్ళని పడతాడు. అందరి పక్క అట్లా చూస్తాడోకసారి. నవ్వుతాడు. వెళ్ళిపోతాడు. ఆ తరువాత వీళ్ళకి మెలకువ వస్తుంది. ఏమిటది? అదే విషయం మీకు రుక్మిణీ కళ్యాణంలో శ్రీకృష్ణుడు ఎట్లా చేశాడో చెప్పారు కదా! చంపేద్దాం, పొడిచేద్దాం, కొట్టేద్దాం అని రకరకాల ఆయుధాలు కూడా సేకరించుకు వచ్చిన వందలాదిమంది మనుషుల్ని ఆయన 'ఏమిరా' అన్నట్టుగా చూస్తాడు ఓ చూపు. అంతే అన్నీ కొయ్య బొమ్మలై పోతాయి. అప్పచెప్పబడిన ప్రాణములు ఆయనలోకి వచ్చేస్తాయన్నమాట. అట్లా జుర్రేసినట్టు వెళ్ళిపోతాయండి జీవులు. అన్నీ గోవులే కదా అవి. ఈయన గోపతి. పని పూర్తి చేసుకుని రథంలో ఆవిడని ఎక్కించుకుని వెళ్ళిపోతాడు. వెళ్ళిపోయిన తర్వాత అప్పుడు వాళ్ళకి తెలివొస్తుంది. అంటే పిచ్చి తెలివి. అసలు తెలివిలో ఉన్నారు ఇంతసేపు. మళ్ళీ పిచ్చి తెలివొచ్చి అదేమిట్రా? అదేమిటి వాడు వెళ్ళిపోయాడు కదా అంటారు. రుక్మిణీదేవిని తీసుకుని వెళ్ళిపోయిన తర్వాత వీళ్ళకి తెలివొస్తుంది. అలాగే బుద్ధుని జీవితంలో కనిపిస్తుంది. మదమెక్కి, పిచ్చెక్కిన ఏనుగు పిచ్చి పిచ్చిగా రోడ్లలో పరిగెత్తుకుంటూ అందరిని చంపుకుంటూ, తొక్కుకుంటూ వస్తుంటే, ఎదురుగుండా ప్రశాంతంగా తను నడిచి వస్తూ వుంటే ఆ ఏనుగు కన్నులలోకి ఈయన చూసేసరికి, అది అట్లా ఆగిపోయేసరికి, దాని తొండం ముందు ఇట్లా రాస్తాడు. రాస్తే అంత ఏనుగు ఎలుకైపోతుంది. కూర్చుండిపోతుంది. ఎంత ప్రశాంతంగా ఉంటుందో. బాగా పదుల సంవత్సరాల నుంచి BP ఉండేవాళ్ళకి ఒక్కసారి normal వచ్చిందనుకోండి, ఎంత బాగుంటుంది తెలుసా? Normal గా ఉండే వాడికి normal అంటే ఏమిటో తెలియదు. BP వాడికి normal వస్తే అబ్బ ఎంత హాయిగా ఉంటుందో! BP వస్తే గానీ normal ఏమిటో ఎప్పుడూ normal ఉండే వాడికి తెలియదు. చాలా హాయిగా ఉంటుంది. హాయిగా నిద్ర పట్టిందంటాడు. విశ్రాంతుడవుతాడన్నమాట. ఏనుగట్లా విశ్రాంతి చెంది, అట్లా తోక ఆడిస్తూ, బుద్ధుడిని అట్లా తొండంతో రాయడం మొదలుపెట్టిందిటండీ. మామూలుగా కుక్క నాకుతుంది చూడండి పెంపుడు కుక్క. ఏమిటది? అంటే ఇవన్నీ సాధ్యమే. కాకపోతే మనకి కాస్త దూరంలో ఉన్నాయి. కారణం ఏమిటంటే అంత మనం ఏకోన్ముఖులమై లేము వచ్చిన గొడవ. ఎంతసేపు ఆయన్ని పీక్కుని మన పనులు చేసుకుందామనుకోవడమే తప్ప, ఆయనలోకి మనం జొరపడదామని లేదు కదా. ఎంతసేపు ఆయన్ని కొలుచుకుని మన పనులకు వాడుకుందామని కదా! మనకెన్ని పనులో! ఆయనకేమో పనిలేదు. అందుకని మనకి ఈ పనులన్నిటికీ ఆయనని వాడుకోవడంలో సరిపోతోంది. ఆయన్ని తెచ్చి ఇటు వాడుకుందాం అనుకుంటే వీలు పడదండీ! మీరెళ్ళి అటు కలిసిపోతే ఆయన పని చేసి పెట్టేస్తాడు. ఈ రహస్యం తెలియాలి. నీకు ఆయన మీద నిజంగా విశ్వాసముంటే, నిజంగా ఆయనలోకి వెళ్ళు. నీ పని సుళువుగా అయిపోతుంది. 'భగవంతుడే ఉపాయము' అని ఎరిగిన వాడు నిజమైన భక్తుడండీ! ఎటువంటి సమస్యకైనా భగవంతుడే ఉపాయం. మన ఉపాయాలు పిచ్చిపిచ్చిగా ఉంటాయి. భగవంతుని యందు మనం ఎక్కువ చొచ్చుకొని ఉండడం వల్ల మనలో భాసించేది భగవద్భావనగా, పరిష్కారానికి సంబంధించింది భాసిస్తూ ఉంటుంది. ఈ లోపల పాడు చేసుకోవడం అటువంటివి

చెయ్యకుండా ఉంటాము. సమస్య వచ్చినప్పుడు కంగారుగా మనం ఇంకొంచెం పాడు చేసుకుంటూ ఉంటాం కదా! ఎవడో BP వచ్చిన వాడికి జంధ్యం ఇచ్చామనుకోండి శ్రావణ పౌర్ణమి నాడు విప్పుకోమని, మొట్టమొదట విప్పేప్పుడు ఏదో ముడిపడిందనుకోండి, తీస్తూ ఉంటే ఇంకో ముడిపడిందనుకోండి వాడికి BP వస్తుంది. ఆ BP వచ్చి ఇంకా ఇదేంటి? ఇంకా ముడి వచ్చింది, చివరికి విసుగొచ్చేసి దాన్నట్లా చింపేసి అవతల పారేద్దామనిపిస్తుంది. అంతేకాదు అది ఇచ్చిన బ్రాహ్మణుడ్ని, శ్రావణ పౌర్ణమికి జంధ్యాలు పెట్టిన వాళ్ళని నానా తిట్లూ తిట్టకుండా వాడికి ప్రశాంతత రాదు. అంతా అయిపోయిన తర్వాత BP పెరిగి ఉస్సూరుమని పడిపోతాడు. అందుకే చిక్కు వచ్చినప్పుడు నువ్వు నీ చిక్కుబుద్ధితో, చిక్కు మనస్సుతో, చీకు మనసుతో దాన్ని ఏదో పరిష్కరిద్దామని ప్రయత్నం చేస్తే దెబ్బతింటుంది. దాన్ని అక్కడుంచి ఒకటేమిటి వంద చిక్కులు వేసుకుంటాం. మన జన్మంతా చిక్కులు వేసుకుని విప్పుకునేసరికి అయిపోతుందండీ! రారా ఇంక చాలు, అంటే ఇంకా కొన్ని ఉండిపోయినాయి సార్ వేసిన చిక్కులు అంటాం. అవి వచ్చే జన్మలో విప్పుకుందాములే అని brought forward. Carry forward కదా! మళ్ళీ next life. మనకి ఇక్కడ. ఒక CFT అని రాస్తారు accounts లో Carried forward. Next page లో brought forward అని వేసుకుంటారు. మళ్ళీ మొదలుపెడతారు. మళ్ళీ పడుతూ ఉంటాయి. ఏవో కొన్ని solve అవుతాయి కొన్ని పడుతూ ఉంటాయి. జరిగిపోతూ ఉంటుంది. ఇది ఇలా ఉంచి అసలు దీనికి ఇటు కాదు అటెటో తీస్తే వాడిలో ఉండిపోతే ఏమవుతుందంటే వాడి బుద్ధిలోంచి పనిచేయడంలో పరిష్కారాలు సులభంగా ఉంటాయి. అందుకని భగవద్భక్తులు భగవంతుడే ఉపాయం అనుకుంటారు. హనుమంతుడు మనం దాటగలమా లేదా? మనకేమాత్రం బలం ఉంది? అసలు ఇదివరకు ఇటువంటి పనులు ఇట్లా ఎన్ని చేశాం? మనకి ఎంత వీలుంటుంది? మనలో ఏమాత్రం.. ఇవన్నీ ఆలోచించలా. పని రాముడిది. ఉపాయం రాముడే. కాబట్టి రాముని బాణం లాగా వెళతాను అన్నాడు. సుందరాకాండలో మొట్టమొదట వచ్చేది అదే. దాటేప్పుడు హనుమంతుడి సంకల్పం ఏమిటయ్యా అంటే 'నేను రామబాణం లాగా వెళతాను' అంటాడు. అంటే రామబాణం అంత గొప్పవాడని అనుకున్నాడా? కాదు. రాముని చేత వదలబడింది కదా రామబాణం. అలాగే రాముని చేత పంపబడినవాడుగా నేను వెళతాను. రాముడే పంపిస్తాడు. రామబాణం ఎవరు పంపిస్తే వెళ్ళింది? రాముడు పంపిస్తే వెళ్ళింది కదా! రామబాణం లాగా వెళతాను అంటే అర్థం ఏమిటంటే దానంత speed గా, piercing గా నేను వెళ్ళిపోతానని కాదు. రాముడు పంపించాడు కదా బాణాన్ని, నన్ను కూడా ఆయనే పంపిస్తాడు. అదీ లెక్క! ఎంత గొప్ప విషయం! లంకలో వెతుకుతున్నప్పుడు కూడా కొంచెం మళ్ళీ సమస్యలు వస్తాయి హనుమంతునికి. తన బుద్ధితో వెతుకుతున్నప్పుడు సమస్యలు వస్తే తేలకపోతే, ఒరే ఒరే ఒరే చిక్కుల్లో పడతామని మళ్ళీ రాముడిని స్మరిస్తాడు. అమ్మవారిని స్మరిస్తాడు. చిక్కు పడ్డప్పుడు చేయాల్సింది అటు తిరగాలండీ! అటు తిరిగితే అక్కడి నుండి మనకి ఒక స్ఫూర్తి వస్తుంది. హనుమంతుడు లంకా పట్టణమంతా వెతికి, చివరికి బాధపడతాడు ఎక్కడా కనబడ్డం లేదని. అప్పుడు ప్రార్థన చేస్తే స్ఫురిస్తుంది

అశోకవనంకి వెళదామని. అంతవరకు అశోక వనంలోకి వెళ్ళడు. ఎంతసేపు ఈ కట్టడాలలో వెతుకుతూ ఉంటాడు. భవనాలలో, రాజప్రసాదాలలో వెదుకుతూ వెదుకుతూ, కాస్సేపు మండోదరే సీతయేమో అని భ్రమపడి, అయ్యో ఇట్లా అయిపోయిందేమిటి అని బాధపడి, ఆ తరువాత ఛీ ఛీ ఇదేమిటి ఇట్లా భావించాను, ఇట్లా ఉండదు కదా అటువంటి ఆయన భార్య అయితే అని అనుకుని, ఎన్ని వచ్చినాయి మనసులోకి హనుమంతుడంతటి వాడికి. మనకి ఎన్ని వస్తాయి చిన్న కష్టం వస్తే? లక్ష వస్తాయి mind లో. మరి అవన్నీ పెట్టుకుని, పోగేసుకుని ఏవో sort-out చేసి మనం ఏదో ఒకటి పట్టుకుని ముందుకు పోయామనుకోండి, ఏం ఉండవు. ఎందుకంటే అసలే సమస్యలో ఉన్న మనసు కదా! దానికి చాలా బుల్లి వెలుగుంటుంది. గుడ్డి దీపం కన్నా గుడ్డిగా ఉంటుంది. దాదాపు ఆరిపోయినట్టుగా ఉంటుంది. ఇంక దానితో నువ్వు ఏం ఆలోచిస్తావు? శుభ్రంగా నూనె పోసుకుని, వత్తి పైకి లాగి, కొండె తీసేసి వెలిగిస్తే అప్పుడు వాడు వస్తాడు కదా! ఆ భావనలో ఆలోచన చెయ్యి. అదీ హనుమంతుడు చేసి చూపించాడు. చిక్కుల్లో పడ్డది వెళ్ళిన పని, వెంటనే అక్కడ కూర్చుని ఒకసారి పరతత్త్వాన్ని, దైవీతత్త్వాన్ని రెండింటినీ ధ్యానం చేసుకున్నాడు.'దారి చూపించండి, ఇంత దూరం వచ్చాను, ఇప్పుడు ఇట్లా అగమ్యగోచరంగా ఉంది' అని భావన చేసుకుని, కన్నులు మూసుకున్నాడు. ఓ ముహూర్తంసేపే! వందల రోజులు అట్లా తపస్సు చేయడం కాదు. చేస్తే స్ఫురణకి వచ్చింది అశోకవనానికి వెళదాం అని. ఎవరు ఇచ్చారు అది? జరాసంధుడిని శరీరాన్ని రెండు భాగాలుగా చీల్చి తలోపక్క అటు ఇటు వేద్దామనే భావన భీముడికి ఎవరిచ్చారు? ఊరికే మనకి అర్థం కావాలనే కృష్ణుడు ఇట్లా కన్ను కొట్టినట్టు, ఇట్లా చేసి ఇవన్నీ అక్కర్లా. వాడి లోపల నుండే వాడికి స్ఫురించేటట్టు చేస్తాడు భక్తుడైన వాడికి. మన dull heads కి అర్థం కాదని అంత మరీ విప్పి చూపిస్తారు. అంత విప్పక్కర్లేదు. ఏం జరుగుతుందంటే, చేస్తున్నాడు కానీ యుద్ధం తెమలడం లేదు. ఒక్కసారి కృష్ణుడి వైపు చూశాడు భీముడు అంతే. కృష్ణుడి వైపు మనం కూడా చూద్దాం లోపల. భీముడికంటే పక్కన ఉన్నాడండి చూశాడు, మనకి ఎట్లా అండీ అని అనకండి. లోపలే ఉన్నాడు. చూసేసరికి స్ఫూర్తి వచ్చింది. వీడిని ఈసారి చీల్చి ఇటు నుండి అటు వేద్దామని వేశాడు, అయిపోయింది పని. అట్లాగే ఆ దుర్యోధనుడ్ని చంపేటప్పుడు. అలా ఉంటుంది. స్ఫూర్తి నీకు వస్తుంది ఎప్పుడైతే నువ్వు ఒక్కసారి సమస్య నుంచి దైవంలోకి చొచ్చుకొని వెళ్ళావో అక్క,డి నుండి నీకు స్ఫూర్తి వచ్చి సమస్య పరిష్కారం అవుతుంది. కాలేదూ-వేచి ఉండడం నేర్చుకో. ఎంత వేచి ఉన్నారు ఒక్కొక్కళ్ళు సమయం కోసం. వేచియున్నంత సమయంలో దాని గురించే ఊరికే జీలలు తీయకుండా వాడి గురించి జీలలు తీసుకుంటూ ఉండు. వాడి కాంతిలో జీవిస్తూ ఉండు. ఇలా వెళితే ఏం జరుగుతుందంటే, వాడు దాదాపు మనతో ఉంటాడండీ రోజూ. ఇంత దూరం వచ్చి 'గో' 'పతి' అవుతాడు కదా! గోపతి అంటే ఇంద్రియాలకు కూడా ఆయనే ఈశ్వరత్వం వహించి ఉంటాడు. ఉండడం చేత కామం దగ్గరికి రాదు. లేకపోతే కామం ఎంతటి వాడినైనా పట్టేసుకుంటుంది గుర్తుపెట్టుకోండి. 'బ్రహ్మ అయినా కూతు పట్టక మానడు' అని రాశారు భాగవతంలో. 'నేను జయించేశాను ఈ కామాన్ని' అని ఎవరన్నా అనుకున్నారో

వెంటనే కాముడు చోటులో గుర్తించి చూద్దాం అంటాడుట. సై అంటే సై అంటాడు. నువ్వు జయించావు అనుకోకూడదు. భగవంతుని యందు నువ్వు ఉండడం చేత ఇంద్రియములు అనుకూలంగా ఉన్నాయి. అలా కాకపోతే ఎంతటి వాడికైనా ఒకటే. ఒకాయన ఇట్లాగే బాగా సాధన చేసి చేసి చేసి ఏదో కొంత కనిపించింది. మనకి కొంచెం కనిపించగానే మనం వాహిక అయిపోయామని, లేకపోతే ఏదో కారణజన్ములం అయి ఉంటామని, అసలు అవతార తత్త్వమేమో అని ఇట్లా అనిపిస్తూ ఉంటుంది కదా! అట్లా ఆయనకీ అనిపించిందిట కొంత చెయ్యంగానే. చేస్తే అక్కడ ఆ చుట్టూ ఉన్న వాళ్ళతో ఏదో మాట్లాడుతూ 'ఆ కాముడేమిటి నా మొహం. కామాన్ని ఎప్పుడో జయించాను. అసలు శరీరం నన్నేమీ చేయ్యలేదు' అన్నాడుట అంటే, ఒక కుర్రాడు అక్కడ బాణాలు పట్టుకుని, ఐదు బాణాలు, ఆయనే కాముడు. మన్మధుడు. అయిదే బాణాలుంటాయి ఆయన దగ్గర. చాలు. మొత్తం ప్రపంచాన్ని ఈ ఐదు బాణాలతో ఆడిస్తున్నాడు. ఏది? బ్రహ్మ దగ్గర నుండి. మనమెంత? కనబడ్డాడట. కనబడితే ఎవరు నువ్వు? అన్నాడుట. 'నన్నే కాముడు అని పిలుస్తారు. నన్ను జయించాను అంటున్నావేంటి?' అన్నాడుట. అవును జయించాను అంటే అయ్యే పని కాదు అంటాడు కాముడు. 'కాదు ఎప్పుడో జయించేశాను నీ మొహం నువ్వు నన్నేం చేయలేవు' అంటాడు. 'అట్లా అనబోకు. నీ మంచి కోరి చెప్తున్నాను.' అని చెప్తాడు. 'లేదు అయిపోయింది. It is my past అన్నాడు English లో. ఇంక నన్నేది ముట్టుకోదు' అని చెప్పాడట. ఆహా అలాగా అన్నాడు. ఆయన రోజూ అడవిలోకి వెళుతుంటాడు. అడవిలో ఏవో అవీ ఇవీ పుల్లలు ఏరుకు తెచ్చుకుంటూంటాడు. హోమం చేసుకోవాలి. ఏవో గొడవలు ఉంటాయి. ఒకరోజు అడవిలోకి వెళితే, అక్కడ ఒక అందమైన అమ్మాయి ఓ మంచి పాత్రలో అక్కడ ఏదో పదార్థం పెట్టేసి, ఆయన చూస్తూ ఉండగా వెళ్ళిపోయిందిట. వెళ్ళిపోతే, 'ఎవరీ అమ్మాయి? ఇక్కడ పాత్ర ఎందుకు పెట్టింది?' అని వచ్చి చూశాడుట. చూస్తే చాలా మంచి సువాసనలు వస్తున్న ఆహారపదార్థం. దానితో మొదలుపెడతాడు. Taste కదా! ఈ పాత్ర ఇక్కడ పెట్టి ఎందుకు వెళ్ళిపోయిందని అనుకుని, అటు ఇటు అటు ఇటు చూస్తే, ఆవిడ చెట్టు వెనుకగా నిలబడి అట్లా తొంగి చూస్తూ, 'తమ కోసమే తెచ్చాను. మీరు మహాత్ములని మా అమ్మ చెప్పింది. మీకు సేవలు చేసుకోవాలనేది మా పెద్దలు చెప్పినది. కాబట్టి మీకు మహానైవేద్యం సమర్పణ చేసుకుంటున్నా' అన్నది. అది సామాన్యమేంటి? ఒకళ్ళు గుర్తించారు అప్పుడే. బావుంది పుచ్చుకున్నాడు. మర్నాడు పుల్లలు ఏరుకోవడానికి వెళ్ళేసరికి మళ్ళీ అటువంటి పదార్థం తింటే బాగుండు అనిపించిందిట. అనిపించదా? అట్లా వచ్చినవే కదా! బందరులో అమావాస్య హోటలని ఉంది. తింటే అక్కడే తినాలి పెసరట్లు. అట్లాగే బెజవాడలో బాబాయి హోటలుంది. తింటే అక్కడే తినాలి ఇడ్లీలు. నెల్లూరు వెళితే కోమలా విలాస్ లోనే భోజనం చేయ్యాలి. బెంగుళూరు వెళితే దాశ ప్రకాశ్ లోనే తినాలని ఉండేది ఒకప్పుడు ఇప్పుడు లేదు. పాపం విశాఖపట్నంలో అటువంటిదేమీ లేదు. గుంటూరు వెళితే గోంగూరే తినాలి కదా! ఇవన్నీ అట్లా వచ్చినవే కదా! ఎందుకొచ్చింది? ఒకసారి నాలుక ఒకటి రుచి చూచిందంటే మరి అది తిప్పతుందండీ, దానికోసమే ఎంత అయినా తిప్పతుంది. అంటే ఇంత మహానుభావుడికీ అది బాగా నచ్చింది.

మర్నాడు కూడా ఇటువంటిది ఉంటుందేమో అనిపించిందిటండీ! అదేమిటి ఇట్లా అనిపిస్తోంది? అనిపించకూడదు కదా, అనుకున్నాడట. మనకేం సంబంధం? అయినా మనం రుచికోసం బ్రతుకుతున్నామా? ఏవో సర్దిచెప్పకున్నాడుట నాలుకకి. వెళ్ళాడు పుల్లలు అవీ ఏరుకొస్తున్నాడు. అప్పడప్పడు ఆ భావన వస్తోంది. అటు ఇటు చూస్తున్నాడు. సరే చూస్తుంటే ఆ అమ్మాయి మళ్ళీ తెచ్చి పెట్టింది అక్కడ ఆ గిన్నె. మనం అడక్కుండా వస్తోంది కదా! సరే పెట్టింది. ఏమిటమ్మా అంటే, 'ప్రసాదం తమరు స్వీకరిస్తే నేను చాలా ఆనందిస్తాను'. పుచ్చుకున్నాడు. నెమ్మదిగా తినడం మరిగాడు. ఆవిడ రోజురోజుకీ quantities పెంచుతోంది, Varieties పెంచుతోంది. పెంచుతుంటే మనవాడు బాగా తిని వృషభతత్త్వంలోకి వచ్చాడు మంచి ఎద్దు వలె. అంటే మామూలుగా యోగ సాధన చేసే వాళ్ళ శరీరం బాగా పలుచనగా ఉంటుంది. అటువంటిది యోగ సాధన సన్నగిల్లుతోంది. తిండి మీద వ్యామోహం పెరుగుతోంది. ఎప్పడు తిన్నాడో పాపం, ఎప్పడో చిన్నప్పడు వాళ్ళ అమ్మ పెడితే తినుంటాడు. ఆ తరువాత ఈ తపస్సు అన్నాడు, యోగం అన్నాడు, అరణ్యంలోకి వచ్చాడు, ఏదో శిష్యుడు అన్నాడు, బాధపడుతున్నాడు, సరియైన తిండి తిని ఎన్నాళ్ళో అయిపోయింది. ఇప్పడు దొరుకుతోంది శుభ్రమైన తిండి. తిండం మొదలుపెట్టాడు. బలుస్తున్నాడు. ఎంత బలిస్తే అంత యోగం తగ్గుతుంది తగ్గుతుంటే, ఆ అమ్మాయి ఏం చేస్తుందంటే మొదట్లో భోజనం పాత్రలో పెట్టి ఈయన వస్తున్నాడని చూడంగానే పారిపోయి ఎక్కడో దూరంగా చెట్టు కింద రహస్యంగా ఉండేది. ఆ తరువాత ఏం చేసిందంటే ఒకరోజు, ఈయన తిన్న తర్వాత పాత్ర ఆవిడ తీసుకుని వెళ్ళిపోయింది. మర్నాడు మళ్ళీ పాత్రతో వచ్చేది. నెమ్మదిగా కొద్దికొద్దిగా రోజులు పెరిగే కొద్దీ ఏం చేసిందంటే, పాత్ర అక్కడ పెట్టి తను కూడా దగ్గరగా ఉండడం మొదలు పెట్టింది. తింటూ ఆవిడని చూడటం మొదలుపెట్టాడు. Taste అయిపోయింది. ఇంక touch లోకి వచ్చాడన్నమాట. వాడు తింటూ ఆవిడని చూడడం, ఆవిడ ఏమో నవ్వడం, కబుర్లు చెప్పడం, ఏవేవో చెయ్యడం. చేస్తూ ఉంటే ఆవిడని చూడడం మొదలుపెట్టాడు. చూడ్డం మొదలుపెడితే, కొత్త చిగురు వెయ్యడం మొదలు పెట్టింది లోపల. ఏవో కబుర్లు చెప్పడం మొదలుపెట్టాడు. మాట్లాడడం మొదలుపెట్టాడు. మొదలు పెడుతూ ఉంటే నెమ్మదిగా పలకరింపుల్లోకి వచ్చింది. పలకరింపులు వచ్చిన దగ్గర నుండి ఇంకొంచెం రోజు రోజుకీ ఆ యోగం లేదు, నిద్ర కూడా పట్టట్లేదు. యోగ నిద్రపోయింది, నిద్ర కూడా పోయింది. ఆ తరువాత ఏం చేశాడంటే ఒకరోజు ఈ భోజనం పెడుతుంటే, 'ఎన్నాళ్ళిట్లా ఈ అడవిలో నాకు భోజనం పెడతావు, హాయిగా నువ్వు నన్ను పెళ్ళి చేసేసుకో, నేను నిన్ను పెళ్ళి చేసేసుకుంటాను, మా ఇంట్లోనే నువ్వు నాకు వండి పెట్టవచ్చు' అన్నాడు. అంటే, అది తప్ప కదా అట్లా చెయ్యొచ్చా మీరు అంటే, అదేముంది? గృహస్థాశ్రమం కూడా ధర్మమే కదా! గృహస్థాశ్రమం స్వీకరిస్తాను నేను, కేవలం నీకోసం, అంటాడు. అంటే ఆవిడ అంటుంటీ, నన్ను మీరు అడక్కూడదు, చిన్నపిల్లను కదా, మా అమ్మని అడగాలి మీరు, పెద్ద వాళ్ళు ఉన్నారు కదా, మా ఊరు వచ్చి వాళ్ళని అడగండి అంటుంది. అంటే వాడు సరే మీ ఊరొస్తానంటాడు పాపం. సరే ఇంత సన్యాసీ ఊళ్ళోకొస్తాడు. ఊళ్ళోకొస్తే, వాళ్ళ అమ్మతో మాట్లాడుతాడు. వాళ్ళ అమ్మ అంటుంది, అట్లాగే తప్పకుండా, మీ

అంతటి మహాత్ములు పెళ్ళి చేసుకుంటానంటే కాదంటామా? కాకపోతే మాకొక ఆచారం ఉంది, ఈ పెళ్ళి చేసుకునే ముందు పెళ్ళికొడుకుకి పెళ్ళికూతురికి నిశ్చయం చేసే ముందు, పెళ్ళికొడుకు మీద పెళ్ళికూతురు కూర్చుని గుర్రం సవారి చేసినట్టుగా ఇంట్లో కనీసం నలభై సార్లు తిరగాలి. ఒక మండలం. ఇంట్లోనే. బయట కాదు. తిప్పాలి. అంటే ఏనుగాట ఆడుతారు చూడండి పిల్లలకి, గుర్రం ఆట ఆడటమనే ఒక ఆచారం ఉంది మాకు, అందుకని మీకు అభ్యంతరం లేకపోతే మరి మా ఈ ఆచారం, పెద్దల కాలం నుంచీ వస్తోంది, మరి ఇది నిర్వర్తించాల్సి ఉంటుందని చెప్తుంది. అంటే పోనీలే ఇంటోనే కదా బయట కాదని ఒప్పుకుంటాడు. ఎవరు చూడటం లేదని. ఒప్పుకున్న తర్వాత, సరే గుర్రం వేషం వేస్తాడు, నాలుగు కాళ్ళు, పశువైపోయాడన్నమాట. నాలుగు కాళ్ళ మీద ఉంటే అదొచ్చి ఎక్కుతుంది మీద. ఎక్కి ఏం చేస్తుందంటే, గుర్రాన్ని మరి తోలాలంటే వెయ్యాలి కదా! ఏది? ఒక కళ్ళెం. ఆ కళ్ళెం మరి ముక్కులోంచి వేస్తే ముక్కుకి చిల్లు పెట్టాలి. కాబట్టి అంత వద్దులేండి, నోట్లోంచి వేస్తామని నోరు రెండు దవడల మధ్య నుంచి శుబ్బరంగా ఓ మంచి పలుపుతాడు లాగి పట్టుకుంటుంది. పట్టుకుని ఇట్టా ఇట్టా లాగుతూ ఉంటుంది వీపు మీద ఎక్కి. వాడు నడవాలి. రౌండ్లు కొడుతూ ఉంటాడు. ఒకసారి లాగినప్పుడల్లా ఇదంతా గోక్కుపోతూ ఉంటుంది. లోపల దవడలన్నీ బాగా దెబ్బలు తిన్నాయి. అయినా వాడికింకా చమ్మగానే ఉంటుంది వీపు మీద స్పర్శ. ఎన్నడూ లేని స్పర్శ కదా! చివరికి ముప్పై తొమ్మిది రౌండ్లు అయిపోయినాయి. ఇంకా నలభై రౌండ్ వస్తుందనగా బాగా నీరసంగా తోలుతుంటే, ఆవిడ లాగిందట తాడు, ఎట్లా లాగిందంటే, ఒక్కసారి గట్టిగా లాగిందట తాడు ఫో ముందుకు అని. లాగేసరికి ఆ మెడ అట్లా తిరిగి పోయిందిట. Fracture. మెడ fracture అయిపోయింది. ఇదేమిటి? ఇంత భయంకరంగా చేసింది ఎంతో సుకుమారి అయినటువంటిది అమ్మాయి అని వెనక్కి తిరిగి చూశాడుట. చూస్తే వీపు మీద ఆ అమ్మాయి లేదుట. వీడు, మనవాడు మన్మథుడు. ఎట్లా ఉందని అడిగాడు. ఇదేమిటి తమరు ఇలా అయిపోయారు? ఈ అన్నం తినడమేమిటి? ఆ పొట్ట ఏమిటి? ఈ గుర్రం వేషం ఏమిటి? ఈ పెళ్ళేమిటి? పోనీ చేసుకుంటే బానే ఉంది. ఇదేమిటి? ఇలా గుర్రం వేషం వేశావేమిటి? ఇన్ని అడుగుతాడు. అడిగితే, అప్పుడంటాడు మన్మథుడు, ఒక్కటే గుర్తుపెట్టుకోండి, నన్నెవరూ జయించలేరు. నన్ను జయిద్దామనుకుంటే సృష్టి జీవులు ఎప్పుడూ జయించలేరు. నన్ను జయిద్దామని పెట్టుకోవద్దు. పిల్లాటలు అయిపోతాయి. You are playing with fire అని చెప్తాడన్నమాట. నన్ను జయించాలని పెట్టుకోవద్దు. భగవంతుడితో ఉండండి నేనేమీ చెయ్యను. ఆయన మా Boss. ఆయన ఒళ్ళో నువ్వు ఉన్నంత సేపు నేను నిన్నేం చెయ్యను. ఆయన ఒడిలోంచి నువ్వు దిగి వాడి వాడినని నువ్వు కొంచెం విర్రవీగావో, ఓహో నాకు నువ్వు చాలా లోకువ అని చెప్తాడు. చూడండి ఎట్లా ఉందో ఇది భాగవత కథలలో ఒక ముఖ్యమైనటువంటి కథ. అంటే స్త్రీ వ్యామోహమనేటువంటిది మానవజాతికి భూమి మీద పుట్టిన దగ్గరనుంచి ఉందిటండీ! స్త్రీకి పురుషుడి మీద, పురుషుడికి స్త్రీ మీద. అందుకని ఎన్ని కబుర్లు చెప్పినా దాన్ని జయించామని అనుకోబోకండి అంటారు. ఎందుకంటే సృష్టే అసలు అమ్మ వారి ఆధీనంలో ఉన్నది. కాబట్టి మగవాళ్ళు స్త్రీ

తత్త్వాన్ని జయించామని అనుకోకూడదు. దేముడిలో ఉండాలి. స్త్రీ అట్లాగే ఈ ఆకర్షణ జయించాననుకోకూడదు భగవంతుడిలో ఉండాలి. అజామీళుడంతటివాడు ఏమయ్యాడు? అందుకని మనకి ఏం చెప్తారంటే, ఈ గోపతికి చెప్తున్నాను ఇదంతా. ఇంద్రియాలు అట్లా పట్టెయ్యగలవు మనుషుల్ని. ఎంతటి వాడినైనా. ఎప్పుడైతే ఆ భావన లోంచి తప్పుకుంటామో అప్పుడు పడిపోతాడు. అందుకని భగవంతుని యొక్క మాయ లేక కామము మనం దాటలేము. దాటాలంటే ఒకటే ఉపాయం. ఆయనతో ఉండాలి. చూడండి పోలీసులు పట్టుకుంటారంటే chief minister ఇంట్లో దాక్కున్నాడట ఒకాయన. Chief minister ఇంట్లో దాక్కోవడం వలన ఆయన్ని పట్టుకోవటానికి వీలు లేకపోయింది. ఎప్పుడూ chief minister తోనే ఉండి, అట్లా ఆయనతో శాశ్వతమైన సంబంధం పెట్టుకుంటే ఇహ వదిలేస్తారు. ఎందుకు వీడిని మనం పట్టుకోలేము కదా అని. అట్లా భగవంతుని దగ్గర చేరిపోతే 'గోపతి' అనేటువంటిది సత్యమవుతుంది. అంతవరకు సత్యం కాదు. కోరికలు వచ్చాయనుకోండి, రాకూడదనేమీ లేదు, రావాలి. రావడం సహజం జీవుడికి. అక్కడ విన్నవించుకోవాలి. ఎక్కడ? నువ్వు దేముడు అనుకుంటున్నావు, గురువు అనుకుంటున్నావే అక్కడ వదిలేయాలి. అక్కడ నివేదనం చెయ్యాలి. అదే నైవేద్యం మన కోరికలు. బాబూ అందులో చచ్చులుంటాయి, పుచ్చులుంటాయి, మంచివుంటాయి, శుభ్రమైనవి నెరవేర్చు. మిగతా వాటిని నాకు లేకుండా చెయ్యి. కోరికకి రెండు రకాలు ఉందండీ! అది మనకి జరగటం లేక అది మన మనసులోంచి వెళ్ళిపోవటం. రెండూ ఒకటే తెలుసా? జరగటం వల్ల మళ్ళీ పుట్టచ్చు. అసలు మనసులోంచి తీసేస్తే పాయే కదా! ఆ విధంగా అక్కడ నివేదన చేసుకుంటూ ఉండచ్చు. ఇలా చేస్తే మనకండి గోపతి నామానికి, ఇంద్రియముల మీద ఆధిపత్యం మనకు ఎలాగూ లభించదు. మనం ఆయనతో ఉండటం వల్ల లభిస్తుంది అని చెప్పడానికి చెప్తున్నా. గోహితులు కూడా ఉంది కదా ఇందులో నామం. తరువాత నామం ఏంటి? 'గోహితో'. ఎప్పుడు వచ్చింది? ముందు ఉంది. గోపతి కన్నా ముందే ఉంది. పతి అయ్యే ముందు హితుడవుతాడన్నమాట.

## 617 గోప్తా

ముందు friend గా చేరి తరువాత Boss అయిపోతాడని. ముందు స్నేహితుడిగా వచ్చి తరువాత మొగుడైపోయాడనుకోండి! అది కదా పట్టు అంటే. ఈ విధంగా ఈ నామాలు మనకి 'గోప్త' అంటే రక్షించి ఉంచుతాడుట. గుప్తా గారు ఏం చేస్తారండీ? రహస్యంగా దాచి జాగ్రత్త పెడుతూ ఉంటారా? ఈయన కూడా జీవుడిని అట్లా పరిరక్షించి తనలో దాచుకుని ఉంచుకుంటాడుట. అంతవరకు దారితీస్తుంది మనం చేసే రమ్యమైన అంతర్ముఖ ధ్యానం లేక పూజ. వృషభాక్షో వృషప్రియః వృషభం అనేది చాలా పెద్ద విషయం. అసలే ఎద్దు కదా! ఎద్దుతో మొదలైనది నంది అవాలి కదా! ఎద్దుకి నందికి తేడా ఏమిటి? ఎద్దు ఎద్దే. నంది నందే. దైవానికి సమర్పణ చెందింది నంది. అట్లా కాకుండా ఎట్లా పడితే అట్లా తిరిగి, ఏది పడితే అది తిని, ఎవడిని పడితే వాడిని పొడిచి, దున్నపోతు వ్యవహారం అని అంటారు చూశారా! కాబట్టి ఆ ఎద్దు తత్త్వంలోంచి మనకి భగవత్తత్త్వం వరకు ఓ దారి ఉంది. అంతా Taurus. వైశాఖమాసం. సామాన్యం కాదు వృషభరాశి. వృషభాక్షుడు వృష ప్రియుడు.

# 618 వృషభాక్షః

వృషభాక్షుడు అనే నామం అతి గంభీరమైనది. అత్యంత రహస్యములతో నిండిన భగవత్తత్త్వమున్నది. వృషభము అనేది మనకి ద్వాదశరాశులలో ఒక ముఖ్యమైన రాశి. అది మనకి వైశాఖమాసంగా మనం పరిగణిస్తాం. ఈ వృషభము భగవంతుని యొక్క కన్నుగా భావన చేస్తూ ఉంటారు. వృషభాక్షుడు అని చెప్పడంలో ఉద్దేశ్యమేమిటంటే తన కంటి ద్వారా సమస్తాన్ని సృష్టి చేసేవాడు అని అర్థం. చూపుల ద్వారా సృష్టి చేస్తాడు. సూర్యుడు తన నుంచి ప్రసరించే కిరణముల ద్వారా సమస్తమైన గోళములను చేస్తున్నాడు. గోళముల యందలి జీవులను సృష్టి చేస్తున్నాడు. సూర్యుడు కన్నుగా ఈ సమస్తమైన సూర్యమండలము ఏర్పడుతూ ఉన్నది. అందుకని సూర్యుడ్ని వృషభాక్షుడని పిలుస్తారు. అలాగే సృష్టి జరగడమనేది భావన చేసినట్లయితే, ఏ ద్వారముగుండా సమస్తమైన సృష్టి ఏర్పడుతుందో, అది నంది కన్ను అని చెప్తారన్నమాట. The eye of bull. The eye of bull లేక వృషభము యొక్క కన్ను-అక్షము వైశాఖ మాసానికి సంబంధించిన కాలంలో ఎక్కువ నిబిడీకృతమై ఉన్నది. అంటే తత్త్వము మేషమాసంలో చాలా అవ్యక్తంగా ఉంటే, వృషభమాసంలో దిగివస్తుంది. అందుకే వృషభము ద్వారానే సమస్తము దిగి వస్తోందని, సూర్యుడు వృషభమని, భూమి గోవు అని, ఆ సూర్యుడు నుంచి వచ్చే కిరణముల ద్వారా ఈ భూమి మీద సమస్తమైన పంటలు పండుతున్నాయి కాబట్టి ఈ విధమైన సమన్వయం మనకి వేదంలో చేర్చి ఇచ్చారు పెద్దలు. వృషభము అంటే కిరణము అని అర్థం ఉన్నది. వృషభము అంటే సూర్యుడు అని అర్థం ఉన్నది. వృషభము అంటే దిగి వచ్చేది అని అర్థం ఉన్నది. వృషభము అంటే భగవంతుని యొక్క పురుషతత్త్వము. పురుషతత్త్వము నుంచి దిగివస్తుంటే స్త్రీతత్త్వము అందుకుంటూ ఉంటే, అందులోంచి సృష్టి ఏర్పడుతూ ఉంటే ఇట్లా మనకి కథ నడుస్తూ ఉంది. అందుకని సమస్తాన్నీ అంది ఇచ్చేటి ఒక ముఖద్వారం ఏదైతే ఉందో దాన్ని 'వృషభాక్షము' అంటారు. వృషభాక్షుడు అన్నారు. All seeing Eye అంటారు. ఈ కన్ను మనలో కూడా మూడవ కన్నుగా ఉన్నది. దాన్నీ వృషభాక్షము అంటారు. ఈ మూడవ కన్ను తెలుసుకున్న వాడు తనలోంచి కూడా అదే సృష్టి నిర్మాణం చేయగలిగిన స్థితికొస్తాడు. అందుకనే ఆజ్ఞ నుంచి సమస్తమైన జీవితాన్ని నిర్వర్తించుకునే వాడిని 'స్వామి' అంటారు. ఆజ్ఞా కేంద్రము నుండి వ్యక్తమయ్యే భావములకి రూపుకట్టి, జీవితాన్ని నడిపించుకునే వాడు తన జీవితానికి తను స్వామిత్వం వహించి ఉంటాడు. మామూలుగా సామాన్యమైన మానవులందరికీ వాడి బొడ్డులో నుండి పుట్టుకొస్తూ ఉంటాయి కోరికలు, ఆలోచనలు అన్నీ. అందుకని అది బాగా చుట్టేస్తూ ఉంటుంది. తన జీవితానికి తను స్వామిత్వం వహించక, జీవితం తన మీద స్వామిత్వం వహిస్తూ ఉంటుంది. కాలం నిర్ణయం చేస్తూ ఉంటుంది వాడి యొక్క దైనందినచర్య. దేశము, కాలమునకు బద్ధుడై జీవిస్తూ ఉంటాడు. కానీ ఎవరికైతే తన ఆజ్ఞయందు తాను చైతన్య స్వరూపుడుగా దర్శనం చేస్తూ ఉంటాడో వాడు తన జీవితాన్ని తనదిగా నడిపించుకుంటూ ఉంటాడు.

తనదిగా అంటే మొత్తం తానులో తాను ఒకడుగా భావన చెంది, ఆ తానుకు తాను వాహికగా నిలబడి, అక్కడ నుండి భూమి మీదకు సమస్తాన్నీ అందిస్తూ ఉంటాడు. ఈ భూమికి సంబంధించిన ప్రజ్ఞ కూడా ఆ విధంగానే దిగివస్తూ ఉంటుంది, ప్రతి సంవత్సరం వృషభరాశి ద్వారా. అందుకని వైశాఖమాసం చాలా ముఖ్యమైన మాసంగా పెద్దలు చెప్పారు. వైశాఖపౌర్ణమి చాలా పర్వదినంగా చెప్పడంలో ఉద్దేశ్యమది. వృషభరాశిలో మనకి కృత్తిక మూడు పాదములు, రోహిణి నాలుగు పాదములు, మృగశిర రెండు పాదాలు గోచరిస్తాయి. అశ్విని నాలుగు పాదాలు, భరణి నాలుగు పాదాలు, కృత్తిక ఒక పాదం మనకి మేషరాశిలో ఉంటే, తరువాత కృత్తిక, రోహిణి, మృగశిరలో కృత్తిక మూడు పాదాలు, రోహిణి నాలుగు పాదాలు, మృగశిర రెండు పాదాలు ఇట్లా మనకి వైశాఖమాసంలో గోచరిస్తాయి. అందుకని రోహిణీ నక్షత్రం వృషభరాశిలో చాలా ముఖ్యమైనట్టిదిగా పెద్దలు చెబుతూ ఉంటారు. రోహిణీ నక్షత్రంలోనే శ్రీకృష్ణుడు జన్మించడం జరిగింది. అంటే ఊర్ధ్వలోకముల నుంచి దిగివచ్చిన ప్రజ్ఞలు రోహిణీ నక్షత్రంలోంచి దిగిరావడానికి అవకాశం ఉంది. వృషభము కిరణముగా దిగిరావడం అనేది రోహిణీ నక్షత్ర మండలంలోంచి దిగివస్తే, మన భూమి మీద శంబళ గ్రామం మీదకి దిగివస్తే, ఆ శంబళ గ్రామంలోంచి హిమాలయాలలోకి దానిని అందుకొని తద్వారా దివ్యప్రణాళికలు నిర్వర్తించే ఒక విధానం ఈ భూమికి సనాతనంగా ఉన్నది. ఇది అందుకోవడానికి కృత్తికల యొక్క సహాయం అందుకుంటారు. కృత్తికలు మాతృతత్త్వం కలిగినవి కాబట్టి ఆ కృత్తికల దగ్గరికి దివ్య ప్రణాళిక అందితే ఆ కృత్తికలు మన భూమి మీదకి వాటిని మన సూర్యమండలం ద్వారా మనకి అందిస్తూ ఉంటాయి. మన సూర్య మండలానికి మొత్తానికి కూడా కృత్తికలు తల్లి వంటివి, సప్తర్షి మండలం తండ్రి వంటిది, శారమేయ మండలం  గురువు వంటిది. కాబట్టి కృత్తికా మండలంలో భాసించిన దివ్యప్రణాళిక రోహిణీ నక్షత్రం ద్వారా, శంబళ గ్రామము ద్వారా హిమాలయాలలోకి అంది, అక్కడ నుండి భూమికి, భూమి జీవులకి అందేది ఒకటి ఉన్నది. ఇదంతా ఒక మార్గంగా నడిచేస్తుంది. ఇది జరగడానికి ఏర్పడిన నక్షత్రమే రోహిణీ నక్షత్రం. దాన్ని 'కన్ను' అంటారు. అందుకని ఆ కన్ను ద్వారా ఊర్ధ్వలోకముల నుంచి సమస్తము పృథ్వీ లోకములలోకి అవతరిస్తూ ఉంటుంది. అందుకనే పరమ గురువులు వైశాఖ పౌర్ణమిని అత్యుత్తమమైన పౌర్ణమిగా భావన చేసి తమ్ము తాము ఆ పౌర్ణమికి రెండు రోజులు ముందుగా సంసిద్ధం చేసుకుని దివ్య ప్రణాళికను తమ యందు పొందుపరచుకోవడానికి హిమాలయాల్లో ఉండే వైశాఖలోయలో అందరూ సమావేశమవుతారు. చైత్ర పౌర్ణమికి ఈ ప్రజ్ఞ శంబళ గ్రామం చేరుతుంది. అక్కడ నుండి వైశాఖ పౌర్ణమికి అదే ప్రజ్ఞ శంబళ గ్రామములో ఉండే సనత్కుమారుడి దగ్గర నుండి బుద్ధుని ద్వారా మైత్రేయాది గురుపరంపరకి అందుతుంది. ఇది ఈ విధముగా వృషభం లో లేక వైశాఖ మాసములో మనకి అంది వచ్చేది. ఇది మనలో ఆజ్ఞా కేంద్రముగా స్థిరపడి ఉన్నది. జీవులందరికీ ఆజ్ఞా కేంద్రము మూతపడి ఉంటుంది. చాక్షుష అనే మన్వంతరంలో మానవులకి మూడవ కన్ను బాగా పనిచేస్తూ ఉండేది. Pineal gland అంటాం. నెమ్మదిగా మనిషి భౌతికమైన విషయములయందు బాగా ఆసక్తి

పెంచుకుంటూ పోయి, ప్రపంచమంతా భౌతికంగానే భావన చేస్తూ, అసలు భౌతికమే జీవనం అనే స్థితిలోకి దిగజారిన సందర్భంలో మూడవ కన్ను మూసుకుపోయింది. ఇప్పుడు కూడా మూడవ కన్ను తెరుచుకోవడానికి చేయవలసిన సాధన ఏమిటయ్యా అంటే భౌతికమైన విషయముల కన్నా సూక్ష్మము, ఊర్ధ్వము అయిన విషయములయందు బాగా ఆసక్తి పది కాలాల పాటు పెరుగుతూ ఉంటే, అంటే మనలో ఉండే చైతన్యం అధోముఖం కాకుండా ఊర్ధ్వముఖము అవుతూ ఉంటే, క్రమశః ఈ చైతన్యం అంతా ఉత్తర ముఖంగా వెళుతూ ఉంటే అది కారణం చేత ఆ తాకిడికి, ఉత్తర వాహినిగా ప్రవహించే చైతన్యం యొక్క తాకిడికి మళ్ళీ మూడో కన్ను తెరుచుకునే అవకాశం ఉంది. దానికే సమస్తమైన తపస్సులు చేస్తూ ఉంటారు. ఎందుకంటే అది తెలుసుకుంటే ఏం జరుగుతుందంటే అటు నుంచి దిగి వచ్చేది ఇటు తీసుకురావడానికి వీలు పడుతుంది. అది మూసుకుని ఉంటే మనకి అటు నుంచి వచ్చేదేం ఉండదు. ఇక్కడ ఈ భౌతికమైన విషయములలో అట్లా లుంగలు చుట్టుకుంటూ మనల్ని మనం బాగా చిక్కులు వేసుకుంటూ బందీకృతులైన జీవులుగా జీవించే ఒక స్థితి ఉంటుంది. అందుకే వృషభరాశిలో రెండు రకాల ఎద్దుల్ని చెబుతారు. ఒకటి భగవంతునికి సమర్పణ చేయబడిన నందీశ్వరుడు. కేవలము శివునియందే తన యొక్క దృష్టి లగ్నము చెయ్యడం చేత, శివుని ఆజ్ఞగా తన యందు భాసించిన విషయాన్ని తాను నిర్వర్తించే వాడు నందీశ్వరుడు. లేక సమర్పణము చేయబడిన జీవుడు. అటు నుండి అందుకోవడానికి వీలులేనటువంటి ఒక స్థితిలో శివుని వైపు ముఖము కాక పృచ్ఛము- తోక చూపించి, ఇంకోవైపు మనం చూస్తూ ఉండడం చేత, మన కన్ను శివుని చూసే స్థితి కోల్పోయింది. శివుడు అంటే ఇక్కడ అర్థం అంతర్యామి అయిన భగవంతుడని భావన. విష్ణువుని చూడకూడదా అండీ అని ఇట్లా అనకుండా భగవత్తత్త్వము యందు లగ్నమైయున్న మనస్సు అని తెలియజెప్పడానికి మనకి నందీశ్వరుడని చెప్తారు. అలాగే గరుత్మంతుడు. దేవాలయంలో దైవము యొక్క వాహనము దైవమునే చూస్తూ ఉంటుంది కదా! రామాలయంలో హనుమంతుడు రాముడికి ఎదురుగుండా ఉండి చూస్తూ ఉంటాడు. విష్ణు ఆలయంలో మనకి గరుత్మంతుడు అదే విధంగా చూస్తూ ఉంటాడు. శివాలయంలో నంది ఆ విధంగా చూస్తూ ఉంటుంది. అమ్మవారి ఆలయంలో సింహం ఆ విధంగా చూస్తూ ఉంటుంది. వినాయకుడి ఆలయంలో ఎలుక ఆ విధంగా చూస్తూ ఉంటుంది. ఎందుకట్లా చూస్తుందంటే వాహికగా ఉండడం అంటే అదే అర్థం. భగవంతుని మాత్రమే దర్శనం చేస్తూ, భగవంతుని యందే తాము జీవిస్తుండడం చేత, భగవంతుని నుండి తమకు వచ్చిన స్ఫూర్తిని ఇటు పక్కకి ప్రతిబింబింపచెయ్యడమనేది వాహిక లక్షణం. వైశాఖమాసానికి, వాహిక కి అటువంటి అనుసంధానం ఉన్నది. ఎందుకంటే కన్ను అక్కడ ఉన్నది. అంటే చిల్లు ఒకటి ఉన్నది. చిల్లుకి అవతల పక్క దివ్యత్వం ఉంది. చిల్లుకి ఇవతల పక్క అంతా మనకి ఈ పృథ్వీతత్త్వం ఉన్నది. ఆ చిల్లే కన్ను అని మనం అనుకున్నామనుకోండి, దాన్నుండి అటు పక్క ఏముందో గమనించి, కాలం ప్రకారం ఏం నిర్ణయించబడ్డదో దాన్ని ఇటుపక్క నిర్వర్తించుకోవడం జరుగుతుంది. అది చెయ్యడానికే పరమ గురువుల పరంపర భూమి మీద పనిచేస్తూ ఉన్నది. ఈ భూమి పుట్టినప్పటి నుండీ

కూడా ఆ పరంపర ఉన్నది. కాకపోతే పరంపరలో పనిచేస్తున్న జీవులు ఊర్ధ్వలోకాలలోకి వెళ్ళిపోతూ ఉంటారు. అందులోకి ఉద్ధరింపబడి వచ్చిన వాళ్ళు అక్కడ ఉంటారు. ఇప్పుడు ఈ కాలచక్రానికి సంబంధించిన గురుపరంపరకి మైత్రేయ మహర్షి అక్కడ అధిపతిగా ఉన్నారు. అంతకుముందు పరాశరుడు, అంతకుముందు శక్తి, అంతకుముందు వశిష్ఠుడు అట్లా మనకి తరతరాలుగా ఒక పరంపర నడిచివస్తూ ఉన్నది. వారియొక్క ముఖ్యమైన కార్యక్రమమేమిటయ్యా అంటే దివ్యప్రణాళికకి వారు కన్నుగా నిలబడడం. అందుకని ఈ 'వృషభాక్ష' నామానికి వారందరి యొక్క సమూహాన్ని మనం ఒక్కసారి గుర్తు తెచ్చుకోవాలి. ఎందుకనంటే అటు పక్కది చూసి ఇటు పక్కకి తీసుకు వస్తున్నారు. ఇటు పక్కకి అందించడం చేత వారు మనకి వృషభులయ్యారు. అటుపక్క నుంచి అందుకోవడం చేత గోవులయ్యారు. 'గో' అనేది అదే తత్త్వానికి సంబంధించిన స్త్రీ తత్త్వము. ఎద్దు లేక వృషభము అనేది దాని యొక్క పురుష తత్త్వం. పురుష తత్త్వం అంటే అందించేది. స్త్రీ తత్త్వం అంటే అందుకునేది. సూర్యుడు అందిస్తాడు. చంద్రుడు అందుకుంటాడు. భూమి అందుకుంటుంది. అందుకునేవాళ్ళంతా స్త్రీలు. అందించేవాళ్ళంతా పురుషులు. ఎవరూ పూర్ణ పురుషులు కాదు. ఎవరూ పూర్ణ స్త్రీలు కాదు. అందుకున్నప్పుడు మనలో ఉన్నట్టి స్త్రీ తత్త్వం పనిచేస్తుంది. అందించేప్పుడు మనలో ఉండేటువంటి పురుషతత్త్వం పనిచేస్తూ ఉంటుంది. అందించేవాడు, అందుకునేది రెండూ మనలో సమానంగా ఉంటే యోగస్థితి వస్తుంది. అదే అర్ధనారీశ్వరతత్త్వం! మనలో ఎంత అందుకుంటున్నామో అంత అందించగలమా? నువ్వు అందించడం ఎక్కువ అవుతూ ఉంటే అందుకోవడం కన్నా ఊర్ధ్వగతికి వెళుతూ ఉంటావు. అందుకోవడం ఎక్కువ అవుతూ ఉంటే అందించడం కన్నా అధోగతికి వస్తూ ఉంటావు. అంటే పృథ్వీ తత్త్వంలోకి మనం ఎక్కువ చొచ్చుకొని వెళ్ళిపోవడానికి కారణం ఏమిటంటే, బాగా పుచ్చుకోవడం నేర్చుకున్న వాళ్ళం కాబట్టి. భారతీయులకి బాగా ఆశ పుచ్చుకోవడం విషయంలో. అందులో ఊరికే వస్తుందంటే మరీ శుభ్రంగా పుచ్చుకుంటారు. అది ఏమైనా సరే. ఎందుకైనా పనికొస్తుంది, ఊరికే వచ్చింది కదా! చైతన్యంలో బాగా పెరుగుతున్న వాళ్ళకి పుచ్చుకోవడం లో ఆనందం ఉండదు. ఇవ్వడంలో ఉంటుంది. ఎందుకంటే ఇస్తున్న కొలదీ నువ్వు ఉత్తరధృవం వైపు వెళతావు. పుచ్చుకుంటున్న కొలదీ నువ్వు దక్షిణధృవం వైపు వెళుతూ ఉంటావు. కానీ ఇంత ఉత్తరధృవం కూడా అంతకు పైనుండి పుచ్చుకోవాల్సిందే. పరమగురువులు మనకి అందిస్తున్నా, వారు అంతకు పై లోకాల నుండి పుచ్చుకుంటున్నారు కదా! కాబట్టి తమ క్రింద వారికి తాము పురుషులు, తమ పై వారికి తాము స్త్రీలు. పేరుకి వృషభరాశి తప్ప వృషభరాశిలో గోవులు కూడా ఉన్నాయి. ఎందుకంటే మనకి ఆధ్యాత్మికపరమైన జ్యోతిర్విద్యలో ఏం చెప్తారంటే The moon in Taurus is the cow, The sun in Taurus is the Bull అంటారు. అంటే చంద్రుడు వృషభ రాశిలో ఉన్నప్పుడు ఆవు అవుతుందిట. సూర్యుడు వృషభరాశిలో ఉన్నప్పుడు ఎద్దు అవుతుందిట. ఇలా చెప్పారు. ఎందుకంటే అందుకోవడం, అందించడం రెండూ ఒకచోటే ఉంటాయి. అందుకోవడం, అందించడంలో హెచ్చుతగ్గులను బట్టి మనకి స్త్రీత్వము, పురుషత్వము అనేది స్వభావికంగా ఏర్పడే ఉంటుంది. భాగవతంలో ఓ

మంచి రహస్యం చెప్పారు. ఈ జన్మలో బాగా పుచ్చుకోవడం నేర్చుకున్నవాళ్ళుంటారే వాళ్ళందరూ వచ్చే జన్మలో స్త్రీలుగా పుడతారని, స్త్రీలుగా పుట్టడం చేత వాళ్ళు అందరికీ చేసి పెడుతూ ఉంటారు కదా, అందిస్తూ ఉంటారు కదా! లేచిన దగ్గరి నుండి రాత్రి పడుకునే వరకు ఇంట్లో వాళ్ళకి సేవ చెయ్యడంతోనే సరిపోతుంది కదా! అందరికీ అన్నీ అందివ్వాలి. కాఫీ గ్లాసుల దగ్గర నుండి, మంచినీళ్ళ గ్లాసుల దగ్గర నుండి, పళ్ళాల దగ్గర నుండి ప్రతిదీ అందిస్తే వాళ్ళు శుభ్రంగా తినిపోతూ ఉంటారు. ఈ విధంగా స్త్రీలు అందిస్తూ, అందిస్తూ వచ్చే జన్మకి పురుషుల శరీరం పొందుతారట. పురుషుల శరీరం పొందిన తరువాత కూడా అందించడమే వాడు నేర్చుకున్నట్లయితే పురుషుడిగా ఉంటాడుట. కానీ అందుకోవడం మొదలుపెడితే స్త్రీ అవుతాడట. ఈ రహస్యం భాగవతంలో ఉన్నది. పురుషులు, స్త్రీలు ఏ విధంగా పుడతారు? పురుషుడిగా ఎందుకు పుడతాడు? స్త్రీగా ఎందుకు పుడతాడు? అంటే నారద మహర్షి ఈ విధమైన సమాధానం చెప్తాడు. పురుషుడుగానే ఎందుకు నువ్వు ఎప్పుడూ అని అడిగితే, 'ఏం లేదురా ఒకటే పెట్టుకున్నాను, అందిస్తున్నాను అందుకోవడం కన్నా, అందించేది అందుకునే దానికన్నా ఎక్కువగా ఉండేట్టు జాగ్రత్త పడుతూ ఉంటాను' అంటాడు. అంటే balance sheet లో అందుకునేవి, అందించేవి వేసుకున్నాం అనుకోండి, అందించేవి అందుకునే వాటికన్నా ఎక్కువ ఉండాలి. ఉంటే పురుష తత్త్వం లో ఉంటారు. అందుకనే మీకు ఎక్కువమంది మహాత్ములు పురుషులుగా గోచరిస్తూ ఉంటారు. ఏంటండీ ఇది? పక్షపాతం, అందరూ పురుషులే ఉన్నారు, స్త్రీలు లేరు ఈ పరమ గురువులలో అని అనవచ్చును కదా! ఎందుకట్లా తయారయ్యారంటే వాళ్ళు, వాళ్ళు అందించడం అందుకోవడం కన్నా ఎక్కువగా స్వభావంగా ఏర్పడిన వాళ్ళు. వాళ్ళు ఎట్టి పరిస్థితులలోనూ ఓ పావలా అందుకుని ముప్పావలా అందిస్తూ ఉంటారు. అలా ఉండడం చేత పురుషులుగా ఎక్కువ ఉంటారు. దివ్య ప్రణాళికలో భాగంగా స్త్రీగా జన్మించవచ్చు. అంత మాత్రం చేత వాళ్ళు అందుకునే వాళ్ళు అని అనుకోకూడదు. మేరీగా పుట్టి Jesus Christ ని పట్టుకొచ్చిందనుకోండి, లేకపోతే మాయాదేవిగా పుట్టి బుద్ధుని పట్టుకొచ్చిందనుకోండి, లేక దేవకిగా పుట్టి శ్రీకృష్ణుని పట్టుకొచ్చిందనుకోండి వాళ్ళందర్నీ మనం ఈ విధంగా లెక్కలు వెయ్యకూడదు. అక్కడ వాళ్ళు ప్రణాళికలో భాగంగా ఒక పాత్ర పోషించిన వాళ్ళు. నేను చెప్పేది సామాన్యమైన జీవుల గురించి. కనుక ఇక్కడ పరమ గురువులు కూడా ఈ వైశాఖ పౌర్ణమి సందర్భంగా అటు నుంచి అందుకుని ఇటు అందిస్తూ ఉంటారు. అటు నుంచి వాళ్ళకి బీజప్రాయంగా అందుతుంటుంది. దాన్ని అందుకోవడానికి వాళ్ళందరూ వైశాఖ పౌర్ణమికి రెండు రోజులు ముందుగానే వైశాఖలోయ అనే దాంట్లో హిమాలయాల్లో చేరతారు. మనం కూడా మన అదృష్టవశాత్తు వైశాఖ నగరంలో ఉన్నాము ఇక్కడ. ఈ వైశాఖ నగరానికి, ఆ వైశాఖ లోయకి ఒక సంబంధం ఉన్నది. అందుకనే మహాత్ములు చాలామంది విశాఖ వచ్చి ఇక్కడ స్థిరపడి కార్యక్రమాలు నిర్వర్తించడం అనేది ఒకటి ఉన్నది. ముందు ముందు ఇంకా ఎక్కువగా ఉంటుంది. ఈ విశాఖ నగరం నిజంగానే ఆధ్యాత్మిక కేంద్రం. మనం ఏదో నాలుగు మాటలు చెప్పుకుంటున్నాం అని అనుకోబోకండి. చాలా ఆధ్యాత్మికమైన ఒక ఆశ్రమం ఉన్నది ఈ సముద్ర తీరంలో.

అక్కడ నుండి హిమాలయాలలోకి ఒక వెలుగు దారి ఉన్నది. ఆ వెలుగు దారి నుండి వైశాఖ లోయలోకి ప్రవేశం ఉన్నది. ఇక్కడ మనకి వైశాఖేశ్వరుడు అనే ఆలయం ఒకటి సముద్రంలో ఉన్నది. అది కేంద్రంగా ఒక ఆధ్యాత్మిక ఆశ్రమం ఇక్కడ చోటులో నిర్మాణం చేయబడి ఉన్నది. అందుకని ఇక్కడ ఆధ్యాత్మిక చింతన సహజం. శంబళ గ్రామం గుండా తమకు అందేది అందుకోవడానికి వాళ్ళు అక్కడ చేరారుట. భౌతికంగా అవకాశం లేని వాళ్ళంతా కూడా దివ్య శరీరాలు ధరించి అక్కడికి చేరతారు. దివ్య శరీరాలు ఉన్నటువంటి వాళ్ళు. లేని వాళ్ళు ఏం చేస్తారు? మనబోటి వాళ్ళందరూ కూడా భావన చేత దానియందు శ్రద్ధ ఉంచడం వలన మనకి కూడా కాస్తో కూస్తో దానికి సంబంధించిన స్ఫూర్తి అందడానికి అవకాశం ఉంది. అది అందుకున్న వాళ్ళు చక్కగా సంవత్సరం అంతా కూడా బాగా కార్యక్రమాల్ని నిర్వర్తించుకోవచ్చు, పరమగురువుల యొక్క ప్రణాళికలో భాగంగా. నిజానికి వైశాఖపౌర్ణమిలో అందేది దివ్య శరీరములు నిర్మాణం అయిన వారికి మాత్రమే! దివ్యశరీరం ఎవరికి నిర్మాణం అవుతుందంటే మూడవ కన్ను తెరుచుకున్న వారికి. మూడవ కన్ను తెరుచుకోవటం అన్నా, దివ్యశరీర నిర్మాణమవడం అన్నా ఒక్కటే. ఆజ్ఞ కేంద్రంగా సమస్తమైన కార్యములను, తాము నమ్మిన వారి దగ్గర నుండి తమకు అందుతూ ఉందనుకోండి, వారికి మూడవ కన్ను కాస్తో కూస్తో పని చేస్తున్నట్టు, ఈ దివ్యశరీరం కాస్తో కూస్తో నిర్మాణం అవుతూ ఉన్నట్టు, వాళ్ళ గురువు అనుగ్రహం చేత వారు కూడా అక్కడికి చేరడానికి అవకాశం ఉంది. ఆ తరువాత స్వామిత్వం సంపాదించుకోవచ్చు. ఈ విధంగా చేరిన వాళ్ళందరి దగ్గర నుండి వారి అనూయాయులు మళ్ళీ జ్యేష్ఠ మాసంలో అందుకుంటారు. అందుకని జ్యేష్ఠ పౌర్ణమి చాలా ముఖ్యం. చైత్ర పౌర్ణమి, వైశాఖ పౌర్ణమి, జ్యేష్ఠ పౌర్ణమి ఇంకొక రెండువందల సంవత్సరములకు చాలా పెద్ద పర్వదినాలుగా, పండుగ దినాలుగా ఏర్పడతాయి. అలాగే శ్రావణపౌర్ణమి అటువంటి పరిస్థితికి వస్తుంది. ఆషాడపౌర్ణమి గురుపౌర్ణమిగా కాక శ్రావణపౌర్ణమి గురుపౌర్ణమిగా విరాజిల్లుతుంది. అలాగే కార్తీకపౌర్ణమి, మాఘపౌర్ణమి. ముందు తరాలలో బాగా పండుగలు చేసుకునే పౌర్ణములు వైశాఖము, శ్రావణము, కార్తీకము, మాఘము. ఈ నాలుగు పౌర్ణములు పర్వదినాలుగా ఏర్పడతాయి. మూడు సోపానములు ఎక్కి కైవల్య స్థితి చేరడానికి పనికొచ్చేట్లుగా ఈ పౌర్ణములు ఉపయోగిస్తాయి. దానికి ప్రాతిపదికగానే మనం పౌర్ణములు ఇప్పుడిప్పుడు కాస్త అవగాహన చేసుకుని, కనీసం ఇది పౌర్ణమి అని తెలియడం కోసం పౌర్ణమి నాడు ఒక ధ్యానం, పౌర్ణమి నాడు ఒక పూజ, పౌర్ణమి నాడు ఇతరములైన పనులు చేయకుండా దివ్యత్వం కోసం ఎదురు చూడడం, దివ్య శరీర నిర్మాణానికి ఆ కాలాన్ని వినియోగించుకోవటం ఇటువంటి కార్యక్రమాలు పరమ గురువులు మనకు అందించారు. గుర్తుపెట్టుకోండి అమావాస్య, మాసశివరాత్రి నుండి చేసే దీక్ష మనలో ఉండే కామశరీరాన్ని దగ్ధం చేస్తుంది. పౌర్ణమి సమయంలో, పౌర్ణమి ముందు నుంచి, పౌర్ణమి తర్వాత వరకు మనం అందుకునే దీక్ష మనలో దివ్యశరీర నిర్మాణానికి దోహదం చేస్తుంది. కాబట్టి ఈ విధంగా పౌర్ణమి, అమావాస్యలు మన జీవితంలో వాటిని సత్యం చేసుకుంటేనే కానీ నిజమైన ఋషిప్రోక్తము, గురుపరంపరామార్గంలో నడవడానికి అవకాశం

లేదు. ఇది జ్ఞానంతో కూడిన యోగమార్గము. అందుకని The cycles of Full Moon and New Moon అనేవి తెలియకుండా, అంటే మాసశివరాత్రులు, పౌర్ణములు, వాటి యొక్క అనుభూతులు పొందకుండా మనలో విచ్చుకోలు రావడం కష్టం. అందుకని ముందు పౌర్ణములతో మొదలుపెట్టుకుని, పౌర్ణమి సందర్భంగా మనం దైనందిన కార్యక్రమాన్ని చక్కగా అమర్చుకుని, వీలున్నంతవరకు దివ్యభావనలో జీవించటానికి ప్రయత్నం చెయ్యాలి. అలాగే మాసశివరాత్రి, త్రయోదశి రాత్రి నుంచి వస్తుంది. అక్కడ నుంచి అమావాస్య వరకు దివ్యమైన భావనలో జీవించడానికి ఎక్కువ ప్రయత్నం చెయ్యాలి. ధ్యానమునకు దైవమునందు మనస్సు నిలపడం కోసం ప్రయత్నం ఎక్కువ చేసుకుంటూ ఉండాలి. ఆ విధంగా మనం వైశాఖమాసంలో ఉన్న వాళ్ళు ఈ గురుపరంపర, ఆ దివ్యపణాళికని మనకి అందించడానికి వారు దైవమునకు సమర్పణ చెందిన స్థితిలో ఉన్నటువంటివారు. అంటే వాహికలుగా నిలబడినవారు 'నందీశ్వరులు' అంటారు. ఈ వాహికలుగా కానటువంటి వాళ్ళు ఎలా ఉంటారయ్యా అంటే బాగా పదార్థముయందు ఆసక్తి కలిగి ఉంటారు. వాళ్ళూ వృషభులే ఎద్దులు. అది నంది అయింది. ఇది ఎద్దు అయింది కదా! నంది ఎందుకు అయిందయ్యా అంటే భగవంతుని యొక్క భావమునకు సమర్పణ చెంది ఉండడం చేత, అదే ఎద్దు నంది అయింది. లేకపోతే ఎద్దు అయింది. ఎద్దుగా ఉన్నప్పుడు ఎట్లా ఉంటుందంటే తన పని తనకు ముఖ్యం. మిగతావాళ్ళు ఏమైపోయినా పర్వాలేదు అన్నట్టుగా ఉంటుంది. Bohemian tendencies అంటూ ఉంటారు. చాలా బండతనం ఉంటుంది మనిషిలో. ఇతరులు ఏమైపోతున్నా తనకి సంబంధం లేదు. తనకు కావలసిన దానికోసం తను అందరి మీద నుండి నడిచి వెళ్ళిపోతూ ఉంటాడు. ఎద్దు చర్మం వీడిది అంటూ ఉంటాం చూడండి. ఎద్దు మీద వర్షం కురిసినట్టే అన్నట్టు ఉంటుంది. ఎద్దు చేలో పడ్డదనుకోండి, అయ్యో ఇది మన చేను కాదు, మనం ఇక్కడ తినకూడదు అనేం ఉండదు. అట్లా పోతుంది శుభ్రంగా అన్ని తొక్కేసుకుంటూ ఉంటుంది తనకి కావలసినది తినేస్తూ ఉంటుంది. అట్లాగే పూర్తా మార్కెట్ లో ఎద్దు ఉందనుకోండి, ఏం చేస్తుంది? లోపలకి గబగబా వెళ్ళిపోతుంది. మిగతావాళ్ళు కొనుక్కుని తీసుకుంటుంటే ఇది వెళ్ళి శుభ్రంగా తినేస్తుంది. రెండు కొడితే తింటుంది. దానికేం పెద్ద తగలదు. కొట్టామని మనం అనుకోవడం తప్ప, దానికి తగిలేదేం లేదు. అట్లా కొంతమంది ఎద్దు మొద్దు స్వరూపాలు మనకి మనుషుల రూపంలో ఉండే వాళ్ళు కనిపిస్తారు. వాళ్ళకి ఇతరుల యొక్క భావాలతో ఏం సంబంధం లేదు. సున్నితత్త్వమనేది ఉండదు. ఉండక ఏదో అట్లా తమకి తోచిందే అన్నట్టుగా పోతూ ఉంటారు. వాళ్ళనీ వీళ్ళనీ ఎంతోమందిని బాధపెడుతూ ఉంటారు. ఇట్లా బాధ పెట్టడానికి కారణం ఏమిటయ్యా అంటే వాళ్ళలో బలీయమైన ఒక కోరిక, అది నిర్వర్తించుకోవడమే ముఖ్యం. మిగతావేవీ ముఖ్యం కాదు. తన కోరికను తాను నిర్వర్తించుకోవడమే తప్ప, దీనివలన ఇతరులకి ఎటువంటి స్పందన కలుగుతుంది అనే భావన లేదు. తమ భావమే తమది. తమ ఆరోగ్యం, తమ ఆయుష్షు, నేను, నావాళ్ళు ఇంతే ఇంతకన్నా ఏమీ లేదు. దాని చుట్టూయే మొత్తం అంతా అల్లుకుని పరమ భౌతికంగా, పదార్థమయమైనటి జీవితం జీవించేటటువంటి వాళ్ళని కూడా, వృషభరాశిలోనే కనిపిస్తారు ఎద్దులల్లే. అందుకని

పదార్థం వైపు బాగా మొగ్గి ఉన్న స్థితిలో మనుషులు ఎద్దులుగా ఉంటారు. పరమార్థం వైపు బాగా వంగియున్న నంది కూడా మనకి వృషభరాశిలోనే గోచరిస్తూ ఉంటుంది. రెండూ అక్కడే ఉంటాయి. మనకి మన వాఙ్మయంలో చెప్పే అత్యంత విశేషమైన విషయం ఏమిటయ్యా అంటే పెద్ద వెలుగు దగ్గరే పెద్ద చీకటి అని. నంది ఉన్న చోటే ఎద్దు కూడా ఉంటుంది. అసలు ఎద్దేగా నంది అయింది. అటు తిరిగితే నంది ఇటు తిరిగితే ఎద్దు. శరీరం వైపు జీవుడు, శరీర ఆవశ్యకతల వైపు, శరీర సంబంధితమైన విషయములయందు బాగా ఆసక్తి కలిగి ఉన్నాడు అనుకోండి ఎద్దు అన్నమాట. శరీరానికి ఏం కావాలో అనేకదా లేచిన దగ్గర నుండి ఆరాటం అందరికీ. ఆ శరీరం ద్వారా ఏర్పడిన బంధుత్వాలు ఉంటాయి కదా! అది శరీర బంధుత్వమే తప్ప, ఆత్మబంధుత్వం కాదు కదా! శరీర బంధుత్వం బంధనానికి దారితీస్తుంది, ఆత్మబంధుత్వం కూడా అందులో ఇమిడి ఉంటే తప్ప. మాస్టరు గారి నాన్నగారిని 'తాతగారు' అంటుండేవాళ్ళం. ఆయన ఎప్పుడూ మనమంతా 'ఆత్మబంధువులమోయ్' అనేవారు. బంధువులం కాదు కానీ, ఆత్మబంధువులం. 'కాదూ మనము బంధువులం కానీ ఆత్మబంధువులం' అని సత్తిబాబు పాటలో రాశాడు. ఆత్మబంధుత్వం ఎట్లా ఉంటుందంటే ఒకరికొకరు పీడించుకునేట్టుగా ఉండదు. ఒకరికొకరు సహకరించుకునేట్టుగా ఉంటుంది, స్వచ్ఛందంగా. బంధుత్వం ఎట్లా ఉంటుందంటే కొంత పీడ ఉంటుంది. అమ్మో వచ్చాడురా వీడు ఎప్పుడు వెళ్ళిపోతాడు అన్నట్టుగా ఉంటుంది. ఇంటికి స్నేహితులు వచ్చిన దానికి, బంధువులు వచ్చిన దానికి చాలా తేడా ఉంటుందండీ. బంధువు కొన్ని demands పట్టుకుని వస్తాడు. హక్కులుంటాయి బంధువులకి కదా! స్నేహితులకి బాధ్యతలుంటాయి. బాధ్యతపడే బంధువున్నాడనుకోండి ఆనందంగా రప్పించుకుంటాము. హక్కులు కోరే బంధువులు వచ్చారనుకోండి, ఎప్పుడు పోతాడా అని చూస్తూ ఉంటాం కదా! అది మనకి కనిపించేది. ఇంటికి ఒకడొస్తున్నాడంటే లోపల గుండె గుభేలు మంటుంది. ఎందుకంటే వాడు వచ్చిన దగ్గర నుండి రకరకాల కోరికలు కోరుతూ ఉంటాడు. ఒక్కొక్కడు వస్తున్నాడు అంటే ఎప్పుడొస్తాడా వీడు, వీడొస్తే బావుంటుందన్నట్టుగా ఎదురుచూస్తూ ఉంటాము. ఎందుకంటే వచ్చిన దగ్గర నుండి ఏదో ఒకటి చేసి పెడుతూ ఉంటాడు కదా! రెండు రకాలు. మనకి 'వృషోత్సర్జనము' అనేది గరుడోపాఖ్యానంలో వస్తుంది. మామూలుగా మనుషులు పోయినప్పుడు చదువుకుంటారు పది రోజులు పాటు. వృషోత్సర్జనము అంటే మన యొక్క చేతన అంతా కూడా అధోముఖంగా మనస్సు, ఇంద్రియాలు, శరీరం నుంచి బయటికి పోతూ ఉంటుందిగా, అట్లా పోకుండా దానిని ఆనకట్ట వేసి ఊర్ధ్వముఖంగా పంపించడము. అదే ఎద్దుని ఆంబోతు చెయ్యడం. ఎద్దుని ఆంబోతు చేస్తే అది ఇంక పిల్లలు పుట్టించడానికి పనికిరాదు. ఆంబోతు చేసిన తర్వాత దాన్ని 'దేవుడికి సమర్పింపబడ్డది' అని చెప్తారు. ఇవన్నీ మన యోగసాధనలో భాగాలని ఎద్దులమీదా, కుక్కలమీదా వాడేసి వాటిని పాడు చేసుకుంటున్నాం. పాపం దానికి ఆ విధంగా చెయ్యడంవల్ల, ఎలాగూ ఊర్ధ్వముఖంగా వెళ్ళి ఆజ్ఞా చక్రంలో నిలబడే పరిస్థితేం ఎద్దుకి లేదు. ఏం అనుకోబోకండి ఇట్లా అన్నానని. ఎద్దు కూడా ఏమీ అనుకోదు. ఎద్దులాంటి మనిషికే లేదు కదా! ఎద్దుకెట్లా వస్తుందండీ ఆత్మజ్ఞానం?

ఒరేయ్ నిన్ను నువ్వు ఆ విధంగా ఊర్ధ్వగతికి పంపించుకో, నీలో ఉండే వీర్యం అంటే మనలో ఉండే శక్తి ప్రవాహము అధోముఖంలో వస్తే వీర్యం అవుతుంది. ఊర్ధ్వముఖంగా వస్తే వెలుగు అవుతుంది. అంతే. అది అట్లా మన ఒంట్లో ఇంతింత ద్రవం నిలువ ఉండదు కదా. భావం చేత ఇటు liquid గా వస్తుంది. భావం చేత అటు వెలుగుగా వస్తుంది. అంతే! ఇటు వెళుతోందా ప్రవాహం అటు వెళుతోందా అని. అందుకని ఉత్తరవాహినిలో స్నానం చేస్తే పుణ్యమంటాం కదా! గోదావరి ఇక్కడ ఉత్తర వాహినిట అమ్మా, ఇక్కడ మనం స్నానం చెయ్యాలి అంటాం. అక్కడ కాదు చేయాల్సింది స్నానం. అక్కడ ఎన్ని చేసినా లోపల బుద్ధులు మామూలుగానే ఉంటాయి కాబట్టి ఏమీ కాదు. అట్లాగే ఉంటారు. నీలో ఉత్తరవాహినిగా ప్రవహిస్తోంది పింగళ. దక్షిణవాహినిగా ప్రవహిస్తోంది ఇడ. ఇడగా ప్రవహించే దాంట్లో వెళుతుంటే, ఈ విధంగా ఎద్దులవుతుంటే ఏం చేశారంటే, వృషోసజ్జనము చేసుకున్నవాడు భగవంతుడికి సమర్పణ చెందినట్టు అవుతుంది. అప్పుడు వాడు పుణ్యలోకాలలోకి వెళతాడనేసరికి, అమ్మ! బావుందిరా అని చెప్పి ఊళ్ళో ఎద్దులన్నీ పట్టుకుని, వాటి వృషణాలన్నీ కూడా (వృష అనే శబ్దంలో నుండి వచ్చిందే వృషణము) శుభ్రంగా sieze చేసి, అందుకు పనికిరాకుండా చెయ్యడం చేత, అదేదో దేవుడికి సమర్పించిందని చెప్పి, దాన్నేమో ఇహ ఊళ్ళో అచ్చోసిన ఆంబోతని, అది ఎక్కడైనా తినొచ్చు, ఏమైనా తిరగచ్చు, అది తింటే దేవుడు తింటున్నాడనుకుని మనం వదిలెయ్యడం, ఇటువంటివి ఏవో సాంప్రదాయాలు. అవి వదిలెయ్యండి. అవి అలా కొన్ని వచ్చినాయి. కానీ నిజంగా మనం ఎద్దుల స్వభావం కలిగిన వాళ్ళం. ఏదీ? శరీరంలో బందీకృతులైన జీవులు, శరీరావశ్యకతల యందు ఎక్కువ జీవిస్తున్న జీవులు, శరీర సంబంధితమైన విషయములయందు మాత్రమే ఆసక్తి కలిగిన జీవులు వారందరూ కూడా ఈ విధంగా వృషోసజ్జనము చేసుకోవాలి. అదీ గరుడోపాఖ్యానంలో చెప్పే ముఖ్యమైన రహస్యం. చేసుకుంటే ఏం జరుగుతుందంటే ఈ చేతన అంతా కూడా గంగ ఎప్పుడూ చదువుతూ ఉంటా ఆ పద్యం

ఆకాశంబున నుండి, శంభుని శిరంబు అందుండి, సుశ్లోకంబైన హిమాద్రి
నుండి భువి, భువినుండి పాతాళంబును చేరే గంగా కూలంకష పెక్కురీతులు
వివేకభ్రష్ట సంపాతముల్

అన్నాడు భర్తృహరి. అంటే అక్కడెక్కడ నుండో బయలుదేరి వస్తోందిటండీ. రోజూ మనకు అదే జరుగుతుంది. ఆలోచన వస్తుంది, అది ఇంద్రియాలను పనిచేయిస్తుంది, అక్కడ నుంచి శరీరాన్ని పనిచేయిస్తుంది, అక్కడ నుండి బయట విషయాలు ఏరుకోవడంలో అట్లా పోతూ ఉంటుంది పోతూ ఉంటుంది. పైనుంచి వచ్చేదంతా ఇట్లా ధారపోసేసరికి సాయంత్రం అయ్యేసరికి నీరసమై పడిపోతాం. అందుకని నిద్ర కావాలి. అట్లా గంగానది ఊర్ధ్వగతి నుండి అధోగతికి ఏ విధంగా వెళ్ళిపోతోందో చూడండి, అట్లా పైనుంచి ఇట్లా భౌతికమైన విషయములలోకి వెళ్ళిపోయే వాళ్ళు 'వివేకభ్రష్ట సంపాతముల్' అని చెప్పారు. వివేకం కోల్పోవడం చేత ఈ విధంగా బయటకు పరుచుకునిపోయి, తమ్ము తాము నీరసం చేసుకుని వివశులైపోయి, నిర్వీర్యులైపోయి, పదార్థమయులైపోయి, పరమార్థానికి మూత వేసేసుకుంటారు. వాళ్ళు ఎద్దులు. ఆ ఎద్దు మొద్దు స్వరూపానికి ఉండేది కేవలం కామమే. ఈ కామాన్ని

మనం ఒక అద్భుతమైన దివ్యశక్తిగా మలుచుకోవచ్చు. ఇది మనకి పెద్దలు ఇచ్చిన యోగమార్గం. కామం ఎలాగూ నీ దగ్గర ఉన్నది కాబట్టి అది సద్విషయములయందు వినియోగించావనుకో, ఇంత బలీయమైన కోరిక సద్విషయములయందు నువ్వు కనుక కేంద్రీకృతం చేస్తే, ఉన్ముఖం చేస్తే బుద్ధుని వలే తయారవుతావు. బుద్ధుడు అంత బండగా దానిని నిర్వర్తించాడు. అందుకనే బుద్ధుని మార్గాన్ని 'వృషభమార్గము' అన్నారు. వృషభమార్గము అనడానికి కారణం ఏమిటంటే, ఋషభుడు అనే వాడు మొట్టమొదట ఇట్లా అతిభీకరంగా తనకుండే బలీయమైన కామాన్ని దైవము మీద లగ్నము చేసి, మిగతా వాటిని లెక్కపెట్టకుండా తనని తాను హింసించుకుంటూ, అంటే హింసించుకోవడమంటే శరీరానికి కావలసినవి కూడా అన్నీ నిర్లక్ష్యం చేసి, అట్లా సుర సుర సుర సుర సురా మండుకుంటూ తీసుకెళ్ళిపోతాడు ఊర్ధ్వగతికి. అది కొంత భాధాకరమైన మార్గం. కేవలము సంకల్పబలం చేత సమస్తాన్నీ కాదని ముందుకు నెట్టుకు వెళ్ళిపోయిన మార్గం, అటువంటి మార్గం వృషభమార్గం. ఆ మార్గంలోనే తరించిన వాడిని తథాగతుడైన బుద్ధుడు, గౌతముడు, సిద్ధార్థుడు అంటారు. ఆయన పుట్టింది కూడా వృషభమాసంలోనే. వైశాఖమాసంలో కదా పుట్టాడు. వైశాఖపౌర్ణమి నాడే కదా బుద్ధుని యొక్క పౌర్ణమి మనం చేసుకుంటాం. అంటే ఇంత భయంకరమైన ఎద్దు కూడా అంత అద్భుతమైన పద్ధతిలోకి దూసుకు వెళ్ళడానికి ఒకటే ఒకటి చెప్తాడు బుద్ధుడు. నీకు ఎంత బలీయమైన కోరిక కలిగి నువ్వు భౌతిక లోకములలో పనిచేస్తున్నావో, అంత బలీయమైన ఆరాటం దైవం విషయంలో పడితే, దాని యందు పడ్డ దాని కన్నా దీనిలో పడటం వలన తొందరగా మనకి గమ్యం చేరుకోవడానికి అవకాశం ఉంది. ఇచ్చినవన్నీ కూడా భగవత్ సృష్టిలో సమస్తము దివ్యమైన శక్తులే. దేనికి వినియోగిస్తావనేది ముఖ్యం. నీ దగ్గర పదవి ఉన్నది, నీ దగ్గర ధనము ఉన్నది, నువ్వు దేనికి వినియోగిస్తావో దానిని బట్టి నీకు ఊర్ధ్వగతో, అధోగతో ఉంటుంది. అంతేకానీ వాటికి ప్రత్యేకంగా వీటివల్ల బాగుపడతారు, వీటి వల్ల చెడిపోతారనేం లేదు. ధనం వల్ల పాడైపోతారనేదేం లేదు. సంస్కారవంతుల చేతిలో ధనము వలన అత్యంత ఉత్తమమైన విషయాలు జరుగుతూ ఉంటాయి. సంస్కారహీనుడి చేతిలో ధనమే వాడిని నాశనం చేసేస్తుంది. కానీ అది వాడి సంస్కారంతో సంబంధించింది తప్ప, ధనంతో సంబంధించినది కాదు. అలాగే పదవి కూడా. సంస్కారవంతుని చేతిలో పదవి పదివేల మందికి ఉపయోగపడేట్టుగా నిర్వర్తింపబడుతుంది. సంస్కారహీనుని చేతిలో వాడిని వాడు నాశనం చేసుకున్నట్టుగా తయారవుతుంది. అందుకని మనస్సు కానీ, ఇంద్రియములు కానీ, మనకు ఉన్న కామము గానీ ఇవన్నీ దుష్టవిషయములని చెప్పేవాళ్ళు తెలియని వాళ్ళు. ఋషిప్రోక్తమైన మార్గములో మనస్సుని అవగాహన చేసుకోవడం, ఇంద్రియములను అవగాహన చేసుకోవడం, శరీరాన్ని అవగాహన చేసుకోవడం ద్వారా వాటిని సద్విషయములయందు కనుక మరలించినట్లయితే అద్భుతంగా ముందుకు పోవడానికి అవకాశం ఉంటుంది. అందుకనే వృషభరాశిలో అటు భయంకరమైన ఎద్దులాగా తయారు కావచ్చు, ఇటు నంది లాగా తయారు కావచ్చు. నీలో కోరిక ఉన్నది కదా ఆ కోరికను సద్విషయములయందు నువ్వు లగ్నం చెయ్యి. అంటే జీవితంలో ఒక ఉన్నతమైన

ఆశయాన్ని ఏర్పరచుకో. ఏర్పరచుకుని ఆ ఆశయం సిద్ధి కోసం నువ్వు పని చేస్తూ ఉండు. From Desire to Aspiration అంటారు. కోరికలు ఉండవచ్చు మనకి. ఏది? పరమ గురువులు చూస్తే బావుండు, మాస్టరు గారు కనిపిస్తే బావుండు, వైశాఖలోయలో జరిగే సమావేశానికి మనం వెళ్తే బావుండు, సి.వి.వి గారిని మన నీలగిరిలో అగస్త్యాశ్రమంలోచూస్తే బావుండు అని ఇట్లా అది కోరిక. కోరికకి తీవ్రమైన ఆచరణ జోడు చేశామనుకోండి, అప్పుడు అది ఆశయమవుతుంది. Aspiration అవుతుంది. అది తపస్సుగా మారాలి. కోరిక తపస్సు అవ్వాలి. ఏ పని చేసినా సరే. డబ్బు సంపాయిద్దాం అనుకున్నామనుకో తప్పులేదు. డబ్బు సంపాయించుకుంటే నిన్ను పోషించుకోవడానికి, నీకుటుంబాన్ని పోషించడానికి, ఇంకా వీలుంటే ఇంకో పదిమందిని పోషించడానికి నువ్వు డబ్బు సంపాదిస్తే తప్పేమిటిట? తప్పేంలేదు. కానీ దానియందు కేవలం కోరిక ఉంటే లాభం లేదు. అది తీవ్రతరమై తపస్సు రూపం ధరిస్తే దాంట్లో నుంచి పుడుతుంది సమస్తం. మొత్తం అంతా సంకల్పంలోంచి పుట్టాల్సిందే. సంకల్పానికి బలం ఎక్కడనుంచి వస్తుంది? నువ్వు ఇచ్చే తీవ్రతను బట్టి వస్తుంది. అటువంటి తీవ్రతను కల్పించావనుకో ఏ విషయంలో అయినా సరే, కల్పిస్తే అది అక్కడ సిద్ధిస్తుంది. అందుకని సంకల్పంలో బలం బాగా గట్టిగా ఉన్నవాడు అది ఇటు వినియోగిస్తే ఇహలోకానికి సంబంధించినవన్నీ సిద్ధిస్తాయి. అటు వినియోగిస్తే పరలోకానికి సంబంధించినవన్నీ సిద్ధిస్తాయి. దేనియందు నువ్వు లగ్నం చేస్తావనేది నీకు సంబంధించిన విషయం. కాబట్టి కోరిక ఆశయంగా, aspiration గా మారితే, అక్కడ నుండి అది దివ్యసంకల్పంగా మారుతుందిట. దివ్య సంకల్పముగా మారి, ఊర్ధ్వగతికి చెంది, ఎంత ప్రజ్ఞ ఊర్ధ్వగతి చెందింది అంటే ఈతరం మానవజాతికి సంబంధించిన వాళ్ళలో అత్యంత ఉత్తమమైనవాడుగా మైత్రేయుడుని గుర్తిస్తాడు శ్రీకృష్ణుడు. గుర్తించి తన యందు ఉన్న సమస్తమైన ప్రజ్ఞను అతనియందు ప్రవేశపెడతాడు. ఈతరం మానవజాతి సంగతి చెబుతున్నా గుర్తుపెట్టుకోండి, అప్పుడు ఇప్పుడు ఎప్పుడూ ఒకటే తరం లేదు. తరంగాలు తరంగాలుగా మానవజాతి వస్తోంది వెళ్ళిపోతోంది ఊర్ధ్వలోకాల్లోకి. ఈ తరానికి సంబంధించిన వాళ్ళలో ఉత్తమ మానవుడిగా గుర్తించినది శ్రీకృష్ణుడు మైత్రేయుడ్ని. అటువంటి ఉత్తమమైనట్టి, జగద్గురువైనట్టి మైత్రేయుడి కన్నా కూడా ముందుకు ఊర్ధ్వలోకాలలోకి దూసుకు వెళ్ళిపోయిన ప్రజ్ఞ గౌతమబుద్ధుడు. అది ఎలా అతనికి వీలుపడ్డదంటే కేవలము తన యందు ఉండే ఆ సంకల్పబలం చేత అట్లా దూసుకుంటూ ముందుకెళ్ళిపోయాడు. అది వృషభమార్గము. ఇక్కడ అంటే వృషభమాసమని మనం చెప్పుకున్నప్పుడల్లా గుర్తుపెట్టుకోవలసినది ఏమిటయ్యా అంటే సంకల్పబలము! సంకల్పబలం బాగా పదార్ధమయమైన విషయములలో, స్వార్థమైన విషయాల్లో ఉన్నప్పుడు కోరికగా ఉంటుంది. పరమార్ధమైన విషయములలో ఉన్నప్పుడు సంకల్పబలాన్నే ఇచ్ఛాశక్తి అంటారు లేక పార్వతీదేవి అంటారు. చూడండి అక్కడ పార్వతి ఇక్కడకొచ్చేసరికి మనకి కోరిక అయిపోయింది. కామేశ్వరి కదా ఆమె. ఎటు మనం దానిని వినియోగిస్తామనేది మనకి తెలిసి వుండాలి. తెలిసి ఉంటే ఆ విధంగా మనం ఊర్ధ్వగతికి చొచ్చుకుని వెళ్ళచ్చు. అందుకని బుద్ధుడు చెప్పిన మొట్టమొదటి బోధ

ఏమిటయ్యా అంటే, 'ఫలితం యందు బుద్ధి పెట్టకుండా అత్యంత కాముకుడు పని చేసినట్టుగా పనిచెయ్యి. అట్లా నువ్వు చేశావంటే నీకు తప్పక లభిస్తుంది' అని చెప్తాడు. ఈ రోజున బుద్ధుడు 'వృషభాక్ష' అనే భగవత్తత్త్వానికి ప్రతీకగా ఈ భూమికి నిలిచియున్నాడు. అందుకని వృషభాక్షుడంటే మనం ఇప్పుడు చెప్పుకోవాల్సింది ప్రస్తుతం, అంటే ఈ విష్ణుసహస్రనామం భీష్ముడు చెప్పినప్పుడు ఇంకా అప్పటికి గౌతమ బుద్ధుడు లేడు. తరువాత వచ్చిన వాడు, వచ్చి ఎంత ఎదిగాడంటే జగద్గురువైన మైత్రేయునికి, ఆపైన ఉండే లోకాలకి మధ్య తాను వాహికగా నిలబడి, మైత్రేయుడికి అందిస్తుంటే, మైత్రేయుడి దగ్గర నుండి మిగతావాళ్ళు అందుకుంటున్నారు. మైత్రేయుడు, మరువు, దేవాపి వాళ్ళు ముగ్గురు కలిసి ఒక త్రిభుజంగా ఏర్పడి అందుకుంటే, ఆయన్నుండి మిగతా వాళ్ళంతా అందుకుంటూ వుంటే అక్కడ నుండి మనకి జ్యేష్ఠమాసంలో వారి వారి అనుయాయులు భూమి మీద ఉండే వాళ్ళందరూ నూట నలభై నాలుగు వేలమంది ఉన్నారు దివ్యశరీరాలతో ఉన్న వాళ్ళు. మనకి తెలిసినది ఎంతమంది? ఇదే maximum అనుకుంటే, లక్షా నలభై నాలుగు వేల మంది దివ్యశరీరములు నిర్మాణం చేసుకున్న వాళ్ళు మైత్రేయుని పరంపరలో శిష్యులుగా ఉన్నవాళ్ళు ఉన్నారు. వాళ్ళందరూ ఎన్నోరకాల కార్యాలు చేస్తున్నారు. అందరూ ఉపన్యాసాలే చెప్పట్లా. కొంతమంది బోధ చేస్తున్నారు. కొంతమంది రాజ్యాలను నిర్వర్తిస్తున్నారు. కొంతమంది ఆర్థికమైన సంస్కరణలు చేస్తున్నారు. కొంతమంది నాగరికమైన సంస్కరణలను చేస్తున్నారు. మరి కొంతమంది విద్యకి పనిచేస్తున్నారు. మరికొంతమంది మతములలో మార్పులు తీసుకురావడానికి పనిచేస్తున్నారు. ఇంకొంతమంది శాస్త్రములలో పనిచేస్తున్నారు. ఇట్లా పదిరకాల విషయాల్లో పని చేస్తున్నారు. అందరికీ ఇట్లా photos పెట్టుకుని పూజలు చేసుకునే పద్ధతి ఉండదు. రెండవ కిరణం, ఆరవ కిరణం వాళ్ళకే ఈ గోల. Second ray, Sixth ray అంటాం. అందులో రెండవ కిరణం వాళ్ళ కన్నా ఆరవ కిరణం వాళ్ళకి ఈ గోల చాలా ఎక్కువగా ఉంటుంది. మనుషులని అక్కడ దేవుళ్ళు చేసి పటాలు పెట్టుకుని ఊరికే భజనలు చేసుకుంటూ ఉంటారు. వాళ్ళు ఒక్కళ్ళ వల్లే పనులు అవటంలా నిజానికి. వాళ్ళ వల్ల ఏం జరుగుతుందంటే వాళ్ళేదో పిచ్చి పనులు చెయ్యకుండా ఇందులో ఉన్నారు. అంతవరకు పనికొచ్చింది. సత్యసాయిబాబా గారి దగ్గరకు ఒకసారి ఒకాయన వెళ్ళి 'ఏమండీ మీ చుట్టూ చాలా black marketeers, black money holders వీళ్ళంతా చేరారు, వీళ్ళందర్నీ చేర్చుకున్నారేమిటంటే', 'అవునయ్యా నాచుట్టూ ఉండటం వల్ల మీరంతా బ్రతికిపోయారని' చెప్పాడాయన. 'నా చుట్టూయే వీళ్ళు లేకపోతే మిమ్మల్ని తినేసేవాళ్ళు కదా! ఈ కాసేపైనా ఇక్కడ ఉండటం వల్ల మీరు సుఖపడ్డారు కదా' అని చెప్పారాయన చాలా నవ్వుతూ. ఆయన చాలా హాస్యంగా మాట్లాడతారు. ఆరవ కిరణంలో ఉండే వాళ్ళు ఎక్కువ గురువులుగా చలామణి అవుతూ ఉంటారు. ఇప్పుడు మరువు, దేవాపికి ఏమున్నాయి స్తోత్రాలు? గుడులు ఏమున్నాయండీ? దేవాపి మహర్షి మైత్రేయుడి తరువాత మైత్రేయుడంతటివాడు. ఈ గుడులు, భజనలు, ఫోటోలు పెట్టించుకోవడాలు ఇవన్నీ ఎప్పుడో వందల సంవత్సరముల క్రితం, వేల సంవత్సరముల క్రితం దాటిపోయారు వాళ్ళు. ఏసుక్రీస్తుకి శిలువ వేసి, అట్లా గుడులు

కదుతూ ఉంటే వాటిని చూసి దేవాపి నవ్వుతూ 'ఏమిటోయ్ ఇట్లా అయింది నీ పరిస్థితి' అంటూంటాడుట. అవన్నీ వాళ్ళకి పిల్లాటలుగా ఉంటాయి. ఆ పరంపరలో ఉండే వాళ్ళు లక్షా నలభై నాలుగు వేల మంది, రకరకముల కార్యక్రమములు, లోకహితమైన కార్యక్రమములలో ఉన్నారు. గుర్తింపు వాళ్ళకి అక్కర్లేదుట. గుర్తింపు ఎంతసేపూ మతంలో ఉంటే వస్తుందండీ. ఒక Einstein photo పెట్టుకుని ఎవరైనా ప్రార్థన చేసుకుంటారా? ఆయన కూడా మహాత్ముడే. ఎందుకు చేసుకోలేరు? విమానం కనిపెట్టిన వాడి photo పెట్టి ఎందుకు ప్రార్ధన చేసుకోరు? మరి ఇవాళ America వెళ్లాలంటే మీ అబ్బాయి, మీ అమ్మాయి, మీ అబ్బాయి మీ అమ్మాయిని చూడాలంటే మీరూ సులభంగా వెళ్ళి వస్తున్నారే. మరి ఆయనకి దండం పెట్టద్దూ? ఆ విమానం కనిపెట్టిన ఆయనకి. Teloevision అక్కడిది ఇక్కడికి చూపించేది, ఇక్కడిది అక్కడికి చూపించేది చేసినవాళ్ళున్నారే వాళ్ళకి దండం పెట్టద్దూ? పెట్టాలా? ఎందుకు పెట్టరు? తెలియక. నిజంగా ఋషులు శాస్త్రంలో పుట్టి, శాస్త్రాన్ని అభివృద్ధి చేసి, మానవ జీవితాన్ని ఎంత పురోభివృద్ధి కావించారు ఈ వంద సంవత్సరాల్లో? మీకు radio దగ్గర నుండి television దగ్గర నుండి, electronics ఇట్లా కూర్చుని మనం కదలకుండా నొక్కుతుంటే అన్నీ మారిపోతున్నాయి అన్నిచోట్లా. ఇంకా మన ఊరు వస్తాయి కొత్త కొత్తగా ముందు ముందు. మన ఇంట్లో కూర్చుని అట్లా నొక్కితే గేటు తెరుచుకుంటుంది. అట్లా నొక్కితే గేటు మూసుకుంటుంది. కాబట్టి ఊర్ధ్వగతి కలిగిన వాళ్ళు, ఊర్ధముఖంగా ఉన్ముఖులైన వాళ్ళు, ఆశించేది ఈ మూడవకన్ను. అది కావడం చేత ఊర్ధ్వలోకాల నుండి వారికి సమస్తమైన విషయాలు అందుతూ ఉంటాయి. అందడం చేత వారి కార్యక్రమాలు వారు భూమి మీద నిర్వర్తిస్తూ ఉంటారు. వారందరినీ కూడా 'వృషభులు' అని పిలుస్తారు. ఏ వృషభులు? మొదటి తరగతి వృషభులు అంటే నందీశ్వరులన్నమాట. వారియందు ఉండే అక్షము లేక కన్నుగా భగవంతుని దర్శనం చెయ్యడం ఈ నామంలో ఉండే అర్థం. అది ఉండడం చేతే ఊర్ధ్వలోకాల్లోంచి అధోలోకాల్లోకి, అధోలోకాల్లోంచి ఊర్ధ్వలోకాల్లోకి ఒక చక్కటి మార్గం ఏర్పడి ఉన్నది. ఆ మార్గం గుండానే అత్యంత ఉత్తమమైన లోకాల్లోంచి, మన లోకాల్లోకి వెలుగు రావడానికి అవకాశం ఏర్పడుతుంది. శ్రీకృష్ణుడు రోహిణి నుండి దిగిరావడం అంటే అదే అర్థం. ఇంకో నక్షత్రంలోంచి దిగి రావడానికి వీలు లేదు. ఈ లోకాలలోకి రావాలంటే ఆ కన్నులోంచి దిగి రావాలి. మొత్తం సృష్టికి అది కన్ను. అవతల ఉండే అవ్యక్తమైన తత్త్వం ఈ వ్యక్తమైన లోకాల్లోకి దిగి రావాలంటే, ఏడు లోకాల అవతల ఉన్న తత్త్వం కదా శ్రీకృష్ణతత్త్వం. పూర్ణ పురుషుడు, పురాణ పురుషుడు. ఆయన దిగిరావడానికి రోహిణే ఎందుకు ఎన్నుకోవాల్సి వచ్చిందంటే ఇక్కడ ఉన్నది దానికి సంబంధించిన ఒక రహస్యం. ఇంకొక నక్షత్రం ద్వారా దిగిరావడానికి వీలులేదు. ఎందుకంటే అది ఒక్కటే ఊర్ధ్వలోకాల నుంచి దారి. మనలో కూడా భగవత్తత్త్వము ఆజ్ఞాకేంద్రాన్ని అవగాహన చేసుకుని, దాని యందు జీవిస్తున్న వాడికి మాత్రమే భగవంతుని తత్త్వము అనుభవం అవుతుంది. అంతవరకు అనుభవం అవదు. అందుకని సమస్తమైన ధ్యానములు కూడా భ్రూమధ్యంలో చేసుకోమని చెప్పడం కూడా. 'వృషభాక్ష' అంటే భగవంతుడు మనలో ఆ కన్నుగా ఉన్నాడు. దారిగా కూడా

ఉన్నాడన్నమాట. భగవత్తత్త్వము, భగవత్తత్త్వాన్ని అందించే మార్గంగా కూడా మనలో ఉన్నాడు. సృష్టిలో ఉన్నాడు. అదీ 'వృషభాక్ష' నామం.

## 619 వృషప్రియః

అంటే ఈ విధంగా ఏర్పడిన వాళ్ళు ఉంటారే వాళ్ళందరికీ ఆయన ఇష్టుడు. ఆయన వాళ్ళకి ఇష్టమైన వాడు. అది ఆ నామానికి అర్థం. ఎద్దులంటే ఇష్టమండీ! అందుకనే కృష్ణుడు దిగివచ్చినప్పుడు ఆవులని, ఎద్దులని బాగా చక్కగా చూసుకున్నాడు కదా! ఆ మందలో ఎంతసేపూ వాటికి ఆయన గానం వినడం, ఆయన వాటి యందు శ్రద్ధ, భక్తి, పరిరక్షణము కలిగియుండడం ఇటువంటివి మనకి గోచరిస్తాయి. దానికి మనం చెప్పకునే అర్థం ఏమిటయ్యా అంటే మనవరకు సాధన పరంగా ఆ విధమైన భావన కలిగిన వాళ్ళందరికీ కూడా, అంటే సిద్ధ పురుషులకి ఆయన రక్ష. ఆయన ప్రియుడు. సిద్ధ పురుషులకి ఆయన ప్రియుడు ఆయనకి సిద్ధ పురుషులు ప్రియులు. అది మనకి వృషప్రియః అనే నామం నుండి అవగాహన చేసుకోవచ్చు. మనకు ఇదివరకు వచ్చింది వృషాకపి అనేచోట. అప్పుడు వృషాకపి అంటే, వృష అంటే అటు నుంచి దిగివచ్చే తత్త్వమని. కపి అంటే ఇటు నుంచి పైకివెళ్ళే తత్త్వం అని చెప్పాను. 'వృషాకపి రమేయాత్మా' అని. అదేవిధంగా ఇక్కడ మనకి వృషభం తీసుకున్నప్పుడు అటు నుండి ఈ విధంగా దిగి వచ్చిన తత్త్వము, దానికి ఏర్పడిన ద్వారము. ఆ ద్వారాన్ని ఆధ్యాత్మికంగా మూడవ కన్నుగా లేక వైద్యపరంగా pineal gland, యోగపరంగా ఆజ్ఞాకేంద్రము అంటారు. అది మూసుకుపోవడానికి కారణమేమిటంటే, మానవజాతి బాగా భౌతికమవడమే! బాగా భౌతికమైన విషయములందు ఆసక్తి. ఈ రోజున కవిత్వం అంటే ఎవరికి ఆసక్తి ఉంది? ఎవరికీ లేదు. చిత్రలేఖనం అంటే ఆసక్తి ఉందా? లేదు. సూర్యోదయమంటే ఆసక్తి ఉందా? లేదు. ప్రకృతి రమ్యమైన దృశ్యాలంటే ఆసక్తి ఉందా? లేదు. ఎందుకు లేదు? అవన్నీ ఇంతకన్నా మంచి విషయాలు. ఇంతకన్నా సూక్ష్మమైన విషయాలు మనం రోజూ చేసే పనుల కన్నా. వాటి యందు ఆసక్తి కలగడం అనేది, ఆ రకమైన సంస్కారం ఉండే వాళ్ళకి వస్తుంది. వ్వాళ్ళకి సూర్యోదయం ముఖ్యము పొద్దున్నే కాఫీ తాగడం కన్నా. మనకి కాఫీ ముఖ్యము సూర్యోదయం కన్నా అట్లా ఉంటుంది. అందుకని emphasis మనలో ఉండేటి, కేంద్రీకృతమైనట్టి విషయములు భౌతికమైన వాటికన్నా కొంత 'అధిదైవికము' అయి ఉండాలి. భౌతికం నుండి దివ్యమైన విషయములయందు ఆసక్తి కలుగుతున్న కొద్దీ మనలో మూడోకన్ను తెరుచుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది. దీనికి సంబంధించిన సమస్తమైన చరిత్ర Madam Blavatsky చాలా చక్కగా వివరించారు Secret Doctrine అనే పుస్తకం లో. ఎందుకు మూసుకుపోయింది? ఎట్లా తెరుచుకుంటుంది? మూసుకుపోవడానికి కారణం ఏం లేదు. మనకి బాగా పదార్థం మీద మోజు పుట్టింది. తెరుచుకోవాలంటే 'పరమార్థం' మీద మోజు పుట్టాలి. చాక్షుష మన్వంతరంలో ఆ విధంగా మానవులు ఎక్కువ దివ్యత్వంలో జీవిస్తూ ఉండేవాళ్ళు కాబట్టి వాళ్ళకి అది ఉంది. వైవస్వతమన్వంతరంలో మనమిప్పడు పదార్థమయ లోకాన్ని బాగా అల్లుకున్నాం. కాబట్టి ఈ విధంగా ఉన్నాము. అందుకని ఈ నామం ద్వారా మనం ఊర్ధ్వగతికి చెందడానికి ఎక్కువ సాధనగా భగవత్తత్త్వం మనకి అట్లా

గోచరిస్తుంది. మార్గంగా తానున్నాడు. పరమార్థానికీ పదార్థానికీ మధ్య అట్లా మార్గంగా ఏర్పడిన వాళ్ళయందు ఆయన ప్రీతి కలిగియున్నాడు. వృషభాక్షో వృషప్రియః.

## 620 అనివర్తీ

అనివర్తీ అంటే మళ్ళీ తిరిగి రాని మార్గం. ఈ మొత్తం సృష్టి జరిగినప్పుడు అదే ఆదివారం మళ్ళీ వచ్చినా అట్లాగే వుండదు. క్రిందటి ఆదివారం వేరు. ఈ ఆదివారం వేరు. రాబోయే ఆదివారం వేరు. ఇప్పటివరకు ఈ వేళ వచ్చిన ఆదివారం మళ్ళీ ఎప్పుడూ రాలేదు సృష్టిలో. ఎందుకంటే వచ్చిందే మళ్ళీ రాకుండా తిప్పుతూ ఉన్నాడు. అదీ ఆయన 'అనివర్తిత్వం'. తిరిగిన చోటులోనే మళ్ళీ తిరగడ మనేది ఉండదు. మళ్ళీ వచ్చినట్లుంటుంది కాని అదే ఆదివారం కాదు. మళ్ళీ శ్రీరామనవమి వచ్చినట్లుంటుంది కాని అదే శ్రీరామనవమి కాదు. మళ్ళీ మేషమాసం వచ్చినట్లుంటుంది కాని అదే కాదు. అదే పుట్టినరోజు కాదు. వచ్చిన కాలం మళ్ళీ రాదు. అందుకే సృష్టిలో వలయాకారంగా, చక్రభ్రమణంగా తిరుగుతున్నట్లే కనిపిస్తున్నా అది గానుగెద్దు తిరుగుడు కాదు అని చెప్పడానికి 'అనివర్తీ' నామం చెప్పారు. వచ్చిందే మళ్ళీ రాదు. అదే వచ్చిందని మీరనుకోవచ్చు. కాలం రూపంలో భగవంతుడు తీసుకువచ్చేవి ఎప్పటికప్పుడు నిత్య నూతనంగా వుంటాయి. మళ్ళీ వెనక్కిరావడ మనేది లేదుట. అందుకని ఒక సంఘటన జరిగిందంటే మళ్ళీ అదే సంఘటన అట్లాగే జరగదు. మైత్రేయ మహర్షి 'కాలము, దేశము రెండూ కూడ గమనంలో భాగంగా వున్నప్పుడు, మళ్ళీ జరిగిన సంఘటనే జరగడమనేది అసంభవం' అని చెప్తారు. ఎందుకు జరగదంటే అదే కాలము మళ్ళీ రాదు. అదే దేశం అనిపించినప్పటికి అది అదే దేశం కాదు. ఎందుకంటే అణువులు మార్పు జరిగి వుంటుంది. మన శరీరం అదే శరీరం అనుకుంటాము కాని ప్రతిరోజూ అనుక్షణం మారుతూనే వుంది ఆ శరీరం. మనకి ఎప్పుడు తెలుస్తుందంటే, అయిదారేళ్ళకి ఒకసారి photo తీయించుకుంటే తెలుస్తుంది. రోజూ అద్దంలో చూసుకుంటే తెలియదు. ఈ శరీరం ప్రతిక్షణం మారుతూ వుంటుంది. కాలం మార్పు చేస్తూ వుంటుంది. కాబట్టి ఈ మార్పులో అదే వుందని ఎట్లా అనగలవు? అలాగే అదే నదిలో రెండవ సారి కాలు పెట్టలేము. ఒకసారి కాలుపెట్టి తీసి, మళ్ళీ కాలు పెట్టేటప్పటికి అదే నది కాదు. ఆ నీళ్ళు వెళ్ళిపోయినాయి. ఇంకో నీళ్ళు వచ్చాయి. కాని అదే నది వున్నట్లుగా గోచరిస్తుంది. అదే మనిషి వున్నట్లుగా గోచరిస్తుంది. ప్రజ్ఞ మారదు. ప్రజ్ఞ చుట్టూ వున్న సృష్టి మార్పు చెందుతూ వుంటుంది. అందుకనే సృష్టి సినిమాలో flash back ఉండదు. వెనుకది మళ్ళీ వచ్చి అట్లాగే జరగడమనేది వుండదు. మళ్ళీ శ్రీకృష్ణుడు వచ్చి అట్లా నడవడం వుండదు. మళ్ళీ శ్రీరాముడు వచ్చి అట్లా నడవడం వుండదు. మళ్ళీ ఏసుక్రీస్తు వచ్చి అట్లా నడవడం వుండదు. మళ్ళీ ఏ గురువూ తిరిగి వచ్చి అట్లా నడవడం వుండదు. అట్లా ఎదురు చూడడమనే ఒక విధమైన అనురక్తి వుంటుంది కాబట్టి ఎదురుచూస్తూ వుంటారు. కాని అదే రాదు. ఇంకో రకంగా వచ్చేసరికి దానిని గుర్తించలేరు. అందుకనే భగవంతుడు దిగి వచ్చినా గుర్తించలేకపోవడం! రాముడు, కృష్ణుడిగా వస్తే హనుమంతుడు గుర్తించలేదు, జాంబవంతుడు గుర్తించలేదు అంటారు కదా! గుర్తించలేరు. ఎవరు గుర్తించగలరయ్యా అంటే, అంతర్యామితత్త్వము నందున్నవారు మాత్రమే! అప్పుడు

తత్త్వమును చూస్తారు తప్ప, అప్పుడు వచ్చిన ఆ శరీరమే మళ్ళీ ఇప్పుడు వచ్చింది, అట్లా వుండదు. అల సముద్రములో కలిసిన తరువాత, మళ్ళీ అదే అల వచ్చిందని ఎట్లా చెప్పగలరు మీరు? చెప్పగలరా? గోదావరి లోంచి ఒక బిందెడు నీళ్ళు తీశాం బయటికి. మళ్ళీ గోదావరిలో కలిపేశాం. మళ్ళీ బిందెలోకి ఎత్తుకున్నాం. అంతకు ముందు ఎత్తుకున్నదీ గోదావరే, ఇప్పుడు ఎత్తుకున్నదీ గోదావరే. కాని అవే నీళ్ళు కాదు. అంతకు ముందు వచ్చినదీ భగవత్తత్త్వమే, ఇప్పుడు వచ్చినదీ భగవత్తత్త్వమే. కానీ అదే పద్ధతిలో రాలేదు. అదీ మైత్రేయుడు మనకి చెప్పినది. అట్లా వస్తుందని ఎదురు చూసిన వాళ్ళందరూ నిరాశ చెందారు. వస్తుంది, వస్తుందని ఎదురు చూసి ఏసుక్రీస్తు వస్తే, పురాణపురుషుడు ఏం చేస్తాడో అవన్నీ ఈయన చేసినా కూడా వీళ్ళు నమ్మలేదు. అలాగే పురాణపురుషుడు దిగి వస్తున్నాడని చెప్తే ఎంతమంది నమ్మారు కృష్ణుణ్ణి? చాలా తక్కువ మంది నమ్మారు. అందుకని భగవత్తత్త్వం దిగిరావడం కూడ నిత్యనూతనం. ఎప్పుడూ కొత్తగానే వుంటుంది. ఎందుకంటే కాలం వేరు, దేశం వేరు. వేరయినప్పుడు నువ్వు అదే అంటే, కొంత భాగం అదే, కొంత భాగం అదికాదు. అదికాదా అంటే అదే. అదేనా అంటే అదికాదు. సృష్టి అంతా కూడ 'నా సత్యం' అని అట్లా చేసి పెట్టాడు. అవునా అంటే కాదంటాడు. కాదా అంటే అవునంటాడు. 'అవునంటే కాదనిలే, కాదంటే అవుననిలే.' రాముడే కృష్ణుడా అంటే అవును, కాదు. తత్త్వపరంగా అవును. మిగతా స్వభావ పరంగా కాదు. తత్త్వపరంగా ఎప్పుడు, ఎక్కడ సత్యం దిగివచ్చినా అట్లాగే వుంటుంది. దానినే గురుతత్త్వం అన్నారు. ఈ గురువు వేరు, ఆ గురువు వేరు అనుకునే వాళ్ళు వాళ్ళ స్వభావాలని, వాళ్ళ స్వరూపాలని, వాళ్ళ శరీరాలని చూస్తున్నారు. స్వభావ, స్వరూపాలు చూసినప్పుడు వేరుగా వుంటాయి. తత్త్వం ఒకటిగానే వుంటుంది. అందుకనే తత్త్వాన్ని చూడడం మొదలుపెడితే, అంతర్యామిని చూడడం అవుతుంది. స్వభావ, స్వరూపాలని చూస్తే, మనం చూసే స్వభావ స్వరూపములే గురువో, దైవమో అనుకునే భావం వున్నప్పుడు దెబ్బ తింటాము. అదే స్వభావం, అదే స్వరూపముతో రావడమనేది సృష్టిలో జరగడానికి వీలులేదు. అట్లా అమర్చాడు. It is always progressive. It is not regressive. వెనక్కి వెళ్ళదండి. వెనక్కి వెళ్ళడం కూడ కొత్త దారిలోనే తీసుకుపోతాడు. ఇట్లా వెళ్ళామనుకోండి, మళ్ళీ అట్లా తిరిగి రావడం వుండదు. అటు నుండి ఇటు పట్టుకు వచ్చేస్తాడు. కొత్తగానే వుంటుంది వెళ్ళిపోయేటంత వరకూ కూడ. ఆకాశం నుండి బయలుదేరిన నీరు భూమి మీద పడి, అక్కడ్నుండి నదులలోకి చేరి, అక్కడ్నుండి సముద్రం లోకి చేరి అక్కడ్నుండి ఆకాశం లోకి చేరుతోంది కదా! అంతా ముందుకి వెళుతున్నట్టే వుంటుంది తప్ప వెనక్కి వెళుతున్నట్టు వుండదు కదా! ఆకాశం నుండి మళ్ళీ భూమి మీదకి వచ్చినప్పుడు మళ్ళీ ముందుకు వచ్చినట్టే వుంటుంది. అదీ 'అనివర్తిత్వం'. ఇట్లా తిప్పుతూ, తిప్పుతూ వుంటాడు. తాను మాత్రం నివృత్తాత్మ. అనివర్తీ నివృత్తాత్మ, తిప్పడం తప్ప తిరగడం వుండదు. అదీ 'నివృత్తి' అంటే. ఆత్మకి ఎప్పుడూ నివృత్తే! ఆత్మ చుట్టూ పేరుకున్న వాడికి ప్రవృత్తి. మనం కూడ అంతే. ఇది తెలుసుకుంటే యోగస్థితి వచ్చేసినట్టే. మనం తిరగలండి. తిరగనిది ఒకటి వుంది. తిరిగేది ఒకటి వుంది. ఆ రెండూ వుంటే కదా తిరగలవుతుంది. లేకపోతే అవదు కదా! అప్పుడే కదా అందులోంచి పిండి బయటికి వస్తుంది. మన జీవితమే

మన పిండి. ఇందులో తిరగని వాడిగా కొంతభాగం నువ్వున్నావు. తిరిగే వాడిగా కూడ కొంతభాగం నువ్వే వున్నావు. ఏమిటి తిరుగుతాయి నీలో? నీ మనస్సు, అందులోంచి పుట్టే భావములు, ఇంద్రియములు, శరీరము ఇవి మార్పుకి గురి అవుతూ వుంటాయి. నీవు అందులో మారని వాడిగా వుంటావు, ఆత్మతత్త్వంలో వెలుగు వలె. వెలుగు మారదు. ఇక్కడ light వేసుకున్నాం. ఎప్పటి నుండో అట్లాగే వెలుగుతోంది. ఇక్కడ చేసే పనులు మారుతూ వస్తున్నాయి తప్ప రోజురోజుకి, అది అట్లాగే వుందిగా. వెలుగుకి ఏమైనా తేడా పడ్డదా! ఒక వెలుగు క్రింద చీట్లపేక ఆడుకోవడం దగ్గర నుండి, విష్ణు సహస్రనామం చదువుకునేటంత వరకు మనలో సంస్కారం పెరగవచ్చు. వెలుగుకో? అది అప్పుడూ వెలుగే, ఇప్పుడూ వెలుగే. ఇక ముందూ వెలుగే కదా! ఆ వెలుగు దేనిది? నీ యొక్క వెలుగే అది! నీవు, నీ వెలుగు ఎప్పుడూ మారరు. నీ వెలుగు ఆధారంగా జరిగే కార్యక్రమాలుంటాయే అవి అన్నీ మార్పుకి గురి అవుతూ వుంటాయి. నీ నుంచి జరిగే కార్యక్రమాలు నీవు కాదు. నీ నుంచి వచ్చే ఆలోచన, నీలోంచి పుట్టినది. అది నిన్ను నడిపిస్తూ వుంటే నీ మనస్సు, శరీరము, ఇంద్రియాలు నిర్వర్తిస్తూ వుంటే సాక్షీభూతులుగా వుండడమే! అదీ యోగులు నిర్వర్తించే జీవనవిధానం! తాను నడవక తాను అన్నిటినీ నడిపిస్తూ వుంటాడు. మంచి వ్యాపారం బాగా తెలిసినటువంటి ఆయన గదిలోనే కూర్చుంటాడు. పనులన్నీ జరిగిపోతూ వుంటాయి. ఎందుకని సార్? 'ఆయన లోపల ఉన్నాడు' అని మిగతా వాళ్ళంతా పనిచేస్తూ వుంటారు. అట్లాగే ఈ లోపల ఒక సార్ వున్నాడుగా. అందుచేతే ఇవన్నీ పనిచేస్తున్నాయి. ఆ సార్ లేకపోతే, గుండె కొట్టుకోవడం వుండదు, శ్వాస పీల్చడం వుండదు ఏమీ ఉండదు. కనుక ఆయన వుండబట్టి ఇవన్నీ జరుగుతూ వుంటాయి. ఉండే వాడిగా వున్నదెవరు? నీవే! 'నేను వున్నాను, నానుండి భావములు వస్తున్నాయి. భావాలతో నేను సహకరిస్తాను తప్ప, భావాలతో పాటు నేను బయటికి పరిగెత్తి వెళ్ళిపోవడం లేదు' అంటాడు శ్రీకృష్ణుడు గీతలో. ఆయన నుండి త్రిగుణాత్మకమైన శక్తి ఉద్భవిస్తోంది. మన నుండి కూడ ఉద్భవిస్తోంది. మనం కూడ ఆయన అంతటి వాళ్ళమే. వచ్చిన గొడవ ఏమిటంటే, Each one of us is as much as I AM. నా అంతటి వాడిని నేను. మనం లేవగానే మనలో నుండి భావాలు ఉద్భవిస్తున్నాయి. ఉద్భవించిన భావాలని నిర్వర్తించడం వేరు, వాటితో పాటు కొట్టుకు పోవడం వేరు. నిర్వర్తించినవాడు దానియందు తాను చిక్కుకొనడు. అట్లు చిక్కుకొనక నిర్వర్తించేవాడు 'నివృత్తాత్మ'.

## 621 నివృత్తాత్మ

ఆత్మపరంగా నివృత్తిలో వున్నాడు, ప్రవృత్తిలో వున్నట్టు కనిపిస్తున్నప్పటికి. ప్రవృత్తాత్మ అంటే ఏమిటి? దానితో పాటు కొట్టుకు పోయేవాడు. ఏదో పని మీద వెళుతూ వుంటే ఒక స్నేహితుడు వచ్చి సినిమాకి వెళదామంటే, వాడితో పాటు సినిమాకి వెళ్ళిపోయినవాడు. మనం ధ్యానంలో కూర్చుంటే ఎలా వెళ్లిపోతూ వుంటుంది? కళ్ళు మూసుకుని కూర్చుంటే అక్కడ వుండే ప్రశ్నే లేదు. 'అక్కడ లగ్నం చెయ్యి మనస్సు' అంటాడు ఆరవ అధ్యాయంలో. అక్కడ అంటే ఎక్కడ? ఎక్కడ అంటే 'లోపల నుండి ఆ ప్రశ్న ఎక్కడ పుట్టిందో అక్కడ'. అని చెప్పాడు కృష్ణుడు. సరే చెప్పండి సార్ ఎక్కడ? అంటే హృదయంలో అని కొంతమంది అన్నారు. భ్రూమధ్యంలో అని కొంతమంది అన్నారు. అక్కడ పెడితే వుందా? ఎందుకు లేదు? అసలు నివృత్తాత్మల మైనా కూడ ప్రవృత్తాత్మలుగా మారిపోయాము. సిద్ధపురుషుడు అట్లా మారడు. తన నుండి వచ్చేది తను సాక్షీభూతంగా సహకరిస్తూ వుంటే, తను చూస్తూ వుంటాడు. 'నేను యుద్ధం చెయ్యను' అంటాడు, మనం రోజూ పని చెయ్యం అన్నట్టుగానే. 'యుద్ధం చేయిస్తాను' అన్నాడు. అట్లాగే నువ్వు కూడా కూర్చో. నీ నుంచి జరిగే వాటిని చేయిస్తూ వుండు. నువ్వు చెయ్యకు. Labour పని చెయ్యకు అంటాడు. Labour చెయ్యడానికి శరీరం వుంది. అది చేస్తూ వుంటుంది. అది చూస్తూ వుండు. నీ శరీరము ఇంద్రియములు, మనస్సు,- నువ్వు ఆ రెండింటి మధ్యపొరలో మారనివాడిగా నువ్వు ఒకడివి ఉన్నావు కదా! అందుకనే నిన్ను అద్దంలో చూసినప్పుడు నువ్వు మారావని నీకు తెలియదు. ఎందుకంటే నువ్వు మారవని నీ నమ్మకం. నిజానికి నువ్వు మారని వాడివే, సహజమైన స్థితిలో. నువ్వు చావవు కూడాను. అందుకనే ప్రతివాడు రోజూ నేను చచ్చిపోతాను కదా అనుకోడు. ఎందుకనుకోడు తెలుసా? నిజంగా చావడు కాబట్టి. నీలో కూడా ఒక భాగం చావదు. చావని భాగంలో వున్నప్పుడు చావం, చచ్చేభాగంలో వుంటే చస్తాం. నువ్వు ఏ భాగంలో వుంటావనేది ముఖ్యం. తిరగలి క్రింద రాయి, పై రాయి రెండూ తిరుగుతూంటే పిండి పడదు. క్రింది రాయి తిరగకపోతే పిండి పడుతుంది. అట్లా మనలో there is female activity and male activity. The male in you is stable, the female in you is active. తన ఆధారంగా ఈ సృష్టి అంతా అమ్మవారు చేస్తోంది అంటాడు. ఎవరీ అమ్మవారు? తనలోంచి వచ్చిందే. తనలో భాగమే. ఆ భాగం అంతా కదలిస్తూ వుంటుంది. ఈ భాగం దానికి స్థిరత్వం ఇస్తుంది. ఒక నాటక రంగంలో stage వుంటే కదా నాటకం. Stage కదులుతూ వుంటే? అదే మాస్టర్ సి.వి.వి. గారు 'stage stable గా లేకపోతే statue ఎట్లా నిలబడుతుందిరా' అంటారు. 'బొమ్మ నిలబడాలంటే ముందు stage stable గా వుండాలి కదా' అంటారు. ఒక్కొక్కళ్ళు అదే విషయాన్ని రకరకాలుగా చెపుతూ వుంటారు. సినిమా తెర సరిగ్గా లేకపోతే బొమ్మ పడదు కదండి. తెర మీద బొమ్మ పడుతూ వుంటే, తెర మీద పడే వాటన్నిటికీ తెర దుఃఖిస్తోందా? చాలాసార్లు చెపుతూ వుంటాను. సినిమా తెర లాగ ఒక భాగం వుంది మనలో. తెర మీద బొమ్మలుగా ఒక

భాగం వుంది మనలో. తెర మీద బొమ్మల భాగంలో వుంటే, ఏదో పెళ్ళి చేసుకున్నప్పుడు పెళ్ళి చేసుకున్నట్టు, చచ్చిపోయినప్పుడు చచ్చిపోయినట్టు, తన్నుకున్నట్టు, కొట్టుకున్నట్టు ఈ బొమ్మలన్నీ వుంటాయి. తెరకు లేవు కదా! నువ్వు తెర భాగంలో వుండి బొమ్మను చూస్తూ వుంటే, మొత్తం అంతా ఒక సినిమా. అందుకని వాళ్ళు ఇదంతా జగన్నాటకం అన్నారు. ఎవడికి జగన్నాటకం? నాటకానికి తెరగా నిలబడిన వాడికి అది జగన్నాటకం. మిగతా వాడికి కాదు కదా! వాడికి పుట్టడం నాటకం. పెరగడం నాటకం. పెళ్ళి చేసుకోవడం నాటకం. పిల్లలు పుట్టడము నాటకం. చచ్చిపోయాడనేది కూడ నాటకం సినిమాలో. ఒక పాత్ర. చచ్చిపోయినట్టు పాత్ర వేసిన వాడికి కూడా తెలుసు కదా చచ్చిపోలేదని. చచ్చిపోయాడా? పాత్ర వెయ్యగానే చచ్చిపోయినట్టు నటిస్తే, చచ్చిపోతే, మరి ఇంకో సినిమాలో వాడు కనబడడానికి వీలు లేదు కదా! తాను చచ్చిపోయానని, చచ్చిపోడని తెలిసి చచ్చిపోయినట్టుగా నటిస్తున్నాడు. చచ్చిపోయినట్టుగా తెలుస్తుందండి. చూడండి. ఒక్కసారి ఆలోచించుకోండి నటుడిగా మిమ్మల్ని. మీరు నటుడిగా నాటకంలో నటిస్తున్నారు. నాటకంలో పెళ్ళి అయింది. నాటకంలో పిల్లలు పుట్టారు. నాటకంలో చచ్చిపోయారు. నాటకమేగా? అని ఒక భావన మీకు వుంటుంది కదా! ఎంత బాగా రక్తి కట్టించేట్టుగా నటించినా, నటించినప్పుడు మీరు అది కాదని మీకు తెలుసు కదా! నిజమైన నటుడు ఎవరో తెలుసా? ఎదుటి వ్యక్తికి తాను ఏ పాత్ర పోషణ చేస్తున్నాడో అదే అనిపించాలి. రాముడో, రావణుడో చూసే వాళ్ళకి ఖచ్చితంగా అనిపించాలిట. కాని తనకి మాత్రం తెలిసుండాలిట తాను రాముడు కాదు, రావణుడు కాదని. మన పాత్ర ఎట్లా వుంటుందంటే మనం అది అయిపోతాం. మనకి రాముడు, రావణుడు పాత్ర ఎట్లాగూ కుదరదు. ఏదో కిష్కింధలో ఒక పాత్ర ఇస్తారు. తోకవేసుకు తిరుగుతూ వుంటాం ఊళ్ళన్నీను. అందుకని నేను అసలు ఎవరు? నాటక రంగంలోకి రాకముందు నేను ఎవరు? వచ్చిన తరువాత ఎవరు? రంగంలోకి దిగినప్పుడు కూడ నేను అది కాదని నర్తకుడికి ఎట్లా తెలుసో, నటుడికి ఎట్లా తెలుసో అట్లాగే మనం కూడ రోజూ బోల్డు సినిమాలలో నటిస్తూంటాం. ఈ సినిమాలన్నీ సాయంత్రం నిద్రలోకి వెళ్ళే సరికి ఉండవు. మళ్ళీ మనకి ప్రొద్దున్నే మొదలవుతుంది TV. లేచిన దగ్గర్నుంచి TV పెట్టుకోవడమే రాత్రి పడుకునేటంతవరకు. అందులో తెర భాగం నువ్వు. బొమ్మల భాగం నీ మనస్సు, ఇంద్రియములు, శరీరం చూపిస్తుంటాయి Eastmancolour, Colour TV. ఇట్లా చూశామనుకోండి. ఇన్ని రంగులు కనిపిస్తున్నాయి కదా! అన్ని రంగులు వున్నాయా? ఒకటే రంగు ఇన్ని రంగులుగా వున్నాయని తెలిసి యుంటుంది వాడికి. ఒకటే తత్త్వం ఇన్ని రూపాలుగా వుంటాయని తెలిసి యుంటుంది. అది కూడా గుర్తు పెట్టుకోవాలి, దీంట్లో పని చేస్తూ వుండాలి. వాడూ 'నివృత్తాత్మ'. సిద్ధపురుషులందరూ అట్లాగే వుంటారు. మరి భగవంతుడి విషయంలో చెప్పడానికేముంది? వాడూ అదే అయ్యి ఇంత చేశాడు. సిద్ధపురుషుడు portable TV. అంత, భగవంతుడు 70mm. screen అంత వుంటాడు అని అనుకోవచ్చు. రెండింటిలో పనిచేసే principle ఒకటే. ఈ మారేదాంట్లో తాను మారని వాడిగా వున్నానని తెలిసి వుంటాడు. వాడూ 'నివృత్తాత్మ'. మనలో ఈ రెండూ వుంటాయి. ఏ భాగంలో మనం ఎక్కువ

జీవిస్తున్నామనేది మనకి సంబధించినది. మనలో నివృత్తి వుంది, ప్రవృత్తి వుంది. ప్రవృత్తిలో వుంటూ నివృత్తిగా వుండమంటారు యోగంలో. నివృత్తి అని చెప్పి, అసలు సినిమా వెయ్యమండి మా screen మీద అని చెప్పామనుకోండి. ఎందుకండీ బొమ్మ వేస్తే, బొమ్మలోకి నేను వెళ్ళిపోతున్నానండి, అందుకని తెర మీద బొమ్మ వెయ్యనండి అంటే ఇంక ఆనందమేముంది? బొమ్మ వేసుకోవాలి. అందులోకి వెళ్ళిపోకూడదు. మనం tragedy సినిమా చూస్తున్నంతసేపు వెక్కి వెక్కి ఏడుస్తున్నామనుకోండి. ఎందుకేడుస్తాం? లీనమవడం వలన. కొంతమంది లీనమవరు. సినిమాయే కదా అనుకుంటారు. అక్కడ సినిమాయే మనకి సినిమా కాదనిపిస్తూ వుంటే, ఇది సినిమా అనుకోమంటే ఎక్కడ చూస్తాం? అనుకోలేరు కదా! సినిమాలో వాడు ఏడిపిస్తే ఏడ్చి, వాడు నవ్విస్తే మనం నవ్వి చేస్తాం. సినిమాలో కూర్చుని నవ్వుకోవచ్చు. సినిమాలో కూర్చుని ఏడవడం waste. కొంతమంది చూడలేరు violence సినిమా. ఎందుకు చూడలేరు? తెరమీదే కదా జరుగుతోంది. ఎక్కడో violence అంటే పోనీ ఏడవచ్చు. తెరమీద violence నీకేమీ అంటదు కదా! కానీ అంటుతుంది. ఎందుకంటే మనం కదలే భాగంలో వుంటాము కనుక అంటుకుంటుంది. అంటని వాడికి అక్కడ నడిచేదంతా జరిగిపోయేదే. కాస్సేపు అయిన తరువాత మళ్ళీ తెర మొత్తం తెల్లగా కనబడుతుంది. ఇలా నివృత్తి, ప్రవృత్తి రెండూ. ఒక భాగం నివృత్తిలో వుంది మనలో. ఇది కూడా తీసుకెళ్ళి ప్రవృత్తిలో పడేసుకోవడం వలన ఆడుతుంటాం. అందుకే మనకి రకరకాల ఉపమానాలు ఇచ్చారు. సూర్యుడు నీళ్ళల్లో ప్రతిబింబిస్తూ వుంటే, నీళ్ళలో కదిలినట్టు వున్నాడు కాని నిజంగా కదలాడా. చంద్రుడు నీళ్ళల్లో ప్రతిబింబిస్తూ వుంటే కదిలినట్టు అనిపిస్తుంది కాని కదలడు. 'కంపితాంతరంగమున కదిలినట్టు తోచు కదలకుండు'' అని ఒక పద్యం వుంది భాగవతంలో. మన అంతరంగం అంటే మన మనస్సు. అంటే మన stage, మన లోపల ఉండే రంగం. అది కదులుతూ వుంటే ఏం జరుగుతుందంటే, అందులో ప్రతిబింబించేది కూడా చాల అల్లకల్లోలంగా వుంటుంది. అది ప్రశాంతంగా వుందనుకోండి, (అదీ మూడవ మెట్టు యోగంలో, స్థిర సుఖమాసనం అని) ప్రతిబింబించేది ప్రశాంతంగా వుంటుంది. స్థిరంగా వుంటుంది. ప్రశాంతమైన సరస్సులో చంద్రుడు ప్రతిబింబిస్తే కదిలినట్టుండదు. మనం photos తీస్తే ఆ చంద్రుడు, ఈ చంద్రుడు కూడ పడతారు. Still. అలా కానప్పుడు కదులుతూ వుంటే మొత్తం అంతా కదిలిపోయినట్టుంటుంది. భగవత్తత్త్వం ఇన్నిటిలోను వున్నా దేనికీ అంటకుండా వుంటుంది. ప్రతి దాంట్లోను వున్నాడు. దానికి సంబంధించిన కార్యక్రమంతో వాడికి సంబంధం లేదు. మనలో వున్నాడు. మనం నడిపించుకునే కథంతా ఆయనకి సంబంధించినది కాదు. అందుకనే దాని నష్టం, లాభం మొత్తం అన్నీ మనకే. సౌకర్యం, అసౌకర్యం తెరకేమి అంటింది? కోటి రూపాయలు వచ్చిందంటే తెరకి అంటిందా? పోవడం, రావడం అనే కథ తెర ఆధారంగానే జరుగుతోంది సినిమాలో. అందుకని మనలో ఉండే నివృత్తి భాగంలో కనుక మనం జీవించడం మొదలుపెడితే ప్రవృత్తి భాగంలో జరిగేది మనకి సినిమాగా గోచరిస్తుంది. అప్పుడుట ఇదంతా లీల అని తెలిసేది. లేకపోతే లీల అని ఎట్లా తెలుస్తుందండి? చచ్చిపోతూ వుంటే రోజా? భగవంతుని లీల, భగవంతుని క్రీడ అంటూంటాము కదా! ఇదంతా భగవంతుని లీల. 'దిగులేల జీవా

తెలుసుకోలేవా' ఇట్లా మనకి పాటలున్నాయి. ఈ విధంగా ఈ నామాలలో వుండే గొప్పతనం మనల్ని మాటిమాటికి స్థిరమైన దాంట్లో నిలబెడుతూ వుంటుంది. అస్థిరమైన దాంట్లో కూర్చోవడం వల్ల మాటిమాటికి లేవాల్సివస్తుంది. ఎప్పుడూ వరదలు వచ్చేచోట ఇల్లు కట్టుకున్నామనుకోండి, ఎట్లా వుంటుంది? ఇవాళ కట్టినా doubt ఎన్నాళ్ళు ఉంటుందో అని. పడిపోతూ వుంటుంది. మళ్ళీ కట్టుకుంటే మళ్ళీ పడిపోతూ వుంటుంది. వరదలు వుండే చోటు కన్న వరదలు లేని చోట కట్టుకుంటే స్థిరంగా వుంటుందిగా. ఎప్పుడూ గాలి, వాన వచ్చేచోటు బతుకుతూ, గాలి, వాన రాకుండా చెయ్యి అనడం ఏమిటి? అలా కాని చోట కట్టుకుంటే మంచిది కదా! ఒకాయన తపస్సు చేసుకుంటున్నాడుట, హిమాలయాల్లో. ఆయన ఓం అనగానే వర్షం పడిందిట. కోపం వచ్చిందిట వర్షం మీద. కాస్సేపు చిరాకు పడేవాడుట, కాస్సేపు తిట్టుకునేవాడుట. మళ్ళీ కాస్సేపు పోయేక మళ్ళీ ఓం అనగానే మళ్ళీ వర్షం పడేదిట. ఇట్లా వర్షంతో కుస్తీ పడుతున్నాడు. అప్పుడు సిద్ధురాలైన ఒకావిడ వచ్చి, అట్లా వర్షం పడేచోట కూర్చుని బాధలు పడి పూజలు చేసుకునేకంటే, మేఘాల కన్న పైన కూర్చోవచ్చు కదా అంది. అదే పురుషమేధంలో విదురుడికి శైలపుత్రి చెపుతుంది 'కొంచెం పైకి వెళ్ళి చేసుకోవయ్యా నీ ధ్యానం. వర్షం పడకూడదంటే ఎట్లా? మేఘాల పైన కూర్చో. పర్వతాలు మేఘాల పైన కూడ వున్నాయి కదా! అప్పుడు వర్షం బాధ వుండదు' అని. సూర్యుడికి, మనకి మధ్య మబ్బుందనుకోండి. మనకి మబ్బు వచ్చినప్పుడల్లా సూర్యుడు లేడని అనిపిస్తుంది. అసలు మబ్బులు లేని పరిస్థితి వుందనుకోండి. మనకి మబ్బు వెయ్యదనుకోండి, బయట మబ్బు కాదు, లోపల. లోపల మబ్బు వెయ్యకపోతే సూర్యుడి వెలుగు ఎప్పుడూ వుంటుంది కదా! మబ్బులు వేసినప్పుడు వుండదు కదా! కాబట్టి సూర్యుడు ఉండడం, లేకపోవడం నిర్ణయం చేసేది మబ్బులు కాదు కదా! మబ్బులున్నా సూర్యుడున్నాడు, మబ్బులు లేకపోతే సూర్యుడున్నాడు అని ఎలాగూ తెలుసు. మబ్బులు రావడం, పోవడం అనేది జరుగుతూ వుంటుంది అని .

వాయు వశంబులై యెగసి, వారి ధరంబున మింటను గూడుచుం
బాయుచు నుండు కైవడిం బ్రపంచము సర్వమున్ గాలతంత్రమై
పాయుచున్ గూడుచుండు నొకభంగిన్ జరింపదు కాలమన్నియుం
జేయుచున్ నుండున్ గాలము విచిత్రము దుస్తర మెట్టివారికిన్

అని చెప్పాడు భీష్ముడు. ఈ మేఘాలన్నీ ఎట్లా కలుస్తూ వుంటాయో, ఎట్లా విడిపోతూ వుంటాయో, ఎట్లా తిరుగుతూ వుంటాయో ఎవరూ చెప్పలేరుట. కాస్సేపు మేఘం రావచ్చు. అమ్మయ్య చల్లగా వుందనుకుంటాం. వర్షం పడితే అయ్యో అనుకుంటాం. ఇవన్నీ మార్పులు. మార్పులలో నువ్వు మారని వాడివిగా వుంటే సరిపోయిందిగా! నువ్వు మారని స్థితిలో కేంద్రంలో నువ్వు కూర్చుని, మారేవాటి నన్నిటినీ నడిపిస్తూ వుంటే, గుర్రం మీద తిరగడం కన్న, గుర్రపు బండిలో తిరగడం సుఖంగా వుండదూ? గుర్రం మీద కుదుపు ఎక్కువ వుంటుంది. గుర్రబ్బండిలో అంతకన్న తక్కువ వుంటుంది. అందుచేత ఎక్కడ కుదుపుంటుందో అక్కడ కూర్చోవడం చేత జీవితమంతా ఒకటే కుదుపు, విపరీతమైన ఒళ్ళునొప్పులు. కాని ఈ కుదుపు లేనిచోట కూర్చోవడ మనేది ఒకటి వుంది మనలో. అది ఆజ్ఞ. ఇక్కడ కూర్చోవడం చేత

కుదుపుండదు. అలాగే హృదయంలో కూర్చున్న వాడికి కుదుపుండదు. బొడ్డులో కూర్చుంటే అంతా కుదుపే. రావణుని ఎంత కుదిపేసింది. తను ఎప్పుడూ సుఖ పడ్డదేమీలేదు. సుఖ పడదామనే ఆరాటం తప్ప. కొత్తది, మంచిది ఎప్పుడు ఎక్కడ ఏది వుందన్నా దాని గురించి పరిగెత్తడమే అయిపోయింది. ఎవడో ఒకడు వచ్చి ఏదో ఒకటి చెపుతూనే వుండేవాడు. నీ దగ్గర లేనిది అక్కడ ఒకటి వుందని. దానికోసం ఆరాటం. ఇట్లా బతికాడు. బొడ్డులో కూర్చుంటే ఆటుపోట్లుంటాయండి. కొంచెం పైన హృదయంలో కూర్చుంటే ఆటుపోట్లుండవు. మనకి కావలసినవి గుర్తున్నంతసేపు బొడ్డులో కూర్చున్నట్టే. మనం చెయ్యవలసినవి మాత్రమే గుర్తుంటే మనకి రావలసినవి వస్తే వస్తాయి, లేకపోతే లేదు అనుకుని కూర్చున్నారనుకోండి, అంత ఆటు పోట్లుండవు. సామెత వుంది. 'ఒంటి నిండా నూనె పూసుకుని, పుట్టెడు నువ్వులలో పొర్లినా అంటేదే అంటుతుంది గాని అంటనిది అంటదని'. కొంతమందికి ఎక్కువ అంటుతుంది. బాగా అందరూ నూనె పూసుకుని పొర్లినా అందరికీ ఒకే రకంగా అంటవు నువ్వులు. ఎవడికి అంటేది వాడికి అంటుతుంది. అట్లా చెయ్యవలసినది చేద్దాం. రావలసినది మనకి సంబంధం లేదు. చెయ్యవలసిన వాటితో రావలసినవి ముడివేసుకోవద్దు. రావలసిన వాటియందు మనస్సుంటే బొడ్డులోకి వెళ్ళిపోతాము. చెయ్యవలసిన వాటియందు మనస్సుంటే హృదయంలోకి వెళ్లిపోతాము. అంతే! చిన్న నిచ్చెన వుందక్కడ. ప్రక్కనే పాముంది. వైకుంఠపాళి కదా! ఎప్పుడూ నిచ్చెన ప్రక్కనే పాము పెడతారు. నిచ్చెన ఎక్కేమన్న సరదా లేకుండా చేసేస్తుంది, తరువాత పాములో పడి. నిచ్చెన ఎక్కగానే చప్పట్లు కొట్టుకోకూడదు, పాములో కూడ పడవచ్చు అని తెలిసుంటే బావుంటుంది. మనం ఏం చెయ్యాలి అని మాత్రమే గుర్తుందనుకోండి, నిచ్చెనలు ఎక్కుతూ వెళతారు. ఇంత చేశాం కదా మనకి ఏమిటి అని గుర్తొచ్చిందనుకోండి, పెద్ద పాములో పడిపోతాము. అటువంటి భావాలు మనకి. రామనవమి ప్రొద్దున్న పూజ చేశాం. మధ్యాహ్నం కళ్యాణం చేశాం. సాయంత్రం కథ చెప్పకున్నాం. రాత్రికి ఏమైనా దర్శన మవుతుందా అనుకుంటే! అది కుదరదు. నువ్వు చెయ్యవలసినవి చెయ్యి. రావలసిన దానికోసం చూడకు. చేసిన దానికి, వచ్చిన దానికి link లేసుకుంటే నీకు తెలియదు. ఒక్కొక్కసారి ఏం చెయ్యకపోయినా వచ్చినట్టుంటుంది. ఒక్కొక్కసారి ఎంత చేసినా రాదు. 'అవి కాలం మడతలలో దాచేశాం. ఆ విషయాలు నీకు తెలియదు. అందుకని నీ వరకు నువ్వు చేస్తూ పో. నీకు చెయ్యడమంటే శ్రద్ధ వుందనుకో, నువ్వు హృదయంలో వుంటావు. నీకు వచ్చే దాని శ్రద్ధ పెరిగినదనుకో అక్కడ నుండి చక్కగా బొడ్డులోకి వస్తావు. బొడ్డులోకి వస్తే ప్రవృత్తాత్మ. హృదయంలోకి వస్తే నివృత్తాత్మ'.

# ౬౨౨ సంక్షేప్తా

సంక్షేప్తా అంటే చాలా అద్భుతము, ఒకరకంగా విచిత్రము అయిన భగవత్తత్త్వం. భగవంతుడు సృష్టిలో సమస్తమైన సంఘటనలు కూడ ఒకదాని తరువాత ఒకటి చక్కగా జరిగేటట్టుగానే అమరిక చేశాడుట. అందుకని జరిగినదంతా కూడ correct. వ్యక్తిగత జీవితంలో జరిగిన సంఘటన కాని, సన్నివేశము కాని, ఒక బృందపరంగా జరిగేవి కాని, ఒక జాతికి జరిగేవి కాని, ఒక దేశానికి జరిగేవి కాని అవగాహనలో తేడా తప్ప జరిగినవన్నీ సరిగ్గా జరిగినట్టే. అవగాహనలో కాస్తో కూస్తో పొరపాట్లు వుండవచ్చు. ఇట్లా జరిగి వుండాల్సింది కాదు, ఇట్లా జరిగి వుండాల్సింది అంటూ వుంటాము కదా! అది ఊరికే మన మనస్సులో వుండే పీకులాటే తప్ప, అసలు జరిగేది ఎప్పుడూ ఒక పద్ధతి ప్రకారం మనకి అవగాహన అవడానికే జరుగుతుంది. మన సంక్షేమం దృష్టిలో పెట్టుకునే అది జరుగుతుందిట. అది మనం బాగా అర్థం చేసుకోవాలి. మనకి ఏదైనా కొంచెం ఇష్టం లేనిది జరిగితే చాల బాధ పడుతూ వుంటాం. కాని నిజానికి మనకి ఇష్టం వుండడం, ఇష్టం లేకపోవడంతో సంబంధం లేకుండా, ఏది long run/దీర్ఘకాలిక ప్రణాళికలో క్షేమం కలుగచేస్తుందో, ఆ విధంగా జీవితంలో జరిగే సన్నివేశాలన్నీ అల్లబడి యుంటాయి. ఆ విధంగా అల్లబడి యుండడం చేత జరిగినదల్లా కూడ సంక్షేమమే అని అనికోవాలి. ఇది ఒక సత్యం. మీకు అక్బర్, బీర్బల్ కథ గుర్తు చేస్తాను. బీర్బల్, అక్బరు ఇద్దరు వేటకి వెళ్ళారుట. వేటకి వెళుతూ వుంటే దారిలో ఒక క్రూరమృగం కనిపించినప్పుడు అక్బరు మొలలోంచి కత్తి గట్టిగా లాగుతూ వుంటే, ఒర పట్టుకున్న వేలు తెగి గాయమై రక్తం వచ్చిందిట. ప్రక్కనే వున్న బీర్బల్ ని చూసి 'ఏమిటి ఇలా అయింది ఈ రోజు' అన్నాడుట. బీర్బల్ 'మన మంచికే జరిగింది' అంటాడు. రాజుగారి వేలు తెగితే మంచిదే అంటే అంత బావుండదు కదా! వెంటనే అక్బరు 'ఈ బీర్బల్ ని తీసుకెళ్ళి జైలులో పెట్టండి. నాలుగు దెబ్బలు కొట్టండి. నేను వేట నుండి తిరిగి వచ్చిచెప్తాను' అంటే 'నీ వేలు తెగడం ఎంత దైవానుగ్రహమో, నన్ను జైలులో పెట్టడం కూడ దైవానుగ్రహమే' అంటాడు. 'దైవ సంకల్పమే అందులో మంచే వుందంటాడు'. అక్బర్ 'ఏం మంచి వుందో చూద్దాంలే, జైలులో ఉండు' అని చెప్తాడు. జైలులో పెట్టేసి ఇంకా బాగా అడవులలోకి వెళితే కొంతమంది ఆటవికులు అక్బర్ ని వలవేసి పట్టుకుంటారు. పట్టుకుని వాళ్ళ అమ్మవారికి బలివ్వడానికి సిద్ధం చేస్తారు. తీరా అన్నీ సిద్ధం చేసి బలిచ్చేముందు శరీరమంతా చూస్తే వేలు తెగి వుంటుంది. 'ఇట్లా వేలు తెగినవాడు బలికి పనికిరాడు వీడిని వదిలేయండి' అంటే వదిలేస్తారు అక్బరుని. అప్పుడు అక్బరుకి తెలుస్తుంది, ఇవాళ వేలు తెగడం వలన తన తల తెగకుండా బయటపడ్డాడని. అప్పుడు బీర్బల్ చెప్పిన విషయాన్ని గుర్తు తెచ్చుకుని ఆనంద పడతాడు. వెంటనే బీర్బల్ ని జైలునుంచి రప్పించి, కుశల ప్రశ్నలు వేసి, 'పొరపాటైపోయింది క్షమించు. నిన్ను ఈ విధంగా ఖైదులో పెట్టాను' అంటే 'లేదు, ఇది కూడ దైవానుగ్రహమే. నీవు నన్ను జైలులో పెట్టి వుండకపోతే నీతోబాటు నేను కూడా వుండేవాణ్ణి. నీకు వేలు తెగింది కాబట్టి నిన్ను వదిలేసేవారు. వేలు తెగలేదు

కదా అందుకని నన్ను బలిచ్చేవారు. కాబట్టి నీకు వేలు తెగడం ఏ విధంగా మంచిదైందో, సంక్షేప్తుగా క్షేమం కలిగించాడో, అదేవిధంగా నీ ద్వారా సంకల్పించి నన్ను జైలులో పెట్టించి, నా ప్రాణాలు కూడా రక్షించాడు. భగవంతుని కృప ఇలాగే వుంటుంది' అంటాడు. ఈ కథ ఇదివరకు ఒకసారి చెప్పుకున్నాము. మళ్ళీ ఒకసారి గుర్తు చేస్తున్నాను. అట్లా జీవితంలో కష్టాలు వస్తే మనకి రాకూడనివి వచ్చాయి, ఇట్లా మనకి రాకూడదు అనుకుంటూ వుంటాము కదా! అయితే వాటిలో కూడా మనకు నిర్దేశించిన ఒక క్షేమం వుంటుంది. ఆ క్షేమాన్ని ఉద్దేశించి మలుపు త్రిప్పడానికి ఇటువంటి సంఘటన ఒకటి జరుగుతుంది తప్ప మరొక పద్ధతి కాదు. రాముణ్ణి కోసల దేశానికి పట్టాభిషిక్తుణ్ణి చేద్దామనుకుంటారు కదా. ముహూర్తం పెట్టినవాడు వశిష్ఠ మహర్షి కదా! ఆయనంతటి మంచాయన, అంతటి మహాత్ముడు, అంతటి తపస్సంపన్నుడు ముహూర్తం పెడితే, అదే ముహూర్తానికి అడవులకి వెళ్ళవలసి వచ్చింది కదా! మామూలుగా మన లెక్కలో అది చాలా అశుభమైన విషయం. వశిష్ఠుడికి బహుశా జ్యోతిష్యం అంత బాగా వచ్చి వుండకపోవచ్చువంటివి అనుకుంటారు. ఏం మాట్లాడడు వశిష్ఠుడు. ఆ విధంగా జరగకపోతే రాముడు దిగివచ్చిన కథే లేదు. అంత కథ జరగదు కదా! అది ఎప్పుడు తెలుస్తుంది? ఈ కథ జరిగిన తరువాత తెలుస్తుంది. ముందు తెలియదు కదా! అట్లాగే మనకి ఏదైనా తీరని కష్టం వస్తే అప్పటికది చేదుగా వుంటుంది తప్ప, క్రమేపీ అందులో నుండి మనకి జరిగిన మంచి తెలుస్తుంది. కనుక ప్రతి కష్టమూ ఒక శుభమైన విషయంలోకి మనకి అర్హత కల్పించడానికే వస్తుందని తెలిస్తే, భగవంతుడు ఏమిచ్చినా మన మంచికే ఇస్తాడు అనే భావన కలిగియుంటే, ఇంక వారికి తిరుగులేదు. వృత్రాసురునికి పూర్వజన్మలో రాక్షసుడిగా పుట్టమని శాపం ఇస్తారు. మహాప్రసాదం అని పుచ్చుకుంటాడు. జయ విజయులకి శాపం పెడతారు సనకసనందనాదులు. మహాప్రసాదం అని పుచ్చుకుంటారు. ఇందులో యోగ పరంగా, సాధన పరంగా సాధకులు తప్పకుండా బాగా ఆలోచించి చెయ్యాల్సిన విషయమిది. ఇది బాగా గుర్తు పెట్టుకోండి. మనం చిన్న చిన్న కష్టాలకు కూడ చాలా తొందరగా బెంబేలు పడిపోతాము. ఈ లోపల తొందరపడి మనం నమ్ముకున్న గురువుని, దైవాన్ని తిట్టిపోస్తాం. అసలు వీళ్ళందరూ ఎందుకు అంటూ వుంటాం. ఏవో చాలా మాట్లాడుతూ వుంటాం. ఏది మాట్లాడినా వాళ్ళు మాత్రం వీడి మంచికే చేస్తున్నాం, వీడికి తెలియడం లేదు అనుకుంటారు. Appendicitis వచ్చింది. Operation చెయ్యకపోతే చచ్చిపోతాడు. Operation కొంచెం కష్టమేననుకోండి. Operation నాకు వద్దంటే ఎట్లా? అట్లా మనకి మధ్య మధ్యలో జీవితం లో కొన్ని సంఘటనలు ఒక మంచి మలుపు త్రిప్పడానికి వస్తూ వుంటాయి. మనకి ఆ సంఘటన ఆపదగానో, కష్టంగానో కన్పిస్తుంది. అందులోంచి ఒక సుఖం- సుఖమంటే మామూలుగా ఇంద్రియ సుఖం కాదు- ఒక శుభం దాని ద్వారా నిర్దేశింపబడుతుంది. జీవుణ్ణి పరిరక్షించడానికి దేముడు చేసే అనేక ప్రయత్నాలలో ఈ 'సంక్షేప్తా' ఒకటి. వాడికి మంచి కలగాలంటే వాడికట్లా జరగాలి. అట్లా జరిగితేనే మంచి జరుగుతుంది. ఇంకో రకంగా మంచి జరగదు. రాయబారానికి వెళితే దుర్యోధనుడు ఒప్పేసుకున్నాడనుకోండి. మరి భూమిమీద ఎంతోమంది రాజులు, 13 అక్షౌహిణుల

సైన్యం అధర్మాన్ని ఆశ్రయించి వున్న వాళ్ళున్నారు. వాళ్ళందర్నీ ఒక త్రాటి మీదకి ఎక్కించడమే మహాభారత యుద్ధం. ధర్మాన్ని నమ్ముకున్న వాళ్ళు 5 అక్షౌహిణులుంటే, అధర్మాన్ని నమ్ముకున్న వాళ్ళు 13 అక్షౌహిణులున్నారుట. నిష్పత్తి అట్లా వుంది. మరి వీరందర్నీ పోగుచెయ్యాలి కదా! పోగెయ్యాలంటే యుద్ధం జరగాలి. యుద్ధం జరిగినప్పుడు కష్టంగా వుంటుంది. యుద్ధం చేయించాడు, యుద్ధం చేయించాడని జ్ఞానులు కూడ బాగా వాపోయారప్పుడు. వచ్చి యుద్ధం చేయించాడండి, నిర్వాకం అన్నారు. చేయించకపోతే అవదు. బాగా ముందు జరగబోయే మంచి తెలియాలంటే ప్రస్తుతం పడే కష్టం తట్టుకోవాలి. బాగా చదువుకోవాల్సిన వయస్సులో చదువుకోవాలి. చదువుకోకపోతే ఉద్యోగం రావడం ఇంకా కష్టంగా వుంటుంది. కష్టం కాదు, ఈ చదువుకోవడం మూడు, నాలుగేళ్ళ కష్టం. అది జీవితమంతా పడే కష్టం. ఎక్కడికి వెళ్ళినా 'ఏ మాత్రం వచ్చాయి నీకు మార్కులు' అంటారు. 'వాడికి ఉద్యోగం రాదు' అంటారు. బాగా మార్కులు తెచ్చుకున్న వాడికి వస్తుంది. కష్టం వస్తే దానిలోంచి ఒక శుభం నిర్దేశింపబడినదని తెలియాలి. ప్రపంచ యుద్ధం వచ్చిందనుకోండి. రెండవ ప్రపంచ యుద్ధం వస్తే దానివల్ల మంచి జరిగిందా, లేదా అని చూస్తే చాలా మంచి జరిగింది. అంతవరకు కామలోకములో సమస్తమైన, భయంకరమైన జీమూతాలంటారు చూశారా అంత నల్లటి మేఘాలు కమ్మేసి, జాతి అంతా నీరసించిపోయి, ద్వేషాలు, వైషమ్యాలు బాగా పెరిగి మానసికంగా బాగా క్రుళ్ళి వున్నారనుకోండి మనుష్యులు, దానిని సరిదిద్దాలంటే ఏం చెయ్యాలి? ఒకసారి తీసేసి మళ్ళీ పట్టుకొస్తారు. మనం ఐరోపా ఖండం వెళితే, అంతకన్నా బాగా సర్వ నాశనమైన దేశం Germany. అది రెండుసార్లు ఓడిపోయింది ఈ శతాబ్దం లో. మొదటి ప్రపంచ యుద్ధంలో కొద్దిగా దెబ్బ తిన్నది. రెండవ ప్రపంచ యుద్ధంలో బాగా దెబ్బ తిన్నది. దానివల్ల ఏం జరిగిందో తెలుసా? ఈ రోజు Germany దేశం వెళితే మిగతా దేశాల కన్న అది చాల హాయిగా వుంటుంది. ఎందుకంటే విశాలమైన రోడ్లు, కొత్త కొత్త భవనాలు, అన్నీ ఏభై ఏళ్ళ లోపు కట్టినవే వుంటాయి. పాత కొంపలుండవు, కుళ్ళు కంపు కొట్టుకుంటూ. పాత రోడ్లుండవు. సందులు, గొందులు లాంటివి Paris లో వుంటాయేమో కాని మొత్తం Germany అంతా తిరిగినా కనబడవు. మనకి చెంగల్రావుపేట, అల్లిపురం వున్నాయి కదా! కొత్త ఊరు వుంది, పాత ఊరు వుంది. ఆ పాత ఊరిలో వుండమంటే వుంటారా? గతి లేకపోతే వుంటారు. అవకాశం వుంటే వుండరు కదా! తీసేసి అక్కడ కూడా ఇట్లా తయారుచేస్తామంటే ఒప్పుకుంటారా? ఒప్పుకోరు కదా! అందుకని మీ ఒప్పుకోలుతో సంబంధం లేకుండా తీసేశారనుకో. మిమ్మల్ని కాస్త అట్లా పంపించేసి కొన్నాళ్ళు, మీరు తిరిగి వచ్చేసరికి మొత్తం ఊరంతా తీసేసి, విశాలమైన రోడ్లు వేసి, ఇళ్ళు కట్టి ఇస్తే 'అబ్బ చాలా హాయిగా బావుంది' అనుకోరూ? అందుకని మొదట పడిన సంకటమేదైతే వుందో, ఈ సంకటం ఒక శుభాన్ని నిర్దేశించి ఇవ్వబడుతుంది. కాబట్టి ఈ సృష్టిలో సమస్తాన్ని కూడ, అన్ని గోళముల యొక్క కార్యక్రమాన్ని కూడ, మన జీవితమే కాదు, మన కుటుంబ జీవితం, మన సంఘ జీవితం, మన జాతి జీవితం, మన దేశం, ప్రపంచం ఇంకా ఆ పైన మొత్తం మానవ జాతి జీవితం బాగు చెయ్యాలనుకోండి, బాగు

చెయ్యాలంటే ఎట్లా? మనం బాగానే వున్నామని అనుకుంటే సరిపోదుగా. అటువంటి పరిస్థితి వచ్చినప్పుడల్లా ఒకసారి మార్పు జరుగుతూ వుంటుంది. ఆ మార్పు నుండి మనకి మంచే నిర్దేశింపబడుతుందని తెలియాలి. అదేకదా కృష్ణుడు చెపుతాడు భగవద్గీతలో. మీలో బాగా రాగద్వేషాలతోను, కామక్రోధాలతోను, మదమాత్సర్యాలతోను నిండియుండి, జీవుడు చాలా బాధ పడుతున్నారు. కాబట్టి ఇందులోంచి వీళ్ళని తొలగిస్తే, పుచ్చిపోయిన శరీరాలు తీసేసి, మంచి శరీరాలు ఇస్తే కాస్త బాగు పడతారేమోనని ఒక ప్రయత్నం, surgery అన్నమాట. మనకి కూడ కొన్ని సన్నివేశాలలో అప్పటికి కొంచెం కష్టంగా వున్నట్టు అనిపించినా తరువాత అది చాలా మంచికే జరిగిందని అనిపించేవి బోల్డుంటాయి చూసుకుంటే. నాకు Engineering లో seat రాలేదు. అప్పుడు బాధ పడ్డాను. తరువాత ఎంత సంతోషించానో. ఒక అయిదారేళ్ళ తరువాత చాల సంతోషించాను. అది రాకపోవడమే మంచిదయిందని. ఎంత మంచి జరిగిందని. వచ్చి వుంటే ఇంకో రకంగా వుండేది. అట్లాగే మా అన్నయ్య గారికి Engineering లో సీటు రాలేదు. ముందు బాధ పడ్డాడు. ఒక అయిదేళ్ళు గడిచేసరికి రాకపోవడం వలన మంచి జరిగింది. I.A.S. officer అయిపోయాడు. కాబట్టి కొన్ని కొన్ని జరగకపోవడం వలన ఎంత మంచి జరుగుతుందో మనకి తెలుస్తుంది, స్వానుభవము మీద. మనం తొందరపడి ఇవాళ ఏమైనా సరే ఊరెళ్ళాలి అనుకున్నప్పుడు, ఆ ఊరు వెళ్ళబోతూ వుంటే ఏదో ఆలస్యమైంది. మనం వెళ్ళేసరికి train వెళ్ళిపోయి మనం ఉండిపోతే, ఆ తరువాత ఆ trainకి ఏదో ఆపద వచ్చి అక్కడెక్కడో ఆగిపోయిందిట, రెండు రోజులు అక్కడే వుందిట అన్నం, నీళ్ళు లేకుండా అన్నారనుకోండి. అలాటప్పుడు వెళ్ళకపోవడమే మంచిదైంది అనిపిస్తుంది కదా! పిల్లి ఎదురొచ్చిందని ఆగిపోయి పిల్లిని తిట్టుకున్నామనుకోండి, పిల్లి ఏం చేస్తుందంటే ముందుగా చెపుతుంది. బాగులేదులే నువ్వు వెళ్ళే పని, అందుకు ఆగు అని. అట్లా పిల్లి రాకూడదనుకోకూడదు. పిల్లి వస్తే అందులోంచి వచ్చే సందేశం పుచ్చుకోవాలి. మనం శుభమా అని బయలుదేరుతూ వుంటే ఎవరో తుమ్ముతారు. తుమ్మితే వాళ్ళ మీద మనకి చాలా కోపం వస్తుంది. మానసికంగా వాళ్ళని almost నిలువునా చీరేస్తాం. చాలా పెద్ద పనిమీద వెళుతున్నాం. చాలా పెద్ద ప్రయాణం పెట్టుకున్నాం. హాచ్ అని తుమ్ముతారు. నీవు పెట్టుకున్న timing of events బావులేదు. అది మార్చుకో అని చెప్పడానికి తుమ్మాడని తెలుసుకుంటే శకున శాస్త్రం సరిగ్గా తెలుస్తుంది. ఒక్క రెండు నిముషాలు కూర్చోమని చెపుతారు. రెండు నిముషాలు కూర్చోవడం వల్ల కొన్ని events మారిపోతాయి. ఒక ముహూర్తం కూర్చోమంటారు. అంటే నాలుగు నిముషాలు కూర్చుని, మంచినీళ్ళు త్రాగి మళ్ళీ బయలుదేరమనడంలో ఉద్దేశ్యమేమిటంటే, ఒక sequence of events వుంటాయి. నువ్వు బయలుదేరేముందు వాడు తుమ్మాడు. లేకపోతే పిల్లి ఎదురుగుండా వచ్చింది. ఒంటి బ్రాహ్మడు ఇలా బోల్డున్నాయి మనకి. వాళ్ళు ఎదురు రాగానే చూసి, ఇప్పుడు ఈ sequence of events లోకి వెళితే మనకి ఏదో ఒక ఆపద నిర్దేశింపబడి యుంది. అది తప్పించుకోవడానికి ముందే మనకి సంకేతంగా వచ్చాయని మనకి తెలియదు. అంటే మనం రోడ్డుమీద వెళుతున్నామనుకోండి, అప్పుడు వెళ్ళే time లో

ఏదో ఒక breaks లేని బండి అడ్డంగా రావచ్చు. మనం రెండు నిముషాలు కూర్చోవడం వల్ల అది వెళ్ళిపోతుంది. ఒక్క నిముషం చాలు మార్పు రావడానికి. ఎందుకంటే ఆ sequence అట్లా అట్లా వెళితే, ఎక్కడ దీనికి సంబంధించి వున్నాయో అవన్నీ ఇక్కడ రెండు నిముషాలో, నాలుగు నిముషాలో కూర్చోవడం వల్ల మనకవి తప్పిపోతాయి. అది తెలుసుకోవడం కోసమే శకున శాస్త్రం తప్ప, శకున పక్షి అని తిట్టడానికి కాదు. ఈ విధంగా ఇచ్చే సందేశాన్ని వింటూ వుంటే, మన చుట్టూ వుండే ప్రదేశాల నుండి బోల్డు సందేశాలొస్తాయి. చల్లని గాలి వచ్చిందనుకోండి. బయలుదేరమని అర్ధం. మొహం మీదకి దుమ్ము ఎగిరి వచ్చిందనుకోండి. ఆగమని అర్ధం. ఇట్లా ప్రకృతి ఏం చెప్తుందో కార్యం మొదలు పెట్టేముందు చూసుకుంటే, వాటిద్వారా దాని ప్రకారం ఆగాలి. మనకి ప్రస్తుతానికి అది అంత సంతృప్తికరంగా లేనందువలన బాధ పడడం కాదు చెయ్యాల్సినది. Ability to wait. రాముడికిపట్టాభిషేకం చేద్దామనుకుంటే సరాసరి అదే సమయానికి అరణ్యానికి వెళ్ళిపోయాడు. ఇట్లా మనకి చాలా సన్నివేశాలుంటాయి. ప్రతి వాళ్ళ జీవితంలోను వుంటాయి. కాబట్టి మన వరకు ఈ సన్నివేశాలలో నుండి తెలిసినదేమిటంటే ఎవరికి ఎప్పుడు ఏం జరిగినా సరే, భగవంతుడు వారి మంచి ఉద్దేశించే చేశాడని మిగతా వాళ్ళ గురించి అనుకోవడం కాదు. మన గురించి అలా అనుకోవాలి. మనకు ఎప్పుడు ఎక్కడ ఏం జరిగినా సరే ఇందులో భగవంతుడు నాకు మంచే నిర్దేశించాడు. భగవంతుడు నీ తండ్రి అని నీకు నమ్మకం వుంటే, విశ్వాసం వుంటే నీ తండ్రి నీకు ఎప్పుడూ కీడు ఎంచడు, మేలే ఎంచుతాడనే భావన నీకు వుంటే జరిగిందల్లా మంచిదే. అందుకే 'అంతయు మన మేలుకే' అని మనకి ఒకటవ క్లాసులో ఒక కథ వుండేది. ఏం జరిగినా భగవంతుడు మన మంచి నిర్దేశించే ఇస్తాడు. డబ్బు ఇచ్చాడనుకోండి. ఏదైనా మంచి నిర్దేశించే మనకి ఇచ్చాడు. అది లేకపోతే ఇక నియమాలు పాటించం. అది వుండడం వలన కొన్ని నియమాలు పాటిస్తాం. నాకు డబ్బు ఎందుకు ఇచ్చాడు అని questioning తీరులో వుండకుండా తండ్రిని ఎద్దేవా చేసేవాడు, తండ్రిని ప్రశ్నించేవాడు, అసలు నాకు ఇట్లా ఎందుకు చేశావని ప్రశ్నించేవాడు సరియైన కొడుకు కాదు. రాముడు అడగలేదు కదా ఏమిటి ఇట్లా చేశావు నా సంగతి అని. కాబట్టి భగవంతుడు సమస్త జీవులకి తండ్రి వంటి వాడు కాబట్టి అపారమైన కరుణ కలిగిన వాడు కాబట్టి భగవంతుడు ఎవరిని ఏ సన్నివేశములో, సంఘటనలో వుంచినప్పటికి కూడ అందునుంచి నేర్చుకోవలసినది ఒకటి వుంది. అది నువ్వు నేర్చుకోవడం ఆయనకి ఇష్టం. నువ్వు నేర్చుకోవడం పూర్తయ్యేసరికి ఆ సన్నివేశం మారిపోతుంది. అది నేర్చుకోనంతవరకు అందులో పెడతాడు. Pass కానంత వరకు ఆ class లోనే వుంచుతారు. Pass అయిన తరువాత ఇంకో classకి పంపిస్తారు. నేను pass కాను, అయినా నన్ను ఆ class లోనే వుంచారంటే ఎట్లా? అందుకని ఎవరు దేంట్లో వున్నారో అప్పుడు అది వారికి అవసరమైన విషయం. అక్కడ నుండి పెరగడానికి చెయ్యవలసినది పరిపూర్ణంగా చెయ్యకుండా ఉండడం వలన నువ్వు అక్కడే ఉన్నావు. అది నువ్వు నేర్చుకునే వరకు నీకు దారిలేదు. అదీ ఆయన లెక్క. ఎందుకంటే అది నేర్చుకోకుండా ముందుకు వెళితే, మళ్ళీ నాలుగు అడుగులు వెనక్కి వెయ్యాలి. ఇటుక మీద ఇటుక అలా

పేర్చుకుంటూ మనం గోడ కట్టేసేమనుకోండి, సరిగ్గా తడపకుండా. తొందరగా అయిపోవాలి కదా మనకి. అంతా తొందరగా అయిపోవాలని వుంటుంది. అన్ని ఇటుకలు పెట్టిన తరువాత, దానిమీద roof కూడా వేసుకున్న తరువాత, హాయిగా నవారు మంచం వేసుకుని పడుకోగానే మొహం మీద పడిందనుకోండి. అంతవరకు రానివ్వకుండా ఇటుక పెట్టినప్పుడే పడిపోయేటట్టుగా చేశాడనుకోండి. Roof వరకు వచ్చి పడేదాని కన్నా ఇది సుఖం కాదూ? విదురుడు కూడ ఇదే చెప్తాడు. ముందు సుఖం వచ్చి, తరువాత కష్టం వస్తే కష్టం. ముందు కష్టం వచ్చి తరువాత సుఖం రావాలి. ముందు కష్టం రావడంలో మనిషిలో లోతులు పెరుగుతాయి. లోతుల్లోంచి పెరుగుతాడు కాబట్టి ఆ పెరుగుదల మళ్ళీ క్రింద పడేటట్టుగా వుండదు. మనం సరియైన పద్ధతిలో పెరగలేదనుకోండి, మనల్ని పడేశారనుకోండి, పడెయ్యడం మంచిదవుతుంది. నా అనుభవంలో వ్యాపారంలో చాలామందిని చూశాను. వ్యాపారంలో సరియైన పద్ధతిలో కాకుండా చాలా వేగంగా పెరిగినవాళ్ళు, కొంతదూరం వెళ్ళిన తరువాత దభేలున పడిపోతారు. ఆ పడ్డం ఎట్లా పడతారంటే తట్టుకోలేనంత పడిపోతారు. కారణం ఏమిటంటే పెరుగుదలలో వేగం ఎక్కువ, పద్ధతి తక్కువ. కొంతమంది పెరుగుదల నెమ్మదిగా వుంటుంది. పద్దతిగా వుంటుంది. ఒక పదిహేనేళ్ళకి పెరుగుతారు. నేను ఎప్పుడూ అందుకని చెపుతూ వుంటాను. పరిమాణం లో పందిపిల్ల, ఏనుగు పిల్ల రెండూ పుట్టినప్పుడు ఒకటిగానే వుంటాయిట. పందిపిల్ల ముందు పెరుగుతూ వుంటుందిట. ఏనుగు పిల్లకన్నా తొందరగా పెరుగుతుంది. పెరుగుతూ వుంటే ఏనుగు పిల్లని చూసి ఇది అంత పెరగదేమిటి, పందిపిల్లే నయం అనిపిస్తుందిట. ఏనుగు పిల్ల పెరగడం మొదలుపెట్టిన తరువాత అసలు మనం అవాక్కైపోతాం. ఎక్కడ పంది? ఎక్కడ ఏనుగు? అందుకని నెమ్మదిగా నెమ్మదిగా పేరిగినా ఏపుగా పెరిగేది ఏనుగు. పందిపిల్ల తొందరగా పెరిగినా అంతంత మాత్రమే పెరుగుదల. అశుద్ధాలు తింటూ వుంటుందంతే! అది పంది. ఇది మాకు ఒక ఉపమానంగా చెప్పేవారు. అట్లాగే కుందేలు, తాబేలు కథ వున్నాయి కదా! ఇవన్నీ మనకి చాల అక్కరకు రావాలి జీవితంలో. అక్కరకు వస్తే బావుంటుంది. నెమ్మదిగా పెరిగినా పర్వాలేదు. పెరిగిందల్లా గట్టి. తొందరగా పెరిగాం పడిపోయాం. ఏమిటి ఉపయోగం? ఒక కప్ప ఒక అడుగు ఎగురుతోంది రోజుకి. ఇంకోటేమో నాలుగు అడుగులు ఎగురుతోంది, మూడడుగులు పడిపోతోంది. ఏది చేరుతుంది బావి అంచుకి? అందుకని 'సంక్షేప్త' లో మనం చూడవలసినది, పడ్డాం అనుకోండి. పడితే ఆ పడ్డంలోంచి నేర్చుకోవలసినది నేర్చుకుంటాం. మనకి పడ్డవాళ్ళ కథలు బోల్డు చెపుతారు. పురాణాల నిండా అవే వుంటాయి కదా! వినాయకుడు, కుమారస్వామి అన్నీ తిరిగి రావాలంటే, ఈ వినాయకుడు ఏమనుకోవాలి? ఏం అనుకోలేదుట. ఎప్పుడూ కష్టంగా కనిపించేదాంట్లో ఒక క్షేమం వుందండి. అదీ 'సంక్షేప్త'. ఇది మన జీవితంలోకి బాగా అందుకోవాలి. కష్టం వస్తోందంటే గుళ్ళ చుట్టూ తిరుగుదాం, గ్రహాల చుట్టూ తిరుగుదాం అవి పెద్ద ఉపయోగం లేదు. ఏమీ అనుకోవద్దు. ఏదో మనలో వుండే భయం చేత వాటిచుట్టూ తిరుగుతూ వుంటాం. తొంభై శాతం భక్తి అంతా భయం. అంతేగా! ఎంత భయం వుంటే అంత భక్తి వస్తుంది? పరీక్షలు

వస్తున్నాయంటే దేముడు గుర్తొస్తాడు. మళ్ళీ మధ్యలో vacation లో. ఆయనకీ vacation. హాయిగా తిరగచ్చు. మన బాధలు ఆయనకి వుండవు. మళ్ళీ ఇంకో వారం రోజుల్లో పరీక్షలు వస్తున్నాయిట అంటే మళ్ళీ ఆంజనేయస్వామి వాళ్ళూ అంతా busy అయిపోతారు. వినాయకుడు, ఆంజనేయస్వామి, రాముడు ఇలా అబ్బో ఏమి తిరుగుతారో గుళ్ళ చుట్టూ. మళ్ళీ results వస్తే ఏమీ వుండదు. బాగా వస్తే ఒక కొబ్బరికాయ కొట్టేస్తాం. లేకపోతే అది కూడ ఆయనకి దక్కుడు లేదు. అట్లా మనం అన్నీ కూడ దేనికో ముడి వేసుకొని అది భక్తి అనుకొంటూ వుంటాం. అలాకాదు. పరీక్ష pass అవలేదు. ఎందుకు pass అవ లేదు? ఎందులో తక్కువ వచ్చినాయి? అది నీకు రాదన్నమాట. అది బాగా చదువుకోకుండా నువ్వు మళ్ళీ అదే పనిచేస్తే, మళ్ళీ ఆ పరీక్షలో మళ్ళీ తప్పుతావు. నువ్వు గుళ్ళచుట్టూ తిరిగినప్పుడు నీకు ఏం రావాలంటే ఆ subject బాగా చదువుకునే స్ఫూర్తి రావడానికి తిరగాలి. ఈ subject నాకు బాగా రావడానికి స్ఫూర్తివ్వు దేవా అని అడగాలి. అంతేకాని నేను ఈ subject చదవను, గుళ్ళచుట్టూ తిరుగుతాను నువ్వు pass చెయ్యి అంటే జరుగుతుందని ఎవరైనా చెపితే మీరు నమ్మవద్దు. ఏ పనియైనా మన చేతే చేయిస్తాడు తప్ప చేసిపెట్టడు. గుర్తు పెట్టుకోండి. ఎందుకంటే నువ్వు సమర్థుడివి కావాలి కాబట్టి. తనంతటి వాడు కావాలి కాబట్టి. ఆయనే చేసిపెడుతూ వుంటే చొక్కాలు కూడ మనంతట మనం వేసుకోము కదా! ఇంక మిగతా విషయాలకి ఏముంది? లేవగానే పళ్ళు తోముతావా అన్న దగ్గర్నుంచి మొదలుపెడతాం. నీ పళ్ళు నువ్వు తోముకోవడం, ఇంకేవో కడుక్కోవడం, మన స్నానం మనం చెయ్యడం, మన బట్టలు మనం వేసుకోవడం మనకి మనంగా చేసుకోవడమనేది నేర్చుకోవాలా? వద్దా? తండ్రి యైనవాడు ఏం కోరుకుంటాడు కొడుకు దగ్గర్నుండి? సమర్థవంతుడు అవ్వాలి. తనంతటి వాడు అవ్వాలి అనుకుంటాడు. అలా అవాలంటే నువ్వు తోముకోరా నీ పళ్ళు అంటేనే నీకు బాధగా వుంటే ఎట్లా? పళ్ళు తోముకోను. బద్ధకంగా వుంది. అంటే అంగారకుణ్ణి పట్టుకోమంటే కుజ గ్రహానికి ఏవో దానాలు ఇచ్చుకుంటూ అక్కడ కూర్చున్నామనుకోండి. ఏమొస్తుంది? నీలో ఇష్టంలేని పని మానేసే బుద్ధి వుందనుకో, శని వస్తాడు. చచ్చినట్టు చేయిస్తాడు. డొక్క చింపి చేయిస్తాడు. ఏడున్నర ఏళ్ళలో నీకు ఇష్టం లేనివన్నీ, అడ్డమైనవన్నీ నీ చేతే చేయిస్తాడు. ఎందుకంటే నువ్వు ఆ విషయం నుండి ఎదగాలని. శని వచ్చాడంటే జాతకం తీసుకుని వెళితే ఆయనేమో శని గ్రహానికి రోజూ నూనె దీపం పెట్టు. దానిచుట్టూ ఎనిమిది సార్లు తిరుగు. లేకపోతే ఎనభై సార్లు తిరుగు. అక్కడ మందపల్లి వెళ్ళు. శింగణాపురం వెళ్ళు -- ఏమిటీ గోల? అదా? ఏమిటి నిర్దేశించాడు శని నీకు? నీలో కొన్ని పరిమితులు వున్నాయి. అవి తీసెయ్యడానికి నేను వస్తున్నాను. నువ్వు తీసేసుకుంటావా, నన్ను వచ్చి తీసెయ్యమంటావా? దొంగతనం చేస్తున్నామనుకోండి, ఇంటికి ఏదో ఒకరోజు police వాడు వస్తాడు. దొంగతనం మానను, మాఇంటికి police వాళ్ళు రాకూడదని దణ్ణం పెట్టుకుంటే ఎట్లా వుంటుంది? ఇవన్నీ మనకి ధర్మాన్ని అవలంబింప చెయ్యడానికి, తద్వారా మనల్ని మనం ఉద్ధరించుకోవడానికి ఇవ్వబడిన సూత్రాలకు వక్రభాష్యం చెప్పుకుని ఇంత చెత్తగా తయారు చేసుకున్నామండి. ఏమీ అనుకోవద్దు. అదీ గోవర్ధనగిరి

పర్వతం ఎత్తినప్పుడు శ్రీకృష్ణుడు చెపుతాడు. 'వాళ్ళకి, వీళ్ళకి పూజలంటావేమిటి?' అని. మన గ్రహాలకి చేసే పూజలు లాంటివే నందుడు, ఇంద్రుడికి చేస్తాననాడు. 'అవేం నీకు పనిచెయ్యవు నాన్నా, నీకు పనిచేసేవి నువ్వు చేసేవే. నువ్వు చేసినది నీ వెంట వస్తుంది. ధర్మం నీ వెంట కడదాకా వస్తుంది. అధర్మం అట్లాగే వచ్చి నిన్ను శిక్షణ ఇస్తూ వుంటుంది' అని చెపుతాడు. కనుక శతవిధాలుగా ప్రయత్నిస్తాడుటండి భగవంతుడు, జీవుణ్ణి మళ్ళీ తన దగ్గరకి తెచ్చుకోవడానికి. ఎందుకంటే తనే పంపించేశాడు కాబట్టి. వెళ్ళి ఆడుకోరా అంటే వాడు ఏమిటేమిటో చెయ్యడం మొదలుపెట్టాడు. ఆడుకోమని ఏదో ఇస్తే పోట్లాడుకున్నారనుకోండి. పోట్లాడుకోమని తండ్రి నిర్దేశించడు కదా! మళ్ళీ వాడికి ఎట్లా ఆడుకోవాలో నేర్పడానికి తాపత్రయ పడుతూ వుంటాడు. ఈ తాపత్రయ పడ్డంలో నేర్పేవన్నీ కష్టంగా వుంటాయి. కష్టంగా వున్నట్లుంటాయి. ఇవాళ్టికి మనం అనుకుంటూంటాం మాస్టర్ సి.వి.వి. గారు ఆరింటికే ఎందుకు పెట్టారు prayer చేసుకోవడం. ఏ ఏడింటికో, తొమ్మిందింటికో పెడితే బావుండును. మళ్ళీ సాయంత్రం కూడా ఆరింటికి పెట్టారు. మేకులాగ ఎటూ పోవడానికి లేకుండా కదా! ఇట్లా వుంటాయి. ఎందుకంటే? ఎద్దు ముక్కుకు త్రాడు వేయకపోతే ఎట్లా? ఎద్దు ముక్కుకి త్రాడు వేసి దానిచేత కృషి చేయిస్తేనే కదా ఏదైనా వస్తుంది. అందుకని నియతి లోనికి రావడానికి, నియమం లోనికి రావడానికి, నిష్ఠ లోనికి రావడానికి కొన్ని కొన్ని సన్నివేశాలు వస్తూ వుంటాయి. They are perfect arrangement. అని చెపుతుంది ఈ నామం. నీకు వచ్చిందల్లా నీ మంచికే. ఎప్పుడో ఎందుకు? ఇప్పుడే రావాలి. తరువాత రాకూడదు. ముందు రాకూడదు. ఏది ఎప్పుడు ఎట్లా రావాలో అట్లా వస్తుందిటండి. అర్థం చేసుకుంటే ఈ నామం మనకి అవగాహన అవుతుంది. 'సంక్లేష్ట'. ఏదో miss అయిపోయామని ఒక్కొక్కసారి బాధపడుతూ వుంటాము కదా! జరిగిందల్లా సరిగ్గా జరిగినట్టే. ఇంక దాని గురించి అట్లా జరగాల్సినది కాదు, ఇట్లా చేస్తే బావుండేది, అట్లా చేస్తే బావుండేది అని బోల్డు చెప్పుకుంటాం కదా అయిపోయిన తరువాత. అవన్నీ కేవలం మన మనస్సులో వుండే గజిబిజి. ఆ గజిబిజి కారణంగా దాని గురించి ఇట్లా అనుకుంటూ వుంటాం. అవాల్సినది అయిపోయింది. శుభ్రంగా వంట చేద్దామనుకుంటాము. ఎందులోనో ఏదో ఎక్కువైందనుకోండి లేకపోతే తక్కువైందనుకోండి. అయిపోయిందిగా. వచ్చాడు వాడికి పెట్టారు, తినేశాడు. వాడి దంతసిరిని బట్టి వచ్చిందంతే. కొంతమంది వస్తే వంట బాగా కుదురుతుంది. కొంతమంది వస్తే వంట బాగా కుదరదు. వంట బాగా చెయ్యకూడదని చెయ్యరు కదా! వాడికి అంతే. వాడికి అట్లా తక్కువగానే రావాలి. వీడికి ఇట్లా ఎక్కువగానే రావాలి. అట్లా వస్తూ వుంటుంది. అందుకని జరిగిన దానిగురించి మనం చేస్తామే విచికిత్స, అది అనవసరం. ఇది చెపుతుంది ఈ నామం, ఈ తత్త్వం. అందుకని దైవము మీద ఆరోపణ లున్నాయనుకోండి, పెట్టుకోవద్దు. నీ మంచికే వున్నాయి. ఇవి లేకపోతే నువ్వు సామాన్యుడేమీ కావు గురూ. అందుకని వున్నాయి. చిన్నవాడివి కాదు నువ్వు. ఆ మాత్రం తొక్కి వుంచితేనే తప్ప నువ్వు మరీ రెచ్చిపోతావు, అని జీవుణ్ణి ఎక్కడ త్రొక్కితే వాడు

నియతుడవుతాడో అక్కడ త్రొక్కి వుంచుతాడండి. ఉంచకపోతే వాడట్లా వెళ్ళిపోతాడు. అదే మార్గంలో తనని తాను ఇంకా నశింప చేసుకుంటూ వుంటాడు.

# 623 క్షేమకృత్

ముందు చేదుమందు ఇచ్చి, రోగం నయం చేసిన తరువాత అప్పుడు చారునీళ్ళు పెట్టినా చాలా బావుంటుంది. మామూలుగా రోజూ చారునీళ్ళు త్రాగమంటే ఎవరూ త్రాగరు. ఏంరా చారు అన్నం తింటావా అంటే పదిహేను రోజులు తరువాత మహాప్రసాదమనుకుంటారు. తింటావా అని అడుగుతావేమిటి? అన్నట్లుంటుంది. మామూలుగా మనని ఇంట్లో చారు పోసుకుంటావా అంటే, ఇంకేం లేదా అంటాం. ఇప్పుడు అది ఒక్కటైనా చాలు. ఎందుకంటే అంత క్షేమంలోకి వచ్చేశావు నువ్వు. సంక్షేప్త లోంచి చారునీళ్ళైనా ఆనందంగానే వుంటాయని అనుకోవడంలోకి వచ్చేసావు. అప్పుడు నీకు చారునీళ్ళే కాదు అన్నీ తినే అవకాశం కల్పిస్తారు. అందుచేత సంక్షేప్త నుంచి 'క్షేమకృత్' క్షేమం కలిగించేవాడు. మరి ఆపదల్లోంచి ఇటువంటి క్షేమాలు పొందిన వాళ్ళు ఎంతమంది వున్నారు. అర్జునుడికి శివుడి దర్శనం దొరికేదా అరణ్యంలోకి పోకపోతే. పాశుపతం సంపాదించే ప్రశ్నే లేదు కదా! పాండవులు ఎంతమంది మహాత్ముల దర్శనం చేశారు అరణ్యవాసం చెయ్యడంతో. మార్కండేయుడితో సహా అందర్నీ చూశారు కదా! మరి ఇంతమందిని చూడగలిగి యుండేవాళ్ళా? మామూలుగా మనం వెళ్ళి చూస్తామండీ? కష్టాలు వచ్చినప్పుడే కదా మహాత్ములని కాని, పుణ్యక్షేత్రాలని కాని దర్శనం చేస్తాం. లేకపోతే మనకేం పట్టదు. అరణ్యంలో రాముడు అప్పుడప్పుడు అనుకుంటాడు కైకేయి నాకు ఎంతో మేలు చేసిందని. చాలా మంది మహాత్ములని దర్శిస్తాడాయన. ఈయన రావడం వాళ్ళని అనుగ్రహించడం కోసమని వాళ్ళు అనుకుంటారు. వాళ్ళని చూడ్డమే తనకి మహాభాగ్యమని రాముడు అనుకున్నాడు. ఎందుకంటే రాముడు తను కారణజన్ముడని ఎప్పుడూ అనుకోలేదు. మానవుడిగా మహాత్ముల దర్శనం మహద్భాగ్యంగా భావించి, ఎంతో ఉపకారం చేసింది కైకమ్మ అనుకుంటాడు. ఇట్లా మనకి క్షేమంకరమైన విషయములు అందులోంచి అమరి వస్తాయి. ఆ విధంగా అది క్షేమానికి నాంది. ఇది క్షేమం లో ఉంచడం. అక్కడ నుండి లోపల ఆనందం కలగడం అది శివం. ఎప్పుడూ ఒక రకమైన తృప్తి, ఆనందం కలిగి వుండడమనేది అవసరం. అందుకని అది వచ్చినా, ఇది వచ్చినా అంటే సంక్షేప్త అయినా, క్షేమకృత్ అయినా లోపల ఆనందంగా మిగిలిపోతాడు. అది ఎందుకు ఇచ్చాడోలే, దానివల్ల ఏదో ఉపయోగముంటుంది అనుకుంటాడు. ఇది ఎందుకు వచ్చిందో, దీంట్లో కూడ ఆనందం, దాంట్లో కూడ ఆనందం. ఏదో వుంది కాబట్టి భగవంతుడు నిర్దేశించాడు. అందుకని రెండు రకాలుగా కూడ లోపల శివము లేక శుభము, ఆనందము కలిగివుంటాడు. ఇవన్నీ మనలో పనిచేసే భగవత్తత్త్వాలన్నమాట. 'సంక్షేప్త, క్షేమకృత్, శివః' మనకి ఈ శివం ముందే దక్కితే దెబ్బ తింటాము. ఇది తెలిసిన తరువాత అందులో నిలబెడితే తరగని శివముంటుంది. తరగని ఆనందం వుంటుంది. తరగని స్థిరత్వం వుంటుంది. ఎందుకంటే శుభం జరుగుతోంది. బావుంది. క్షేమం కలిగిస్తున్నాడు బావుంది. ఆపద కలిగిస్తున్నాడు. క్షేమం కోసమే ఆపద కూడ. అదే కదా కుంతీదేవి ప్రార్థన. 'ఏం

కావాలి అత్తయ్యా మనకి ఇదే last interview. ఇంక మళ్ళీ కనబడను, నీవు ఏమైనా అడగదలచుకుంటే అడుగు' అని కృష్ణుడు కుంతీదేవిని అడుగుతాడు. అంటే ఆవిడ 'నీ గురించిన మధురమైన భక్తి నాకు అబ్బడానికి కారణం నాకు చిన్నప్పటి నుండీ వచ్చిన కష్టాలే. అవి లేకపోతే నిన్ను తలచుకుని వుండేదాన్ని కాదు. కాబట్టి నాకు ఆ programme continue చెయ్యి' అని అడుగుతుంది. 'నాకు కష్టాలే ఇవ్వు. ఇస్తే నేను నీతో వుంటాను. లేకపోతే నిన్ను తలచుకోలేను' అంటుంది. కష్టాలే లేకపోతే కుంతి చరిత్ర ఎట్లా వుండేదో మనం చెప్పలేము. ఎందుకంటే ఆవిడే ఆ మాట అంటోంది. అందుకని ఆవిడ ఎప్పుడూ శివము నందే వుంది. ఎందుకంటే ఆ ఆపద కారణంగా భగవంతుడిలో వుండడంలో వుండే రుచిని అనుభూతి చెందడం చేత కష్టం తెలియదు. అందుకని కష్టం కారణంగా ఇంత ఉపకారం జరిగింది కాబట్టి అట్లాగే వుండనియ్యి నన్ను, అంది. చాలా ఆశ్చర్యంగా వుంటుంది. మొట్టమొదట మనం భాగవతం చదువుకున్నప్పుడు sick lady ఏమో కుంతి, continuous గా కష్టాలు పడడం వలన mind కొంచెం negative అయివుంటుంది. ఇటువంటి భావాలు intellectual గా  తెలివైన వాళ్ళమని అనుకుంటాం. లోతుల్లోకి వెళితే వీళ్ళందరి గురించి తెలుస్తుంది, ఎంతెంత లోతుల్లోంచి వచ్చారో. కుంతి లోతు మనకి ఏమి తెలుసు? సినిమాలు చూస్తే తెలియదు. సన్నివేశాలలో కుంతి ఎట్లా ప్రవర్తించిందనేది చదువుకుంటే తెలుస్తుంది. ఎంత నైపుణ్యంతో వీళ్ళందర్నీ కాపాడుకుంటూ వీళ్ళని ఆ కుర్చీ ఎక్కించిందో, ఆవిడ! ఆ కుర్చీలో తన కొడుకు కూర్చోవడానికి ఈవిడ చేసిన రాజకీయం ఎంత వుందో మీకేమి తెలుసు? అంతా దేవుణ్ణి ఆధారం చేసుకుని చేస్తుంది. నోట్లోంచి మాట రాకుండా, ఎక్కడా మాట పోగొట్టుకోకుండా, ఉపన్యాసాలు చెప్పకుండా, రోడ్డుమీద పడకుండా అందర్నీ ఈవిడ మొహం చూస్తేనే guilty గా feel అయేటట్టుగా చేస్తుంది సన్నివేశాలు. కుంతీదేవిని చూడగానే భీష్మడికి బాధ. మనం అధర్మం చేశాం కదా అనిపించేటట్టుగా చూస్తుంది. అనదు. విదురుడికీ అట్లా అనిపిస్తుంది. ధృతరాష్ట్రుడికీ అట్లా అనిపిస్తుంది. గాంధారికీ అట్లా అనిపిస్తుంది. మనదే విజయం మానసికంగా. ఇంకా మనం చూస్తే daily basis అంటామే, కుంతిని చూడగానే విదురుడు, భీష్మడు, గాంధారి ముగ్గురు ఈవిడకి అన్యాయం చేశామని గుర్తు వచ్చేటట్టు చేస్తుంది. మరి ఎంత చేసిందో ఆవిడ. చిట్టచివరికి కొడుకుల కోసం ఆ కొడుకు కర్ణుడి దగ్గరకెళ్ళి ఎట్లా అడిగి వచ్చింది? చదువుకోవాలి. అంటే మహాభారతంలో ఒక్కొక్క పాత్రకి దాని విశిష్టత దానికుంది. అలాగే రామాయణంలో. ముందు మామూలుగా చదువుకోవడమొకటి. రెండవది పాత్ర వారీగా రామాయణం చదివామనుకోండి. భరతుణ్ణి పట్టుకుని రామాయణమంతా భరతుడి ప్రసక్తి ఎక్కడ వస్తే అది అంతా పోగేసుకొని చదువుకోవాలి. హనుమంతుణ్ణి పట్టుకుని చదివెయ్యాలి. లక్ష్మణుణ్ణి పట్టుకుని చదవాలి. అమ్మవార్ని పట్టుకుని చదవాలి. అయ్యవార్ని పట్టుకుని చదవాలి. ఇట్లా మనం చదివామనుకోండి. భగవంతుడి చుట్టూ వుండి కార్యక్రమంలో పాల్గొన్న వాళ్ళందరూ కూడా సామాన్యులు కారు కదా! చాలా అత్యున్నతమైన జీవులు. దైవీ స్వభావము పుణికి పుచ్చుకొని వుండకపోతే, అటువంటి వెలుగుల చుట్టూ తిరగలేరు కదా! వాళ్ళు ఎట్లా వున్నారు?

తెలుసుకోవచ్చు. లక్ష్మణుణ్ణి చూశామనుకోండి, ఇద్దరు కనిపిస్తారు. ఒక ప్రక్క పరమ భక్తుడు కన్పిస్తాడు. మరొక ప్రక్క పరమ మూర్ఖుడు కన్పిస్తాడు. అంటే ఏమిటి? మనలో కూడ అలా వుండవచ్చు. భక్తుడు అయినంత మాత్రమున మూర్ఖుడు కాడని ఏమీ లేదు. రెండూ వుండవచ్చు. భరతుడు రాగానే 'మనం ఈ మాత్రం కూడ బ్రతకడం వాడికి ఇష్టంలేదు వచ్చేశాడు' అనేస్తాడు. అట్లా అన్నవాడు రాముడితో రాముడు తప్ప దిక్కు లేదు, అతడే సర్వస్వం అన్నట్టుగా వున్నాడుగా! అటువంటి స్థితులుంటాయా అంటే ఉంటాయని చెపుతోంది రామాయణం. అట్లాగే హనుమంతుడి విషయంలో కూడ కనిపిస్తాయి కొన్ని కొన్ని. మనం ఏం చేస్తామంటే అందులో వుండే miracle ని ఏరుకొని, వాటితోనే వాళ్ళని చూడ్డమనేది నేర్చుకుంటాం. అందుకని వాళ్ళు perfect అనుకుంటాం. ప్రస్తుత ప్రపంచంలో అట్లా ఎవరైనా లేకపోతే 'వాళ్ళు అబ్బే ఏం లేదండి' అంటాం. కానీ కాదు. అంత ఉత్తమమైన సంస్కారములున్నా కూడా ఇటువంటి గుణములు వుండవచ్చని చెప్పడానికి హనుమంతుడి యొక్క inconsistency చూపిస్తాడు అప్పుడప్పుడు. ఎందుకని? కోతి శరీరంలో వున్నాడు కాబట్టి దాని స్వభావం అప్పుడప్పుడు ప్రకోపిస్తూ వుంటుంది. ఆయనేం మహాత్ముడండి, ఆయనకి కోపం వచ్చింది అన్నారనుకోండి. వస్తుంది. మానవ శరీరంలో వున్నందుకు మిగతావి కూడ వుంటాయి. మంచి విషయాలకి భూతద్దం వేసుకుంటాం. లేకపోతే ఆంజనేయుడు కొన్ని కొన్ని కోతిపనులు చేయడం కూడ కనిపిస్తుంది రామాయణంలో. ఏమీ అనుకోవద్దు. ఎందుకంటే హనుమంతుడు ఏమీ అనుకోడు. మీరూ ఏమీ అనుకోవద్దు. రాముడంతటి వాడు రకరకాలుగా బాధపడ్డ సన్నివేశాలు కనిపిస్తాయి. ఇప్పుడు మా పిన్ని కైకేయి కళ్ళు చల్లగా ఉండే వుంటాయి అనుకుంటాడు. ఎప్పుడు? సీతాదేవిని ఎత్తుకు పోయినప్పుడు. ఏడుస్తాడు, ఏమిటేమిటో మాట్లాడుతాడు. రెండు, మూడుసార్లు రాముడు పూర్తిగా బెంబేలు పడిపోయిన సన్నివేశాలు రామాయణంలో వాల్మీకి చిత్రీకరించాడు. మనలాగా దాచలేదు. మనం ఏం చేస్తామో తెలుసా? మన autobiography లో మనం ఏడ్చినవి, మనల్ని తిట్టినవి, మనల్ని కొట్టినవి అన్నీ దాచేసి మనం నవ్వినవి, మనం సాయం చేసినవి ఇవన్నీ రాసుకుంటూ వుంటాం. రాముడు భయంకరం గా బాధ పడుతూ వుంటాడు తెలుసా? ఏమిటి రాముడు ఇంత mental patient ఆ అన్నట్టుగా వుంటాయి కొన్ని సన్నివేశాలు. ఎందుకని? మానవుడు కాబట్టి ఇవి సహజం. ఇట్లా ఉన్నంత మాత్రాన నువ్వు ఏదో చాలా అపరిపక్వతలో వున్నానని అనుకోబోక అని చెప్పడానికి. 4,5 సార్లు ఇప్పుడు కైకేయి బాగా ఉండి వుంటుందని అనుకుంటాడు. అదేమిటి ఆ చెప్పడం. అమ్మవార్ని ఎత్తుకుపోయినప్పుడు బాధ పడతాడు. ఆ తరువాత మతంగముని ఆశ్రమానికి వెళ్ళినప్పుడు మళ్ళీ బాధ వచ్చేస్తుంది. అద్భుత విషయాలు చూడగానే సీతాదేవి ప్రక్కన లేదే అని బాధ పడతాడు. ఏడుస్తాడు. Depression వచ్చేస్తుంది. అప్పుడు లక్ష్మణుడు anti depression మందు వేస్తాడు. చాలా చక్కగా మాట్లాడుతా డప్పుడు. రాముడు నిస్పృహ చెంది ఏడుస్తూ, పొర్లుతూ వుంటే లక్ష్మణుడు రెండుసార్లు అన్నగార్ని ఉత్సాహపరుస్తాడు. 'ఉత్సాహమే బలము కదా అన్నయ్యా, ఉత్సాహం పొందిన

వాళ్ళని ఎవరు జయించగలరు? అలా ఉత్సాహం పొందు. నీకు నేను చెప్పేదేమిటి? మనకన్నీ బాగానే జరుగుతాయి. వదిన దొరుకుతుంది. దొరక్క ఎట్లా వుంటుంది? ఇంకో విధంగా వుండడానికి వీలులేదు కదా' అని ఎంతో ఉత్సాహపరుస్తాడు లక్ష్మణుడు. అప్పుడు మళ్ళీ లేస్తాడు. లేచి అంటాడు. అసలు ఇంతటివాడు ప్రక్కన లేకపోతే ఎంతటివాడు మాత్రం ఎందుకు పనికొస్తాడు అనుకుంటాడు. అదీ స్నేహితుడంటే! కష్టంలో వుండేసరికి 'ఆ-ఇదేం కష్టమయ్యా, ఏం పర్వాలేదు చూసుకుందాములే' అంటే ఎట్లా వుంటుంది. 'అమ్మబాబోయ్ ఇంత కష్టమే ఎట్లా బ్రతుకుతావు' అన్నామనుకోండి. వాడసలే బిక్కు బిక్కుమంటూ వుంటాడు. ఆ విధంగా నువ్వు చంపేస్తావు. అలాగే లక్ష్మణుడు మూర్ఛ పోయినప్పుడు ఏమిటేమిటో మాట్లాడుతాడు రాముడు. లక్ష్మణుడు మూర్ఛపోతే సీతమీద కోపం వస్తుంది రాముడికి. అరణ్యంలో కష్టం వస్తే కైకేయి మీద కోపం వస్తూ వుంటుంది. కై కై మంటూ వుంటాడు. సుగ్రీవుడు ఉపకారం చేసి మర్చిపోతే విపరీతంగా కోపం వచ్చి నానా మాటలు అనేసరికి, ఇదంతా విని లక్ష్మణుడికి కోపం వచ్చిన తరువాత ఆయనకి తగ్గిపోతుంది. కోపం అక్కడకి transfer అవుతుందన్నమాట. అప్పుడు 'అమ్మో వీడికి కోపం వచ్చింది. మనకి కోపం వస్తే పర్వాలేదు. వీడికి కోపం వస్తే వీడు పాడు చేస్తాడే' అని 'ఒరేయ్ అంత కోపం వద్దురా. కొంచెం జాగ్రత్త సుమా' అని తను సర్దుకుని మళ్ళీ వాడికి చెపుతాడు. అంత మాత్రంచేత ఈయన ఏం గొప్పండి, ఈయన్ని మనం కొలవ నక్కరలేదు అని అనుకోకండి. ఎందుకంటే మరి ఆయన చూపించిన మిగతావో? ఇవి మనమూ చూపిస్తాం. మరి అవో? అవి ఉన్నాయి కాబట్టి వాళ్ళని కొలుస్తాం. ఇవన్నీ ఎందుకు చెపుతున్నానంటే దైవీ స్వభావంలో ఉన్నవాళ్ళకి కూడ వాళ్ళు ఉన్న శరీరాన్ని బట్టి కొన్ని కొన్ని ఉంటూ వుంటాయి. వారి శరీరం అప్పుడప్పుడు వారిమీద ప్రభావం చూపుతుంది. అప్పుడు అరుస్తారు, కోప్పడతారు, తిడతారు. షిర్డి సాయిబాబా మీరనుకున్నంత ప్రశాంతంగా ఏమీ ఉండేవారు కాదు. ఎప్పుడు అరుస్తాడో తెలీదు. ఎప్పుడు బూతులు తిడతాడో తెలీదు. ఇప్పుడు మనకి photo కాబట్టి హాయిగా బాగానే వుంది. మనిషితో చాలా కష్టంగా వుండేది షిర్డి సాయిబాబాతో. ఆ ప్రక్కన కనబడేవాడిని నడ్డి విరిగేటట్టు కొట్టేవాడు. ఎందుకు కొట్టాడో? మహాత్ములంటేమనకి standard ఉంటుంది కదా! ఆ standards అక్కడ ఏమి కనిపించవు. మన standards ప్రకారం వాళ్ళుందామని అనుకోరు. ఆ మసీదంతా దద్దరిల్లి పోయేటట్టు అరుస్తూ వుండేవారు. ఒక్కొక్కసారి గంటల తరబడి. అదేమిటది? అదే అంటాడు శ్రీకృష్ణుడు 'నాదెప్పుడూ ప్రసన్నమైన స్వభావమే అనుకోవద్దు సుమా' అని. నిజమే. మరి అవన్నీ వాడిలో వున్నాయి కాబట్టి మనలోనూ అవే వున్నాయి. కాకపోతే మనలో ఇవే వున్నాయి అవి లేవు. ఆయనలో అవి, ఇవి వున్నాయి, రెండూ వున్నాయన్నమాట. ఎందుకు ఈ విధంగా చెపుతున్నానంటే ఆ విధంగా characters చదువుకుంటే, ఒక ఆపద వచ్చింది ఎట్లా వున్నారు, తరువాత శుభం వచ్చింది ఎట్లా వున్నారు. అన్నిట్లోను మంచిని దర్శించిన వాళ్ళుగా మనకి వాళ్ళు గోచరిస్తారు శివం. అందుకని మనకి కూడ జీవితంలో సమస్తమూ శుభమే.

## 624 శివః

లోపల ఉన్నది శివుడే. వాడి యొక్క ప్రతీకయే నేను. 'హంస శ్శివ స్సోహం' అహం సః నేను అతడే! శివః అతను శివుడు, సోహం--సః అహం--నేను అతడే! అతడు శివుడు, అతడే నేను. ఇదీ మంత్రం. కాబట్టి మనం శివుడైనప్పుడు ఇంక మనకి అశుభం ఏముంది? అశుభం దేనికి వుంటుందంటే, తెరమీద బొమ్మలు వచ్చేపోయేవిగా వుంటాయి కదా! వాటికి. కాని తెరకి అశుభం లేదు. తెరకి పుణ్యాహవచనం చేయనక్కరలేదు. Screen మీద ఓ శవం చూపించారనుకోండి. Screen మీదే కాల్చేస్తారు. అప్పుడు చావు వచ్చిందని పుణ్యాహవచనం చేయిస్తామా? Screen మీద పురుడు పోశారనుకోండి. పుణ్యాహవచనం చేయిస్తామా? ఏం ఉండదు. శివుడికీ ఏమీ ఉండదు. నీవు అతడే, నువ్వు శివుడవే. అలా వుంటే, వచ్చేపోయే వాటిలో శుభాన్నే దర్శనం చేయడమనే స్థితి లోనికి రావడానికి అవకాశం ఏర్పడుతుంది. అందుకని 'శివ' అనే శబ్దం విష్ణువుకి కూడా ఆపాదించవచ్చు. శుభం కలిగించే వాళ్ళందరూ శివులండి. ఎవరైనా శివ అని పేరు పెట్టుకున్నారనుకోండి, ఎప్పుడూ వారు శుభం కలిగిస్తూ వుంటారన్నమాట. తత్త్వం అట్లా వుండాలి.

# 625 శ్రీవత్సవక్షాః

శ్రీవత్స అనే పుట్టుమచ్చ, వక్షం మీద వుంది ఆయనకి. అలా ఉంటే శుభం ట. మీకు కూడా వుంటే శుభం. ఆయనకి పుట్టుకతో వుందిట. ఇదేమిటండి పుట్టుకేమిటంటే, విష్ణువుగా పుట్టినప్పుడు వుందిట. అదీ తమాషా. పుట్టుక లేనివాడు ఎట్లా పుట్టాడని మీరు అడగవచ్చు. అంతర్యామితత్త్వమే ద్వాదశ ఆదిత్యులలో విష్ణువుగా పుట్టినప్పుడు, ఆ పన్నెండుమందిలో ఈయనొక్కడికే హృదయం దగ్గర ఒక పుట్టుమచ్చ వుందిట. మిగిలిన వాళ్ళకి లేదుట. అదీ ఆయన ప్రత్యేకత. ప్రభువు అయివున్నప్పటికీ కూడ హృదయమే ఆధారంగా మొత్తం కార్యక్రమం నిర్వర్తిస్తాడు. మనకి 'హృదయమే ఆధారంగా జీవించు' అని సందేశం ఇస్తున్నాడు. మిగతావన్నీ పెట్టుకోబోక. ఇందులోకి దిగి వచ్చావు కదా! ఇక్కడ హాయిగా బ్రతకాలంటే అన్నీ హృదయం నుండి ఆలోచించు. మస్తిష్కం నుండి వద్దు అని, ఆయన వక్షము నందున్న 'శ్రీవత్సము' అనే పుట్టుమచ్చ మనకి సంకేతాన్నిస్తుంది. అది శుభంట. శ్రీ! శుభం అంటే అంతరంగంలో ఆనందంగా వుండడం. అంతరంగంలో ఆనందం వుండేవాడికి ఇంక బయట ఏమున్నాయి, ఏమి లేవనే వాటితో సంబంధమేమీ వుండదండి. బయట బాగా పోగు వేసుకున్నంత మాత్రాన ఆనందం వస్తున్నదా? కనుక హృదయమే ఆధారంగా జీవిస్తూ వుండు. రోజూ విష్ణు సహస్రనామాలు చదువుకుంటూ విష్ణుమూర్తి ప్రార్ధన చేస్తాము కదా! లేదా ప్రార్ధన చేశామని అనుకుంటున్నాము కదా! ఆ హృదయము దగ్గర వుండే పుట్టుమచ్చ మనకి ఇచ్చే సందేశ మేమిటంటే, try to live in heart, try to think from heart అని. హృదయం నుండి ఆలోచించడ మేమిటి? అంటే ఇతరులకి ఏమి అవసరమో గుర్తించే వాళ్ళు, ఇతరుల అవసరములకు సహకరించే వాళ్ళు, ఇతరుల అవసరం కోసమే తమ శక్తి సామర్ధ్యములను వినియోగించే వాళ్ళు వీళ్ళంతా హృదయంలో జీవిస్తున్నారు. మన ఆయుష్షు, మన ఆరోగ్యం, దేవుడి పూజలు మన కోసమే అనుకో. అలాంటి వారికి పుట్టుమచ్చ హృదయంలో లేదు. ఇంకెక్కడో వుంది. అందుకని విష్ణుమూర్తి చొక్కా విప్పకొని మరీ మరీ చూపిస్తూ వుంటాడు. 'ఒరేయ్ నన్ను ప్రార్ధన చేస్తున్నావు, నేను నీకు అనుకూలుడిని అవాలంటే ఏ పని చేసినా హృదయం ఆధారంగా చేసుకుని చెయ్యి. మనసుని ఆధారంగా చేసుకుని చెయ్యకు. మనస్సు శరీరానికి సంబంధించినది కాబట్టి నిన్ను బాగా పృథ్వీతత్త్వంలో కూరుకు పోయేటట్టు చేస్తుంది. హృదయం శరీరానికి సంబంధించినది కాదు, నీ నివాస స్థానం. మనస్సు అద్దె కొంప, హృదయం సొంత కొంప. అక్కడ కూర్చుంటే నీకు నా భావాలు వస్తాయి. అక్కడ్నుండి నిర్వర్తించుకుంటే నీ జీవితం ఆనందమయంగా వుంటుంది' అని సందేశం. జగద్గురువైన మైత్రేయులు 'ఇద్దరు లేక ముగ్గురు కలిసినప్పుడు, ఒకరితో ఒకరు హృదయము విప్పకుని మాట్లాడుకుంటుంటే నేను అక్కడ వుంటా'నని చెపుతారు. If two or more persons can transact each other through their heart, my presence is instantly there. అప్పటి కప్పుడు తక్షణమే నా సాన్నిధ్యం వుంటుంది. ఎక్కడ హృదయములు కలిసి

మాట్లాడుకుంటాయో అక్కడ నా సాన్నిధ్యం ఉంటుంది. ఎక్కడ మస్తిష్కం నుంచి మాట్లాడుకుంటారో అక్కడ వుండను, ఎంత భక్తులైనప్పటికీ కూడ. గత రెండు మూడు నామాలుగా భగవంతుని యొక్క అంగములలో వుండే ప్రత్యేకత చూపిస్తూ వస్తున్నారు. అలాగే ఇప్పుడు 'నేను హృదయస్థుడనై యున్నాను. అందరి హృదయముల యందు వున్నాను. కాబట్టి నాతో నీవు కలిసి వుందామనుకుంటే నీవు కూడా హృదయస్థుడవై యుండు. హృదయము నుండే సమస్త కార్యములు నిర్వర్తించు. అప్పుడు నీ జీవితానికి నీవు రాజు అవుతావు. స్వామి అవుతావు. అంతకన్న దిగావో బానిసైపోతావు' అని వక్షస్థలంలో వుండే పుట్టుమచ్చ సందేశం ఇస్తున్నది. హృదయంలో వుండడమంటే మనం పెట్టుకొనే ఒక దీక్ష ఏమిటయ్యా అంటే ఎవరైనా మనకి తారస పడితే, వీళ్ళకి మనం చేయవలసినది ఏముంది? వాడు అడిగినదల్లా చెయ్యమని కాదు. వాడికి మనం చేయవలసినది ఏమైనా వుందా? అని చూసుకుని, ఆ కాస్త చేసి కూర్చుంటే సరిపోతుంది. ఎందుకొచ్చారో ముందు చెప్పకుండా వస్తారు కదా! అందుకని చెప్పేవన్నీ వినడం కాకుండా, దేనికోసం వచ్చాడో, ఏది కావాలని వచ్చాడో, మనం చెయ్యగలిగిన దేమిటో చూసుకుని చెయ్యగలిగినదైతే హృదయపూర్వకంగా చెయ్యడం. చెయ్యలేనిదైతే మళ్ళీ మళ్ళీ తిప్పకుండా చెయ్యలేనని చెప్పడం. ఆలోచిస్తాం మళ్ళీ రా, రేపురా, ఎల్లుండిరా, ఈవాళ శుక్రవారం వచ్చేవేమిటి? ఈవాళ పండుగ కదా! ఆదివారం వచ్చేవేమిటి? ఇట్లా మనం త్రిప్పకుంటూ కూర్చుంటే, అదీ మస్తిష్కం. వాడు నీలాంటి వాడే. వాణ్ణి నీ దగ్గరకి పంపించారు. నీ చేతనైతే చెయ్యి. చెయ్యలేకపోతే చెప్పెసెయ్. మహాత్ములు హృదయంలో జీవిస్తారు. అందుకని 'The doctrine of heart' అంటాం. దానిని మనకి సందేశంగా అందించేది ఈ నామం. ప్రతివాళ్ళు కొంతమంది దగ్గర నుండి అందుకోవచ్చు, కొంతమందికి చెయ్యవచ్చు. అందుకునే చోట అందుకోండి. చెయ్యగలిగే చోట చెయ్యండి. అసలు అందుకోకుండా చేద్దామనుకోకండి. ఎందుకంటే అందరూ అందుకుంటున్నారు. సూర్యుడే తన పైనుంచి అందుకుంటున్నాడు. అది సూర్యుడి వెలుగు కాదు. మనకి సూర్యుడి నుండి వస్తోంది. సూర్యుడే అందుకుంటూంటే మనమెంత? చిన్నవాళ్ళకి చెయ్యడం కోసం, పెద్దవాళ్ళ దగ్గర నుండి అందుకుంటూ వుండు. అలా పెట్టుకుంటే హృదయం ద్వారం గా అపరిమితంగా చెయ్యగల స్థితి క్రమశః ఏర్పడుతుంది. అంతు లేకుండా చేస్తూ వుంటారు కదా కొంతమంది. మితి లేకుండా చేస్తూ వుంటారు. అలా ఎలా పెరిగారంటే, అసలు చెయ్యడం మొదలు పెట్టడం వలన ఈ కొళాయి open అయిపోయిందన్నమాట. హృదయమనే కొళాయి బాగా వాడడం చేత పెద్ద ద్వారంలాగ అయిపోయింది. శ్రీవాసః. తరువాతి నామం శ్రీపతి.

## 626, 627 శ్రీవాసః, శ్రీపతిః

శ్రీపతి అంటే అమ్మవారికి భర్త మామూలు భాషలో. శ్రీ అంటే నాలుగు అర్థాలున్నాయి. శ్రీ అంటే లక్ష్మీదేవి శ్రీ అంటే సరస్వతీదేవి, శ్రీ అంటే పార్వతీదేవి, శ్రీ అంటే విషం నాల్గవది. విషం కూడ ఆయనే. విషానికి కూడా ఆయనే పతి. అది లేకపోతే మనందరిని పట్టుకు రావడం కష్టం. అది మనలో కూడా పెట్టి వుంచారు. ఇట్లా అన్నిటికీ ఆయన పతి అండి. లక్ష్మి, సరస్వతి, పార్వతి అంటే త్రిజటగా, త్రివేణిగా ప్రవహించే శక్తి. ఒకటే శక్తి, మూడుగా తయారై ఈ మొత్తం అంతా అల్లుతుంది. ఈ అల్లుతున్న మొత్తానికి ఆయన పతి. అంటే ఆయన ప్రేమ కారణంగా హృదయము నుండి వ్యక్తమైన శక్తిలోంచి మూడు శక్తులు వస్తాయి. మూడు శక్తులూ మొత్తం సృష్టిని అల్లుతూ వుంటాయి. వీటిని తిరోధానం కలిగించడానికి నాలుగవది అయిన విషం. అదే మరణం. అదికూడా ఆయన లోంచే వచ్చింది. 'శ్రీమాతా' అనే అమ్మవారి నామం ఇదే చెపుతుంది. ఎవరు శ్రీమాత? లక్ష్మి, పార్వతి, సరస్వతి, విషం. విషం చెప్పరు ఎవరూ. అటువంటివి చెపితే పారిపోతారని దాచేశారు. దాచేస్తే ఒక ప్రక్క మాత్రమే చూపించినట్టు అవుతుంది. మొత్తం చూపించినట్టు అవదు. మొత్తం చూపించకపోతే అది తెలియదు మనకి. ఎప్పుడూ మనలో ఘర్షణ వుంటుంది. ఏనుగు అనిచెప్పి తొండమే చూపించామనుకోండి, తొండమేనా ఏనుగు? తోక కూడ ఏనుగే కదా! తొండము, తోకేనా ఇంకా ఎంత వుంది వ్యవహారం. మొత్తం చూపించాలి కదా! అందుకని యోగులు, ఋషులు మొత్తం చూపిస్తారు. అది ఒకటే అనుకోబోకు. ఇది కూడ, అని అంటారు. ఈ విధంగా నాలుగు రకాల తత్త్వాలకి ఆయన పతి. కేవలం పతే కాదు. 'శ్రీవాసః' వాటిలో ఆయన ఉంటాడుట. అది చూడండి. అంటే త్రిగుణములు అనుకున్నామనుకోండి. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి శక్తులుగా తీసుకుంటే, గుణాలుగా తీసుకుంటే సత్త్వము, రజస్సు, తమస్సు గుణము లన్నిటికి అతీతుడుగా, అధిపతిగా వున్నవాడు. కేవలం దానికి అధిపతిగా ఉండడమే కాదు, వీటన్నిటినీ రక్షించేవాడు. సంరక్షిస్తూ వుంటాడు. సంరక్షించే వాడిని కూడా పతి అనే అంటారు. గణపతి అన్నామనుకోండి, గణము లన్నిటినీ సంరక్షించేవాడని అర్థం. అంతేకదా! అందరికీ మొగుడని కాదుకదా! పరిరక్షించేవాడు కాబట్టి మొగుడు. వాడిని కూడా పతి అన్నారు. కాబట్టి శ్రీపతి కేవలం శ్రీపతే కాకుండా 'శ్రీవాసః'. 'పైన కూర్చుని orders వెయ్యడం కాదండి, మీరు కూడా దిగి పనిచేస్తూ వుండాలి' అని చెపుతూ వుంటారు చూశారా, ఆయన ఆ ముగ్గురిలోకే కాక నాల్గవ దానిలోకి కూడా దిగి వచ్చాడుట. ఆయనే దిగి రావడం వలన ఇచ్ఛాశక్తికి ఆ బలం వుంది. అలా దిగి రావడం వలన జ్ఞానశక్తికి ఆ బలం వుంది. క్రియాశక్తికి బలం లేకపోతే ఎట్లా? అందుకే అన్నిట్లోకి ఆయనే దిగి వచ్చాడు కనుక బలం. అది లేకపోతే బలమేముంది? అట్లా దిగివచ్చి అన్నిట్లోనూ వుంటాడు. విషంలో కూడ వున్నాడు. విషంలో విషంగా వుంటాడు. అమృతంలో అమృతంగా వుంటాడు. ఉప్పులో ఉప్పగా వుంటాడు. పంచదారలో తీపిగా వుంటాడు. అదీ భగవంతుని యొక్క అంతర్యామిత్వం. పులిలో పులిలా వుంటాడు. పిల్లిలో పిల్లిలా

వుంటాడు. ఇట్లా దిగి వస్తాడండి. మనకి మామూలుగా పతి అంటే దిగిరాడు. ఆయన దగ్గరకి వెళుతూ వుండాలి. అందిస్తూ వుండాలి కదా! ఈ లోకాల అధిపతులు కూడ దిగిరారు. అధిపతులందరూ కూడ అధిపతులు గానే వుంటారు. భగవంతుడు ఒక్కడే అందరిలోను అంతర్యామిగా వుంటాడు. ఇంద్రుడికి మొత్తం ఈ సృష్టులన్నిటి మీద ఆధిపత్యం ఇస్తే, అతడికి ఎక్కడ ఏం జరుగుతోందో తెలియలేదు. తెలియదని మీకు తెలుసా? అట్లాగే అందరి దేవతలని పిలిచి చెప్తే తెలుస్తుంది. ఇందరిలోనూ ఉండేవాడు ఒకడున్నాడు. వాడిక్కొడికే సమస్తమూ తెలుస్తుంది. నువ్వు ఏం చేసినా వాడికి తెలుస్తుంది. వాడు అంతర్యామి! అందుకని వాణ్ణి పటుకుంటే దేవతలందరూ మన జేబులో వున్నట్లే. ఒక్కొక్క దేవతకి రొప్పుపడి పూజలు చెయ్యక్కరలేదు. అంతర్యామికి చేసేస్తూ వుంటావన్నమాట. ఏం చేస్తావు? నువ్వూ అదే! వాడే 'నేను' గా వున్నానని తెలిసుంటే, అయిపోయింది పని. ఇంత నైష్ఠికంగా పూజలు చెయ్యడం వుండదు. యోగులు అట్లా వుంటారు. ఈ వేద సంప్రదాయము లో నుంచి వచ్చిన రకరకాల క్రతువులన్నీ కూడా యోగులు నిర్వర్తించరు. ఎందుకంటే ఇంకా వాడెవడో వేరే వున్నాడు, మనం వేరే వున్నామనే భావన వుండదు. యోగి అంటే ఇది, అది కలిసిపోయిన వాడు అవుతాడు. ఈ 'శ్రీవాసః' అనే నామంలో మనకి భగవంతుడి యొక్క అత్యద్భుతమైన విషయం తెలుస్తుంది. ఏమిటయ్యా అంటే తను సృష్టించిన దానిలోకి తాను జొరబడి వున్నాడుట అక్కడ. ఎంత వరకు వున్నాడు? చీమ వరకు కూడా తనే వున్నాడు. అది చీమ కదా అందులో మనం ఉండేదేమిటి అని ఉండదు. ఇది అది లేకుండా అన్నిచోట్లా నిండి వుంటాడు. సమస్తం నిండి వుంటాడుట. అందుకని మీరు గుర్తు పెట్టుకోవలసినది ఏమిటంటే మీ పూజ గదిలో ఎంత వున్నాడో, మీరు స్నానాల గది అనుకుంటున్న చోట కూడ అంతే వుంటాడుట. ఇక్కడ ఎక్కువ వుండడం, అక్కడ తక్కువ వుండడం మీ భావనలో తప్ప వాడిలో లేదు. స్నానాల గదిలోనూ చోటు వుంది. పూజ గదిలోనూ చోటు వుంది. భోజనాల గదిలోనూ చోటు వుంది. నీ ఇల్లు వున్నా, లేకపోయినా చోటు వుంది. నీ ఇల్లు వుంటే అందులో వున్నది చోటే. నీ ఇల్లు లేకపోయినా ఉన్నది చోటే. చోటు లోంచే అన్నీ వస్తున్నాయి. చోటు లోకే అన్నీ పోతూ వుంటాయి. చోటుగా అంతా వ్యాపించియున్న తత్త్వం. అందుకని కేవలం పతి కాదు, వసించి యుంటాడు అన్నిట్లోనూ అని చెప్తారు. అదిట ఆయన ఈశ్వరత్వం, ఆయన స్వామిత్వం, ఆయన అంతర్యామిత్వం. దానికి ఉదాహరణ మనకి ఇల్లు వుంది. మనం ఇక్కడ వున్నాం. అక్కడ ఆ ఇంట్లో ఏమైనా జరుగుతూ వుంటే మనకి ఏమైనా తెలుస్తుందా? తెలియదు. ఈ ఇంట్లోనే ఇప్పుడు ఎక్కడైనా ఏమైనా జరుగుతూ వుంటే మనకి తెలియదు కదా! ఏమిటి మన స్వామిత్వం? ఎవరండీ దీని యజమాని అంటే, నేనంటూ వుంటాము కదా! నాదేనంటూ వుంటాము కదా! నిజమైన స్వామిత్వం/ ఈశ్వరత్వం ఎక్కడ వుంటుందంటే, వాడి దాంట్లో కూడ వాడే వుంటాడుట. ఇది చూడండి. నాకు పొలం వుంది అంటే, ఎక్కడ వుంది అంటే, ఎక్కడో మర్రిపూడిలో వుందన్నామనుకోండి. ఈయన ఎట్లా వుంటాడంటే ఇక్కడా వుంటాడు, మర్రిపూడిలో వుంటాడు. అదీ ఈశ్వరత్వం. ఎందుకయ్యా అంటే తనలోంచి వచ్చిన దాంట్లో తను నిండి యుంటాడు. మనలోంచి వచ్చిన దాంట్లో మనం అట్లా

నిండియుండం. అదీ 'శ్రీవాసః'. సమస్తము నందూ నిండి యున్నాడు కాబట్టే గజేంద్రుడికి పలికాడు, మిగిలిన దేవతలు పలక లేకపోయారు అని చెప్పడంలో ఉద్దేశ్యం.

విశ్వ మయత లేమి వినియు నూరక యుండి, రంబు జాసనాదు లడ్డుపడక

విశ్వమయత లేదుట వాళ్ళకి. విశ్వమంతా వ్యాపించి యున్న అంతర్యామి తత్త్వము లేదు. లేకపోతే పాపం ఎన్ని గోళాలు సృష్టించాడు ఆ బ్రహ్మ. ఎంతమంది సూర్యులో, ఎన్ని వందలాది కుటుంబాలున్నాయో! ఎవరో ఏదో ఒక కుటుంబంలో, ఒక భూగోళంలో ఏదో మొసలి ఏనుగుని పట్టేస్తే ఈయన కేమిటండి పాపం. అట్లా వున్నాడు బ్రహ్మ. గజేంద్రుడు ఎవరిని పిలిచాడు? విష్ణుమూర్తిని పిలవలేదు, అంతర్యామిని పిలిచాడు. అసలీ మొత్తం ఎవరి లోంచి వస్తోంది?

ఎవ్వనిచే జనించు జగ మెవ్వని లోపల నుండు లీనమై; ఎవ్వని యందు డిందు?

అసలు ఆయన ఏం పేరు పెట్టలేదు. ఈ సమస్తానికీ ఆధారభూతమైన వాడు ఒకడు వుంటే, వాడు నన్ను రక్షిస్తే బావుంటుందని అన్నాడు, అంతే! 'ఆత్మభవు నీశ్వరునే శరణంబు వేడెదన్' ఈశ్వరుడంటే అక్కడ శివుడని కాదు. మొత్తానికి అధిపతి. ఎందుకంటే చాలా రకాలుగా చెపుతారు. ఆ పద్యాలన్నీ అంతర్యామిని గూర్చిన ప్రార్ధన కాబట్టి గజేంద్రమోక్షం లోని పద్యాలు, ప్రార్ధనా పద్యాల లోకెల్ల మకుటాయ మానమైన పద్యాలుగా చెప్తారు. అందుకని మనకి కూడా తరింపు కావాలనుకొంటే, ఆ పద్యాలని రోజూ చదువుకోమని చెపుతారు. ఎందుకంటే అంతర్యామిగా వున్న వాడిని దర్శనం చెయ్యడానికి సాధ్యపడుతుంది ఇంక వీడు వాడు అనకుండా. అట్లా చేశాడుట పాపం ఆయన. చేస్తే విశ్వమయత లేకపోవడం వలన మిగతా వాళ్ళు ఎవరూ రాలేకపోయారు.

విశ్వమయుడు విభుడు విష్ణుండు జిష్ణుండు, భక్తియుతున కడ్డపడ దలంచె.

అటు తెలిసిపోతుంది. అంతటా వ్యాపించిన వాడికి తెలియదాండి? మనం కూడా మన శరీరమంతా వ్యాపించి యున్నాము కదా! అందుకని వేలుమీద చీమ కుడితే పుటుక్కున కాలు లాక్కోమూ! లాక్కోవడమే కాదు కసిగా రెండవ కాలితో ఆ చీమని చంపేస్తాం. మరి ఎట్లా తెలుస్తుందండి? ఎక్కడో చిటికెన వేలు కదా. నీ శరీరమంతా నువ్వు వ్యాపించి యున్నావు కదా! అందుచేతనే తలలో పేనైనా, కాలిమీద బల్లైనా తెలుస్తోంది కదా మనకి నడుస్తూంటే. ఎట్లా అంతర్యామిగా నువ్వు వ్యాపించి యున్నావో, అదే విధంగా మొత్తం సృష్టంతా వ్యాపించి యున్నాడు. ఇక్కడ లేడని ఏమీలేదు. ఎక్కడ లేవు నీ శరీరంలో నువ్వు చెప్పు. చెపితే నేను దాని సంగతి చూస్తాను. జుట్టులో ఆయన లేడని అనుకున్నామనుకోండి, జుట్టు పీకితే. మీసంలో లేడన్నమనుకోండి, మీసం పట్టుకు పీకితే. గోళ్ళలో అంత లేదు, గోరు నా కప్పచెప్పెయ్యి. గోరులో వున్నావో లేవో చూపిస్తాను. అలా గోళ్ళదాక కూడా తాపత్రయపడి వ్యాపించి యున్నావే నువ్వు. అట్లా వ్యాపించి యున్నాడు సమస్తంలో. శ్రీ అంటే ఇంకో అవగాహన 'సంకేతము' అని అర్ధము. సంకేతం లేకపోతే వాడు వున్నట్లు తెలియదండి. చాలాసార్లు ఉదాహరణ చెపుతూ వుంటాను. విద్యుత్తు వున్నట్టు సంకేతం ఏమిటి మనకి. ఇవి తిరిగేవి, అవి వెలిగేవి, ఇది వినబడేది. ఇవి పోతే విద్యుత్తు పోయిందంటూ వుంటాం. అంటే దానిని చూడలేము కదా!

సంకేతార్ధములుగా మిగిలినాయి కదా ఈ tube lights, fans. ఆ సంకేతార్ధములుగా వున్న వాటిని 'ప్రతీకలు' అంటారు. ఆ ప్రతీకలని 'చిహ్నాము' లంటారు. ఆ చిహ్నాలని 'లక్ష్మి' అంటారు. అసలు లక్ష్మి అంటే 'చిహ్నాము' అని అర్ధం. మనకి లక్ష్మి అంటే అర్ధం కుండల కొద్దీ నాణాలు అట్లా గుమ్మరిస్తుంది అని.  మనకి ఏది కావాలో ఆ ఒక్కటి పుచ్చుకొని మిగతాదంతా అలా ప్రక్కకి పెట్టేస్తాం. అందుకే అర్ధం కాదు లక్ష్మి. లక్ష్మి జగత్తును నామ రూపాత్మకమైన జగత్తుగా గోచరింప చేస్తుంది. ఆవిడ లేదనుకోండి, మనకి ఇంతమంది కనబడరు. సంకేతంగా నామ రూపాత్మకమైన జగత్తును పుట్టించి, దానిలో ఆయన వశించి యున్నాడు. 'శ్రీవాసః' అంటే అది ఒక అర్ధం. సర్వ జగత్తు యందు నిండియున్న వాడు ఎట్లా వున్నాడంటే, నామ రూపాత్మకమైన జగత్తుగా వున్నాడు. దాన్ని మించి కూడా వున్నాడు అని చెపుతుంది పురుషసూక్తం. కేవలం ఇందులోనే ఇమిడి లేడు. కొంత పిండి పూరీలు వేసుకున్నాం. అంత పిండీ వేసుకోలేదు. 'అతిక్రామత్' దాన్ని మించి యున్నాడు. ఆ విధంగా మనకి కనిపించే అంతటి లోనూ వున్నవాడు వాడే. ఈ నామంలో మనకి భాగవత పరమైన అర్ధం కూడా వుంది. మీరు చూస్తున్నా, నేను చూస్తున్నా, లోపల నుంచి మాట్లాడుతున్నా ఆ చేష్టలు చేసేవాడి రూపంలో వాడే వున్నాడు వాడే వాసు. వాసు అంటే ఏమిటి? వశించి యుండేవాడని అర్ధం. అందరం వాసులమే. కానీ అందరూ వాసు అని పేరు పెట్టుకుంటే confuse అయిపోతాము కదా! వాసు అంటే ఎవరు పలకాలో తెలియదు. అందుకని వేరే పేర్లు పెట్టుకున్నాం కదా! ఇన్ని రూపాలు, నామాలుగా ఏర్పరచుకుని అందులో వశించి యున్నాడు అని చెప్పడానికి 'శ్రీవాసః'. ఇక్కడ నాలుగు రకాలుగా తయారైన వాటన్నిటిలోకి ఆయనే దిగివచ్చి యున్నాడు. ఆ కనపడే పై తెర తొలగిస్తే, లోపల వుండేవాడు వాడే. ప్రతివాడికి నామం, రూపం రెండూ వలిచేశామనుకోండి, మిగిలేది వాడు. అందరికి బయట వుండే తొడుగులు వేరు తప్ప లోపల వుండే తత్త్వం ఒకటే కదా! ఆ విధంగా నీవు వున్నావు అని చెపుతుంది ఆ నామం.

## 628 శ్రీమతాం వరః

శ్రీమతులు కొంతమంది వున్నారు. శ్రీమంతులన్నమాట. 'శ్రీమతాం' అంటే శ్రీమంతులని అర్థం. శ్రీమంతులలో కెల్లా ఎవరయ్యా గొప్పవాడు అంటే ఈయనే. శ్రేష్ఠుడు అని అర్థం. ఎందుకని అందరికీ శ్రీ తను అనుగ్రహిస్తుంది. ఇక్కడ శ్రీలక్ష్మి వేసుకోండి, సంపద వేసుకోండి, వైభవం వేసుకోండి, విశ్వము వేసుకోండి, వైభోగం వేసుకోండి, కళ వేసుకోండి, శక్తి వేసుకోండి. అవన్నీ వున్నాయి. మొత్తం ముగురమ్మల శక్తులు చేరుతూ వుంటాయి అప్పుడప్పుడు ఒకళ్ళ దగ్గరకి. శక్తివంతులు, జ్ఞానవంతులు, బలవంతులు అట్లాగ వుంటుంది. వాళ్ళందర్నీ అమ్మవారు అనుగ్రహించింది. అమ్మవారికే అసలు ఈయన ఆధారం. ఈయన హృదయం లోంచి కదా అందర్నీ ఆవిడ అనుగ్రహిస్తుంది. కాబట్టి అమ్మవారు కొలిచే వాడు ఈయన. అందుచేత అమ్మవారు పొంది వుంటుంది. అందుకని ఎంత గొప్పవాడు అనుకున్నవాడు కూడా ఈయన ముందు సామాన్యుడే అని చెప్పడం. ఎవరయ్యా నిజమైన శ్రీమంతుడంటే, శ్రీకి ఆధారంగా వున్నవాడు. మనం శ్రీ ఆధారంగా వున్నవాళ్ళం. శ్రీ అంటే చైతన్యం అని కూడ అనుకోవచ్చు. ఎందుకంటే మూడు శక్తులు కలిసి వున్న సందర్భంలో శ్రీ ని చైతన్యంగా చెప్తారు. ఆ చైతన్యమే మూడుగా విభజింపబడుతూ వుంటుంది. దానినే 'వెలుగు' అంటారు. దానినే 'ఎరుక' అంటారు. ఆ ఎరుకే మనలోంచి ప్రతి ఉదయం వస్తుంది. వచ్చి అక్కడ్నుండి ఇచ్ఛ, జ్ఞాన, క్రియా శక్తులుగా విడిపడుతూ వుంటుంది. త్రిగుణాత్మకంగా బయటికి వస్తూ వుంటాము. ఈ చైతన్యం ఎక్కడ నుంచి వస్తోంది? చైతన్యం వచ్చిన తరువాత మనం అది ఇది. మనలోంచి మెలుకువ వచ్చిన తరువాత అంటే అమ్మవారు వచ్చిన తరువాత మనకి బోల్డు వైభవం, వైభోగం, సంపద, ఐశ్వర్యం అన్నీ వున్నాయనుకోండి. అది అసలు రావడానికీ? ఎంత శ్రీమంతుడైనా అమ్మవారికి/ ఆ చైతన్యానికి లోబడే వున్నాడు. చైతన్యం లోంచి పుట్టుకు వచ్చినవాళ్ళు వీళ్ళందరూ. అసలు చైతన్యం ఎక్కడ నించి ఉద్భవించింది? అవ్యక్తమైన తత్త్వం/ అంతర్యామి తత్త్వం నుండి ఉద్భవించింది కాబట్టి ధనం వుండే వాళ్ళందరి కన్నా, పదవులుండే వారందరి కన్నా, ధనము, మంచి పదవి, మంచి కీర్తి ప్రతిష్ఠ, జ్ఞానబలం, కండబలం, బుద్ధిబలం ఈ బలాలన్నీ శ్రీ యే, అమ్మవారే. శ్రీ ఎవరిని ఆశ్రయించిందో, ఆయన్నే నువ్వు ఆశ్రయించేవనుకో, ఇవన్నీ వున్న వాళ్ళని ఆశ్రయించ నక్కరలేదు. మీకు ఒకాయనతో పని వుందండి. ఆయన పై officer నీకు friend అయితే ఎట్లా వుంటుంది? చాలా సులభమై పోలేదూ పని. అంతర్యామి మనకి స్నేహితుడైతే, లేనిదేముంది? అలా అంతర్యామి తో ముడిపడితే అమ్మవారు ఎప్పుడూ ఆశీర్వదించడమే/ అనుగ్రహించడమే వుంటుంది. అందుకనే అంతర్యామి, అంతర్యామి అంటారు ఋషులు. అంతర్యామి లోంచి వచ్చిన వివిధములైన శక్తులను వేరు వేరుగా పూజ చేసుకునే సాంప్రదాయం ఒకటి వుంది. సరాసరి అంతర్యామినే ఆరాధన చేసే సాంప్రదాయం కూడ వుంది. ఏది కావాలో మీరు తేల్చుకోండి. అందుకనే ఇక్కడ 'శ్రీమతాం వరః' అన్నారు. పదవులు, డబ్బు, కీర్తి ప్రతిష్ఠ వున్నవారి

చుట్టూ తిరుగుతూ వుంటాము కదా మనకి పనులు కావాలని. నిజంగా దైవ భక్తుడివైతే, నీకు భగవంతుడి మీద పూర్ణ విశ్వాసం వుంటే నీ గురించి వీళ్ళెవరినీ కలవకు. మాస్టర్ సి.వి.వి. గారు నాకు ఒక మాటివ్వరా. అంటే ఏమిటదంటే, 'ఈ రోజు నుండి నీ గురించి ఆలోచించడం మానెయ్యి. నీకు కావలసినది నాకు చెప్పుకో తప్ప, ఎప్పుడూ ఊళ్ళో వాళ్ళని అడగబోక. వాళ్ళకి అవసరమైతే, నీ చేతనైనదేదో చేస్తూ వుండు. నాకు దణ్ణం పెట్టుకునే వాళ్ళందరూ కూడ నాకిది కావాలని బయటకు వెళ్ళి ఎవరినీ అభ్యర్థించవద్దు' అని చెప్పారు. అది ఒక నియమం. ఎందుకనీ? ఆయన ఇచ్చేది అంతర్యామి తత్త్వాన్ని. అంతర్యామి తత్త్వంలో నీవు ఇమిడినప్పుడు అన్ని శక్తులూ నీకు కావలసిన సమస్తమునూ సమకూరుస్తాయి. సమకూరే వాటి గురించి ఊరికే నువ్వు వెంపర్లాడుతూ తిరగడ మెందుకు? నువ్వు కూర్చో. అన్నీ సమకూర్చ బడతాయి. అందుకని యోగంలోకి రావడనికి ఆయన ఇది మొట్ట మొదటి condition గా పెట్టారు. ప్రొద్దున్న, సాయంత్రం ప్రార్ధనతో పాటు ఈ రోజు నుండి నీ గురించి నువ్వు ఎవర్నీ అడగకు. మొదటిది ప్రార్ధన, రెండవ నియమం ఇది. మూడవ నియమం నీకు చేతనైనది ఎవరికైనా చేస్తూ వుండు. ఈ మూడు నువ్వు చెయ్యి చాలు, నేను చూసుకుంటాను. నా అంతటి వాడిని చేస్తాను. నువ్వు ఎవరయ్యా అంటే 'నేను నేనే'. నాడీ గ్రంథం తిరగేసి చూస్తే, పరబ్రహ్మతత్త్వమే మాస్టర్ సి.వి.వి.గా దిగి వచ్చిందని కాకభుజంగ నాడి చెప్పింది. ఎవరీయన అని తెలలేదు. ఏమిటంటే దేముడికి దణ్ణం పెట్టు అంటే దేముడు ఎక్కడున్నాడని పెట్టమంటావు? అంటే వీళ్ళకి తెలియలేదు. ఏదో పిచ్చాడు అనుకున్నారు. అప్పుడప్పుడు చేసే పనులు చూస్తే పిచ్చిగా కనబడుతూ వుంటాయి. Instant cures. ఇంతటి healers ని ఎక్కడా చూడలేరు. వేటూరి ప్రభాకర శాస్త్రి గారికి అప్పటి కప్పుడు అన్నం పెట్టించేస్తే, తీరని రోగాలన్నీ ఆ పూట నించే నయమై పోయినాయంటే మాటలు కాదు. పైగా ఎవరో చెప్పారంటే మనం నమ్మలేము. జరిగిన ఆయన వేటూరి ప్రభాకరశాస్త్రి గారే రాశారు. CVV గారు రాసుకోలేదు వాడికిట్లా చేశానని. బ్రహ్మమే వచ్చిందేమోనని doubt వచ్చి నాడి తీసి చూస్తే, పరబ్రహ్మతత్త్వమే మళ్ళీ రూపు కట్టుకుని వచ్చిందని తెలిసింది. ఆయన ఇచ్చేది అంతర్యామి తత్త్వం. ఆయన భాష మనకి అర్ధం కాకపోతే, మాస్టర్ EK ఆ తత్త్వాన్నే మనకి పరిపూర్ణంగా అందించడానికి ప్రయత్నం చేశారు. కాబట్టి అది పట్టుకుంటే ఈ శ్రీమంతులని పట్టుకోనక్కర లేదు. అందుకనే భగవంతుని పాదాలు పట్టిన వాడు ఇంక ఎవరి పాదాలు పట్టలేడండి. అందరినీ గౌరవిస్తాడు తప్ప దేహి అని ఇంక ఎవర్నీ అడుగలేడు. అందుకు వాడు స్వయంప్రతిపత్తిలో వుండడం, స్వయం ఉపాధిలో వుండడం, వాళ్ళక్రింద వీళ్ళక్రింద పని చెయ్యకపోవడం అవన్నీ అందులో పుట్టుకొస్తాయి. వారి జీవ లక్షణంలో ఇంకోళ్ళ దగ్గర పనిచేయలేరు. ఎందుచేతనంటే దేహి అని అడగాలి కదా! కొలువు చెయ్యలేడు. He is king of his own life అన్న స్థితిలోకి వచ్చేస్తాడు. ఈ నామం మనకి ఇచ్చే ధైర్యమేమిటంటే నన్ను నమ్ముకోరా. ఊళ్ళో వాళ్ళని నమ్ముకోనక్కర లేదు నువ్వు. వెమటపడి తిరగనక్కర లేదు. నీకు కావలసినవన్నీ నేను చేసిపెడతాను. ఎందుకంటే వాళ్ళందరి దగ్గర ఏముందో, నా దగ్గరున్న ఆవిడే వాళ్ల దగ్గరకి వచ్చింది. ఆవిడ ఎప్పుడైనా తీసేసుకోవచ్చు అక్కడ

నుండి కదా! లక్ష్మి చాలా చంచల. 'అనపగామినీం' అంటుంది శ్రీసూక్తం. ఒక్క క్షణం ఒకచోట నిలబడదు తెలుసా? కళకళలాడుతూ వుంటుంది. కదులుతూ ఎక్కడకో మాయమైపోతుంది. ఎప్పుడు మాయమైపోతుందో తెలీదు. ఇక్కడ మాయమవదు. ఇక్కడ stable గా వుంటుంది. అక్కడ ఎప్పుడు వుంటుందో, ఎప్పుడు వుండదో తెలీదు. అక్కడ పోయి మనం క్రిందా మీదా అవడం కన్నా, ఇక్కడ ఈ పాదాలు పట్టుకుంటే 'శ్రీమంతు లందరిలోకి కూడ నేనే శ్రేష్ఠుడిని' అని చెబుతుంది ఈ నామం. భీష్ముడు, శ్రీకృష్ణుడి గురించి అలా చెప్పాడని అనుకోవాలి. ఈ వెయ్యి ఎనిమిది నామాలూ శ్రీకృష్ణుడికి అన్వయించి కృష్ణుని చరిత్రచెప్పకోవచ్చు. అంత అద్భుతంగా వుంటాయి. అదీ కృష్ణుడి గొప్పతనం. విష్ణు సహస్రనామం అంటాము గాని, కృష్ణుడిని ఆరాధన చెయ్యడానికి ఉత్తమమైన స్తోత్రం 'విష్ణు సహస్రనామం'. ఎందుకు? కృష్ణుణ్ణి చూసి చెప్పాడు భీష్ముడు. అందుకని ఈ వెయ్యినామాలకి సంబంధించిన సంఘటనలన్నీ కూడ కృష్ణుడి వద్ద చూడవచ్చు. ఎంత శ్రీమంతుడు శ్రీకృష్ణుడు. ఈ భూమిమీద ఎన్ని సంపదలు వున్నాయో ఆయనకే తెలుసు. అవన్నీ అతడికి సంబంధించినవే. చివరకి యుద్ధం అయిపోయిన తరువాత మళ్ళీ అశ్వమేథం చెయ్యాలి, అని చెపుతాడు. డబ్బు లేదు బావా అశ్వమేథం చెయ్యడానికి, యుద్ధానికే అంతా ఖర్చయిపోయింది కదా అంటే, రా నాతో అని హిమాలయాల లోనికి తీసుకెళ్ళి ఇక్కడ త్రవ్వుకో అంటే, కోకొల్లలుగా వుంటుంది. అర్జునుడికి ఆశ్చర్యంగా వుంటుంది. ఎంత వుంటుందంటే, ఎంత వుంటే నీకెందుకు? ఎంత కావాలంటే అంత తీసుకెళ్ళు అంటాడు. అలాంటిది మరి వాళ్ళావిడ అసలు తూకమే వేద్దామనుకుంది కదా తన దగ్గరున్న బంగారంతో. కానీ తెమలలేదు కదా! కాబట్టి 'శ్రీమతాం వరః' ధనవంతుల లోకెల్ల ధనవంతుడు. వైభవోపేతుల లోకెల్ల వైభవోపేతుడు. మీరు ఏదైనా చెప్పండి. ప్రతి దాంట్లోనూ ఆయన ఒక ఆకు ఎక్కువండి. మహావీరులని చెప్పారనుకోండి, వాళ్ళకన్న ఆయన కొంచెం ఎక్కువ. మరీ ఆకర్షణ వున్నవాళ్ళు వున్నారనుకోండి, వాళ్ళకన్న కొంచెం ఎక్కువ. ఇట్లా వుంటుంది. ఏదైనా సరే అక్కడ కన్న ఎక్కువ వుంటుంది మనకి. అదీ 'శ్రీమతాం వరః'. ఈ విషయంలో ఫలానా వాడు కృష్ణుడి కన్న ఎక్కువ అనడానికి లేదు. ఇది దాని అద్భుతం. యోగమా, రా మాట్లాడుకుందాం. భగవద్గీతలో చెప్పని యోగం లేదు. చేతా, చూడు. మహత్తా, చూడు. అందమా, చూడు. ఆనందమా, అబ్బో లెక్కలేదు. దేనికైనా పరాకాష్ఠ. అందుకే పిచ్చెక్కి పోయారు మనుష్యులు. ఈ మొత్తం అందరూ లోకాలలో ఏమేమి కోరుకుంటారో, ఆ కోరుకునే శ్రీ ఈయన దగ్గర అట్లా వుంది. అణిగి మణిగి వుంటుంది. రుక్మిణీదేవి కదా! అందుకని మళ్ళీ అమ్మవారి పూజ వేరే ఒకటి చెయ్యాలా అనే భావన వచ్చిందనుకోండి. అక్కరలేదు అని అర్థం. విష్ణుపూజ/కృష్ణుని పూజ చేస్తే అమ్మవారి పూజ చేసినట్టు కూడ. మనం పెట్టుకుంటే చాలా వుంటాయి. పెట్టుకోకపోతే ఏం లేదు. ఇప్పుడు ఈ శరీరం అంతా ఒకే మనిషా లేక ఆ ముక్కు, కన్ను, చెవి, కాలు, చేయి, మళ్ళీ చేతికి వ్రేళ్ళు, బొటనవ్రేలా, చిటికెనవ్రేలా ఇట్లా చూసుకుంటే కోకొల్ల లుంటాయి. అట్లా కాకుండా మొత్తం అంతా ఒకటిగా చూసుకున్నామనుకోండి, ఒకటే!

## 629, 630, 631 శ్రీదః, శ్రీశః, శ్రీనివాసః

ఈ శ్లోకాన్ని ధ్యాన శ్లోకంగా తీసుకోవాలి. మొత్తం విష్ణు సహస్రనామంలో సిరి, సంపద, సౌభాగ్యము, ఆనందము, వైభవము, విభూతి ఇటువంటివి జీవితంలో కావాలని, జీవులు సహజంగా కోరుకుంటారు. దురాశ కాదు. ఎందుకంటే భగవంతుడు, జీవుల సృష్టి చేసి, జీవులు ఆనందించవలెనని సృష్టిని ఏర్పాటుచేయడం జరిగింది కాబట్టి, ఆనందించడానికి కావలసిన అర్హత 'శ్రీ' అనే తత్త్వంలో ఉన్నది. అందుకని, ఈ 'శ్రీ' భగవంతుని యొక్క వైభవము, మోహనత్వము, సంపద. ఆయనను ఈ నామాలతో ధ్యానం చెయ్యడం ద్వారా మనకి, ఆ 'శ్రీ' ఆవహించే, మమావహ అని కదా అడుగుతున్నాం, ఆవహించే ఒక అవకాశం ఏర్పడుతుంది కాబట్టి, సిరి సంపదలు, భోగ భాగ్యాలు, అన్నిటికీ మించి, హృదయము నందు ఆనందము, ప్రశాంతత, నిర్మలత్వము, నిండుతనము, తృప్తి, సంతోషము ఇటువంటివి కావాలనుకుంటే ఈ శ్లోకాన్ని బాగా ధ్యానం చేసుకోమని పెద్దలు చెప్తారు. 'శ్రీ' అంటే వెలుగు అని మనం అర్థం చేసుకోవచ్చు. ఎందుకంటే భగవంతుని నుండి వ్యక్తమైన మొదటి తత్త్వము. అందులో నుంచి సమస్తమైన సృష్టి వ్యక్తమైనది. ముందు వెలుగు వ్యక్తమై, వెలుగు లోంచి త్రిమూర్తులు వ్యక్తమై, అక్కడ నుంచి ఇతరములైన దేవతలందరూ వ్యక్తమై, అక్కడ నుంచి సృష్టి వ్యక్తమై, అందులోంచి సృష్టి జీవులు వ్యక్తమై, ఈ సమస్తము, సృష్టి సంసారమునకు అధిదేవత శ్రీ . అందుకని, ఆ శ్రీ ని ధ్యానం చేసుకోవడమనే ఒక విధానం మనకి ఉన్నది. అది మనకి శ్రీసూక్తంలో బాగా ఇచ్చారు. అందుకని మనలో ఉండే సమస్తమైన మలినములు అంటే భగవత్తత్త్వము మనలో పరిపూర్ణంగా వికసించడానికి అవరోధాలు కల్పించేవన్నిటిని మనం నిర్మూలించుకోవాలనుకుంటే 'శ్రీ' అనే శబ్దము మీద చాలా సాధన చేయవచ్చు. అందుకనే శ్రీసూక్త పరంగా ధ్యానం చేసుకునే పద్ధతి ఒకటి వుంది. 'శ్రీం' అనేది ఒక బీజాక్షరం. అది అధారం గా హృదయంలో ఉచ్చారణ చేస్తూ, బంగారపు రంగును ధ్యానం చేసుకుంటూ ఉన్నట్లైతే, లోపల హృదయంలో ఉండే కల్మషాలు క్రమశః, తొలిగిపోవడానికి అవకాశం ఉన్నది. లోపల నుండి ఆ బంగారపు రంగు కిరణములు శరీరమంతా వ్యాపనం చెందుతున్నట్లుగా భావన చేసుకోవాలి. శ్రీం అనే అక్షరం ఎంత బాగా దీర్ఘంగా మనం ఉచ్చారణ చేయగలిగితే, అంత మంచిది. 'ఓం' లాగానే 'శ్రీం', అలా ఈం కారము లోపల హృదయ కేంద్రము నుండి వ్యక్తమవుతున్నప్పుడు అందులోంచి చాలా మిరుమిట్లు గొలిపే బంగారపు రంగు వ్యక్తమవుతున్నట్టుగా భావన చేసుకుంటూ ఉంటే, హృదయము నుండి మనస్సుకి, మనస్సు నుండి ఇంద్రియాలకి, ఇంద్రియాల నుండి శరీరానికి, మనకి బాగు చేసుకోవలసినవి, తుడుచుకోవలసినవి, కడుక్కోవలసినవి, రుద్దుకోవలసినవి, మనస్సులోనూ, ప్రాణమును అంటిపెట్టుకున్న కామ శరీరమునందు, భౌతికమైన శరీరమునందు ఉంటాయి. అందుకని ఆ 'శ్రీ' ని మనకి అందించమని కోరడమే 'శ్రీసూక్తము' మొత్తం అంతా కూడా, ఓ జాతవేదుడా! నాకు అందించు. మమావహ, జాతవేద -

అంటే సమస్తము, అవ్యక్తము నుండి వ్యక్తము లోనికి అగ్ని స్వరూపుడుగా భగవంతుడు వ్యక్తమైతే, ఆమెలో అక్కడ నుండి మనకి ఈ తత్త్వం, ఈ వెలుగు వ్యక్తమవడంచేత, ఆ వ్యక్తమయిన తత్త్వంలోంచి సమస్తం వ్యక్తమవుతోంది కాబట్టి ఆ మూల పురుషుణ్ణి మనం కోరుకుంటున్నామన్నమాట, ఈ విధంగా నాకు అబ్బేట్టు చెయ్యమని. వెలుగు అబ్బేట్టు చేయమని. వెలుగు అబ్బేట్టు చేయమని అడగటంలో అర్థమేమిటో తెలుసా? నువ్వు అమ్మని అడగడమే. ఎందుకంటే ఆయన వస్తేనే వెలుగు. ఆవిడ వచ్చిందిట అంటే ఆయన ఉన్నారుట అని అర్థం. వెలుగు వచ్చిందిట అంటే దాని వెనకాల విద్యుత్తు ఉందిట అని అర్థం కదా. వెలుగు లేదుట అంటే దాని వెనకాల ఉండవలసిన తత్త్వం లేదని. వెలుగు మొదటి స్వరూపం భగవంతుడికి. దాన్ని ఆవాహన చేసుకోవడానికి ఈ మంత్రాన్ని చక్కగా దీర్ఘంగా రోజుకి పదహారుసార్లు ఉచ్చారణ చేసుకుంటూ ఉండాలి. పదహారుసార్లు అని ఎందుకన్నామంటే మనకి మనస్సు, 5 కర్మేంద్రియములు, 5 జ్ఞానేంద్రియములు, 5 ప్రాణములు--ఇవన్నీ కలిపితే పదహారు అవుతాయి. ఈ పదహారుని అంటిపెట్టుకొని లింగ శరీరం ఉంటుంది. ఈ లింగ శరీరానికి పవిత్రత ఆపాదించుకోవడం కోసం పదహారుసార్లు. ఆ పదహారు స్థానాలలోను ఉన్న మలినాన్ని తీసేసి, శ్రీని నింపడమన్నమాట. అందుకని పదహారుసార్లు, హృదయం కేంద్రంగా ఉచ్చారణ చేసుకుని, శరీరంలో వుండే కోణ కోణాల్లోకి, మూలమూలల్లోనికి అన్నిటిలోకి కూడా ఈ బంగారపు రంగు కిరణాలు ప్రసరిస్తున్నట్లుగా భావన చేసుకోవాలి. ఇది ఒక సాధన. ఆ తరువాత క్రమశః బంగారం రంగు నుండి కొంత నీలము, లేత ఆకుపచ్చ కలిగిన రంగు ధ్యానం ఉంటుంది. ఆ తరువాత పూర్ణమైన నీలము, అందులో నుండి తెలుపు ఒకసారి, నీలం ఒకసారిగా ఆజ్ఞలో మనకి భాసిస్తుంది. ఆ తరువాత కొన్ని సూర్యుల సమూహములు కలిసి వెలుగుతున్నంత కాంతిగా మనకి గోచరించే అవకాశము ఉంది. మనవరకు మొదలుపెట్టవలసినది హృదయంలో. కల్మషాలన్నీ హృదయాన్ని బంధించి ఉంచుతాయి. అందుకని కల్మషాలు పారద్రోలుకోవాలంటే, మనకి 'శ్రీం' అనే మంత్రం చాలా ముఖ్యం. ఎప్పుడైతే కల్మషాలు పారద్రోలబడతాయో అప్పుడు, సిరి, సంపద, సంతోషము, సంతృప్తి, ఆనందము, తృప్తి, వైభవము, విభూతి లభిస్తాయి. అభూతి అనేది లేకుండా చెయ్యమని కోరతాం మనం శ్రీసూక్తంలో.

'అభూతిర్ నాశయామ్యహం'. అసమృద్ధి, 'నిర్ణుదమే గృహాత్'.

మన గృహం అంటే ఈ శరీరంలో ఉండే అసమృద్ధి అనే భావము ఒకటి ఉంటుంది. ఏ అనుభూతి లేని ఒక మోడు వారిన జీవితం లాగా ఉండచ్చు కదా. వీటినుండి మనం బయటపడాలంటే ఈ శ్లోకమైనా చదువుకోవాలి లేదూ, అందులో కీలకమైన ఈ 'శ్రీం' అనే మంత్రాన్ని బాగా ఉచ్చరించాలి. ఎప్పుడూ బాధపడుతుండే మన సోదరుడికి, ఈ మంత్రం చేసుకో, ఒక సంవత్సరం పాటు, నీ జీవితమంతా మారిపోతుంది అని చెప్పడం జరిగింది. ఎప్పుడూ దారిద్ర్య బాధే. అతడు నమ్మి చేసుకున్నాడు. అంతే సంవత్సరానికల్లా మంచి అవకాశం వచ్చింది. విదేశాలు వెళ్ళడం జరిగింది. పదుల సంవత్సరాల నుండి ఋణాలతో బాధ పడుతున్నవాడు ఋణ విముక్తుడయ్యాడు. ఆనందంగా, సంతృప్తిగా వున్నాడు. అంత ఉన్నది 'శ్రీం'

అనే మంత్రంలో, శ్రీసూక్తంలో. 'శ్రీం' అనే మంత్రమే కాదు, శ్రీసూక్తం కూడా చదువుకోమంటారు. మనకి ఇవన్నీ ఋషులు మనమీద కరుణ కొద్దీ అందించారు. మనకి అవిలేవు ఇవిలేవని వాటికోసం బయట ఆరాటపడ్డం కన్నా లోపల దీనిని చేసుకోవాలి. సృష్టిలో అన్నీ అక్కడే ఉన్నాయి, కావలసినవన్నీ మన చుట్టూనే వున్నాయి. మనం అయస్కాంతమైతే, అన్నీ ఆకర్షింపబడతాయి. మనం ఇనుపముక్క అయితే ఏమీ ఆకర్షింపబడవు. తుప్పు పట్టేస్తే అసలు బొత్తిగా ఏమీ ఉండదు. మనకి మనసులో తుప్పు, ప్రాణ శరీరానికి అంటుకుని ఉన్న వున్న కామశరీరంలో తుప్పు, భౌతికమైన శరీరంలో తుప్పు. ఈ మూడు తుప్పులు ఎంతసేపూ ఆకలి, దాహం. క్షుత్పిపాస అనే మలములు. ఏవో కావాలి కావాలి అని బాధపడుతూ వుంటారు. కావాలంటే ఉపయోగం లేదు. కర్తవ్యంలో ఉంటే వస్తాయి. ఫలము నందు ఆసక్తి తప్ప కర్తవ్యము నందు ఆసక్తి వుండదు. కర్తవ్యము నందు ఆసక్తి ఉంటే ఫలములు, అప్రయత్నంగా వస్తాయి. ఉండవలసినది కర్తవ్యమునందే, ఫలితములందు కాదు. ఇది అందరికీ తెలుసు. ఎవ్వరూ ఆచరించరు. అది మాయ. అది మోహం. అదే అజ్ఞానం. ఫలితాలు కావాలి. కర్తవ్యం ఆచరించరు. కర్తవ్యాలు ఆచరించాలంటే మార్గాలు ఇచ్చారు మనకి. ఏమిటి కర్తవ్యం? ముందు హృదయాన్ని శుభ్రం చేసుకోవాలి. హృదయం నుండి మనస్సుని, ఇంద్రియాలని, శరీరాన్ని శుభ్రం చేసుకోవాలి. ఈ శుభ్రం చేసుకోవడానికి, అగ్నిని తోడుగా పెట్టుకోవడమనేది చాలా ముఖ్యమైనది. అందుకనే అగ్నిదేవుణ్ణి తీసుకురమ్మని అడుగుతాము అమ్మవారిని. శ్రీ ని పట్టుకురమ్మని ఎవరిని అడుగుతామంటే శ్రీసూక్తంలో, అగ్నిదేవుణ్ణి, జాతవేదుడిని. ఎందుకని అగ్నిదేవుణ్ణి అడుగుతున్నాము అంటే, మనలో అగ్నిని ప్రజ్వలింపచేసుకోవాలి. 'శ్రీం' అనే మంత్రంలో కూడ స అనే శబ్దము, భగవంతునికి సంబంధించినది. ఈంకారము, అమ్మవారికి సంబంధించినది. రకారము అగ్నికి సంబంధించినది. అందుకని పవిత్రీకరింపబడాలంటే అన్నిటికన్నా ముఖ్యమైన మంత్రంగా 'రాం' మంత్రం చెప్తారు. 'రం' అనేది, రాకిని అని ఇస్తారు మనకి లలితా సహస్రంలో. 'స' కి సంబంధించినదేమో సాకిని అని ఇస్తారు. అన్నీ కూడ మంత్రాలే. ఢాకిని అనేది 'ఢం' అనే మంత్రం. హాకిని అనేది 'హం' అనే మంత్రం. కాకిని అనేది 'కం' అనే మంత్రం. ఆకాశానికి సంబంధించినది. లాకిని 'లం' అనే మంత్రం. ఇది అమృత వర్షిణి మంత్రం. అమృతాన్ని కురిపించే మంత్రం. మనలో అమ్మవారి కేంద్రాలు, వాటి బీజాక్షరాలు అవన్నీ లలితా సహస్రనామంలో మనకి గోచరిస్తాయి. ఇక్కడ శ్రీలో మనకి చూస్తే 'స' ఉంది, 'ర' ఉంది, 'ఈం' ఉంది. అమ్మవారికి ఈం అనేది బీజాక్షరం. అందుకనే మనకి శ్రీసూక్తంలో 'ఈం' అని వస్తుంది. 'ఈం' అనేది ఎంత వీలుంటే అంత దీర్ఘంగా పలకాలి. అందుకనే మనకి పార్వతి, లక్ష్మి, సరస్వతి, ఇట్లా ఇ తో అంతమయ్యేట్టుగా ఆడవాళ్ళ పేర్లు ఉంటాయి. మగవాళ్ళ పేర్లు 'అ' తోనో, 'ఓ' తోనో వుంటాయి. ఇవన్నీ మనకి, వ్యాకరణంలోకి వెళితే దొరుకుతాయి. మనవరకు ఇందులో ఇక్కడ భగవంతుడు ఉన్నాడు. అమ్మవారు ఉన్నది. అగ్నితత్త్వం కూడా ఉన్నది. అందుకని మీరు బంగారపు రంగుని ధ్యానం చేయడానికి ముందు శ్వాసని బాగా పీల్చి వదలడం అనేది చేస్తే, శ్వాస ఆధారంగా మనలో అగ్ని పుడుతుంది. ఎంత అగ్ని పుట్టచ్చంటే

ఒళ్ళు చెమట్లు పట్టేటంత. అలా బాగా శ్వాసని మనం ఆశ్రయించినట్లయితే ప్రాణమయ కోశాన్ని ఆవరించియున్న కల్మషాలన్నీ కూడా నిర్మూలింపబడతాయి. అది కారణంచేత భౌతిక శరీరం కూడ ఆరోగ్యంగా వుంటుంది. నిజానికి మనకి ఒంట్లో ఉండే జబ్బులని  పారద్రోలుకోవడానికి కూడా శ్వాసని వినియోగించుకునే విధానం మనకి పెద్దలు ఇచ్చారు. అది అందరికీ తెలుసు కానీ అది ఎవరూ చెయ్యరు. అంతకన్నా ముందు ఒక డోసు మందు వేసుకుంటే పోలేదా అనిపిస్తుంది. మందు వేసుకుంటే పోతుంది గానీ మళ్ళీ వస్తుంది. ఇలా చేస్తే పారద్రోలవచ్చు. ప్రాణాయామం బాగా జరిగినప్పుడు, శరీరంలో ఉండే రుగ్మతలన్నీ పోతాయి. శరీరంలోనికి కాంతి ప్రవేశిస్తుంది. అశుచి ఉన్నచోట లక్ష్మి రాదు. ఇల్లు అశుచిగా వున్నా, ఒళ్లు అశుచిగా ఉన్నా, ఇంద్రియముల యొక్క వాడకం అశుచిగా ఉన్నా, మనసులో ఆలోచనలు అశుచిగా ఉన్నా, భాష అశుచిగా ఉన్నా, అంత మేరకు లక్ష్మిని రానీయకుండా నువ్వే జాగ్రత్త పడుతున్నావని అర్థం. మన మనస్సులో వచ్చే భావములలో వుండే అశుచి, మనలోనికి లక్ష్మిని రానివ్వకుండా చేస్తుంది. ద్వేషము, క్రోధము, తీవ్రమైన కామము, ఈర్ష్య  ఇవన్నీ కూడా లక్ష్మిని రానీకుండా చాలా జాగ్రత్త పడతాయి. ఇక్కడ లక్ష్మి అంటే డబ్బులు కాదు, సంపదతో పాటు కూడిన ఆనందము, వైభవము. సంపద చాలామందికి అడ్డగోలుగా వుండవచ్చు. దాంతో వాళ్ళు సుఖపడేదేమీ వుండదు. కష్టపడుతూ ఉంటారు. అందుకే లక్ష్మి కావాలనుకుంటే మనసులో అశుచి ఉండకూడదు. భాషలో అశుచి వీలైనంతవరకు తగ్గించుకోవాలి. ఇంద్రియముల యొక్క వాడకములో అశుచి, శరీరము యొక్క అశుచి. ఎందుకంటే శరీరము యొక్క శుచిత్వమునే పట్టించుకోని వాళ్ళకి మిగతా శుచులు రావు. శుచి, శుభ్రత అనేది లక్ష్మి ఆవరించాలంటే చాల ముఖ్యం.  ఇంటి ముఖము ఎంత శుచిగా ఉంచుకుంటే అంత లక్ష్మి, ఇంట్లో ప్రవేశించడానికి అవకాశమేర్పడుతుంది. అలాగే మన ఒంటికి ముఖము మన నోరు. మన ముఖాన్ని, వీలైనంతవరకు శుభ్రంగా వుంచుకోవాలి. జిడ్డు మొహం, తలకాయ దువ్వుకోకుండాను, ఏదో ఏడుపుగొట్టు మొహంలాగా కనిపించద్దు. వీలుంటే, నవ్వడానికి ప్రయత్నం చేయండి. ఎప్పుడూ నవ్వేవాడికి సంపద ఎప్పుడూ ఉంటుంది. రెండూ ఒకదానికొకటి అనుసంధానం. సంపద ఉన్నవాడు నవ్వుతాడు, నవ్వినవాడికి సంపద ఉంటుంది. వెకిలిగా నవ్వితే రాదది. లోపల ఆనందం ఉంటే బయటికి చిరునవ్వు వస్తుంది. ఆ విధంగా మనం, ఒక్కొక్కటి, ఒక్కొక్కటి, నఖశిఖ పర్యంతం ముందు అసలు భౌతికంగా శుచిగా ఉన్నామో లేదో చూడాలి. మనం ఉన్న ప్రదేశం ఎట్లా వుంది? మన పడకగది గాని, మనం నివసించే ఇల్లు కాని, మనం ఉండే కార్యాలయంలో మన పరిసరాలు కాని ఎలా వున్నాయో చూసుకోవాలి. శుభ్రతకి, luxury కి సంబంధం లేదు. ఉన్నంతలో ఉతికిన బట్టలేసుకంటే శుభ్రంగా ఉన్నట్టే కంపు కొడుతూ అవే బట్టలు వేసుకుని తిరగడం కన్నా. అసలు ఒళ్ళు కంపు రాకుండా చూసుకోవాలి. అక్కడ నుండి వుంది. ఎందుకంటే మనం, ఈ మంత్రం చేసుకుంటూ, ఈ ఆచరణ కూడా పెంచుకోవాలి. రెండు ప్రక్కలనుంచి జరగాలి పని. ఎట్లా ఉంటుందంటే, అద్దం పగిలిపోయినా అట్లాగే దాన్ని వాడుకుంటూ ఉంటారు. ఎన్నో ఖర్చులు పెడతారు, ఆ అద్దం మాత్రం

మార్చరు. ఎంత అవుతుంది, ఒక చిన్న అద్దం క్రొత్తది కొనుక్కుంటే. విరిగిపోయిన వస్తువులు, చిరిగిపోయిన వస్తువులు, పాడైపోయిన వస్తువులు, వాడుకుంటూ వుంటారు చూశారా, వాళ్ళలో దరిద్రం తాండవిస్తూనే వుంటుంది. ఉన్నంతలో శుచిగా ఉండండి. శుభ్రంగా ఉండండి. ఇంట్లో పాలరాయి ఉండక్కరలేదు గాని, ఉన్న నేల శుభ్రంగా వుండాలి. ఎక్కడా బూజు చేరకూడదు. ఒంట్లో చేరకూడదు, ఇంట్లో చేరకూడదు. ఇంట్లో ఉండే వస్తువులన్నీ కూడ ఎప్పటికప్పుడు తుడుచుకుంటూ నిగనిగలాడుతూ ఉంచుకోవాలి. అది సంకేతం. లోపల కూడా ఆ విధంగా శుభ్రంగా ఉంచుకునే స్వభావం వీడికి ఉందా లేదా అని తెలపడానికి, 'ఇల్లు చూస్తే ఇల్లాలి సంగతి తెలుస్తుంది' అని మనకి సామెత లేదూ! ఒక ఇల్లు చూస్తే ఆ ఇల్లాలు ఎంత శుచి, శుభ్రత కలిగి ఉందో తెలుస్తూ ఉంటుంది. వేరే చెప్పక్కరలేదు మళ్ళీ. మన ఆరాటం ఇంటి విషయంలోను, ఒంటి విషయంలోను వుండడం చాలా అవసరం. లేకపోతే, లక్ష్మి చేరదు. ఎందుకంటే, ఎంతో శుభ్రంగా ఉంటే కాని ఆవిడ కాలు పెట్టదు. ఈ శుభ్రతకి కావలసినది ఏమిటంటే లోపల్నుంచి ఒక్కొక్కటి, భౌతికమైన శుభ్రత, కామలోకాలలో శుభ్రత, మనోలోకాలలో శుభ్రత. అందుకని తలనిండా పురుగులు పెట్టుకుంటే ఆవిడ రాలేదు. కాబట్టి ఇవి వున్నాయని మనకు తెలుసు. పోగొట్టుకోవాలని తాపత్రయం ఉంది, పోవు. అది తెలిసి, ఏం చేశారంటే, కొంతమంది బలం అప్పు తెచ్చుకుని పోగొట్టుకో అని చెప్పారు. వ్యాపారం మొదలుపెట్టేటప్పుడు, వ్యాపారానికి కావలసిన పెట్టుబడి అంతా మన దగ్గర లేకపోతే, ఓ పావలా మనం పెట్టి ఓ ముప్పావలా అప్పు తెచ్చుకుని, వ్యాపారం చేసి, వ్యాపారం పెరిగిన తరువాత అప్పు తీర్చేస్తాం. కదా. అలాగే, ఇక్కడ శ్వాసని అప్పు తెచ్చుకో, తద్వారా అగ్నిని అప్పు తెచ్చుకో. తద్వారా సమస్తాన్నీ పవిత్రీకరించు. ఒంట్లో అగ్నికార్యం బాగా జరగాలి. బయట హోమం చేసినా, చెయ్యకపోయినా ఒంట్లో అగ్నికార్యం బాగా జరుగుతోందనుకోండి, రోజుకి మూడుసార్లు, మరి అక్కడ అశుచి చేరటానికి వీలుండదు. మండుతూ వుంటే లోపల, ఏదైనా వచ్చిపడితే మండిపోతుంది తప్ప, అది ఉండటానికి వీలుండదు. అందుకని అశుచి ఉన్నకొద్దీ ఏంటంటే ప్రతిదాని మీద, ఒక విధమైన విముఖత వస్తూ ఉంటుంది. ఆ అది చేస్తేనేనా, ఇది చేస్తేనేనా, పూజ చేస్తేనేనా, ప్రార్ధన చేస్తేనేనా, దణ్ణం పెడితేనేనా, ఇవన్నీ చేసినవాళ్ళు ఏమాత్రం బావున్నారు కనుక. ఇటువంటి క్రొత్త క్రొత్త వికారపు ఆలోచనలన్నీ రావడం, దేనికి లక్షణం అంటే, మనస్సులో కూడా బాగా అశుచి చేరిందని అర్ధం దానికి. అందుకని ఋషిప్రోక్తమైన మార్గంలో, చేసి, దానిలో ఉండే రుచి తెలుసుకోవడమే తప్ప, మరొక మార్గం లేదు. అందుకని మనం శ్వాసని అందుకుని, తద్వారా అగ్నిని బాగా ప్రజ్వలింప చేస్తే, లోపల్నుంచి మనము కొంత మలినాలని బయట పారేయడం గా వుంటుంది. లోపల, బయట వుండే మాలిన్యాలన్నీ తీసెయ్ అని కూడా శ్రీసూక్తంలో వస్తుంది. ఆ విధంగా శ్రీసూక్తంలో లోపల వున్నది, బయట వున్నది తీసిపారేయమ్మా. ఆకలిదప్పులు తీసిపారేయమ్మా, పెద్దమ్మని తీసిపారేయమ్మా, అశుచిని తీసిపారేయమ్మా, మలినాన్ని తీసిపారేయమ్మా, ఇటువంటివి కోరతాం. ఇవన్నీ కోరేముందు ఆవిడ రావడానికి

ఎవరిని కోరతామంటే అగ్నిని కోరతాం ముందు. చివరికి కూడా మళ్ళీ అగ్నికే చెప్తాం.

'తాం మ ఆవహ జాతవేదో లక్ష్మీమ్ అనపగామినీమ్' కాస్త తేడాగా ఉన్నామంటే జారిపోతుందండి లక్ష్మి. చాలా అనపగామిని అంటే, ఆవిడ పోకడలు ఎవరికీ తెలియదుట. చాలా చంచలమైనది అని చెపుతారు కదా! ఎందుకు చంచలమంటే, నువ్వు కాస్త తేడా చేశావంటే నెమ్మదిగా జారిపోతుంది. 'కరి మింగిన వెలగపండు సిరి' అని చెప్పారు కదా. ఆ విధంగా జారిపోతుంది. అందుకని అగ్నిని బాగా పెంచాలి. తమస్సుకి, లక్ష్మికి ఒక కోసెడు దూరం వుంటుంది. ఎంత తమస్సు ఉంటే మనిషిలో, అంత అలక్ష్మి. అందుకనే తమస్సు కన్నా, రజస్సు చాలా మంచిదని చెప్తారు. రజస్సులో, మనిషి ఎప్పుడూ ఏదో ఒక విధమైన ఉత్సాహముతో పనిచేసుకోవడంలో ఉంటాడు. తమస్సులో ఉండేవాడికి అంతకంతకీ అంతకంతకీ పదార్ధం బరువు బాగా పెరిగిపోతుంది. శరీరంలో ఉండే కణముల సాంద్రత అంటామే, density, అది విపరీతంగా పెరిగిపోతుంది. ఇంక వాడికి నిద్రాసక్తి చాల ఎక్కువగా ఉంటుంది. ఎప్పుడు, ఎక్కడ నిద్రపోతామనేది ఎప్పుడూ planning లో భాగంగా వుంటుంది. ఇవాళ అన్నం తిన్న తరువాత నిద్ర దొరుకుతుందో, దొరకదో, రాత్రి తొందరగా పడుకోవడం, ప్రొద్దున్నే లేవలేకపోవడం వుంది చూశారా, అది చాలా స్పష్టమైన సంకేతం మనలో తమస్సు ఉందని. అందరికీ తెలుసు కానీ. అలాగే భోజనం చెయ్యగానే పడుకుందామనేదాంట్లో తెలుస్తుంది, తమస్సు. పనిచెయ్యడంలో ఒక ఐదు నిముషాలు ఆలస్యంగా, prayer కి ఒక ఐదు నిముషాలు ఆలస్యంగా, వెళ్దామనుకునే చోటికి ఒక ఐదు నిమిషాలు ఆలస్యంగా, ప్రతిచోటుకి ఆలస్యం అవుతూ ఉండడం, పనుల్లో కూడా ఆలసత్వం. ఏదో train కి వెళదామనుకుంటే, మనం వెళ్ళేసరికి train platform మీద నుంచి కదిలి వెళ్ళిపోతుంటే, వెనుక పరిగెత్తి, పరిగెత్తి, పరిగెత్తి, ఆయాసపడుతున్నట్టుగా కల వస్తుంది. ఇవన్నీ ఏమిటయ్యా అంటే మనకి సంకేతం, తమస్సు బాగా పెరుగుతోంది లోపల అని. జీవితంలో ప్రతి విషయానికి కొంత late అండి! మరి ఇవి పోవాలంటే? పోవాలని వాడికీ ఉంటుందిగా, ఉన్నవాడికి. పోవాలంటే ఇది చేయాలి. ఏది? బాగా, పట్టి లాగాలి. ఎక్కతీసి లాగాలి అంటారు చూశారా, అట్లా బాగా శ్వాస మీద పడి, పని చేసుకుంటే అన్నీ మారిపోతాయి. కానీ అది కూడ చెయ్యనివ్వదు. మనమందరం ఎన్నిసార్లు చెప్పుకున్నాం? మనం ఎంత చేస్తున్నాము? చేయనివ్వదు కదా! ఎందుకు చేయనివ్వదు? నీ బలం చాలదు. ఎందుకంటే నీలో వుండే పెద్దమ్మ, ఏడిశావులే నోర్ముయ్యి అంటుంది. అమ్మా, తప్పకుండా, అని నోరు మూసుకుంటావు. అందుకని ఏం చెయ్యాలంటే, పెద్దమ్మని దాటి, చిన్నమ్మ దగ్గర చేరి ఉన్నవాడు ఉన్నాడే, వాడితో కలిసి చేసుకోవాలి. అప్పుడు వాడి బలం వల్ల వీడికి కూడా అంటుతుంది. అంటటం చేత వీడు కూడా చేసుకోవటమనేది క్రమశః వీలు పడుతుంది. ఒక ఒడ్డున కూర్చున్నవాడు, కొట్టుకుపోతున్న వాడికి చేసే సహాయం అది. ఓ మహాత్ముని సాన్నిధ్యంలో చేసుకున్నారనుకొండీ, ఆయనతోపాటు చేసుకున్నారనుకోండి, నువ్వు జారిపోయినా ఆయన లాగుతూ ఉంటాడు. మనంతట మనం

చేసుకుందామనుకున్నామనుకోండి, చాలాసార్లు మంచిచోటుకి వెళ్ళి ఏదో ఆశ్రమానికో ఎక్కడికో వెళ్ళి, తెల్లవారు ఝామున లేస్తుంటాం. ఇప్పుడు షిరిడి వెళ్ళామంటే తెల్లవారు ఝామున లేస్తాం. పుట్టపర్తి వెళ్తే తెల్లవారు ఝామున లేస్తాం. తిరుపతి వెళ్తే అర్చనకని రెండింటికే లేస్తాం. అప్పుడు మనకి రెండు మూడు రోజులు అయిన తరువాత ఎట్లా ఉంటుంది తెలుసా, రోజూ లేవచ్చు కదా మనం పొద్దున్నే అనిపిస్తుంది. కదా. అక్కడ లేవడం అంత సులభమేమిటి? మన ఇంటికి వచ్చిన తరువాత అంత కష్టమేమిటి? అక్కడ ఉండే బలమది. ఆ దేవస్థానంలో, గురు స్థానంలో ఉండే బలం చేత, నీకు చాలా సులభంగా మెలకువ వస్తుంది. అన్ని కార్యక్రమాలూ సులభంగా అయిపోతాయి. చాలా ఉత్సాహంగా ఉంటావు. రోజూ మూడింటికి లేవచ్చు కదా రోగమా? అనిపిస్తుంది. పైగా అట్లా లేచినా రోజంతా కూడా నిద్ర మొహం ఉండదు అక్కడ. అప్పుడు ఆశ్చర్యం వేస్తుంది. మనం ఇలా ఉండగలం అని తెలుస్తుంది. వచ్చిన రోజు నుండీ ముందు ఏం చేస్తామంటే అబ్బా చాలా మనం అలసిపోయి వచ్చాం కదా, ఈ ఒక్కరోజు, కాస్త మామూలుగా పడుకుని, రేపటి నుంచి అంటాం. అంతే, ఇంక అది అంతే, ఇంక అది రేపే. అట్లా ఉంటుంది. అందుకనే ఏం చెయ్యాలంటే, అట్లా చేసుకునే వాళ్ళ దగ్గరకి వెళ్ళి కూర్చోవాలి. కలిసి చేసుకుందామండీ, combined studies అన్నమాట. కలిసి చేసుకోవడంలో అది ఉన్నది. నీ బలం నీకు చాలదు కాబట్టి సత్సాంగత్యము వలన, నీకు బలం కలుగుతుంది. సత్సంగత్వంలో వదిలి పోయినట్లుగా మామూలుగా వదలవు. ఎందుకంటే నువ్వు ఒక్కడివే వుంటే అవి నిన్ను కమ్మేస్తాయి. సత్సంగత్వంలో బలం 'సత్' కి ఎక్కువుంటుంది. ఉండడం చేత ఇవన్నీ చేరనివ్వవు. మరీ ఎక్కువ అక్కడే వుంటున్నావనుకో, అలవాటయిపోతుంది. అప్పుడు ఇంట్లో కూడా చేసుకోవచ్చు. ఒకాయన నా దగ్గర రుద్రనమకం నేర్చుకుంటానన్నాడు. ఎన్నింటికి రమ్మంటారు, తొమ్మిదింటికి రమ్మంటారా అన్నాడు. తొమ్మిదింటికి కాదయ్యా, వేదం నేర్చుకుందామనుకుంటే ఒక time టైముంది దానికి. సూర్యోదయానికి ముందు రా, వేదం నేర్పుతాను, సూర్యోదయం అయిన తరువాత ప్రార్థన చేసుకున్న తరువాత వెళ్ళిపోదువుగాని, అని చెప్పాను. మొదటి రోజు, వస్తానన్న రోజు అసలు రానే రాలేదు. Phone చేశాడు తొమ్మిందింటికి, లేవలేకపోయాను సార్ అని. సరే, రేపు లే అన్నాను. లేచాడు. ఒక రెండు మూడు రోజులు వచ్చాడు ఏదో మొత్తానికి, నిక్కీనీలిగి! ఆ తరువాత అతనికి ఒక, brilliant idea వచ్చింది. మంచి ఐడియా వచ్చింది సార్, అన్నాడు. ఏమిటంటే మీరు రోజూ నాకు, నేర్పుతున్నారు కదా! అది, రోజూ ఎంతెంత నేర్పుతారో అది record చేసి ఇసే సుళువవుతుంది కదా! అంత దూరం పడి రావడం కష్టం కదా అని. ఎక్కడ? యోగాశ్రమం దగ్గర నుండి రావాలి అతను. ఇక్కడ యోగాశ్రమం దగ్గర నుండి రావడానికే బాధపడతారు, Foreigners ఎంత దూరం నించి వస్తారు తెలుసా? ఇరవై, ముప్పై, నలభై kilometers దూరం నుండి, పొద్దున్నే కారు వేసుకొని ప్రార్థనకి వచ్చేవాళ్ళు వందలాది మంది ఉన్నారు అక్కడ! ఏమిటంటే వాళ్ళలో తమస్సు లేదు. మనకి ప్రక్క సందులోంచి రావడానికే బద్ధకంగా వుంటుంది. ఎందుకుంటుందంటే అంతే అది. మాస్టరుగారు అక్కయ్యపాలెంలో ప్రార్థన

చేస్తున్నారట, New colony లో ప్రార్ధన చేస్తున్నారట, ఎక్కడ ప్రార్ధన చేస్తుంటే, ఆయనతో కలిసి ప్రార్ధన చేసుకుంటే ప్రార్ధన అంటుతుంది తప్ప, ఆయన మనకి చెప్పారు కదా, మనం చేసుకుందామనుకుంటే అంటదు. కలిసి చేసుకోవాలి. ఆ స్ఫూర్తి ఉండాలి. సరే అలాగే record చేసుకో అని చెప్పాను. Record చేసుకున్నాడు. Record పెట్టుకొని ప్రొద్దున్నే కూర్చున్నాడు. కూర్చుంటే, ఎవరూ లేరు కదా! మొదటి రోజు విన్నాను, అన్నాడు. రెండవ రోజు ఏమయిందంటే ప్రొద్దున్నే నిద్ర లేచాడు కానీ, స్నానం చెయ్యలేదు. స్నానం చెయ్యకపోతేనేంలే వినడమే కదా అనుకున్నాడు. విని నేర్చుకోవడమే కదా అని, వినడం పెట్టుకున్నాడు. మూడవ రోజు, నాల్గవ రోజు అట్లా ఏమైందంటే తరువాత పడుకుని వినడం మొదలుపెట్టాడు. ఏరా ఎట్లా వుంది నీ సాధన, అంటే, ముందు ప్రస్తుతం వింటున్నాను సార్ అన్నాడు. బావుంది, ఎట్లా వింటున్నావంటే, కొంచెం పడుకుని వినడంగా వచ్చింది. ఆ తరువాత ఏమైందంటే అది పడుకోవడంగా అయిపోయింది. ఇవాళ్టికి కూడా ఆయనకి రాలేదు నమకం. ఈ ఉపమానం నేను ఇప్పటికి కనీసం పదేళ్ళ నుంచి చెపుతున్నానేమో. అంతకు ముందు ఐదేళ్ళ క్రితం సంగతి. పదిహేనేళ్ళు ఐపోయింది. రాదు. ఎందుకు రాదంటే, తమస్సు! కాబట్టి అది చేసే వాళ్ళతో కలిసి చేసుకున్నారనుకోండి, పారిపోతుంది. అదే ఒక సిద్ధపురుషుడి యొక్క సాంగత్యంలో దొరికేది. ఏమిటి ఆయన దగ్గర దొరుకుతుందంటే, అదే దొరుకుతుంది. ఆయనతో కలిసి చేసుకోవడం వలన దొరికింది వేరు, మనంగా మనం చేసుకున్నది వేరు. ఆ తేడా చాలా ఎక్కువగా వుంటుంది. నీ అంతట నువ్వు నిష్ఠగా, అంతఃస్ఫూర్తితోనూ చేసుకునేంతవరకు, నీకన్నా బాగా చేసుకునేవారితో, వీలున్నంత వరకు, కలిసి చేసుకో. చేసుకుంటే అబ్బుతుంది. అదే నేను చెప్పిన అప్ప తెచ్చుకోవడమంటే. శ్వాస బాగా దానిమీద పనిచేయండి. మనకి సాధనకి అది ఒక్కటే మెట్టు! శ్వాసతో అగ్నిని ప్రజ్వలింపచెయ్యండి. Petromax light బాగా గుర్తుపెట్టుకోండి. దాని పంపు కొడితే అగ్నిశిఖలు క్రింద నుండి ఇట్లా పైకి వస్తాయి. అట్లా మనకి శరీరంలో ప్రాణమయకోశం బాగా ఉత్తేజితం అవుతుంది. అది ఉత్తేజితమైన కొద్దీ కామశరీరాన్ని దగ్ధం చేస్తుంది. బాగా ఉత్తేజితమవుతున్న కొద్దీ దివ్యశరీరానికి కావలసిన పునాదులు వేస్తుంది. ఇంత ఉంది, శ్వాసలో. రోజుకి మూడుసార్లు చేసుకోమని చెపుతారు పెద్దలు. ముందు ఒక్కసారి చేయండి. రెండుసార్లు చెయ్యడానికి ప్రయత్నం చెయ్యండి. మూడుసార్లు చేస్తే గొప్ప విషయం. దాని ద్వారా మనం బయటికి ఎంతైనా నెట్టెయ్యచ్చు. బోలెడు ఆవలింతలు వస్తాయి. గట్టిగా, మనం శ్వాస పీల్చి వదులుతూ ఉంటే, విపరీతమైన ఆవలింతలు వస్తాయి. ఆవలింతలు దేనికి సంకేతమయ్యా అంటే తమస్సుకి సంకేతం. ఆ తమస్సు బయటికి వచ్చేస్తుందన్నమాట. బొగ్గుపులుసు వాయువు బయటికి పంపించేస్తుందన్నమాట. కళ్ళ వెంబడి నుంచి నీళ్ళు వస్తాయి. ఏడవం; ఆవలించిన కొద్దీ బాగా తెరచుకుని, ఈ కళ్ళలోంచి కూడా అది బయటికి వచ్చేస్తూ ఉంటుంది. CVV గారి ధ్యానంలో అట్లా ఆవలింతలు రావడమనే ఒక ప్రక్రియ జరుగుతుంది. కావాలని ఆవలిస్తే అసహ్యంగా ఉంటుంది. ఆవలించాలి కదా అని ఆవలించడం కన్నా, శ్వాస పీలిస్తే బావుంటుంది. అది అందుకుని అగ్నిని ప్రజ్వలింప చేసుకుని, మలినాలను బయటికి పారద్రోలండి.

అపుడు మనకి, ఒక్కొక్కటి ఒక్కొక్కటి దగ్గరకి వస్తాయి. ఎట్లా దగ్గరకి వస్తుంది? శ్రీ అంటే చెప్పాను, నాలుగు, కదా. ఇచ్ఛ, జ్ఞాన, క్రియా శక్తులు కాకుండా లక్ష్మి, పార్వతి, సరస్వతీదేవి కాకుండా, విషము లేక మలినము లేక మృత్యువు; అదే పెద్ద అమ్మవారు. ఆవిడని పంపించేయాలి. చిన్న అమ్మవార్ని పట్టుకురావాలి. ఆ మూడూ, సమపాళ్ళలో మనలో వుండాలి. సంకల్ప బలం ఉండడమే ఇచ్ఛా బలం. మనం ఒకటి అనుకుంటే అది చెయ్యగలిగిన పరిస్థితి వుండాలి. అనుకోవడమే కాని, చేయలేకుండా ఎన్నో ఉంటాయి మనకి. కదా. అవన్నీ abortions. మనస్సులో పుట్టి, చేతల్లోకి రానివన్నీ పిల్ల పుట్టనట్టే, బయటికి రానట్టే కదా! ఎన్ని abortions! లేచిన దగ్గర్నుండి వరుసగా. సంకల్ప శక్తి వున్నవాడు, తనలో కలిగిన సంకల్పాన్ని నిర్వర్తించి, అక్కడ సృష్టి చేసి చూపిస్తాడు. దానినే 'White Magic' అంటారు పరమగురువులు. ఒక దివ్యమైన సంకల్పాన్ని, చక్కగా నిర్వర్తించడం జరిగితే, అది భూమి మీద దానికి సంబంధించినది ఏర్పరచగలిగితే, నువ్వు సంకల్ప శక్తి కలిగినవాడివి. అలాగే జ్ఞానశక్తి. ఎంత మనకి, మలినం తగ్గుతూ ఉంటుందో, అంత లోపల్నుంచి వికసించుకొస్తుంది జ్ఞానం. దీపం లోపలే ఉంది, దాని చుట్టూ మసి. మంచి దీపం పెట్టి, సమ్మెంతా, ఒక నల్ల చిప్ప బోర్లించామనుకోండి, లోపల దీపం ఉన్నట్టుగా తెలియదు కదా! అంత మసి వున్నది కాబట్టి, మసిని తీసేసుకోగానే లోపల్నుండి జ్ఞానదీపం మనకి వ్యక్తమవుతుంది. అట్లా తెలుసుకున్నారు మన మహాత్ములందరూ కూడా. ఇచ్ఛ, జ్ఞానములు తరువాత క్రియ. ఈ విధంగా నిర్వర్తింపగలిగిన సమర్థత వస్తుంది. సమర్థత కలిగిన చోట, ఈ విధమైన సంపద వుంటుంది. ఇది మనకి అందించడం అనేది భగవంతుడు చేస్తాడు. 'శ్రీదః' అంటే శ్రీని ఇచ్చేవాడు. 'శ్రీశః', శ్రీకి ఈశ్వరుడు. శ్రీనివాసః. 'శ్రీవాసః' అంటే శ్రీలో తను ఉంటాడని కదా! త్రిగుణములలో తను, ప్రవేశిస్తాడని, అక్కడ్నుండి ఆవిడ అల్లే అల్లికలన్నిటిలోకి ప్రవేశిస్తాడని, ప్రతి చిన్న విషయంలో కూడా వుంటాడని. చీమలో, దోమలో కూడా ఉంటాడని. అది 'శ్రీవాసం'. ఇక్కడ 'శ్రీనివాసం' అంటే ఆవిడ ఆయనలో వుంటుందని. 'శ్రీవాసః' అంటే ఆయన ఆవిడలో వున్నాడు, అన్ని స్థితులలో కూడా. శ్రీనివాసుడు అంటే ఆవిడ ఆయనలో ఉంటుంది. ఆయన హృదయంలో వున్న ఆవిడే, ఆవిడ వ్యక్తమై బయటికి వస్తూ ఉంటే, ఆవిడలో ఉంటూ వచ్చాడు. అప్పుడు ఆయన 'శ్రీవాస్' అయ్యాడు. అటు నుండి ఇటు మళ్ళీ, ఇది చాలా పెద్ద విషయం. శ్రీవాసం కన్నా శ్రీనివాసం చాలా పెద్దవిషయం. శ్రీనివాసుడంటే తాను శ్రీకి నిలయం. అంటే మన ఇంట్లో, మన ఒంట్లో ఆమె వుండడం, అంటే మనం ఆవిడకి ఆశ్రయమై ఉండడం, అది ఆయనకే తగుతుంది. ఆమె ఇంట్లో ఆయన ఉండడం, మా ఆవిడ ఇంట్లో నేనుంటున్నానండి అన్నట్టుగా వుంటుందండి సృష్టిలో. ఇల్లు ఆవిడది, ఉండేది ఆయన. ఇక్కడేమిటంటే శ్రీనివాసుడంటే ఆయన ఇంట్లో ఆవిడ వుంటుంది. అందుకనే హృదయంలో చూపిస్తాడు, ఇక్కడ వుందని చెప్పడానికి. 'శ్రీనివాస్' అంటే ఆవిడ ఆయన ఇంట్లో ఉంటోంది. 'శ్రీవాస్' అంటే ఆవిడ ఇంట్లో ఆయన ఉంటున్నాడు. రెండిటిలో చాలా తేడా వుంది. ఎవరి ఇంట్లో ఎవరు వుండడం వలన ఎవరికి ఎక్కువ బలం వుంటుంది? అంటే శ్రీని తనయందు ఒక బిందువుగా పొందిన భగవంతుడు, బిందువులోకి చొచ్చుకునివెళ్ళి అందులో ఉంటున్న

భగవంతుడు. ఇటూ వుంటాడు, అటూ ఉంటాడు. ఆవిడ వ్యాపనం అంతా కూడా ఆయన సహకారం చేతే జరుగుతుంది. 'శ్రీదః' శ్రీని ఇచ్చేవాడు. 'శ్రీశః' శ్రీకి ఈశ్వరుడు. 'శ్రీనివాసః' తనయందు అమ్మవారు వుంటుంది. అక్కడ్నుంచే మొత్తం మొదలు. అదే నాలుగు స్థితులు చెపుతారు. 'శ్రీనివాసః' స్థితి చిట్టచివరి స్థితి. కలియుగదైవం కదా! ఎప్పుడూ దైవమే! మొట్టమొదటి స్థితి ఏమిటయ్యా అంటే భవతారిణి. ఆయన పడుకుంటే ఆవిడ ఎక్కి తొక్కుతూ ఉంటుంది. జననేంద్రియముల దగ్గర ఒక కాలు, హృదయం దగ్గర ఒక కాలు వేసి తాండవమాడుతూ వుంటుంది. శివుడి మీద శక్తి, పదార్థము పరమార్థము మీద ఆధిపత్యము పొందిన స్థితికి సంకేతము. అక్కడ్నుండి నెమ్మదిగా రెండవ మెట్టు ఎక్కితే జీవుడి క్రింద లెక్కవేసుకోవచ్చు. మనం త్రొక్కబడుతున్నాము కదా జీవితంలో. మనకేమైనా స్వామిత్వమా? పాడా? బానిసలమే. హాయిగా రాజువలె బ్రతకమని జీవితం ఇస్తే, బానిసల్లే బ్రతకడం నేర్చుకున్నాం మనం. అది గుర్తు చేస్తూ ఉంటుంది ఆ స్థితి. 'నన్ను ఆశ్రయించరా, నువ్వు ఈ స్థితినుండి బయటపడతావు' అన్నట్టుగా చెపుతుంది కాళి. ఇలా నాలుక బయటికి పెడుతుంది కదా! ఏమిటో తెలుసా? నాలుక బయటపెట్టడంలో అర్థం? అట్లా పెట్టిన నాలుకతో నీలో వుండే చెత్తనంతా లాగేస్తాను అంటుంది. అదీ కాళి గొప్పతనం. నీలో చెండాలమంతా నాలుకతో నాకేస్తానంటుందన్నమాట. శివుడు చిప్ప పట్టుకున్నట్టు ఆవిడ నాలుక బయట పెడుతుంది. శివుడి చిప్ప కూడ అదే. భిక్షాపాత్ర అంటాం కదా. చిప్ప అంటే బావుండదు. భిక్షాపాత్ర సంస్కృతం. మనకి అడుక్కునే చిప్ప. అందులో ఆయన కోరేది కూడా అదే. నీలో వుండే పురుగులన్నీ ఇందులో పడేసెయ్యి, నువ్వు హాయిగా వుంటావు అని తిరుగుతూ ఉంటాడుట. కాబట్టి అమ్మవారు, అక్కడ కాళిగా వున్నప్పుడు మొదటి స్థితి. రెండవ స్థితిలో ఏం చేస్తుందయ్యా అంటే కాస్త నువ్వు ఏమైనా నేర్చుకుంటే, చంకని ఎక్కించుకుంటుందిట. ఎత్తుకుంటుంది. ఎక్కి తొక్కుతున్నది, ఎత్తుకుంటుంది. అది యశోదాకృష్ణ. బాలకృష్ణుడు, యశోద ఒడిలో వున్నాడు, అంటే, ప్రకృతి ఒడిలోకి తీసుకుంది జీవుణ్ణి. అంతకు ముందు పిచ్చగా తొక్కుతుందన్నమాట. ఒకటే తొక్కుడు, అప్పడాల పిండి తొక్కినట్టు. తొక్కి తొక్కి వదిలేస్తే, అందులోంచి వాడు నేర్చుకుంటాడు. కాస్తో కూస్తో నేర్చుకువాడు, ధర్మాన్ని అనుసరించడం ఇటువంటివి ఏవో ఉంటాయి కదా! కాస్త వాడిలో పరిణతి రాంగానే చంకలోకి తీసుకుంటుందిట. అప్పుడు కొడుకు అవుతాడు. Son of the Mother. అక్కడ్నుంచి వాడు నెమ్మదిగా, ధర్మంలోను, వెలుగులోను, శుచిలోను, శుభ్రంలోను, అన్నిటిలోను, బాగా పెరుగుతూ ఉంటే తనలో సగం ఇచ్చేస్తుందిట. అర్ధరాజ్యం ఇచ్చేస్తుంది. అప్పుడు కొడుకు స్థితి నుండి మొగుడు స్థితి వస్తుంది. మొగుడు అంటే ఏమిటి? సగభాగం! భార్యాభర్తలలో ఇద్దరూ సమానులే అని భారతీయ సాంప్రదాయం. ప్రవర్తన ఎట్లా వున్నా, ఎవరి బలాబలాలను బట్టి వాళ్ళు, అధికృత సంపాదించుకుంటూ ఉంటారు మామూలుగా జీవితంలో, కదా! అది అలా వుండగా సాంప్రదాయము ఏమిటి అంటే భార్యా,భర్త అంటే they are equals అని అర్థం. సమానులు. అది అర్ధనారీశ్వర తత్త్వం. అంటే ప్రకృతి తనకి పూర్తిగా సహకరిస్తున్న స్థితి. అంతకు ముందు పిల్లవాడుగా ఉన్నప్పుడు, ప్రకృతిచే,

రక్షింపబడుతున్న స్థితి. అంతకు ముందు క్రిందపడి త్రొక్కబడుతున్నప్పుడు, ప్రకృతిచే, శిక్షింపబడుతున్న స్థితి. జీవుడు ప్రకృతిచే శిక్షింపబడుతూ ఉంటాడు. అందులోనుంచి ఏమైనా ప్రాయశ్చిత్తం కలిగి నేర్చుకుంటే, నెమ్మదిగా రక్షణ వస్తుంది. పిల్లవాడిని చంక నెక్కించుకోవడమంటే అదేకదా! తల్లి పిల్లవాడికి ఇచ్చినది రక్షణే! అక్కడి నుండి ఇంకా బాగా తయారైతే, సగం ఇస్తుంది. అంటే ఏమిటయ్యా అంటే సహకరిస్తుంది. ప్రకృతి సహకారం. అంటే ఏమయ్యాడు? అంతకు ముందు బానిస, తరువాత కొడుకయ్యాడు. కొడుకు ఇప్పుడుభర్తయ్యాడు, భాగస్వామి అయ్యాడు. ఆ తరువాత తండ్రి అవుతాడు. అది శ్రీనివాస స్థితి. అంటే తాను తండ్రి, ప్రకృతి తన కుమార్తె. తన హృదయం నుంచి పుట్టుకొచ్చింది కదా! మనకి కూడా అదే చెపుతారు. పిల్లవాడిగా వున్నప్పుడు తల్లి సంరక్షణ. ఆ తరువాత పెద్దయిన తరువాత భార్యతో భాగస్వామ్యం. ఆ తరువాత నీకు కూతురు పుడితే నువ్వు తండ్రి అయ్యావు. అందుకని, తల్లి, భార్య, కూతురు. ఈ మూడూ, నీ చైతన్యము యొక్క, వృద్ధికి సంబంధించిన మూడు stations. కాబట్టి మూడు స్థితులు మనకి ఏర్పడిన తరువాత నాల్గవ స్థితిలో శ్రీనివాసుడు! వాడిని ప్రార్థన చేసుకుంటే ఆయన కూతురు, ఎటువంటి కూతురయ్యా అంటే ఆయనలో చాలా  బుల్లి కేంద్రంలాగా, బిందువు లాగా ఉంటుంది. ఆయన్ని ప్రార్ధన చేస్తున్నాం, ఈ శ్లోకంలో. బాబూ బాబూ, కాస్త దీని సంగతి చూడమని. అందుకనే ఆ సంకేతం వేంకటేశ్వరస్వామి! అబ్బో, తలుచుకున్నవారికల్లా విపరీతంగా పారేస్తూ ఉంటాడు. ఆ సంకేతంలో అది ఉంది. అందుకనే ఆయనకి అంత వైభవం, ఆయన్ని తలచినవాడికీ అంత వైభవం. ఆపదమొక్కులవాడు కదా! ఎంతమంది ఎన్ని రకాలుగా కష్టాలు, నష్టాలు తీరి సుఖాలు పడకపోతుంటే, వేస్తారండీ వెళ్ళి అక్కడ హుండీలో మనవాళ్ళు? మనవాళ్ళు చాలా commercial, మనిషి  వాటా ఇస్తాడు తప్ప, మొత్తం ఇవ్వడు కదా. అంతేనా మనం చేస్తాం? ఓ ముగ్గురు భగవంతుడికి మొక్కుకున్నారుట, ఏదో పెద్ద కార్యం తలపెట్టారు. కలిసొస్తే అందులో వచ్చి నీ  హుండీలో ఇంత వేస్తామని. ఎంత వేస్తామో చెప్పలేదు. ఎందుకు  ముందే commiment అని. సరే ముగ్గురికీ విపరీతంగా కలిసొచ్చిందిట. కలిసొస్తే ముగ్గురూ కూర్చుని, ఏరా మనం కలిసొస్తే మరి చేస్తామన్నాము కదా! మరి ఇప్పుడు మరి వెళ్ళి వెయ్యాలి కదా! ఎంతెంత వేద్దామని. అంటే ఒకడు  'నేను ఒక రకంగా నిర్ణయం చేసుకున్నాను', అన్నాడట. 'మొత్తం నా దగ్గర పోగైన డబ్బుంది కదా! అది, దగ్గర పెట్టుకుని, ఇదిగో  ఇంత circle/వృత్తం ఒకటి గీస్తాను, పైకి ఎగరేస్తాను. ఈ circle లో ఎంత పడితే అది దేవుడిది. ఈ  circle కి బయటపడ్డది నాది' అన్నాడు. బావుంది. సరే ఇంకోడ్ని నువ్వేం చేస్తావురా అంటే, 'నేనూ ఆలోచించాను. నువ్వు చెప్పింది బాగానే ఉంది. నేను ఇంకో రకంగా పెట్టుకున్నాను. ఈ circle మధ్యకో గీత గీస్తాను. కుడిభాగంలో పడ్డది ఆయనకిస్తాను, మిగతాది మరి నేనుంచుకుంటాను' అని అంటాడు. అమ్మో వీడింకా తెలివైనవాడు!  అనుకున్నాడుట మొదటివాడు. అనుకుని మూడోవాడిని అడిగాడుట. ఏరా నువ్వేం చేస్తావంటే, 'ఈ సమస్తం, ఆయన ఇచ్చినదే కదా మనకి! ఆయన ఇచ్చిన దానికి మనం ఎంత ఇద్దామని మనం నిర్ణయం చేస్తే ఏం బావుంటుంది? ఆయనకి ఎంత కావాలంటే అంత తీసుకోవడమే కదా' అన్నాడుట.

అమ్మో వీడు చాలా భాగవతోత్తముడు అని వాళ్ళు చాలా ఆశ్చర్య పడ్డారట, నిజంగా అంతా ఇచ్చేస్తాడు అన్నట్టుగా, ఐతే మరేం చేస్తావంటే, 'ఏం లేదు, ఈ ఉన్న కట్టలన్నీ కూడా అట్లా పైకి ఎగరేస్తాను. ఆయనకి ఎన్ని కావాలనుకుంటే, అన్ని ఆయన అందుకుంటాడుట. ఆయన వదిలేసినవి, క్రిందపడ్డవి నేను తీసుకుంటాను, ఆయనకి మొత్తం ఆయన తీసుకుందామని సంకల్పం అనుకో. తీసుకుంటాడు హాయిగా. నాకేం అభ్యంతరం లేదు. కొన్ని తీసుకున్నాడనుకో ఫర్వాలేదు. మొత్తం క్రిందపడేశాడా, నేను తీసుకుంటాను'. ఇట్లా చెప్పాడుట. ఇట్లా మనం వాటాలు వేస్తాం కదా. మనకి వచ్చేదాంట్లో కొంత, ఏదో 5%, 10%, మళ్ళీ వచ్చిన దాన్ని బట్టి అమ్మో కొంచెం ఎక్కువయ్యిందేమో అనిపిస్తూ ఉంటుంది. 'ఇంతెక్కువ వేయచ్చా మనం హుండీలో బావుండదు అని, అంత బదులు ఇంకో దర్శనం ఆ డబ్బులతో చేసుకుంటే బాగుంటుంది. అదికూడా దేవుడి దగ్గరికే వెళుతుంది'. భలే ఆలోచనలు వస్తాయి మనిషికి. ఇప్పుడు మూడువేలు వేద్దామనుకున్నాం అనుకోండి హుండీలో, అక్కడున్నవాడు ఏం చేస్తాడయ్యా అంటే, అర్చన టిక్కెట్లు తీసుకుంటే దర్శనం సులభంగా అవుతుందండీ, మీరు నలుగురున్నారు కదా! నాలుగు రెళ్ళు ఎనిమిది. ఎనిమిది వందలు అవుతుందంటే, ఆ మూడువేలలోనే ఈ ఎనిమిది వందలు సర్దుతాడు. అన్నీ అందులో సర్ది, చివరకి ఏం చేస్తాడంటే ఆ మిగిలిన మొత్తం మూడువేలు కదా నీకు ఇస్తానన్నాను, ఏ రూపేణ ఇస్తే నీకేంటి అంటాడు. ముందు హుండీలో వేస్తానన్న మూడువేలే! ఇట్లా వస్తుంది లోపల్నుంచి ఒక, వైశ్యప్రవృత్తి అంటారు దాన్ని, Commercial attitude. అయినప్పటికి విపరీతంగా ఆయనకి వస్తోందంటే ఆయనకి పాపం మనం ఇచ్చేది 2%, 5% commission కే ఆయనకి అంత వస్తోందంటే, మిగతా వాళ్ళకి, అసలు వస్తున్న వాళ్ళకి ఎంత వస్తున్నట్టు లెక్క?. అదెవరో ఒక మణుగు బంగారం వేశాడుట. అంటే అసలు వాడికి ఎంత వచ్చిందో మనకి తెలియదు కదా! మణుగు బంగారం వేంకటేశ్వరస్వామికి పడ్డదని తప్ప, వెంకటేశ్వర స్వామి అంటాడు, 'చాలదురా ఇది' అంటాడు. ఎందుకంటే వాడికి, పదిహేను మణుగులో, ఇరవై మణుగులో వస్తే నాకు ఇది వేశాడు అన్నట్లు. ఎందుకిది చెపుతున్నానంటే అంత విపరీతంగా ఇస్తున్నాడే, అది ఎక్కడ ఉంది అంటే ఆ symbol లో ఉంది. భగవంతుడైన వేంకటేశ్వరస్వామి లో వుంది. హృదయంలో లక్ష్మి. అది శ్రీనివాసుడు. అంటే ఏమయిందక్కడ? ఆయన బాగా నిండి వున్నాడు, ఆయన యందు ఈమె వినయంగా వుంది. ఇది 'శ్రీనివాసుడు'. మరి ఆయన ఇవ్వదలచుకుంటే ఏముందండి. ఆయన ఇస్తే 'శ్రీదః' అయ్యాడు. ఆయన ఆధిపత్యం వహించియుంటే 'శ్రీశః' అయ్యాడు. శ్రీకి ఈశ్వరుడు అయ్యాడు. 'శ్రీనివాసః' అయ్యాడు.

## 632 శ్రీనిధిః

శ్రీనిధిః అసలు శ్రీకి source ఈయనే. మూలం. అసలు మూలకారణ మీయనే. ఈయన లేకపోతే ఆవిడ లేదు కదా! అందుకని మొత్తం సంపదకి, కారణం కూడ ఈయనే. అందుకని ఆవిణ్ణి అడగడమేముందిలే, ఆయన్ని అడుగుదాం అన్నట్టుగా ఈ శ్లోకంలో వున్నదేమిటంటే, ఆవిడ గురించి ఆయన్ని అడుగుతున్నట్టుగా వుంటుంది. శ్రీసూక్తం కూడా ఆవిడ గురించి ఆయన్ని అడుగుతున్నట్టుగా వుంటుంది. అది ఈ శ్లోకంలో ఉండే ఒక విశేషం.

## 633, 634 శ్రీవిభావనః, శ్రీధరః

ఎట్లా ఇస్తాడో మనకి తెలియదుటండి. వంద రకాలుగా ఇవ్వచ్చు, వెయ్యి రకాలుగా ఇవ్వచ్చు. ఎన్ని రకాలుగా ఇస్తాడో, నువ్వు భావన చెయ్యలేవు. అది'శ్రీ విభావనః'. ఎప్పుడు? ఇందాక చెప్పానే ఆ పద్ధతులలో మనం ఉంటే. మామూలుగా, ధనం వచ్చిన వాళ్ళకి కూడా, వాళ్ళు ఊహించిన పద్ధతిలో రాదు అది. ఇంకో రకంగా వస్తుంది. ఎప్పుడూ మనకి ఊహ కందని పద్ధతుల్లో వచ్చి చేరుతూ ఉంటుంది. మనం ఊహించిన పద్ధతుల్లోంచి అంత రాదు. ఆ విధంగా చేరుతూ ఉంటుంది. అందుకని భగవంతుడి దగ్గర ఉండే ఈమె, ఆయన భావన ప్రకారం వస్తూంటుంది కాబట్టి, ఆయన ఎట్లా భావన చేస్తే అట్లా వస్తుంది. లాటరీలో రావచ్చు. ఎవరో జ్ఞాతులు చచ్చిపోతూ నీపేర రాసేయచ్చు. లేకపోతే నువ్వు రైల్లో వెళ్తూ ఉంటే, ఒక unclaimed box దొరకచ్చు. అందులో open చేస్తే బంగారం బిస్కట్లు ఉండవచ్చు. ఛస్తావు అప్పటి నుంచి ఏం చెయ్యాలో తెలియక అవి. ఇక అక్కడ నుంచి tension. ఎట్లాగైనా రావచ్చు. రావడానికి ఇట్లా రావాలని rule లేదుట. అది చెపుతుంది ఈ నామం. ఎన్ని రకాలుగానైనా సరే నిన్ను సంపన్నుణ్ణి చెయ్యగలడుట ఆయన. ఆయన ధరించి ఉన్నాడు శ్రీ అని చెప్పటానికి అర్థమేమిటయ్యా అంటే, ఆయన మొదటి రూపం ఆవిడే 'శ్రీధరః'. అసలు ఆయన కనబడడం అంటే ఆవిడ రూపంలో కనబడడమే. అదే మనకు కేనోపనిషత్తు చెపుతుంది. కేనోపనిషత్తు ఏం చెపుతుంది? అక్కడ కనబడ్డదిట. వీళ్ళంతా వెళ్ళారుట. అగ్ని వెళ్ళాడుట, వాయువు వెళ్ళాడట, ఇంద్రుడు వెళ్ళాడట. ఏం జరిగిందయ్యా అంటే ఆ కనబడ్డదేమిటో వీడికి తెలియదు. ఆ తరువాత, తెలుస్తుంది. ఏమిటయ్యా అంటే ఆయన వచ్చాడు, ఆవిడ లాగా కనబడ్డది. రూపు కట్టుకుంటే భగవంతుడు వెలుగుగా రావలసినదేనండీ. వెలుగంటే ఆవిడ! 'ఆవిడ' అనే చొక్కా వేసుకోకుండా ఆయన బయటికి రాలేడండీ. వస్తే మనకి కనబడడు. ఇప్పుడు మీకు, నాకు మధ్య ఉండే చోటు అదే, ఆ తత్త్వమే. అది ఒక వెలుగు రూపం కట్టుకుందనుకోండి, అబ్బా దేవుడు వచ్చాడంటాం. రావడమేమిటి? ఉన్నాడు అసలు. 'అదేమిట్రా వచ్చాడంటావు, ఎప్పుడూ ఇక్కడే ఉన్నా కదురా' అంటే, 'ఉంటే ఉండచ్చు సార్ కానీ మాకు కనబడ్డం లేదు కదా! అందుకని ఇప్పుడు వచ్చారన్నాం' అంటాం. అందుకని ఆవిడ లేకపోతే ఆయనకి క్షణం గడవదు. ఆయన దిగి రావాలంటే, ఆవిడ కావాలి. మనం బయటికి వెళ్ళేటప్పుడు ఏ విధంగా చొక్కా లాగూ వేసుకెళతామో, అట్లా ఆవిడని ధరించి గానీ ఆయన వెళ్ళడండి. అందుకని 'శ్రీధర్' ఆయన.

## 635 శ్రీకరః

శ్రీకరుడు. మిగతా వాళ్ళకి కూడా ధరింప చెయ్యగలడు. మిగతా వాళ్ళకి కలిగించగలడు.

## 636 శ్రేయః

ఎట్లా ఉంటుందంటే భగవంతుడు ఇచ్చిన సంపదకి, మరో రకంగా మనం అడ్డగోలుగా దార్లు కొట్టి సంపాదించిన దానికి తేడా ఉంది. ఆయన ఇచ్చిన సంపద శ్రేయస్సు కూడా ఇస్తుంది. శ్రేయస్సుతో కూడిన సంపద ఉంటే వైభవం! శ్రేయస్సుతో కూడని సంపద చాలా భయంకరం! ప్రతి క్షణం భయం, భయంగా వుంటుంది. మీ దగ్గర ఉంచండి అని చెప్పి ఎవరైనా ఒక కోటి రూపాయలు ఇచ్చి వెళ్ళారనుకోండి ఇప్పుడు. ముందు ఈ రాత్రి నిద్ర పట్టదు. ఎందుకంటే ఎవరైనా వస్తారేమో, డబ్బు పోతే పోయింది, తల పగలకొడతాడేమో అని వస్తుంది ముందు భావన. తరువాత దీన్ని ఏం చెయ్యాలి? ఎన్నాళ్ళు ఉంచుకోమన్నారంటే, మీ ఇష్టం అన్నాడనుకోండి, తరువాత ఎప్పుడో వచ్చి తీసుకుంటానని. ఈ లోపల నేను వాడుకోవచ్చా? వాడుకోవచ్చు, నేను అడిగినప్పుడు కోటి ఇచ్చేస్తే చాలన్నాడనుకోండి. మరి మనకు ఎన్ని పుట్టుకొస్తాయో అందులోంచి. ఏం చెయ్యాలో తెలియక క్రింద పడిపోయి, మీద పడిపోయి, మనల్ని మనం పాడుచేసుకుంటాం. శ్రేయస్సు డబ్బుతో లేదు. ఒక్కొక్కసారి సంపద వచ్చి శ్రేయస్సు పోగొట్టినట్టి సందర్భాలు బోలెడు కనిపిస్తాయి. ధనం వచ్చి మనిషిని పాడుచేసిన సన్నివేశాలు ఎన్ని లేవు? అందుకని ఆయన ఇచ్చేది, శ్రేయస్సుతో కూడినది. భగవంతుని నమ్ముకున్న వారి దగ్గరకి చేరినది, అంటే భగవంతుని నమ్ముకోవడమంటే ధర్మాన్ని నమ్ముకోవడం.

## 637 శ్రీమాన్

ధర్మమార్గంలో తన దగ్గరకి చేరినది ఉంటుందే, తను యాచించకుండా తన దగ్గరకి చేరినది, తను ఆరాటపడకుండా తన దగ్గరకి చేరినది, తను సద్వినియోగం చేస్తూ వుంటే తన దగ్గరకి చేరినది, ఉన్నప్పుడు వీడికి కూడా ఆనందాన్నిస్తుందిట. ఆ విధంగా ఉండేవాడు 'శ్రీమాన్'. అందరూ శ్రీమాన్ కాదు. డబ్బులు, ఊరికే డబ్బులుంటే శ్రీమాన్ అవడు. ఊళ్ళో డబ్బులుండేవాళ్ళు, నాకు ప్రత్యేకించి ఈ జన్మకి, అది ఒకటి బాగా, తెలిపేట్టుగా వృత్తినిచ్చాడు భగవంతుడు. అందరూ, మామూలుగా, మీ అందరి కన్నా చాలా భయంకరంగా వుంటాయి వాళ్ళ జీవితాలు. ఏవి? కోట్లు ఉండి, ఎంత భయంకరంగా ఉంటాయంటే, వింటూ ఉంటే అమ్మ ఇటువంటి సంపాదన వద్దు అనిపిస్తుంది. భర్తకి భార్య మీద అనుమానం. భార్యకి భర్త మీద అనుమానం. కొడుకులకు తల్లిదండ్రుల మీద అనుమానం. తల్లిదండ్రులకు కొడుకుల మీద అనుమానం. ఒకరి మీద ఒకరికి అనుమానం. ఎవరిది వాళ్ళు జాగ్రత్త చేసుకుంటూ వుంటారు. ఎప్పుడు వీలుంటే అప్పుడు ఇంకొకడిది లాగేసుకోవడానికి చూస్తూ ఉంటారు, ఏ మాత్రం అవకాశం ఉన్నా. ఈ ఊళ్ళో ఒక సంఘటన చెపుతాను మీకు. పదికోట్ల ఆస్తి తండ్రి ముగ్గురు సంతానానికి పంచి, భార్యకి పంచి, తన వంతు తను ఉంచుకుని, ఒరేయ్ మనమందరం కలిసి ధర్మకార్యాలు చేద్దాం. మీకు అందరికీ నేనిచ్చిన దాంట్లోనుంచి, ఒక పదిశాతం ఇందుకు ఇస్తే బాగుంటుంది అన్నాడు, ధర్మకార్యానికి. వాళ్ళు మొదటి సంవత్సరం ఏం చెప్పారంటే 'ఇప్పుడేగా అందుకున్నాం, ఇంకా పూర్తిగా మాకు అది దాని, మోజు తీరలేదు, వచ్చే సంవత్సరం చూద్దాం' అన్నారు. రెండో సంవత్సరం వచ్చేసరికి ఏం చేశారంటే, 'ఇందులో రెండు రకాలు ఉంది కదా, తెలుపు, నలుపు. తెలుపులో వాటా ఇస్తే పోలేదా! నలుపు సంగతి నాన్నకి ఎందుకు చెప్పాలి అని భావం. మూడో ఏడాది వచ్చేసరికి మనం కష్టపడి సంపాదించి పెంచుకుంటుంటే, ప్రతిసారి పెరిగినదాంట్లో కూడా పదిశాతం బాలేదు, అందుకని fixed గా ఇచ్చేస్తే పోతుంది కదా అని. ఇప్పటికి అది. ఇప్పటికా పరిస్థితిలో వుంది. 'వచ్చే సంవత్సరం నుంచి అసలు ఇవ్వాలా? ఇవ్వను నాన్నా, నేనే కొన్ని ధర్మకార్యాలు సరాసరి చేస్తాను' అని, ఐదో సంవత్సరం ఆపేస్తాడు. అయిపోతుంది దానితో. అట్లా ఉంటుంది అటువంటి డబ్బుతో. తీరని రోగాలు, ఎటువంటి రోగాలంటే, ఒక లక్ష రూపాయలు ఖర్చయిపోతుంది. రోగం మాత్రం మిగిలిపోతుంది. బొంబాయిలు, మద్రాసులు, ఢిల్లీలు, న్యూయార్క్ లు విమానాల్లో తిరగడాలు, ఎంత ఎక్కువ fee ఇస్తే అంత పెద్ద డాక్టరు అనే మోహంలో పడడాలు, ఇటువంటివన్నీ ఉంటాయి. అన్నీ అయిన తరువాత చిట్టచివరికి ఎట్లా ఉంటుందంటే, అది ఏదో cancer అండి అంటారు, అయిపోయింది. చక్కగా అన్యోన్యంగా ఉండే కుటుంబం, డబ్బులు వచ్చి విడిపోయిన సందర్భాలు బోలెడున్నాయి. కేవలం డబ్బు కారణంగా. మరి వీళ్ళందరూ శ్రీమంతులంటే ఎట్లా? శ్రీమంతులు కాదు వాళ్ళు. వాళ్ళని దాన్ని పెట్టే కొడుతుందావిడ! నీకు కావలసినది డబ్బు కదా! ఆ రూపంలోనే వచ్చి నిన్ను చావగొడతానన్నట్లుగా, ప్రకృతి, కాళిలాగ తాండవం చేస్తూ ఉంటుంది

వాళ్ళ మీద. మనకి స్పష్టంగా తెలుస్తుంది, ధనం వల్ల సుఖం లేదని. ఎప్పుడు? అది సరియైన పద్ధతుల్లో రాకపోతే. వస్తే, వాడు శ్రీమంతుడు. వాడికి ఏం జరుగుతుందంటే, కీర్తి ఉంటుంది, ప్రతిష్ట ఉంటుంది, గౌరవం ఉంటుంది, శాంతి ఉంటుంది, కాంతి ఉంటుంది, ఇంట్లో ఆనందం ఉంటుంది. కాస్త పిల్లలతోను, పెళ్ళాంతోను కబుర్లు చెప్పకునే time ఉంటుంది. ఎక్కువ మందికి time ఉండదు. ఎందుకంటే సంపాదనకే ఎంత time చాలదు. కలిసి భోజనం చేసే యోగ్యత ఉంటుంది. ఒకసారి Coramandal express లో Calcutta నుండి బయలుదేరి వస్తూ ఉంటే, ఓ కోటీశ్వరుడు నాతోపాటు ఎక్కాడు A.C. First class లో. సరే కాసేపు అటూ, ఇటూ చూశాడు. నేను ఏదో పుస్తకం చదువుకుంటున్నాను. ఎక్కువసేపు మాట్లాడితే మనకి కాలం వృథా అవుతుందని. చాలా ఇబ్బందిగా చూస్తున్నాడు. ఇంక ఒక రెండు గంటలు ఆగాడు. ఆ తరువాత ఏం చదువుతున్నారంటూ దూరిపోయాడు నాలోకి. ఏం చదువుతున్నారన్నది ఒక ఐదు నిముషాలే ఉంటుంది. ఆ తరువాత, మీరేం చేస్తున్నారు, ఇట్లా వచ్చేస్తుంది. సరే వాడు ఏం చేస్తున్నాడంటే, వాడు చాలా పెద్ద వ్యాపారి. బెజవాడలో ఉంటాడు. పిల్లలు. మాటల్లో ఏముందండీ ఈ రోజుల్లో పిల్లలు మన మాట వినరు కదా అన్నాడు. అంటే నీ మాట నీ పిల్లలు వినడం లేదా? మామూలుగా పిల్లలు, తల్లిదండ్రుల మాట వినడంలేదు కదా అనబోక, నీ విషయం చెప్పు. వింటున్న వాళ్ళు కూడా వున్నారు, నీకు వినడం లేదు అంతేనా! అన్నాను. మీకు వింటున్నారా అంటే వింటున్నారు అన్నాను. నాకు వినడం లేదు అన్నాడు. ఎందుకు వినడం లేదో తెలుసా? అన్నాను. చెప్పండన్నాడు. నీకు డబ్బు సంపాదనలో ఉన్న మోజు, పిల్లలు ఎట్లా ఉన్నారో చూసుకోవడంలో లేదు అని చెప్పాను. అదేమిటి అన్నాడు. ఎప్పుడైనా నీ పిల్లలతో కూర్చుని నువ్వు ప్రొద్దున్న breakfast, మధ్యాహ్నం భోజనం, రాత్రి భోజనం కలిసి చేశావా? అని అడిగాను. చెయ్యలేదన్నాడు. 'మరి వాళ్ళు నీ దగ్గర్నుండి ఏం నేర్చుకుంటారు? నీకు, వాళ్ళకి మధ్య ఏం అనుసంధానం ఉంది? పరస్పరత్వం ఏముంది? ఎక్కడ్నుండి వస్తుంది? అసలు ఇంట్లోవాళ్ళు ఏం చేస్తున్నారో నువ్వు ఏమీ తెలుసుకోవు కదా. మరి ఆ విధానంలో నీకు నీ పిల్లలు వింటారనేది హుళక్కి' అని చెప్పాను. మరేం చెయ్యాలన్నాడు. ఆ దొరికాడు అనుకుని, కలకత్తా నుండి విశాఖపట్నం. చాలా time. వేశా, మనకి తెలిసినదంతా. ఆచరణలో పెట్టాడు. పిల్లలు చాలా చక్కగా తయారై అతని వ్యాపారం అందుకున్నారు. ఇది జరిగింది ఎప్పుడు? 1983లో జరిగింది. అద్భుతంగా ఉంది కుటుంబం. ఉంటుంది. ఎప్పుడయ్యా అంటే, ఈ విధంగా ఉంటే. అన్నీ పాడు చేసుకుంటూ ఉంటారు, డబ్బుతో. ఎందుకంటే డబ్బు సంపాదనే ముఖ్యం. అది ఉంటే వీళ్ళంతా బావుంటారని వాడికి పాపం లెక్క. డబ్బుంటే పిల్లలు బావుంటారనేది లెక్క, చాలా తప్పుడు లెక్క. డబ్బున్న వాళ్ళ పిల్లలంతా బావుండాలి కదా ఆ లెక్కన. లేరు కదా! అందుకని శ్రీమంతులెవరయ్యా అంటే ఎవరి సంపద వారికి వైభవాన్నిస్తోందో, వైభవమంటే ఎట్లా ఉంటుందంటే, ఈయన ఎక్కడికి వెళితే అక్కడ కాలు క్రింద పెట్టనియ్యకుండా చూస్తుందండి. 'తెలుగు మాస్టరునోయ్ మనకి Red carpet treatment ప్రపంచమంతా ఇప్పిస్తున్నారు మాస్టరుగారు' అని

చెప్పారు మాస్టరుగారు. అదీ శ్రీమంతుడంటే! ఎవరో ఒకావిడ France దేశంలో, మేము రాగానే ఏదో పాపం poor Indians వచ్చారని, మేమున్న గదిలో మాస్టరు గారి పేరున, ఒక మూడువేల French Franks కవరు పెట్టింది. ఏమిటోయ్ చూడు అంటే చూశాను. మూడువేల Franks. ఎందుకు పెట్టింది మాస్టరుగారు అంటే, 'ఏం లేదూ ఈ జాతులందరికీ ఒక నమ్మకం, మనం దరిద్రులమని. మన దరిద్రులు కూడా ఇక్కడకి వచ్చి అదే ఋజువు చేస్తూ వుంటారు. ఆధ్యాత్మికత అని వచ్చి, అడుక్కుతిని పోతూ వుంటారు కదా! మరి వాళ్ళందరినీ చూసి మనం దరిద్రులమని వీళ్ళకి బాగా నమ్మకం, అందుకని అట్లా పెడతారు. అట్లా ఉండనీ. రేపు ప్రొద్దున్న ఆవిడకి ఇద్దాములే. పెట్టిన ఆవిడది తప్పులేదు. మనదే తప్పు', అని చెప్పి, మర్నాడు ఆవిడ వచ్చినప్పుడు కూర్చుని కబుర్లు చెప్తున్నప్పుడు చెప్పారు. ఎందుకు పెట్టావంటే, మీకు అవసరం వుంటుంది కదా, అందుకని పెట్టాను అన్నారు. అంటే అప్పుడు మాస్టరుగారు అన్నారు, 'నేను, నా సామ్రాజ్యానికి చక్రవర్తిని' అని చెప్పారు. 'I am an emperor of my own kingdom. I am only a giver. I have never been a begger.' అని చాలా గట్టిగా చెప్పారు, చెప్తే ఆవిడ ఏడ్చేసింది. 'ఈ భావం కలగడానికి కారణం లేకపోలేదు, కానీ నా విషయంలో ఇది సత్యం, అందుకని తీసుకోను, నీ దగ్గర ఉంచుకో' అని చెప్పారు. శ్రీమంతుడంటే అట్లా ఉంటాడు. అంతేకాని దేహి దేహి అని వాణ్ణి వీణ్ణి అడుక్కు తినడు. నాకు దణ్ణం పెట్టుకున్నవాడివి నీ గురించి ఎవరినీ అడక్కురా అన్నారుగా! చక్రవర్తులే అట్లా మాట్లాడగలరు. కదా! ఏసుక్రీస్తుని శిలువ వేసేముందు నానా బాధలు పెట్టి, ముళ్ళ కిరీటం పెట్టి, నువ్వు రాజాధిరాజువట కదా, అంటే అవునంటాడు ఆయన. అదేమిటి అంటారు. మరి ఏది నీ రాజ్యం అంటే మీకు కనబడదు అంటాడు. ఇక్కడే ఉంది మీకు కనబడదు. ముందు ముందు అవతరిస్తుంది నా రాజ్యం, అని చెప్పాడు ఆయన. మీ రాజ్యం, నా రాజ్యం మీద చాలా చిన్న రాజ్యం. ప్రస్తుతానికి మీకు కనబడ్డం లేదు. అది ముందు తరాల్లో బాగా అవతరించి అందరికీ కనిపిస్తుంది అన్నాడు. ఈ రోజు భూగోళంలో ఎనభై శాతం ఆయన భక్తులే. అట్లా ఉంటుంది శ్రీమంతులంటే!

## 638 లోకత్రయాశ్రయః

మూడు లోకాలకీ ఆయనే ఆశ్రయం. ఒక్క లక్ష్మికి ఏమిటి? లక్ష్మి అనుకోకండి అని. కానీ లక్ష్మో? లక్ష్మే మూడు లోకాలు. మూడు లోకాలంటే ఏం లేదండి. బనీను, బనీను మీద చొక్కా, చొక్కా మీద, ఇంకో కోటు. భూః, భువః, సువర్లోకాలు. వెలుగు లోకం ఒకటి, దాని ఆధారంగా శక్తి లోకం, దాని ఆధారంగా పదార్ధ లోకం. పదార్ధము, శక్తి, ప్రజ్ఞ, ఈ మూడు, మూడు లోకాలు. అంటే మనం చలికాలంలో వేసుకునేటువంటి బనీను, చొక్కా, దానిమీద స్వెట్టరు. ఒకదాని కన్నా ఒకటి మందంగా ఉంటాయి. అంతేగా. స్వెట్టరంటే బాగా మందంగా ఉంటుంది. లేకపోతే గొంగళి అనుకోండి. దానికన్నా చొక్కా కొంచెం తక్కువ మందంగా వుంటుంది. అంతకన్నా బనీను ఇంకొంచెం పల్చగా వుంటుంది. ఆ లోపల నువ్వు వున్నావు. అట్లా ఈ మూడు లోకాలు పదార్ధము, శక్తి, ప్రజ్ఞ . ఈ మూడింటికి, ఆయనే ఆశ్రయం. ఆయన గొడుగులోనే ఈ మూడూ వున్నాయి. ఆయన లోంచే బయటికి వస్తూ వుంటాయి. బయటికి వచ్చిన వాటిలోకి ఆయన వస్తూ ఉంటాడు. మనం ఇల్లు కట్టుకుంటే మన ఇంట్లోకి మనం రావడం లేదూ! మూడు గదులు ఇల్లు కట్టామండి. కట్టుకుని ఏం చేస్తాం. బయట ఉంటావా? అట్లాగే ఆయన మూడులోకాలు, సృష్టి చేసుకుని, మూడు లోకాలలోనూ ఆయనే వ్యాపించి ఉన్నాడు. మనం కూడా, ఒళ్ళు కూడా అట్లా తయారు చేసుకొని, ఆ ఒంట్లోకి మనమే దిగివస్తున్నాం ఏడవ నెలలో, స్త్రీ గర్భంలోకి. అది కూడా ఆయన దగ్గర నుంచి నేర్చుకున్న విద్యే. ఆయన తయారు చేసి అందులోకి దూరాడు, అదే మనం కూడా జీవుడిగా నేర్చుకున్నాం. మనం కూడా తయారు అవగానే అందులోకి దూరతాం. అదే నేర్చుకుని ఇల్లు కట్టి ఇంట్లోకి దూరతాం, కదా! లేదంటే అద్దె కొంపలోకి దూరతాం. ఈ ఇల్లు (శరీరం) కూడా, అద్దె ఇల్లే. సొంత ఇల్లు కాదు. వాడిది ఈ ఇల్లు. వాడింట్లోకి మనం దూరి మన ఇల్లు అనుకుంటూ ఉంటాము. Calcutta, Mumbai వంటి ప్రదేశాలలో ఎవరికన్నా అద్దెకి ఇస్తే వాడు ఇంక లేవడు. అయిపోయింది. ఉన్నవాడిది ఇల్లు అక్కడ. అంటే కలి ధర్మమన్నమాట. అది కాదురా నాది కదా అంటే అయివుండవచ్చు, నాది ఇప్పుడు. నేను లేవను. ఏం చేస్తావో చేసుకో. అట్లాగే ఈ ఇంట్లో మనం నాది, నేను లేవను ఏం చేస్తావో చేసుకో అంటే, చేసి చూపిస్తాడు. అట్లా ఊరికే పెట్టి, ఇట్లా లేపేస్తాడండి, Fork తో లేపినట్టు. ఒక బంగాళదుంప ముక్కని ఇట్లా లేపామనుకోండి, అట్లా జీవుణ్ణి ఆ శరీరంలోంచి టక్కున లేపేస్తాడు. మూడు లోకాలూ ఆయనవే! మనకి మనస్సుగా ఏర్పరచినది ఆయనే. మన మనస్సు అనుకుంటాం. ఇంద్రియాలు ఏర్పరిచింది ఆయనే. శరీరం ఏర్పరచినది ఆయనే. మూడు పొరల శరీరం. ఆ పైన వెలుగుగా, ఆవిడ ఉంది, శ్రీ, బుద్ధి, ఆ పైన జీవుడు, ఆ పైన మనం, ఆ పైన దేవుడు. ఇట్లా ఉంది మనకి. అందుకని మూడు లోకాలకీ ఆయనే ఆశ్రయము అని చెప్పే నామం ఇది. ఈ శ్లోకం సర్వ శ్రేయస్కరమైన శ్లోకం. విష్ణు సహస్రనామ శ్లోకాల్లోకల్లా అద్భుతమైన శ్లోకం. అందుకని మనకి రకరకాల, ఒక్క డబ్బు అనే కాదు. ఏ అసౌకర్యం కూడా, అలక్ష్మే!

జబ్బు కూడా అలక్ష్మే. ఏ బాధైనా అలక్ష్మే. లక్ష్మీ ప్రదంగా ఉండాలి కదా జీవితం. శుభంగా ఉండాలి కదా! ఉండాలంటే ఈ నామాన్ని బాగా సాధన చేసుకుంటే అద్భుతంగా అది మనకి రాణిస్తుంది. అది ఈ శ్లోకం లో ఒక్కొక్క నామం గురించి, మిగతా నామాల లాగా వివరించే అవసరం లేదు. ఎందుకంటే సులభంగా అర్థమవుతున్నాయి. మొదటిది, 'శ్రీదః' ద అంటే ఇవ్వటం. దానం అందులోంచే వచ్చింది. Latin భాషలో కూడా 'ద' అంటే ఇవ్వటమే! Donation అనేది అందులోంచే వచ్చింది. దాన, Dona ఇట్లా. Latin లో Dona అంటే ఇవ్వటం. దాన మనకి. దాణా కాదు!

శ్రీదః శ్రీశః శ్రీనివాసః శ్రీనిధిః శ్రీ విభావనః
శ్రీధరః శ్రీకరః శ్రేయః శ్రీమాన్ లోకత్రయాశ్రయః

దీన్ని బాగా, ఉపయోగించుకోండి. ఋషులు మనకి ఇవన్నీ ఎందుకిచ్చారంటే, ఇన్నెందుకు చెప్పారంటే, వెయ్యి చెపితే ఒక్కటన్నా పట్టుకోడా అని పాపం వాళ్ళకి తాపత్రయం. మనమీద వాళ్ళకి అంత confidence. వెయ్యి చెప్తే ఒక్కటన్నా పట్టుకుంటాడని. అంటే one thousandth confidence వుంది. దానినైనా మనం సత్యం చెయ్యగలిగితే, మనకి బాధలు చాలా తక్కువ ఉంటాయి. ముండకోపనిషత్తులో ఒంటిమీద పెరిగే వెంట్రుకల లాగా, సాలెపురుగు నోట్లోంచి వచ్చేసాలెగూడు లాగా, వెంట నడచివచ్చే నీడ లాగా అప్రయత్నంగా లభిస్తాయి ఇవి, ఇటు తిరిగితే అంటారు. అప్రయత్నంగా లభించే వాటి వైపు ప్రయత్నం చేసే వాడి తెలివి ఏమనాలి? ఈ పద్ధతిలో కొద్దిగా ఓపిక కావాలి. ఇవన్నీ దీర్ఘకాలిక ప్రణాళికలు. కానీ అందినదల్లా ఆనందాన్నిచ్చేది. వెనక్కి తిరిగేదేమీ లేదు. 'అనివర్తి' కదా! భగవంతుడి దగ్గర నుండి లభించినదల్లా మనకి వెనక్కి పోయేదేమీ ఉండదు. అందుకని మనం, కొద్దిగా ఆలస్యమవుతుందని మనకి అనిపించినా, ఆలస్యమంటే మనం ఒక time కి అవాలని అనుకోవడం వల్ల కదా అక్కడి నుండి ఆలస్యం లెక్క. అందితే అట్లా అందుకుందాం. ఇంకో రకంగా వద్దు అనుకుంటే సుఖం. అందుకని ఈ నామాన్ని ఈ విధంగా మనం చెప్పుకోవచ్చు. మూడు లోకాలలో, అంటే మన శరీరము, ఇంద్రియములు, మనస్సు, వీటిని ఏ విధంగా పవిత్రీకరించుకోవాలి అనేది, purification of the three vehicles అని ఇచ్చారు జ్వాలాకూల్ మహర్షి. ఇప్పుడు నేను చెప్పిన విషయాలే ఉంటాయి. ఎక్కువగా ఏం చెప్తారంటే, గూభ్యం లాంటి ఇంట్లో ఉండద్దు అని చెపుతారు. పగలు సూర్యకిరణాలు పడని గదులలో జీవించద్దు అంటారు. రాత్రి పడుకున్నప్పుడు గాలి ప్రసరించని గదులలో పడుకోవద్దు అంటారు. వీలుంటే అంతా, పైన ఆచ్ఛాదం వుండి, చుట్టూ open గా వుండే ప్రదేశంలో పడుకోవాలి, వరండా లాంటి దన్నమాట, పడుకోమని చెపుతారు. పవిత్రమైన ఆహారం మాత్రమే స్వీకరించు అని చెప్తారు. జలములు బాగా తీసుకో అని చెప్తారు. శరీరంలో ఏ భాగంలోను మలినం లేకుండా ఉండేట్లుగా చూసుకో అని చెపుతారు. శుచి అయిన భాషణం కలిగి ఉండేట్టుగా ఉండమని చెప్తారు. వీలున్నంత వరకు పొద్దున ఎనిమిది గంటల వరకు, సాయంత్రం నాలుగు గంటల తరువాత, సూర్యరశ్మికి శరీరం ఉన్ముఖమై వుండేట్లుగా చూసుకోమని చెప్తారు. సూర్యరశ్మికి బాగా ఉన్ముఖంగా వుంటే ఈ సమయంలో etheric body చాలా

గట్టిపడుతుందని చెప్తారు. తరువాత మనలో ఉండే ఆవేశములు, కామలోకములలో ఉండే రుగ్మతలన్నీ తగ్గాలంటే, రోజూ ఒకసారి అసలు, విప్పతీసి చూసుకో ఏమున్నాయో లోపల అని చెప్తారు. ఆత్మ పరిశీలనం చేసుకో అని చెప్తారు. ఇట్లా మొత్తం అన్నీ చెప్పడం జరిగింది. అది నిజానికి, ఒక ముప్ఫై నలభై పేజీలుంది. ఇంగ్లీషు వచ్చిన వాళ్ళు చదువుకోవచ్చు. వాళ్ళే తెలుగులో రాయచ్చు. రాసి క్లుప్తంగా పంచవచ్చు. ఎందుకంటే నిధి/ source చూపించేస్తే అందులోకి మీరు కూడా వెళ్ళే ప్రయత్నం చెయ్యచ్చు. జ్వాలాకూలుడు ప్రస్తుత కాలంలో చెప్పని అంశం అంటూ ఏమీలేదు. ఆయన ముప్ఫై ఏళ్ళ dictations ఇచ్చాడు. ఏ అంశానికైనా సరే మనం index తీసుకుని చూసుకుంటే, దానికి సరియైన మార్గం ఇస్తారు. మొత్తం అన్ని పుస్తకాలకి సంబంధించిన ఒక index book కూడా తయారుచేశారు వాళ్ళు. Fear ఉందనుకోండి, మొత్తం ఆయన భయం గురించి ఏం చెప్పాడు మొత్తం అంతా తీయచ్చు. ప్రాణం గురించి ఏం చెప్పాడు మొత్తం తీయవచ్చు. దివ్య శరీరం గురించి ఏం చెప్పాడు మొత్తం అన్ని పుస్తకాలలో నుండి బయటికి తీయవచ్చు. డబ్బు గురించి ఏం చెప్పాడు, అన్నీ బయటికి తీయవచ్చు. అట్లా కొన్ని కొన్ని ప్రయత్నాలు చేసి, కొంత బయటికి తీశారు. మిగతావి మనం కూడా తీసుకోవచ్చు. దీనికి కొంత శ్రద్ధ, ఆసక్తి ఉంటే అన్నీ మనకి అందుబాటులో/available గా వున్నాయి. అంటే ఏమిటి తెలుగులో వున్నాయి. కాబట్టి అది చూడండి. అందుకని ఆ book గుర్తు చెయ్యడానికి తెచ్చాను. 'Letters on occult meditation' అని, అందరం meditation చేసేద్దామనుకుంటాము కదా! చెయ్యడానికి ముందు ఈ మూడు శరీరాలూ కాస్త శుభ్రపరచుకోరా, అని చెబుతారు. అది ఎట్లా చేసుకోవాలో కూడా చెప్తారు.

# 639 స్వక్షః

అంటే చక్కని కన్నులు కలవాడు అని అర్థం. 'భగవాన్ భగహానందీ వనమాలి హలాయుధః' నుండి భగవంతుని యొక్క అంగములను, ఆయుధములను, అలంకరణలను వర్ణించే విధానము ఒకటి శ్లోకాల రూపంలో వస్తూ వున్నది. స్వక్షః అంటే మనం చక్కని కన్నులు కలిగినవాడుగా భగవంతుని రూపుకట్టుకుని ధ్యానం చేసుకోవచ్చు. విష్ణువు యొక్క కన్నులు విచ్చిన కలువలవలె, చాలా ఆకర్షణీయంగా, అందంగా, వెలుగు పూరితంగాను వుంటాయనే భావన మనం ధ్యానం చేసుకునేప్పుడు చేసుకోవలసినది. ఇవన్నీ కూడా ధ్యానమునకు సంబంధించిన నామములు అని చెప్పకోవచ్చు. 'స్వక్షః' అని చెప్పకున్నప్పడు మనం బాగా పూర్తిగా విచ్చుకున్న కన్నులను ధ్యానం చేసుకోవచ్చు. కన్నుల నుండే ఒకరి నుండి ఒకరికి ఆత్మతత్త్వం అందుతుంది. ఎందుకంటే ఎవరి నుండి, ఎవరిలోకి, ఎవరు చూస్తున్నప్పటికి కూడా జరుగుతున్నది వెలుగు ప్రసారమే కాబట్టి సరాసరి అంతర్యామి దర్శనం కన్నుల ద్వారా చేయవచ్చు. కన్నుల నుండి వచ్చేవాడు అంతర్యామియే! ఇంకొకరి కన్నులలోకి చూచినపుడు అటునుండి కనిపించే వెలుగు కూడా ఆ అంతర్యామి యొక్క వెలుగే. అందుకే వెలుగూ వెలుగూ కలిసే ఒక సన్నివేశం కన్నులూ కన్నులూ కలవడంగా చెప్తారు. అందుకని భగవంతుని కన్నులలోనుండి వచ్చే వెలుగును మనలోకి మనం బాగా ఆస్వాదన చేసినట్లయితే, మనలో మనకి పరిపూర్ణమైన తృప్తి, ఆనందము, శాంతి కలగడానికి అవకాశం ఏర్పడుతుంది. భగవంతుని కన్నులను ఆరాధన చేసే ఒక మార్గం కూడా వున్నది. ఆవిధంగా కన్నులనే దర్శనం చేస్తూ, సమస్తాన్ని అనుభూతి చెంది తద్వారా తాదాత్మ్యం చెందిన భక్తుల కథలు కూడా మనకు చాలా గోచరిస్తాయి. భగవంతుని కన్నులు అంత ఆకర్షణీయంగా వుంటాయి. అంతేకాదు ఆకర్షణీయమైన కన్నులు కనిపిస్తే అవి 'భగవంతుని యొక్క కన్నులుగా' భావన చేయాలి. ఎవరి కన్నులైనా, ఆకర్షణీయంగా అనిపించాయనుకోండీ, మాటిమాటికీ చూడాలనిపించిందనుకోండీ అంటే అక్కడ భగవంతుని యొక్క అస్తిత్వము ఆ కన్నుల ద్వారా వ్యక్తం అవుతోందని భావన చేయాలి. ఎక్కడ అందం కనిపించినా అది భగవంతునిదీ, భగవంతుని యొక్క అస్తిత్వమే ఆ విధంగా వున్నదని భావన చేయడం భక్తి మార్గంలో ఒక ముఖ్యమైన విధానము. అందుకని ఇక్కడ కన్నులు చెప్పబడుతున్నాయి.

## 640 స్వంగః (సు అంగములు)

అంటే మొత్తం చక్కటి అంగములు. శిరస్సు నుండి పాదాల వరకూ వుండే సమస్త అంగములు, చాలా అందముగా వుంటాయి భగవంతునివి. మీ ఊహకి అందినంత అందాన్ని మీరు లోపల భావన చేసుకోవచ్చు. నిజానికి భగవత్తత్త్వానికి నామము, రూపము లేనప్పటికి కూడా, నామరూపాత్మకునిగా మన లోనికి ఆవాహన చేసికుని, దాన్ని వెలుగుతో నింపుకుని, బంగారు రంగు, తెల్లటి రంగు, నీలిరంగు, ఒంటిమీద వేసుకున్న పూలమాలల రంగు, పెట్టుకున్న ఆభరణముల కాంతి, ఇటువంటి భావన చేసుకుంటూ ఒక్కొక్క అంగమూ ఎంత దివ్యమైన అందముతో కూడి వున్నదో భావన చేయడం బట్టి మన లోపల ఒక రకమైనట్టి సమన్వయమూ, సామరస్యమూ, సంపూర్ణత ఏర్పడుతుంది. అందాన్ని చూసినపుడు మనలో వుండే ప్రజ్ఞ అంతా కూడా ఒక చక్కని అమరికను పొందుతుంది. అందుకనే పరిపూర్ణమైన అందము చూడగానే, కకలావికలమైన మనిషి ప్రజ్ఞ అంతా కూడా ఒక చక్కని నమూనా ప్రకారం రూపు కట్టుకుంటుంది. ఇనుప రజను ఓ కాగితం లో పోసి క్రింద మనం అయస్కాంతం అటూ ఇటూ తిప్పుతూంటే ఆ రజను చక్కని నమూనాలలో రూపాలుగా ఏర్పడుతుంది. అలాగే పరిపూర్ణమైన అందాన్ని ఆరాధన చేసే విధానము ఒకటి వున్నది. అందం కనిపించగానే దాన్ని మోహించడం అనేది మనస్సునకు లేక మిథ్యా, జ్ఞానములకు సంబంధించిన విషయము. అందం కనబడగానే అందులోని భగవంతుడిని దర్శనం చేయడం అనేది భక్తి మార్గానికి సంబంధించిన విషయము. చక్కని అంగములతో కూడిన వ్యక్తి కనిపిస్తే చూడకూడదనుకోకూడదు. చూచినపుడు నీలో ఎటువంటి భావములు కలిగినవో అవి ముఖ్యం. నీలో దుర్భావములు కలిగితే నీ చూపుల ద్వారా ఎదుటి వ్యక్తి ఇబ్బంది పడతాడు. కొంతమంది చూస్తుంటే ఇబ్బందిగా వుంటుంది. కొంతమంది చూస్తుంటే ఇబ్బందిగా వుండదు. అందాన్ని దైవం యొక్క అస్తిత్వంగా మనం చూడ్డం అనేది మొదలుపెడ్తే, రూపానికి అతీతమైన అందంలోకి మనల్ని మనం ఉద్ధరించుకోవడం అనేది జరుగుతుంది. ఇది చాలా ముఖ్యమైన సాధన. ఒక పువ్వు గానీ, ఒక బొమ్మ గానీ, ప్రదేశంగానీ, మనిషిగానీ ఏది అందంగా ఉన్నా ఆ అందాన్ని చూసినప్పుడు 'అబ్బా చాలా అందంగా వున్నదే' అని అనిపిస్తుందే, ఆ అనిపించినప్పుడు ఆ అందం అక్కడ భగవంతుని యొక్క అస్తిత్వముగా భావన చేయాలి. ఇలా భావన చేయడం గనుక అందాన్ని ఆరాధన చేయడం అనే విధానాన్ని మనం అభ్యాసం చేసినట్లయితే, రూపాతీతమైన అందం రూపం నుండి కనిపిస్తుంది. The beauty beyond form, to be experienced as the beauty in the form. ఆకారంలో వుండే అందంతో, ఆకారం ఉపాధిగా కనిపిస్తున్న అందం, ఆకారానికి అతీతమైన అందంగా గోచరించి మన మనస్సును, ఇంద్రియములనూ ఏకోన్ముఖులను చేసి ఆకర్షించి, మనలను ఒక ఉత్తమమైన స్థితి లోనికి తీసికుని వెడుతుంది. మనలో వుండే కామము అంతా కూడా సరిదిద్దబడి, దివ్యత్వం వైపు ఉన్ముఖమైన ఒక తన్మయత్వ స్థితి కలిగించే పరిస్థితి ఆ అందంలో వున్నది. అందుకే శ్రీకృష్ణుని అందమునకు ఆ

విధంగా విపరీతంగా ఆకర్షితులు అయినారు అందరూ. అందుకే రాముని అందానికీ ఆ విధంగా అందరూ ఆకర్షితులు అయినారు. మహాత్ముల అందానికి ఆకర్షితులవడం అనేది మన వశంలో ఉండక, వివశులై ఆకర్షింపబడతాము. అలాగే గోపికలందరూ ఆకర్షింపబడ్డారు. అలాగే శూర్పణఖా ఆకర్షింపబడ్డది. రాముని అవతారంలో కూడా ఎంతోమంది స్త్రీలు, పురుషులు, బ్రహ్మర్షియైన విశ్వామిత్రునితో సహితం రామునిచే ఆకర్షింపబడి, రాముని ఆలింగనం చేసుకోవడానికి రకరకాలుగా అవకాశాలు వెతుక్కొనేవారు. అలాగ విశ్వామిత్రుడు రాముడ్ని, తాటకిని సంహరించగానే ఒక్కసారి కౌగలించేసుకోవడం, ఆ తర్వాత యజ్ఞం పరిసమాప్తి కాగానే ఒకసారి, ఇలా ఏదో వంక పెట్టుకుని ఒకసారి కౌగలించేసుకోవడం, ఆ తర్వాత అహల్య శాపవిమోచనం చేస్తే కౌగలించేసుకోవడం, ధనస్సు విరిచి సీతని గెలుచుకుంటే కౌగలించేసుకోవడం, పరశురాముణ్ణి చూపుల చేత నిర్వీర్యుణ్ణి చేస్తే కౌగలించేసుకోవడం. ఎందుకు ఇట్లా చేశాడు ? పిచ్చా, వెర్రా, కామమా? అదే మొగవాడు చేస్తే మామూలు అవుతుంది. అదే స్త్రీలు చేస్తే? అదే వ్రాశారు భాగవతం దశమస్కంధంలో ఆడా మగా, తేడా లేదు, ఆవులూ దూడలూ కూడా. సమస్తమూ ఆకర్షింపబడడానికి కారణం ఏమిటయ్యా అంటే అక్కడుండే అందం అలాంటిది. అందానికి ఆకర్షింపబడనివాడు వుండడు. లేకపోతే ఒక్కొక్కడికి ఎంత మోతాదు వుంటే ఆకర్షింపబడతాడు అనేది లెక్క తప్ప. అలా ఆకర్షింపబడ్డప్పుడు మన లోని మనస్సు, ఇంద్రియములు ఏకోన్ముఖమైపోతాయి. మామూలుగా వీటిని ఏకోన్ముఖం చేయాలంటే ఎంత తంటాలు పడాలి? ఈ మనసుని ఏకాగ్రం చేయాలి అనే భావనతో రకరకాల బాధలు పడుతుంటాము. ఇవన్నీ లేకుండా ఒక ఆత్యద్భుతమూ, మనోహరము, అతిసుందరమూ అయిన రూపాన్ని చూస్తే అప్రయత్నంగా అలా ఆకర్షింపబడుతుంది. అదీ మన పెద్దలు మనకు పూజావిధానంలో ఇచ్చిన అంశము. ఆ విధంగా ఆకర్షింపబడడంతో మనస్సు కరుగుతుంది. 'మనోహరము' అయినది ఆ అందం. అంటే మనస్సుని హరింపచేసేది అందం. అది భగవంతుని అస్తిత్త్వము. అది భగవంతుని అస్తిత్త్వముగా చూస్తే తప్పు లేదు. మరో దృష్టితో చూస్తే నీవు మోహం చెందడానికి అవకాశం ఏర్పడుతుంది. నిజానికి గోపికలు శ్రీకృష్ణుని శరీరము యొక్క, అవయవముల యొక్క, కన్నుల యొక్క అందమునకే ఆకర్షింపబడ్డారు నిస్సందేహంగా. ఎందుకంటే భాగవతం 'కామోత్కంఠిత గోపికల్' అని చెప్తుంది. వాళ్ళు కామపరవశులై ఆయనయందు ఆకర్షింపబడితే, ఆయన తన నుండి ప్రసరించే కిరణాల ద్వారా వారిని ఒక తన్మయ స్థితిలో వుంచి, వారు వారి ఆత్మయందు రమించేటట్లుగా ఒక యోగ స్థితిని కల్పించాడు. అది భాగవతంలో వున్నది. తనయందు మక్కువ కలిగిన వారికి, వారిలో వున్న తనను దర్శింపచేసి, తద్వారా వారికి ఆ అనుభూతినిచ్చాడు. ఆ విధంగా భగవంతుని సుందరరూపం చాలా ఆనందాన్ని కలిగిస్తుంది.

## 641 శతానందః

శతానందం కలిగిస్తుందిట భగవంతుని రూపం. వంద రకాలుగా ఆనందిస్తాడుట. 'మంద్రజాలం' లో మార్గశీర్ష పౌర్ణమి నాడు శ్రీకృష్ణుడు వేణుగానం చేస్తుంటే, ద్వారకా పుర వీధులలోని ప్రజలందరూ కూడా వీధులలోనూ, భవనాలలోనూ, గోపురముల పైకి ఎక్కి, కృష్ణుని దర్శనం చేస్తూ వుంటే, ఒకరు కాలివేళ్ళు, ఒకరు కాళ్ళు, ఒకరు చేతివేళ్ళు, ఒకరు చేతులు, ఒకరు కన్నులు, ఒకరు నవ్వులు, ఒకరు చెవులు, ఒకరు ముంగురులు, ఒకరు కదలికను చూసిన వాళ్ళు ఏవిధముగా సమ్మోహితులై ఒక తన్మయస్థితిని చెందారో మనకు దర్శనం అయింది. రాసలీల అంతా అలా జరిగింది. అందుకని రకరకాల యోగవిధానాలలో, మనకి మనస్సును హరింప చేసే పద్ధతులు యుండగా అందులో అందమును ఆరాధించే మార్గమును అతి సులువైన మార్గంగా చెప్తారు. ఎంత అందమైన మూర్తిని మీ ఆరాధనలో అందుకోగల్గితే అంత సాధ్యం అవుతుంది. ముందు ఇంట్లో వుండే బొమ్మలు అలా వుండేటట్లుగా చూడండి. చూస్తుంటే చూడాలనిపించేటట్లుండాలి. ఎంత చూడాలి అనిపించాలి అంటే పరిసరములు గుర్తుకు రానంతగా చూడాలి అనిపించేటట్టుగా వుండాలి. కన్నులు ఆ విధంగా ఆకర్షించగలవు. అందుకే ఒక చక్కని మూర్తిని మనం పూజ చేసుకునేటప్పుడు ఆ మూర్తి యొక్క సమస్త అంగములు అంత అందముగా వుండాలి. కాలి వేళ్ళు, చేతివేళ్ళు ఎంతో సున్నితంగా ఉండాలి. సంపెంగ పూవులాంటి ముక్కు అని, దొండపండ్ల వంటి పెదాలని, తామర రేకుల వంటి కన్నులని, అద్దము వలె నిగనిగలాడే బుగ్గలంటారు. చక్కని చుబుకం, మెడ, భుజములు, కంఠము, కంఠమునందలి రేఖలూ చెప్తారు భాగవతంలో. ఇలా చెప్పడంలో ఉద్దేశ్యం ఏమంటే అది చదువుతుంటే అది చిత్రీకరణం చేసుకున్న వాడు, కన్నులు మూసుకుని అద్భుతమైన, ఒక దివ్యమైన రూపం చూడగల్గితే, అది కారణంగా మనలో వున్న astral currents అన్నీ కూడా ఒక చక్కని కుదురును పొందుతాయి. చక్కటి కుదురు వస్తుంది వాటికి. ఒక చక్కని అమరిక వచ్చి, ఉన్ముఖమై సరాసరి ఆనందమయలోకాలలోకి ప్రవేశించడానికి వీలు పడుతుంది. అందుకనే మన పెద్దలు మనోహరమూర్తిని లోపల దర్శనం చేస్తూ ధ్యానం చేసుకోండి, అని చెప్పారు. గుణాతీతుడైన భగవంతుడు దొరికేముందు గుణములతో కూడిన భగవంతుని మూర్తిని ఆరాధన చేసుకోవడం ఒక మెట్టుగా ఇచ్చారు. అందులో భాగంగా ఈ నామాలు వస్తాయి. స్వక్షః అన్నప్పుడు అద్భుతమైన విచ్చుకున్న కన్నులు గుర్తుకు రావాలి. మనం ఆ కన్నులలోకి చూస్తుంటే తద్వారా తాదాత్మ్యం చెందాలి. దేన్ని చూస్తున్నా అందులోనుండి అంతర్యామిని చూడడం భక్తి. చూస్తున్న అంశము నందు మనస్సు పనిచేయడం కాకుండా, ఆ అందము నందు మనస్సు లీనమై, అంతర్యామి యందు మనస్సు లగ్నమైతే అది భక్తి అవుతుంది. అది ఇంట్లో వాళ్ళని చూసినా, స్నేహితులను చూసినా, సృష్టిలో సమస్త రూపములు వేటిని చూసినా, ఆ చూస్తున్న దాంట్లోంచి అంతర్యామిలోకి ప్రవేశించవచ్చు. మామిడిచెట్టు కదా అని అనిపించవచ్చు. మామిడిచెట్టు లోంచి మామిడిచెట్టు అనే

రూపంలో వున్న అంతర్యామిలోకి ప్రవేశము. యోగమిత్రుడు అనే భావనలో నుండి అంతర్యామిలోకి ప్రవేశము. ఇట్లా అంతర్యామిలోకి ప్రవేశం చేయడానికి మనస్సు చేసే ప్రయత్నంలో అందం ద్వారా చేసే దాంట్లో చాలా త్వరితగతిని, సులభగతిని అప్రయత్నంగా అందులోకి మనస్సు హరింపబడుతుంది. అలా హరింపబడడం వలన అంతరంగమున ఆ రూపంతో రమిస్తూంటారు. అదీ గోపికలు రాత్రులు 'ఆత్మారాములై భగవంతునితో రమించారు' అంటారు. ఏమిటి రమించడం తమ లోపలున్న వెలుగుకి ఏర్పరచుకున రూపం, ఆ రూపం చుట్టూ వారు ఏదో నృత్యం చేస్తున్నట్లో, ఆయన పాదాలు దగ్గర పడి వున్నట్లు, ఆయన చేతులు పట్టుకున్నట్లు, ఆయన పాదాల మీద చేతులు పెట్టుకున్నట్లు, ఆయన ఒంటిమీద వాలిపోయినట్లో-- భావాలు. రకరకాల బొమ్మలు, కవులు ఊహించి ఇచ్చినవన్నీ ఈ భావాల్లోంచి వచ్చినవే. లోపల రమిస్తూంటే, బయట ఇంక వెంపర్లాడనక్కరలేదు. ఇక అందానికి బయట చూసేదేమీ ఉండదు. రూపంలో అందమునుండి, రూపాతీతమైన అందంలోకి ప్రవేశించడం జరగడం చేత మనిషికి స్థూలమైన విషయాల మీద ఆసక్తి తగ్గి, సూక్ష్మమైన విషయాల మీద ఆసక్తి పెరుగుతుంది. స్థూలములో వుండే సూక్ష్మప్రజ్ఞను దర్శనం చేయడం, దాని అందాన్ని చూడడం. సూక్ష్మప్రజ్ఞ యొక్క అందం, స్థూలమైన రూపు అందం కన్నా చాలా ఎక్కువ కాంతిగా వుంటుంది. మీరొక దీపాన్ని చూసి, ఇలాగే ఒక కాగితం మీద ఆ జ్వాలను చిత్రీకరించారనుకో. కాగితం మీద మీరు చిత్రీకరించిన జ్వాలకు, మీరు చూసిన జ్వాలకు వెలుగు విషయంలో ఎంత తేడా వున్నది? మీరు ఎంత బాగా చిత్రీకరించినా ఆ వెలుగు కాగితం మీద అంత బాగా రాదు. ఎందుకు అంటే అది కాగితం. ఇంకొక బండ కాగితం మీద గీశారనుకోండి, ఇంకా తగ్గి పోతుంది. పదార్థం సూక్ష్మం అయ్యే కొద్దీ వెలుగు ఎక్కువవుతుంది కనుకే ఈ అందం యొక్క ఆరాధనలో సూక్ష్మత్వంలోకి ప్రవేశించడం చేత, మనిషి క్రమశః తనలో తాను సూక్ష్మశరీరంతో ఎలా ఉన్నాడో దర్శనం చేసేంత వరకు దారితీస్తుంది. ఈ లోపల ఈ సాధనలో కలిగే ఆనందం మాత్రం చాలా ఎక్కువగా వుంటుంది. వంద రకాలుగా ఆనందిస్తారు. భగవంతుడ్ని లోపల అలా దర్శించే వాడికి బయట విషయాల మీద అంత మోజు ఉండదు. కర్తవ్యం మేరకు పని చేస్తూంటాడు. వారినే మనకు భాగవతంలో ఇచ్చారు. వారలా అంతర్ముఖులై రమిస్తూంటారు. వివిధములుగా ఊహించుకుని ఆనందపడుతూంటారు. ఆయనతో మాట్లాడుతూంటారు లోపల. త్యాగయ్య, అన్నమయ్య ఇలా భక్తులందరూ మాట్లాడుకుంటుంటారు, లోపల వుండే భగవంతునితో. వాడే చెలికాడు, తోడూ నీడా, అన్నీ వాడితో చెప్పకోవడం, వాడితో మాట్లాడడం, వాడు మాట్లాడితే వినడం అంతవరకూ వెళ్తుంది. ఇందులో భాగంగా వాడు, వాడి పాదాలవద్ద మనం సూక్ష్మంగా కనిపిస్తే, మనం ఎప్పుడయితే వాడి పాదాల దగ్గర సూక్ష్మంగా కనిపించామో, అది మనలో సూక్ష్మశరీరం నిర్మాణం అయిందనడానికి తార్కాణం. అందుకే యోగపరంగా చేసే ఒక సాధన కన్నా, ఈ సాధన ఎక్కువ రసవత్తరంగా వుంటుంది. దీనిని 'శుక్రవిద్య' అంటారు. శుక్రుడు అనుభూతి పరమైన సాధన ఇస్తాడు. అందుకని అందం యొక్క ఆరాధన భగవత్పరంగా చేయాలి. రావణుడు సీతాదేవి అందాన్ని చూసి ఒక రకంగా

భావించాడు. రావణుని అందం రాముడు చూచి ఎలా భావించాడు? చాలా అద్భుతమైన భావం చేస్తాడు. ఓహో ఎంత తేజస్సు, ఎంత వర్చస్సు, ఎంతభగవత్ అస్తిత్వము కలిగియుండి, అహంకారముచే దమింపబడి వున్నాడని చూస్తాడు. రావణబ్రహ్మ కదా! కేవలం ఆ ఒక్క అహంకారమూ లేకపోతే ఎంత అద్భుతమైనవాడు అని అనిపించేటంత దర్శనం రాముడు చేశాడంటే, రాముడు చూసిన అందం ఏమిటి? అలా సమస్తమునందూ సత్పురుషులు భగవంతుని యొక్క అస్తిత్వమునే అందంగా  చూస్తారు. అలా చూసే తత్త్వం కలిగిన వారు ఆనందంగా ఉంటారు. కవులు, చిత్రకారులూ అలా అంతరంగము నందు రమించడానికి కారణం ఇదే. ఈ విధంగా ఆనందిస్తూంటారు కాబట్టి, ఆ ఆనందాన్నిచ్చేది ఆయన కాబట్టి 'నందీ' అన్నారు.

## 642 నందిః

అంటే ఆనందానికి పూర్ణ స్వరూపం అని అర్ధం. నందుడన్నా అదే. ఆనందమును కలిగి యున్నవాడు నంది, నందుడు, ఆనందుడు. ఆనందలోకాలకు సంబంధించిన జీవులందరినీ నందులని పిలుస్తారు. నందీశ్వరుడికి ఆ పేరు రావడానికి కూడా శివుడ్ని దర్శిస్తూ ఆయన పొందినట్టి పరిపూర్ణమైన ఆనందము వల్ల ఆ పేరు వచ్చింది. నంది అంటే శివుడి వాహనం అని మనం అనుకుంటాం. నందిగా వున్న ప్రతి ఒక్కడూ శివుని వాహనమే. అంటే శివము ఎక్కడ వుంటుందయ్యా అంటే ఆనందమున్న చోట వుంటుంది. శివుడ్నే ఆరాధన చేసుకుంటూ, శివుడ్నే దర్శిస్తూ, శివుడు తప్ప మరేదీ లేని స్థితిలో యుండే వానికి యుండేది ఆనందం. అదే నంది! కన్నుల ఆరాధన ద్వారా, అంగముల ఆరాధన ద్వారా వంద రకముల ఆనందం పొందుతూ, మనం ఆనంద స్థితిలోనికి చేరడం అనేది జరుగుతుంది. ఆనంద స్థితిలో మనకు లభించేది వెలుగు దర్శనం.

## 643 జ్యోతిః

ఆనంద స్థితిలో దివ్యమైన దర్శనము జ్యోతిస్వరూపుడు. విష్ణువు యొక్క స్వరూపాన్ని బాగా ఆనందంతో ఆరాధన చేస్తూంటే, ఆ రూపం మరుగై వెలుగు ఎక్కువ అవుతుంది. రూపం మరుగై వెలుగు ఎక్కువవడం అనేది తలకిందులుగా చెప్పడం. వెలుగు ఎక్కువై, రూపం మరుగవడం అనేది అసలు సరిగా చెప్పడం. ఇక్కడ బాగా వెలుగు పెరిగిందనుకోండి, అక్కడ కృష్ణ విగ్రహం కనిపించదు. అలా మనకి గుణములతో, రూపముతో కూడిన దైవాన్ని సగుణముగా ప్రార్థన చేసుకుంటున్నప్పటికీ, ఆ చేసే ఆరాధనలో మనం పెంచుకునే కాంతులుంటాయే, ఆ కాంతులు బాగా పెరిగి పెరిగీ, కాంతులు ఎక్కువై, రూపం మరుగున పడుతుంది. అప్పుడు రూపాతీత తత్త్వం అక్కడ మనకి దర్శనం ఇస్తుంది. ఇలా ఈ సాధన చాలా అద్భుతంగా జరగడానికి మొదటి మెట్టు ఏందయ్యా అంటే, ఏదో ఒక అంగాన్ని పట్టుకుని, గట్టిగా మనస్సు దానిమీద లగ్నం చేయాలి. పద్మముల వంటి పాదముల మీద లగ్నం చేయవచ్చు. పాదములు పూజ చేసుకుంటూ, చూస్తూ, ఎంత కోమలంగా ఉన్నాయి, పచ్చగా ఉన్నాయి, గోళ్ళు నిగనిగలాడుతూ గులాబీ రంగులో ఎంత అందంగా ఉన్నాయీ అనుకుంటూ, మనం ఆ పాదాలు ఒకసారి ముట్టుకున్నట్లూ, ఆ పాదాలు చల్లగా వున్నట్లూ, ఆ తర్వాత ఆ పాదాలను కడిగినట్లు, పసుపు రాసినట్లు, పారాణి పెట్టినట్లూ--- ఇలా మీ ఓపిక. మీరెన్ని విధాలు కావాలంటే అన్ని విధాలా చేసుకోవచ్చు. కనులు మూసుకుని మీ హృదయంలో. అట్లా పాదాలనే దర్శనం చేస్తే అక్కడ నుండే గోచరించే అవకాశంయున్నది. ఎక్కడో అక్కడ, ఏదో ఒక అంగం చాలు. చక్రం, గద, భుజాలు, వక్షస్థలం, ముఖం, మొత్తం భావన చేయవచ్చు. మొత్తాన్నిఅంతా ఒక్కసారి పొందలేరు. ముందు ఒక్కొక్క అంగాన్ని స్థిరపరచుకుంటూ వెళ్ళాలి. అది పై నుండి క్రిందకన్నా రావచ్చు, లేదా క్రింద నుండి పైకన్నా రావచ్చు. దాసభక్తి కల్గినవారు కింద నుండి పైకి చూస్తారు గానీ పై నుండి కిందకి చూడరు. కొంతమంది వీరభక్తి వున్నవాళ్ళు ముందు పైనుండి కిందకి చూస్తారు. అంటే వీళ్ళ భక్తి దాసభక్తి కాక ప్రేమభక్తిగా వుంటుంది. వారు ముఖం నుండి కిందకి చూసుకుంటూ వెళ్తారు. వీడు ముఖాన్నుండి చూశాడు వీడికి గర్వం, వీడు కాళ్ళ నుండి చూశాడు వీడికి వినయం అని భగవంతుని దృష్టిలో ఉండదు. ఎట్లా అయినా మనల్ని చూశాడుగా అనుకుంటాడుట. ఎందుకంటే జీవుడు తనవైపు ఉన్ముఖమయ్యే వరకు భగవంతుడు ఆరాటం చెందుతాడట. తననుండి విడివడి వెళ్ళినవాడు కదా! మళ్ళీ తన వద్దకు రావాలని. కనుక ఇలా భావన చేసుకుంటూంటే లోపల ముందు అందం పెరిగుతుంది, అందం పెరగడం వల్ల ఆనందం పెరిగి, ఆనందం వందరెట్లు పెరిగి, చివరకు 'నంది' అయిపోతారు. పూర్ణమైన ఆనంద స్థితిలో మనకీ వెలుగు బాగా దర్శనం ఇస్తుంది. ఆ తర్వాత భగవంతుని యొక్క వివిధములైన గణములు లేక విభజనలు అన్నిటికీ ఈయనే ఈశ్వరుడు అని తెలుస్తుంది.

## 644 గణేశ్వరః

గణేశ్వరుడు అంటే వేరు వేరు భాగములుగా కనిపిస్తున్నవి అన్నీ కూడా ఒకే తత్త్వమునందు ఇమిడియున్నవి అని తెలియడం గణేశ్వరతత్త్వం. అందుకు గణపతి ప్రార్ధన అందుకు చేసుకోవాలి. గణములన్నిటికీ పతి, గణములన్నిటికీ ఈశ్వరుడు. గణములు అంటే విభజింపబడినవి. మొత్తం సృష్టి అంతా కూడా ఇన్ని లోకాలుగా, ఇన్ని గోళాలుగా, ఇన్ని జీవులుగా, ఇంతమందిగా విభజింపబడ్డా ఇన్నింటిలోనూ ఒకడే నిండి యున్నాడు. ఇవన్నీ వాడి గణములుగా, అంగములుగా నిండి యున్నవి. మనకు మన శరీరం చూసుకుంటేనే బోలెడు కనిపిస్తాయి. రెండు చెవులు కనిపిస్తాయి. ఒక చెవికీ, ఇంకో చెవికీ సంబంధమే యుండదు. రెండు కన్నులు, ఒక ముక్కు, నోరు కనిపిస్తుంది. లోపల కూడా ఏ అవయవములు ఆ అవయవములుగా ఉన్నాయి. కాలేయము కాలేయము వలె యున్నది. ప్రేవులు ప్రేవుల వలె, ఊపిరితిత్తులు ఊపిరితిత్తుల వలె, గుండె కాయ గుండె కాయ వలె యున్నాయి. జఠరాశయం జఠరాశయం వలే, మూత్రనాళం మూత్రనాళంగా, పురీషనాళం పురీషనాళంగా వుంది. కాళ్ళు వేటికవేగావున్నాయి. ఇవన్నీ ఒకడు వుండడం చేత కలసి పనిచేస్తున్నాయి. ఆ ఒక్కడూ అక్కడ లేకపోతే వేటికవి అయిపోతాయి. వేటికవి అయిపోతాయి తప్ప చచ్చిపోవు, 'చచ్చిపోయాయి' అని మనం అంటాం తప్ప, ఒక్కొక్కఅంగము కొంతకాలం బ్రతికే వుంటాయి. అందువల్లనే చచ్చిన వాడి కన్నుతీసి ఇంకొకడికి పెట్టడం, మూత్రపిండాలు, గుండె తీసి ఇంకొకరికి పెట్టడానికి ఎట్లా వీలు పడుతుంది? కలసి ఒకే తత్త్వముతో పనిచేసినట్టివి, ఆ తత్త్వం అక్కడ నుండి వెళ్ళిపోగానే వేటికవి అయిపోతాయి. ఒకదానికొకటి అనుసంధానం వుండదు. అందుకే అసలు మన శరీరం లోనే పెద్ద group living జరుగుతోంది. సామూహిక సహజీవనం. అసలు నువ్వే ఒక పెద్ద group, ఒక బృందం, ఒక పెద్ద బృందావనం. నీ బృందావనం అంతా చక్కగా పనిచేయడానికి కారణం లోపల నున్న భగవత్తత్త్వమే. అందుకని ఇన్ని గణములుగా వున్న ఇంద్రియములున్నాయి, పంచభూతములున్నాయి. పంచభూతములకూ, ఇంద్రియములకూ ఏమిటి సంబంధం? ఈయనుండడం వలన సంబంధం. పంచ ఇంద్రియములకూ, పంచతన్మాత్రలకూ ఏమిటి సంబంధం? ఈయనుండడం వలన సంబంధం. అదే మనకు ప్రచేతసుడి కథగా ఇచ్చారు. ఇంద్రియములు భాగములుగా, అంగములుగా ఉన్నాయి. బయట రుచికరమైన పదార్ధములున్నాయి. కానీ అతడిలో తన్మాత్ర లేదు. కాబట్టి అతడికి రుచి చూద్దామన్న భావన లేదు. అవి అట్లా ఉన్నాయి బయట. ఆ మామిడి కాయ అట్లా వుంటుంది, మన నాలుక అలాగే ఉండిపోతుంది. దానికీ దీనికీ ఏమీ సంబంధం వుండదు. ప్రకటింపబడ్డ చేతస్సుగా భగవంతుడు మరికొంత దిగిరావడం వలన ఈ నాలుకకు రుచి. ఆ మామిడికాయ, దానికది పులుపు కాదు. మన నాలుక మనకి పులుపు కాదు. ఆ మామిడికాయ మామిడికాయకి పులుపు కాదు, మనకి మనం పులుపు కాదు, కానీ ఆ మామిడికాయ ముక్క మన నాలుక మీద పడితే, పులుపుగా భగవంతుడు ప్రకటింపబడతాడు. అదీ 'ప్రచేతసుడు.'

ఇప్పుడు glass లో చల్లటి  నీరు పోశారు, చల్ల నీళ్ళు దానికది చల్లదనం కాదు, మన చేతికి చల్లదనం లేదు, దాన్ని  ముట్టుకోవడం వల్ల  చల్లదనం  అక్కడ ప్రకటింపబడుతుంది. ఇలాగే అన్ని అవయవాలలో కూడా అనుభూతి ప్రకటింపబడడం 'ప్రచేతసుల కథ' గా భాగవతంలో ఇచ్చారు. ప్రకటింపబడిన చేతస్సులు. Secret doctrine లో వున్న విషయాలు మనకు సరిగ్గా అవగాహన కావడానికి మాస్టారు భాగవతంలో ప్రచేతసుల కథగా తెలుగులో వ్రాసి ఇచ్చారు. చదువుకోండి. ఆవిధంగా ఆయన వుండడం వలన ఐదు ఇంద్రియముల మధ్య ఒక పొందిక వున్నది. ఎక్కడో ఏదో వాలితే, చర్మం చెప్తే, కన్ను చూస్తే, చేయి గోకుతుంది. మరి ఇంత group cooperation మన body లో కనిపిస్తోంది. ఏదన్నా తింటే పళ్ళ మధ్య ఇరుక్కుంటే, వెంటనే మనకు పళ్ళ మధ్య వుండే  స్పర్శ తెలుపుతుంది. తెలిపితే చేత్తో బయటకు తీస్తాం. శరీరం గురించి ఇలాగే  బోలెడు చేస్తుంటాం, చక్కటి సహకారం మనకి కనిపిస్తుంటుంది. ఇవన్నీ కలసి పనిచేయడం ఆయనుండడం చేతే! అదీ గణములు, గణములుగా వున్న శరీరములో ఒకదానికొకటి ఈవిధంగా అనుసంధానం కలిగి యుండడం, ఆయన ఈశ్వరుడుగా వుండడం వలన జరుగుతున్నది. ఇదే భావన మీరు కొంచెం భూతద్దం వేసికుంటే, ఒక సూర్యమండలం అవుతుంది. ఒక సూర్యుడూ, ఇన్ని గోళములూ ఇవన్నీ వేటికవి వేరుగా వున్నట్లు కన్పిస్తూంటాయి. మనలో అన్నీ వేటికవి వేరుగా ఉన్నా, అన్నిటి మధ్య ఒక సూత్రం కలసి పనిచేసేది ఏ విధంగా పనిచేస్తోందో, అట్లాగే ఈ సూర్యమండలంలో వుండే  గ్రహాలన్నింటి యందూ ఒకే సూత్రం పనిచేస్తూంటుంది. సూర్యునికి, సమస్త మండలములలో వున్న గోళములలోని కార్యములన్నీ కూడా, మనకి మన ఒంట్లో ఏం జరుగుతున్నా ఎలా తెలుస్తుందో అలా తెలుస్తుంది. అదీ గణేశ్వరతత్త్వం. ఐదుగురు సూర్యులు ఒక గుంపు, ఇంకొక ఏడుగురు సూర్యులు ఒక గుంపు. మొత్తం పన్నెండు మంది సూర్యమండలాలు ఒక గుంపు. ఆ గుంపుకంతా కూడా కేంద్రంలో యున్న వాడికి తెలుస్తూంటుంది. అట్లా సమస్తమూ మండలాత్మకంగా ఏర్పడిన సృష్టిలో అన్ని చోట్లా ఎక్కడ ఏమి జరుగుతున్నా అక్కడ తెలుస్తూంటుంది. అదీ గణేశ్వరతత్త్వం. గణేశ్వరతత్త్వం వచ్చిందంటే గణపతిగా చెప్పకోవడం కాదు. ఏ విధంగా గణేశ్వరుడు భగవంతుడూ అంటే ఈవిధంగా వేరు వేరుగా విభజింపబడియున్నట్లుగా గోచరించే సమస్తము నందూ తానే వ్యాపించి వున్నాడని మనకు తెలిపే నామం ఈ 'గణేశ్వర' నామం. అదెలా తెలుస్తుందయ్యా అంటే  మనలో జ్యోతిర్దర్శనం జరిగాక తెలుస్తుంది. అలా తెలుసుకునే మనకు ఋషులు సమస్తమైన గ్రంధాలనీ ఇచ్చారు. ఋషి దృష్టి. కుజ గ్రహంలో ఏముందో అట్లా చూడడానికి ఓ rocket వేసుకుని వెళ్ళే అవసరం లేకుండానే వారు చూడగలిగారు. చంద్రుని మీద జీవం లేదన్నారు. ఇప్పుడు వుందంటున్నారు. ముందు లేదంటారు. మనకి కనబడకపోతే లేదంటాము, మనకి కనబడగానే వుందంటాము. చంద్రుడి మీద నీళ్ళున్నాయి పదండి వ్యవసాయం చేసుకుందాం అని అప్పుడే Japan వాడు కొన్ని  విత్తనాలు పట్టుకుపోయాడట, ఈ మధ్య నెల రోజుల క్రితమే. అసలే Japan వాడికి బొత్తిగా భూమి తక్కువ. వాడికి ఆరాటం ఎక్కువ. మనిషికున్న ఆరాటం, చీమకున్న శరీరం వుందనుకోండి  ఏం సరిపోతుంది? అదీ Japan వాడి

పరిస్థితి. అలాగే కుజుడి లోనూ వున్నారని తెలుసుకుంటారు. 'ఏం సందేహం లేదు, అన్నిచోట్లా వున్నారు అబ్బాయ్, కానీ నీకుండే ఈ మానవ యంత్రంతో దాన్ని నువ్వు దర్శించలేవు. అక్కడున్న పంచభూతాలకు సంబంధించిన జీవశరీరాలు అక్కడుంటాయని', పెద్దలు చెప్పారు. సూక్ష్మ శరీరము పొందినవారు శుక్రగ్రహం మీద దివ్యమైన, అతి సుందరమైన రూపాలు దర్శించవచ్చు. దేవతాదర్శనం బాగా అట్లాంటి చోట్ల జరగాలంటే, మనలో సూక్ష్మ శరీర నిర్మాణం అయితే, చోటులో తిరిగే దేవతలంతా మనకు గోచరిస్తూంటారు. Madam Blavatsky కి అలా గోచరించేవారు మహాత్ములూ, దేవతలూనూ. కానీ మనం గణేశ్వరత్వంలోకి ఎప్పుడు ప్రవేశిస్తామంటే ముందు ఈ జ్యోతిర్దర్శనం అయ్యి, మనమే ఆ జ్యోతి అని తెలిశాక వచ్చేది 'గణేశ్వరః'.

# 645 విజితాత్మా:

తనను తాను తెలుసుకోవడం జ్యోతిర్దర్శనం. తాను వెలుగని, మొత్తం వెలుగులో తానొక భాగమని, ఆ వెలుగే తనయందు తనవలె వెలుగుతోందని తెలుస్తుంది. మొత్తం సముద్రంలోని నీళ్ళు, ఓ glass లో పోస్తే, glass లో కూడా ఆ నీళ్ళే glass రూపంలో కనిపిస్తాయి. మొత్తం చోటులో మనం ఓ చెంబు పెడితే, ఆ చెంబులో వుండే చోటు, మొత్తం చోటులో, చెంబులో వుండే చోటు చెంబు ఆకారంలో అక్కడ వుంటుంది. అలాగే మొత్తం చైతన్యం మనలో మన రూపంగా వున్నది అని తెలుస్తుంది. ఇలా తెలిసినపుడు తాను, ఈ మొత్తము లోని వాడని, మొత్తానికీ, తనకీ వేర్పాటు లేదు. అవినాభావ సంబంధమే వున్నది. 'అతడే తానుగా ఉన్నాడు' అని తెలిసినపుడు ఆత్మవంతుడవడం చేత సమస్తమునూ అధిష్టించి వుండే స్థితి లోకి వస్తాడు. ఏమిటా సమస్తమునూ? బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, శరీరము ఇవన్నీ తన అధీనం లోకి వస్తాయి. వాడూ 'విజితాత్ముడు'. జయించిన ఆత్మతత్త్వం కలవాడు. ఆత్మచే సమస్తమునూ జయించిన స్థితిలో వున్నవాడు. అంటే ఆ శరీరాన్ని, మనస్సు చేత చక్కగా పని చేయించగలవాడు. సక్రమంగా ఇంద్రియముల చేత పనిచేయించగలడు. శరీరం చేత పని చేయించగలడు. అవి తనను బంధింపక తాను వాటిని నిర్దేశించే పద్ధతిలో ప్రవర్తింపచేయగలడు. మనస్సు, పంచేంద్రియములు, పంచభూతములు పదకొండు వున్నాయి. వీటి మీద స్వామిత్వం వస్తుంది. ఆకాశం మీద స్వామిత్వం అప్పుడు ఆకాశగమనం. వాయువు మీద స్వామిత్వం, అగ్ని మీద, జలము మీద, పృథ్వీ మీద స్వామిత్వం వస్తాయి. అలాగే శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములనే తన్మాత్రలున్నాయి కదా! వాటి మీదా స్వామిత్వము! అన్నిటికీ మించి భావము మీద స్వామిత్వము. తన నుండి దివ్య భావం వ్యక్తమైతే, దాని ఆధారంగా నిర్వర్తించడం తప్ప, ఇతర భావాలు తన మనస్సులో మెదిలే స్థితి దాటి ఉంటాడు. ఇలా మనస్సు, ఇంద్రియములు, పంచభూతాత్మకమైన శరీరము ఈ మూడూ మన అధీనం లోనే ఉన్నాయనుకోండి, అంటే పదకొండు గుర్రాల బండి మనం నడుపుతూంటే, పదకొండు గుర్రాలూ మనమెలా చెప్తే అలా వింటూ ఉన్నట్లు. వాడూ విజితాత్ముడు.

## 646 విధేయాత్మాః

భగవంతుడు ఇలా వున్నాడని మరోసారి మనం చెప్పకోనక్కరలేదు. వీటన్నిటినీ అధిష్టించి వున్న తత్త్వమే భగవత్తత్త్వం. 'జ్యోతి' వెలుగుగా, మొదటి తొడుగుగా అతడే కనిపిస్తున్నాడు. వెలుగు ఆయన యొక్క మొదటి తొడుగు. అంతకన్నా ఇంకా సూక్ష్మమైన తొడుగు శబ్దము. అందుకని నాదము మొదటి తొడుగు, వెలుగు రెండవ తొడుగు అని చెప్తారు. ఇహ అక్కడ నుండి మిగిలిన తొడుగులు వెలుగు యొక్క కాంతి. దీపం ఉంది, దానికి కాంతి ఒకటి వున్నది. అక్కడ నుండి మనస్సు, ఇంద్రియములు, పంచభూతములు ఇలా అన్నీ స్థూల లోకాలలోకి అవరోహణ క్రమంలో ఏర్పడుతుంటే, వీటన్నిటినీ ఆయన అధిష్టించి యుండి, స్వామిత్వం వహించి, వాటిని నియమించి, వాటిని జయించి వుంటాడు. తననుండి వ్యక్తమైన దానియందు తనకు ఈశ్వరత్వం వుంటుంది. మననుండి వ్యక్తమైన దానియందు మనకా విధంగా ఈశ్వరత్వం వుంటే మనం కూడా భక్తి యోగమున దైవంతో వున్నట్లు. మనలో వున్న వాటి ద్వారా మనం బంధింపబడితే బంధజీవుడుగా యున్నట్లు. 'విజితాత్మా' అనడానికి వీలులేదు 'బంధితాత్మా'అంటారు. మనకొక ఆలోచన వస్తే పీడించదూ పట్టుకునీ. చాల్లే ఇహ వదలవే అన్నా ఆలోచన వదలదు. ఒక ఆలోచన వచ్చిందీ, పోవాలంటే పోదు. ఇంకో ఆలోచన తెచ్చుకుంటే ఇది పోతుంది. వున్నది వదలదు. అలా మనల్ని పీడించేవిగా వుంటాయి, మన ఆలోచనలు మన కోరికలు, మన శరీరమూను. శరీరం కూడా చాలా పీడిస్తూంటుంది. వాడికి శరీరం, ఇంద్రియముల, మనస్సు యొక్క పీడ వుండదు. అన్నీ తను నిర్దేశించినట్లుగా పనిచేస్తూంటాయి. తాను యజమానిగా, అవి పనివాళ్ళుగా వుంటాయి. తను నియమించిన పని, తను నిర్దేశించిన పని అవి చేస్తూంటాయి. అవి నిర్దేశించినట్లు తాను తిరగక, తను నిర్దేశించినట్లు అవి తిరుగుతాయి. పనివాడ్ని యజమాని నిర్దేశించాలా, పనివాడు యజమానిని నిర్దేశిస్తాడా? మనకు పనివాడే సలహా ఇస్తాడు అలాక్కాదు ఇలా తిను అని. నాలుక 'ఇంకొంచెం తిను, ఫర్వాలేదు.' అంటుంది. తినేస్తాం, ఆ తర్వాత మధ్యాహ్నం అంతా బరువుగా వుందంటాం. అప్పడు నాలుక నవ్వుతుంది. చూశావా మరి, నేను చెప్పినట్లు చేస్తే నీకెలా అయ్యిందో అని. ఇంకోసారి ఇలా బరువయ్యేట్లు తినకూడదూ అనుకుంటూ, మళ్ళీ తిన్న సందర్భాలు లేవా? అలా ఇంద్రియాలతో ఎన్ని చేశామో! చూడకూడదనుకున్నవి చూడ్డం, మాట్లాడకూడదన్నవి మాట్లాడడం, వినకూడదన్నవి వినడం, ముట్టుకోకూడదన్నవి ముట్టుకోవడం, తినగూడదు అనుకున్నవి తినడం. ఇలా 5 రకాలుగానూ చేస్తూంటాం. ముక్కు కూడా అనవసర విషయాల్లో దూరుస్తూంటాం. 'Don't poke your nose into other's affairs' అని చెప్తాం కానీ ఇంకొకళ్ళ విషయాల యందు మనకు ఎంతాసక్తో, భగవంతుని విషయాల కన్నా కూడా. కొంత చెప్పి, అయినా ఎందుకు లెండి ఆ విషయం అందనుకోండి ఇంటావిడ, అలాక్కాదూ పూర్తిగా చెప్ప అంటాడు. ఆవిడకీ తెలుసు పూర్తిగా చెప్పేస్తే తిడతారు, ఎందుకు వాళ్ళ విషయాలూ, వీళ్ళ విషయాలు

చెప్పావని, సగం చెప్పి ఆపుతుంది. అప్పుడు ఏమౌతుందంటే అడిగి చెప్పించుకున్నాడు కాబట్టి, తర్వాత తననడానికి వీలు ఏమీ వుండదు. ఇట్లా మనల్ని ఏడిపిస్తూంటుంది. ఇదంతా ఈ మూడే. మనస్సు, ఇంద్రియములు, శరీరము. వీటిని జయించిన వాడు ఎలా జయించాడూ, వాడి మనస్సు హరింపబడీ, ఆనందంలో మునిగితేల్తూ నెమ్మదిగా జ్యోతిర్దర్శనం చేసుకున్నాడు. చేసుకోవడం చేత విజితాత్ముడయ్యాడు, విధేయాత్ముడయ్యాడు. అంటే సమస్తమూ తనకు విధేయముగా వుంటుంది. ప్రకృతి విధేయత చూపిస్తుంది. మంచి ఎండలో వాడు బయట నడచి వెళ్తుంటే ఓ 5,10 నిమిషములలో ఎక్కడ నుండో నల్లటి మేఘం ఒకటి వచ్చిపైన గొడుగు వలె ఏర్పడుతుంది. అలాగే బయటకు వెళ్ళడానికి వాహనం లేదూ, అయినా వెళ్తాం ఎవరో వచ్చి car లో తీసుకుని వెళ్తారు. మామూలుగా మనకి ఎలావుంటుందంటే వున్నవి పనిచేయవు. వాడికి లేకపోయినా ఒకటి వచ్చి పట్టుకుపోతూంటుంది. రాముడికి అలాగే జరిగింది. రాముడు వరకూ అక్కరలేదు మనకు జీవితంలో అట్లా జరిగిన మహానుభావులు చాలా మంది వున్నారు. ఎందుకు జరుగుతుందీ అంటే కాస్తో కూస్తో ఆ విధమైన స్వామిత్వం వున్న చోట జరుగుతుంది. ఆకాశం యొక్క సహకారం, అగ్ని యొక్క, వాయువు యొక్క, జలము యొక్క సహకారం వుంటుంది. జలం మొత్తం అంతా ముంచేస్తున్నా, నీ ఇల్లు, నీ పేట ముంచని స్థితి వుంటుంది. గురునానక్, కొండ మీద నుండి ఓ పెద్ద బండరాయి దొర్లుకుంటూ మీద పడుతూంటే, క్రిందన ఉపన్యాసం చెప్తున్నాడు. ఆయనక్కడే కూర్చుంటాడు ఏం కాదని. అందరూ ఓ ఓ అని అరుస్తుంటే, దాని ప్రక్క అలా చేయి పెట్టాడుట, అదలా ఆగిపోయింది. అంటే పదార్థం మీద స్వామిత్వం అన్నమాట. మనం ఇట్లా చేయి పెడితే, ఆ రాయి చేయి మీద పడి, ముఖం మీద పడి fracture అయిపోతుంది. పంచభూతాత్మకమైన సమస్త సృష్టి విధేయతని కలిగియుంటుంది. అదే రాముడి, కృష్ణుడి జీవితాలలో కనిపిస్తుంది. భగవంతుని విషయంలో ఈ నామాలు పూర్ణ సత్యం. భక్తుల జీవితాలలో కూడా ఈ నామాలు సత్యం. భగవంతుని చూడాలంటే భక్తుల రూపంలో చూడడమే! వైభవంగా కనిపిస్తాడు. మిణుకు మిణుకు మంటూ అప్పుడప్పుడు కనిపించి వెళ్ళేవాడేం ఉపయోగం? ఎప్పుడూ కనిపించేవాడు ఓ భక్తుడి రూపంలో వుంటాడు. అతడు నడిచి వెళ్తుంటే భూమి పులకరిస్తుంది. వెళ్ళద్దు, వెళ్ళద్దని గోల పెడుతుందిట. రాముడు, కృష్ణుడు శరీరాలు వదిలినపుడు మనకంటే భూమి విపరీతంగా ఏడుస్తుంది. యుద్ధం లో పాశాల వల్ల అంతా భూమి మీద పడిపోయివుంటే, గరుత్మంతుడు తను అక్కడికి వచ్చేసరికి పాశాలన్నీ కూడా విడిపోతాయి. (రాముడికి గరుత్మంతుడు రెండు సార్లు వచ్చి సహాయం చేస్తాడు. నాగపాశం నుండి తప్పిస్తాడు). చూశాడు రాముడు, అద్భుతమైన వ్యక్తి ఎవరో వచ్చాడు వీళ్ళందరికి పాశ విమోచనం కలిగింది అని 'ఎంత ఉపకారం చేశావ్, నిన్ను చూస్తుంటే సన్నిహిత మిత్రుడని అనిపిస్తున్నది, చిరకాల మిత్రుడు కనిపించినట్లుంది, ఎవరు నువ్వు? నువ్వు నాకింత సాయం చేశావు' అని అడుగుతాడు. దానికి ఆయన 'నిజానికి నువ్వూ, నేనూ అనాదిగా స్నేహితులం. ప్రస్తుతం నీకు గుర్తు లేదు, నాకు గుర్తుంది. నేను నీకు బంటులాంటి వాడిని' అని చెప్తాడు. ఏమిటా సహాయం?

అలాగే ఇంద్రుడు సరాసరి స్వర్గం నుండి రాముడికి రథం పంపిస్తాడు, రావణునితో యుద్ధం చేయడానికి. అందరూ  దేవతలు ఇంద్రుణ్ణి కోప్పడుతారు, 'నీకు బుద్ధి లేదా, నీబోటి వాళ్ళందరినీ రక్షించడానికి కదా రావణునితో ఆయన యుద్ధం చేస్తున్నాడు. ఆయన నేల మీద నిలబడి యుద్ధం చేస్తున్నాడు, వాడేమో రథం మీద అడ్డగోలగా ఆకాశం మీదా, దాని మీదా దీని మీదా  పడి యుద్ధం చేస్తున్నాడు, ఆయనకి మన సహాయం అవసరం  లేకపోవచ్చు. కానీ మన వంతు సహకారం మనం అందించాలి', అని  చెప్తారు. అంటే అప్పుడు ఆయనకి వెలిగి, రథం పంపిస్తాడు. అప్పుడు ఆ  రథంలో కూర్చొని  యుద్ధం చేస్తాడు. అదీ ప్రకృతి యొక్క విధేయత! కృష్ణుడికి సమస్త ప్రకృతి ఎంత విధేయంగా వుంటుంది? సూర్యాస్తమయం అయిపోయిందని కదా అంతమందీ నమ్మారు. అర్జునుడే నమ్మాడు. సూర్యాస్తమయం అయిపోయిందనుకునే అగ్ని ప్రవేశం చేయడానికి  అంతా సంసిద్ధం చేసుకుంటాడు. ఏమిటి  ఆ సహకారం? సమస్తమూ ఆత్మకు విధేయమై యున్నది. అందుకనీ ఏదీ ఆయన అదుపు దాటి లేదు. అదుపాజ్ఞలలోనే యున్నది. అవతార పురుషులు దిగివచ్చినపుడు వారటువంటివి ప్రదర్శింపచేస్తారు. ఐదువేల మంది ఉపన్యాసం వింటున్నారు, కొండ మీద ఒకాయన కూర్చుని ఉపన్యాసం చెప్తుంటే! మంచి విషయాలు చెప్తుంటే అలా జనం బిల బిలా వచ్చేశారు. వింటున్నకొద్దీ  ఈయన చెప్పాడట. మధ్యాహ్నం అయిపోయిందట, చెప్పడం ఆపేశాడట. అప్పుడు వారికి ఆకలి తెలిసిందట. అంతవరకూ ఆకలి తెలియలేదు. కడుపు విపరీతంగా లోపల మండిపోయి, గోల పెట్టారు. ఇప్పుడు  ఏమీ చేయాలి మేము? ఇంతసేపు అయిపోయిందీ, మాకు తెలియలేదూ, ఇళ్ళల్లో వండుకుని కూడా రాలేదూ అనుకుని గొడవ పడుతుంటే అక్కడ 5 రొట్టె ముక్కలు, 2 చేపలూ వుంటే వాటిని multiply చేసి 5 వేల మందికీ భోజనం పెట్టాడుట ఒకాయన. ప్రకృతికి ఎంత విధేయత లేకపోతే, అలా చేయగలడు? సరస్సులో నావలో అంతా వెళ్తుంటే, అల్లకల్లోలం అయి నావ మునగబోతుంటే నడచి వచ్చి నీళ్ళమీద వాళ్ళని రక్షించి, ఆ తుఫాను తాకిడినంతా ఉపశమింప చేశాడట. ఎంత విధేయత వుంటే జరుగుతుందీ? అలా వుంటుంది విధేయాత్మా అంటే. దిగివచ్చిన అవతారములలోనే మనకు ఇవన్నీ గోచరిస్తున్నప్పుడు, అవతారం అంటే మొత్తం కాదుగా, మొత్తంలో నుండి దిగివస్తుందీ, మొత్తంగా కూడా వుంటుంది. మరి ఆ విధంగా నిర్వర్తిస్తాడు భగవంతుడు కాబట్టి, ఘటనా ఘటన సమర్థుడు. అందుకని మన భావనలో ఒకటి గుర్తు పెట్టుకోండి, మన కర్మలను భగవంతుడు దాటించలేడు, అని పెట్టుకుంటే, మన భావన చేత భగవంతుడికి దాటించే అవకాశం ఇవ్వని వాళ్ళం అవుతాం. అంటే నువ్వు భగవంతుని శక్తిని శంకించినవాడివి అవుతావు. భగవత్తత్త్వం ముందు కర్మ ఆగదు. సామాన్యంగా ఆయన సృష్టిలో కర్మ సిద్ధాంతాన్ని నిర్వర్తింపనిస్తాడు. అంతమాత్రం చేత, దానిని ఖండించి భక్తుణ్ణి రక్షించే సన్నివేశాలు లేకపోలేదు. వున్నాయి. అందుకని 'కర్మ బలమైందీ, దైవం ఏం చేస్తాడూ' అని అనుకున్నాం అనుకోండీ, నీకంతే. తన కర్మను సైతం భగవంతుడు నిర్మూలించి తనను ఉద్ధరించగలడు ఏ నిమిషమైనా. కనుక భగవంతుడే ఉపాయంగా పెట్టుకుని, భగవంతుడే శరణుగా జీవించడం మొదలుపెట్టిన వాడిని కర్మ అంటకపోవచ్చు. అదీ

'భృక్త రహితం'. 'ఆ ఏదో అన్నారండీ, అయ్యే పనా!' అంటారు. కర్మ సిద్ధాంతం బాగా నమ్మినవాడికి కర్మ సిద్ధాంతమే సత్యం అవుతుంది. ఎవడేది నమ్మితే అది వాడికి సత్యం అవుతుంది. కర్మ కన్నా దైవం బలమైనది. దైవం ఘటనా ఘటన సమర్ధత కలిగినది. దైవము తలుచుకుంటే కాలము, కర్మ లొంగవలసినదే అనే భావము నందు పరిపూర్ణముగా జీవించేవాడికి అది సత్యము అవుతుంది. పునర్జన్మ వున్నది అనుకున్న వాడికి పునర్జన్మ సత్యం. పునర్జన్మ లేదూ అనుకున్నవాడికి పునర్జన్మ లేకపోవడం సత్యం. ఇది కొంచెం ఆశ్చర్యం కలిగించినా, ఇది వుంది. నీ భావం చేత నీవేది గట్టిపరుచుకుంటావో అది నీకు సత్యమై నిలుస్తుంది. అందుకని సమస్తమూ, కాలముతో సహా భగవంతునికి విధేయత చూపుతుంది. ఇరువది నాలుగు తత్త్వములను కాలం నడుపుతోంది. కాలం ఇరువది ఐదవది. కాలాన్ని కూడా నియమించగల్గినవాడు ఆ పైన వున్న తత్త్వం. కాలమే కదా లక్ష్మణుడు, కాలమే కదా బలరాముడు. మరి వాళ్ళిద్దర్నీ నియమించలేదూ? కలియుగంలో కలికాలాన్ని తన భక్తుడైన పరీక్షిత్తు చేత నియమింపచేశాడు భగవంతుడు. కృష్ణుడు వెళ్ళిపోయాడు, మనకేం ఫర్వాలేదనుకున్నాడు కలి. కానీ పరీక్షిత్తు రూపంలో కృష్ణుడుండి, కలిని మూడు వందల సంవత్సరాలు జీవులని తాకకుండా శాసించాడు. అదెలా సాధ్యం? సాధ్యమే! అందరికీ అన్ని శక్తులూ ఇచ్చినవాడు కాబట్టి, ఇచ్చిన వాడు తన నుండి పుచ్చుకున్న వాడి కంటే ఎప్పుడూ గొప్పవాడే. కాలం ఎందులోంచి పుట్టిందీ? శక్తి ఎందులోంచి పుట్టిందీ? ప్రకృతి ఎందులోంచి పుట్టిందీ? ఈ మూడూ కదా మొదట పుట్టినవని చెప్పుకుంటూ వచ్చాం. భగవంతుని నుండి ముందు పుట్టినవి మూడు, ఒకేసారి పుట్టాయి. ప్రకృతి, శక్తి, కాలము. మొదటి త్రిభుజము. కాలానుగుణంగా ప్రకృతి, శక్తీ చక్కగా సృష్టంతా అల్లుకున్నాయి. కాబట్టి వీటన్నిటిని అధిష్టించియున్నది ఆత్మతత్త్వం. కాబట్టి ఆయనకు సమస్తమూ విధేయమై యుంటుంది. అందుకనీ ఆత్మచైతన్యము ఘటనా ఘటన సమర్ధత కలిగినది.

# 647 సత్కీర్తిః

భగవంతుని యొక్క కీర్తి సత్కీర్తి. ఆ కీర్తి సత్త్వమునకు సంబంధించిన కీర్తి. అందరి కీర్తి సత్కీర్తి కాదు. కొంతమంది కీర్తి వాళ్ళున్నప్పడే వుంటుంది. వాళ్ళు వెళ్ళిపోగానే వాళ్ళతోపాటు వెళ్ళిపోతుంది. ఒక ముఖ్యమంత్రి ఇదివరకున్నాడు. ఇప్పుడు లేడు. వున్నప్పుడు అంతా కీర్తే. ఓ ప్రధానమంత్రి ఇదివరకున్నాడు. ఇప్పుడు ప్రధానమంత్రిగా లేడు. కీర్తి ఉందా? కీర్తి వేరు, సత్కీర్తి వేరు. లౌకికమైన కీర్తి సత్కీర్తి కాదు. అందుకని మనకు డబ్బు వున్నప్పుడు కీర్తి, మనకు పదవి వున్నప్పుడు కీర్తి, మనకు అవి లేనప్పుడు అపకీర్తి. అలా వుండదు సత్కీర్తి. సత్కీర్తి అతడు లేకపోయిన కొద్ది కూడా అది ఇంకా పెంపొందుతూనే ఉంటుందట. మనిషి వెళ్ళిపోయిన తర్వాత అతని గురించి ఇంకా ఎక్కువగా చెప్పకుంటూ వుంటారట. ఎప్పుడో త్రేతా యుగంలో ఏదో చేసి వెళ్ళారు. ఇప్పటికి చెప్పకుంటున్నాము కదా! హనుమంతుడు, రాముడు, సీత, లక్ష్మణుడు, భరతుడు. అది సత్కీర్తి. అలాగే ఐదువేల సంవత్సరాల క్రితం చేసి వెళ్ళిన శ్రీకృష్ణుడు, రెండు వేల ఐదు వందల సంవత్సరాల క్రితం చేసి వెళ్ళిన బుద్ధుడు, రెండువేల సంవత్సరాల క్రితం చేసి వెళ్ళిన Christ. వాళ్ళకు, వాళ్ళున్నప్పుడు అంత కీర్తి యుండి యుండకపోవచ్చును. మహాత్ములు వున్నప్పటి కన్నా వాళ్ళు వెళ్ళిపోయిన తర్వాత వాళ్ళ కీర్తి పెరుగుతుందిట. ఎందుకనంటే వాళ్ళు వున్నప్పుడు సమకాలికులైన మనుషులు అంత బాగా గుర్తించలేరట. గుర్తించలేకపోయినందువల్ల తెలియక ఏవేవో మాటలు కూడా అంటూ ఉంటారట. మామూలుగా భగవద్భక్తులందరూ సంఘం చేత ఎద్దేవా చేయబడ్డవాళ్ళే. కీర్తింపబడ్డ వాళ్ళు కాదు. ఆయన వెళ్ళిపోయిన తర్వాత, అమ్మో అంతటివాడా? ఇంతటివాడా? మనం తెలుసుకోలేకపోయామే అని బాధపడ్తూ వుంటారు. అంతకంతకీ, అంతకంతకీ విశ్వవ్యాప్తంగా కీర్తి పెరుగుతూ వుంటుంది. సత్కీర్తికి, ఇతర కీర్తులకీ ఒక తేడా ఉంది. కాలమే సత్కీర్తిని పొందుపరచి, పెంచుతూ వుంటుంది. ఇతరమైన కీర్తుల గురించి వాడు వెళ్ళిపోయిన తర్వాత నెమ్మదిగా అందరూ మర్చిపోతారు. కాబట్టి భగవద్భక్తుని కీర్తి ఎప్పటికీ పెరుగుతూనే వుంటుంది. ఎందుకనీ? అతడు భగవంతుడు లేక సత్యము, దాని యొక్క అవతరణము, దాని యొక్క విభూతి, దాని గురించి చెప్పడం, దాని యందు జీవించడం, దాన్ని తన నుండి ప్రసారం చేయడం, ఇవన్నీ దానికి కైంకర్యంగా, దానికి సమర్పణగా జీవించి యుండటం చేత. ఏదో ఇవాళ్టికి మనం పని పూర్తి చేసేసుకొని రేపు paper లో వేయించేసుకున్నామనుకోండి. సాయంత్రానికి ఆ paper mixer పొట్లం వాడి దగ్గర వుంటుంది. ప్రొద్దుట చూస్తాం మన photo ని paper లో. సంతోషిస్తాం. రేపాదివారం సాయంత్రం ఈ class కి ఏం వెళ్తాంలే bore అని, beach కి వెళ్ళామనుకోండి. అక్కడ వాడు పొట్లం కట్టి ఇచ్చేవాడు mixer ఇస్తే, ఆ mixer తినగానే లోపల చూస్తే, మన మొహం నిండా ఆ mixer యొక్క కారం, నిమ్మరసం వుందనుకోండి--. అమ్మో ఇక్కడ పడ్డామా అనుకుంటాం. అక్కడి నుండి వెళ్తుంటే ఇంకొకడు వచ్చి, ఒరేయ్ అక్కడ ఎవరో తిని క్రింద పడేసినట్లుంది. అక్కడ ఆ పేపరు

మీద నీ photo ఉంది, అంటాడు. ఈ లోగా చూస్తూండగానే దానిమీద గేదె పేడ వేసిందనుకోండి. అయిపోయింది కదా! నిన్న చేసిన పనికి ఇవ్వాళ paper లో వేయించుకోవడంతో అయిపోయింది. రేపో? నువ్వు చెప్తే మిగతా వాళ్ళకి గుర్తుండాలి తప్ప ఎవ్వడూ గుర్తు పెట్టుకోడు. అందుకని ఈ కీర్తి కావాల్సిన వాడు ఏం చేస్తాడంటే, వాళ్ళే గుర్తు చేస్తూ ఉంటారు. అప్పుడిట్లా జరిగింది కదా! అప్పుడట్లా చేశాం కదా! ఇట్లా చేశాం కదా! అని చెప్పకుంటూ ఉండాలి. మర్చిపోయాడేమోనని, మొన్నామధ్య అన్నదానం చేశాం. అద్భుతంగా జరిగింది కదూ! అని వీడే చెప్తూంటాడు మళ్ళీ. ఆహా చేశావు కదా అన్నట్టు అంటాడు వాడు. అందుకని మామూలు కీర్తిని ఎప్పటికప్పుడు కాలం కడిగేస్తుంది. ఎందుకంటే దానికి ఫలితం అప్పుడే అనుభవించేశావు. సత్యమైన కీర్తి, కీర్తిని ఆశించకుండా సత్యం కోసం దానిమీద వుండే ఆరాటం చేత, తన నుండి అది వ్యక్తమై చేసుకుంటూ పోతూంటుంది. అది అట్లా పైకి వస్తూంటుంది. మహాత్ముల కీర్తి సత్కీర్తి. దుర్మార్గుల కీర్తి నిలవదు. కాలం ఉంచదు, ఉండనివ్వదు. చెరిపేస్తుంది. నీ అంతట నువ్వు శిలా విగ్రహం వేసుకున్నా, నీవు వెళ్ళిపోయిన తర్వాత ఆ విగ్రహం పడిపోతే, దాన్ని మళ్ళీ ఇంకొకటి పెట్టడు. పోతే పోయిందిలే వెధవ విగ్రహం అనుకుంటాడు. Lenin విగ్రహం అంతది తీసేశారు కదా! కొన్ని కొన్నివిగ్రహాలు పోతే మళ్ళీ పెట్టరు. కొన్ని విగ్రహాలు పోతే మళ్ళీ పెడతారు. అసలు ఇదివరకుండేదిట అని మళ్ళీ అక్కడ తీసుకెళ్ళి పెట్టడానికి ప్రయత్నాలు జరుగుతుంటాయి. ఎందుకనంటే అతడు దైవమునకు, సత్యమునకు అంకితమై జీవించినవాడు. అతడి కీర్తిని కాలమే పెంపొందిస్తూంటుంది. తన కీర్తిని తనే పెంపొందించుకునే వాడుంటాడే, వాడు వెళ్ళంగానే వాడి గురించి ఇంకెవరూ పెంపొందించే వాళ్ళుండరు. వాడే చేసుకుపోయాడు గదా! అందుకని సత్కీర్తిని కాలం పెంపొందిస్తుంది. ఇతర కీర్తులని కాలం తగ్గిస్తూ వుంటుంది. అందుకని కాలమే తెలుపుతుంది వీడు సత్యవంతుడా, కాదా అనేది. ఒకావిడ రోజూ మాగిన పళ్ళు అమ్ముకుని ఆ వచ్చే డబ్బుల్తో జీవించడం అనే ఒక కార్యక్రమం పెట్టుకుంది. ఆవిడ రోజూ కృష్ణుడింటికి వచ్చి కృష్ణుడి దగ్గర కూర్చొని, వున్న పళ్ళల్లో, దాదాపు సగం బుట్ట పళ్ళు ఏదో వంకన ఆయనకు అప్పచెప్పి, తను అక్కడ వుండగానే ఆయన ఒక పండన్నా తినేట్టుగా చూసి, మిగతా పళ్ళు కూడా ఆవిడకివ్వండి, ఈవిడకివ్వండి, వాళ్ళకివ్వండి, నాన్నగారికివ్వండి, అమ్మగారికివ్వండి అని అన్నీ ఇచ్చేసి డబ్బులాశించక వెళుతూ వుంటుంది. శ్రీకృష్ణుడు ఆవిడకి రోజూ అరగంట time ఇస్తాడట. ఆవిడేవో కబుర్లు చెప్తూ వుంటుంది. ఈయన వింటూ వుంటాడుట. కబుర్లు ఎక్కడైపోతాయోనని ఇంకా కబుర్లు పెంచుతాడుట. పెంచి పెంచి మాట్లాడుతూంటాడుట. అరగంట, నలభై నిముషాలు, యాభై నిముషాలు వుంటుంది ప్రొద్దున్నే. అవతల మహాభక్తులు కృష్ణుడి గురించి వేచియుండేవాళ్ళు బోలెడు మంది వుంటారు కదా! ఈయనకేమో పళ్ళబుట్ట, ఆవిడతో సంపర్కము. ఎట్లా వుంటుంది? బాగుండదు కదా! మనబోటి serious భక్తులకి అసలు బాగుండదు. కృష్ణుడికి అదే బాగుంటుంది. మిగతావి బాగుండవు. ఈ serious భక్తులను చూస్తే ఆయనకు చిరాకు, విసుగు. ఎందుకంటే వాళ్ళ దగ్గర చాలా disciplined గా మెలగాలి కృష్ణుడు. ఇక్కడ హాయిగా వుంటుంది

free గా వుంటుంది. కనుక రోజూ అరగంట గోల ఇది. ఇది మిగతా వాళ్ళందరికీ విసుగ్గా వుంటుంది. ఎందుకని? ఆవిడ రావడం, ఆ పండ్లబుట్ట దింపడం, ఏవో మాట్లాడుకోవడం. పెద్ద వేదాంతసూత్రాలేమీ వుండవు, బ్రహ్మ సూత్రాలు అంతకన్నా వుండవు. భగవద్గీత చెప్పాల్సిన అవసరమే యుండదు. ఏదో ఆవిడ ఇస్తూ వుంటుంది. ఆయన్ని చూస్తూ వుంటుంది. మాట్లాడుతూ వుంటుంది. వాళ్ళకంటుంది, వీళ్ళకంటుంది. నేనిట్లా పండించాను, అట్లా పండింది. ఈ పండింత బాగా పండింది. ఈ అన్నిటిలో ఇది చాలా మంచి పండు. ఇది నువ్వు తింటే బాగుంటుంది అంటే ఆహా ఓహో అంటూ ఏవో కబుర్లు చెప్తూ ఉంటాడు. ఆవిడకన్నా బాగా అందరికన్నా బాగా కబుర్లు చెప్పగలడు కృష్ణుడు. తింటూంటాడు. ఇది రోజూ ఒక programme. ఇది అలా అలా అలా అలా పాకి నారదుడి వరకూ వెళ్ళింది. నారదుడు ఒక రోజు వస్తే, ఆయన్ని కూడా ఆపేస్తారు. ఏమిటంటే, పండ్లావిడతో మాట్లాడుతున్నాడాయన. మరి నీకూ, నాకూ interview లేదు. ఇంటావిడకే interview లేదు ఆవిడొచ్చినపుడు, అని చెప్తారు. అని చెప్తే అదేంటని ఆశ్చర్యపడతాడు ముందు. ఎంత మహాభక్తురాలు కాకపోతే ఇంత time ఇస్తారు గురువుగారని ఓ doubt వస్తుంది. వెళ్ళి చూస్తాడు, చివరి క్షణంలో. చూస్తే చాలా మామూలుగా పళ్ళబుట్ట వ్యవహారం గానే కనిపిస్తుంది. ఎందుకంటే simple things లో divine aspects చూడడానికి చాలా లోతు కావాలి. నారదుడికి లేదని కాదు. చూస్తే ఇట్లా పళ్ళ గురించి మాట్లాడుకుంటున్నారు. ఆ పండు ఎక్కడ బాగా పండుతుంది. ఈవిడ ఎట్లా పండించింది. ఏ చెట్టు నుంచి కోసింది. ఏవో ఇట్లాగే మాట్లాడుతున్నారు. అంతా అయిపోయింది. వెళ్ళిపోతున్నారు. సరే అందరూ అప్పటికే చాలా briefing ఇస్తారు నారదుడికి. కాస్త మార్చవయ్యా ఈయన పళ్ళావిడ పిచ్చిలో పడ్డాడు. ఎప్పుడూ ఏదో ఒక దాంతో తగులుకుంటున్నట్టు గానే వుంటాడు. భార్యలకెప్పుడూ complaint కృష్ణుడి గురించి. ఎందుకనంటే ఎప్పుడూ ఏ నిముషములో ఎవత్తె ఎత్తుకుపోతుందో అనేట్టుగా ఉంటాడు. అందరూ చాలా briefing ఇస్తారు. కానీ ఆయనకెవ్వరూ చెప్పలేరు కనుక, ఈయనేం చేశాడంటే, ఏంటి ఇంత time ఇస్తున్నావు ఈవిడకే, అంటే ఏదోలే పాపం నాకోసం పళ్ళు తెస్తోంది. అందుకని ఇస్తున్నానంటాడు. అంటే అప్పుడు 'అది సరేగాని ఇప్పుడే కాశీ నగరం నుండి వస్తున్నాను. ఏమి భక్తుడయ్యా ఆయన? నీ భక్తుడున్నాడు. నీ పేరున విపరీతంగా సత్రాలు కట్టిస్తున్నాడు. నీ పేరున విపరీతంగా అన్నదానాలు చేస్తున్నాడు. నీ పేరున వస్త్రదానాలు చేస్తున్నాడు. నీ పేరున యజ్ఞాలు చేస్తున్నాడు. నీ పేరున దానాలు చేస్తున్నాడు. అబ్బో ఏం చేస్తున్నాడు. మనస్సు బాగా పొంగిపోతోంది నాకు. కాశీ రాజ్యమంతా చెప్పకుంటున్నారు. ప్రక్క రాజ్యాల్లో కూడా చెప్పకుంటున్నారు. ఒక్కసారి ఆయన్ని అనుగ్రహిస్తే బాగుంటుంది కదా', అంటాడు. చూద్దాంలే అంటాడు కృష్ణుడు. 'చూద్దాంలే అంటావేంటి? ఆవిడకు కిచ్చిన time లో పదోవంతు వాడికిచ్చినా బాగుంటుంది కదా' అంటాడు. అంటే 'అది వీలుపడే విషయం కాదు నారదా! వాడికి నేనక్కరలేదు. ఈ పళ్ళ ఆవిడకి నేను కావాలి' అంటాడు. అదేంటి? అంటాడు నారదుడు. 'అంతే అది. వాడు నాపేరు పెట్టుకుని దానాలు చేస్తున్నాడు. నాపేర్న దానాలు చేస్తున్నాడు. కీర్తి సంపాదిస్తున్నాడు. నాపేర్న సత్రాలు కట్టించాడు.

కీర్తి సంపాదిస్తున్నాడు. నాపేర్న బోలెడు చేస్తున్నాడు. దానికి సంబంధించిన కీర్తి దేశం అంతా పాకింది కదా, ప్రక్క దేశాల్లోకి కూడా వెళ్ళింది కదా! వాడికి కావల్సింది అదే. దాని ఫలం వాడు అప్పుడే అనుభవించేస్తున్నాడు. వాడికి నేను అక్కరలేదు. నా పేరు చాలు. ( మాస్టారు 'చెట్టు పేరు చెప్పుకుని కాయలమ్ముకొనే దొంగ వెధవలు నాకొద్దు' అని అంటుండేవారు.) కృష్ణమాచార్య పేరు చెప్పుకుని ఊర్లో పనులు చేయించుకునేవాళ్ళు నాకొద్దు అని చెప్పలేదూ! చెప్పారా? నాపని చేసిపెట్టేవాళ్ళు నాకు పనిచేసిపెట్టండి. నాపేరు చెప్పుకుని కాయలమ్ముకునేవాళ్ళు నాకొద్దు అన్నారు.) నాపేరు చెప్పుకుని వాడు కీర్తిప్రతిష్ఠలు విపరీతంగా సంపాదించుకుంటున్నాడు. వాడికి నేనక్కరలేదు. వాడికి కావల్సింది కీర్తి, ప్రతిష్ఠ. ఈ అమ్మాయికి కావల్సింది నేను. పళ్ళు అమ్ముకోవడం కాదు ఆవిడ పని. సగం పళ్ళు ఇక్కడ ఇచ్చేస్తే ఆవిడ ఏం వ్యాపారం చేస్తుందయ్యా? డబ్బులు తీసుకోకుండా నైవేద్యం పేరున ఆ రోజూ అమ్ముకొనే పండ్ల బుట్టలో సగం పండ్లు ఇక్కడే ఇచ్చేస్తుంది. మిగతా పళ్ళు అమ్ముకుంటే profit వస్తుందా? నిజంగా profit కావాలనుకునేవాళ్ళు బయట అమ్ముకోవాలి. ఇక్కడ ఊరికే ఇచ్చేసి వెళ్ళిపోతే రాదుకదా! ఎందుకు వస్తున్నదో తెలుసా? కేవలం ఈ వంకతో నన్ను చూడడానికి వస్తోంది. ఏదో వంక పెట్టుకొని నన్ను చూసి, నాతో మాట్లాడితే ఆవిడ ఆత్మకి తృప్తి. అది లేకపోతే ఆవిడ బ్రతకలేదు. గోపికల్లాగా, ఈ పళ్ళమ్మాయి కూడా ఈవిధంగా తయారైంది. ఆవిడకి నేనే సర్వస్వం. పళ్ళు ముఖ్యం కాదు. అక్కడ కీర్తి ముఖ్యం. నేను ముఖ్యం కాదు' అంటాడు. అంటే నేను నమ్మను, అంటాడు నారదుడు. నువ్వు నమ్మాలంటే నేనేం చేయాలి? అంటాడు. మనం వెళ్ళి కనబడదాం ఆయనకి. నిజంగా నిజమో, కాదో చూద్దాం, అంటాడు. అంటే అప్పుడు సరే పద అంటాడు. ఇద్దరూ మారువేషాలు వేసుకుందాం అంటాడు నారదుడు. ఇద్దరూ బ్రాహ్మణుల రూపంలో మంచి పట్టీలు గిట్టీలు పెట్టి, పట్టు బట్టలు కట్టి వాళ్ళింటికి వెళ్తారు. చాలా కీర్తిమంతుడూ, చాలా ధనవంతుడు కాబట్టి చాలామంది నౌకర్లు, చాకర్లు బయట వుంటారు. వాళ్ళు అడుగుతారు. 'ఎవరు మీరూ' అని అడిగితే, 'బ్రాహ్మణులం, వేదపండితులం. మీ అయ్యగార్ని చూడటానికి వచ్చాం. మాకు తెలిసిన విషయాలు చాలా వున్నాయి. ఆయన శ్రేయస్సు కోరి ఆయన్ని ఆశీర్వదించడానికి వచ్చాం' అని చెప్తాడు నారదుడు. కృష్ణుడేమీ మాట్లాడడు. లోపలకి వెళ్ళి, ఇట్లా ఇద్దరు బ్రాహ్మణులొచ్చారు, వేదపండితులు, మిమ్మల్ని ఆశీర్వదిస్తారట. అంటే వాడు అంటాడూ, 'ఆ బ్రాహ్మణులు ఆశీర్వదించి డబ్బుల కోసం వచ్చారు. వేదపండితుల గురించి మనకు తెలీదా! ఆశీర్వచనం అంటారు, డబ్బులడుగుతారు. బట్టలు పెట్టమంటారు. రేపక్కడ సభ జరుగుతోంది కదా! అక్కడికి వచ్చి ఆశీర్వాదం చేయమను. అక్కడిస్తాను' అంటాడు. ఎందుకని? ఇప్పుడు వీళ్ళు ఆశీర్వచనం చేస్తే, ఏదో తృణమో పణమో పెట్టి, బట్టల్లో పెట్టి అందిస్తే ఎవరికీ తెలియదు కదా! అక్కడ సభలో ఓ ఐదువందల మందో, ఐదువేల మందో వున్న చోట వాళ్ళు ఘనంగా చదివితే, వీడు ఘనంగా ఏదో చేస్తే, అబ్బా! ఏమి దాతండీ, అని అందరూ అంటారు కదా! అందుకని వాళ్ళని ఇప్పుడు నాకు చూసే తీరికలేదు పొమ్మంటాడు. పొమ్మంటే నారదుడు బిక్కమొహం వేస్తాడు. కృష్ణుడు నవ్వుతాడు. చూశావా మరి అని.

'అలాకాదు ఇంకోసారి మనం హిమాలయాల్నించి వచ్చిన సాధువుల రూపంలో వద్దాం' అంటాడు నారదుడు. సరే అంటాడు కృష్ణుడు. సాధువుల రూపంలో వస్తారు. వస్తే మళ్ళీ గేటు దగ్గర ప్రశ్నలు. ఎవరయ్యా మీరు అంటే 'ఇప్పుడే హిమాలయాల్నించి దిగివస్తున్నాం. రూపం కట్టుకుని వచ్చాం. ఆకాశగమనం చేశాం'. నారదుడికి యావ. ఎంత గొప్పగా చెప్తే, వాడు అంత ఒప్పుకుంటాడని. ఆకాశగమనం చేశాం. ఇప్పుడే ఇక్కడే వెలిశాం. ఈ కమండలం, గెడ్డం గిడ్డం అన్నీ బ్రహ్మాండంగా వుంటాయి. గోచీ వుంటుంది. మరి హిమాలయాల్లో సాధువులంటే బట్టలు వేసుకోకూడదు. అటువంటి వేషం వేయిస్తాడు కృష్ణుడి చేత. చెప్తాడు. లోపలకి వెళ్ళి బంటు చెప్తాడు. 'అయ్యా, హిమాలయాలనుంచి సాధువులొచ్చారట మీ దర్శనానికి. ఇట్లా ఆకాశగమనం చేసివచ్చారట'. అంటే వాడంటాడు. 'హిమాలయాల్లో వుండి ఆకాశగమనం చేయగలిగినట్టి వాళ్ళకి నాతో పనేముంటుంది? దొంగ సన్యాసులయి వుంటారు. ఈమధ్య అసలు సన్యాసులెవరో, దొంగ సన్యాసులెవరో తెలియడం లేదు. దొంగ వెధవలయి వుంటారు. హిమాలయాల్లో సాధువులు వాళ్ళ గురించి వాళ్ళు చెప్పుకోరు. వీడేమో ఆకాశగమనం చేశానంటున్నాడు. అదంటున్నాడు ఇదంటున్నాడు. అక్కడ్నుండి వచ్చానంటున్నాడు. ఇక్కడ్నుంచి వచ్చానంటున్నాడు. వాళ్ళకేమన్నా కావాలంటే ఫలానా రోజున యజ్ఞం చేస్తున్నాను. అక్కడికి వస్తే ఇస్తాను రమ్మంటాడు'. మళ్ళీ నారదుడు బిక్కమొహం వేస్తాడు. కృష్ణుడు నవ్వుతాడు. వెళ్ళిపోతారు. ఏమిరా అంటే ఇంకొక ప్రయత్నం చేద్దాం అంటాడు నారదుడు. 'ఈసారి ఏమిటి వేషం' అని అడుగుతాడు. 'ఇంక వేషాలు వద్దు. నేను నారదుడు గాను, నీవు కృష్ణుడు గాను వచ్చేద్దాం అంటాడు. ఇక direct గా పెట్టేసుకుందాం. వేషం వేస్తే వాడికి తెలియడంలేదు. వాడు కొంచెం అజ్ఞానంలో ఉన్నాడు. నీ భక్తుడే నేను చెప్తున్నాను కదా! ముమ్మాటికీ నీ భక్తుడు. నేను చెప్తుంటే నీవు నమ్మడం లేదు. నీవు కృష్ణుడుగా రా. నేను నారదుడుగా as it is వచ్చేద్దాం' అంటాడు. సరే అంటాడు. వెళ్తారు. వెళ్ళి అక్కడ గేటు దగ్గర నిలబడి నేను నారదుడ్ని, ఈయన పురాణపురుషుడు, జగద్గురువు, మూడు లోకాలకీ గురువు శ్రీకృష్ణుడు. అంటే బంటుకే నవ్వొస్తుంది. లోపలకి వచ్చి' అయ్యా! మీ కోసం నారదుడు, శ్రీకృష్ణుడు వచ్చారు. గేటు దగ్గర wait చేస్తున్నారంటే' వాడికే నవ్వొస్తుంది. నవ్వొచ్చి 'ఒరే నాలుగు తగిలించు, గాడిద కొడుకులకి. ఏదో వేషం వేస్తే వెయ్యచ్చు గాని, సరాసరి కృష్ణుడి వేషం, నారదుడి వేషం వేస్తారా! వాళ్ళనెంతో అవమానపరచిన వాళ్ళయ్యారు వీళ్ళు. చావగొట్టి పంపించేయ్' అని చెప్తాడు. వాళ్ళు కర్రలు పట్టుకొని బయటకు వచ్చేసరికి నారదుడు అమ్మో! అంటాడు. అప్పుడు చెప్తాడు కృష్ణుడు. 'నాయనా, వాడికి మన అవసరం లేదు. మన అవసరం లేని వాడి దగ్గరకు మనం వెళ్తే ఇట్లాగే వుంటుంది. ఆ అమ్మాయికి నేనే. ఇంకోటి లేదు. ఏదో వంక పెట్టుకొని వస్తూ వుంటుంది'. మీరాబాయి ఓ పాట రాస్తుంది. 'చాకర్ రాకోజీ మైనే చాకర్ రాకోజీ' అని కదా! నీ ఇంట్లో ఇల్లు ఊడ్చేదానిగా, తుడిచేదానిగా, నౌకరుగా చాకిరీ చేయడానికి పెట్టుకో అని. ఎవరావిడ? రాజపుత్రుల వంశానికి చెందినది. ఒక రాజపుత్రుని భార్య. మహారాణి. కోరిందేమిటీ? నీ ఇంట్లో నన్ను చాకిరీకి పెట్టుకో అంటుంది. ఎందుకు పెట్టుకోవాలో కూడా పాటలో చక్కగా చెప్పింది. నీ ఇంట్లో

చాకిరీ చేస్తూంటే, ఆ రాజప్రాసాదంలో కాస్త నువ్వు అట్నుంచి ఇటు, ఇట్నుంచి అటు తిరుగుతూ వుంటావు కదా! అప్పుడొక్కసారి నిన్ను చూడచ్చు అంటుంది. ఎంత భావం. నౌకరుగా ఉన్నా ఫరవాలేదు నాకు. నీ ఇంట్లో వుంటే నీ దర్శన భాగ్యం రోజుకోసారి ఎట్లాగో అట్లా కలుగుతుంది. ఏదో time లో బయటకి వెళ్తావు. ఏదో time లో ఇంట్లోకి వెళ్తావు. ఏదో అక్కడే ఆ నేల తుడుచుకుంటూ, గిన్నెలు కడుక్కుంటూ ఉంటాను. కాస్త అట్లా చూడచ్చు. నువ్వు అమ్మగారితో మాట్లాడుతూంటే చూడచ్చు. నాన్నగారితో మాట్లాడుతూంటే చూడచ్చు. ఎక్కడో దూరంనుంచి నువ్వు తింటూంటే చూడచ్చు. మాట్లాడుతూంటే చూడచ్చు. ఏదోవిధంగా నిన్ను చూడచ్చు కదా! కాబట్టి నన్ను నౌకరుగా పెట్టుకుంటావా? అని అడుగుతుంది పాటలో. అందుకని భగవద్భక్తులు భగవంతుణ్ణి చూడటం కోసం ఏదో ఒక వంక పెట్టుకుని వస్తూంటారట. మైత్రేయుడంతటివాడు అట్లా వంక పెట్టుకుని వస్తూంటాడు అంటాడు కృష్ణుడు. ఏదో ఒక నెపం పెట్టుకుని చూడ్డానికి వస్తూంటాడట. మరి మీరాబాయి కీర్తి ఎలా నిలిచిపోయింది? ఇంకా పెరుగుతుంది తప్ప తరగదు. అన్నమాచార్యుల వారి కీర్తి ఎట్లా పెరిగిపోతోంది? 500 ఏళ్ల క్రితం పాటలు రాస్తే అది ఇప్పుడు బయటకి రావడమేమిటీ? ఇన్నాళ్ళూ మరి ఏమైందీ? కాలం బయటకి తెచ్చేసుకుంది. అది సత్యమైన విషయము కాబట్టి కాలం బయటకి తెచ్చింది. ఏసుక్రీస్తు పోయినపుడు ఎవ్వరికీ తెలియదు ఆయన గురించి. 300 సంవత్సరాల తర్వాత ఇంతటి మహానుభావుడు జీవించాడనే విషయం తెలిసింది. ఆయన జీవితాన్ని సమస్తాన్ని అప్పుడు సేకరించడం మొదలుపెట్టారు. ఏదో పదిలపరిచారు. అతుకుల బొంతగా ఒక కథ మనకిచ్చారిప్పుడు. ఇంకా పూర్తిగా ఎవరికీ తెలీదు. ముందు ముందు ఇంకా తెలుస్తుంది. షిరిడీలో సాయిబాబా వున్నప్పుడు ఎవరికి తెలుసు? ఎంతమందికి తెలుసునండీ? మహా తెలిస్తే 500 మందికి తెలిసిందేమో! ఏదో మసీదులో వున్నాడు. వాడూ, వీడూ పెట్టిన అడ్డమైనవీ తిన్నాడు అన్నీ కలిపేసుకుని పైగా, రుచీ పచీ లేకుండా. చిరిగిన బట్టలేసుకున్నాడు. దగ్గరకెళ్తే కంపు కూడా కొడ్తూ వుండేది. శ్యామా అనేవాడు ఆ చొక్కా మీ దగ్గరుంటే, మేము దగ్గరకి రాలేకపోతున్నాము. చొక్కా మార్చుకుంటే వస్తాం అని చొక్కా తెస్తే మార్చుకోకపోవడం ఆ గొడవ లన్నీ వున్నాయి కదా! ఎవరికి తెలుసు షిరిడీ? ఎంతమందికి తెలుసు షిరిడీ? ఆయన గురించి ఆయన వున్నప్పుడు ఎంతమందికి తెలుసు? ఇప్పుడు ఎంతమందికి తెలుసు? ఏం జరిగింది? అది సత్యమైన విషయం కాబట్టి కాలం పెంపొందిస్తుంది. అసత్యమైన విషయం నువ్వు ఎంత బాగా పెంపొందించి, నువ్వే దాన్ని బాగా స్థిరత్వం కల్పించి establish చేసి వెళ్ళిపోదామనుకున్నా, నువ్వెళ్ళిన మర్నాటి నుండి దానికి భ్రష్టు పట్టేస్తుంది. అందుకని సత్కీర్తి ఎవరికి లభిస్తుందయ్యా అంటే దివ్యత్వానికి సమర్పణ చెంది, లోకశ్రేయస్సు కోసం పనిచేస్తూ, తన కీర్తి గురించి బాధపడకుండా, లోకశ్రేయస్సు గురించి బాధపడి పనిచేస్తూండే వాడుంటాడే, కాలమే వాడి కీర్తిని పెంపొందింప చేస్తుంది. తనున్నప్పుడు తనే photos తీసుకుని, తనే videos తీసుకుని, తనే అందరికీ పంచేసుకుని తనే paper లో వేసుకుంటే అప్పటికప్పుడు అయిపోయింది. ఎవరూ ఏమీ చేయనక్కరలేదు. అయిపోతుంది ఆ విషయం. సత్కీర్తి ఆ విధంగా

వుంటుంది. భగవంతుని కీర్తి సృష్టి వున్నంతకాలం వుంటుంది. రాముడి కీర్తి ఎంతకాలం వుంటుంది తెలుసా? భూమి ఉన్నంతకాలం వుంటుంది. కృష్ణుడి కీర్తీ అంతే. భగవద్భక్తుల కీర్తి అంతా అంతే. హనుమంతుడు 'రాముడి రూపంలో ఈ భూమి మీదకు ఆయన వచ్చాడు కాబట్టి ఈ గోళం వున్నంతకాలం శాశ్వతంగా వుండిపోతాను' అని చెప్పాడండీ. ఎంత అదృష్టం మనకి ఆయన వుండడం. ఆయనకి వున్న ప్రజ్ఞాపాటవాలకి హనుమంతుడికి నిజానికి ఇక్కడ వుండాల్సిన అవసరం లేదు. ఎందుకున్నాడటయ్యా అంటే ఈ భూమి మీద రాముడు నడిచాడు కాబట్టి, ఈ భూమి వున్నంతకాలం నేనుంటానని చెప్పాడు. అది సత్కీర్తి. రాముడి విగ్రహంపై ఎవరో చెప్పులేసినా, లేకపోతే రామాయణాన్ని దుష్ప్రచారం చేసినా అవి తాత్కాలికాలు. తరువాత ఇటువంటి దుర్మార్గులు కూడా నడిచారు ఈ భూమి మీద అని చెప్పుకుంటారు. అంతేకానీ రామాయణం కీర్తి తగ్గదు ఎంత మనం తగ్గిద్దామనుకున్నా. మహాభారతం తగ్గదు. మహాత్ముల జీవితాలు ఎంత తగ్గించాలనుకున్నా పెరుగుతూనే వుంటుంది. నీవు తగ్గించడానికి చేసిన ప్రయత్నంలోంచి ఇంకొంచెం పెరుగుతూ వుంటుంది. అది సత్కీర్తి. అటువంటి కీర్తి ఎక్కడ కనిపించినా, అది దైవం యొక్క కీర్తి అని భావన చేయాలి. అందుకని సత్కీర్తిని దైవం యొక్క అవతరణగా గుర్తించడం సత్కీర్తి నామంలో భాగం. అక్కడ ఉత్త కీర్తి చెప్పలేదు. సత్కీర్తి చెప్పారు కాబట్టి మన కీర్తి, ప్రతిష్ఠల గురించి తాపత్రయపడడం అజ్ఞానంలో గాఢాంధకారమన్నమాట. వాళ్ళూ వీళ్ళూ వచ్చి చెప్తున్నా సరే, అదేం లేదని చెప్పాలి. శ్రీకృష్ణుడు వాళ్ళ అమ్మకి, వీడు భగవంతుడేమో అన్న doubt వచ్చిన మరుక్షణంలో ఓ నవ్వు నవ్వేసి అదేం కాదన్నట్టుగా భావన కలిగించేశాడు కదా! ఎంతమందికి ఆయన పట్ల కలిగిన భావాన్ని కూడా తుడిచిపెట్టాడు. ఆయన reverse మనకి. మనం ఏం వుండదు లోపల, అసలు మాస్టర్ గారికి నేనే వాహిక సుమా! అని తెలియాలని, రకరకాలుగా రకరకాలుగా indirect గా సూచనలిస్తూ, మాట్లాడడం అనే ఒక తెలివితక్కువ తెలివి ఒకటి వుంటుంది కదా! వుంటుందా? విన్నవాడు ముందు ఏమీ అనలేక ఆయ్, ఆయ్ అంటాడు. గేటు దాటి వెళ్ళిపోయిన తరువాత నవ్వుకుంటాడు. తిట్టుకుంటాడు. అపహాస్యం చేస్తాడు. నువ్వే నిన్ను తీసిపారేసుకుంటే, సత్యమైతే ఎక్కడికీ పోదు. అసత్యమైతే, నువ్వెంత దాన్ని నిలబెడదామనుకున్నా పోతుంది. ఎందుకు దాని గురించి యావ? మహాత్ముల సత్కీర్తి రూపంలో భగవంతుడే అక్కడ ఉన్నాడని గుర్తుపెట్టుకోవాలి. ఆయనే పెంపొందిస్తుంటాడు భక్తుని కీర్తిని. ఆయనకి, తను పెద్దవాడనిపించుకోవడం పెద్ద ఇష్టం లేదు. ఎందుకో తెలుసా? తన భక్తుడు పెద్దవాడంటే, తను ఆయన కన్నా పెద్దవాడికిందే లెక్క కదా, అందుకని తనను నమ్ముకున్న వాణ్ణి పెద్దవాణ్ణి చేసేసరికి, వాడు ఎవర్ని నమ్ముకున్నాడో వాడు అంతకన్నా పెద్దవాడైపోయాడు కదా! లౌక్యంగా ఆలోచించినా అది బావుంది. మనం ఎవర్నన్నా పెద్దవాడ్ని చేస్తే, వాడు వాడిగురించి చెప్పుకుని, మనల్ని మర్చిపోతాడని భయం మనకి. అందుకని సత్కీర్తి విషయం వరకూ వస్తే దివ్యత్వము, లోకశ్రేయస్సు. లోకశ్రేయస్సు కలిగినట్టి శాస్త్రజ్ఞులు చాలామంది ఉన్నారు. వాళ్ళ కీర్తి అట్లా చిరస్థాయిగా ఉండిపోతుంది. Einstein ని ఎవరూ

మరువరు. Wright brothers ని  ఎవరూ మరువరు. Electricity ఇచ్చినవాణ్ణి మరువరు. Telephone ఇచ్చినవాణ్ణి మరువరు. Computer ఇచ్చినవాడ్ని మరువరు. ఎందుకు మరువరంటే, వాళ్ళ మూలంగా చాలా శ్రేయస్సు జరిగింది. వాళ్ళ రూపంలో కూడా ఇటువంటి దివ్యత్వమే పనిచేస్తోంది. Newton ని మరువరు. ఎందుకంటే మనకి బుద్ధి వికాసం కలిగించటానికి వాళ్ళు చూపించిన సూత్రాలు ఎంతో అవసరపడ్డాయి, ఉపయోగపడ్డాయి. అలా వుంటుంది సత్కీర్తి.

## 648 ఛిన్నసంశయః

Doubt పెట్టుకోవద్దు. నన్ను నమ్ముకుంటే ఇహ doubt వద్దు. నన్ను పెట్టుకుని, doubt కూడా పెట్టుకుంటే నీకు నేనూ వుంటానూ, doubt కూడా వుంటుంది. Doubt పనిచేస్తుంది, నేనూ పనిచేస్తాను. సందేహం కదా! దానిలో నుండి ఒక రకమైన అనుమానం, మన గురువుగారు మనకి ఇది చేయగలరా అని. పెద్దవాళ్ళేం చెప్తారంటే నీ విశ్వాసమే నిన్ను రక్షిస్తుందిరా అని. నీ కున్న ప్రగాఢమైన నీ విశ్వాసం నిన్ను రక్షిస్తుంది తప్ప, మధ్యలో కొంత సంశయం వస్తే పడిపోతావ్. శంకరాచార్యుల శిష్యుడు పద్మపాదుడు. గంగా నదికి అటుప్రక్క గురువుగారూ, ఇటుప్రక్క ఈయనా వున్నారుట. గురువుగార్ని చూడగానే అమితోత్సాహం కలిగి, నీళ్ళ మీద నుండి నడుచుకుని అటువైపు వెళ్ళిపోయాడట. 'ఇదేంట్రా నువ్విలా వచ్చేశావ్, నేనే నడవలేను' అన్నారట ఆ గురువుగారు. 'మీరలాగే అంటారు, మీరూ నడవగలరు, మిమ్మల్ని చూసే నేను నడిచాను' అంటాడు. నిజానికి అతని విశ్వాసం అతన్ని నడిపించింది అంతే. రాముడి మీద విశ్వాసంతో హనుమంతుడు ఎగిరాడండీ! మరి రాముడో? రాళ్ళేసుకొని నడుచుకు వెళ్ళాడు. విశ్వాసాన్ని మించిందేమీ లేదు. 'వేంకటేశ్వరస్వామి నా సమస్త కష్టాలూ తప్పక పోగొడ్తాడు, సందేహం లేదు' అని పరిపూర్ణంగా నమ్మిన వాడికి, వాడి నమ్మకమే నడిపిస్తుంది. ఇంకొకడు రాముడంటాడు, ఇంకొకడు హనుమంతుడంటాడు, ఇంకొకడు వినాయకుడంటాడు ఇంకొకడు కృష్ణుడంటాడు, ఇంకొకడు లింగం అంటాడు, మరొకరు పార్వతి అంటే ఇంకొకడు లక్ష్మి అంటాడు. ఒక్కడికి ఒక్కొక్క పేరున్న దేవతపై విశ్వాసం, అదీ పరిపూర్ణంగా వుంటే 'ఇలా జరగడం అసంభవం' అనుకున్న విషయాలు జరిగిన సందర్భాలు చాలా వుంటాయి. ఏదైనా సంభవమే అనేది భగవత్తత్త్వంలో వుండే ముఖ్యమైన అవగాహన. అందుకని అటువంటి విశ్వాసం నీకు భగవంతుని యందుంటే, నీకు వేరే భావన రావడానికి అవకాశం లేదు. వేరే రకంగా పాడైపోయే అవకాశం లేదు. విభీషణుడు లంక లోంచి బయటకు రావాలి. వాళ్ళ ఒక అన్నయ్య నిద్రపోతూంటాడు. సంప్రదించడానికి వీలు లేదు. మరొకడేమో చెప్పిన మాట వినడం లేదు. పిచ్చి పిచ్చి పనులు చేస్తున్నాడు. వద్దురా అంటే తిడుతున్నాడు, కొడుతున్నాడు. ఏం చేయాలి? ధర్మంగా అనిపించలేదు. అవతల ప్రక్క ధర్మాన్ని నమ్మినాయన తన సోదరుణ్ణి సంహరించడానికి లంకకు వస్తున్నాడు. ఇప్పుడు తను వెళ్ళి, లంకకు శత్రువు అయినవాడ్ని శరణు వేడాలి. మనకంటే రాముడు ఇప్పుడు తెలుసు కానీ, అప్పుడు శత్రువు పక్షంలో వుండే వాడిని శరణు వేడడానికి వెళ్తే ఇస్తాడో, అప్పటి కప్పుడే తెగేస్తాడో తెలీదుగా. ఇక్కడ లంకలో అతని కుటుంబం ఉన్నది. సకుటుంబంగా విభీషణుడు వెళ్ళక, ఓ నలుగురు సహచరులను వెంటబెట్టుకుని వెళ్ళాడు. ఏమిటీ ధైర్యం? రక్షించవచ్చు, రక్షించకపోవచ్చు. శరణు ఇవ్వకపోతే, తిరిగి వస్తే వీళ్ళు చంపేస్తారు. మైలబడ్డావు, ఇప్పటికీ ఇప్పుడే 'రా' అంటాడు. శరణు ఇస్తాడో ఇవ్వడో? శరణు ఇవ్వాలని rule లేదు కదా! 'లంకలో అమ్మవార్ని బంధించి చాళ్రోజులైనా ఈరోజు నేను యుద్ధానికి సంసిద్ధుడను

అయినానని, నా పరాక్రమం తెలిసీ, చచ్చిపోతానన్న భయంతో ఇప్పుడొచ్చి నన్ను శరణు అంటున్నాడూ' అని అనుకోవచ్చు కదా! అంతేకాదు ప్రధాన శత్రువుకి సరాసరి సహోదరుడు. అదే కడుపు లోంచి వచ్చినవాడు. కాబట్టి నమ్ముతాడనేమిటీ? నీ శత్రువు ఇంట్లోనుంచి వాడి తమ్ముడు నీ దగ్గరికి వచ్చి నేను నీ ప్రక్కన వుంటాను అంటే వెంటనే నమ్మాలని ఏముంది? పైగా రాక్షసులు. అంటే స్వభావము చేత రహస్య, మాయా ప్రవర్తన కలిగినవారు. అంత సులభంగా అవగాహన చేసుకునే వీలు లేని వారు. నమ్మదగ్గ వారుకాదు. అదీ తెలుసు విభీషణునికి. ఇన్ని పెట్టుకుని కూడా, ఏ అపనమ్మకము లేకుండా, విశ్వాసంతో వెళ్ళాడు రాముని వద్దకు. అదీ విభీషణుని శరణాగతి లోని గొప్పతనం. విభీషణ శరణాగతిని అత్యుత్తమంగా ఎందుకు అంటారంటే మామూలుగా మనలాంటి వాడైతే వెళ్ళడానికి చాలా సందేహిస్తాడు. నూటికి తొంభై తొమ్మిది పాళ్ళు వెళ్ళనే వెళ్ళడు. వెళ్ళినా రకరకాల భావాలు లోపలుంటాయి. అటువంటివాడూ, తన వాళ్ళని కాదని శత్రువు, నిరాయుధుడూ, తనతో పెద్ద సైన్యం లేదు తనను సంహరించవచ్చు. అక్కడకి వెళ్తే, ఆయన 'శరణు' అంటే, చుట్టూ వుండే వాళ్ళు రకరకాలుగా మాట్లాడుతూంటారు. సుగ్రీవుడు 'ఏమో చెప్పలేం సార్' అంటాడు. జాంబవంతుడు, అంగదుడు ఇలా అంతా తలో విధంగా అంటారు రాముడితో, విభీషణునికి శరణు ఇవ్వనా అన్నప్పుడు. హనుమంతుడేమో 'అంగీకరించవచ్చు' ఎందుకంటే అనీ, కారణాలు చెప్తాడు. ఇందువలన అంగీకరించవచ్చు అని చెప్తాడు. అప్పుడు రాముడు 'మీరంతా శుద్ధ తప్పు. ఒకడు వచ్చి నన్ను శరణు వేడితే మంచివాడు కనక అని శరణు ఇవ్వడం పద్ధతి కాదు. నన్ను ఎవరు శరణు కోరినా, వాడేవడైనా శరణు ఇవ్వడమే నా పద్ధతి, ధర్మం' అని చెప్తాడు. మంచి వాడు కాబట్టి అని హనుమంతుడు చెప్పాడు, మంచి వాడు అవునో కాదో మాకు తెలియదు కాబట్టి మరి నీ ఇష్టం అని చెప్పారు అందరునూ. అవన్నీ కాదు, నిజమైన ధర్మం ఏమిటి అంటే నన్ను శరణు కోరినవాడు ఎటువంటి వాడైనా సరే వాడిని అంగీకరించడమే నా ధర్మం!' అని అంగీకరిస్తాడు. అంతటి విశ్వాసం విభీషణుడికి రాముడి మీద ఎలా ఏర్పడింటీ? ఎప్పుడూ చూళ్ళేదు కదా! చుట్టూ వుండి చూసిన వాళ్ళు అలా వున్నారు. ఎప్పుడూ చూడని వాడు ఇలా వున్నాడేమిటీ? ఏ సంశయమూ లేదు. విభీషణుడు పరిపూర్ణంగా ధర్మాన్ని నమ్ముకున్నవాడు. సత్త్వగుణ సంపన్నుడు. రాముడు సత్త్వగుణాతీతుడు. సత్త్వగుణంలో వుండే వాడికే గుణాతీతమైనతత్త్వం నందు ఆకర్షణ యుంటుంది. రావణుడూ, కుంభకర్ణుడూ రజస్సూ, తమస్సూ. వాటి మీద అతనికి ఆసక్తి లేదు. విపరీతంగా అక్కడకు లాగేసింది. 'అక్కడ సత్యం, ధర్మం ఉన్నాయి. సత్య స్వరూపం అది. ధర్మ స్వరూపం అది. నాయందు అది గోచరిస్తున్నది. నేను నమ్ముతున్నాను. నేను వెళ్ళిపోతున్నాను'. అని వెళ్ళిపోయాడాయన. అంత సులభం కాదు. అటువంటి వాడి రూపంలో భగవంతుడే వుంటాడుట. ఎట్లా ఉన్నాడు అక్కడ? అతడు ధర్మము యందు, సత్త్వము నందూ నిలబడి యుండుట చేత సంశయములు లేక యున్నాడు. మనలో కూడా సంశయములు లేక వుండాలంటే సత్త్వగుణ ప్రధాన ప్రవర్తన బాగా అలవాటు చేసుకోవాలి. ఎలా? అంటే భగవద్గీతలో గుణత్రయ విభాగ యోగం చూస్తే అందులో

సత్త్వగుణ సంపన్నులు ఎలా వుంటారో ఓ పట్టీ వున్నది. దాని ప్రకారం వుండడానికి ప్రయత్నం చేయండి. అప్పుడూ సంశయము లేనట్టి స్థితి యందు పూర్ణ చైతన్యంగా మనకి మనం గోచరించే మార్గం దొరుకుతుంది. అటువంటి పూర్ణ చైతన్యంలో దేనికీ సంశయము యుండదు. కృష్ణుడికీ, రాముడికీ ఎవరి మీదా సందేహాలుండవు. అదీ 'ఛిన్నసంశయః'. సందేహాలన్నీ ఛేదించేస్తాడుట. మనకున్న సందేహాలు కూడా ఛేదించడం వున్నదిందులో. నీలో సందేహాలని తనే ఛేదిస్తూ నమ్మకం కుదురుస్తాడట. మార్గంలో స్థిరమైన బుద్ధిని మనకు ఇవ్వడం కూడా ఆయనే దీక్ష కట్టుకొనీ, సన్నివేశాల ద్వారా ఏర్పరుస్తాడట. అదే కదా CVV గారు అంటారు 'నీకు ఆ నమ్మకమును కూర్చవలసిన వాడిని కూడా నేనే. పూర్ణముగా నన్ను విశ్వసించినచో నీకు యోగము బాగుగా జరుగును అని నేను చెప్పను. ఆ విశ్వాసమును కూడా నేనే కల్పించెదను.' అంటారు. కనుక పూర్ణ విశ్వాసమును కూడా భగవంతుడే కల్పిస్తాడు. పూర్ణమైన విశ్వాసము యున్నవాడికి దారి సులభం అవుతుందని అవగాహన చేసికోవాలి.

## 649 ఉదీర్ణః

ఉదీర్ణః అంటే ఊర్ధ్వముఖమైన కిరణములు కలిగిన వాడు అని అర్థం. భగవత్తత్త్వం యొక్క గతి ఎప్పుడూ ఊర్ధ్వముఖంగా వుంటుంది. స్థూలం నుండి సూక్ష్మానికి చేసే గమనాన్ని ఊర్ధ్వముఖం అంటారు. ఊర్ధ్వం అంటే పైకి అని కాదు. పైన, కింద అనేది మనకి భూమిమీద ఉన్నప్పుడే. భూమి దాటితే పైన లేదు, కింద లేదు. స్థూలం నుండి సూక్ష్మానికి వెళ్ళటానికి ఊర్ధ్వం అంటారు. ఎంత స్థూలంలోకి వెళ్తూ వుంటే అంత దక్షిణంగాను లేక అధోముఖంగాను లేక పశ్చిమంగాను వెళ్తున్నట్టు భావన. ఎంత సూక్ష్మంలోకి మనం వెళ్తూ వుంటే అంత ఉదీర్ణత్వము అనే తత్త్వంలోకి ప్రవేశిస్తున్నట్టు భావన. ప్రజ్ఞ ఎప్పుడూ ఊర్ధ్వముఖమే అంటే ఎప్పుడూ సూక్ష్మమే. పదార్థము ఎప్పుడూ అధోముఖమే లేక స్థూలమే. అందుకనే మీరు ఒక రాయిని ఇట్లా పడేస్తే అది క్రిందపడుతుంది. ఒక hydrogen తో నిండిన baloon ని ఇలా వదిలేస్తే పైకి వెళ్ళిపోతుంది. అగ్ని ఊర్ధ్వముఖంగా వుంటుంది. వాయువు పైనే తిరుగుతూ వుంటుంది. ఆకాశం అంతకన్నా పైన. నీరు సమతలంగా వుంటుంది. పదార్థం బరువుగా క్రిందకి వుంటుంది. అందుకని మనకి స్థూలంలో బరువుంటుంది. స్థూలంలో పదార్థం ఎక్కువ వుంటుంది. ప్రజ్ఞ తక్కువుంటుంది. సూక్ష్మంలో ప్రజ్ఞ ఎక్కువ వుంటుంది. పదార్థం తక్కువ వుంటుంది. మనం ఈ నామం మీద సాధన చేయడం వలన సూక్ష్మమైన విషయముల యందు ఎక్కువ మనసు లగ్నం చేసి మనం కూడా ఉదీర్ణత్వం చెందుతాం, అంటే ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేస్తాం. మామూలుగా సామాన్య మానవులం అందరం కూడా బొడ్డు కేంద్రంగా జీవిస్తూ వుంటాము. భావమయ ప్రపంచంలో జీవిస్తూ వుంటాము. ఇల్లు, సంసారం, ఉద్యోగం, దాని బాధలు, పిల్లలు, వాళ్ళ చదువులు, వాళ్ళ బాధలు, మొగుడికి భార్య, భార్యకి భర్త, వాళ్ళ బాధలు. ఈ రకమైన వలయంలోనే ఎక్కువ తిరుగుతూ వుంటుంది మనసు. ఒక ఇల్లాలి మనసు దేంట్లో తిరుగుతూ వుంటుంది? ఇంట్లో పనులు, పనిమనుషులు, మొగుడు, పిల్లలు. ఇంతకు మించి తిరగదది, ఎన్ని చెప్పినా. ఒక ఇంటాయన భావాలు దేంట్లో తిరుగుతూ వుంటాయి? ఉద్యోగం, promotion ఇంకా ఎట్లా సంపాదించుకోవచ్చు? ఈ పిల్లలు సరిగా చదువుకుంటున్నారా? లేదా? ఇల్లెక్కడ కడదాం? స్థలం ఎక్కడ దొరుకుతుంది? అప్పు చేద్దామా? అప్పు చేస్తే ఎట్లా తీరుస్తాం? వీట్లోనే తిరుగుతూ వుంటుంది. ఇంతకు మించి తిరిగేదేమీ లేదు. ఈ తిరుగుడంతా కూడా స్థూలంలో తిరగడమే. అంటే మనచుట్టూ వుండే సమకాలిక ప్రపంచ విషయములలో తిరిగే మనస్సు ఏదో అప్పుడప్పుడు దేవుడు, దేవుడు అంటూ వుంటాము. అంటే ఓసారి అట్లా పైకి వెళ్ళి, ఇట్లా మనం దానికి ECG లాగా ఒక graph తీస్తే, అలా సమతలంగా అంటే horizontal గానే వెళ్ళిపోతూ వుంటుంది. బాగా అప్పుడప్పుడు క్రిందకి వెళ్ళిపోతూ వుంటుంది. ఎప్పుడన్నా ఒకసారి అట్లా పైకి వెళ్ళి మళ్ళా వచ్చేస్తూ వుంటుంది. ఎప్పుడూ? నమస్కారమ్స్ మాస్టర్ CVV అన్నప్పుడు మాత్రం అట్లా వెళ్ళి వచ్చేస్తుంది. మిగతా అప్పుడు ఇట్లా వెళ్ళిపోయి అట్లా గోతుల్లోకి వెళ్ళిపోతూ వుంటుంది. ఇంకా

వాళ్ళమీద, వీళ్ళమీద అసూయ, ద్వేషం, పగ, కసి ఇవన్నీ మన మనసునిండా బాగా నిండి వున్నాయనుకోండి, పాతాళంలోకి వెళ్ళిపోతూ వుంటుంది. కాబట్టి మనకి 'ఉదీర్ణ' అనే నామం చాలా ముఖ్యమైన నామం. మన మనసులో సగటు భావం ఎట్లా వున్నది? Average pass అయ్యాడా, fail అయ్యాడా అనటానికి ఏది తార్కాణంగా తీసుకుంటారు? మొత్తం కలిగే భావాల్లో, ఎన్ని ఉన్నతమైన భావాలు కలుగుతున్నాయి? ఎన్ని దివ్యమైన భావాలు కలుగుతున్నాయి? దివ్యము అంటే వెలుగుతో కూడిన, వెలుగు సంబంధమైన భావములు, దైవ సంబంధమైన భావములు, సద్భావములు. ఇవి ఎన్ని కలుగుతున్నాయ్ రోజు మొత్తంలో. ఈ మిగతా, మన భాషలో చెప్పాలంటే దరిద్రపుగొట్టు ఆలోచనలు ఎన్ని వస్తున్నాయ్? దరిద్రపుగొట్టు ఆలోచనలు బాగా వస్తున్నాయనుకోండి అంటే మనం ఎంత భక్త సమాజంలో వున్నా కూడా, వెళుతున్నది పాతాళ లోకాల్లోకే. పాతాళంలో ఉన్న భావాలు మాత్రం దాని యందున్నాయనుకోండి, ఏదీ? అసలు వస్తువు నందు, ఊర్ధ్వలోకాల్లో ఉన్నట్టే. కాబట్టి పధ్నాలుగు లోకాల్లో మనం ఎక్కడ ఉన్నాం అనేది మన భావన బట్టి తెలుస్తూ వుంటుంది. భగవంతుడు ఎప్పుడూ కూడా నీవు స్మరణ చేయటంచేత నిన్ను ఊర్ధ్వస్థితికి తీసుకొస్తాడు. అందుకని ఈ స్తోత్రాలు, నామాలు, నామస్మరణలు. నామస్మరణ ఊరికే యాంత్రికంగా చేసుకుంటూ, మనిషి మాత్రం అదే పద్ధతిలో వుంటే ఉపయోగం ఏమీ వుండదు. మన భావాల్లో మార్పు వచ్చిందా? ద్వేషం ఉందా? మమకారం ఉన్నదా? ఈర్ష్య ఉన్నదా? అసూయ ఉన్నదా? క్రోధం ఉన్నదా? లోభం ఉన్నదా? కామం ఉన్నదా? మదం ఉన్నదా? మాత్సర్యం ఉన్నదా? అవి పొంచి చూస్తున్నాయా? లేదా? అని ప్రశ్న వేసుకుంటే, లేదు అని ఎవడూ, ఎవడికీ సమాధానం చెప్పకోలేడు. తగ్గించుకుంటూ పొండి. ఎంత తగ్గించుకుంటే అంత average పెరుగుతుంది. విష్ణు సహస్రనామం చదివినప్పుడు 90 మార్కులు వచ్చి, భయంకరంగా ఒక మనిషి గురించి మన నోటి నుండి మాటలు మాట్లాడేస్తే, అందులో 3 మార్కులు వచ్చినాయనుకోండి. పరీక్ష pass అయినట్టా, తప్పినట్టా? ఒకదాంట్లో 90 వచ్చి, ఒక paper లో 3 మార్కులు వస్తే, News paper లో మన number కనపడదు. అదెందుకు, ఇదెందుకు? Average చేస్తే కనీసం 35, 40 రావాలి కదా, అట్లా మనం దివ్యమైన భావాల్లో జీవించడం మొదలుపెట్టాలి. దేవకీదేవి ఎలాంటి భావాల్లో జీవించింది? వసుదేవుడు ఎలాంటి భావంలో జీవించాడు? ధర్మరాజు ఎలాంటి భావంలో జీవించాడు? కష్టాల్లో ఉన్నవాళ్ళే వీళ్ళంతా. మనకన్నా చాలా పెద్ద కష్టంలో ఉన్నవాళ్ళు. మన కష్టాలెంత? అటు నీవు చూస్తే ఏమవుతుందంటే, నీ మొత్తం చైతన్యం అంతా కూడా ఊర్ధ్వగతి చెందడం వల్ల ఈ క్రింద వుండే ఎంతటి బరువైన విషయాలైనా సరే తేలిక అవుతాయి. మనం సమస్యల్లోకి దిగినకొద్దీ, మన చైతన్యం, బాగా పాదరసం క్రిందకి వచ్చేసినట్లుగా అవటంవల్ల, సమస్య బరువవుతూ వుంటుంది. సమస్య తేలికవ్వాలంటే నీవు దివ్యత్వంలో ఎక్కువ జీవించడం మొదలుపెట్టాలి. భయంకరమైన సమస్యల నుండి పరిష్కారం ఆవిధంగా పొందినట్టుగా మనకు భక్తుల జీవితాల్లో కనిపిస్తూంటుంది. అంత భయంకరమైన సన్నివేశాలు మనకెవ్వరికీ లేవు. నలుడికి వచ్చినవి గానీ, ధర్మరాజుకి వచ్చినవి గానీ, ప్రహ్లాదునికి వచ్చినవి గానీ, అంబరీషునికి వచ్చినవి

గానీ, రాముడికి వచ్చినవి గానీ, సుగ్రీవునికి వచ్చినవి గానీ, విభీషణునికి వచ్చినవి గానీ, భక్తులకు వచ్చిన అంత భయంకరమైన సన్నివేశాలు మనకేమున్నాయ్? మహాఅయితే ఓ అరగంట కాఫీ ఆలస్యం అవుతుంది. అంతకన్నా వుండదు. ఓపూట రుచిగా తిండి దొరక్కపోవచ్చు. మనం అనుకున్నన్ని మార్కులు మన పిల్లలకి రాకపోవచ్చు. మనం అనుకున్నట్లుగా మన పిల్లలు సుఖపడుతూ ఉండకపోవచ్చు. మనం అనుకున్నట్లు promotion రాకపోవచ్చు. వీటివల్ల మనిషి చచ్చిపోయేంత అపాయం ఏమీ లేదు. అవే సమస్యలుగా భావిస్తూ, వాటిలోనే జీవిస్తూ, వాళ్ళ గురించి వీళ్ళ గురించిన అభిప్రాయాల్లో బాగా జీవిస్తున్నావనుకో, నీవు భగవంతుని యందు జీవిస్తున్నట్లు కాదు. భగవంతుని యందు జీవించడం అంటే, నీయందు ఏ భ్రూమధ్యంలోనో, ఏ హృదయంలోనో చక్కటి కాంతిమయమైన ఒక పురుషుణ్ణి దర్శనం చేస్తూ, ధ్యానం చేస్తూ వున్నావనుకో. ఆ కాసేపు మిగతా విషయాలు గుర్తు ఉండవు. తేలిక పడ్తాం. అందుకనే సత్సంగత్వం వల్ల తేలిక పడ్తూ వుంటాము. విష్ణుకథలు వింటూ ఉండడం చేత ఆ కాసేపు మనసు తేలిక పడుతుంది. ప్రసన్నం అవుతూ వుంటుంది. మహాత్ముల్ని దర్శించినపుడు కూడా ఆ విధంగా సమస్యలు గుర్తు లేక, వానియొక్క ప్రజ్ఞాప్రసారం మన యందు బాగా ఉండడం చేత మనసు కాస్త ఊరట చెందుతుంది. ఊరట చెందిన తర్వాత భావములను అదే స్థాయిలో ఉంచుకోవడానికి ప్రయత్నం చేయాలి. అందుకనే ప్రజ్ఞ ఊర్ధ్వముఖంగా మనకి ప్రయాణం చేయాలంటే, భగవత్స్మరణ బాగా జరుగుతూ వుండాలి. స్మరణ యాంత్రికం కాకూడదు. జీవితం యాంత్రికం అవ్వాలి. భగవత్స్మరణలో తానుంటే అప్రయత్నంగా వంట వండేసినట్లు, అందరికీ పెట్టినట్లు అవన్నీ కలగా జరిగిపోవాలి. అంతేగాని మనస్సులో స్మరణ మాత్రం యాంత్రికంగా జరిగి, పనులు యందు మనస్సు వుంటే? నామస్మరణ చేసేవాళ్ళకి స్మరణ యాంత్రికం అయిపోతుంది, పనులు మాత్రం బాగా వుంటాయి మనసులో. నిజంగా భగవంతుని స్మరణ చేసే వాళ్ళకి పని యాంత్రికమయిపోతుంది. అంటే అప్రయత్నంగా జరిగిపోతుంది, తను వాడి స్మరణలో ఉండడంచేత. సక్కుబాయి గోధుమపిండిని అట్లా తిరగలి పట్టేసింది. బస్తాడు గోధుమలు మనకిస్తే, స్మరణ చేస్తూ చేయమంటే, ఇప్పటికయ్యేనా మనకి. ఆవిడకెట్లా అయ్యింది? ఎట్లా అయ్యిందంటే తను పాండురంగని భావంలో అట్లా ఉంటూ, పాటలు పాడుకుంటూ వుంటే, తనకు తెలియకుండానే ఈ చేయి తిరిగిపోవడం, ఆ పిండి వచ్చేయడం, బస్తా గోధుమలు అయిపోవడం అయిపోయింది. భక్తుడికి జీవితం అప్రయత్నంగా జరిగిపోతుంది. మనకి జరగట్లేదుట అంటే మనం ఆ భావంలో లేమని గుర్తుపెట్టుకోవాలి. అంతేకాని భగవంతుని మీద మనకి సంశయం వద్దు. ఉదీర్ణత్వం మనకి బాగా ఏర్పడాలి. ఏర్పడటానికి కేవలం భగవంతుని మీద మనస్సు పెట్టి స్మరించడం చేయాలి. అందుకనే ఈ నామాలు చదవడం. ఓ ఇరవై నిముషాల సేపో, ఓ అర్ధగంట సేపో నామంమీద మనస్సు ఉంచినంతసేపూ, ఆ లోపల ఆ దివ్యమంగళమైన రూపాన్ని దర్శనం చేస్తున్నంతసేపూ నీయొక్క ప్రమేయం లేకుండానే, నీ ప్రయత్నం లేకుండానే నీ చైతన్యం ఊర్ధ్వగతి చెందుతుంది. 'విష్ణునదీ జలము పగిది విమలుల చేయున్' విష్ణుకథా రతుడైన వాడిని, విష్ణుకథలు వింటూ వుండే వాడిని, విష్ణుకథలు చెప్తూ

వుండే వాడిని, విష్ణుకథల గురించి పరిప్రశ్నం చేస్తున్న వాడిని విష్ణునదీ జలములు ఏ విధంగా విమలము చేస్తాయో, విష్ణుపద జలములు అంటే గంగ ఏ విధంగా పవిత్రం చేస్తుందో, ఆ విధంగా పవిత్రీకరిస్తుంది. అంటే పవిత్రీకరణం కోసం మనం చేసే కార్యక్రమం సులభంగా నడిచిపోతుంది. భగవత్స్మరణలో పరిపూర్ణమైన మనస్సు, దానిమీద లగ్నం చేసి చేస్తూ వుంటే. ఆ తత్త్వము నందు రతి కలుగుతుంది. అది ఎలాంటిదంటే ఒక్కసారి బుర్రలోకి వస్తే ఇహ తోచదు. అది పొందేంతవరకు తోచదు. ఒక ప్రియుడికి ఒక ప్రేయసిని పొందేవరకు, ఒక ప్రేయసికి ఒక ప్రియుడు దొరికేంతవరకు వాళ్ళింక ఆ భావం నుంచి చెదరరు కదా ఎన్ని చెప్పినా! పని చేస్తున్నా, అన్నం తింటున్నా, office కి వెళ్తున్నా, కాయితాలు సంతకాలు పెడ్తున్నా ఆవిడ గురించే ఆలోచిస్తూ తప్పు సంతకాలు కూడా పెట్టేస్తాడు. ప్రేయసి గురించి ప్రియుడు ఏ విధం గా ఏకోన్ముఖుడుగా తపన చెందుతాడో, ప్రియుడి గురించి ప్రేయసి ఏకోన్ముఖియై ఏ విధంగా తపన చెందుతుందో అటువంటి రతి మనకి భగవంతుని యందు ఉన్నదా? వుంటే సమస్త వ్యక్తిగత జీవితం కూడా యాంత్రికంగా జరిగిపోతుంది. ఇది సత్యం. వాడి యందు మనం నిలబడటంచేత మనలో బలం పెరుగుతుంది. మన నుండే నిర్వర్తింపబడతాయి. అంతేకాని మనం ఇంట్లో మూడంకేసి పడుకుంటే అందరూ చేసిపెట్టరు. మన నుండే జరుగుతాయి. కానీ అప్రయత్నంగా జరిగిపోతూ వుంటాయి. సక్కుబాయికి ఎవరో వచ్చి విసిరి పెట్టలేదంతాను. ఆవిడే విసిరింది. విసిరినట్టు తెలీదు. నేనే విసిరానా? అన్నట్టుగా వుంటుంది. పోతన భాగవతం ఆయనే రాశాడు. కానీ నేనే రాశానా? అన్నట్టుగా వుంటుంది. హనుమంతుడు సముద్రాన్ని లంఘించాడు. నేనే లంఘించానా? అన్నట్టుగా వుంటుంది. లంఘించింది ఆయనే. ఎందుకనీ? తనయొక్క శక్తి పదింతలవటం, వందింతలవటం, వెయ్యింతలవటం జరుగుతుంది తను దానియందు వుండటంచేత. దానియందు వుండకపోవడం చేత తన శక్తి బాగా సన్నగిల్లుతుంది. మనస్సు సమస్య యందు కేంద్రీకృతమైతే, చైతన్యము అధోగతికి ప్రవహిస్తూ వుంటుంది. అధోగతి చెందిన చైతన్యము పని చేయనే లేదు. ఎంత క్లిష్టమైన కార్యమైనా సరే ఆ స్ఫూర్తితో వున్నప్పుడు నిర్వర్తించుకోవడం జరుగుతుంది. అందుకే 'దుర్గమ కాజ జగతకే జేతే సుగమ అనుగ్రహ తుమ్హారే తేతే' నిన్ను తల్చుకోవడం వల్ల జగత్తులో సాధ్యపడని కార్యములు కూడా చాలా సుగమంగా అయిపోతాయి. ఎందుకవుతాయి? నీలో వచ్చే బలం అలాంటిది. నీలో వికసించే బుద్ధి అలాంటిది. ఆ బుద్ధి వికాసంలో ఏది, ఎప్పుడు, ఎట్లా చెయ్యాలో చక్కగా తెలిసి స్ఫూర్తితో మనస్సు, ఇంద్రియములు, శరీరము యొక్క సహకారము దొరికి పని పూర్తి చేసుకుంటాం అప్రయత్నంగా. బుద్ధిలో నిలబడగానే మనస్సు, శరీరము, ఇంద్రియములు సహకరిస్తాయి. బుద్ధిలో నిలబడకపోతే ఆ మూడూ మాట వినవు. ఒకదాని మాట ఒకటి కూడా వినవు. అందుకని మనకి ప్రతి రోజూసూర్యోదయ సమయంలో ప్రతి రోజూ సూర్యుని కిరణాలు ఊర్ధ్వముఖంగా వస్తున్నట్లుగా కనిపిస్తుంది కదా. ఇంకా సూర్యుడు కనబడలేదు. ఉదయం అయ్యింది. ఆ సమయంలో మొత్తం కిరణాలన్నీ ఆకాశంలోకి అట్లా లేస్తున్నట్లు వుంటుంది. దాన్ని 'ఉదీర్ణః' అంటారు. అందుకనే మనలో కూడా పదార్థంలో, తమస్సులో, నిద్రలో

ఇమిడిపోయిన జీవచైతన్యానికి కూడా మెలకువ వస్తుంది. ఐదున్నరకి కాకపోయినా, ఆరున్నరకో, ఏడింటికో, 12 గంటల లోపు మెలకువ వస్తుంది. ఎందుకంటే పన్నెండు గంటల వరకూ ఉదీర్ణత్వమే. సూర్యుడు నడినెత్తి మీదకు వచ్చేవరకూ కూడా ఉదీర్ణత్వమే. అది కారణం చేతనే దివ్యకార్యాలన్నీ కూడా పన్నెండు గంటల లోపలే చేయాలి. దైవీ కార్యక్రమములన్నీ కూడ ఉదయం పన్నెండు గంటల లోపల అయిపోవాలి. మధ్యాహ్నం పన్నెండు గంటల తర్వాత చేస్తే వాటికి విలువ లేదు. ఎందుకంటే చైతన్యము అక్కడ నుండి నెమ్మదిగా అధోముఖం చెందుతూ వుంటుంది. పన్నెండు గంటల నుంచి రెండు గంటల వరకు పితృదేవతలకి సంబంధించిన కాలం అంటారు. మధ్యాహ్నం పితృదేవతలది, ఉదయమంతా దేవతలది ఇట్లా చెప్పారు. అందుకనే దైవ కార్యాలు ప్రొద్దున్నే చేసుకోవడం మొదలుపెట్టాలి. మన చైతన్యం కూడా మధ్యాహ్నం పన్నెండు గంటల వరకు English లో చెప్పాలంటే rise లో వుంటుంది. కాబట్టి ఉదీర్ణత్వం అనేది మనయందు బాగా వృద్ధి చెందడానికి వినియోగించుకోవలసిన కాలం ఉదయం, ఉత్తరాయణం, శుక్లగతి. శుక్లగతి అంటే అమావాస్య దాటిన పాడ్యమి నుండి పౌర్ణమి వరకు. అలాగే రోజులో ఉదయం నుండి మధ్యాహ్నం వరకు. అలాగే సంవత్సరంలో ఉత్తరాయణకాలం. కాబట్టి ఈ విధంగా మనం ఉదీర్ణత్వాన్ని సాధించుకుంటూ మన భావ పరంపరలు ఎట్లా వున్నాయో చూసుకోవడానికి ఒక record పెట్టుకోవాలి. అందులో మీ గురించి మీరు సత్యంగా ఉండడానికి ప్రయత్నం చేయండి. మళ్ళీ అందులో అబద్ధాలు రాసుకోవద్దు. ఈ రోజున నాకు జీవితంలో ఏ భావాలు వచ్చినాయి? అందులో ఎన్ని అరిషడ్వర్గాలకు సంబంధించినవి వచ్చినాయి? ఎన్ని జీవిత సమస్యల గురించి వచ్చినాయి? ఎన్నిసార్లు భగవంతుడు గుర్తు వచ్చాడు? ఇలాచూస్తే అందులో ఎక్కువ భాగం దివ్యమైన విషయములయందు నీమనసు చరించిందో అంత నీకు ఊర్ధ్వగతి. మిగతా విషయాలయందు కేవలం మన సమస్యల గురించే ఆలోచిస్తుంటే బొడ్డులో వుంటాము. వాళ్ళమీద, వీళ్ళమీద క్రింద వుంటాము. కాబట్టి మనయొక్క భావసముదాయము నుంచి మనని మనం అసభ్యకరమైన భావములు మనకు వస్తున్నాయంటే మనల్ని మనం ఇంకా ఉద్ధరించుకోవాలి. ఉద్ధరించుకోవడానికి ఒకటే మార్గం. సూక్ష్మమైన విషయములయందు మనసు ఆసక్తి చెందియుండాలి. దీపం అందుకే. దీపం వెలుగునిస్తుంది. వెలుగు సూక్ష్మమైన లోకాలకి సంబంధించినది. మనలో ఆ దీపాన్ని చూసి మనం కూడా భ్రూమధ్యంలో అటువంటి వెలుగును చూడటానికి ప్రయత్నం చేయాలి. భ్రూమధ్యం అనేది శ్రీకృష్ణుడు ఎందుకు చెప్పాడంటే అంతవరకు మనం పెరగచ్చు. అందుకని దీపాన్ని చూసి కనులు మూసుకుంటే, ఆ జ్యోతిని అక్కడ దర్శనం చేస్తూ ఎంతసేపు ఉండగల్గితే అంతసేపు ఉండడం. మళ్ళీ పిచ్చి భావాలు వస్తుంటే మళ్ళీ దీపాన్ని చూడడం, మళ్ళీ కళ్ళు మూసుకోవడం. అట్లాకూడా సాధన చేయచ్చు. లేదూ సూర్యోదయాన్ని చూస్తూ ఆ వెలుగును కళ్ళు మూసుకుని ధ్యానం చేసి, మళ్ళీ ఆ వెలుగు కనిపించనపుడు మళ్ళీ చూసి ధ్యానం చేయడం. లేదూ ఆకాశంలో వుండే వెలుగుని చూసి ధ్యానం చేయడం. లేదూ బంగారం కాంతిని చూసి ధ్యానం చేయడం. లేదూ వెండి వెలుగుని చూసి ధ్యానం చేయడం. వజ్రం

వెలుగుని చూసి ధ్యానం చేయడం. మణి వెలుగుని చూసి ధ్యానం చేయడం. కాంతివంతమైన వాటిని చూసి ధ్యానం చేయడం. చాలా మంద్రస్థాయిలో వినబడుతున్న నాదాన్ని వింటూ, దానియందు మనసు లగ్నం చేయడం. అంతర్ముఖంగా లోపల వుండే ఉచ్ఛ్వాస, నిశ్వాసలకు ఆధారభూతమైన స్పందనమునందు మనసు లగ్నం చేయడం. ఎందుకనీ? ఊర్ధ్వం అంటే స్థూలం నుండి సూక్ష్మం కదా! స్థూలంగా మనకి కనిపిస్తున్నది శ్వాస. దానికి సూక్ష్మంగా ఆధారభూతమైనది స్పందనం. ఏదో ఒకటి సూక్ష్మత్వంలోకి ప్రవేశించాలి. అక్కడే దివ్యత్వం అంతాకూడా వుంది. స్థూలంలో చాలా తక్కువ వుంది. తక్కువ గోచరిస్తుంది. మనకి కనిపించే పదార్ధంలో వుండే పరమార్ధం యొక్క కదలిక గమనించండి. మనిషిని చూసినపుడు కళ్ళలోంచి మనకి కనిపిస్తున్న వెలుగును చూడండి. మాట వింటున్నప్పుడు మాటలో భావాలు కాకుండా, లోపలి నుండి వచ్చే వాక్కుని వినండి. మరువు మహర్షి 'వాక్కుని దుర్వినియోగపరచిన వాడు నమ్మక ద్రోహి, అంతకన్నా నమ్మక ద్రోహి ఇంకెవడూ లేడు' అని అన్నారు. ఎందుకంటే వాక్కే భగవంతుని యొక్క అస్తిత్వం మనలో. అది మనలో నాదంగా వుంది. అది ఆధారంగా మనం మాట్లాడుతున్నాం. ఎప్పుడు పిచ్చి మాటలు మాట్లాడినా దాన్ని దుర్వినియోగపరచినట్లే. మంచిమనిషిని చెడ్డపనులకి వాడుకుంటే, వాడికి నమ్మకద్రోహం చేసినట్లు అవుతుంది. వాక్కు నాదంగా మనలో వున్నది కదా! ఓంకారం చేసి దాన్ని వినడానికి ప్రయత్నం చేయండి. ఇట్లా సాధన సూక్ష్మమైన విషయములయందు మనస్సు లగ్నం చేయటంలో వున్నది. స్థూలమైన విషయములయందు  చాలా తక్కువ వున్నది. దేవాలయానికి వెళ్తాము. అక్కడ వుండే దైవాన్ని దర్శనం చేసుకుంటాము. బయటికి వచ్చి కూర్చొని కాసేపు అదే దైవాన్ని నీ మనస్సులో అంటే నీ హృదయంలోనో, నీ ఫాలభాగంలోనో స్మరణ చేసి నిలబడ్డాడేమో చూసుకోండి. అప్పుడు నిజంగానే దేవాలయం లోకి నీవు వెళ్ళి వచ్చినట్టు. కాసేపు కూర్చోమన్నారు కదండీ అంటుంటారు. లేకపోతే కాసేపు కూర్చొని ఆ కొబ్బరిచిప్పలు కొట్టుకొని తినేసి, కూర్చోమనడం ఇందుకే అనుకుని ఆ ప్రసాదం తిని రావడం, అదికాదు. దేవాలయంలోకి వెళ్ళి దైవాన్ని చూసి వచ్చిన తర్వాత కనులు మూసుకుంటే, మళ్ళీ నీ లోపల కనిపించాలి. ఎందుకనీ? అక్కడే ఎక్కువసేపు నిన్ను నిలబడనివ్వరు, ఇంకా మిగతా భక్తులు కూడా ఉంటారు. ఇవతలకి వచ్చిన తర్వాత ఆ రూపాన్ని నీలో నిలుపుకుని, దానియందు నీవు మనసు లగ్నం చేస్తే, నీకు దేవాలయములో దర్శనం చేయడంలో ఒక సార్ధక్యం వున్నది. అలా కాకపోతే ఆ విగ్రహాన్ని చూడడమే పరమావధి అనుకుంటే వీలులేదు. మనసు ఎంత స్థూలంలోకి ప్రవేశించింది? ఎంత దివ్యం లోకి ప్రవేశించింది? ఎంత సూక్ష్మంలోకి ప్రవేశిస్తే, అంత దివ్యత్వంలోకి ప్రవేశించినట్టు. పురుషసూక్తం కూడా అంతే! స్థూలంగా వుండేది ఈ కనిపించేదంతాను. దీనికాధారంగా వుండే సూక్ష్మం అంతా కూడా దివ్యమైనది, అమృతమయమైనది అంటారు. ఈ స్థూలంగా కనిపించే ప్రపంచంలో దీనికన్నా సూక్ష్మంగా వుండేవి రంగులు. కనుక ఎరుపు రంగు, పసుపు రంగు, నీలం రంగు, ఆ రంగు ఈ రంగు వీటన్నిటి కళలు భగవంతుడికి మనం ఏర్పరచుకుంటూ, వాణ్ణి లోపల దర్శనం చేయడానికి ప్రయత్నం చేయడంలో

సూక్ష్మంలోకి ప్రవేశిస్తాం. రంగులు కన్నా వెలుగు ఇంకా సూక్ష్మం. వెలుగు కన్నా నాదం సూక్ష్మం. అట్లా సూక్ష్మలోకాల్లోకి వెళ్ళడానికి చేయవలసిన ప్రయత్నం ఒకటి వుంది. ఏ ప్రయత్నమైనా అందుకు పనికిరావాలి. అంతేకానీ ఈ కార్యక్రమం అవగానే మామూలుగా మన సమస్యల్లోకి జారిపోయిందనుకోండి మనసు, ఎగలాక్కోవాలి ఇందులోకి. ఈ ఎగలాక్కోవడం కోసమే గ్రంథపఠనం పెట్టారు. రోజూ రాత్రి ఒక గంట చదువుకుని పడుకున్నామనుకోండి. ఉత్తమమైన విషయాలు చెప్తారు కదా గ్రంథం లో. భగవంతుడి గురించే చెప్తారు. అది ఎగలాక్కోవడంగా వుంటుంది. మనకి అలవాటు క్రిందకి జారిపోవడం. పైకి తీసుకువచ్చి పెట్టినా అక్కడ కూర్చోలేం. అందుకని ఏం చెప్పారంటే సత్పురుష దర్శనము, సత్సాంగత్యము, సద్గ్రంథపఠనము, స్మరణము, స్తోత్రము. ఇవన్నీ అట్లా దానికి అలవాటు చేయాలి. మనసుకి అదే పెట్టి రాపాడాలి. రాపాడడం చేత కాస్తో కూస్తో దానికి అంటుకుంటుంది కొన్నాళ్ళకి. ఇది బాగా 50% అంటుకోవటం మొదలుపెట్టిన తర్వాత మిగతావి అంటుకోవడం తగ్గుతుంది. లేకపోతే ముందు దీన్ని అంటనివ్వకుండా అవే వచ్చి అంటుచేసేస్తుంటాయి మనల్ని. బాగా అంటయిపోతూంటాం. కనుక అంటులేకుండా ఉండాలంటే ఈ అంటు పెంచుకుంటే, ఆ అంటు తగ్గుతుంది. ఇది bore కొడుతూందనుకోండీ, ఎందుక్కొడుతుందంటే దానియందు ఆసక్తి వుంటే ఇది bore కొడుతూంటుంది. దీనియందు ఆసక్తి వుంటే అది bore కొడుతుంది. ఎటుప్రక్క ఉన్నాం అనేది లెక్క. ఈ విధంగా మనం వెలుగు కిరణములు ప్రసరించే వైపు వెళ్ళాలి.

## 650 సర్వతః చక్షుః

స్థూలంలోంచి సూక్ష్మంలోకి కిరణములు ఆధారంగా వెళ్తూ వుంటే సమస్తమునూ చూడగలిగిన కన్ను దగ్గరికి వెళ్తాము. 'సర్వతశ్చక్షుః' అనే నామం సూర్యుడికి కూడా వుంది. మన సూర్యమండలంలో జరిగే సమస్తమైన కార్యక్రమములకీ తనే ఆధారం. తనే కిరణాలు పంపిస్తూంటాడు. తనే సమస్తాన్ని చూస్తూ ఉంటాడట. అలాగే మనలో కూడా ఒక ఉద్భృతమైన సూర్యస్థానమున్నది. అదే మన మూడవ కన్ను. ఈ వెలుగులు దర్శనం చేసుకుంటూ, సూక్ష్మమునందు జీవించడానికి ప్రయత్నము చేస్తూ, భావాల్ని చాలా పవిత్రంగా, ఉన్నతంగా ఉంచుకోవడం కోసం ప్రయత్నం చేస్తూ వుంటే ప్రజ్ఞ ఊర్ధ్వగతి చెందుతూ వుంటుంది. ఆ చెందడంలో హృదయం కి వస్తుంది. హృదయం దాటి విశుద్ధికి వస్తుంది. విశుద్ధి దాటి అంగిట్లోకి వస్తుంది. అంగిటి దాటి ఇంకా పైకి ముక్కు పైకొన లోకి వస్తుంది. ఈ bridge దగ్గరికి వంతెన దగ్గరికి. అక్కడ నుండి పైకి వెళ్తూ వుంటుంది. పైన వెళ్ళి మూడవ కన్నులోకి ప్రవేశించిందనుకోండి, అది తెరుచుకుందనుకోండి, అదే దివ్యచక్షువు. అదే అర్జునుడికి శ్రీకృష్ణుడు ప్రసాదించింది, విశ్వరూప దర్శనం కోసం. మొత్తం విశ్వాన్నంతా దర్శనం చేసే అనుభూతి కలగడానికి ఒకే ఒక మార్గం దివ్యమైన విషయములయందు మనసు ఆసక్తి చెందియుండుట. స్థూలమైన విషయములయందు కేవలం కర్తవ్యం మేరకి ప్రవేశించుట, త్వరితగతిన వెనక్కి వచ్చి ఇందులో కూర్చొనుట. త్వరగా దాన్ని పూర్తిచేసుకుని ఇందులో వచ్చి కూర్చొనడానికి ప్రయత్నం చేయాలి. అదీ మడి కట్టుకోవడం అంటే. ఆవిధంగా మడిగా వుంటే బావుంటుంది. మనసులో మైలా, బయట మడి బట్ట, ఏమిటి ఉపయోగం? మన మడి, మన ఆచారం ప్రపంచాన్ని మోసం చేయడానికి పనికివస్తుంది. నిజంగా మడి కట్టుకోవడం అంటే దివ్యమైన భావంతో ఉండడం. ఉండి నిర్వర్తిస్తూండడం. అది బాగా పెంచుకుంటూ వెళ్ళాలి. వెళ్తే మనస్సు ఊర్ధ్వగతి చెందుతుంది. ఒకసారి ధ్రువుడు తపస్సు చేసినపుడు అతనికి కలిగిన పరిణామము, Evolution, పృథు చక్రవర్తి తపస్సు చేసి శరీరాన్ని వదిలేసేముందు అతనియందు జరిగిన పరిణామము, అక్షర పరబ్రహ్మ యోగంలో అసలు ఏవిధంగా తను అక్షరుడని తెలుస్తుందో దానికి సంబంధించిన లోపల జరిగే పరిణామములు ఒక్కసారి చదువుకోండి. ఆ విధంగా పరిణామం చెందుతూ వుంటే ఈ మనం చేసే ప్రయత్నానికి అది ఫలశృతి. ఏదైనా అందుకునేందుకు దానికి సార్ధకత వుండాలి. ఇక్కడ పూసుకుని అక్కడ పోయి దులిపేసుకుంటూంటే ఉపయోగం లేదు. మనం వచ్చి ఇక్కడ పూసుకుంటాం. అక్కడ దులిపేసుకుంటూంటాం, తలుపుకు అవతలే. ఎందుకని అట్లా వుందంటే ఇతర విషయములయందు మనసుకి బలం ఎక్కువగా వుంది. దీనియందు బలం తక్కువగా వుంది. దీని బలం పెంచుకోవాలి. దీని బలం పెంచుకోవడం కోసమే ఇవన్నీ పెట్టారు. ఏవీ? సత్పురుష దర్శనము, సత్సాంగత్యము, సద్గ్రంథ పఠనము, స్తోత్ర పఠనము, నామస్మరణము. ఇదంతా దీంట్లో పడి రుబ్బేసుకోవడం కోసం. దానివల్ల మనస్సుకి కాస్తో కూస్తో బాగా

అంటితే, ఇది అంటిన రుచిచేత వాటియందు విముఖత ఏర్పడాలి తప్ప, వాటియందు విముఖత ఏర్పడిన తర్వాత ఇవన్నీ నేర్చుకుందాం అంటే అవదు. Retire అయిన తర్వాత చదువుకుందాం అని పుస్తకాలు పోగేసుకునేవాళ్ళు బోల్డుమంది నాకు తెలుసు. వాళ్ళెవ్వరూ చదవరు. ఎందుకంటే అప్పటికి బాగా వాసనలయందు కూరుకుపోయి వున్న మనస్సు పుస్తకం తీయనివ్వదు. చిన్నతనంలోనే ఈ ఆలోచనలు బాగా వున్నవాడికి వీలుపడుతుంది. అందుకని కర్తవ్యం కాక విశ్రాంతి సమయం ఏ మాత్రం వున్నా దీనియందు ఎక్కువగా వినియోగం చేస్తూ వుండాలి. ఈ విధంగా చేస్తూ ఉండడం వలన ఊర్ధ్వగతి చెందిన చైతన్యము మూడవ కన్నును తెరిపిస్తుంది. అప్పుడు 'సర్వతశ్చక్షుః', సమస్తమును చూడగలిగిన కన్ను కలిగినవాడవవుతావు. తన్ను తాను తెలిసికోవడం అంటే కూడా అదే. తాను ఆత్మ అని తెలిసినప్పుడు, పరమాత్మయందు తాను నిలబడి సమస్తాన్ని దర్శనం చేయగలిగిన స్థితి ఏర్పడుతుంది. అది అర్జునునికి కలగలేదు. కృష్ణుడు అనుగ్రహించాడు. కాబట్టి ఆ తర్వాత మళ్ళీ మామూలుగానే వున్నాడు. మన బోటివాళ్ళకి ఏదో ఇలాంటి మంచిమాటలు వింటున్నప్పుడే కొంచెం బాగుంటుంది. ఇట్లా ఉండచ్చు కదా అనిపిస్తుంది. బయటికి వెళ్ళిన తర్వాత ఒక రోజు వుంటాము, రెండు రోజులుంటాం. మారిపోతూంటాం. మహాత్ముల దర్శనం చేసి వచ్చినపుడు చాలా నిర్ణయాలు తీసుకుంటూ వుంటాము. పుణ్యక్షేత్రాలు వెళ్ళినపుడు చాలా నిర్ణయాలు తీసుకుంటూ వుంటాము. సద్గ్రంథ పఠనం చేసినపుడు చాలా నిర్ణయాలు తీసుకుంటాం. దైనందిన జీవితంలో ప్రవేశించగానే అన్నీ జారిపోతాయి. జారనివ్వకండి. దాన్ని రోజు రోజుకి పెంచుకుంటూ వెళ్ళండి. రజోగుణం చాలా అవసరం సాధనలో, మొదటి ప్రాథమిక దశలో. ఆ రజస్సు కారణంగా ఈ కార్యాలు బాగా పెంచుకుంటూ వుండాలి. ఎంత పెంచుకోవాలంటే తీరిక లేనంత పెంచుకోవాలి. ఇంకో పని దీనిలోకి దూరటానికి వీలులేనంత పెంచుకోవాలి. ఆ ఇదంతా రజస్సండీ, అని మనం తమస్సులో చతికిలపడిపోవటం కాదు. అసలు లేవందే ఆకాశంలోకి ఎలా వెళతావు? పక్షి నేల మీద వుంది. అది ప్రయత్నం చేయాలి. రెక్కలు బాగా ఆడించాలి. బాగా పైకి వెళ్ళాలి. అప్పుడు రెక్కలాడించనక్కరలేదు. కాళ్ళు ముడుచుకోవచ్చు. లేవగానే కాళ్ళు ముడుచుకోవచ్చు. కానీ రెక్కలాడించాలి. రెక్కలెంతవరకాడించాలి? బాగా పైకి వెళ్ళేంతవరకు రెక్కలాడించు. ఆ తర్వాత అక్కడ తేలు. అక్కడ తేలడానికి ప్రయత్నానికేముంది? అక్కడికి వెళ్ళిన తర్వాత రజస్సు కన్నా సత్త్వంలో వుంటాము. అసలు రజస్సు లేనిది సత్త్వంలోకి వెళ్ళకుండా అలావుంటే చతికిలపడి వుంటాము నేలమీద. అందుకని శ్రీకృష్ణుడు తమస్సు కన్నా రజస్సు చాలా గొప్పదని చెప్పాడు. అందుకని దివ్యమైన కార్యక్రమాల్లో వీలున్నంత వరకు, నిన్ను నీవు బంధించుకో. రకరకాలుగా బంధనం వేసుకో. సినిమాకి వెళ్ళడానికంటే దైవ కార్యక్రమాన్ని పెట్టుకుని మనకి అడ్డు రావాలి. అందుకే ఆరింటికి prayer. ఈ CVV గారి prayer వల్ల ఎప్పుడూ మొదటి నుండి cinema చూడలేం అన్నట్టుగా వుంటుంది. ఏ పని చేయాలన్నా ఒక దైవ కార్యక్రమం అడ్డువచ్చి ఆ పని చేయనీయకుండా ఉండాలండీ. కర్తవ్యం తప్ప మిగతా పనులుంటాయే అవి చేయనీకుండా వుండేట్లు నీకు నీవు

అల్లుకున్నావనుకో, అందులో నీవు జీవిస్తున్నావనుకో. TV చూడటానికి కూడా time లేకుండా నువ్వు ఇది చదువుకుంటా రోజూ ఈ time లో, అనుకున్నావనుకో. అక్కడ మరి మంచి కార్యక్రమం వచ్చినా ఇదే చదువుకునేట్టుగా ఒక నియమం పెట్టుకున్నావనుకో, నీకు నీవు పెట్టుకునేవే నియమాలు. ఇంకొకడెవడూ పెట్టడు. పెట్టినా అవి నిలబడవు. అందుకనే కృష్ణుడు భగవద్గీతలో ఆరవ అధ్యాయంలో 'ఆత్మచేతనే ఆత్మని ఉద్ధరించుకోవాలని చెప్తాడు. ఆత్మకి ఆత్మే శత్రువు. ఆత్మకి ఆత్మే మిత్రుడు' అని చెప్తాడు. నీవు ఒకటి మంచి అనుకుంటే, నీలో ఇంకో భాగం ఏడిశావులే ఇదికాదు అది చేద్దాం అంటుంది. అంటే అక్కడ ఆత్మ శత్రువు. అట్లా కాదులే ఇదే చేద్దాం అని అంటే ఆత్మ మిత్రుడు. మిత్రుడవగానే ఉద్ధరించుకోవచ్చు. అందుకని నీలోనే నీవు ముక్కలు ముక్కలుగా పడి  వున్నావని చెప్తాడు. ఆరు ముక్కలై పోయావు. ముక్కలు చెక్కలు అయిపోయావు. ఒకదానికొకటి జోడించుకోవాలి. దారానికెక్కించాలి పూసలన్నీ అంటాడు. 'సూత్రే మణి గణా ఇవ' అంటే అర్థం ఇది. ఆరు పూసలండీ. నీవు ఏడోవాడివి. నీవు దారానివి. ఈ పూసలన్నీ వేటికి వాటికి విడిపోయినాయి. అయితే మాల ఎట్లా అవుతుంది? ఒక్కొక్కటి దారానికెక్కించుకోవాలి. ఇవన్నీ ధ్యానయోగంలో చెప్పాడు. అలా మనం ఊర్ధ్వగతి చెందుతూ వుంటే ఆజ్ఞలోకి రావడానికి వీలుపడుతుంది. ఆజ్ఞలోకి వచ్చిన వాడికి ధారణ అనే స్థితి ఏర్పడుతుంది యోగంలో. కేవలం ఎప్పుడూ భగవద్భావనలో వుండే వాడికి ఈ యోగం అంతా కూడా అప్రయత్నంగా జరిగిపోతుంది. అదీ భాగవతంలో గొప్పతనం. అష్టాంగయోగంలో దీన్ని శాస్త్రపరంగా సాధన చేస్తారు. భాగవతంలో అనుభూతి పరంగా మధురంగా జరిగిపోతూంటుంది. అందుకని 'జీవితం అప్రయత్నంగా జరుగుతుందబ్బాయ్, నీవు దీనియందు నిలబడు' అని చెప్తుంది ఉపనిషత్తు. శరీరం మీద వెంట్రుకలు మొలిచినంత అప్రయత్నంగాను, సాలెపురుగు నోట్లోంచి ఏ విధంగా దారాలు బయటికివచ్చి సాలెగూడు ఎంత అప్రయత్నంగా ఏర్పడుతుందో, అంత అప్రయత్నంగాను, నీవు నడుస్తూ వుంటే నీవెంట నీడ ఏ విధంగా నడిచివస్తుందో అంత అప్రయత్నంగాను జరిగిపోయే జీవితానికి నీవు ఇంత ప్రయత్నంలో పడ్డావే? ఎందుకు పడ్డావ్? దీని మహిమ తెలీక! దీని బలం తెలీక! అదీ భగవద్భక్తుని యొక్క బలం. అందుకని దీనికెక్కువ ఉన్ముఖత్వం చెందుతూంటే అక్కడికి చేరతాం.

## 651 అనీశః

అనీశః అంటే ఈశ్వరుడు లేడట ఇంక వాడికి. వాడే. He is the Master. అంతవరకు నీకు ఇంకో Master వుంటాడు. అప్పట్నుండి నీవే Master. వాడంతే. అసలు తత్త్వం కూడా Master. అదే కదా మొత్తానికి. ఆయనకి ఇంకో ఈశ్వరుడు లేడు. శిష్యుడు గురువయ్యాడంటే బంధం నుండి విమోచనం చెందిన జీవుడివి అని. ఆత్మస్వరూపాన్ని తెలుసుకున్న వాడివీ, నిన్ను నీవు తెలుసుకున్న వాడివీ అవడం చేత అప్పట్నుండి నీ నుండే ఆ సమస్తమూ వ్యక్తమవుతూ వుంటే, నీవు నిర్వర్తిస్తూ వుంటావు. అప్పుడు అనీశత్వం వస్తుంది. భగవంతుడు తప్ప ఇంక ఈ ప్రపంచంలో ఎవ్వరికీ తల వంచవలసినట్టి అవసరం రాదు. సమస్తమునకు అతనొకడే! అతడికి అనుంగు పుత్రుడవు నీవు. కాబట్టి ఈ సృష్టిలో నీవు దేనికీ తల వంచాల్సిన అవసరం రాదు. అందుకనే నేను రాజాధిరాజును అని చెప్తాడు ఏసుక్రీస్తు. నీవు రాజైతే నేను రాజులకు రాజునురా, అని చెప్తాడు. ఎందుకని రాజులకు రాజు? ఈ మూడు లోకాల్లో అతడికి కావల్సింది ఏం లేదు. మనకి బోల్డు వున్నాయ్. కావల్సింది లేనివాడే రాజు. తెలుసా? కావాలి అని వుంటే రాజు కూడా బానిసే. దేన్ని కోరుకుంటున్నాడో దానికి బానిస. గంగాదేవిని కోరుకోవడం వల్ల శంతనుడు బానిసయ్యాడు, ఆవిడేం చెప్తే అది చేయాల్సివచ్చింది. కోరిక వలన బానిసత్వం వస్తుంది మనిషికి. దైవమునందు నిలబడడం చేత, కోరికల లేమి అనే స్థితి కలిగియుండడం చేత ఈశ్వరత్వం వస్తుంది. ఆ విధంగా మనకి అనీశత్వము. వాడి పక్క వీడి పక్క చూడడం, వాడి దగ్గరికెళ్ళి తెలుసుకుందాం, వీడి దగ్గరకెళ్ళి తెలుసుకుందాం, ఇంకోడ్ని అడుగుదామా? ఇంకేమీ వుండదు. అది మాస్టర్ CVV గారు, అలాగే ప్రతీ రాజయోగీ చెప్పేది ఒకటే. పెట్టే చెయ్యిగా ఉంచు వీలున్నంతవరకు. పుచ్చుకునే చెయ్యిగా ఉంచక. నీవు పెడుతూ వుంటే నీకు వస్తూ వుంటాయి. ఉన్నంతలోనే నీవు తినే దాంట్లోనే ఇంకోడికి ముద్ద పెట్టు. అసలు పెట్టలేకపోవడానికి లేదండీ. ఏదో ఒకటి వుంటుంది. పెట్టాలనే బుద్ధి వుండాలి తప్ప. కుచేలుడు ఎంత చక్కటి ఉదాహరణ మనకి. మనింట్లో ఏముంది గనక ఆయన దగ్గరికి వెళ్ళేప్పుడు ఇవ్వడానికి అనుకున్నాడా? ఏదో ఒకటి వుంటుంది లేవే చూడమని చెప్పాడు. ఏదో ఒకటి వుంటుంది పెట్టడానికి. పెట్టాలనే బుద్ధి వుండే వాళ్ళకి పెట్టడానికి బోలెడు కనిపిస్తాయి. ఆ బుద్ధే లేకపోతే పెట్టేది లేదు. పెట్టినకొద్దీ పెరుగుతారు. గుర్తు పెట్టుకోండి. పెట్టినకొద్దీ విసర్జించడమే కదండీ పదార్థాన్ని. ఎంత పదార్థాన్ని విసర్జిస్తే అంత తేలిక అవుతాడండీ మనిషి. దానం ఇచ్చేవాడు ఒకరకంగా అలా స్వార్థపరుడు. దానం పుచ్చుకునేవాడు, దానం ఇచ్చేవాణ్ణి ఒక రకంగా అనుగ్రహిస్తున్నాడు. దానం పుచ్చుకునేవాడు భగవంతుడే అని భావన చేయమనేది అందుకు. వాడు పుచ్చుకోకపోతే వీడు ఇచ్చేదేముంది? అదికదా బలిచక్రవర్తి కథ. నేను పుచ్చుకోను, నాకెందుకు అన్నాడు వామనుడు. అట్లా ఎక్కడా జరగలేదు. మామూలుగా ఇస్తానంటే చేటంత మొహం చేసుకుని పుచ్చుకుంటూ ఉండడమే. ఆయన పుచ్చుకోలేదు. పుచ్చుకోకపోతే ఎట్లా వుంటుంది అని కథ

చూపించాడు. పుచ్చుకోకపోతే ఇచ్చేవాడికి పెంపెక్కడ వుంది? లేదు. ఇస్తున్నకొద్దీ ఈశ్వరుడవవుతావు. స్వామిత్వం చెందడమే ఈశ్వరత్వం. ఆజ్ఞకి చేరుకున్న వాడి జీవితానికొక స్వామిత్వం వస్తుంది. దాన్ని చక్కగా నిర్వర్తించగలుగుతాడు. అంతర్యామితత్త్వంతో లేక పరమాత్మతత్త్వంతో లేక విశ్వాత్మ చైతన్యంతో అనుసంధానం చెంది జీవించి వుండేవాడు మాత్రమే ఆజ్ఞయందు నిలబడియుంటాడు. ఆజ్ఞ అని ఎందుకు పేరొచ్చిందంటే తనయొక్క బుద్ధి, మనస్సు, ఇంద్రియములు, శరీరము వీటిని తను ఆజ్ఞాపించగలడు. బయట పరిసరములు అతడిని ఆజ్ఞాపించలేవు. ఏవీ అతడిని ఆకర్షించలేవు. అతడే సమస్తాన్ని ఆకర్షించగలడు. చుట్టూ వుండే సన్నివేశాలు అతడిని ప్రభావితం చెయ్యవు. అతడు ప్రభావితం చేస్తూ వుంటాడు. మరి ఆయన ఈశ్వరుడి క్రింద లెక్క. అంటే ఇహ వాడు ఇంకొకడి కాళ్ళు పట్టుకునే పరిస్థితి రాదు. అది అనీశత్వం. భగవంతుడికి ఇంకో ఈశ్వరుడు లేడని చెప్పనే అక్కరలేదు. శ్రీకృష్ణుడు అట్లా చూపించాడు. ఎవర్నీ ఏమీ అడగలేదు కదా కృష్ణుడు! 'సర్వతశ్చక్షుః' నువ్వు అని చెప్పాడు భీష్ముడు. నీవు చూడలేనిదేమీ లేదు. సమస్తమూ చూస్తున్నావ్ అని గమనించాడు. ఎక్కడో ఉండి వస్త్రాపహరణ సమయంలో రక్షించాడు. ఎక్కడో ఉండి పిలిస్తే గిన్నెలో ఆహారాన్ని పెంచాడు. తన చావు గురించి రకరకాలుగా తనే ఆలోచించి పని పూర్తి చేశాడు. సైంధవుణ్ణి కొట్టినప్పుడు కృష్ణుడు ఆ తలకాయ వెళ్ళి వాళ్ళ నాన్న ఒళ్ళో పడేట్టుగా కొట్టాలని చెప్పకపోతే ఏమవుతుంది? అర్జునుడి బుర్ర వెంటనే ఒక లక్ష్మీ బాంబులాగా పేలిపోయేది. ఎంత చూడగలిగితే అలా చెప్పాడు కృష్ణుడు? సైంధవుణ్ణి చంపానని సంతోషపడడానికి వీలులేదు. వాడి తల నేలకి తగలగానే, అర్జునుడి తల ఢాం అని పేలుతుంది బాంబు పెట్టినట్టు. మరి ఎంత చూడగలిగితే అర్జునుని రక్షించగలిగాడు. సర్వతశ్చక్షుః నామం కృష్ణుడికొక్కడికే చెల్లింది భూమిమీద. ఈ సన్నివేశాలన్నీ చూస్తే ఎక్కడ్నుండిచి ఎక్కడకైనా చూసేయగలడు. ఏదైనా చూసేయగలడు. ఎలా వీలు పడ్డది? అందుకనే నువ్వే ఈశ్వరుడివి అని చెప్పాడు. అట్లా చాలాసార్లు చూపించాడు శ్రీకృష్ణుడు. అందుకనే పూర్ణపురుషుడు, పురాణ పురుషుడు.

## 652, 653 శాశ్వతః, స్థిరః

అనీశత్వం కలిగిన వాడు అంటే Master అయిన వాడు శాశ్వతుడై వుంటాడు. సృష్టి వున్నంతకాలం సృష్టికార్యంలో తనదైన కర్తవ్యాన్ని నిర్వర్తిస్తూ, దైవమునకు వాహికగా చిరంజీవియై నిలచియుంటాడు. అది శాశ్వతత్త్వం. దానికి కావలసిన సాధన ఎలా అనేది మనం మళ్ళీ ఒక్కసారి గుర్తు తెచ్చుకోవచ్చు. ఇవన్నీ ఎక్కడ నుండి మొదలైనాయి? ఉన్నతమైన భావములు మనస్సు యందు బాగా కలిగించాలి. జ్వాలాకూలుడు కనిపించి నపుడు ఒకాయన 'మీరు ఇన్ని మంచి విషయాలు చెప్పారు. మాకేంటి ఎప్పుడూ ఇవే గుర్తొస్తూ వుంటాయి. గుర్తొస్తే ఫరవాలేదు అవి రుచిగా కూడా వుంటాయి' అన్నాడు. వుంటాయి కదా మనకి. ఉండవా? నిజం చెప్పండి. వుంటాయి, వుంటే, జ్వాలాకూలుడు 'సహజంలే' అన్నాడు. 'అదేంటి సార్ సహజం అన్నారు. ఇట్లా వుంటే మంచిదని చెప్పారు. అది సహజం అంటారు' అంటే, 'సహజమేనయ్యా అది. ఎలా సహజమంటే, పందికి అశుద్ధం రుచి కాదూ!' అన్నాడు. అంటే ఏమన్నట్టు ఆయన మనల్ని. పందికి అశుద్ధం ఎట్లా రుచో, కలుషితమైన మనసుకి అశుద్ధమైన విషయములయందు అంత రుచిగా వుంటుంది. 'సత్యమే నువ్వు గమనించింది. నీ పరిస్థితి అది. మురికి గుంటే బాగుంటుంది. కానీ పందులు కూడా దైవ సామ్రాజ్యంలో భాగంగానే వున్నాయి కదా' అన్నాడు. పందియందు కూడా భగవంతుడు వున్నాడు అని చెప్పాడటండీ. విన్నవాడు వినగలిగినవాడు కాబట్టి ఆయన చెప్పాడట్లా. లేకపోతే చెప్పలేడు. లేకపోతే నీవు పందివి అంటే ఎవడొప్పుకుంటాడండీ ఈ రోజుల్లో. పండితుడంటే కాకపోయినా అనుకుంటాడు అవునని. పందే, పండితుడంటే సంతోషిస్తాడు. పందిని పంది అంటే ఒప్పుకోదు, పందివి నీవంటే నిజమేనన్నాడు వాడు. అంటే పరమగురువు ఏం చెప్పాడంటే 'పందిలో కూడా పరమాత్మ వున్నాడులే. నేను చెప్పినట్లు సాధన చేస్తూండు. కేవలం continuous గా అదే సాధన చేస్తూండడం వలన మురికిగుంట లోంచి బయటికి రావాలే తప్ప ఇంకో పద్ధతి లో మురికిగుంట లోంచి బయటికి రాలేవని' చెప్పాడు. బయటకి వచ్చి ఇందులో పడే వాడు ఇందులో శాశ్వతంగా వుంటాడు. అందులో వుండే వాడు అందులో శాశ్వతంగా వుంటాడు. వీడూ ఇక్కడ స్థిరంగా ఉంటున్నాడు. వాడు అక్కడ స్థిరంగా ఉంటున్నాడు. శాశ్వత స్థిరః. అందుకని స్వామిత్వం సంపాదించుకోవడానికి నాలుగు నామాలు ఇచ్చారండీ. ఉదీర్ణః, సర్వతశ్చక్షుః, అనీశః, శాశ్వతస్థిరః. ఇప్పుడు మనమెరిగిన పరమగురువులందరూ ఆ విధమైన చిరంజీవిత్వం సంపాదించుకుని, శాశ్వతులై భగవంతుని యొక్క తత్త్వానికి ప్రతీకలుగా భూమిమీద నిలబడియున్నారు. వాళ్ళు స్థితప్రజ్ఞత కలిగియున్న వాళ్ళు. సన్నివేశాలు వాళ్ళని కుదుపలేవు. సన్నివేశాల్ని వాళ్ళ యొక్క శక్తి, సామర్థ్యము, భగవదనుగ్రహం చేత వాటిని వీలున్నంతవరకు సమన్వయపరచి, ప్రశాంతత ఏర్పరచడానికి ప్రయత్నం చేస్తున్నవాళ్ళు వాళ్ళు. ఇహ భగవంతుని స్థితప్రజ్ఞత్వం చెప్పవలసిందేముంది? భగవద్భక్తులే స్థిరత్వం ఇస్తున్నప్పుడు, భగవంతుడు స్థిరత్వం ఇస్తాడు అని చెప్పకోవాలేంటి? అట్లా స్థిరత్వం

ఇచ్చాడు కృష్ణుడు బోలెడు మందికి. నీవు శాశ్వతుడవు. నీకన్నా ఈశ్వరుడు లేడు. ఎక్కడా దణ్ణం పెట్టిన సందర్భాలేమీలేవు. అనీశుడవు, శాశ్వతుడవు, స్థిరుడవు. ఎప్పుడూ వుంటావు నీవు. స్థిరంగా వుంటావు. ఇట్లా గమనించాడు భీష్ముడు, కృష్ణుడిలో. సాధకుడు ప్రతి మహాత్మునిలోనూ అట్లా గమనించొచ్చు. కేవలం గమనించి వాడి గురించి చెప్పకోవడమే కాకుండా అట్లా మనం కూడా అవాలనే ప్రయత్నం వుండాలి. ఎందుకంటే  అవగలిగినంత శక్తి లోపల బీజప్రాయంగా ప్రతివానిలోనూ వున్నది. వాడిలోనే వుంది, మనలో లేదు. వాడు కారణజన్ముడు. వాడట్నుంచి వచ్చాడు, మనం ఇట్నుంచి వెళ్తాము. ఇవన్నీ కబుర్లే. అందరము అట్నుండి వచ్చినవాళ్ళమే. అట్నుండి ఇటొచ్చి ఇట్నుండి ఏం చేశామనే దాన్నిబట్టి, శరీరం బరువెక్కిందా, తేలికగా ఉందా అనేది లెక్క. కనుక భావాలు బరువెక్కిపోయినకొద్దీ వాటియందు విముఖత కూడా వస్తుంది. మనం చూడండి, కొన్నాళ్ళు ఈ యోగం Master చెప్పిన పద్ధతిలో చేస్తుంటే విముఖత వస్తుంది. విసుగు పుడుతుంది. Bore కొడుతుంది. వెయ్యదా? తప్పించుకు తిరుగుతూ వుంటాము. ఎందుకంటే బాగా బండ విషయాలయందు ఆసక్తి పెరిగి ఉండడం చేత, శరీరంలో వుండే అణువులన్నీ బాగా పదార్థము చేత బరువెక్కడం చేత, density of the cells of the body బాగా పెరగడం చేత ఉత్తమమైన విషయములయందు విముఖత్వం వస్తుంది. అటు తిరిగినవాడికి వాటియందు వుండే రక్తిచేత, మామూలుగా సామాన్యుల్ని ఆకర్షించే విషయాలయందు వీడికి ఆసక్తి వుండదు. వాడట్లా వుంటాడు. వీడిట్లా వుంటాడు. వాడికది సత్యం. వీడికిది సత్యం. ఎటుపోతున్నాం మనం అనేది చూసుకోవడానికి పనికివస్తుంది. ఈ స్థిరత్వం వరకు, శాశ్వతత్త్వం వరకు, Master వరకు వెళ్లే నామం.

## 654 భూశయః

అంటే భూమియందు శయనించినవాడు. పదార్థము నందు ప్రజ్ఞ నిబిడీకృతమై ఉన్నది. అంతర్గతమై ఉన్నది. మనకి పదార్థమే ఎక్కువ గోచరిస్తూ ఉంటుంది. దాని లోపల అస్తిత్వం కలిగిన ప్రజ్ఞను గుర్తించడము తక్కువగా జరుగుతుంది. ఋషి దృష్టి కలిగినవాడు పదార్థమందలి ప్రజ్ఞను దర్శనం చేస్తూ ఉంటాడు. భగవంతుడు దక్షిణాయనంలో భూశయనం చేస్తూ ఉంటాడు. ఉత్తరాయనంలో ఆకాశంలో ఉంటాడు. సంవత్సర చక్రంలో మనకు జరిగే ఈ ఉత్తర, దక్షిణాయనములు నారాయణములు అంటారు. అంటే కొంత భాగము ఊర్ధ్వగతికి చెందుతూ ఉంటే కొంత సమయము మళ్లీ అధోగతికి వస్తున్నట్టుగా ఒక చక్రభ్రమణము జరుగుతూ ఉంటుంది. అందుకని కొంత ఉన్నతమైన భావములు, ఆ తరువాత కొంత సామాన్యమైన భావములు ఇట్లా కొంత మనకు హెచ్చు తక్కువలు కలుగుతూ వుంటుంది. సృష్టిలో హానివృద్ధులు బాగా వుంటాయి. సృష్టిలో వున్నాయి కాబట్టి, సృష్టి జీవులకు ఉంటాయి. గ్రహాదులకు ఉంటాయి. గోళాలకు ఉంటాయి. అంతర్యామితత్త్వం లో నిలబడని వారందరికీ కూడా హాని వృద్ధులు ఉంటాయి. అంతర్యామి తత్త్వమునందు నిలబడిన వారు హాని వృద్ధి అనే వలయము నుండి బయటకు వచ్చి, సమస్తము దర్శనము చేస్తూ, అనుభూతి చెందుతూ ఉంటారు. భూశయడు అని భగవంతుని గురించి చెప్పడంలో రకరకములైన భావములు అవగాహన చేసుకోడానికి అవకాశం ఉన్నది. స్థూలంగా భూమియందు శయనించినవాడు అని అర్థం. అంటే పదార్థము నందు అంతర్హితంగా ఉన్నవాడు. భూశయడు అంటే ప్రతి సంవత్సరము మనకి వర్ష ఋతువు రాంగానే భగవత్తత్త్వము భూమికి దిగి వస్తుంది. అందుకని వర్షఋతువుని సాయంకాలంగా చెప్తారు. భూమికి దిగివచ్చిన సూర్యుడు అధోముఖంగా దిగివస్తాడు కాబట్టి మనకు అలా గోచరిస్తుంది. ప్రతి సాయంకాలం అదే జరుగుతుంది. ప్రతి కర్కాటక సంక్రమణం అప్పుడు అదే జరుగుతూ ఉంటుంది. అందుకని భగవంతుడు భూమికి దిగివచ్చినట్టుగా మనకి రకరకాల వ్రతాలు, భూమియందు శయనించినట్టుగా అనంతపద్మనాభస్వామి వ్రతం ఇటువంటివన్ని దక్షిణాయణంలో వస్తాయి. దక్షిణాయణంలో వచ్చే వ్రతాలు అన్నీ కూడా భగవంతుడు భూమియందు శయనిస్తున్న వ్రతాలుగా ఉంటాయి. అంటే దక్షిణాయణంలో పదార్థములో పరమాత్మ ఇమిడి ఉన్నాడు. ఉత్తరాయణంలో పరమాత్మలో పదార్థము ఇమిడి ఉన్నది. ఆకాశాన్ని చూస్తే ఆ వెలుగులో పదార్థం ఉన్నది. కానీ పదార్థము గోచరించదు, ఎందుకు అంటే అంత సూక్ష్మంగా ఉన్నది. ప్రజ్ఞ యందు అంతర్హితంగా ఉంటుంది. భూమియందు ప్రజ్ఞ అంతర్హితంగా ఉంటుంది. అంటే ఆయనలో ఆవిడ ఉండేది ఆకాశం. ఆవిడలో ఆయన ఉండడం అనేది భూమి. ఈ మధ్య స్థితులన్ని కూడా లోకాలుగా మనకు గోచరిస్తుంటాయి. సత్యలోకం నుంచి భూలోకం వరకు ఉండే సమస్త లోకాలన్నీ కూడా ఆయనలో నుండి ఆవిడ ఉద్భవించి ఆవిడ బాగా తిరుగుతూ ఉంటే, ఆవిడ లోకి ఆయన ఇమిడి పోతూ వస్తూ ఉంటే, చివరికి ఆవిడే

కనిపించి ఆయన కనిపించని స్థితి. సువర్లోకము అంటే ప్రకృతియే కనిపిస్తుంది దాని యందు అంతర్హితమైన పురుషుడు గమనికకు రాడు. సత్యలోకం యొక్క స్థితి ఏమిటి అంటే ప్రజ్ఞయే కనిపిస్తుంది అందులో అంతర్హితమైన ప్రకృతి కనిపించదు. ఆకాశంలో కూడా పదార్థము సూక్ష్మంగా ఉన్నది. అందుకని ప్రకృతి పురుషులు ఇద్దరు అయినప్పటికీ ఒకరే ఉన్న పరిస్థితి లేదు. అలా మనం అనుకుంటూ ఉంటాం. కానీ ప్రకృతి కనపడకుండా వెలుగే కనిపిస్తుంది అని మనం అనుకుంటే అసలు వెలుగు ప్రకృతే! చోటులో కూడా చాలా సూక్ష్మాతి సూక్ష్మమైన రూపంలో ప్రకృతి ఉన్నది. అలాగే స్థూలమైన పదార్థములు చూసినప్పుడు మనకి వాటిలో భగవంతుడు ఉన్నట్లు మనకు గుర్తుండదు. అలా గుర్తున్నవాళ్ళే భాగవతంలో చెప్పబడిన వారు. ప్రహ్లాదుడు ఇటువంటి వాళ్ళందరూ, 'అన్ని రూపాలలో కూడా భగవంతుడే ఇమిడి ఉండడం చేత ఆ రూపం ఆ విధంగా ఉన్నదనే భావన' వాళ్ళకి స్థిరపడిన వారు. అంటే పదార్థము అనే తొడుగుకు వెనకాల ఉన్న ప్రజ్ఞను గమనిస్తూ ఉండేవాళ్ళు. అంటే పదార్థములో పరమార్థాన్ని గమనిస్తూ ఉండటం అనేది సాధన బాగా చేయాలి అంటే భూశయుడు అనే నామం. మనకి భూశయనత్వం ఎంత వరకు ఉంటుంది అంటే దక్షిణాయనంలో, కర్కాటక మాసంలో మొదలయి దాదాపు ధనుర్మాసం వరకు ఉంటుంది. మళ్ళీ మకర సంక్రాంతి రాగానే భూమి మీద నుండి లేస్తుంటారు. దాన్ని ఉత్తరాయణం అన్నారు. ఎందుకు అన్నారు అంటే అది ఉదయం కాబట్టి. అంటే మనం తూర్పున భూమి ఆకాశం కలిసిన చోటు నుండి చూస్తే అక్కడ సూర్యుడు ఉదయిస్తున్నట్టుగా ఉంటుంది. అది జరిగేది మనకి మకర మాసం అంటారు. ప్రతిరోజూ ఉదయం మకర మాసమే. మకర మాసంలో ఉదయం చాలా ముఖ్యం. ఆ విధంగా మకరమాసంలో తెల్లవారుజామునే లేచి సూర్యుడు ఉదయించే సమయంలో అద్భుతమైన సాధన మనకు పెద్దలు ఇచ్చినవి ఉన్నాయి. అది Spiritual Astrology అనే పుస్తకంలో మాస్టర్ గారు ఇచ్చారు. మనం కూడా ఒక Five Pointed Star లాగా నిలబడి సూర్యుడు ఉదయించే సమయంలో ఓంకారం చేయడమో, గాయత్రి మంత్రము చేయడమో, ఆ వెలుగుని మనలోనికి ఆవాహన చేసుకోవడమో చేసినట్లయితే, మన పంచేంద్రియములు, ఐదు కర్మేంద్రియములు, మనస్సు సమస్తము క్షాళనం జరిగిపోతుందని చెప్పారు ఆ నెలలో. అది మనకి భూమి నుండి ప్రజ్ఞ బయటికి తరలివస్తున్న సమయం, ఏది? ఉదయం. అందుకని నిద్ర నుండి/ తమస్సు నుండి జీవులు బయటకు వస్తుంటారు. అలాగే సాయంకాలం ప్రజ్ఞ పదార్థంలోకి వెళ్ళిపోతున్నట్టుగా, సూర్యుడు ఆకాశంలో నుండి భూమి అడుగులోకి వెళ్తున్నట్టుగా మనకి భావన. దాన్నిబట్టి సాయంకాలము పూట నీవు అంతర్హితుడువై ఉంటావు తప్ప లేకపోలేదు అని తెలుసుకోవడానికి ధ్యానం. ఆ విధంగా మన పెద్దలు మనకి రకరకములైన క్రతువులు, వ్రతాలు, హోమము లు ఇచ్చారు. సంవత్సర చక్రంలో మనకి దక్షిణాయనం అంతా భగవంతుడు భూశయుడే. కాబట్టి భూమియందు ఉన్న ఆ ప్రజ్ఞను ఆ విధముగా దర్శనము చేసుకోవడం అనేది చేయగలిగితే, అంతర్హితముగా ఉన్నదాన్ని చూడగలిగినప్పుడు, అది బహిర్హితముగా బాగా వ్యక్తమైనప్పుడు ఇంకా సులభంగా చూడడానికి అవకాశం ఉన్నది. అందుకని భాగవతపరంగా మనకు సాధనలో మొదట ఇచ్చేది

విష్ణు ఉపాసన. అంటే రూపాన్నే భగవంతునిగా దర్శించమని చెప్తారు. కారణం ఏమిటంటే ఆ విధంగా దర్శనం చేస్తూ వుంటే పదార్థం యొక్క తొడుగును దాటి లోపల వున్న ప్రజ్ఞను చూడడానికి అవకాశం ఉన్నది. తర్వాత ప్రత్యేకించి భగవంతుని భూశయడు అని ఎందుకన్నారు అంటే రామావతారమందు భూమియందు పరుండిన సందర్భం ఉన్నది. 14 సంవత్సరములు అరణ్యవాసము చేసినప్పుడు రాముడు భూమియందు శయనించాడు. ఆ కారణంగా కూడా భూశయనుడు. భూమియందు తాను అంతర్హితంగా ఉండడం చేత భూశయడు. భూశయడు అవుతుంటాడు, అప్పుడప్పుడు ఆకాశ శయనుడు కూడా అవుతుంటాడు. కాబట్టి ఈ తత్త్వాన్ని మనం అవగాహన చేసుకోవడంలో ముఖ్యంగా పదార్థాన్ని చూసినప్పుడు, దాని లోపల ఉన్న పరమార్థాన్ని ఎరిగినట్లయితే ఇది కేవలం మట్టికుండగా కనిపించకుండా, అందులో కూడా ఉన్నాడు అనే భావం ఏర్పడుతుంది. ఏది చూసినా అందులో ఆ తత్త్వం ఉన్నది అనే భావం ఏర్పరుచుకోవడం కోసం ఈ భూశయ నామం బాగా వినియోగించుకోవచ్చు.

## 655 భూషణః

అంటే అదే భూమియందు అంతర్హితంగా ఉన్నవాడు అందులోంచి కాస్త మళ్ళీ మెరుస్తూ కనిపిస్తాడు. మట్టి glass ఉంది అనుకోండి, వెండి గ్లాసు ఉంది అనుకోండి. మట్టి glass కన్నా వెండి glass లో మెరుగు వస్తుంది. మట్టి glass అయితే తాగి పారేస్తాం. వెండి glass అయితే జాగ్రత్తగా చంకలో పెట్టుకుని తెచ్చేసుకుంటాం. ఏం తేడా? మనకి లౌకికమైన విలువలు ఒకటి. అది కాక దీనిలో ఈ విలువ ఆ విధంగా ఎందుకు వచ్చింది? ఇందులో ప్రజ్ఞ ఇంకొంచెం బహిర్గతంగా ఉంది. వ్యక్తమై ఉన్నది. అందుకని బంగారం లోను, వెండి లోను, విలువైన నవరత్నాలు యందు మనం ఎందుకు ఎక్కువ మోజు కలిగి ఉంటాము? దాని యందు భగవంతుడు మెరుస్తూ ఉన్నాడు. భూషణాలు అంటే మెరిసేవి అని అర్థం. అవి మెరియడం వల్ల మనలో కూడా ఈ రక్త మాంసాదులతో చేయబడిన శరీరం లోపల కూడా ఆ మెరుపుకు సంబంధించినది ఉన్నది కాబట్టి, బయట మెరుస్తున్న దానియందు సహజంగా ఆసక్తి కలుగుతుంది. ఏదన్నా శుభ్రంగా తళతళా తోమినదానికి, తోమకుండా చిలుము పట్టిన దానికి  ఈ రెండు దగ్గర పెడితే మనిషికి సహజంగా ఏది ఎక్కువ నచ్చుతుంది? తోమినది ఎక్కువ నచ్చుతుంది. మురికిగా ఉన్న ఇల్లు ఉన్నది, కళకళలాడుతున్న ఇల్లు ఉన్నది. సహజంగా ఏది ఎక్కువ నచ్చుతుంది? శుభ్రంగా ఉన్న ఇల్లే ఎక్కువ నచ్చుతుంది. ఇది భగవంతుని యొక్క భూషణత్వము. అంటే అంత బొత్తిగా అట్టడుగున అంతర్హితుడై రహస్యంగా, ఎవరికీ అందకుండా, అందులో ఉన్నాడు అని తెలియకున్న స్థితి నుంచి కొంత వ్యక్తమైన స్థితి పదార్థములో. అందుకే మనకు ఏం జరుగుతుంది అంటే ఏ వస్తువులో అయితే కాస్త కళ, కాంతి ఎక్కువ ఉంటాయో ఆ వస్తువు యందు ఆసక్తి కలుగుతుంది. వస్తువే కాదు, జంతువుల యందు కూడా అంతే. జంతువులే కాదు వృక్షముల యందు కూడా అంతే. వృక్షములే కాదు ఫలముల యందు కూడా అంతే. పుష్పముల యందు కూడా అంతే. మనుషుల యందు కూడా అంతే. కొన్ని పూలు చూస్తే కొన్ని పూల కన్నా ఎక్కువ అంనందంగా ఉంటుంది. అన్ని పూలైనా, అందులో కొన్ని పూలు, కొన్నిపూలకన్నా ఎక్కువ ఆనందాన్ని ఇస్తాయి. చాలా రంగుల చీరలు కట్టుకున్నాక, ఒక సారి తెల్లని చీర కట్టుకున్నావు అనుకోండి, చాలా బాగుంటుంది. అట్లా ఇన్ని జీవులలో కూడా, అన్నిట్లోనూ భగవంతుడు ఉన్నప్పటికీ కూడా కొన్నిట్లో ఎక్కువ మెరుస్తూ ఉంటుంది. తెల్లటి హంసను చూశాం అనుకోండి, మణి ఉన్న నాగుపాముని చూశాం అనుకోండి, ఇట్లా మనకి కొన్ని చూస్తే ఎక్కువ ఆనందం కలుగుతుంది. కొన్ని చూస్తే అంత ఆనందం కలగదు. ఏమిటంటే అంతటా నిండి ఉన్నప్పటికీ పదార్థము నందు, కొన్నిటియందు ఎక్కువగా, మనలో గుడ్డి వాళ్ళకు కూడా కనిపించేటట్టుగా వ్యక్తమై ఉంటుంది. అందుకే మనం సహజంగా ఆకర్షితులమవుతూ వుంటాం. ఆ విధంగా పదార్థమయమైన ప్రపంచంలో పదార్థ రూపములో ఉన్నవాటి యందు కూడా మెరుపు కలిగి మనల్ని ఆకర్షించే తత్త్వం ఏదైతే ఉందో దాన్ని భూషణము అన్నారు. అంటే 'భూ'తత్త్వము అన్నమాట.

అంతకుముందు కూడా 'భూ' శబ్దం వుంది. భూశయము, భూషణము. ఇక్కడా పదార్థమే! మన లోపల ఉన్న చేతన సహజంగా మెరుపు కలది. జ్యోతి స్వరూపులం కదా మనం. కాబట్టి ఎదురుగుండా కాస్త మెరిసేది కనిపిస్తే కాస్త ఆకర్షితులవడమే కాకుండా, ఆనందం కూడా కలుగుతుంది. అందుకని ఆభరణాల మీద అందరికీ ఆశ. ఆభరణాలు, భూషణాల మీద ఆశ ఎందుకు అంటే దానియందు కొంచెం ప్రస్ఫుటముగా ప్రజ్ఞ ప్రకటింపబడి ఉండడం చేత. అందుకని ఎక్కడైనా సంపద కలిగి ఉన్నా, చక్కటి ఆభరణములు ఉన్నా, అందమైన వస్తువులు ఉన్నా, అది చూసినప్పుడు మనలో ఆనందం కలగడం మంచి సంస్కారం. పందిని చూసినా, ఆవుని చూసినా ఒకటే భావం కాక, ఆవుని చూసినప్పుడు ఇంకొంచెం ఎక్కువ భావం కలిగుతుంది. అది సంస్కారం లో ఉంటుంది. భూషణం సంస్కారవంతుడికి ఆనందం ఇస్తుంది. సంస్కారహీనుడికి బాధపెడుతుంది. మొత్తానికి వాణ్ణి మాత్రము ఉన్నట్టుగా ఉండనివ్వదు. అంతకుముందు ఎట్లా ఉన్నాడో అట్లా ఉండడు భూషణం చూసినప్పుడు. కొంత కదలిక కలుగుతుంది. రావణుని చూసినప్పుడు రాముడు ఆనందం చెందుతాడు. రావణుని అందం చూసి ఆనందం చెందుతాడు. రావణుని యొక్క బ్రహ్మ తేజస్సుని చూసి ఆనందం చెందుతాడు. రావణుడు ధరించిన ఆభరణములను చూసి ఆనందం చెందుతాడు.  రావణుని యొక్క రథము, గుర్రములు అన్నీ చూసి 'ఓహో ఏమి వైభవం ఇతడిది' అని ఆనందం చెందుతాడు. సంస్కారవంతులు అట్లా ఆనందం చెందుతారు. సంస్కారహీనులు అటువంటివి చూసినప్పుడు వాళ్లల్లో బాధ కలుగుతుంది. అందుకని ఎవరైనా వాడికి జరిగిన మంచో, వాడి దగ్గర ఉన్న సంపదో, మనకి గోచరింపజేసినప్పుడు మనం సహజంగా ఆనందం చెందుతామా, లేక ఈర్ష్య పడతామా అనేది మనలో ఉన్న సంస్కారం యొక్క స్థితి తప్ప ఇంక వేరే ఏమీ లేదు. ఆక్కడ భగవంతుని యొక్క అస్తిత్వం దర్శనం చేయగలిగితే మంచి దుస్తులు వేసుకొచ్చారు, మంచి చీర కట్టుకొచ్చారు, మంచి నగలు పెట్టుకొనివచ్చారు. మంచి హృదయం నీకు ఉంటే, చక్కగా  దాన్ని చాలా బాగుందని నీవు మనస్ఫూర్తిగా  పొగడవచ్చు. దాంట్లో భగవంతుని యొక్క దర్శనం చేయవచ్చు. ఆ విధంగా బంగారానికి, వెండికి, రత్నాలకి వీటన్నిటికీ ఆదరణ లభించినది.  కారణం ఏంటంటే అందులో ఎక్కువగా, ప్రస్ఫుటంగా తత్త్వం ఉండడం చేత. మనకి లేదు కాబట్టి అందని ద్రాక్ష పండ్లు పులుపు అనే సిద్ధాంతం తప్పు. విదురుడు ధృతరాష్ట్రుడికి అదే చెప్తాడు. 'ఎదుటివారి సంపదను చూసి ఈర్ష్యపడి, హేళన చేసినవాడు మూర్ఖుడు' అని. ఎదుటివారి విజ్ఞానము, ఎదుటివారి యొక్క శీలము, ఎదుటివారి యొక్క సంపద చూసి ఆనందిచగలగాలి. మామూలుగా మనకన్నా శీలవంతులను చూస్తే, మనకి వాడిలో ఏదో రంధ్రాన్వేషణ చేద్దామనే  భావన ఎక్కువ ఈ రోజుల్లో. అంత మంచి ఉంటే ఆ మంచిని చూడలేక ఏదో ఒక చెడు వెతికి  వీడూ చెడ్డవాడే, అనిపిస్తే తప్ప మనకి ఆనందంగా ఉండదు. శీలమందు హేళన మనకు కలిగితే, అది మన సంస్కార లేమి. అలాగే మనకన్నా ఇంకొకళ్ళకు బాగా ఎక్కువ తెలుసు అనుకో, తెలిస్తే ఈర్ష్యపడేవాడు సంస్కారహీనుడు. ఈనాటికి పుట్టపర్తి లో వైభవము చూసి ఈర్ష్యపడేవాళ్లు బోలెడు మంది ఉన్నారు. ఎందుకంటే ఎంత మహా జ్ఞాని అనుకున్న వాళ్లు కూడా అక్కడ ఉన్న

వైభవాన్ని చూసి అంగీకరించరు. ఎందుకు అంగీకరించరు అంటే, అంగీకరించడానికి మనస్సు ఒప్పుకోకపోవడం ఒక్కటే కారణం. ఇంకోటి లేదు. రావణుని సంపదని చూసే ఆనందించిన రాముడు అంత రావణత్వం అక్కడేం కనపడదు కదా. దైవత్వమే కదా. అయినప్పటికీ ఏదో దాని వెనకాల కాస్త అది ఉంది, ఇది ఉంది, అని చెప్పి అది అంతా correct కాదు ఇట్లా చెప్పుకుంటే ఆనందం. ఎందుకో తెలుసా, ఉన్న కాల స్వభావంలో ఈర్ష్యా అనేది తాండవం చేస్తుంది. ఒక జ్ఞానికి ఇంకొక జ్ఞానిని ఒప్పుకోలేని కాలమిది. ఒక మహాత్ముడు అంటే ఒక మాదిరిగా బాగా తెలిసిన వాడు, ఆయన దగ్గరికి వెళ్ళి ఇంకోళ్ళ గురించి మనం చెప్పాం అనుకోండి. ఏవో ఆయనలో కొన్ని లోపాలు చెప్పడమే తప్ప, హృదయపూర్వకంగా ఎదుటి వ్యక్తి లో ఉండే మంచిని అంగీకరించి పొగడగలిగిన సంస్కారం చాలా తక్కువ మందిలో ఉంటుంది. విదురుడు 'ఎదుటి వ్యక్తి యొక్క శీలమును సహించలేక బాధపడ్డావు' అంటాడు. 'ధర్మరాజు శీలమును చూసి బాధపడ్డావు' అంటాడు. ఎందుకంటే ధృతరాష్ట్రుడికి ధర్మాలు చెప్తాడు. ధర్మరాజుకి ధర్మాలు చెప్తాడు. ధర్మరాజు అసలు పేరు యుధిష్ఠిరుడు. యుధిష్ఠిరుడు ధర్మరాజు అని బిరుదు పొందాడు. ధృతరాష్ట్రుడికి అది కష్టం. అర్జునుడికి పాండిత్యం ఉన్నది విలువిద్యలో. కర్ణుడికి పాండిత్యం ఉన్నది విలువిద్యలో. అర్జునుని యొక్క పాండిత్యం కొనియాడబడినది. కర్ణుడు పాండిత్యము కొనియాడబడలేదు అన్న కారణం చేత కర్ణుడికి అర్జునుడి మీద ఈర్ష్య విపరీతంగా. వ్యక్తిగతంగా అర్జునుడు ఎప్పుడూ తనకు చేసిన అపకారము ఏమీ లేదు, అయినా ఎందుకంత కసి, పగ? అందుకని విదురుడు 'ఎదుటి వ్యక్తి యొక్క శీలము కానీ, ఎదుటి వ్యక్తి సమర్థత, పాండిత్యం కానీ, జ్ఞానము కానీ, ఎదుటి వ్యక్తి సంపదను కానీ, నీవు చూసి, నువ్వు ఏకీభావం చెందికూడా, హేళన చేసి అసూయతో ఏవేవో మాట్లాడుతున్నావు అంటే నీ అంత సంస్కారహీనుడు ఎవరూ లేరు' అంటాడు. నువ్వు అని చెప్పకుండా ధృతరాష్ట్రుడికి సంస్కారహీనులు ఈ విధంగా ఉంటారు అని చెప్పి ఈ మూడు చెప్తాడు. అంటే ఏమిటి అసలు base of thinking ఎలా వుంటుందంటే అసూయ. ఎంతటి వారైనా అసూయ దాటలేరు. అది దాటలేక అందులోనే పడి కొట్టుకుపోతుంటారు. వాడికి ఏం ఆనందం? ఎంతటి అద్భుతమైన విషయం చూపించినా వాడికేం ఆనందంగా ఉండదు. వాడికి వుంటే ఆనందం, చూస్తే ఆనందం ఉండదు. అసలు ఉంచుకోవడం వల్ల కాదు. ఎవరన్నా చూసి ఊర్కోవడమే సుఖం. అదే కదా రామాయణం. ఎటువంటి లేడి అది? చాలా అద్భుతమైన లేడి. కళ్ళు ఏమో నీలమైన వర్ణము కలిగి కాంతులు వెదజల్లుతున్నదట. ఒళ్ళంతా బంగారం రంగులో ఉన్నదట. దానిమీద తెల్లటి మచ్చలు అవి కూడా రత్నాలు పొదిగినట్లుగా ఉన్నదట. పచ్చటి మచ్చలు పచ్చలు పొదిగినట్లుగా ఉన్నదట. నల్లటి మచ్చలు నీలాలు పొదిగినట్టుగా ఉందట. తోక ఆడిస్తుంటే ఒక మెరుపు వెనకాల ఆడుతున్నట్లుగా ఉందట. చాలా అద్భుతంగా ఉంది ఆ లేడి. ఏదో మామూలుగా లేడి గురించి సీతాదేవి అంత బాధ పడే ఉండేది కాదు. బోలెడు లేళ్ళు చూశారు. ఆ లేడి ఎట్లా ఉంది అంటే చాలా అద్భుతంగా ఉంది. చూసి ఆనందించి ఉంటే బాగుండేది. మనకు కూడా చాలా విషయాలు చూసి ఆనందించే బుద్ధి ఉండకపోతే ఏం జరుగుతుందో చెప్పడానికి రామాయణంలో ఆ

ఘట్టం బాగా పనికి వస్తుంది. మనకి ఏమనిపిస్తుందో తెలుసా మనకి కూడా ఉంటే బాగుంటుంది. చూడండి భూషణాల వల్ల ఆనందం పోయి రకరకాల బాధలు కనిపిస్తాయి. భగవంతుని అస్తిత్వం చూసి అంతా బాధపడుతున్నావేమిటి? అదే శిశుపాలుడి బాధ. కృష్ణుడు కనపడగానే వీడికి reaction వచ్చేస్తుంది. కృష్ణుడు కనపడగానే విపరీతముగా react అయిపోతాడు శిశుపాలుడు. ఎందుకని reaction అంటే నీలో సంస్కారహీనత అంతే. వాడికి ఏమవుతుందో, వాడికి ఏం జరుగుతుందో, వాడేం రాజు, అసలు వాడు యాదవ కులానికి అపకీర్తి. అపకీర్తికల వంశంలో పుట్టాడు. చిన్నప్పుడు అవి ఇవి దొంగిలించేవాడు వాళ్ళింట్లోను వీళ్ళ ఇంట్లోనూ. ఆడపిల్లలతో సహవాసం చేసేవాడు. ఇది కదా. ఎందుకు ఇంత జరుగుతుంది లోపల? నీలో సంస్కారహీనత ఉండే సరికి ఒక సంస్కారవంతుని చూడగానే లోపల నుంచి రకరకాల కల్మషాలు అన్ని బయటకు వచ్చేస్తుంటాయి. చూడండి ఎంత చేస్తుందో భూషణం. అదే సంస్కారవంతునికి ఆనందాన్నిస్తుంది. సీతాదేవిని చూసేసరికి శూర్పణఖకి, అంత అందమైన యువకుని దగ్గర ఈమె ఉందే, నేను లేకపోతినే అనే చుప్పనాతితనం. అదే కదా శూర్పణఖ అంటే. అంతకన్నా ఏమీ లేదు. తనకి దక్కని రాముడు సీతాదేవికి మాత్రం ఎందుకు దక్కాలి అని, వాళ్ళ అన్నకి బాగా పంపు కొట్టింది. వాడు కదిలి వెళ్ళే వరకు ఊరుకోలేదు. జరిగింది అదే. కాబట్టి ఎక్కడ అందము ఉందో చూసి, కేవలము ఆనందించడం తప్ప ఇంకోటి పెట్టుకోకపోతే వాడు బుద్ధిమంతుడు. ఇతరుల భూషణాలు చూసి నీవు ఆనందించాలి. నీకు ఉండడం ఉండకపోవడంతో సంబంధం లేదు. ఉండడంవల్ల తలకాయ నొప్పి. ఎవరింట్లోనో మంచి పూల మొక్కలు ఉన్నాయి. మనకి కూడా ఉండాలని పెంచుకోవడం మొదలు పెట్టాము అనుకోండి, ముందు tanks తో నీళ్లు తెప్పించుకోవాలి పోయటానికి. అది ఎండిపోతుంటే వాటికి నీళ్లు పోయాలి రోజూ. సాయంత్రం office కు పోవడానికి లేదు. అసలు ఊరు వెళ్ళే పరిస్థితి రాదు. చూసి వచ్చేసి ఆనందిస్తే పోయే. పెంచుకోవడం వల్ల ఎంత వచ్చిందో చూడండి. ఇంట్లో మొక్కలు పెట్టుకుంటే వాళ్ళు ఉన్నారు. ఇంట్లో మొక్క పెడితే ఏం చేయాలో తెలుసా? రోజూ రాత్రుళ్ళు బయటపెట్టాలి, పగలు ఇంట్లో పెట్టుకోవాలి. రాత్రిపూట ఇంట్లో ఉండకూడదు మొక్క. ఆ గాలి మనం పీల్చకూడదు. దాన్ని బయట పెట్టాలి. కాసేపు దాన్ని ఎండలో పెట్టాలి. కాసేపు దాన్ని నీడలో పెట్టాలి. ఇంట్లో పెట్టుకుంటే అందంగా కనిపించాలి కాబట్టి కుండీకి కూడా యోగం పడుతుంది. Paint వేయాలి. ఎంత పని పెరిగింది. కనబడ్డది కనబడట్టుగా ఆనందించగలిగితే బాధ లేదు కదా. ఎందుకంత గొప్ప? కొని తెచ్చుకోవడమేగా. రకరకాలుగా రకరకాలుగా తెలివి తక్కువగా కొని తెచ్చుకుంటుంటాం. అదే చూసి ఆనందించగలిగితే భూషణం నుంచి భూతిలోకి వస్తాం.

## 656 భూతిః

భూతి అంటే విభూతి అని అర్థం. చూసిందల్లా కావాలి అనుకుంటే ఇల్లు నిండిపోతుంది. మనం కదలడానికి కూడా చోటు ఉండదు. ఒక్కొక్క ఇంట్లో ఎంత సామాను చేరింది? ఇదివరకు ఇంత సామాను ఉందా? ఏడుగురం పిల్లలం ఒక గదిలో శుభ్రంగా టపటపా మంచాలు వేసుకుని పడుకునే వాళ్ళం. తెల్లవారగానే మంచం లోకి మంచం, మంచం లోకి మంచం, ఏడు మంచాలు ఒక దాంట్లోకి ఒకటి ఎక్కించే వాళ్ళం. పరుపులన్నీ ఒక చోటుకి వెళ్లిపోయేవి. ఆ గది ఖాళీ గా ఉండేది. ఇప్పుడు ఏడుగురు పిల్లలు అంటే ఆరు Bedrooms కావాలి. అంతేకాదు ఆ పడకగదిలో అవి మధ్యలో ఉంటే వాటి చుట్టూ ప్రదక్షిణం చేస్తూ మనం, ఆ ఉన్న కాస్త చోటులోనే తిరగాలి. పెద్ద పెద్ద Bedrooms ఎవరికి ఉండవు కదా. మంచాలు పెద్దవిగా ఉంటాయి. అవి మధ్యలో పెట్టుకుని, వాటి చుట్టూ ప్రదక్షిణ చేస్తూ పనులు చేసుకుంటూ ఉంటాం, వాటిని కదల్చకుండా, వాటిని ఎత్తడానికి వీల్లేదు, పక్కన పెట్టడానికి వీలులేదు. ఏమిటి అంటే Bedroom. Bedroom ఎప్పుడూ? రాత్రిపూట. పగలు వాడుకోముగా. ఏమిటో దేవుడు చుట్టూ తిరిగినట్టుగా వాటి చుట్టూ తిరుగుతుంటాం. మా ఇంట్లో bedroom లో మంచాల చుట్టూ తిరుగుతూ ఉంటాం, బట్టల కోసం, వాటి కోసం వీటి కోసం కనీసం ఒక మూడు నాలుగు ప్రదక్షణాలు చేయకుండా ఏ రోజూ పొద్దున, సాయంత్రం పని కానే కాదు. దాంతో ఏం జరుగుతుంది? ఎక్కువ చోటు మన bedroom లో మంచాలు occupy చేస్తున్నాయి మనకి తక్కువ చోటు వస్తున్నది. అదేంటది? ఎక్కడికక్కడ సామాను పేర్చేసి, ఎందుకంటే వాళ్లకు ఉన్నాయి కదా అదొక్కటే logic. వాడికి ఉంది కాబట్టి మనకి ఉండాలి, మనకి అవసరమా కాదా అనే logic కానే కాదు. ఇంకోడికి ఉంది కాబట్టి మనకి ఉండాలి. కష్టమైనా, నష్టమైనా, అసౌకర్యమైనా మనకి ఉండాలనే భావన కదా. ఆ విధంగా బాధపడుతూ ఉంటే ఏ ఉపయోగం? అందుకని చూసి ఆనందించడం అనేది చాలా అద్భుతమైన విషయం. భూషణములను చూసి ఆనందించాలి. అలా మనం అన్నింటిని చూసి కేవలం ఆనందించడం అనేది, భూషణముల యందున్న భగవంతుని యొక్క అస్తిత్వాన్ని గమనిస్తూ ఉంటే ఏదన్నా చూసి ఆనందించవచ్చు. ముందు ఆనందం వస్తుంది. ముందు ఈర్ష్య రాదు. మనకన్నా కింద వాడు, మన కన్నా పైవాడు అయ్యాడు అనుకోండి, మనమేం చేస్తాం ఏడుస్తామా? ఏడవడం మనకు సహజం. ఏడిస్తే ఉపయోగమేమిటి? నువ్వు ఏడుస్తున్న కొద్ది వాడింకా నవ్వుతాడు. రోజూ కనిపిస్తాడు, నీ పైవాడు అయ్యాడు కదా. వాణ్ణి నీవు ఎలాగూ కలవక తప్పదు. బాధపడడం రోజూ తప్పదు కదా. ఓహో భగవంతుడు వాడిని ఆ విధంగా కరుణించాడు, అని అనుకుంటే పోయే. ఈ భూషణంలో మనకి ఇంత ఉంది, నాగభూషణం లాగా. దాన్ని చూడంగానే మనకి ఎదుటి వ్యక్తిలో మన దగ్గర లేనిదే ఒకటి కనిపిస్తే చూసి ఆనందించగలిగావా ధన్యోస్మి! దుఃఖ పడ్డావా చచ్చావే. నీలో ఉండే ఆ సంస్కారాన్ని మాటిమాటికి ముట్టుకుంటూ ఉంటాడు భగవంతుడు ఆ రూపంలో. కర్ణుడు దుఃఖ పడ్డవాడు

జన్మంతా ధుఖఃమే. ఎంత దుఖఃమో. చెప్ప లేనంత దుఃఖం. కొంతమందికి సమర్ధత ఉంటుంది ఎవరు గుర్తించరు. ఏంచేస్తాం? కొంతమందికి అంత సమర్ధత ఉండకపోవచ్చు, ఊరంతా గుర్తిస్తుంది. దానికి నీవేమి చేస్తావ్? వీడికి ఇది తప్పదు వాడికి అది తప్పదు. నువ్వేం చేయలేవు. చేయగలిగిందంతా ఏడవకుండా ఉండడమే. వీలైతే చూసి సంతోషించడమే. ఇలా మనం భూషణాల్లో నుంచి భగవంతుని యొక్క అస్తిత్వాన్ని చూస్తూ ఉంటే మనలో ఆ కాంతి పెరుగుతుంది. ఎదుటి భూషణంలో ఉండే కాంతి చూసి ఆనందించగలిగే సంస్కారం మనలో పెంపొందితే మనలో కూడా కాంతి పెరుగుతుంది. ఎందుకంటే నీలో కూడా ఉందిగా. ఎప్పుడు సంతోషంగా ఉండేవాడి దగ్గర కాంతి ఉంటుంది. ఎప్పుడు ఏడుపు మొహం వేసుకుని, జిడ్డల్లే తిరిగే వాడి దగ్గరకు ఏవి రావు. ఏమి లేకపోయినా నవ్వుతూ, ఉల్లాసంగా, ఆనందంగా తిరిగే వాడి దగ్గరికి ఏదైనా రావచ్చు. అందుకని కనబడుతున్న అందరిలోనూ, ఆకర్షణలోనూ భగవంతుని యొక్క అస్తిత్వాన్ని దర్శించడం చేస్తూ ఆనందిస్తూ ఉంటే నీ లోపల ఆనందించడం అనే ఒక faculty, ఒక తత్త్వం, ఒక కళ్యాణ గుణం పెంపొందించుకోవడం చేత నవ్వు ముఖం కలిగిన వాడి దగ్గరికి సమస్తమైనవి వస్తూ ఉంటాయి. నవ్వు దానికి అయస్కాంతీకరణ శక్తి ఉంది. వెకిలి నవ్వు కాదు. వికటాట్టహాసం అంతకన్నా కాదు. సహజంగా చిరునవ్వుగా ఉండడం. అలా ఉన్నవాడి దగ్గరికి అన్ని నడిచి వస్తాయి. కోపిష్టి వాడి దగ్గరికి, ఏడుపుగొట్టు వాడి దగ్గరికి వద్దాం అనుకున్నా కూడా రావు. అందుకని ఆనందించడం వల్ల అది నీలో కూడా పెంపొందుతూ ఉంటుంది. పెంపొందుతూ వుంటే ఉంటే నీలో కూడా అనుభూతికి అర్హత వస్తుంది. తర్వాత నామం భూతి. అనుభూతి ఎవరికి కలుగుతుంది అంటే ఎవరి యందు శుక్రుడు యొక్క ప్రజ్ఞ బాగా ప్రజ్వలించి ఉంటుందో వాడికే అనుభూతి. తట్టెడు ఉండొచ్చు. శుక్ర తత్త్వం సరిగా లేకపోతే ఏ అనుభూతి ఉండదు. ఏమీ లేకపోవచ్చు. శుక్ర గ్రహ తత్త్వం బాగా లోపల ఉంటే ఆ ఉన్న కాస్త పరిపూర్తిగా అనుభవిస్తాడు. కొంచమే అయి ఉండొచ్చు, కానీ వీడికి అనుభూతి మిక్కుటంగా ఉంటుంది. తట్టెడు ఉండొచ్చు, వీడికి ఏ అనుభూతి రాదు. కాబట్టి అనుభూతి అనేది ఎక్కడి నుంచి వస్తుంది అంటే ఈ అసూయ లేనివాళ్ళకి. అసూయ ఉన్నచోట అనుభూతి ఉండదు. దుర్యోధనుడికి విపరీతమైన అసూయ. వాడు హస్తినాపురంలో అంత పెద్ద భవనంలో ఉన్నాడు. రాజప్రసాదంలో వాడింట్లో ఉన్నంత, ఎవరింట్లో ఉండడానికి వీలు లేదు కదా, ఉంటే అసూయ కదా. అయినా వాడు ఏం ఆనందం చెందాడు? ఎప్పుడు ఈ పాండవులని ఎట్లా చంపాలా, ఎట్లా నరకాలా, హింస పెట్టాలా, ఇదే కార్యక్రమంలో జీవించడమే. వాడికి నిద్ర లేదు, ఆహారము లేదు సరిగ్గా. ఒంటిమీద ఏమి వేసుకున్నాడో వాడికి తెలియదు. ఎటువంటి ఆహారం తింటున్నాడో వాడికి తెలియదు. ఎంతసేపు ఈ బాధ. అనుభూతి వుండదు. అందుకనే చాలామంది గురుగ్రహం గురుగ్రహం అనుకుంటారు. గురుగ్రహం నీకు తట్టెడు సంపద ఇవ్వచ్చు. అది అనుభవించే యోగ్యత ఉందే అది శుక్రుడు. శుక్ర గ్రహమే మనలో ఉండే సూక్ష్మ శరీరానికి కారకుడు. మనభూమికి సూక్ష్మ శరీరము శుక్ర గ్రహం. అందుకే భూమికి అక్షయ అని చెప్తారు, శుక్రుడు. ఇది స్థూలము అది సూక్ష్మము. నీలో సూక్ష్మత్త్వం ఎంత పెరుగుతూ

ఉంటే అంత కాంతివంతం అవుతూ ఉంటావు. పదార్థం యొక్క సాంద్రత బాగా పలచబడుతూ ఉంటే, ఆ పదార్థం నుంచి కాంతి ఎక్కువ వికసిస్తూ ఉంటుంది. మనిషి బాగా బండబారి పోతూ ఉంటే వెలుగు తగ్గుతూ ఉంటుంది. మనిషి బాగా పలచన అవుతుంటే వెలుగు బాగా కనిపిస్తుంది. అందుకనే కదా పిల్లల బుగ్గలు అట్లా చిదుపుతూ ఉంటాం ఎందుకని? పలచనగా ఉంటుంది. ఇట్లా ముట్టుకుంటే కందిపోయేటట్టుగా ఉంటుంది. అట్లా ఉంటారు పెద్దవారు అయ్యాక కూడా కొంతమంది. ఎందుకని అంటే వాళ్ళ శరీరంలో కాంతి పెరగడం చేత. తత్త్వంలో పసిపిల్లలు కాదు. పెద్దవారు అయ్యాక కూడా పిల్లల చేష్టలు చేసుకుంటూ వుండే తత్త్వం కాదు. పెద్దవారే చాలా పలుచని శరీరం, ఎంతటి పలుచని శరీరం అంటే కాంతులు వెదజల్లుతూ ఉంటుంది. వారికి ఏం జరుగుతుంది అంటే ఈ బయట చూసే కాంతులు ఉన్నాయే అవన్నీ లోపల అనుభూతిని ఇస్తూ ఉంటాయి. అది భూతి. అంటే కనులు మూసుకుని ధ్యానం చేస్తున్నా, నిద్రపోతున్నా దివ్యమైన లోకాల యొక్క అనుభూతి ఉంటుంది. దివ్యము అంటే వెలుగుతో కూడినది అని అర్థం. దేవతలు అంటే వెలుగే రూపం గా కలిగిన వాళ్ళు. రకరకాల రంగులు, రకరకాల కాంతులు, రకరకాల తేజస్సులతో కూడిన లోకాలలో తిరుగుతున్నట్లు, అటువంటి లోకాలకి సంభంధించిన మనుషులతో తను కలసి తిరుగుతున్నట్లు,వాళ్ళు తనతో మాట్లాడుతున్నట్టు, తను వాళ్ళతో ఏదో మాట్లాడుతున్నట్టు, అటువంటివన్నీ జరుగుతున్నట్లుగా బోలెడు అనుభూతులు. దేవకీదేవికి అటువంటి అనుభూతులు కలిగాయి కృష్ణుడు గర్భంలో ఉండగా. వసుదేవుడికి అటువంటి అనుభూతులు కలిగాయి. నందుడికి అటువంటి అనుభూతులు కలిగాయి. సాధనలో ఒక స్థితిలో ఇటువంటి స్వచ్ఛమైన అనుభూతులు బోలెడు కలుగుతూ ఉంటాయి. వీటికి కారణం సృష్టిలో అందమైన వాటిని, ఆకర్షణీయమైన వాటిని పొందవలెను అనే బుద్ధి కాక, చూసి ఆనందించవలెను అనే ఆరాధన. దీన్ని 'శుక్ర విద్య' అని చెప్పారు. Beauty in form, beauty out of form. ముందు ఒక రూపంలో అందాన్ని చూస్తారు. రూపంలో అందాన్ని చూసి పొందాలి అనే భావన లేకుండా ఆనందించగలిగితే, అందమైన రూపం ఏది చూసినా నీలో ప్రజ్ఞ యొక్క సమీకరణం జరుగుతుంది చక్కగా. Rearrangement of the etheric current in you, astral current in you. అందుకని అందంగా అలంకరించుకోవడం, అందమైన రూపాలని ఆరాధించుకోవడం, అందమైన వస్తువుల కోసం ఆరాటపడడం. పొందాలని వద్దు, చూసి ఆనందించండి. దాన్ని లోపల దర్శనం చేసుకుంటూ ఉంటే మనం అనుభూతిలోకి ప్రవేశించడానికి వీలు పడుతుంది. ఎక్కడో మట్టిలోనో, రాయిలోనో కనపడకుండా ఉండేవాడు, ఇప్పుడు ఎంత దగ్గరకు వచ్చేశాడు మనకి. గుండ్రాయిలో ఉండేవాడు హృదయంలోకి వచ్చేసాడు. ఎందుకంటే అక్కడ నుండి ఇంకొంచెం బాగా కనిపించే విధంగా బాగా వెలుతురులో ఉండే వాటిని చూడడం, వాటిలోకి చూస్తూ ఆ మెరుపులు తీసుకుని లోపల చూడడం, ఆ మెరుపులు లోపల ఆరాధన చేయడం. ఇది కారణంగా అనుభూతి పరమైన స్థితిలోకి వస్తాడు. ఈ స్థితులన్నీ మన శరీరానికి ఉన్నాయి. మన శరీరం బయటకు చూడడానికి బండగా కనిపించినా, లోపల దానికి ప్రజ్ఞ యొక్క ఆధారం ఉంది కాబట్టి, ప్రజ్ఞ నుండి వచ్చే

కాంతులను లోపల నుండి దర్శనం చేసుకోవచ్చు. ఈ విధంగా దివ్య లోకాలలో అనుభూతి ఉన్న వాళ్ళకి భౌతికంగా కనిపించే సన్నివేశాలలో ఉన్న శోకం అంటదు.

## 657 విశోకః

వెలుగు దగ్గరికి చీకటి ఎట్లా రాలేదో, కల్మషాలు హర్షం దగ్గరికి ఎట్లా రాలేవో, లోపల ఈ విధంగా తన యందు ఉన్న వెలుగుని బాగా అనుభూతి చెందుతున్న వాడిని శోకం పీడించదు. సన్నివేశం వచ్చినప్పుడు ఏదన్నా కాస్త బాధపడ్డా వెంటనే అందులోంచి విముక్తుడౌతాడు. ఎందుకంటే ఇది లోపల ఉండడం చేత కాల్చేస్తుంది. కొంతమంది ఏడుపు ఎట్లా ఉంటుంది అంటే blotting paper వలె మన దగ్గర నుండి కూడా లాగేస్తారు. వచ్చిన దగ్గర్నుండి రోగాలు రొష్టులు, ఏదో కష్టాలు నష్టాలు, ఏడుపులు. ఎప్పుడూ ఏడుపు, ఎప్పుడూ ఏదో బాధ, ఎప్పుడూ అదే ఆలోచిస్తూ, క్రుంగి పోయిన వాళ్ళ దగ్గరికి మనం వెళ్తే నీరసం వస్తుంది. వాళ్ళను సముదాయించబోయి నువ్వు కళ్ళు నులుముకుంటూ, బయటకి రావాలి. వెక్కి వెక్కి ఏడుస్తూ వస్తావు. ఎవరో చచ్చిపోతే పలకరిద్దామని వెళ్ళి ఆవిడను ఓదార్చపోయి, వీళ్ళు ఏడుస్తూ రారూ బయటికి? అందుకనే ఇంటికి వచ్చి ఒకసారి స్నానం చేయమని చెప్పడం. కొంతమందికి రాదు. ఎందుకు రాదు అంటే లోపల ఉన్నది. అదేం చేస్తుంది అంటే వెళ్ళిన చోట వాళ్ళకి కాస్త అందించి వస్తాడు. అది healing అంటే. Healing చేస్తామని hospital కి వెళితే వాడిని చూసి వాడితో పాటు మనము ఏడ్చేస్తే అది healing కాదు. Healing అంటే వెళ్ళి రోగిని, రోగి చుట్టూ ఉండే వాళ్ళని ఉత్సాహపరచాలి. వాళ్ళు నవ్వేటట్టు చూడాలి, వాళ్ళు ఆనందపడేటట్టు చూడాలి. వాళ్ళకి చాలా చిన్న కష్టం అనిపించేటట్టుగా కబుర్లు చెప్పాలి. ఇంతకన్నా చాలా పెద్ద కష్టం వచ్చినవాళ్లు ఏ విధంగా బయటపడ్డారో చెప్పాలి. మీది bypass కదా, open heart surgery వాడికి లాభం లేదు అన్నారు అని చెప్పాలి. అయినా వాడు బ్రతికి వచ్చేశాడు. అంటే వీడికి మనది చిన్నదే అని ఓహో పరవాలేదు, అమ్మో bypass అన్నావనుకో వెంటనే వాడు pass అయిపోతాడు. ఎవడు ఇవి చేయగలడు? వీడు లోపల ఉండాలి. ఆయనకు శోకం అంటదు. వీడికి శోకం అంటకపోవడం వల్ల వీడి దగ్గర ఉండే కాంతి ఇంకోడికి అందిస్తాడు. అది శోక నాశనః

# 658 శోకనాశనః

ముందు నీవు విశోకుడివి అవ్వాలి. అశోకుడివి అవ్వాలి. అక్కడి నుండి శోక నాశనం. నీకే లేచిన దగ్గర నుండి తట్టెడు శోకం వస్తుంది అనుకోండి, చూస్తుంటేనే ఏడుస్తున్నారు అనుకోండి, చెప్పడమే ఏడుస్తూ చెప్తున్నారు అనుకోండి. ఎట్లా ఉండాలి healer? మెరుపల్లె ఉండాలి. ఎంత ఉత్సాహం ఉంటే అంత మంచిదండి. ఉత్సాహమే బలం. రాముడంతటి వాడికే లక్ష్మణుడు చెప్తాడు. ఒకసారి రాముడు నిరుత్సాపడిపోతాడు ఇంకేం లేదు అయిపోయింది, అని. మతంగ మహర్షి ఆశ్రమంలో ఆ అందమైన ప్రకృతిని చూసినప్పుడు సీత గుర్తొస్తుంది. ఎక్కడ ఉందో తెలియదు. వాడెవడో రావణాసురుడు ఎత్తుకుపోయాడట అంతవరకు తెలుసు. అతడు ఎక్కడ ఉంటాడో తెలియదు. ఈ చుట్టుపక్కల ఊర్లో కాదు. అది మన లోకంలో అవునో కాదో తెలియదు. తెలుసుకోవాలి. ఎట్లా తెలుసుకోవాలి అది ఒక బాధ. రెండోది ఆమె ఎంత కోమల, ఎంత సున్నితమైనది. రాక్షసుడి చేతిలో ఎంత బాధ పడుతున్నదో, ఏం చేస్తున్నాడో వాడు మనకు ఏమి తెలియదు కదా. ఆ బాధ ఎక్కువ. అందుకని వివశుడైపోయి పడి ఏడుస్తాడు. ఏడిస్తే అప్పుడు లక్ష్మణుడు అంటాడు 'అదేంటది నీ అంత వీర్యవంతుడు ఎవరు ఉన్నారు? నీ అంత బలవంతుడు ఎవరు ఉన్నారు? నీకు సాధ్యం కానిది ఏమున్నది? ధర్మం మన ప్రక్క ఉంది కదా! ఇట్లా బాధపడతావేమిటి? ఉత్సాహంగా ఉండు. ఉత్సాహంగా ఉంటే సగం సమస్యలు జయించినట్లే! అందుకని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్సాహం పోగొట్టుకోకూడదు' అని ఒక మంచి శ్లోకం కిష్కింధకాండలో ఉంటుంది. లక్ష్మణుడు రాముడికి చేసిన బోధ. అదండీ లక్ష్మణుడి గొప్పతనము! రాముడు పడిపోయిన రెండు మూడు సందర్భాలలో ఈయన గట్టిగా నిలబడతాడు. (ఆయన ఏడవంగానే, ఈయన ఏడుస్తూ ఉంటే ఇద్దరూ అక్కడే గోతులు తీస్తూ కప్పెట్టేవాళ్ళు.) 'మన ఉత్సాహాన్నే బలంగా పెట్టుకుని కార్యోన్ముఖులమై వెడతామన్నయ్యా, తప్పకుండా వదిన మనకు దొరుకుతుంది. నువ్వు మళ్ళీ తప్పకుండా అయోధ్య నగరానికి వెళ్తావు. 14 సంవత్సరాల తర్వాత నీ భార్యతో నువ్వు అక్కడ సింహాసనం మీద కూర్చుంటావు, నేను చెప్తున్నాను కదా' అని ఇట్లా ఎంతో ఉత్సాహాన్ని ఇస్తాడు. 'నిరుత్సాహ పడకూడదు. నిరుత్సాహపడితే ఏమీ లేదు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఉత్సాహాన్ని పోగొట్టుకోకూడదని ఆర్యులు చెప్తారు. ఉత్సాహవంతులే బలవంతులు' అని చెప్తాడు. అదే చెప్తాడు అర్జునుడికి కృష్ణుడు కూడా విషాద యోగంలో. ఏడుస్తాడు కదా పాపం. కృష్ణుడు ఒక్కటే అంటాడు. కృష్ణుడు మొదలు పెట్టినదే 'క్షుద్రం హృదయ దౌర్బల్యం'. హృదయమునందు దుర్బలత్వము చూపిస్తున్నావే దానికి నా సానుభూతి లేదు. అది చాలా క్షుద్రమైన విషయం. I pity you అంటాడు. కొంతమంది ఎంతసేపూ సానుభూతి కోరుతూ ఉంటారు. కోరడం అంటే ఎట్లా ఉంటుందంటే కొబ్బరి కోరినట్లే. అవతల వాడిని కోరేస్తూ ఉంటారు ఆ సానుభూతి కోసం. వాడు నిస్సారమైనంతవరకు వీళ్లు సానుభూతి కోరుతూ ఉంటారు. ఋషులయితే 'ఛీ పో' అని ఒక లెంపకాయ కొట్టి, వాడిని సరి చేస్తారు. వాడ్ని

ముందు శోకం లోంచి బయటకు తీసుకురావాలి. మరీ శోకంలో ఉండేవాడిని లెంపకాయ కొడితే shock తిని అందులోంచి బయటకు వస్తాడు. కొట్టాలి అవసరమైతే. గట్టిగా ఒక్కటి కొడితే, ఎందుకు కొట్టారో తెలియక శోకం మర్చిపోయి, వీడెందుకు కొట్టాడో అని ఆలోచిస్తాడు. ఇవన్నీ healing techniques. అర్జునుడు ఏదో పిచ్చిపిచ్చి వేదాంతం చెప్పి ఏడుస్తూ వుంటాడు. ఇంత అర్జునుడూ, ప్రపంచఖ్యాతి గడించిన వాడు అట్లా యుద్ధంలో ఏడుస్తూ ఉంటే ఎంత అసహ్యంగా ఉంటుందండి? అరే నాయనా నీకింత ఏడుపు వచ్చిందా అని సానుభూతి చూపలేదు కృష్ణుడు. ఒక్కటే మాట అంటాడు వాత పెట్టినట్టు. చాలా క్షుద్రంగా ఉంది నీ హృదయ దౌర్బల్యం, ముందు దాన్ని పక్కన పెట్టు. ఏడుస్తావేమిటి సిగ్గు లేకుండా అంటాడు. ఏడ్చే వాడిని బుజ్జగిస్తే ఇంకా ఏడుస్తాడు. ఏడుస్తావ్ ఏమిటిరా సిగ్గు లేకుండా అని అంటే, తీసేసుకుంటాడు అమ్మో అని. శోకం నాశనం చేయడానికి నీవు ఎట్లా చేస్తావు? నీ యందు విష్ణుతత్త్వం ఉండాలి. నువ్వే శోకంలో ఉన్నావనుకో ఇంకోడికి శోకం వచ్చిందనుకో, నేను అట్లాగేరా మనం ఇద్దరం కలిసి ఏడుద్దాం అన్నట్టుగా ఉంటుంది. ఏమిటిది? ఈ అంతర్హితమైన తత్త్వాన్ని ఎలాగూ చూడలేము కాబట్టి, అది కాంతుల రూపం లో ప్రకటింపబడుతున్నది కాబట్టి, అంటే పదార్ధములో అయినా కాంతిరూపం లో ప్రకటితమౌతున్నప్పుడు ఆ కాంతులని గమనించి, దర్శించి, అరాధన చేసుకోవాలి. అందుకే దీపాలు పెట్టుకోవడం. దీపం ఎవరికోసమో కాదు, మన కోసమే దీపం పెట్టుకోవడం. దీపం ఎందుకు పెడతామంటే ఆ జ్యోతిని మనలో దర్శనం చేసుకోవడానికి. అది లోపల బాగా వెలుగుతూ ఉంటే శోకం రాదు. శోకం వచ్చినా దాన్నే వెలుగనుకుంటే దాన్ని దాటవచ్చు. అందుకే శోకం లో ఉన్నవాడు ఎవరైనా ఒక మహాత్ముని వద్దకు చేరితే శోకం తగ్గుతుంది. ఎందుకంటే ఆయనకి శోకం ఉండదు కదా! ఆయనలో జ్యోతి ఇతడికి కొంచెం supply అవుతుంది. అందుకే మనకు అంత బావుండనప్పుడు సత్పురుషుల దర్శనమునకో, పుణ్య క్షేత్రాలకో, సద్ గ్రంథములు చదువుకోవడమో, చేస్తే శోకానికి విరుగుడౌతుంది.

అందుకని కాంతిమయమైన వస్తువులను, అది భగవతుని అస్తిత్త్వముగా భావన చేస్తూ, ఈర్ష్య లేక ఆనందం చెందుతూ, తన లోపల కాంతిని దర్శనము చేసుకుంటుంటే కాంతి పెరగడం వల్ల శోకం తగ్గుతుంది. లోపల ఎంత కాంతి పెరిగితే నీవు అంత అయస్కాంత శక్తి కలిగి ఉంటావ్. అది కారణం గా సమస్తమైన సంపదలూ నీ వద్దకు చేరవచ్చు. విలువైన వస్తువులన్నీ అక్కరలేకపోయినా చేరతాయని పతంజలి మహర్షి చెప్తారు. ఎందుకంటే వాటికి అతడి వద్దకు చేరదామని అనిపిస్తుందిట. మంచి వస్తువులన్ని, విలువైన వస్తువులన్నీ అక్కడికే పోదామనుకుంటాయిట. ఎందుకంటే అతని వద్ద కాంతి ఉన్నది, అందువల్ల వాటిని అతడు సద్వినియోగం చేస్తాడని. అది ఒక సిద్ధి. నువ్వు పవిత్రీకరింపబడన కొద్దీ ఈ సిద్ధులు వచ్చి చేర్తాయి. అలా ముందుకు సాగుతుంటే నీకు శోకం అంటని పరిస్థితి వస్తుంది. అంతేకాదు ఇతరులకు శోకం వచ్చినప్పుడు వారి శోకాన్ని నాశనం చేసే స్థితి ఉంటుంది. ఇవన్నీ భగవంతుడికి ఉన్నాయి. మనం కూడా ఆయన అంశావతారములమే కదా, కాబట్టి మనలో కూడా ఇవన్నీ పెంపొందించుకునే

అవకాశమున్నది. అన్నీ మనలో ఉన్నాయి. కాకపోతే ఎటు తిరుగుతామనేది మన భావ పరంపరలను బట్టి ఉంటుంది. అది ఇవాళ అంటే రేపటికి అయిపోతుందనుకోవద్దు. ఆ రకమైన భావనలు మనలో స్థిరం కావాలి. శుక్ర మహాదశ వస్తే అందరికీ సుఖశాంతులు ఇవ్వాలని లేదు. మనబట్టే శుభాలు ఉంటాయి. ఈ భావనలతో మనకిచ్చిన సాధన శుక్రవిద్య కి సంబంధించినది. మంచి అందమైన పంచలోహ విగ్రహము పెట్టుకుని, బాగా కాంతులీనే విధం గా దీపాలు పెట్టుకుని, ఆ కాంతులలో ఆ విగ్రహములోని మెరుపు రూపాన్ని చూస్తూ, కళ్ళు మూసుకుని ఆ రూపాన్ని ధ్యానం చేసుకోవాలి. అప్పుడు పదార్ధము లోపలికి వెళ్ళదు, దాని కాంతి రూపము మాత్రమే లోపలికి వెడుతుంది. అప్పుడు నువ్వు బాగా సూక్ష్మమైన రూపాన్ని ఆరాధన చేసినవాడివి అవుతావు. కనులు మూసుకుని ఆ కాంతిమయమైన రూపాన్ని దర్శనం చేస్తూంటే దాని కాంతి (నీ కాంతే అది) ఎంత నువ్వు  పెంచుకుంటుంటే, నీ లోపల అంత కాంతి సమీకరణం చెందుతుంటుంది. అప్పుడు నీ వర్చస్సు పెరుగుతుంది. పెరిగితే అపరిశుభ్రమైన విషయాలు గాని, సన్నివేశాలు గానీ, మనుషులు గానీ, వస్తువులు కాని నీ వద్దకు చేరవు. ఎందుకంటే ఇక్కడ కాంతి ఉన్నది కాబట్టి కాంతికి సంబధించినవే చేర్తాయి. దైవీ ప్రకృతి ఉన్నవారి వద్దకు దైవీ ప్రకృతికి  సంబంధించినవే వచ్చి చేర్తాయి. ఆసురీ ప్రకృతి ఉన్నవారి వద్దకు ఆసురీ ప్రకృతి శక్తులు చేర్తాయి. అన్నీ మనబట్టే ఆకర్షించుకునేవి ఉంటాయి. కాంతులు పెంచుకుంటూంటే సూక్ష్మ శరీరనిర్మాణం వరకు కూడా పనిచేస్తుంది. ఇవన్నీ నీకు అందుబాటులో వస్తాయి. అవి నువ్వు అందరికీ అందిస్తుంటావ్. అది కారణంగా శోకానికి అతీతమైన స్థితి వస్తుంది. మానవ జన్మ ఎత్తినందుకు శోకాన్ని పొందవచ్చు కానీ చాలా త్వరగా ఆ శోకాన్నుండి బయటకు వస్తాడు. తన మేనల్లుడు, తను చిన్నప్పటి నుండి సకల విద్యలూ నేర్పిన అభిమన్యుడు యుద్ధం లో వెళ్ళిపోతే కృష్ణుడు చాలా బాధపడతాడు. అంతకన్నా ఎక్కువ అర్జునుడు బాధపడతాడు. ఎంత ఎక్కువ కాంతి ఉంటే అంత తక్కువ శోకముంటుంది. అయితే యోగి కదా 'సరె అయిపోయింది. ప్రస్తుతము చేయవలసిన కర్తవ్యాన్ని గూర్చి అలోచించాలని' బోధిస్తాడు కృష్ణుడు. అయిపోయిందాన్ని గూర్చి ఏడుస్తూ కూర్చోక కర్తవ్యాన్ని నిర్దేశిస్తుందిట కాంతి. అటువంటి వారితో మనముంటే అదృష్టం. యుద్ధ అంతా అయిపోయింది. ధర్మరాజుకి శోకం. అర్జునుడికీ శోకం. ఇలా అందరూ శోకం లో ఉన్నారు. కృష్ణుడొక్కడే శోకం లేక కర్తవ్యం లో ఉంటాడు. అసలు విష్ణు సహస్రనామాలు, 1008 నామాలన్నీ కూడా కృష్ణునికే వర్తిస్తాయండి. ఇవన్నీ ఆ దైవమే ఇలా రూపుకట్టుకుని ఉన్నాడని చెప్పడానికి.

## 659, 660, 661 అర్చిష్మాన్, అర్చితః, కుంభః

అర్చిష్మాన్ అంటే దేదీప్యమైన కాంతివంతుడు అని అర్ధం. భగవత్తత్త్వం దేదీప్యమైన కాంతిగా చాలామంది భక్తులకు గోచరించింది. ఆ తత్త్వం ఆధారంగానే సృష్టి అంతా ఏర్పడుతుంటుంది. భగవంతుని నుండి వ్యక్తమైన వెలుగు, వెలుగులో నుండి త్రిగుణములు, మూడు రకాలైన శక్తులూ ఉద్భవించడం, అక్కడ నుండి ఆ వెలుగునే వీరు పచనం చేసి సృష్టి నిర్మాణం చేయడం జరిగింది. ముచికుందుడు శ్రీకృష్ణుణ్ణి దేదీప్యమైన కాంతిగా దర్శనం చేయడం జరిగింది. అందుకని భీష్ముడు శ్రీకృష్ణుని ప్రశంసిస్తూ, 'అర్చిష్మాన్' అనే పదం వాడడం జరిగింది. ముచికుందుడు వేయి సంవత్సరములు తపస్సు చేసిన మహర్షి. ఆయన కనులు తెరిచి శ్రీకృష్ణుని చూడలేకపోయాడట. అంతటి కాంతివంతుడిగా ఉన్నాడు కృష్ణుడు. కాలయవనుడనేవాడు పశ్చిమ దేశాల నుండి శ్రీకృష్ణునిపై దండెత్తి ద్వారకా నగరానికి వచ్చి, కోటగుమ్మం వద్ద చాలా నినాదాలు చేస్తాడు, శ్రీకృష్ణునితో యుద్ధం చేయాలనే ఉత్సాహంతో. చేస్తే శ్రీకృష్ణుడొక్కడే ఆయుధాలు కూడా ధరించకుండా బయటకు వచ్చి, కాలయవనుని చూచి నవ్వుతాడు. అతనితో యుద్ధం చేయడానికి సిద్ధపడడు. ఎందుకంటే అతడు పశ్చిమ దేశాల్లో పెద్ద యోధుడు. అమితమైన, ఎదురులేని పరాక్రమం కలవాడే కానీ, అతను కృష్ణుడికి చాలా చిన్నవాడిలాగ గోచరిస్తాడు. అందుచేత యుద్ధం చేయడం ఇష్టంలేక, ఈ సమయం సద్వినియోగం చేయాలన్న ఉద్దేశ్యంతో శ్రీకృష్ణుడు నిరాయుధుడుగా బయటకు వచ్చి, కాలయవనుడు యుద్ధానికి పూనుకుంటే ఈయన పరుగెట్టడం మొదలుపెడ్తాడు. కాలయవనుడు వెంటపడ్తాడు. కృష్ణుడు పరుగెత్తి పరుగెత్తి ముచికుందుడు తపస్సు చేస్తున్న గుహలో ప్రవేశిస్తాడు. ప్రవేశించి ముచికుందుని వెనకాల దాక్కుంటాడు. వెనకాలే వచ్చిన కాలయవనుడు ముచికుందుని చూచి, ముచికుందునిగా మాయారూపంలో శ్రీకృష్ణుడే ఉన్నాడని దుర్భాషలాడతాడు. ఆ శబ్దానికి తన తపస్సుకు భంగం కలిగి ముచికుందుడు ఎవరా ఈ శబ్దాలు చేస్తున్నదని కళ్ళు తెరచి చూసేసరికి, ఈయన కన్నులలో నుండి వచ్చిన కాంతిచేత ఎదురుగా ఉన్న కాలయవనుడు భస్మం అయిపోతాడు. అంతటి తపస్సు ముచికుందునిది. తేజోమయమూర్తిగా పరిపూర్ణమౌతాడతను. అలాంటివాడు పరమాత్మ దర్శనం / కృష్ణ దర్శనం కోసం ఎదురు చూస్తుంటాడు. ఆయన కనులు తెరచి చూసేసరికి కాలయవనుడు భస్మం అయితే ఎవరు వచ్చారో, ఎందుకు భస్మం అయ్యాడో ముచికుందునికి అవగాహన కాక ఆశ్చర్యపడుతూంటే, వెనక దాగిన కృష్ణుడు ముచికుందుని ఎదుట నిలబడతాడు. ఏ కనులు తెరిస్తే ఎదుటనున్న ఒక మహాయోధుడు భస్మీపటలం అయ్యాడో, అవే కనులు ఈ మూర్తిని చూడలేనంత కాంతివంతంగా ఉంటాడు. ముచికుందుడు చూడలేక కనులు మూసుకుంటాడు. దాన్నిబట్టి శ్రీకృష్ణుని కాంతి ఎటువంటిదో అంచనా వేసుకోవచ్చు.. కృష్ణుని కాంతి ఎంత నలుపో, అంత తెలుపు. చీకట్లో కనబడడు, వెలుగులో కూడా చూడలేనంత వెలుగు. అందుకనే భగవన్నామంలో/ విష్ణుసహస్రనామాలలో కృష్ణుని ప్రశంశిస్తూ,

భీష్ముడు 'అర్చిష్మాన్' అనే నామాన్ని అందించాడు. పూర్ణమైన, దేదీప్యమానమైన వెలుగు, చూడలేనంత వెలుగూ అయిన కృష్ణుణ్ణి మనం ప్రార్ధన చేసుకుంటున్నాం. అలా ప్రార్ధన చేసుకుంటూంటే, మనలో కూడా ఆ వెలుగు బాగా నిర్మాణం అవుతుంది. విష్ణు సహస్రనామాన్ని కనులు మూసుకుని కృష్ణ రూపం దర్శనం చేసుకుంటూ చదువుకోవచ్చు. అంటే విష్ణు సహస్రనామం నిజానికి శ్రీకృష్ణుణ్ణి ప్రశంశిస్తూ భీష్ముడు చేసిన స్తోత్రం. కనుక విష్ణు రూపంగా కానీ, కృష్ణ రూపంగా గానీ ధ్యానం చేసుకుంటూంటే మనలో కూడా ఈ అర్చన కారణంగా వెలుగు ఏర్పడుతుంది. ఆ వెలుగే ఈ వెలుగుగా ఉందీ అని మనకి ఒక సత్యం గోచరిస్తుంది. నిజానికి మన వెలుగు ఎలాంటిదంటే ప్రతిబింబించిన వెలుగు. సూర్యుని వెలుగు ఒక కదలని నీటిలో ప్రతిబింబిస్తూంటే, ప్రతిబింబించిన వెలుగు అంతగానూ గోచరిస్తుంది. ఆ ప్రతిబింబించిన వెలుగు కారణంగా లోపలంతా కాంతివంతంగా ఉంటుంది. మీరు సముద్రం లోపల ఉండి, పై నుండి వెన్నెల సముద్రం మీద పడుతూంటే చూశారనుకోండి, పై నుండి సూర్యుని కిరణాలు పడుతూంటే సముద్రం లోపల నుండి చూశారనుకోండి, సముద్రం లోపలంతా వెలుగుగానే ఉంటుంది. అలా ఆపాదింపబడిన వెలుగు గలవాళ్ళం మనం. వెలుగు ఆయనది. వెలుగు ఈ విధంగా నీటిమీద ప్రతిబింబింపబడినపుడు, ఆ వెలుగు ఆయనది కాబట్టి దానికి సంబంధించిన వాళ్ళం మనం అని గుర్తుండాలి. కానీ ఈ ప్రతిబింబించిన వెలుగు గలవాళ్ళం శరీరము, శరీరావసరాలలో ఎక్కువ ఆసక్తి కలిగియుంటాం. అందుకని మనం సమీకరణం చేసికోవాలి, ప్రతిబింబింపబడ్డ వెలుగు కలవాళ్ళమని. అసలు వెలుగు పరమాత్మది! ఆ విశ్వాత్మ చైతన్యం మనయందు ఈ విధంగా ప్రతిబింబిస్తుంటే అది కారణంగా ఈ శరీరం నిలబడియున్నది. కాబట్టి దానికి సంబంధించిన వాళ్ళం, అంటే ఎక్కడ నుండి ఈ వెలుగు వస్తున్నదో దానికి సంబంధించిన వాళ్ళమని, ఆ వెలుగుని మన శిరస్సులో అమితమైన వెలుగుగా భావన చేసుకుంటూ, మనం హృదయంలో కూర్చొని ఆ పై నుండి వచ్చే వెలుగు మనపై బాగా పడుతున్నట్లుగా భావన చేసికుని కూర్చోవాలి. అంటే నూతిలో మనం ఉన్నామనుకోండి, చంద్రుని వెలుగూ, సూర్యుని వెలుగూ నూతినీళ్ళల్లో పడుతూంటాయి కదా! ఇప్పుడు చేసే 'అర్చితః' అర్చన ఎలా సాగాలంటే, ఆపైన మనకి శిరస్సులో నిండిన వెలుగు అంతా ఒక మార్గము వలె హృదయములోని గుహలో ఉన్న మనలో పడుతున్నట్లుగా సాగాలి. ఎవరైనా బుర్రా గుహలు చూశారా? లోపల అందులో పైన ఒక రంధ్రం ఉంటుంది, అందుగుండా వెలుగు పడుతూంటుంది. ఇక్కడా అంతే. మనం నిద్ర లేవగానే హృదయంలో కూర్చుని, ఆజ్ఞలో ఏర్పడిన వెలుగు మనమీద ప్రసరిస్తుంటే, ఆ వెలుగు గొట్టం ఆధారం చేసికుని, ఉచ్ఛ్వాస నిశ్వాసల ద్వారా ఊర్ధ్వముఖంగా ప్రయాణం చేయడం అనే యోగసాధన ఒకటి ఉన్నది. ఊరికే మనం కళ్ళు మూసుకుని ఊహ చేయవచ్చు. మన శిరస్సునిండా విపరీతమైన వెలుగు నిండి ఉన్నదనుకోండి. అక్కడ 'అర్చిష్మాన్' ఉన్నాడు. హృదయగుహలో మనం 'అర్చించే' వాళ్ళం ఉన్నాం. అక్కడ నుండి ఈ వెలుగు ఓ గొట్టం ద్వారా పడుతోందనుకోండి అది గుండ్రంగా బావి ఒరల్లా ఉన్నదనుకోండి, అక్కడ నుండి ఆ వెలుగు మనమీద ఇలా దిగివస్తున్నదనుకోండి.

దిగివస్తూ ఆ వెలుగు మనమీద పడుతూంటే మనం పద్మాసనంలో కూర్చుని ఉన్నామనుకోండి. పద్మాసనంలో కూర్చున్నవాళ్ళం ఆ వెలుగు మన శిరస్సు మీద పడుతూంటే, శరీరంలో అంతా వ్యాపించియున్న తత్త్వాన్ని సమీకరించుకుని హృదయంలో కూర్చోపెట్టుకోవాలి. ఎప్పుడూ ప్రార్థన ఎలా చేయాలంటే మనం శరీరం మొత్తం వ్యాపనం చెందినవాళ్ళం. తొంభై తొమ్మిది రకాలుగా వ్యాపనం చెంది ఉంటాం అని చెప్తుంది యోగశాస్త్రం. శరీరం మొత్తంలోకీ అధోముఖంగా తొంభై తొమ్మిది నాడుల ద్వారా శరీరం అంతా వ్యాపించియుంటాం. వ్యాపించినవాళ్ళం ఓంకారం చేశామనుకోండి. ఓంకారం చేసేసరికి ఈ తొంభై తొమ్మిది నాడుల్లోకి వ్యాపనం చేయబడ్డ ప్రజ్ఞలు ఒక్కసారి కేంద్రానికి పిలవబడ్డట్లు హృదయం లోకి సమీకరణం చేయాలి. చిలవలు పలవలుగా తొంభై తొమ్మిది నాడుల్లోకి ప్రసరింపబడ్డ తత్త్వం ఏదైతే ఉన్నదో, జీవతత్త్వం, అంటే అంతకు ముందున్న పరమాత్మ తత్త్వమే మనలో ప్రతిబింబించీ ఈ నాడుల ద్వారా దేహపు మూలమూలల్లోకీ వ్యాపించి ఉంటుదన్నమాట. పైనుండి పడుతున్న ఒక నదీ ప్రవాహాన్ని తీసుకుందాం. అది మన ఇంట్లో పడుతుంది. మన ఇంట్లోంచి అన్ని గదుల్లోకీ అదే పాకింది. లేక సూర్యరశ్మి తీసుకోండి. అది ఇంట్లోకి కిటికీల్లోంచి వస్తుంది. ఒక గదిలోకి ప్రవేశించి మిగతా కిటికీలు వేసినా సరే ఆ కాంతి అన్ని గదుల్లోకీ కాస్తో కూస్తో ప్రసరించి ఉంటుంది. రాత్రివలె ఉండదు కదా కనీసం. పగలుకూ, రాత్రికీ తేడా ఏమిటీ? చీకటిగా ఉన్నది వెలుగుగా మారింది కదా! ఆ వెలుగు నీ ఇంట్లో ఎలా ప్రవేశించిందీ? అలాగే విశ్వాత్మ చైతన్యమూ. అర్చిష్మాన్ అనే అత్యద్భుతమైన దేదీప్యమానమైన వెలుగూ ఏదైతే ఉన్నదో ఆ వెలుగు మనయందు ప్రతిబింబిస్తోంది. మనం ఆ ప్రతిబింబమే! అది ప్రతిబింబించి సమస్తమూ వ్యాపించియున్నది, ఇల్లంతా వ్యాపించి ఉన్నట్లు. ఈ వెలుగు పైనుండి హృదయం వరకూ దిగివచ్చి, హృదయం నుండి తొంభై తొమ్మిది మార్గాలుగా అది పాకుతుంది. పైనుండి దిగివచ్చిన మార్గం నూరవ మార్గం. దాన్నే 'సుషుమ్న మార్గం' అంటారు. అందుకని మనం బాగా ఓంకారం చేస్తున్నప్పుడు మన చేతికీ, కాళ్ళకీ ఉండే వేళ్ళల్లోంచి, మొండెం లోంచి, మన శరీరం లోని సమస్త భాగములు, అంగములు కూడా ఈ ప్రాణము/ జీవమూ/ ఈ చైతన్యమూ మొత్తమంతా సమీకరింపబడి, మన హృదయమనే గుహలో పద్మాసనంలో మనల్ని మనం ఒక వేలెడు మనిషిగా భావన చేయాలి. ఎందుకంటే దేహాత్మ భావనతో పరమాత్మను ధ్యానం చేస్తే ఏమీ దక్కదు. జీవాత్మ భావనతో పరమాత్మను ధ్యానం చేయాలి. పరమాత్మ, జీవాత్మ, దేహాత్మ మూడు. పరమాత్మ అంటే సమస్తమునూ వ్యాపించియున్న చైతన్యము, జీవాత్మ అతనియొక్క ప్రతిబింబము, దేహాత్మ అంటే జీవాత్మను ఆధారంగా చేసికునియున్న శరీరము. దేన్ని ఏది ఆధారంగా చేసికుందీ? మనం తలక్రిందులుగా అర్థం చేసుకుంటాం. శరీరం ఆధారంగా జీవుడున్నట్లు, జీవుడు ఆధారంగా లోపల ఎక్కడో మిణుకు మిణుకుమంటూ

నీవారశూకవత్తన్వీ పీతాభాస్వత్యణూపమా
తస్యాశ్శిఖాయా మధ్యేపరమాత్మా వ్యవస్థితః

అంటూ బియ్యపుగింజ మీద ఉండే తలకాయ మీద ఉండే బిందువంత నారయణుడున్నాడుట. వాడు బయటా, లోపలా కూడా ఉన్నాడుట. వాడి ఆధారంగానే జీవుడూ, జీవుడాధారంగా శరీరము ఉన్నది. మొత్తం వ్యాపించియున్న వెలుగు ఏదైతే ఉన్నదో ఆ వెలుగు మనలో మనలాగ ప్రతిబింబిస్తూంటే /మనలాగే ఎందుకు ప్రతిబింబిస్తుందంటే మన ఉపాధి/శరీరం ఎలా ఉంటే అదలా ప్రతిబింబిస్తూంటుంది. అంటే చెంబులో ఉన్న నీళ్ళు చెంబులాగ, గిన్నెలో పోసిన నీళ్ళు గిన్నెలాగా ఉంటాయి కదా! అసలు రూపం నీటికీ, వాయువుకీ, ఆకాశానికీ, ఆత్మతత్త్వానికీ లేదు. ఉపాధిని బట్టే రూపం. కనుకే మన హృదయంలో ఆ విధంగా గోచరిస్తే మనకెవరో కనబడ్డారని అనుకుంటూంటాం. ఎవరో కనబడ్డం కాదు. మనకి మనం కనబడ్డమే! ఇలా మనం ఓంకారం చేసినపుడు తొంబై తొమ్మిది మార్గాలుగా చిలవలు పలవలుగా అందులోకీ, ఇందులోకీ, ఉద్యోగాలలోకీ, వ్యాపారాలలోకీ, బంధుత్వాలలోకీ అలా పాకిపోతాం కదా, చెట్టువేళ్ళు పాకినట్లుగా. అలా మనసుతో చాలా దూరాలు వెళ్ళిపోతూంటాం కదా! విష్ణు సహస్రనామం ధ్యానం చేస్తుంటే ఎక్కడెక్కడో తిరిగిరాదూ మన మనస్సూ. ఇవన్నీ ఈ నాడుల ద్వారా బయటికి ప్రసరించేదే! పదార్థంలోకీ, పదార్థమయమైన విషయంలోకీ బాగా ప్రసరించి తొంబై తొమ్మిది రకాలుగా వెళ్లిపోతూంటాం కదా! ఈ వెళ్ళిపోయే వాటన్నిటిలో ఇరుక్కుపోతాం. అసలు నాడులు అంటే 'వెలుగు ప్రసరించే దారులని' అర్థం. 'Lines of force'. నువ్వు ఓంకారం చేయగానే ఆ నాడుల్లోంచి మన స్వామి మనల్ని పిలుస్తున్నాడని (శరీరానికి జీవుడే స్వామి) ఒక్కసారి సమీకరింపబడి హృదయంలో తాను నిలబడతాడు. తనకి ఊర్ధ్వంగా ఉన్న మూర్ధంలో (అంటే శిరస్సు) అక్కడ నుండి ఓ వెలుగు తన నుండి ప్రసరిస్తున్నట్లుగా భావన. అది ఒక్కటే ఊర్ధ్వముఖానికి దారి. దాన్నే 'సుషుమ్న నాడి' అన్నారు. అది హృదయం నుండే జరుగుతుంది. హృదయం నుండి ఆజ్ఞ వరకూ అది ఏర్పడి ఉంటుంది. ఆ ఏర్పడిన వెలుగు మార్గమున్నదే, ఆ మార్గాన్ననుసరించి తను ఊర్ధ్వగతిగా పైకి వెళ్తున్నట్లు భావన చేయాలి. తాను హృదయంలో కూర్చున్నాడుట అంటే అప్పటికే భూమి, జలము, అగ్ని ఈ మూడింటినీ దాటి వాయువుగా, తాను వాయు స్థానంలో కూర్చున్నాడన్నమాట! అంటే భూమికి పై స్థానంలో కూర్చున్నాడన్నమాట! తాను భూమిపైన ఉపస్థితుడైయున్నట్లు భావన చేసుకుంటూ, అక్కడ నుండి ఒక వెలుగుగొొట్టం లో నుండి పైన చూస్తే, ఆ పైన అమితమైన వెలుగున్నట్లు ఆ వెలుగును చేరడానికి మూడు ఓంకారాలూ జరిగేసరికీ ముందు సమీకరణం జరగాలి. ఆ తర్వాత ఓంకారం జరిగినపుడు ఆ గొట్టంలోంచి పైకిలేచి, ఆజ్ఞలోకి వస్తున్నట్లు ప్రయత్నం చేయాలి. అలావస్తే అర్చన అనేది సరిగ్గా/బాగా జరిగినట్లు. అర్చిర్ అనే పదానికి వెలుగు మార్గము అని అర్థము. అర్చిర్ మార్గము, ధూమ్ర మార్గమూ అని రెండు మార్గములున్నాయి. ఒకటి వెలుగుతో కూడినది, ఒకటి పొగతో కూడినదీ అని చెప్తారు. అర్చిర్ మార్గములో మనంచేసే ప్రయత్నమే 'అర్చన' అని చెప్తారు. ఎంతసేపు ఈ భావన ఉన్నదో అంతసేపు అర్చన జరిగినట్లు. ఈ భావన లేకుండా ఎంతసేపు కూర్చున్నా మన శక్తి వృథా అయినట్లే. అవడంలేదనుకోండీ, కాస్సేపు ఆగి మళ్ళీ చేయండి. ఇది భావన చేసుకోవచ్చు చక్కగా. హృదయం అనే గుహలో నువ్వు

కూర్చున్నావు. చుట్టూ చీకటి. క్రింద చీకటి, ప్రక్కన చీకటి. పైన రంధ్రం ఉన్నది.ఆ రంధ్రం నుండి సరాసరి నీ సహస్రారం మీదకి ఓ పెద్ద కాంతిపుంజం పడుతోంది. పైకిచూస్తే అది చాలా పైకి ఉన్నది. సినిమా చూస్తున్నప్పుడు projecter నుండి తెరమీదకి కాంతి ఎలా వెళ్తుందో అలాగ ఉంటుంది కాంతిపుంజం నిలువుగా. ఒక్కో ఓంకారం చేసినా, ఒక్కో భగవన్నామం చేసినా ఇక్కడనుండి అక్కడకు వెళ్తున్నట్లు. శ్వాస మనం పీలుస్తున్నప్పుడూ/inhalation/ ఉచ్ఛ్వాస చేస్తున్నప్పుడు నాసాపుట రంధ్రాల్లోంచి భ్రూమధ్యంలోకి వెళ్ళి, అక్కడనుండి శ్వాస దిగి హృదయంలోకి వస్తున్నట్లుగా భావన చేస్తూ ఇక్కడకు వెళ్ళిన శ్వాస, అక్కడుండే వెలుగుని మనముండే హృదయ గుహలోకి తీసుకువస్తున్నట్లూ, మళ్ళీ మనం నిశ్వాస చేసినపుడు పద్మాసనంలో కూర్చున్నవాళ్ళమే ఆ నిశ్వాసతో పాటు ఆ వెలుగు రంధ్రం ద్వారా పైకివెళ్ళి ఆజ్ఞలో కూర్చున్నట్లు, అంటే ఆయన్ని క్రిందకి పట్టుకొస్తూంటాం. మనం పైకి వెళ్తూంటాం. ఇట్లా చేస్తూంటే, చివరకు ఆ పైకివెళ్ళి ఆయనతో కూర్చోడం, కలయిక అవుతుంది. క్రమశః మన స్పందనం విశుద్ధి చక్రంలో బాగా వినిపిస్తూంటుంది. జీవుడు 'హంస స్వరూపుడు'. ఈ స్పందనకే 'హంస' అని పేరు పెట్టారు. కనుక ఈ స్పందనం ఇక్కడ వినిపిస్తుంటే, వాయువు అనాహత చక్రం, వాయు సంబంధమైనదాన్లో కూర్చున్నవాళ్ళం వాయువు నుండి, వాయువుకు పుట్టుక స్థానమైన ఆకాశంలోకి వెళ్ళడం జరుగుతుంది. ఆకాశంలో నుండి ఇంకా ఊర్ధ్వగతి చెంది (మనసులోకి వెళ్ళడం జరుగుతుంది. అదీ) భ్రూమధ్యం వద్దకు వెళ్ళడం. భ్రూమధ్యం నుండి మూడవ కన్ను వద్దకు వెళ్తే ఆజ్ఞలోకి వెళ్ళడం, అప్పుడాయన ఇంటికి వెళ్ళడం జరుగుతుంది. ఇదంతా ఎందుకు చెప్పకుంటున్నామంటే అర్చన చేసినపుడు మనయొక్క ఇహలోక అస్తిత్వాలు గుర్తుండరాదు. నీవెవరూ అంటే నేను జీవుడను. జీవుడిగా దేవుడి యొక్క ప్రతిబింబమును, ప్రతీకను. అలాగే సర్వజీవరాసులూనూ. ఓంకారం చేసి, నాలో అన్నిచోట్లా వ్యాపించియున్న నేనును సమీకరించుకొని, నేను హృదయమునకు చేర్తాను. అదీ ఓంకారం ద్వారా చేసుకోవాలి. చావడం కూడా ఇంతే. శరీరం వదిలేవారు ఇలా హృదయంలోకి సమీకరణం చేసికుని, అక్కడ నుండి ఊర్ధ్వగతిగా వెళ్ళి, ఆజ్ఞలోకి వెళ్ళి, అక్కడ నుండి ఇంకా ఊర్ధ్వగతిగా వెళ్ళి, వాళ్ళ ఓపిక కొద్దీ సహస్రారంలో నుండి వెళ్ళిపోతారు. అందుకే మహాత్ములంతా శరీరం వదిలేముందు ఉత్తరంగా ప్రయాణం చేశారు అని చెప్తారు. ఉత్తరంగా ప్రయాణం అంటే హిమాలయాలకు ప్రయాణం అని కాదు. అది సంకేతార్థం. రహస్యార్థం. ఊర్ధ్వముఖమును 'ఉత్తరము' అన్నారు. ఊర్ధ్వముఖము అంటే స్థూలం నుండి సూక్ష్మము. అసలు మనం ఆజ్ఞ అనే ద్వారం నుండి బయటకు వెళ్ళి, సమస్త సృష్టి లోనూ మనం ప్రత్యేగాత్మగా ఉంటూ కూడా విహరిస్తూ, జీవిస్తూ ఉండవచ్చు. మళ్ళీ ఇందులోకి వస్తూండవచ్చు. అది అసలు ఎప్పుడూ జరగాల్సిన సాధన. అలా జరిగితే శరీరం వదిలిపోయే సమయంలో కూడా సులభంగా వెళ్ళిపోతాం. అంతేకాదు, శరీరంలో ఉన్నప్పుడూ, లేనప్పుడూ కూడా శరీరం మనం కాదని తెలిసియుంటాం. అందుకని ప్రార్ధన చేసేటప్పుడు ముందు మిమ్మల్ని మీరు శరీరంలో సమీకరించుకుని, హృదయం లో ఆ వెలుగుయొక్క ప్రతిబింబంగా భావన చేయాలి.

శరీరం మనము కాదు. శరీర సంబంధమైన విషయములయందు ఆసక్తి కాసేపు ప్రక్కన పెట్టాలి. అందుకే సమస్యలూ, కర్మ బాగా పీడిస్తున్నవాళ్ళు అర్చన బాగా చేయలేరు. ధ్యానం బాగా చేయలేరు. తొంబై తొమ్మిది దారులలో బయటకు వెళ్ళడమే ఉంటుంది తప్ప, నూరవ దారిలో ఊర్ధ్వముఖంగా వెళ్ళడం అనేది బయట ముళ్ళు వేసుకున్న వాళ్ళకి వీలుపడదు. అందుకనీ ముందు ఈ morals అన్నీ చెప్తారు. సంఘంలో చిక్కుబడని జీవితం ఉండాలని చెప్తారు. తనవల్ల తప్పు లేకుండా, తనకు దేనియందూ మోహం లేకుండా ఉందనుకోండి అప్పుడు సాధన వీలవుతుంది. తనవల్ల తప్పులంటే తనకి ముడులు పడిపోతాయి. తనకి వేటిమీద మోహం ఉంటే వాటివల్ల ముడులు పడిపోతాయి. అందుకని మనవాళ్లు బయట జీవితాన్ని ఒక మాదిరిగా చక్కబెట్టుకోకుండా లోపలకి రావడానికి వీలులేదని చెప్పడానికే స్థిరమూ, సుఖమూ అయిన ఆసనము మనస్సుకు కలగాలని చెప్తారు. అది కాకుండా ఇది జరగాలంటే దురాశే. 'ఉట్టికెక్కలేనమ్మ స్వర్గానికేమి ఎగురుతుందన్న' సామెత ఉన్నది కదా! అందుకని మనకు దేహాత్మ భావన ఎంతున్నదీ, జీవాత్మ భావన ఎంతున్నదీ? నేనూ జీవుడ్నే, వీరూ జీవులే. వీరితో దేహపరమైన సంబంధములున్నవి. అవికాక శాశ్వతమైన జీవసంబంధమున్నది. జీవులుగా మనమందరమూ సోదరులము. దేహపరంగా సంబంధములు రకరకాలు భార్య, భర్త, పిల్లలు, అమ్మ, నాన్న ఇలా. నిన్ను నీవు జీవుడిగా భావన చేసుకుంటే విరోధి ఎవడూ ఉండడు. ఇష్టం లేనివాడుండడు. ఎందుకంటే జీవుడుగా ఇష్టం లేకపోవడం ఉండదు. దేహపరమైన సంబంధంలో, లావాదేవీలలో, పాంచ భౌతికమైన ప్రపంచంలో మనకు ఒకరి యందు ఒకరికి జరిగిన సన్నివేశాలను బట్టి ఇష్టాయిష్టాలు ఏర్పడుతుంటాయి. జీవుడికి ఏం ఉన్నాయి? జీవుడిగా నీవు కేవలం వాడి ప్రతిబింబమే! ఒకే సూర్యుడి వెలుగు ఉపాధిని బట్టి రకరకాలుగా పడుతుంది. కాబట్టి నిజానికి సరాసరి సంబంధం అక్కడ గానీ చుట్టుప్రక్కల ఉండే విషయాలలో లేదుకదా! దేహాత్మ భావన లేనివాడు మాత్రమే తాను కళ్ళు మూసుకుంటే తన హృదయంలో ఉండగలుగుతాడు. ఒక్కసారి ఓంకారం చేయగానే, siren కూస్తే workers factory కి పరుగెత్తినట్లు లోపల అంతటా వ్యాపించిన ప్రజ్ఞ సమీకరణం చెందాలి. హృదయంలో ఉండే ప్రాణాన్ని 'ముఖ్య ప్రాణము' అంటారు. మనకు 5 రకాల ప్రాణాలు.

1. అపానము --------- మూలాధారంలో ఉంటుంది.
2. ఉదానము --------- విశుద్ధిలో ఉంటుంది.
3. వ్యానము --------- సమస్తమూ వ్యాపనం చెందియుంటుంది.
4. సమానము --------- బొడ్డులో ఉంటుంది.
5. ప్రాణము --------- హృదయంలో ఉంటుంది.

కనుక ప్రాణం యొక్క రహస్యాలు తెలియాలంటే హృదయంలోకి ప్రవేశించి, ఊర్ధ్వగతిగా వెళ్తే అదే 'ముఖ్య ప్రాణం' దాన్నే 'merry life' అన్నారు ఒకాయన. అక్కడ నుండి ముఖ్య ప్రాణం ఒకటి దిగి మన లోకాలలోకి వస్తుంటే, ఆ ముఖ్య ప్రాణం ఆధారంగా ఇంకా నాలుగు ప్రాణాలు ఏర్పడినాయి. అపానము, వ్యానము, ఉదానము, సమానము. ఈ నాలుగు ప్రాణాలూ ముఖ్య ప్రాణం లోకి సమన్వయం

చెందుతాయి. అవగాహన చేసికుని చక్కగా ఓంకారం చేసుకోండి. చేసిన తర్వాత ఆ గొట్టం పట్టుకుని పైకి వెళ్తూ క్రిందకి వస్తూ, పైకి వెళ్తూ క్రిందకి వస్తూ అలా భావన చేసుకుంటూంటే, పైకి వెళ్ళడానికి నిశ్వాస వాడుకో, ఆ వెలుగు కిరణాలను క్రిందకి బగా దింపుకుని, మనకి బాగా స్ఫూర్తి నివ్వడానికి ఉచ్ఛ్వాసని వాడుకో. ఇలా వాడుకుంటూ జరిగాక శ్వాస చేయవలసిన అవసరం లేని సందర్భంలో 'స్పందనం' మాత్రమే మిగిలియుంటుంది. ఆ స్పందనం ఊర్ధ్వగతి చెందుతూంటుంది. మూలాధారంలో స్పందనం వినిపిస్తుంది. బొడ్డులో, హృదయంలో, విశుద్ధిలో, మన నోట్లో, మన దంతాల పైన ఉన్న చిగుళ్ళలో, పై అంగుటిలో, ముక్కులో, ఆ ముక్కు పైన ఉన్న వంతెనలోనూ స్పందనం వినిపిస్తుంది. ఇంక అక్కడ నుండి పైకి వెళ్తూ ఉంటుంది. అప్పుడిహ కేవలం నీవు స్పందన స్వరూపుడివే, హంస స్వరూపుడివే, వెలుగు స్వరూపుడివే! నీవు ఇక్కడికి వెళ్ళాక అసలు నీ శరీరం గానీ, చుట్టుప్రక్కల గానీ ఏమీ గుర్తుండవు. ఆకాశంలో నీవొక్కడివే అలా విహరిస్తున్నవాడివిగా ఉంటావు. అలా వెళ్తూ వెళ్తూ వెలుగులో లీనమవుతావు. అదీ 'కుంభః' అంటే. 'అర్చిష్మాన్ అర్చితః కుంభో' అన్నారుగా. వెలుగు గోళంలోకి మనం చేరిపోతామండీ. పూర్ణపురుషుడు అని చెప్పడానికి 'కుంభః' అని చెప్తారు. కుంభం పూర్ణత్వానికి సంకేతం. కుంభ చైతన్యంలో, ఈ కుంభ తత్త్వాన్ని పరిపూర్ణంగా అవగాహన చేసికోవడానికి అవకాశము ఎక్కువ. ఆ విధంగా కుంభ చైతన్యాన్ని అందుకున్న వాడికి జనన మరణాలుండవు. ఎందుకూ? పూర్ణపురుషుడు కనుక. తనకి పదార్థంలోకి వచ్చే దారి తెలుసు, పరమార్థంలోకి వెళ్ళే దారి తెలుసు. ఇటు రాగలడు, అటు పోగలడు. కనుక ఆయనయే వెలుగు గోళం. బ్రహ్మాండం అంతా వెలుగుతో నిండియున్నాడు. ఆయనయే అర్చన మార్గంగా, వెలుగు మార్గంగా ఉన్నాడు. ఆయనయే సృష్టికి అతీతంగా, పూర్ణంగా ఉన్నాడు. ఇలా భగవంతుని అవగాహన చేసుకోవాలి. అలాంటివాడు మార్గంగా ఏర్పడడంలో మనకి కూడా ఓ అవకాశం దొరికింది. మనం ఇటునుండి అటు మళ్ళీ వెళ్ళడానికి మనం కూడా ఆ పూర్ణములోంచి వచ్చిన పూర్ణములమే. 'పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే' పూర్ణంలోనుండి పూర్ణమే వచ్చింది బయటకి. అంతేనా! 'పూర్ణస్య పూర్ణమాదాయా' మళ్ళీ ఈ పూర్ణంలో నుండి బయటకు వచ్చినా, మళ్ళీ పూర్ణం అందించినా ఇది పూర్ణంగానే ఉంటుంది. అందులోంచి ఎన్ని బయటకి వచ్చినా అది పూర్ణంగానే ఉంటుంది. జ్ఞాని తన వద్ద ఉండే జ్ఞానాన్ని ఎంతమందికి పంచినా అతని వద్ద ఉండే జ్ఞానం తగ్గుతుందా! తగ్గదు కదా! అదీ పూర్ణత్వం. జ్ఞానం అన్నా ఆత్మతత్త్వం అన్నా ఒకటే. అందుకే దీనికి ఎప్పుడూ పూర్ణత్వమే ఉంటుంది. ఎంత తీసినా, ఎంత కలిపినా కూడా పూర్ణమే. భాగాహారం చేసినా, హెచ్చవేసినా కూడా పూర్ణమే. ఏం చేసినా పూర్ణమే ఉంటుందని చెప్పడం. కుంభరాశి తత్త్వానికి సంబంధించిన ఓ మహత్తరమైన శ్లోకం. మన వరకూ 'అర్చన' కదా మనం చేసేది. ఏదో రకంగా మనం అర్చనే చేస్తున్నాం. ఓంకారం చేయవచ్చూ, శ్వాసమీద మనస్సు లగ్నం చేయవచ్చూ, స్తోత్రం చేయవచ్చు. ఇవన్నీ ఎందుకుచేస్తామంటే ఈ అర్చిర్ మార్గంలో/ వెలుగు మార్గంలో నడిచి వెలుగు ఎక్కడ పుడుతుందో దాంట్లోకి, ఆ సరస్సులో మునగడానికి అనండి, అందులో స్నానం చేయడానికి అనండి లేదా

అందులో ఉండిపోవడానికి అనండి. అందుకని అర్చన ఎప్పుడు సఫలమౌతుందీ? గోత్రనామాలు చెప్పకుంటే కాదు. ఇవి కేవలం ఈ రూపంలో ఉన్న జీవుణ్ణి అని చెప్పకోవడానికి చెప్పకోవచ్చు. కానీ హృదయము నందు తన్ను తాను సమీకరణం చేసుకుంటే 5 సంవత్సరముల పిల్లవాడిగా తనకి తాను గోచరిస్తాడు. అది 'బాలదశ'. సాధనలో 5 సంవత్సరముల పిల్లవాడిగా గోచరించిన వాడు 16 సంవత్సరముల పిల్లవాడిగా గోచరిస్తాడు. పూర్తి కళలు వచ్చేసరికి అంత అవుతుంది. ఇలా బాలదశలో తనకి తను గోచరించినపుడు అది ఒక శుభారంభం. తన్ను తాను గోచరింపచేసుకున్నాక అదే భగవద్దర్శనం కాదు. తను మొత్తం తత్త్వం యొక్క ప్రతిబింబము. అది నేనే. నేను ఆ మొత్తంలో ఇముడుతాను. ఆ మొత్తమే నాలోంచి పనిచేస్తోంది. వాడూ నేనూ ఉన్నాం. మేమిద్దరం ఆడుకోవడానికి రంగస్థలం అంతా ఉంది. వాడు చెప్పిన ధర్మాల ప్రకారం ఆడుకుంటే వైభవం. సొంతంగా ఆడుకుంటే అదొక రకం. మనం ఏ పూజలు చేసినా బహిర్గతంగా చేస్తాం. ఎందుకు చేస్తాం? అంటే పవిత్రీకరింపబడ్డ ఆత్మతత్త్వం కలిగియుంటే తప్ప ముందు మూడూ ( అర్చిష్మాన్, అర్చితః, కుంభః) దొరకవు. దీనికోసం ముందు 'విశుద్ధాత్మ' అవ్వాలి, 'విశోధనః' అవ్వాలి. నామాలన్నీ ప్రతి శ్లోకంలోనూ ఒక క్రమంలో ఉంటాయి. వాటికి సాధన పద్ధతి కూడా ఒకటి ఉన్నది.

## 662, 663 విశుద్ధాత్మా, విశోధనః

విశోధనః అంటే మనలో, మనల్ని మనం పవిత్రీకరించుకునే స్ఫూర్తిగా భగవంతుడుంటాడట. కొంచెం శుభ్రంగా ఉందాం అని మనకి అనిపించిందనుకోండి. శుభ్రంగా ఉండడానికీ, గొప్పదనానికీ సంబంధం లేదు. సంపదతో సంబంధం లేదు. పాదాలు చక్కగా శుభ్రంగా ఉంచుకోవాలంటే ఏం కావాలండీ? మన పాదాలు ఎందుకు శుభ్రంగా ఉండకూడదండీ? తల శుభ్రంగా ఉంచుకోవాలి అంటే దువ్వుకొని సరైన సంస్కారం చేసుకోవాలి. ముఖం శుభ్రంగా ఉంచుకోవాలి, ఒళ్ళు శుభ్రంగా ఉండాలి అంటే ఏం కావాలి? వేసుకునే దుస్తులు శుభ్రంగా ఉండాలంటే ఏం కావాలి? మూడు రోజులూ కుళ్ళు బట్టలు వేసుకునే కంటే రోజూ ప్రొద్దుటా, సాయంత్రం మార్చుకుని శుభ్రంగా ఉండవచ్చు కదా! ముందు భౌతికమైన శుభ్రం తో మొదలై తర్వాత వాచికంలో శుభ్రత. అంటే మన మాటల్లో ఎంత సత్యం గోచరిస్తే అంత మంచిది. అన్నీ అబద్ధాలే చెప్తూ, భగవత్తత్త్వం గురించి చెప్తూంటే నిన్ను నీవు మోసం చేసుకుంటున్నట్లు అర్థం. భౌతిక లోకంలో ఉండే పవిత్రత, భావమయమైన పవిత్రత ఉండాలి. భావాల్లో పవిత్రత ఉండాలి గానీ manipulations ఉండరాదు. భావ పవిత్రత లేకపోతే పవిత్రత ఎలా వస్తుంది? ఛీ, ఎన్నాళ్ళిలా భావ పవిత్రత లేకుండా జీవిస్తానూ అని మనలో మనకు అనిపించిందనుకోండీ, అదీ 'విశోధనః' అంటే. మనమీద మనం చేసే పనులు, మాట్లాడే మాటలు, వచ్చే ఆలోచనల మీద రోత పుడ్తుంది. ఏదోరోజు ప్రతి మనిషికీ పుడుతుంది. పుట్టాలి. ప్రపంచం అంతా అసత్యమే. అలాగే జరుగుతూంటుంది. అందులో నీవు సత్యవంతుడిగా జీవించడం సామాన్యమైన విషయం కాదు. ధీరత్వం కావాలి నీవు సత్యవంతుడిగా జీవించాలంటే. ముఖ్యంగా భావ శుభ్రత, భావంలో ఎవరి గురించి ద్వేషపూరితమైన ఆలోచనలు వస్తున్నాయో చూసుకోవాలి. ఎవరి గురించి ఈర్ష్య కలుగుతోందో చూసుకోవాలి. ఎవరిమీద క్రోధం కలుగుతోందో చూసుకోవాలి. ఎవరిమీద అక్కరకు మించిన మమకారం కలుగుతోందో చూసుకోవాలి. వీటివల్ల ఉపయోగం లేదుకదా! అరిషడ్వర్గాలు మనకి తాండవమాడుతూంటాయి. గర్వం ఉందేమో చూసుకోవాలి. మదం ఉందేమో చూసుకోవాలి. మన గురించి పదిమంది మంచిగా చెప్పుకుంటున్నారా అని ఆరాటపడుతున్నామేమో చూసుకోవాలి. అబద్ధాలు చెప్తున్నామేమో చూసుకోవాలి. ఇవన్నీ భావమయ లోకంలో చాలా చూసుకోవాలి. అట్లాగే కోరికలు తీర్చుకోడానికి కూడా రకరకాలుగా మెలికలు వేస్తూంటాం. రకరకాల పద్ధతులు వాడతాం. దేవుణ్ణి కూడా వాడతాం. సాధన కూడా వాడతాం. గురువు గారి పేరు వాడతాం. ఏమైనా వాడగలం మనం. కేవలం మన కోరికలని పరితృప్తి పరచుకోడానికే కదా చేస్తాం. ఇహ ఆపైన శరీరం. శరీరంలో మాలిన్యాలు ఎప్పటికప్పుడు శుభ్రంగా బయటకు పంపిస్తున్నామో లేదో చూసుకోవాలి. అంటే విసర్జించకుండా మళ్ళీ నోట్లో ఏమీ పెట్టుకోకూడదు. ఆయుర్వేదం ఏం చెప్తుందంటే, మలవిసర్జన కాకుండా మళ్ళీ ఏమన్నా తింటే అంతకన్నా చండాలం లోపల శరీరంలో జరిగేది ఇంకేమీ లేదు అని,

ముందు విసర్జన కాకుండా నోరు తెరవక తినడానికి అని చెప్తారు. ఎందుకంటే లోపల పాయిఖానా పెట్టుకుని ఇది తింటే, ఇదీ అదీ కూడా కలిసిపోతుందిరా అని. కడుపులో బాగా gas వస్తుంది. అప్పుడు ఏదోవిధంగా మలవిసర్జన అయ్యేంతవరకూ తిండి తినకూడదు. మొత్తానికి అది వెళ్లిపోవాలి. కాలిగోళ్ళు పెంచుకోకూడదు. జుట్టు ఉంటే సంస్కరించుకోవాలి. శరీరం నీది కాదు, భగవంతుడు నీకిచ్చింది కాబట్టి ఎంత పవిత్రంగా ఉంచుకోవాలో అంత పవిత్రంగా ఉంచుకోవాలి, మిలమిలలాడుతూ. వెలుగు కదా అర్చిష్మాన్ కదా! వెలుగు కనబడాలి శరీరంలో. శరీరానికి పోషణ చేయాలి కానీ మమకారం, మోహము పడకూడదు దానిమీద. కోరికలయందు శుద్ధత్వం ఉండాలి. భావములయందు పవిత్రత ఉండాలి. 'విశుద్ధాత్మా' గా తయారైతే అప్పుడు ముందు మూడు నామాలలోకీ ప్రవేశించవచ్చు. విశుద్ధాత్మ విశోధనః అంటే purify అయ్యారు. 'పవిత్రీకరించేవాణ్ని కూడా నేనే' అని చెప్తున్నారు. నువ్వే పవిత్రీకరిస్తావు. మనలో ఆ స్ఫూర్తి కలగడమే అదృష్టం. కాస్త హాయిగా తల దువ్వుకోవచ్చు క్షవరం చేయించుకుంటే అనే భావన మనలో కలిగిందనుకోండి, జిడ్డు మొహం వేసుకు తిరక్కుండా కాస్త కడుక్కుందాం అనుకున్నారనుకోండి, ఒళ్ళు వాసన వేస్తుంటే ప్రొద్దుట చేశాం కదా అనుకోక, మళ్ళీ స్నానం చేశాం అనుకోండి ఇవన్నీ శుభలక్షణాలన్నమాట! ఒళ్ళు వాసన కొడ్తూంటే అత్తరు సాయిబల్లే సెంటు కొట్టుకు తిరగడం కాదు. వాళ్ళంతా ఎడారి ప్రాంతంలో, కొండ ప్రాంతాలలో పూర్వం తిరుగుతూండేవారు. పాపం వారికి నీరు ఎప్పుడో గానీ దొరికేది కాదు. ఈ లోపల శరీరం కంపుకొట్టకుండా కాస్త అత్తరు రాసుకు తిరుగుదాం అని రాసుకునేవారు. ఆ అత్తరు మనకి కూడా అందించారు. మనకి నీళ్ళున్నా కూడా ఆ అత్తరు పూసుకొని, స్నానం మానేశామనుకోండీ, బయట సువాసనా లోపల కంపు కదా! అందుకని ఈ లోకాలలో అంటే భావమయము, కామమయము, వాచికము, భౌతికము ఇన్నిచోట్లా ఏమాత్రం పవిత్రత ఉన్నదో ఎవరికి వారు చూసుకోవాలి. ఇంకోళ్ళు చెప్పేదేమీ ఉండదు, చెప్పకూడదు కూడా. నువ్వు ఆత్మ సాధన చేసుకుందామనుకుంటే రోజూ ప్రొద్దున్నే ఈ నాలుగూ విప్పతీసి చూసుకోవాలి. బీరువా తెరిస్తే నాలుగు అలమరలూ ఎలా ఉన్నాయో కనిపించినట్లు. సర్దుకుని, అప్పుడూ ఓంకారం. పుట్టెడేసి బుర్ర నిండా పెట్టుకుని ఎన్ని పూజలు చేసినా, విష్ణు సహస్రనామాలు ఎన్ని చేసినా ఫలితం ఎందుకివ్వవూ అంటే ఇందుకివ్వవు. దేహాత్మ భావనతో చేసే పూజలు ఫలించవు. నువ్వు దేహం కాదు. ఈ దేహం నీ ఇల్లు. ఈ ఇల్లు ఎంత శుభ్రంగా ఉంచుకుంటే అంత హాయిగా ఉండవచ్చు. శుభ్రంగా ఉంచుకోకపోతే నిన్ను బంధిస్తుంది. శుభ్రంగా ఉందామన్న భావన కలగడమే నేను. కృష్ణుడు కుబ్జను ఎలా ఉద్ధరించాడూ? కుబ్జ ఏమిటీ? మూడు వంకరలగా ఉన్నదని చెప్తారే. ఇదే. భావమయ లోకంలో వంకర, కామమయ లోకంలో వంకర, భౌతికంగా వంకర. మనకి భౌతిక వంకరే తెలుస్తుంది. ఎందుకంటే త్రివక్ర కదా! మనమంతా కుబ్జలమే. త్రివక్రలమే. మరి ఈ మూడు వంకరలూ ఎలా తీసేసాడాయన? So He is the purifier. అందుకని ఆయన 'విశోధనుడు'! ఈ నామాలన్నిటికీ కృష్ణుని జీవితంలో సన్నివేశాలు గోచరిస్తాయి. విశోధనుడు చేస్తే ఏమయ్యింటీ ఆమె అప్పటినుండి కృష్ణుణ్ణి తప్ప ఏమీ కోరుకోని

స్థితిలోకి వచ్చిందిట. ఈ సమస్తమూ, నేను, నా శరీరం నీకు సంబంధించినదే కాబట్టి నీకే అర్పితం అని చెప్పింది. అదీ త్రివక్ర చేసింది. కుబ్జ అంటే పిల్లి బుర్ర అని అర్థం అంటే పొట్టిగా ఉంటుందని. అంటే దేనిలో పొట్టి, బుద్ధిలో పొట్టి, వంకర అన్నమాట. ఇన్ని వంకరలు పెట్టుకుని నిన్ను నీవు మోసం చేసుకోక. సాధన చేసుకోవాలంటే వంకరలు తీసుకోవాలి. అందరికీ వంకరలు ఉంటాయి. ఇంకోడి వంకరలు తీసే పని మనకి లేదు. మన వంకరలు మనం తీసుకుంటుంటే, మనల్ని చూసి వాడు నేనూ తీసుకుంటాను అంటే ఆ-- నువ్వు కూర్చుని సాగదీసుకో. అంతేగానీ నువ్వు వాడిమీద సవారీ చేయక. తాను జీవుడు, అలాగే అందరూనూ. అలాగే చెట్టూ, కుక్కా, పందీ, మనింట్లో పని చేసేవాళ్ళు. అందరూ జీవులే! కనుక జీవులుగా మనం సోదరులం. ఇది స్థిరపడితే అప్పుడు జరిగేది అర్చన! మన బుద్ధి తిరగబడక ముందు అర్చన చేయకూడదా అంటే, చెయ్యండి. శుభ్రం చేసుకోవడానికి చేయండి. వాడికీ, నీకూ మధ్య వంతెన నిర్మాణం చేసుకుని ఆ వంతెన మీద నువ్వు నడచివెళ్తూంటావ్. అంటే ఎగురుతూ వెళ్ళడమే. రెక్కలుంటాయి. ఎగురుకుంటూ వాడిలోకి వెళ్ళిపోతే తన్మయత్వం. అందుకని విశోధనము లేక పవిత్రీకరణము జరగడం చేత జీవాత్మ పవిత్రాత్మ అయితే, పవిత్రాత్మ ఈ అర్చిర్ మార్గం గా వెళ్తూంటే పూర్ణత్వం రావడం, తాను వెలుగవడం ఇంతుంది కార్యక్రమం. అందుకని

'అర్చిష్మాన్'-- అంటే దేదీప్యమానమైన, అమితమైన వెలుగు, కాంతి అని అర్థం.

'అర్చితః' -- అక్కడ నుండి ఏర్పడినట్టి వెలుగు మార్గము.

'కుంభః'-- పూర్ణత్వము, సమృద్ధి.

'విశుద్ధాత్మా'--విశిష్టమైన, శుద్ధి కలిగిన ఆత్మతత్త్వంగా ఆయనే గోచరిస్తూంటాడు. అందుకనే మహాత్ముల
రూపంలో భగవంతుడు ఆ విధంగా దర్శనం ఇస్తూంటాడు.

'విశోధనః'---తనను తాను పవిత్రీకరించుకునే సాధకుని రూపంలో సాధనగా గోచరిస్తున్నది భగవంతుడు.

భీష్ముడికి అలాంటి ఋషి దృష్టి ఉన్నది. కాబట్టి సాధకుడి యందు సాగే సాధన భగవంతుడు. సాధన ద్వారా కలిగిన పవిత్రత భగవంతుని యొక్క అస్తిత్వము. అక్కడ నుండి వెలుగు దారి, అక్కడ నుండి పూర్ణత్వం, అక్కడ నుండి పూర్ణమైన వెలుగు. ఇలాగ సమస్తాన్నీ దర్శనం చేయడం మనకి మొదటి పాదంగా చెప్పారు.

## 664 అనిరుద్ధః

ఇట్లా తయారైనవాడికి ఇహ అడ్డూ ఆపూ ఏమీ లేదండీ. అనిరుద్ధుడు అంటే నిరుద్ధము చేయడానికి శక్యము కానివాడు. 'నిరోధ్' అనేది సంస్కృత పదం. నిరోధ్ అంటే నిరోధించడం. నిరుద్ధుడు అంటే నిరోధింపబడేవాడు. అనిరుద్ధుడు అంటే బొత్తిగా ఎవ్వరూ ఆపలేరు. నిరోధింపలేరన్నమాట. భగవత్తత్త్వం కి దిగిరావడం అనే సంకల్పం కలిగితే ఏదీ ఆపలేదు. అసలు స్తంభమే ఆపలేదు. అందులోంచి భళ్ళున బయటికి వచ్చాడు కదా! శ్రీకృష్ణుని ఎవరు, ఎక్కడ ఆపగలిగారూ? అనిరుద్ధుడిగా శ్రీకృష్ణుని చూస్తే ఎక్కడా అడ్డూ ఆపూ లేదాయనకు. ఎక్కడకి వెళ్ళలేడూ? మృత్యు లోకాల్లోకి కూడా వెళ్ళివచ్చి, గురువుకి అతని తనయుణ్ణి తెచ్చి అందించాడే. వరుణ లోకం లోకి వెళ్ళి తన తండ్రిని తీసుకువచ్చాడు. నందుడు మరీ ప్రొద్దున్నే, సాధనకి బ్రాహ్మీ ముహూర్తమునకు ముందు వెళ్ళాడు. అందుకు వరుణుడు లాగేశాడు. సాధనలో మనకి కొంత anxiety ఉంటుంది అందరి కన్నా ముందు చేసేయాలని. ఆ ముందర వెళ్ళడంతో నందుణ్ణి వరుణుడి భటుడు లాగేశాడు. తీసుకుపోయి వరుణ నగరంలో పెట్టాడు. ఏడీ ఈయన నీళ్ళల్లోకి వెళ్ళినాయన కనబడలేదంటే, ఈ కృష్ణుడు వరుణ నగరం వెళ్ళిపోయాడట. వెళ్తే వరుణుడు ' నా భటుడు చేసింది తప్పయినా, నాకు మహోపకారం చేశాడు. నిజంగా నువ్వు సశరీరుడవై నా లోకంలోకి వచ్చావు' అని పూజలు చేసి, క్షమించమని ఆయన తండ్రి నందుని పువ్వుల్లో పెట్టి ఇచ్చేశాడు, ఈయన పట్టుకు వచ్చేశాడు. అదీ అనిరుద్ధత్వం. బాణాసురుడు కృష్ణుడి మనుమడు అయిన అనిరుద్ధుణ్ణి దాచేస్తాడు. వాడు అనిరుద్ధుడు కాదు తత్త్వం ప్రకారం. ప్రద్యుమ్నుడి కొడుకు అనిరుద్ధుడు. ప్రద్యుమ్నుడు కృష్ణుడి కొడుకు. బాణాసురుడి కూతురు అనిరుద్ధుణ్ణి కావాలంటుంది. అందుకని ఎవరికీ తెలియకుండా దాచేశాడు బాణాసురుడు. అన్నీ నీకు సమకూరుస్తాను, మా అమ్మాయితో హాయిగా ఉండు అని House-arrest చేశాడన్నమాట! అక్కడకు కూడా వెళ్ళి బాణాసురుణ్ణీ, రుద్రుణ్ణీ కూడా జయించి తెచ్చేశాడు మనుమణ్ణి. రుద్రుడు కూడా ఆపలేకపోయాడు కృష్ణుణ్ణి. రుద్రుడు వేరు, పరమ శివుడు వేరు. పరమ శివుడు అంటే అంతర్యామి తత్త్వం. రుద్రుడంటే పంచభూతాలలో vibrations/స్పందనాత్మకమైన చైతన్యాన్ని రోదనము లేక రుద్రము అంటారు. ఆ పంచభూతాలకు అధిదేవత 'యో రుద్రో అగ్నౌయో అప్సుయ ఓషధీషు' అంటాం కదా! అక్కడ పంచభూతాలూ వస్తాయి. విశ్వమంతా వ్యాపించినట్టి తరంగములను కూడా జయించి, బాణాసురుణ్ణి జయించి అనిరుద్ధుణ్ణి పట్టుకొచ్చేశాడు. అదీ అనిరుద్ధత్వం! తిరుగులేదు! దుర్యోధనుడు వచ్చి 'అతడ్ని సభలోకి రానియ్యనక్కర లేదు' అన్నా వచ్చేశాడు. సత్రాజిత్తు మా ఇంటికి రావడానికి వీలు లేదంటే, గోడల్లోంచి వచ్చేస్తాడు. ఎందుకంటే సత్యభామ కావాలనుకుంటుంది కాబట్టి. ఎక్కడికి రాలేడూ నీ లోపలకి కూడా వచ్చేస్తాడు. అనిరుద్ధ నామంలో అడ్డూ ఆపూ లేకుండా ఎక్కడకైనా రాగలిగిన తత్త్వం. నిజానికి రాగలగడమేమిటి? ఉన్నదదే. దాని ఆధారంగా, దానిచుట్టూ అల్లుకున్నది కనుక ఎక్కడ నుండైనా వ్యక్తం

కాగలడు. కృష్ణుడు అలా అనిరుద్ధత్వాన్ని చూపించాడు. మొత్తం 120 సంవత్సరాల జీవితంలో ఎన్నో రకాల సన్నివేశాల్లో విపరీతంగా చూపించాడు. తను వచ్చి రుక్మిణిని తీసుకువెళ్తుంటే, అక్కడున్న వాళ్ళంతా తెల్లమొహం వేసుకు చూస్తూ ఉండిపోయారు, ఈయనతో యుద్ధం చేద్దామనుకున్నవారంతా. ఏమీ చేయకుండా అలా ఉండిపోయారు. నవ్వుతూ వాళ్ళ ప్రక్క చూస్తూ వెళ్ళి, రుక్మిణి చేయి పట్టుకొచ్చి రథంలో కూర్చున్నాడూ, రథం వెళ్ళిపోయింది. అప్పుడు వీరందరికీ తెలివొచ్చింది. ఇదీ అనిరుద్ధత్వం!

## 665 అప్రతిరథః

రథం అంటే శరీరం అని అర్థం. తనను ప్రతిఘటించే రూపం ఈ ప్రపంచంలో లేదు. పిచ్చివాళ్ళు తెలియక రకరకాలుగా ప్రయత్నం చేశారు, అంతే. పూర్ణపురుషుడు అంటే కృష్ణుడే అని చెప్పుకోవాలి. తిరుగులేనటువంటి వ్యాపనమూ, తనను ఎదిరించి నిలువలేని రూపమూ కలిగిన ఇంకో రూపం. ఏముందీ అక్కడంతా అతడేగా ఉన్నాడూ. తత్త్వపరం గా చూస్తే అన్ని రూపాల్లోనూ అతడే కదా! ఇంకో రూపంలో అయినా మనమే. మనం ఆ రూపం లోంచి ఇటు వచ్చేస్తే పడిపోతుంది. Tube లో light, switch ఆపితే పోలేదూ? Switch మనవద్ద ఉన్నది. ఆపితే అది ఆగిపోయింది. అదేంటంటే, అది అంతే. అదే యుద్ధంలో చేస్తాడు. వారి ఆయువులన్నీ తన నవ్వుతూ అందర్నీ ఒక్కసారి ఆకర్షించేసి, ముఖ్య ప్రాణం ద్వారా లాగేస్తాడు. కొబ్బరికాయలో నీళ్ళు straw తో జుర్రున జుర్రేస్తే లోపల ఏమీ ఉండదుగా! అలా ఆయన చూపులతో లాగేస్తే, మిగతా డొల్లలన్నీ అర్జునుడు కొట్టుకున్నాడని భాగవతంలో పద్యమొకటి ఉన్నది. అదీ ఆయన అప్రతిరథత్వం! అంటే తనకు ఎదురు నిలబడి మనగలిగిన వాడెవ్వడూ లేడు. ఎందుకనీ? తనలోంచి వచ్చినవాడే కాబట్టి వాడు. తనలోంచి వచ్చినవాడు తను జుర్రేస్తే వచ్చేస్తాడు. అందుకని ఎన్ని రూపాలు బయటకి వచ్చినా, అన్ని రూపాలుగా వచ్చిందీ అతడే! నువ్వే రూపం చూసినా, ఆ రూపం నిన్ను ఇబ్బంది పెడుతోందనుకో, ఈ నామం సాధన చేస్తే, ఆ రూపం ఇహ నీకు ప్రతికూలంగా ఉండదు, అనుకూలంగా ఉంటుంది. అదే సాధకునకు ఓపిక, సహనం, క్షమ, వేచియుండగలగడం ఉండాలి. వేచియుంటే ఎంతటి ప్రతికూలుడైనా అనుకూలుడుగా మారతాడట, మరీ దుష్టుడైతే తప్ప. మరీ అలాంటివాడు ఎక్కడో ఒక్కడే ఉంటాడు. దుర్బలులే ఎక్కువుంటారు. మంచివాడు కాదనుకునేవాళ్ళు బోలెడు మంది ఉంటారే వాళ్ళంతా మంచివాళ్ళే. మనలో కొన్ని రుగ్మతలు ఎలా ఉంటాయో, వాళ్ళల్లోనూ అలాగే ఉంటాయి. మనం దుర్బలత్వానికీ, దుష్టత్వానికీ తేడా తెలియకుండా అందర్నీ ఒకే తరగతిలో పడేస్తూంటాం. దుష్టులు ఎక్కడో గానీ ఉండరు. దుర్బలులు అన్నిచోట్లా ఉంటారు, మనతో సహా. మనకుండే బలహీనతలు మనకున్నాయి. ఇంకోడికి ఇంకో బలహీనతలుంటాయి. వాడికుండే బలహీనతలు నీకు లేకపోవడం వలన వాడిని నువ్వు ఇంకో రకంగా చూడనక్కరలేదు. నీకున్న బలహీనత వాడికి లేకపోవచ్చు కదా! వాడిలో ఉన్న వాణ్ణి గనక మనం దర్శించడం మొదలుపెడ్తే, వాడు నెమ్మదిగా మనకి సహకరించడం మొదలుపెడ్తాడు. ఎదురుండదు. కృష్ణుడిని ఎవ్వరూ ఎదిరించి నిలువలేకపోయారు. చూపులతోనే పడిపోయారు. ఎందుకనీ? చూపు సరాసరి వాడిలో ఉండే తత్త్వంలోకి వెళ్ళిపోతుంది. వాడు ఈయన ప్రతిబింబమే! అందుకని ఆ విధంగా నిర్వర్తించి చూపాడు.

## 666 ప్రద్యుమ్నః

సంకర్షణ, వాసుదేవ, ప్రద్యుమ్న, అనిరుద్ధ వ్యూహములు 4 ఉన్నాయి. ఈ 4 వ్యూహములుగా భగవత్తత్త్వమే ఉంటుంది. చతుర్మూర్తిః, చతుర్బాహుః, చతుర్వ్యూహః, చతుర్భుజః. ఇలా నాలుగుగా వచ్చినవన్నీ ఈయనే. మొత్తం అంతా వ్యాపించినవాడు, ప్రత్యేగాత్మగా, అహంకారంగా ఒక్కొక్కళ్ళం, ఒక్కొక్కళ్ళం ఉన్నట్లు భావం చేసేట్టి 'సంకర్షణ' గా ఏర్పడుతుంది. అక్కడ నుండి దాని వెలుగు, ఆత్మతత్త్వం యొక్క వెలుగే, బుద్ధి! అదీ ప్రద్యుమ్నుడు! ఆ వెలుగు యొక్క ప్రసారం కిరణాల ద్వారా ఉంటుందే, అది అనిరుద్ధుడు! అందుకే నామాలలో 4 వ్యూహాలలో 2 వ్యూహాలు మళ్ళీ ఇక్కడ వస్తాయి. అనిరుద్ధుడి తండ్రి ప్రద్యుమ్నుడు అని చెప్పడంలో ఉద్దేశ్యం ఏమంటే అనిరుద్ధత్వం అనేది కిరణాలుగా ప్రసరించి ఎందులోకైనా దూసుకు వెళ్ళిపోయేది. ఈ కిరణములకు పుట్టుక స్థానమైన వెలుగుగా గా ప్రద్యుమ్నుణ్ణి చెప్తారు. ప్రద్యుమ్నత్వం అంటే మనలో బుద్ధి యొక్క వెలుగు ఇంద్రియములలోకి కూడా ప్రసరింపచేయగలిగితే అనిరుద్ధత్వం సాధ్యం అవుతుంది. అందుకని అనిరుద్ధుడు హృదయం దగ్గర ఉండి, అక్కడ నుండి ఇంద్రియాలలోకి ప్రసరిస్తుంటాడని చెప్తారు. ఇంద్రియాలలో వెలుగు ప్రసరిస్తుంటే, ఇంద్రియాలు కూడా అశుద్ధాన్ని కోరవు. పంచేంద్రియాలూ శుద్ధమైనవే కోరతాయి. మరొకటి కోరవు. అప్పుడు అనిరుద్ధుడు. అంతకు ముందు బుద్ధిలోకంలో ఉండేది ప్రద్యుమ్నుడు. అంతకు ముందు జీవాత్మగా ఉండేది సంకర్షణుడు. అంతకు ముందు వాసుదేవుడిగా ఎప్పుడూ ఉంటాడు. ఈ నాలుగు వ్యూహాలూ చాలా వివరంగా కపిలుడు దేవహూతికి చెప్పాడు. వీలుంటే చదువుకోండి. English లో 'Sankhya' పుస్తకంలో అదే విషయం చెప్పాను. మనం ఈ నాలుగు స్థితులలో ఉన్నాం. మనలో వాసుదేవుడు అంతర్యామిగా ఉండి, నేను ఒకణ్ణి ఉన్నానూ అని అనుకోవడం ద్వారా బలరాముడు ఏర్పడీ, (బలరాముడు ఎప్పుడూ కృష్ణుడి సాన్నిధ్యంలో ఉంటాడు కదా!) వాసుదేవుడి సాన్నిధ్యం చేత మనలో ఏర్పడిన వెలుగుగా, బుద్ధిగా ప్రద్యుమ్నుడు పనిచేస్తుంటే, (బుద్ధి ప్రచోదనం చేయమని కోరతాం కదా అంటే ప్రద్యుమ్నుణ్ణి బాగా అవతరింప చేయమని కోరడమే!) ఆ బుద్ధి అనే వెలుగు బాగా పెరుగుతూండడం వలన అది ఇంద్రియములలో కూడా ప్రసరింపబడడం చేత అనిరుద్ధుడు ఎర్పడితే, ఇలా 4 స్థితులలో ఒకే తత్త్వం ఏర్పడి ఉంటే, వాడూ పూర్ణపురుషుడు! అందుకని శ్రీకృష్ణుడు చూపులచేత, స్పర్శ చేత అన్నిరకాలుగా ఇతరులను ఉద్ధరించగలిగాడు. ఆయన అమిత విక్రముడు.

## 667 అమితవిక్రమః

విశిష్టమైన క్రమముట. సృష్టిలో ఒక క్రమమున్నది. ఆ క్రమాన్ని అవగాహన చేసికుని దానిప్రకారము నడిచినవాడు చిక్కులలో పడడు. అంటే స్వంత కర్మ సృష్టి చేసుకోడు. దివ్య కర్మలోనే ఉంటాడు. స్వంత కర్మలోంచి దివ్య కర్మలోకి ప్రవేశించాలి. సృష్టి యొక్క క్రమం తెలియడం జరగాలి. ఆ క్రమం తెలిసీ, ఆ ప్రకారం ప్రవర్తించేవాడు 'విక్రమ్' అని పేరు పెట్టుకోవాలి. అట్లా తెలిసిన వారిలో మితిలేనటువంటి, విశిష్టమైన క్రమము కలిగిన వాడిగా శ్రీకృష్ణుని దర్శించవచ్చు. ఎప్పుడు, ఎక్కడ, ఏది, ఎలా జరగాలో అలా జరిపించాడు తప్ప, దేనికీ దుఃఖ పడలేదూ, ఆవేశ పడలేదూ, బాధ పడలేదు. మిగతా అవతారాలకీ, ఈ అవతారానికీ చాలా తేడా ఉన్నది. శోకం లేదు, మోహం లేదు. రామావతారంలో శోకం, మోహం కనిపిస్తాయి. ఉత్తమ మానవుడిగా నడిచిన పద్ధతి అది. ఇది super man తత్త్వం, కృష్ణునిది. మానవాతీతతత్త్వం మానవశరీరంతో పనిచేస్తే ఎలా ఉంటుందో చూపించింది శ్రీకృష్ణుడు. అందుకని ఇంతా అంతా అని కొలతలు లేవు ఈయన విక్రమత్వానికి. సంస్కృతంలో ఈ పదం ఒక్కో చోట ఒక్కో అర్థం ఇస్తుంది. విక్రముడు అంటే పరాక్రమవంతుడని అర్థమూ ఉన్నది. ఆక్రమ, విక్రమ, పరాక్రమ, క్రమోక్రమ ఇలా రకరకాల అర్థాలు వచ్చేట్లుగా ఉన్నాయి. ఒక రకమైన పద్ధతిగా అమరిక జరిగి ఉంది సృష్టిలో. అది కాలంచేత నిర్వర్తింపబడుతూంటుంది. కాలక్రమంలో అన్నీ విచ్చుకుంటూంటాయి. ఆ కాలము యొక్క క్రమము తెలిసి దాని ప్రకారము తాను నిర్వర్తించినటువంటివాడు. అందుకనే పుట్టగానే కంసుణ్ణి చంపగలిగే స్థితిలో ఉన్నా కూడా కాలక్రమం లో విచ్చుకుంటూ, 'వాడే పిలుస్తాడూ, మనం వెళ్ళి అప్పుడే కొడదాం' అనుకున్నాడు. ప్రతిదానికీ కాలాన్ని కూడగట్టుకుని పనిచేసుకున్నాడు. కాలంతోనే కలిసి వస్తాడు కదా! బలరాముడు కాలస్వరూపుడు, లక్ష్మణుడు కాలస్వరూపుడు. రెండు అవతారాలలోనూ వారిద్దరితోనే నడిచాడు. అంటే కాలస్వరూపులకు వారి గురించి వారికి తెలియకపోవచ్చు. కానీ ఈయనకి తెలుసు. బలరాముడు, లక్ష్మణుడు అప్పుడప్పుడు ఆవేశపడ్డ సన్నివేశాలు కనిపిస్తూంటాయి. కృష్ణుడు ఆవేశపడ్డ సన్నివేశం కనిపించదు. కాలక్రమంలో అన్నీ జరుగుతాయి అని తెలిసి, అన్నీ నిర్వర్తించినవాడు. ఎంత తెలుసూ అంటే 'అమితం' అన్నమాట. ఇంతా అంతా అని చెప్పడానికి వీలులేదు. 'అమితవిక్రముడు'. చాలా పరాక్రమవంతుడు అన్నమాట! మొత్తం అందర్నీ కేవలం సంకల్పమాత్రం తో తీసెయ్యగలడు. ఎందుకు తీయలేదూ అంటే, ఒక క్రమంగా తీయాల్సిన పద్ధతి సృష్టిలో ఉన్నది కాబట్టి. ప్రతిజ్ఞలు చేశారు. అవి చేశారు, ఇవి చేశారు. కర్మలు చేసుకున్న జీవులు ఎవరిని ఎవరు చంపుకోవాలో అప్పుడే accounts వేసుక్కూర్చున్నారు. వీళ్ళు labour పని చేయడానికి ఎలాగూ సిద్ధపడ్డారు కదా మనకి అక్కరలేదని ఊరికే కూర్చున్నాడు. అందుకని భీష్ముడు, ద్రోణుడు అనుకుంటూ ఉండి ఉండాలి 'చూద్దాం మనల్ని ఏ విధంగా తీసేస్తాడో' అని. అశ్వత్థామకా మరణం లేదు, చిరంజీవి. ద్రోణుడు విల్లు పట్టుకున్నంతసేపూ ఆయన్ని ఎవరూ జయించలేరు. భీష్ముడు తనకు తాను

చచ్చిపోదాం అనుకుంటే కానీ చచ్చిపోడు. కర్ణుడు సరాసరి సూర్యుని కుమారుడు. సహజ కవచ కుండలాలున్నాయి. ఎవరూ చంపలేరు. ఇలాంటి వాళ్ళందరూ ఉంటే 'వీళ్ళెలా గెలుస్తారో చూద్దాం' అనుకుంటే తనేమీ చేయకుండా చేయించాడు. ఎట్లా చేయించాడు? అన్నీ చక్కటి సన్నివేశాలు రావడం, వాటిని వాడుకోవడం. ఎటువంటివి చూపించాడంటే అత్యవసరమైతే సూర్యాస్తమయం మార్చేశాడు. మానవుల మేధస్సులో సూర్యుడు అస్తమించినట్లు చేయించాడు. అంతకన్నా ఏం కావాలి? పరలోకాల నుండి మనుషుల్ని తెప్పించాడు. పరలోకాలలో ఉండేవారిని ఇక్కడ ఉండి బాగుచేశాడు. CVV గారు ఇక్కడ కూర్చుని శుక్ర గ్రహంలో, శని గ్రహంలో వంకరలు తీసారని చెప్పకుంటాం కదా! కృష్ణుడు ఇక్కడ కూర్చుని బ్రహ్మకుండే వంకర, ఇంద్రుడికుండే వంకరా తీశాడు. అంటే ఎంత దూరం వెళ్ళాడు? శుక్ర courses లాగ బ్రహ్మ courses చేయించాడన్నమాట. ఇంద్రా courses అని ఇంద్రుడికి పెట్టాడు. అందర్నీ rectify చేశాడు ఇక్కడ కూర్చుని. అంతకన్నా విక్రమం ఏంటండీ? అందుకనే ఉత్త యోగి కాదు. యోగులకు యోగి, యోగేశ్వరుడాయన. యోగీశ్వరుడు వేరు, యోగేశ్వరుడు వేరు అని శంఖారావంలో మాస్టారు రాశారు. యోగీశ్వరులు చాలామంది ఉంటారు. వీరందరికీ ఈశ్వరుడు కృష్ణుడు 'యోగేశ్వరుడు'! ఈ విక్రమత్వం ఎంత అద్భుతమైనదో చూడండి. అందుకనే వ్యాసాదుల నుండి పిచ్చెక్కి ఈయన వెంట పడ్డారని మిగిలిన వాళ్ళంతా complaint చేశారు. 'ఇంత బ్రహ్మజ్ఞానం తెలిసిన నువ్వు వీడివెంట పడ్డావేంటని' వ్యాసుణ్ణి బ్రహ్మజ్ఞానులంతా అన్నారుట! బ్రహ్మజ్ఞానం తెలిసినవాడికేమంటే, బ్రహ్మం అంతా వ్యాపించియున్నాడు కదా ఈ గొట్టిగాయ వాడి వెనుక ఎందుకు పడాలి అని. మరి ఈ గొట్టిగాయగాడిలోనే మొత్తం అంతా కనిపించిందిట వేదవ్యాసుడికి. మొత్తం అంతా చూద్దాం అనుకున్నవాడికి ఎదురుగుండా వస్తే కనిపించదు, గుడ్డితనం! అదీ బాధ. జ్ఞానులకి అవతారపురుషుడు ఎదురుగుండా వస్తే కనబడదు. భక్తుడికి అటుప్రక్క తెలీదు. జ్ఞానికి ఇటుప్రక్క తెలీదు. ఇద్దరూ పూర్ణత్వం చెందితే గానీ అటూ ఇటూ కూడా చూడగలిగే స్థితిలోకి రాలేరు. భీష్ముడు ఆ విధంగా చూశాడు. యుద్ధం చేసేముందు చచ్చిపోదాం అనుకోలేదాయన. ఒకే ఒక ఉపదేశంతో ఇహ మనం వెళ్ళిపోతేనే మంచిదనిపించాడు. క్రమంతో జరిపిన కార్యములు, Plan of work అటువంటి దానిలో విశిష్టమైన జ్ఞానం కలిగినవాడు. కాబట్టే అర్జునుణ్ణి ఎంతో క్లిష్టమైన విషయాలలో నడిపించాడు. పాండవులని అలా నడిపించాడు. అందర్నీ నడిపించాడు. ఎవరూ దేనినీ ముట్టుకోడానికి వీలులేకుండా పరిరక్షించాడు. తప్పకున్న వాణ్ణి వదిలేశాడు. ఆశ్రితులని రక్షించాడు. స్వంతంగా చూసుకుంటాం అంటే తప్పకుండా చూసుకోమని వదిలేశాడు. అర్జునుడు కొంచెం స్వంత తెలివి వాడేసరికి అభిమన్యుడు వెళ్ళిపోయాడు. అభిమన్యుడు వెళ్ళడం కూడా కార్యక్రమంలో భాగం కాబట్టి. అభిమన్యుడు సరాసరి శివుడి నుండి వస్తాడు. సోమతత్త్వం లోంచి వస్తాడు. పదహారు కళలు కలిగినటువంటి సోమతత్త్వం లోంచి వచ్చినవాడు. 'పదహారు సంవత్సరాలకన్నా మీ లోకంలో ఉంచను' అని శివుడు చెప్తాడు. పదహారు సంవత్సరాలు అక్కడ పూర్తయిపోతాయి, వీడు వెళ్ళిపోయాడు. మరి క్రమమే కదా! అన్ని లోకాల క్రమాన్ని తాను మన్నిస్తాడు. ఊరికే local

dimension కాదు. Universal dimension. అదీ కృష్ణుడు! మనం కూడా జీవితంలో ఓ క్రమాన్ని పాటిస్తే, దాన్లో నుండి శిక్షణ దొరుకుతుంది. జీవితంలో ఏదో ఒక క్రమం దొరకనివాడికి వృద్ధి దొరకదు. ఎందుకంటే సృష్టే ఒక క్రమం ప్రకారం నడుస్తోంది. దాన్నే ఈ రోజున జ్వాలాకూల్ మహర్షి '7th ray' అన్నారు. 'క్రతు విద్య' అన్నారు. జీవితాన్ని ఓ క్రమంగా నడిపించడం క్రతువు! దైనందినంగా, పద్ధతిగా నడవాలి. కొన్ని nodal points పెట్టుకుని, వాటిని తు.చ. తప్పకుండా ఆచరించడం అనేది నీకు అభ్యాసం అయ్యేంతవరకూ నీలో సంకల్పబలం పెరగదు. సంకల్పబలం పెరగని వాడు వృద్ధి పొందే అవకాశం లేదు. అందుకనే క్రమం కావాలి. అదే శని. క్రమశిక్షణ లేనివాళ్ళకు క్రమశిక్షణ ఇస్తాడు శని. ఉన్నవాళ్ళకు మంచి చేస్తాడు. కొంతమందికి పుట్టుకతోనే జాతకం లో శనిగ్రహం బావుంటుంది. అంటే క్రమశిక్షణ వాళ్ళల్లో సహజంగా ఉన్నదని అర్థం. శని బావుంది కదా అడ్డుగోలుగా బ్రతకమని కాదు. వాడసలు అడ్డుగోలుగా ఉండలేడు. Saturn in Libra అనుకోండి చాలా పద్ధతిగా ఉండకపోతే తోచదు. Saturn in Capricorn అనుకోండి పద్ధతిగా ఉండడం సహజంగా ఉంటుంది. Saturn in Cancer అనుకోండి అసలు పద్ధతిగా ఉండబుద్ధికాదు. ఎందుకుండాలనిపిస్తుంది? అప్పుడు ఎందుకుండాలో Saturn చూపిస్తుంది. అప్పుడుంటాడు వుండకపోతే కష్టం అని. అందుకని మనకి ముందు గురువుగా వచ్చేవాడు శని. మొదటి గురువు శని. ఏ గురువైనా తన శిష్యుడికి ముందు ఇచ్చేది క్రమశిక్షణ. ఓ శిష్యుడు తన వద్దకు వస్తే, గురువు 'కట్టెలు కొట్టుకురారా, అడవికి వెళ్ళి' అని చెప్పేవాడు ఇదివరకు. ఎన్నాళ్ళయినా కట్టెలు కొట్టుకు రావడమే. ఇంకేమీ చెప్పడు. అంటే చెప్పింది చెప్పినట్లు చేయగలడా, లేడా? ఇంకోణ్ణి పొలానికి నీళ్ళు పెట్టమంటాడు. మరొకణ్ణి సమిధలు ఏరుకు రమ్మంటాడు. ఇట్లా చెప్తుంటే ముందు క్రమశిక్షణ బాగా వృద్ధి చెంది, చెప్పింది చెప్పినట్లు చేస్తూంటాడే, వాడికే తర్వాత మెట్టు వుంటుంది. అందుకే CVV గారు ముందు Saturn courses తర్వాత Venus courses అన్నారు. అంటే మనం ఓ ఉద్యోగం చేస్తున్నామనుకోండీ. ఆ ఉద్యోగం చేయడానికి ఓ పద్ధతి వుంటుంది. ఆ పద్ధతి ప్రకారం చేస్తేనే ఉద్యోగంలో చిక్కులు పడకుండా వుంటాం. ఉద్యోగంలో పిచ్చి పనులు చేస్తే రోజూ భయం వేస్తూంటుంది ఎవరు, ఎప్పుడు పీకుతారో అని. వ్యాపారం చేస్తాం అనుకోండీ, దానికీ ఓ పద్ధతి వుంటుంది. సంసారానికైనా ఓ పద్ధతి వుంటుంది. పెద్దలిచ్చిన పద్ధతులలో ఓ క్రమంగా ఆచరించే ఓర్పు, సహనం, వేచియుండుట ఇవన్నీ నీకున్నాయా, లేదా? ఈ రోజుల్లో దేనికీ ఓపిక లేదు, సహనం లేదు. 10 నిముషాలు ఆలస్యం అయితే మనిషి గిజగిజలాడిపోతుంటాడు. అదెట్లా? ఎందుకు వేచియుండమన్నాడో? Ability to wait అనేది చాలా ముఖ్యం. ధర్మరాజు అలా wait చేశాడు. 'The one who can wait, is the one who profits most'. చేతో, మాటో తొందరపడి చేస్తే ఇంకొంచెం పాడుచేసుకుంటాడు. ఆ విధంగా వేచియుండే శక్తి, నియమము, నియతి, మౌనము, మాటమీద స్వామిత్వము ఇవన్నీ ఏర్పడిపోతాయి. బలం పెరిగి, సంకల్ప బలంగా మారుతుంది. అదిపెట్టి పనిచేసే దారి వేరు, ఏదో పని చేయడం వేరు. తోచినప్పుడల్లా పార తీసుకుని కొంచెం త్రవ్వితే ఎప్పటికయ్యేనూ బావి

త్రవ్వడం. అదే పనిగా చేస్తూంటేనే success. అలా Principle ఒకటే దేనిమీద apply చేసినా. అది రావాలంటే ఓపిక, సహనం, క్షమ ఇవన్నీ శని నేర్పుతాడు. అవి నేర్చుకోవాలి. అవి నేర్చుకున్నవాడు, సరైన సాధనకి కావలసిన సంపత్తి కలిగినవాడు. అదీ సాధన సంపత్తి. శ్రద్ధ, సబూరి అన్నారు కదా! సబూరి అంటే ఓర్పు. శ్రద్ధ, సబూరి వుంటే, అది క్రమాన్ని ఇస్తుంది. ఆ క్రమంలో విశిష్టమైన క్రమం. ఆ విశిష్టమైన క్రమానికి అడ్డూ, ఆపూ ఏమీ లేవు. ఇంతా, అంతా అని ఏం చెప్పలేం. అదీ 'అమిత విక్రమః'. ఇలా భావన చేసుకోవాలి. అలాటిది శ్రీకృష్ణుని జీవితంలో గోచరించింది. అది భగవంతుని తత్త్వం. అది ఎవరియందుంటే దానియందు మనం దాన్నలా చూడాలి. కొంతమంది ఎంతో ఓపిగ్గా, మౌనంగా పనులు చేస్తూంటారు. 'వాడు Saturn రా' అంటాం. వాడి వద్ద వుందీ, నీ దగ్గర లేదు. వాడితో తిరిగి కాస్త నువ్వు కూడా పుచ్చుకో. ఏ గ్రహతత్త్వం ఎవరియందెక్కువగా వుందో వారితో స్నేహం చేస్తే, ఆ తత్త్వం మనకబ్బే అవకాశం వున్నది. 'ఆర్నెల్లు తిరిగితే వారు వీరవుతారనే' సామెత లేదూ! ఎవరి వద్ద శుక్రగ్రహం బావుందో వారితో తిరిగితే, జీవితంలో వున్నది అనుభవించే యోగ్యత ఒకటి లభిస్తుంది. చాలామందికి ఎన్ని వున్నా, అనుభవించలేని పరిస్థితి వుంటుంది. అన్నం తింటూంటే phone వస్తూంటుంది. మాట్లాడ్తూ తింటాడు. ఏం తిన్నాడో తెలీదు. కాఫీ త్రాగుతూంటే మనుషులూ, ఫోన్లూ. కాఫీ త్రాగే యోగ్యత కూడా వుండదు. మంచి Bathroom, Shower అన్నీ పెట్టించుకుని కూడా హాయిగా స్నానం చేసే అనుభూతి వుండదు. అదే బక్కెట్లతో నీళ్ళు తోడుకుని, ఆరుబయట బావి వద్ద స్నానం చేస్తూ అనుభూతి పొందవచ్చు. అనుభూతి ప్రతి చిన్న విషయాలలోనూ పొందీ, విశ్వరూపుడైన, రసస్వరూపుడైన భగవంతుని ఆనందం చెందాలంటే శుక్రగ్రహం బావుండాలి. ఎవరికి బావుంటుందంటే అంతకుముందు కాస్త సాధన చేసుకునేవాడికి వుంటుంది. వాడు చొక్కా వేసుకున్నా ఆనందంగా వేసుకుంటాడు. ఏదో గబగబా తగిలించుకుని ప్రార్థనకు వెళ్దాం అనుకోడు. చొక్కా వేసుకున్నప్పుడు కూడా ప్రార్థనకు వెళ్ళేంత శ్రద్ధా వుంటుంది. అన్ని విషయాలలోనూ శ్రద్ధ ఏర్పడుతుంది. దాన్నుండి అనుభూతి వస్తూంటుంది. ఇవన్నీ క్రమమైన శిక్షణ పొందినవాడికి సాధనలో అందిన ఫలంగా వుంటుంది. లేకపోతే కొన్ని కొన్ని జారిపోతూంటాయి. కొన్ని దొరికినట్లుంటాయి. కొన్ని పోయినట్లుంటాయి. జీవితం అంతా గందరగోళంగా అదోమాదిరిగా వుంటుంది. ఏం తెలవు. అందుకనీ సాధనలో ఓ క్రమాన్ని అనుసరిస్తే బావుంటుంది. ప్రతి గురువూ సాధనలో ముందు కొన్ని నియమాలు ఇస్తాడు, Physical plane లో. తర్వాత Emotional and Mental plane లో వాడు ప్రస్తుతం ఆచరించగలిగిన కొన్ని నియమాలు ఇస్తాడు. ఆ-- ఈ బయట పూజలేంటండీ అనగూడదు. ఎందుకంటే అంతా పూర్తయిన తర్వాత తెలుస్తుంది. దీనికి అవకాశం వున్నప్పుడు ఇది చేసుకోవాలి. అవకాశం లేనప్పుడు అంతర్గతంగా చేసుకోవాలి. అంతర్గతంగా చేసికుని మనోస్థైర్యము అంటే స్థిరత్వం పొందినవారు బయట చేసుకోకపోయినా ఫర్వాలేదు. ఉందా, లేదా అనేది ఎవరికి వారు చూసుకోవాలి. ఉందనుకుంటే వున్నట్లు కాదు. కనుక ఓ క్రమంగా వస్తే అంతులేనంత పెరగచ్చు. ఎందుకంటే అసలు వున్నదంతా వాడే కదా! అందుకని జీవాత్మ తత్త్వం ఏదైతే వుందో, అది కేవలం

పరమాత్మ యొక్క అంశయే/అవతారమే కాబట్టి, అదే ఇదిగా వుంది కాబట్టి, అతడి దగ్గర ఏం వుందో, వీడి దగ్గరా అదంతా వుంటుంది. ఇట్లా వున్న వాడిని మనం దర్శనం చేసుకుంటూ, అది మన జీవితంలో సాధన పరంగా అందుకుంటూ వుంటే ఈ నామాలు సిద్ధినిస్తాయి. ప్రతి నామం ఓ జన్మంతా సాధన జరిపేంత వుంటుంది. ఊరికే మనం ఇందులో కాస్త జీవించడానికి, మిగతా వాటిలోంచి కాస్త బయటకు వచ్చి ఇందులో వుండడం వలన ఓసారి గంగానదిలో స్నానం చేసినట్లుగా వుంటుంది. ఇంకొంచెం fresh గా సాధనలోకి మళ్ళీవెళ్ళడానికి పనికివస్తుంది, ఈ భాషణం. ఏదన్నా చేసికునేవారికే దక్కుడు. వినడం వలన చేసుకోడానికి స్ఫూర్తి రావడానికి అవకాశం వున్నది. (లేకపోవచ్చు కూడా). అందుకూ మనం చెప్పుకుంటున్నాం.

## 668, 669 కాలనేమినిహా, వీరః

కాలనేమినిహా అంటే కాలనేమిని సంహరించినవాడు అని అర్థం. కాలనేమి అనే రాక్షసుడు కంసుని రూపంలో రకరకాలైన అధర్మాలు ఆచరించడం జరుగుతుంది. అతనిని సంహరించినవాడని ఈ నామంలోని అర్థం. 'కాలనేమి' అనే తత్త్వం రాక్షసతత్త్వం అని ఎందుకన్నారంటే అది ఆసురీ భావంతో కూడిన స్వభావం. అధికార కాంక్ష ఎక్కడ వుంటుందో అక్కడల్లా కాలనేమి వుంటాడు. కంసునికి అధికార కాంక్ష ఉండడం వల్లనే దేవకీ వసుదేవులను చెర యందుంచడం జరుగుతుంది. కారణమేమంటే వసుదేవుడు నిజానికి మధురకి రాజు. యాదవులకు రాజు. అతడికి అధికారము యందు నిరాసక్తత ఏర్పడడం చేత, రాజసింహాసనం వదిలేసి, ప్రజలలోకి వెళ్ళి, ప్రజలతో పాటు తాను కూడా కలిసి మెలిసి వారిలో ఒకడిగా జీవిస్తూ, వారికి సంఘపరమైన చక్కని జీవనవిధానం ఇస్తాడు. బృందములుగా మనుషులను పోగేసి వారి పాడీ, పంట ఏ విధంగా సంరక్షించుకోవచ్చు, ఏ విధంగా వారు కలిసి జీవిస్తూ ఆనందంగా ఉండవచ్చో వసుదేవుడు మొట్టమొదటిసారిగా ఈ కాలచక్రంలో బోధ చేసినటువాడు. దాన్నే తర్వాత Plato, 'Republic' అని Socrates అనే మహానుభావుడు, ఆ తర్వాత యూదులు అందుకోవడం జరిగింది. సంఘంలో మనల్ని మనం చక్కగా పరిపాలించుకోగలిగితే ప్రభువులు, పరిపాలకులు ఎవరూ వుండనక్కరలేదు అనే భావన ఇది. 5 వేల సంవత్సరాల క్రితం తాను రాజైయుండి, తన రాజసింహాసనం పరిత్యాగం చేసి, ప్రజలలోకి వచ్చి, వారితో కలసి జీవిస్తూ, వారు ఏ విధంగా పాడి, పంట వృద్ధి చేసుకోవచ్చు, ఏ విధంగా ప్రకృతితో అనుసంధానం చెందుతూ ఆనందమయ లోకాలలో జీవించవచ్చు అనే విధానం ఒకటి అందించడం జరుగుతుంది. ఈ విధానం ఎక్కడుంటే అక్కడల్లా బృందావనములు ఏర్పడడం జరిగింది. ఇలా రాజ్యమూ, అధికారమూ అనే కాంక్ష వదిలేసి, తన రాజ్యంలో వుండే అన్ని గ్రామములలో ఈ విధమైన బృందావనాలను ఏర్పరుస్తూ వుంటే ఎవరికి వారుగా స్వయంసమృద్ధి కలిగిన పరిస్థితి వచ్చినపుడు రాజూ, ఆయన యొక్క పాలనా, ఆయన మీద ఆధారపడడం అనేవాటి అవసరం లేకుండా పోయింది. అందుకని ఉగ్రసేనుని కుమారుడైన కంసుడు, ఈ విధంగా గనక రాజ్యమంతా పరిపూర్ణంగా అభివృద్ధి చెందితే ఇంక తనకి మనుగడ ఉండదు అనే భయం చేత, ఎలాగైనా వసుదేవుణ్ణి తనవాడిగా చేసుకోవాలనే ఒక భావన చేత తన సోదరియైన దేవకిని, వసుదేవునికిచ్చి వివాహం చేస్తాడు. వివాహంలో ఒక కుతంత్రం వున్నది. వసుదేవుని తన బావగారుగా చేసుకోవడం ద్వారా మంచి చేసుకుని, తను రాజ్యాధికారాన్ని నిలబెట్టుకోవాలి, లేకపోతే ప్రజలు తన మాట వినరనే భయంచేత ఈ మొత్తం అంతా ఓ ప్రణాళిక ప్రకారం అతను నిర్వర్తిస్తాడు. నిర్వర్తించి, వివాహం చేసి, చెల్లెల్నీ, బావగార్నీ తీసుకుని రథంలో వెళ్తూ వుంటే, అశరీరవాణి 'పిచ్చివాడా! నువ్వు చేసేదంతా ఏమీ ఉపయోగపడదు. వీళ్ళ నుండే నిన్ను సంహరించేవాడు పుడతాడని' తెలుపుతుంది. ఈ అశరీరవాణి ఎక్కడో వుండదు. మన లోపలే

దహరాకాశంలో వున్నది. మనం పిచ్చి పిచ్చి పనులు చేస్తున్నప్పుడు అందులోంచి మనకి వినిపిస్తూంటుంది, ఇలాంటి పనులు చేయకని. పురంజనోపాఖ్యానం చదువుకోండి తెలుస్తుంది. మనం ఈ పురం/శరీరం లోకి వచ్చినప్పుడు మనతో ముందు అంతర్యామి ప్రజ్ఞ వుండడంచేత అది ఆధారంగా మనం శరీరంలోకి దిగడం జరుగుతుంది. అతడు మన శరీరంలో విజ్ఞాతుడనే ప్రజ్ఞగా వుంటాడని, హృదయంలో అంతర్హితుడై వుంటాడనీ, అతనిని సంప్రదిస్తే మనకి సమస్త ధర్మములూ బోధిస్తాడనీ తెలుసుకోవాలి. ఎందుకంటే మనం చేసే పనులకి బయట ప్రపంచంలో మోసం చేయవచ్చు గానీ మనకుగా మనం ఆత్మపరిశీలనం చేసి చూసుకుంటే, ఇదేంటీ ఇలా పిచ్చి పిచ్చి పనులు చేస్తున్నాము అని మనకి అద్దం లో చూపిస్తున్నట్లు గా అనిపిస్తుంది. మనకివి అక్కరలేదు అని వినిపిస్తుంది. కంసుడు భయం చేత అలా చేస్తుంటే, లోపల నుండి ఆత్మతత్త్వం, తనలో ఉండే చైతన్యమే తనకు తెలిపింది-- 'ఈ పని చేస్తున్నావ్ గానీ, వీరి నుండే నీకు ఆపద వస్తుందని'. ఇలా అశరీరవాణి ప్రతివాడికీ పలుకుతుంది. మరీ పశుప్రవృత్తిగా ఆత్మ వంచన చేసుకుని, దానికి తాళం వేసి seal కూడా వేసేసుకుని, మనం ఏం చేస్తున్నామో మనకిగా మనం ఆలోచించుకోలేని స్థితిలో వున్నవాళ్ళకి తప్ప, కాస్తో కూస్తో ప్రతిరోజూ నేనేం చేస్తున్నానూ, నేనేం చేయాలీ, నేను చేస్తున్నది సరైన పద్ధతేనా, ఇలాగే చేయాలా? ఇంతకన్నా మనం బాగా ఉండవచ్చా? అని తన్ను తాను రోజూ ఆత్మపరిశీలన చేసుకునేవాడికి లోపల నుండే సమస్తమైన సందేశాలు, సమాధానాలూ వచ్చేస్తాయి. మార్గదర్శకత్వం కూడా అక్కడ నుండే లభిస్తుంది. అదే కంసుడికి వినిపించి వసుదేవుణ్ణి, దేవకినీ సంహరించడానికి ప్రయత్నం చేస్తాడు. వసుదేవుడు భక్తుడు, బుద్ధి కుశలుడు, జ్ఞాని కాబట్టి దాన్ని తప్పిస్తాడు. అప్పటి నుండే కాక కృష్ణ జననం దగ్గర నుండి కూడా కంసుడికి మరింత భయంగా వుంటుంది. భాగవతంలో కనిపించే కంసుడి పాత్ర కేవలం పదవీ కాంక్ష, అధికార కాంక్ష, అధికార దాహం, దానికోసం పగలూ, రాత్రీ కృషి చేసేవారెక్కడ వుంటారో వారంతా కాలనేమిలే అని చెప్తుంది. అలాంటి వారున్నారంటే కాలనేమి ఈనాటికీ జీవిస్తున్నట్లే. అందుకని కంసుని సంహారం అయ్యాక కాలనేమి, కాలయవనుడి రూపంలో వస్తాడు. భూమంతా ఆక్రమించి, మొత్తం మనది చేసుకోవాలనే తత్త్వం పాశ్చాత్య దేశాల్లో ఎక్కువ. మన దేశంలో బుద్ధుడు వచ్చిన దగ్గర నుండి అది పడిపోయింది. హాయిగా శాంతియుతంగా జీవించడమే తప్ప, ఆక్రమించడం అక్కర్లేదనే విషయం మనకి అశోకుని ద్వారా జీవతత్త్వం లో బాగా జీర్ణించుకుపోయింది. అంతకు ముందు నుండీ పాశ్చాత్య దేశాలలో ఆక్రమణ ధోరణులున్నాయి. అలెగ్జాండరు, నెపోలియన్ తర్వాత ప్రపంచయుద్ధాలు, ఇవన్నీ ఇవే సూచిస్తాయి. అలా ఆక్రమించాలనే ఉద్దేశ్యంతో కాలనేమి రూపంలో వచ్చినవాడు మళ్ళీ సంహరింపబడతారు. సంహరింపబడ్డా, అది తత్త్వం కాబట్టి, మళ్ళీ మళ్ళీ మనుషుల్ని ఆశ్రయించి జీవిస్తూంటుంది భూమిమీద. దైవీతత్త్వం కొందర్నెలా ఆశ్రయిస్తూంటుందో, ఆసురీతత్త్వం కొందర్ని అలా ఆశ్రయిస్తూంటుంది. అదెలా వుంటుందంటే ఇద్దరు ముగ్గురు మనుషుల్ని మన చెప్పుచేతల్లో ఉంచుకోవడం దగ్గర్నుండి, అంటే కాస్త సాయం చేసి వాళ్ళని మన గుప్పెట్లో పెట్టుకుని మన ఇష్టం

వచ్చినట్లు వాళ్ళని వాడుకోవడం. సహాయం పొందినవాడికి ఓ రకమైన బాధ్యత వుంటుంది సహాయం అందుకున్న వారి గురించి. దాన్ని సాయం చేసినవాడు వాడుకుంటూంటాడు. ఇలా అధికార కాంక్ష అందరియందూ కాస్తో కూస్తో పనిచేస్తూంటుంది. ఈ కాంక్ష ఎక్కడ ఉంటే అక్కడల్లా కాలనేమి వున్నట్లే. ఈ శ్లోకంలో మనకి కాలనేమిః, కేశిః అని కూడా వస్తుంది. కేశి కంసుని యొక్క సైన్యాధిపతి. అతడికీ ఇదే బుద్ధి. వీడు కంసుని సేనాధిపతిగా వుండి, కంసుడితో సంబంధం లేకుండా కంసుడి రాజ్యంలో తను వేరే రాజ్యం ఏర్పాటు చేసుకుంటూంటాడు. ఈ రెండూ విచిత్రమైన పాత్రలు. ఈ కలియుగంలో ప్రత్యేకంగా వుంటూంటాయి. ఒక అధికారి వుంటే, ఆయన వద్ద పనిచేసే కార్యదర్శి ఆయన పేరు చెప్పకుని అధికారం చెలాయిస్తూంటాడు. వాడు చేసేవన్నీ వాడు చేస్తూంటాడు. ఈ విధంగా కంసుడు, కేశి మొత్తం రాజ్యంలో భీభత్సం సృష్టించి అధికారం పేర్న మనుషుల దగ్గర నుండి రకరకాలుగా గుంజుతూంటారు. వీరిద్దర్నీ కృష్ణుడు సంహరించాడు. పదిమందిని పట్టివుంచాలి, పదిమంది మీద అధికారం కలిగి వుండాలి, పదిమందీ చెప్పచేతల్లో వుండాలీ అనే అసురీ భావం ఎవరి యందుంటుందో, వారియందు కృష్ణతత్త్వం భాసించదు. అందరిలోని జీవచైతన్యాన్ని భగవంతుని యొక్క అస్తిత్వంగా భావన చేసుకుంటూ, సోదరత్వాన్ని స్థాపితం చేసుకుంటూ, ఆవిధంగా సమస్తాన్నీ తన ప్రవర్తనలో ప్రదర్శించుకుంటూ, ఏవిధమైన అధికారమూ చలాయించక జీవించేవారియందు కృష్ణతత్త్వం వృద్ధి చెందడానికి అవకాశం వుంటుంది. అంతేకానీ అధికారపూరిత బధిరులు అంటామే, అంటే గుడ్డి చెవిటి అయిపోతారట అధికారం బాగా కోరుకున్నవాళ్ళు. వాళ్ళేం వినరూ, చూడరు. వాళ్ళకు తోచినది చేసుకుంటూ పోతూంటారు. వారున్నచోట కృష్ణతత్త్వం వుండదు. అది పెచ్చు పెరిగినచోట కృష్ణుడే వారిని సంహరించడం జరుగుతుంది. భక్తుడైతే మనలో వుండే ఈ రాక్షసత్వాన్ని సంహరిస్తూంటాడు. మనకు తెలియకుండానే కొంత అధికారం చలాయిస్తూంటాం. కానీ కుంభయుగంలో కావలసినది సోదరత్వం తప్ప అధికారం ద్వారా ఇతరులచే పనిచేయించడం అనేది కాదు. ప్రేమ చేత చేయించగలిగిన పని అధికారం చేత చేయించలేవు. నువ్వు అధికారిగా ఉత్తర్వులు జారీచేస్తే మనఃస్ఫూర్తిగా అవతల మనిషి పనిచేసి పెట్టడు. నీతో వాడికి అవసరం వున్నంతకాలం పనిచేస్తాడు. వాడికేమాత్రం స్వతంత్రత దొరికినా, ఆరోజున ఓ జెండా ఎగరేసి నీకు ప్రతికూలంగా నిలబడతాడు. ప్రేమ మార్గంలో చేయించగల పని, శక్తి మార్గంలో చేయించలేరు. That which can be done through love, cannot be done through force. అందుకని ఓ మనిషిని తనతో సమానంగా ఆదరిస్తూ, ఉత్తర్వులను కూడా సలహాలుగా అందిస్తూ, Be suggestive, but not authoritative, అలా పనిచేయించుకుంటూంటే, అందరి మధ్యా అనురాగము, ప్రేమ, ఆప్యాయత వుంటాయి. ఒకరి కష్ట సుఖాలు ఒకరు చెప్పకునే two-way communication వుంటుంది. ఆ విధంగా నిర్వర్తించుకు వెళ్తే ప్రేమ సామ్రాజ్యం స్థాపితం అవుతుంది. అందుకనే కృష్ణుడు కూడా కంసుణ్ణి సంహరించాక రాజ్యాన్ని అందుకోలేదు. కారణం ఏమంటే తన తండ్రి మార్గమే తనదీను. రాముడు రాజ్యాన్ని పరిపాలించాడు. కృష్ణుడి కాలానికి రాజ్యపాలన

కాదూ, హృదయము నందు పరిపాలన అని పెట్టాడు. ప్రతివాడి హృదయములందు నువ్వు చేసే పనుల ద్వారా స్థానం పొందావంటే, ఆ మనిషి నువ్వు చెప్పిన పని తప్పక చేస్తాడు. నువ్వు అధికారం చూపించనక్కరలేదు. అధికారం చూపించినప్పుడు నీతో వాడికి అవసరమున్నప్పుడు పనిచేసి పెడ్తాడు. నీతో అతనికి అవసరం లేకపోతే ఇంక నీ మాట వినడు. ఇక్కడ మాట వినడం, వినకపోవడం అనేది ఒకరి యందు ఒకరికుండే ఆప్యాయత వల్ల వుంటుంది తప్ప, నీతో వాడికుండే ఉపయోగం వల్ల వుండదు. మామూలుగా ప్రపంచం అంతా ఎవరి వల్ల ఎంత ఉపయోగం వున్నదో చూస్తుంది. తద్వారా జీవుడు తెలివిగా ప్రవర్తిస్తూంటాడు. అంటే వ్యాపారధోరణిగా వుంటుంది. అతని వల్ల నాకేం ఉపయోగము? ఉపయోగమున్నది కాబట్టి అతను చెప్పిన పని చేసిపెడ్తాను. ఉపయోగం లేదనుకో, అతన్ని వదిలేస్తాము. ఓ పెద్ద officer గారు retire అయితే, తర్వాత ఆయనింటికి ఎవరు వెళ్తారు? ఎవరూ వెళ్ళరు. ఎటువంటి officer ఇంటికి retire అయినా వెళ్తారు? ఆయన అధికారంలో వున్నప్పుడు, అధికారం చలాయించకుండా, తనవద్ద పనిచేసేవారిపట్ల ప్రేమ, అనురాగం, ఆదరణ కురిపిస్తే, ఆయన retire అయ్యారన్న దానితో సంబంధం లేకుండా, వారి వద్దకు వెళ్ళి వారి బాగోగులు గమనిస్తూ, మీకేమన్నా అవసరం ఉంటే చెప్పండి, మేం చేసి పెడతాం అని చెప్తూంటారు. ప్రేమతో చేయించుకోగలిగినది అధికారంతో చేయించుకోలేరు. ప్రేమ చెయ్యడం కోరుతుంది కానీ అవతల వాడిచేత చేయించుకోవడం కోరదు. ఇతనికి మనం ఏం చేయగలమనేది ఎక్కువుంటుంది. అలా వుండడం చేత అటుప్రక్క నుండి కూడా ఇతనికి మనం ఏం చేయగలం అనే కోరుతుంది. నిజమైన భక్తి సామ్రాజ్యంలో ఒకరికొకరు చేసుకోవడం వుంటుంది. కానీ ఒకరికి ఎప్పుడూ చేస్తూండడం, ఒకరు ఎప్పుడూ చేయించుకోవడంగా వుండదు. నిజమైన భక్తి సామ్రాజ్యంలో గురువు, శిష్యుడికి ఉద్ధరణకి సంబంధించినది చాలా చేసిపెడుతూంటాడు. శిష్యుడు గురువు యొక్క కార్యక్రమాలలో చేదోడు వాదోడుగా వుంటాడు. స్వచ్ఛందమే తప్ప ఇందులో బలవంతం ఏమీ వుండదు. ఆ విధంగా సత్త్వగుణము బాగా పెంపొందినచోట భగవత్తత్త్వము బాగా అస్థిత్వం చెందడానికి అవకాశం వున్నది. మామూలుగా మనిషి తన రజోగుణ ప్రవృత్తి చేత తన దగ్గర పనిచేసే వారిపై అధికారం చూపించాలనే తత్త్వం వుంటుంది. పైవాడికి సలాం కొట్టి, క్రిందవాణ్ణి order చేస్తూంటారు. ఎవరి మీదా ఎవరికీ ప్రేమానురాగాలు వుండే అవకాశం లేదు. పనులు కూడా అంతంత మాత్రంగానే జరుగుతూంటాయి. ఏ సంస్థలోనైనా పనులు బాగా జరగాలంటే ఈ విధమైన అనుబంధం బాగా పెంచుకోవాలి. మనిషికి, మనిషికీ ముందు అనుబంధం, ఆ తర్వాత ఆ కార్యాలయంలో ఒక్కొక్కరూ ఒక్కో పాత్ర పోషణ చేస్తున్నారు కానీ 'అందరూ వ్యక్తులుగా సమానులే' అన్న భావన వుండాలి. మన office లో మనకి cofee తెచ్చేవాడి నుండి మనకు ఉత్తర్వులు జారీ చేసేవాడి వరకూ అందరూ వ్యక్తులుగా సమానులే. జీవులుగా సమానులే. ఎవరి పాత్ర పోషణ వారు చేస్తున్నారు. అంతా కలిసి చేస్తేనే కదా అక్కడ కార్యక్రమం సక్రమంగా జరుగుతున్నది! అందరిదీ పాత్ర పోషణ కనుక ఒకరి యందు ఒకరికి హెచ్చు తగ్గుల భావన లేకుండా జీవించడానికి ఎక్కడ ప్రయత్నం జరుగుతుంటుందో,

ఆ కార్యాలయాల్లో దైవీతత్త్వము చాలా బాగా ప్రతిబింబిస్తూంటుంది. అక్కడ వృద్ధి చాలా శాశ్వతంగా వుంటుంది. చేరినవారికి పనిచేయడంలో ఆనందం వుంటుంది. కార్యాలయంలోకి వెళ్ళాలంటే ఓ రకమైన ఉత్సాహం వుంటుంది. ఎప్పుడూ కోప్పడే officer ఉంటే office మొహం చూడబుద్ధికాదు. ప్రేమతో పలకరించేవాడున్నాడనుకోండీ, ఏదో వంకను ఆయనకి నమస్కరించి, నాలుగు మంచిమాటలు చెప్పించుకుని రావాలనిపిస్తుంది. మన దగ్గరుండే మనుషులు మనని చూసి ఉత్సాహపడుతున్నారా లేక మనల్నుండి దూరంగా వుండడానికి ప్రయత్నం చేస్తున్నారా అనిచూస్తే మనలో ప్రేమ వున్నదా, అధికారం వున్నదా అని తెలుస్తుంది. అధికారం వున్నచోట తప్పనిసరై వుంటారు. అందుకని కంసుని భటులు తప్పనిసరై పనిచేస్తూంటారు తప్ప, ఆయన యందు అనురాగము లేనట్లుగా గోచరిస్తుంది పురాణపురుషుడు పుస్తకంలో. ప్రేమ, అధికారము power and love ఈ రెంటిలో మానవజాతి దేన్ని ఆశ్రయిస్తుంది? మానవజాతి తక్కువ సంస్కారమున్నప్పుడు, తక్కువ చైతన్యమున్నప్పుడు అధికారాన్ని ఆశ్రయిస్తారు. సంస్కారము పెరుగుతున్నకొద్దీ, చైతన్యవంతులము అయ్యేకొద్దీ అధికారానికి ఏమాత్రమూ బలము లేదని తెలుస్తుంది. ఇదే విషయాన్ని మనం సాధన పరంగా చూసుకుంటే కొంతమంది ఉపాసకులుంటారు. కొంతమంది యోగులుంటారు. ఉపాసకులు ఓ దేవతను ఆరాధన ద్వారా తమ వశం చేసుకుని తద్వారా పనులు చేస్తుంటారు. ఏరోజు ఇతని ఉపాసన సరిగ్గా లేదో ఆరోజు ఆ దేవత ఆయన మాట వినదు. అందుకని చచ్చీచెడీ ఆ ఉపాసనంతా చేయాల్సిందే. రైల్లో వెళ్తున్నా చేయాల్సిందే. ఊరుగాని ఊర్లో వున్నా చేయాల్సిందే. ఈ ఉపాసకులంతా వారు ఆరోజు చేయవలసినంత మంత్రోచ్ఛారణో, నామస్మరణో చేస్తేనే ఆరోజు పని జరుగుతుంది. అలా కాకపోతే వుండదు. ఎందుకంటే తన సహజమైన బలం లేదక్కడ. ఒక దేవతా బలాన్ని తన ఉపాసన చేత బిగించియుంచి, తద్వారా పనులు చేస్తుంటారు. వారు తమయందు పరిపూర్ణమైన శాంతి కలిగియుండరు. వారికి ఉన్నట్లుండి బాగా కోపం వచ్చేస్తుంది. హనుమత్ ఉపాసకులు, గణపతి ఉపాసకులు, దుర్గా ఉపాసకులు ఇలా చాలా రకాలుగా వుంటారు. వీరంతా చాలా శక్తిమంతులే కానీ వారి శక్తి కాదు అది. తాము ఉపాసన చేసిన దేవతయొక్క శక్తి. ఆ దేవతకు కూడా వీడియందు అంత మక్కువ వుండదు. ఎందుకంటే భక్తుడు కాడు కదా! దేవతలకి కొన్ని రకాల ఉపాసనలు చేస్తే, వారికి కట్టుపడి వుండే ధర్మం వున్నది. అందుకని కట్టుబడి వుంటారు. రుద్రుడి దగ్గర్నుండి అందర్నీ కట్టేస్తాడు రావణుడు. రామాయణం TVలో చూపించారు కదా! అందులో రావణుడు ఓడిపోతున్న సమయంలో రుద్రుణ్ణి ఉపయోగిస్తే, ఓ time లో రుద్రుడు ఆయన మాట వినడు. వీణ్ణి జయించేవాడు వీడి వద్దకు వచ్చేసరికి వీడు, 'ఇహ వీడి బెడద వుండదు' అని తప్పించుకుంటాడు. బాణాసురుడు రుద్రుణ్ణి ఆ విధంగా ఉపాసన చేసి, తన రాజ్యానికి మనం గ్రామదేవతలను పెట్టుకున్నట్లుగా, క్షేత్ర దేవతల్లాగా రుద్రుణ్ణి పెట్టాడు తన రాజ్యానికి, ఎవరన్నా వస్తే నువ్వే చూసుకో అని. అదా? అంతే కృష్ణుడు రాగానే రుద్రుడు తప్పకున్నాడు. ఎందుకంటే ఎవరి చేతిలో తప్పకుండా వీడు దెబ్బ తింటాడో ఆ సమయం వచ్చేంతవరకూ కాసుకుంటారు. వాళ్ళు రాగానే వీళ్ళు

తప్పకుంటారు. రుద్రుడితో రావణుడు 'నాకు తెలుసు, నువ్వు కూడా నన్ను కాదని స్వతంత్రించి వ్యతిరేకంగా పనిచేస్తున్నావు, రాముణ్ణి గెలిచాక నీ సంగతి చూస్తాను' అంటాడు. గ్రహాలన్నీ తప్పనిసరియై పనిచేశాయి, ఏ మాత్రం అవకాశమున్నా దాటేద్దాం అన్నట్లుగా రావణుడికి సహకరిస్తుంటాయి. ఇంద్రజిత్తు పుట్టే సమయంలో జ్యోతిశ్శాస్త్రజ్ఞులందర్నీ పిలిచి, ఎలాగ గ్రహాలుంటే వీణ్ణి ఈ 14 లోకాల్లోనూ ఎవరూ జయించలేరో, ఆ positions చూసి చెప్పమన్నాడు. వాళ్ళు చెప్పారు. ఆ గ్రహాలన్నిటినీ అలా వుండమన్నాడు. తీరా పుట్టే సమయానికి ఒకడు ప్రక్కన కాలు వేసేశాడు. రావణుడి చేత దెబ్బలు తింటే తిన్నాం, వాడంటూ ఈ గ్రహాల స్థితిలో పుడితే రావణుడి కన్నా భయంకరంగా తయారవుతాడని శనైశ్చరుడు తెగించి ప్రక్కకు కాలేస్తాడు. వాడు ఇక అంతే! ఎట్లా ఉంటుందంటే ప్రకృతిని దమించడానికి ప్రయత్నం చేస్తే లేదా దమిస్తే, ఏ సమయంలోనైనా సరే అవకాశం వస్తే, మళ్ళీ తిరిగి వాడికి వాత పెట్టడానికి సిద్ధంగా వుంటుంది. ఉపాసకుల గతి ఇంతే. యోగులు వేరు, దేవతా ఉపాసకులు వేరు. యోగులు తమయందు తమ్ము తాము తెలిసికుని, పరమాత్మయే తాముగా వున్నామని భావన చెంది, పరమాత్మ తత్త్వం తో తాము అనుసంధానం చెంది, తమయందు తాము వుంటారు కాబట్టి దేవతలంతా మేమంటే మేమని సహకారం అందిస్తారు. సహజ యోగికి దేవతలు సహకారం అందిస్తారు. ఉపాసకుడికి దేవతలు అంతంత మాత్రంగా లొంగి వుంటారు. అందుకని యోగము అన్నిటికన్నా మించినది. ద్రోణుడు శివుని ఉపాసించినవాడు. అశ్వత్థామ శివుని ఉపాసకుడు. ఏమైంది వాళ్ళకి? కర్ణుడు సూర్యోపాసన చేశాడు. ఏం లాభం? ఉపాసనలు చేసి అధర్మంలో వుంటే దేవతలకి చిరాగ్గా వుంటుంది. వీణ్ణి ఎప్పుడు వదిలించుకుందామా అన్నట్లుంటుంది. కంసుడు అట్లా కొన్ని ఉపాసనలు చేసి, కొన్ని తంత్రములు పొంది, అది ఆధారంగా ఈ శిశువైన కృష్ణుడి మీదకు భూతాలైన పూతన, శకటాసురుడు, తృణావర్తుడు, ధేనుకాసురుడు మొదలైనవారిని ప్రయోగిస్తాడు. సహజ యోగిని ఎవ్వరూ ఏమీ చేయలేరు. ఎందుకంటే పరమాత్మ తత్త్వమే అక్కడ జీవాత్మ తత్త్వాన్ని ఆశ్రయించి వుంటుంది. కాబట్టి రాజయోగ మార్గంలో వుండే గురువుకి దేవతలు సహకరించినట్లుగా, ఉపాసకులకు సహకరించరు. యోగి సత్త్వగుణ సంపన్నుడుగా వుంటాడు. తాను భగవంతుని యందు జీవిస్తూంటాడు. భగవంతుని యందు చరిస్తూంటాడు. భగవంతుడే తానుగా వుంటాడు. ఏ మాత్రమూ తన గురించి తను వ్యక్తపరచుకొనే దురద వుండదు. ఎందుకంటే తన గురించి అనేది ఎప్పుడో వెళ్ళిపోయి ఆయన గురించి అని మాత్రమే జీవించడం వుంటుంది. ఎప్పుడయితే దేవతలతో సహా అందరికీ పుట్టుక స్థానం అయిన తత్త్వం తో ముడిపడియున్నాడో, అప్పుడు దేవతలంతా ఇతనితో కలసి పనిచేయడానికి ఉత్సాహం చూపిస్తారు. రాముడు సహజ యోగి, ఉపాసకుడు. అందుకే రాముడు యుద్ధం చేస్తుంటే గరుత్మంతుడు సహకారం అందించాడు, ధైర్యం చేసి. అలాగే ధైర్యం చేసి ఇంద్రుడు సహకరించాడు. రావణుడు ఏమంటాడోనని భయం లేకుండా. అలాగే దేవతలూ సహకరించారు. ఎందుకు సహకరించారంటే యోగి కాబట్టి. అది కాకుండా ఒక్కొక్కళ్ళనీ వశం చేసుకోవడం మొదలుపెట్టాం అనుకోండి, ఎంతమంది దేవతలని వశం చేసుకోగలరు? Police

department లో వుండే conistable నుండి అందర్నీ వశం చేసుకోడం కన్నా, మొత్తం రాష్ట్రానికి అధికారి యైనవాడు మన స్నేహితుడై, మనింట్లో ఓ వారం రోజులున్నాడనుకోండి, ఈ ఊళ్ళోవాళ్ళంతా మనం అంటే జాగ్రత్తగా వుంటారు. అట్లా అంతర్యామి యందు జీవించేవాడు సత్త్వగుణం లోంచే గుణాతీత తత్త్వంలోకి ప్రవేశించవచ్చు. అలా ప్రవేశించడం అనేది బుద్ధిమంతుల మార్గం. అలా కాకుండా ఏదో ఒక దేవతను ఉపాసిస్తూ కూర్చోడం అనేదీ అదొక మార్గం. దేవతా ఉపాసన దాన్ని పట్టి ఉంచడంగా వుంటుంది. ఎప్పుడైనా పారిపోయే పనివాణ్ణి ఎంతసేపు పట్టి వుంచుకుంటావ్? మన చుట్టూ తిరిగే వాళ్ళుండగా, మనం ఎవర్నో పట్టుకొని పనిచేసుకుందాం అనుకోవడం ఈ రెంటిలో ఏది సుళువు? వాణ్ణీ వీణ్ణీ పిలిచి పని చేయించుకునేవాడికి పనులు అవ్వవు. కొంతమంది చుట్టూ కొంతమంది అడక్కుండానే తిరుగుతూంటారు. ఎందుకంటే అంతే మరి ప్రేమ సామ్రాజ్యంలో. కృష్ణుడి చుట్టూ అలా తిరుగుతూండే వారు. మహాత్ముల చుట్టూ అలా తిరుగుతూంటారు. తిరుగుతున్న వారిలో శుభ్రమైన వారికి పనులు అప్పచెప్తూంటారు, బాధ్యత ఉన్న వాళ్ళని. అంతేగానీ వారినీ వీరినీ పిలిచి పని చేయించుకునేవారు తెలివి తక్కువవారు. ప్రేమ సామ్రాజ్యం ఇట్లా వుంటుంది. అధికార సామ్రాజ్యం అట్లా వుంటుంది. అందుకనే ఈ సామ్రాజ్యాన్ని మొట్టమొదట ఏర్పాటు చేసినవాడు వసుదేవుడు. దాన్ని అలాగే నిర్వర్తించినవాడు కృష్ణుడు. రాజ్యాధికారం కలిగి వున్నప్పటికీ, మళ్ళీ ఉగ్రసేనుని రాజుగా నియమించి తాను ప్రేమ సామ్రాజ్యానికి రాజుగా నిలబడ్డాడు. ఏసుక్రీస్తు ని 'మీరు రాజుట కదా?'అంటే 'మీరు అనుకున్న రాజ్యానికి కాదు. నా రాజ్యం అందరి హృదయాలలోనూ వున్నది. అక్కడ నేను రాజాధిరాజుని' అని చెప్తాడు. ప్రత్యేకించి మనం ఇది నేర్చుకుంటే జీవితంలో సుఖపడ్తాము. నాలుగు రోజులు కనబడకపోతే, మనింటికి రాకపోతే మనల్ని మర్చిపోయారేమో అని భయపడే పరిస్థితి రాకూడదు. చూట్టూ నలుగురు తిరగకపోతే తోచదు అధికారికి. పైగా తిరగకపోతే అపోహలు కల్పించుకుంటారు. భక్తిమార్గంలో కూడా ఇవి కనిపిస్తూంటాయి. ఇదీ కలితత్త్వం. అధికార వాంఛ, అధికార దాహం, ఇతరులపై అధికారం చలాయించుట ఇవి వుంటే కృష్ణుడక్కడికి రాడు. నీ కన్నా తక్కువ వాడై, నీకు సేవ చేయడానికి వచ్చేవాడి యందు ప్రేమగా వుండడం నేర్చుకుంటే కృష్ణుడొస్తాడు. యోగికి తనకన్నా పైవాడొక్కడే వుంటాడు. మిగతా అందరూ వాడివాళ్ళే. అందుకని అందరితో సోదరత్వం కలిగివుంటాడు. క్రిందవాడి వద్ద భుజాలు ఎగరెయ్యడు గనక పైవాడి వద్ద వంగ నక్కరలేదు. అందుకే పోతన, త్యాగరాజు లాంటివారు, 'మా కప్ప జెప్పెయ్యి, మావద్ద పాడూ' అంటే 'పోరా' అన్నారు. ఎందుకంటే వారంతా అధికార మదం చేత కోరారు. ప్రేమతో కోరితే గుడిసెలోకి వెళ్ళయినా పాడతాడు త్యాగరాజు. అన్నమయ్య కూడా అంతే. అధికారానికి లొంగడు. యోగులు అధికారానికి లొంగరు. ప్రేమకు లొంగుతారు. మనలో కూడా అధికార వాంఛ ఎంతున్నదో మన మాట వినేవారు, మనతో అవసరం వుండేవారు ప్రవర్తించే తీరులో కనిపిస్తుంది. అది వున్నంతకాలం మనకి దివ్యచైతన్యం అనుభూతి చెందడం కనిపించదు. వారిని కూడా ఆదరంగా చూసుకోవడం అంటే నెత్తి కెక్కించుకోవడం కాదు. తక్కువ తెలివి వున్నవాడిని,

తక్కువ సంస్కారం వున్న వాడిని ఎక్కువ మీదకెక్కించుకుంటే, పైకెక్కి ఇహ అంతే! అలాక్కాదు చేయడం. ఆదరించడమంటే వాడికేది అవసరమో, శ్రేయస్సో అది చేస్తూ కనిపెట్టి వుండడం. ఆ విధంగా చక్కగా నిర్వర్తించుకోగలిగి మనలో కృష్ణ చైతన్యం పెంచుకుంటూంటే, మనకు ఈ అధికారం మీద వాంఛ తగ్గుతూంటుంది. నిజమైన కృష్ణ భక్తుడికి అధికారం అక్కరలేదు. ఉన్నది కూడా వదిలేస్తాడు. వీరులూ, శౌరులూ అయిన శూరజనులకు ఈశ్వరః అనే నామం తర్వాత వస్తుంది.

## 670, 671, 672 శౌరిః, శూరః, జనేశ్వరః

శౌర్యవంతుడైన శూరజనులు అంటే శూర ప్రదేశములున్నాయి కదా! మధురలో రెండు రకాల ప్రదేశాలున్నాయి. మధుర ప్రదేశములు కొన్ని, శూర ప్రదేశములు కొన్ని. శూర ప్రదేశములు అంటే కిరణముల కాంతి ప్రసరించే ప్రదేశములు. శూరులంటే అర్థం అది. అతని కాంతి అట్లా ప్రసరిస్తూ వుంటుంది తనలోనూ, తన చుట్టూను. శూరజనులకు ఈశ్వరుడు. ఈ వెలుగున్న వాడే నిజమైన శౌర్యవంతుడు. చూడ్డానికి పెద్దగా ఆనకపోవచ్చు. వశిష్ఠుడు విశ్వామిత్రుడికి ఆనలేదు కదా! ఆనకపోయినా తీరా పని జరిగే సమయానికి తనెంతో కనబడతాడు. వినాయకుడు, కుమారస్వామికి ఆనలేదు కదా! కానీ అసలు సమయంలో కుమారస్వామికి, వినాయకుడెంతో తెలుస్తుంది. అలాగే రాముడి గురించి రావణుడికి తెలిసినట్లు, కృష్ణుని గురించి సమస్త రాజులకీ తెలిసినట్లూ. మామూలుగా అట్లా గోచరించరు. సన్నివేశంలో సన్నివేశాన్ని మించి కనబడతారు. వాళ్ళూ శూరులు! వారి శౌర్యము నివురు కప్పిన నిప్పు వలె వుంటుంది. వీరులు వీరత్వం కలిగి, శూరత్వం కలిగి వున్నారే, వారందరికీ ఈయన ఈశ్వరుడు అని చెప్తున్నాడు ఈ నామంలో. ఎందుకంటే ఉత్త వీరత్వం, శూరత్వం, క్రౌర్యం రజో గుణాలు. లాభం లేదు. సత్త్వంలో ఉండి క్రౌర్యాన్ని నటించవచ్చు. కృష్ణుడు, రాముడు అవసరాన్ని బట్టి క్రౌర్యాన్ని నటించారు. తెచ్చిపెట్టుకుని, చూపించి, ఆ పనయ్యాక మళ్ళీ మామూలుగా వుంటారు. అంతేకానీ దాంట్లోకి లొంగిపోరు. కనుక ఆ రకమైన సత్త్వగుణములోని వెలుగు కిరణములు ప్రసారము జరుగుతున్నట్టి, శౌర్యము కలిగిన వీరులకు ఇతడీశ్వరుడు అని చెప్తున్నాడు భీష్ముడు. ఎందుకంటే చాలా సార్లు చూశాడు కనుక. రాజసూయంలో అగ్రపూజప్పుడు భీష్ముడే చెప్తాడు. 'అందరి కన్నా వీరులూ, శౌరులూ ఎవరూ?'అని కదా ప్రశ్న. అక్కడున్న వారందరూ నేనంటే నేనే అనుకున్నారు. అందరి రాజులలోకీ అగ్రగణ్యుడికి ఆ రోజు సన్మానం జరగాలి. ఆయనకి పూజ చేయాలి. ఆయన ఆశీర్వచనం అందుకోవాలి. 'ఉన్నవాళ్ళల్లో ఎవరూ' అని ప్రశ్న వచ్చింది. ధర్మరాజు పూజ చేయాలంటే, ధర్మరాజు కన్నా ఇంకా గొప్పవాడై వుండాలి అన్ని విషయాలలోనూ. అందుకని చివరకు భీష్ముణ్ణి నిర్ణయించారు. గంగాపుత్రుడూ, దేవతల చేత సమస్త విద్యలూ పొందినట్టి పూర్ణపురుషుడు, మహా జ్ఞాని, యోగి, బైరాగి అన్నీ వున్నాయి. ఒక భగవద్భక్తునికి, ఒక రాజయోగికి ఉండవలసిన గుణములలో ఏదీ తక్కువ లేకుండా పూర్ణంగా ఉన్నవాడు భీష్ముడు. ప్రపంచమంతా ఆయన్ని ఆ విధంగా గుర్తించింది. ఎందుకు గుర్తించిందయ్యా అంటే పరశురాముణ్ణి కూడా యుద్ధంలో ఓడించేశాడు. ఆయన్ని ఓడించడం ఆ రోజుల్లో చాలా గొప్ప విషయం. ఎందుకంటే అంతకు ముందే 21సార్లు భూమి చుట్టూ తిరిగీ క్షత్రియులందరి తలకాయలూ తెగ్గొట్టినటువంటి వాడాయన. ఆయన వస్తున్నాడంటేనే అందరికీ కాళ్ళల్లో వణుకు పుడుతుంది. అటువంటి వాణ్ణి యుద్ధంలో జయించాడు. పరశురాముణ్ణి యుద్ధంలో జయించింది భీష్ముడొక్కడే! రాముడికీ, పరశురాముడికీ యుద్ధం వరకూ రాలేదు. ముందే ఒప్పేసుకున్నాడు

పరశురాముడు. ధనుస్సు 'ఓంకార' స్వరూపం కదా! అందుకు ధనుస్సు అందించినప్పుడు ఆయనలోనూ, ఈయనలోనూ ఓంకారం వున్నది. ధనుస్సు యొక్క బలం దానిని ఎంత గట్టిగా చేయించుకుంటే దానిమీద ఆధారపడి వుండదు. పౌండ్రక వాసుదేవుడి లాగ. ఆయన బాగా కంచు పోసి శంఖ, చక్రాలు మోయలేనంత పెద్దగా వుండాలని చేయిస్తాడు. కృష్ణుడికి పిలిస్తే వస్తాయి. వీడు గొప్పగా బరువుగా చేయించి పెట్టుకున్నాడు. మోయలేడు. 'శివ ధనుస్సు విరిచేంత మొగాడివా, ఇదిగో విష్ణు ధనుస్సు' అని పరశురాముడు manifest చేస్తాడు. అప్పటికప్పుడు సృష్టిస్తాడు. 'నేను శివధనుస్సు విరవలేదు. ఎక్కుపెడుతూంటే విరిగిపోయిందని' చెప్తాడు రాముడు. 'అది దైవ సంకల్పం' అంటాడు. 'నువ్వు దైవ సంకల్పం తెలిసినంతటివాడివా' అంటాడు. తెగ రజస్సు. కానీ అది లేకపోతే ఈ రాజులందర్నీ చావగొట్టడం కష్టం. తాడి చెట్టెక్కి ముంజకాయలు కొట్టినట్లు రాజులందరి తలకాయలూ చెక్కి పారేస్తాడు. అలాంటివాణ్ణి చూస్తే క్షత్రియులందరికీ వణుకు. ఆయన పేరు చెప్తే నిద్ర పట్టదు వాళ్ళకు. భీష్ముడు అటువంటి వాణ్ణి ఓడించాడు. ఎందుకు ఓడించాడంటే భీష్ముడు ధర్మపరంగా యుద్ధం చేశాడు. పరశురాముడు కొంత ధర్మానికి మద్దతు ఇచ్చాడు. 'మీరు నన్ను చేయమంటున్నది అధర్మం కనుక మీరెంత గురువైనా' చేయనంటాడు భీష్ముడు. 'రోజూ మీకు నమస్కరించి కార్యక్రమాలు మొదలు పెడ్తాను. కానీ అధర్మం చేయను'. గురు శిష్యుల సందర్భాలలో ఇదొక రకం సన్నివేశం. 'గురువేం చెప్పినా ధర్మాధర్మాలు లేకుండా చేస్తాను' అనే సన్నివేశాలూ వుంటాయి. పరశురాముడు అదే చేశాడు. తండ్రి, తల్లి తలకాయ నరికెయ్యమంటే గొడ్డలి తీసి నరికేస్తాడు. పరశురాముడికి కార్యక్రమం అక్కడ్నుండే మొదలు. అదేంట్రా అంటే 'తండ్రి చెప్పాడు తీసేశాను' అంటే, తండ్రి సంతోషించి తల్లికి తలకాయ మళ్ళీ తెప్పించేస్తాడు. ఇక్కడ భీష్ముడు 'నేను పెళ్ళి చేసుకోను అని మా నాన్నకు మాట ఇచ్చాను. ఎవరు చెప్పినా చేసుకోను' అంటాడు. అంబ, అంబిక, అంబాలికలను ఎత్తుకు వచ్చినప్పుడు, అంబ సాళ్వుణ్ణి వరించిందని తెలుసుకుని, ఆమెను అక్కడకు పంపితే సాళ్వుడు, 'నువ్వు ఆఘ్రాణించిన పుష్పానివి. ఎందుకంటే భీష్ముడి చేత జయింపబడి తీసుకెళ్ళబడ్డావు కాబట్టి నీవు నా భార్యగా వుండతగవు' అంటాడు. ఎందుకంటే వాడికది అవమానం. యుద్ధంచేసి సాళ్వుడు భీష్ముడి చేతిలో ఓడిపోతాడు. ఓడాక 'ఆ కన్యను నువ్వు చేసుకో' అంటే రాజుగా వాడికది అవమానం. అతని చేత జయించబడ్డావు కాబట్టి అతని దగ్గరకే పొమ్మంటాడు. భీష్ముడి వద్దకు వెళితే 'నేను మా తండ్రికి మాట ఇచ్చాను కాబట్టి నేను చేసుకోలేను' అంటాడు. అప్పుడు అంబ వారివద్దకీ, వీరివద్దకీ వెళ్తే కొంతమంది 'నువ్వు పరశురాముడి వద్ద నీ గొడవ చెప్పుకో. ఇతడు పరశురాముడి శిష్యుడు. అక్కడ influence చేస్తే ఇతడిక్కడ లొంగుతాడని' సలహా ఇస్తారు. ఈమె వెళ్ళింది, గోల పెట్టింది. నా మాట వింటాడని, అనుకున్నాడు. శిష్యుడు మన మాట ఎందుకు వింటాడూ? చాలామంది 'మీరేం చెప్తే అది చేస్తాం' అంటారు. కానీ చాలా మంది అది చేయరు. ధర్మమైన పని చెప్తేనే చేస్తారు. మనం ధర్మమైన పనే చెప్తామని వారికి నమ్మకం. అధర్మం ఆచరించమని మనమంటామని వారనుకోలేరు. అందుకని మీరేం చెప్తే అది చేస్తామంటే, రోడ్డుమీద వెళ్ళేవాడి జేబు కొట్టుకు రమ్మని చెప్తామా?

'నా శిష్యుడేలే. పెళ్ళే కదా నేను చెప్పి ఒప్పిస్తాను' అన్నాడు. పరశురాముడు వెళ్తే అన్ని ఉపచారాలు చేసి నమస్కరిస్తాడు భీష్ముడు. ఆయన 'నువ్వు అంబని పెళ్ళి చేసుకో' అంటాడు. అయితే 'నా తండ్రికిచ్చిన మాట ఆచరించడం నాకు ధర్మం కదా! ఇప్పుడు మీరు చెప్పింది వింటే నేను ధర్మం ఆచరించినట్లా, ఆచరించనట్లా?' అంటాడు. అదంతా నీకెందుకూ నేను చెప్పినట్లు చేయమంటాడు పరశురాముడు. అది నాకు కుదరదు అంటాడు భీష్ముడు. నాకు ధర్మా ధర్మ విచక్షణ కావాలి. ఈమెను పెండ్లి చేసుకుంటే నేను ధర్మాన్ని ఆచరించినట్లా, ధర్మాన్ని అతిక్రమించినట్లా? ఇలా తెమలదు. తెమలక పోయేసరికి పరశురాముడికి కోపం వస్తుంది. కోపం వచ్చి, చేసుకోకపోతే యుద్ధం చేసి నిన్ను చంపేస్తానంటాడు. 'అయితే కానీ. యుద్ధం చేసి నీ చేతిలో మరణించడమే నాకు సరైన మార్గం. కానీ ఈమెను వివాహం చేసుకోవడం నాకు సరైన మార్గం కాదు' అని చెప్తాడు భీష్ముడు. యుద్ధం చేస్తారు. భీష్ముడు బృహస్పతి వద్ద విద్య నేర్చుకున్నాడు. దేవతలందరూ రకరకాల విద్యలు నేర్పారు. ఆయన దేవతల వద్ద ఉన్న విద్యలు, 64 విద్యలూ నేర్చుకున్నాడు. ఎదురుగా పోట్లాడేవాడు తన గురువు. అందుకని గట్టిగా బాణాలు వేయలేకపోతూంటాడు. గురువేమో రజస్సుతో గూడి చావగొడుతూంటాడు. బాగా మంత్రించిన ఆయుధం భీష్ముడిమీద వదిలేసరికి, అది వాడి ముఖ్య ప్రాణానికి తగిలి సొమ్మసిల్లిపోతే, దాదాపు చనిపోయినంత పనైతే గంగ వస్తుంది. 'ఏంటి నాయనా! నువ్వు ధర్మం కోసం యుద్ధం చేస్తున్నావు. నువ్వెంతటివాడివీ! అధర్మం అయితే గురువే కాదు శివుడైనా పోట్లాడవలసిందే' అని చెప్తుంది. 'శివుడు వచ్చి అధర్మం చెప్పి పోట్లాడితే శివుడు ఓడిపోతాడు. కేవలం ఆయన మీదుండే గౌరవం కొద్దీ నీవు కొంత మెత్తగా బాణాలు వేస్తున్నావ్' అంటుంది తల్లి. రాముడు రావణుడి మీద అలాగే బాణాలు వేస్తూంటాడు. కనుక ఇంక చాల్లే కొట్టేసెయ్ అని చెప్తుంది గంగ, భీష్ముడికి. సరే ఒక బాణం గట్టిగా వేస్తే పరశురాముడు దభేల్న పడిపోతాడు. పడిపోతే మళ్ళీ ఇంకో బాణం తీసివేయబోతూంటే త్రిమూర్తులు దిగివస్తారు. దిగివచ్చి పరశురాముడికి బుద్ధి చెప్తారు. 'నువ్వు మళ్ళీ ప్రపంచంలోకి వచ్చావంటే నీ మాట దక్కదు. ఇప్పటికే చాలా అవమానం అయ్యింది, వెళ్ళిపో. పర్వతం మీద తపస్సు చేసుకో. మళ్ళీ ఈ ప్రపంచం జోలికి రావద్దు. నీ యుగం అయిపోయింది. నీ పని అయిపోయింది. ఇహ ఇక్కడ నీకు పనిలేదు, తపస్సుకు వెళ్లిపో' అని చెప్తారు. అంత పనయ్యింది. అలాంటి భీష్ముడు వీరుడు, శూరుడు, శౌర్యము కలిగినటువంటివాడు. అతనితో సమానుడు ఆ కాలంలో ఎవ్వరూ లేరు. అతని కొక్కడికే తెలుసు ఇంకొకడున్నాడని. అతడూ కృష్ణుడు. పాండవులు కూడా అవసరానికి ఆశ్రయించారే తప్ప, చిట్టచివర వరకూ కూడా కృష్ణుడి గురించి అంత తెలియదు. ఈయనకి తెలుసు, హిమాలయాల్లో వుండే కొంతమందికి తెలుసు, గోపికలకు తెలుసు. ఇంకెవ్వరికీ తెలీదు. గోపికల గోలంతా ఇంకో రకమైన scandal గా ప్రపంచంలో ప్రచారమై వుంటుంది. Play boy అనే భావన. ఆడపిల్లలతో అల్లరి చిల్లరిగా తిరిగిన వెధవ అనే భావన రాజులలో. నాసిరకపు రాజు అని. పోనీ శరీరం చూద్దామంటే పెద్ద కండలు పెంచినట్లు కనబడడు. చైతన్యం సంస్కారవంతులకే కనిపిస్తుంది లేకపోతే కనబడదు. ఆ సభలో అంతా అగ్రపూజ భీష్ముడికి చేయాలంటే సరే భీష్ముడికే అనుకుంటాడు ధర్మరాజు.

భీష్ముడి వద్దకు వెళ్తే, 'ఈ సభలో ప్రభువు, ఈశ్వరుడు, అందరికన్నా గొప్పవాడూ ఎవరయ్యా అంటే నేను కాదు ఆయన' అని కృష్ణుణ్ణి చూపించాడు. ఎంత సంస్కారం తనలో ఉండకపోతే, ఎంత ఆత్మవంతుడు కాకపోతే ఆయన్ని చూపించగలిగాడు. కృష్ణుడు అలా వుంటాడు తప్ప, ఏదీ వ్యక్తం చేయడు కదా! రాజసూయయాగమంటే, భూగోళంలో వుండే ఎక్కడెక్కడి రాజులూ వచ్చారు. వారందరికీ భీష్ముడు highest. ఆయన వద్దకు వెళ్తే ఆయన చెప్పాడు. 'నేను కాదు నాయనా, పరమ పురుషుడు అక్కడ కూర్చొని వున్నాడు. ఆయనకి అగ్రపూజ చెయ్. నేను అగ్రపూజ చేయించుకుంటే అపచారం జరుగుతుంది. ఆయనకి చేయండి' అని చెప్తాడు. వీరులకీ, శూరులకీ, అందరికీ ఈశ్వరుడు. ఆయన మొత్తం సృష్టికే ఈశ్వరుడు. కానీ ఈ నామం మనం చెప్పకోవలసింది వీరికీశ్వరుడు అని. ఈ రాజసూయంలో ఈ అగ్రపూజ చేయించిన స్ఫూర్తి అప్పటికి వుండడమే ఈ నామాల కారణంగా నేను భావన చేస్తున్నాను. వీర్యము, శౌర్యము కలిగిన జనులకు ఈశ్వరుడుగా తను గుర్తించాడు. అందుకే పాండవుల వైపు ఆయనున్నాడు గనుక వారికేమీ ఇబ్బంది లేదని తను సంతృప్తి చెందుతాడు.

## 673 త్రిలోకాత్మా

ఇన్ని జీవాత్మలున్నాయి. ఇందులో కృష్ణుడొకడు. అంతేకాదు ఇన్నీటికీ కృష్ణుడొకడు. ఆ రూపంలో తానొకడుగా కనిపిస్తున్నప్పటికీ మొత్తం మూడు లోకాలలో, భూర్భువస్సువర్లోకాలలో పదార్థము, శక్తి, ప్రజ్ఞ మూడు లోకములూ ఆవరించిన ఏకప్రజ్ఞ ఏకాత్మ, 'విశ్వాత్మ'. త్రిలోకములూ ఈయన మీద ఆధారపడియున్నాయని చెప్పడం 'త్రిలోకాత్మా'.

## 674 త్రిలోకేశః

మూడు లోకాలకీ ఆధారభూతుడు, ప్రభువు, ఈశ్వరుడు, స్వామి. అందుకే కృష్ణుణ్ణి 'కృష్ణం వందే త్రైలోక్య గురుః' అంటారు. మూడు లోకాలకీ ఆయన ఈశ్వరుడు.

## 675 కేశవః

అంటే ఊర్ధ్వమైన కిరణములు కలిగినవాడు. కేశములు కూడా ఆ పదం నుండే వచ్చాయి. చైతన్యం బాగా ఊర్ధ్వంగా ఉండేవాళ్ళు ఊర్ధ్వముఖంగా ముడి వేసుకుంటారు. 'కపర్దిని' అని అంటామే అంటే పైకి ముడి వేసుకుంటారు. క్రిందకి జారవదలరు. ఋషులంతా బాగా బిగించి పైకి లాగి ముడి వేసుకుంటారు. ఎందుకంటే చైతన్యము ఊర్ధ్వముఖంగా ప్రవహిస్తుంది వారికి. అందుకని అక్కడ నుండి వెంట్రుకలు క్రిందకి వేలాడుతుంటే పరమ చిరాగ్గా వుంటుంది. మరీ చీకాగ్గా వుంటే గుండు కూడా చేయించేసుకుంటారు తప్ప అలా వేళ్ళాడేసుకు తిరగరు. ఎందుకంటే మొత్తం ప్రజ్ఞ అంతా ఊర్ధ్వముఖంగా వెళ్తుంది. అధోముఖం గా వెళ్ళదు. అందుకని వాళ్ళకి కొడుకు పుట్టాలంటే చాలా కష్టం. ఓ పట్టాన కాదు ఆ కార్యక్రమం. కుమారసంభవం ఉన్నది కదా! దేవతలంతా పార్వతీదేవిని శివుడు ప్రేమిస్తే బావుణ్ణని కోరుకుంటారు. చివరికి కామదేవుడు కూడా శివుణ్ణి కామంలోకి దించడానికి వృథా ప్రయత్నం చేస్తాడు. మొత్తానికి ఎలాగో కళ్ళు తెరిస్తే, ఎదురుగుండా పార్వతి వుంటుంది. అసలు ఈమె తపస్సుకు వెళ్తానంటేనే తల్లి వద్దని చెప్తుంది. 'ఉమ' అంటే అదే అర్థం. ఈమె పర్వతరాజపుత్రి. పెండ్లీడుకు వచ్చింది. శివుణ్ణే పెళ్ళి చేసుకుంటానంది. అదయ్యే పనా? అందులోనూ శివుడా! చైతన్యం అసలు దిగిరాదు. ఆ వ్యవహారం అంతా విష్ణువుదే! అసలు చైతన్యం ఉంటుంది శివుడికి కానీ దిగదు. మనలోనూ ఉంటుంది, దిగదు కానీ. ప్రపంచంలోకి దిగని అంతర్యామి ప్రజ్ఞ అది. దిగివస్తే హరి, దిగి రాకపోతే శివుడు. అలాంటి వాణ్ణి పెళ్ళి చేసుకుంటానంటుందీమె. ఆమెకా కోరిక పుట్టడానికి కారణం ముందు ముందు తారకాసుర సంహారానికి నాంది అన్నమాట. ప్రజ్ఞ అక్కడ నుండి రావాలి. ప్రయత్నాలలో భాగంగా ఈమె తపస్సు చేస్తుంది. ఈలోగా మన్మథుడికి ఓపిక పోతుంది. ఈమె తపస్సు ఎప్పటికి తెమిలేనూ, ఆయనెప్పుడు కరుణించేనూ, వీళ్ళిద్దరికి పెళ్ళి ఎప్పుడయ్యేనూ, పిల్లవాడెప్పుడు కలిగేనూ, ఈ తారకాసురుణ్ణి ఎప్పటికి చంపేనూ-- ఇలా అతడికి ఓపిక పోయి నాలుగు బాణాలు వేసాట్ట శివుడి మీద. అంతే! ముచికుందుడు చూసినట్లే ఈయనా కళ్ళు తెరిచి చూశాడు, ఏమిట్రా ఏమిటి పడుతున్నాయని చూస్తే, వీడు. అంతే చూడగానే భస్మమైపోతాడు మన్మథుడు. ఏంటా ఇది అనుకుంటుంటే, ఎదురుగా పార్వతి కనిపిస్తుంది. అప్పుడు దేవతలంతా 'ఈమె నీకోసం తపస్సు చేస్తోంది' అని చెప్తారు. ఈమె తపస్సుకు వెళ్తుంటే తల్లి వద్దని చెప్పడం 'ఉమ'. ఉ అంటే నీవు, మ అంటే వెళ్ళవద్దు అని అర్థం. ఉమ బజారుకి వెళ్ళిందంటే ఎలా వుంటుందీ? పెళ్ళి చేసుకుంటే ప్రజ్ఞ దిగదే ఆయనకు. శివుడికి అధోముఖ ప్రజ్ఞ లేదసలు అంతా ఊర్ధ్వముఖ ప్రజ్ఞ తప్ప. 'కపర్దినేచ' అంటాం అందుకే నమకంలో. తను దిగడు. అక్కడ కూర్చొని అన్నీ చేస్తాడు. దాంతో అలా దేవతా సంవత్సరాలు జరిగిపోతూంటాయి. ఆడుకుంటూంటారు, పాడుకుంటూంటారు గానీ పిల్లలు కలిగే కార్యక్రమమేమీ మొదలు కాదు. ఆయన సాన్నిధ్యంలో ఆమె ప్రజ్ఞా అంతే, ఆమే దిగదు. అప్పుడు

అగ్నిదేవుడు వచ్చి వారి ఏకాంతం భగ్నం చేస్తే, మళ్ళీ శివుడు చూస్తాడు. అగ్నిదేవుడు కూడా చచ్చిపోయేవాడే. 'బాబూ నన్ను మాత్రం నువ్వు కాల్చెయ్యక. దేవతలకి నీనుండి సాయం కావాలి. నీనుండి మాకు ఓ పుత్రుణ్ణి ప్రసాదించు అని కోరడానికి వచ్చాను' అంటాడు. అందరూ కలిసి అగ్నిదేవుడ్ని ముందుకు తోస్తారు. మిగతావాళ్ళం భరించలేము, నువ్వు అగ్నివి కదా, నువ్వే భరించగలవని. బిక్కు బిక్కుమంటూ తెల్లటి పావురం రూపంలో వెళ్తాడు. అది కూడా ఏకాంతానికి అంతరాయం కలిగిస్తుంది. గట్టిగా చూడబోతే, చూడబోకని గబగబా ప్రత్యక్షం అయ్యి, గబగబా చెప్పేస్తాడు కథంతా. నవ్వుతాడు శివుడు. సరే కానీ. నువ్వు పట్టుకుపో అని ఆయన చేతిలో పోసేస్తాడు వీర్యం. అది అగ్ని పట్టుకోలేకపోతాడు. వెంటనే గంగలో వదిలేస్తాడు. ఆమె అది భరించలేకపోతే, ఋషిపత్నుల గర్భంలోకి ప్రవేశింపచేస్తాడు ఆరుగురికి వారు స్నానానికి వస్తే. అరుంధతి గర్భంలో ప్రవేశింపచేస్తే శపిస్తుందని భయపడి ఆమెను వదిలి మిగిలిన ఆరుగురు ఋషి పత్నుల గర్భాలలో ప్రవేశపెడ్తుంది గంగ. నదిలో వుండేవరకు వీళ్ళు బానే వుంటారు. బయటకు వచ్చేసరికి ఇహ క్రొత్త ఆవకాయ తిన్నట్లు మండిపోతూంటుంది. ఏమిటిలా మండిపోతోందని గమనిస్తే తెలుస్తుంది. అమ్మో అని అక్కడ రెల్లుపొద వుంటే అక్కడకి వెళ్ళి వదిలేస్తారు, ఆరు ఖండాలుగా. అవన్నీ పోగుచేసుకుని ఈయన పుట్టుకువస్తాడు. పుట్టుకు రావడమేమిటి మొత్తం చీకట్లన్నీ పోయినాయట. పుట్టడమే 5 సంవత్సరముల పిల్లవాడైపోయి 'పదండ్రా యుద్ధానికి' అన్నాట్ట. దేవతాసేనల్ని మీరంతా సిద్ధమేనా అన్నాట్ట. కుమారసంభవం చాలా బావుంటుంది, చదువుకోండి. అలా ప్రజ్ఞ ఊర్ధ్వంగా వున్నది దిగదు. 'కేశవః' అంటే అదీ అర్థం. అలా దిగనివాడు కోరుకున్న వాళ్ళందరితోనూ ఆడుకున్నాడండీ. చూసేవాళ్ళందరికీ ఏం అర్థం అవుతుందీ? రంకు కట్టారు. పోరా అనుకున్నాడు. కృష్ణుడిలో గొప్పతనం ఏమంటే, ఎంత తిట్టుకుంటూంటే అంత నవ్వుకుంటూండేవాడు. ఎంత అపనిందలు వేస్తే భలే అపార్థం చేసుకున్నారే అని ఆనందించేవాడే తప్పా ఏమీ అనేవాడు కాదు. అది చూడండి. మనం ఎంత తాపత్రయపడతాం మన గురించి ఎవరూ ఏమీ అనుకోకూడదని. తప్పలు కప్పకుంటాం. అక్కడాయన లేని తప్పలు ఆపాదించినా ఏమీ అనలేదు. పోరా అన్నాడు. నువ్వు దొంగవా అంటే నవ్వాడు. అక్కడా ఇక్కడా తిన్నావా వెన్న అంటే నవ్వాడు. అన్నిటికీ నవ్వుతాడు. అసలు నేను వీరికి చెప్పినా అర్థం కాదు. వీళ్ళకెందుకు సమాధానం ఇవ్వడం అని. ఓ పందితోనూ, ఓ గాడిదతోనూ ఎవరైనా మాట్లాడగలమా? స్తుతి చేసినా అంతే. స్తుతి చేసినవాడు అర్థం చేసుకున్నాడు, నింద చేసినవాడు అర్థం చేసుకోలేదు అని రెండూ లేవు. ఎందుకంటే స్తుతి చేసినవాడు కూడా పూర్తిగా అర్థం చేసుకోలేదు. పూర్తిగా అర్థం అయినవాడు ఈయనొకడే గనక ఈయనొక్కడి చేతా చెప్పించాడు, వెయ్యీ ఎనిమిది నామాలూనూ. పరిపూర్ణంగా అర్థం అయ్యింది భీష్ముడికే! ఈయన మహా భక్తుడు, జ్ఞాని. ఊర్ధ్వములైన కిరణములు కలిగినవాడు, అధో చైతన్యము లేనటువంటివాడు అని 'కేశవ' కి అర్థం. మనం కూడా ఊర్ధ్వ రేతస్కులం అయితే యోగుల మవుతాం. అధో రేతస్కులం అయ్యేకొద్దీ భోగుల మవుతాం. భోగించొద్దు అని చెప్పలేదు భగవంతుడు. కానీ యోగం కావాలంటే ఊర్ధ్వ రేతస్సు! ఇదే

పనికొచ్చేది. మనలోని 101 నాడులలోనూ అధోముఖంగా మానవుని ప్రజ్ఞ ప్రవహించి, అక్కడ నుండి బహిర్గతంగా ప్రసరిస్తుంది. ఆయన కవన్నీ ఊర్ధ్వముఖంగా ప్రసరిస్తూంటాయి. ఈ 101 వచ్చి వందలో చేరితే, వంద నుండి ఆకాశంలోకి వెళ్తూంటుంది ఎప్పుడో ప్రజ్ఞ. అవసరాన్ని బట్టి దిగి వస్తూంటారు. దిగి వచ్చినా సహజ స్వభావం ఊర్ధ్వముఖంగా పోవడమే. మనం అత్యంత ప్రయత్నం చేత ఊర్ధ్వముఖంగా వెళ్తాం. అంత ప్రయత్నం చెయ్యాలి ఆయన అధోరేతస్కుడవడానికి. ఇదే తేడా ఆయనకీ, మనకీ. మనకి హృదయం లోకి రావడానికి ఎంత కష్టం? ఎన్ని రకాల సాధనలూ, ఎన్ని రకాల ప్రయత్నాలూ. రకరకాల బాధలు పడుతున్నాం. ఇంతా చేసినా లేచిందో లేదో తెలీదు. నీకు లేచిందో లేదో ప్రక్కవాణ్ణి అడుగుతావ్ 'నా ప్రజ్ఞ హృదయం వరకు వచ్చిందంటారా' అని. నీకు తెలుస్తుందా? ప్రక్కవాడికి తెలుస్తుందా? నీవు ఒక గరిటెడు ఉప్మా తిని, నా కడుపు నిండిందా లేదా అని ప్రక్కవాణ్ణి అడిగితే, వాడికెట్లా తెలుస్తుంది నీకు కడుపు నిండిందో లేదో? ఎట్లాగండీ తెలిసేది? తనకి జరిగిన విషయాన్ని ఇంకోళ్ళని confirmation అడిగితే ఇదే అర్థం. ఒక ఆవేశ పూరిత భక్తుడు భక్తరాజ్ మహరాజ్ గారితో హిమాలయాలకు వెళ్ళాడు. మైత్రేయుడి గురించి నా బోటివాడి వద్ద విన్నాడు. అక్కడున్న జనాలందర్నీ అదరగొట్టడం మొదలుపెట్టాడు మూడు రోజులు. 'ఆకాశం అంతా మైత్రేయుడు నిండి వున్నాడు' అని. అంటే అంత మూర్తి కనబడ్డదిట. చుట్టూ వుండేవాళ్ళకి ఈయన భక్తుడేమోనని doubt వచ్చింది. అందరూ అతన్ని జాగ్రత్తగా చూసుకున్నారు. ప్రయాణం అంతా అయ్యి తిరిగి వచ్చాక వాడికి కనిపించింది నిజమేనా అని, నన్నడగడానికి వచ్చారు. వాడికి కనిపించిందో లేదో నేను చెప్పాలిట. ఎందుకంటే వాడికి కనిపించిందంటే, వీళ్ళకి బాధ. లేదు. వాడి బొంకంటే సంతోషం. అందుకనే మాస్టారు చెప్పేవారు వాడికి కనిపించిందో లేదో వాడికి తప్ప మనకెందుకు బాధ అని, అలా వుండగా కనిపించిందంటూ నానా గోల చేసినవాడు వచ్చాడు. ఓ రోజు సాయంత్రం పైన కూర్చుంటే, ఇలా మూడు రోజులూ మైత్రేయుడు బదరీనాథ్ దగ్గర కనిపించాడు, మీరేమంటారు? అన్నాడు. నేనేమంటాను? నీకు కనిపించింది కదా! అన్నాను. అలాక్కాదూ, నాకు కనిపించిందీ లేందీ సత్యమా కాదా మీరు చెప్పండన్నాడు. కనిపించలేదని దాని తాత్పర్యం. నేను ప్రొద్దున్న 10 ఇడ్లీలు తిన్నానా లేదా అనేది మీరు చెప్పండి అంటే, నీకు ముందు తెలియాలా? నాకు తెలియాలా? అంత స్పష్టంగా తెలుస్తుంది నువ్వు పొందిన అనుభూతి. ఇతరులతో ఆనందాన్ని పంచుకో. కానీ ఈ ప్రశ్నలేమిటీ? ఇంకొకర్ని అడిగామూ అంటే భ్రమ పడ్డామనే. ఇదే చెప్పాను. మధ్యాహ్నం భోంచేశావా? అని అడిగాను. చేశాను, అన్నాడు. ఎలా తెల్సు? అంటే చేశాను కదా! అన్నాడు. అదీ అంతే అన్నాను. ముందు అర్థం కాలేదు. 5 నిముషాలు తర్వాత అర్థం అయ్యింది. ఇంతేనా అయితే కలగలేదన్నమాట, అన్నాడు. కలగకుండా కలిగాయనే భ్రమలో పడి జీవించేవారుంటారు. ఈయనెప్పుడూ అందులోనే ఉంటూ, ఇటు దిగివస్తూంటాడు. అదీ 'కేశవ'. 'కేశవాయ నమః' అన్నప్పుడు మన సమస్త నాడులలోంచి వెలుగు ప్రసారం ఊర్ధ్వముఖం చెందుతుంది. ఆ నామంలో అంత power వుంది. ఏదో మామూలుగా చేయకండి 'కేశవాయ స్వాహా' అంటూ. అసలు

మనకిచ్చిన ఒక్కో నామం ఒక జన్మకి చాలు, ఇంకేమీ అక్కరలేదు. ఎన్నిసార్లు 'కేశవాయ స్వాహా' అన్నాం? 'ఓం కేశవాయ స్వాహా' అనగానే మొత్తం అంతా ఊర్ధ్వగతిని తిరగాలండీ. ఇట్నుంచటన్నమాట. మనకి తెలీక రొడ్డుకొట్టుడుగా కొడుతూంటాం. అసలు ఈ నామమేమిటీ, ఎందుకిచ్చారూ అనుకుంటూ ఇక్కడాగిపోతే పోలేదూ అలా పోడం కన్నా. 'ఓం' అనగానే ౭౨ నాడుల్లోనూ అధోముఖంగా ప్రసరిస్తున్న ప్రజ్ఞ ఒక్కసారి హృదయంలోకి సమీకరణం చెందాలి. ఇంకో ఓంకారంతో అక్కడ నుండి పైకి వెళ్ళాలి. మూడవ ఓంకారంతో అక్కడ కలవాలి. బాగా తెలిసినవారు ఇట్లా చేస్తారు. అదీ కాకపోతే కేశవాయ స్వాహా అన్నా అదే. 'కేశవా' అని పిలిస్తే చుట్టుప్రక్కల గుర్తుండదు, పైకి వెళ్ళిపోవలసినదే.

## 676 కేశిహా

కేశిహా అంటే కేశిని చంపినటువంటివాడు. వీరంతా power mongers. ప్రపంచం అంతా వాళ్ళే.

## 677 హరిః

చాలా అద్భుతమైన నామం. 'హరీ' అంటే పాపాలన్నీ నశిస్తాయిటండీ. హరించేస్తాడుట. హర, హరి. హరి కొంత స్త్రీత్వంతో కూడినది, మనోహరమైనది. హర అనేది మరీ తేజస్సు. మోహనంగా చెప్పకోవాలంటే 'హరి' అని చెప్పకోవాలి. తేజోవంతంగా చెప్పకోవాలంటే 'హర' అని చెప్పకోవాలి. హర, హరి అనగానే మనస్సు, ఇంద్రియాలు, శరీరంలో వుండే రుగ్మతలను హరింపచేసే మంత్రం. Hara is the male form and Hari is the female form of the same mantra. విష్ణువు శివుడికి స్త్రీ తత్త్వం, శివుడు విష్ణువుకి పురుష తత్త్వం. దిగివస్తే హరి, దిగకపోతే హర. దిగివస్తే జగన్మోహనంగా వుంటుంది. ఏదైతే మొత్తం అంతా వ్యాపించి వుందో అది దిగివస్తే జగన్మోహనంగా వుంటుంది. అందుకని 'హరి నామ స్మరణం కల్మష హరణం' అని చెప్పారు కదా! అలాగే 'హరే రామ హరే కృష్ణ' అని చెప్పడంలో ఉద్దేశ్యం ఏమంటే హరియే రాముడిగా, హరియే కృష్ణుడిగా చెప్పకోవడం. మనం రాముడు, కృష్ణుడు అనుకుంటాం గానీ ఆ హరియే రాముడిగా, కృష్ణుడిగా వచ్చాడని చెప్పకోం.

గురుర్బ్రహ్మా గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః
గురుస్సాక్షాత్ పరం బ్రహ్మా తస్మై శ్రీ గురవే నమః'

అంటే ఒకే ఒక గురువు బ్రహ్మగా, విష్ణువుగా, శివుడిగా, పరతత్త్వం గా వచ్చాడని అర్థం. పరతత్త్వమే గురువుగా వచ్చాడు. పరతత్త్వమే బ్రహ్మగా గురు రూపం లో వచ్చి జ్ఞానం ఇచ్చాడు. పరతత్త్వమే విష్ణువుగా గురు రూపం లో మన వద్దకు వచ్చి స్థితిని ఇచ్చాడు. పరతత్త్వమే శివుడిగా వచ్చి మనకు సృష్టి రహస్యాలను ఇచ్చాడు. ఇట్లా భావన చేసుకోవాలి. నీ గురు రూపంలో నీకు పరతత్త్వమే వచ్చింది. ఏదో చేసుకున్న పూర్వపుణ్య విశేషం వల్ల గురు సాన్నిధ్యం లభిస్తుంది. ఆ గురువు రూపం పట్టుకోవడం కన్నా ఆ రూపంలో పరతత్త్వం నీ వద్దకు వచ్చింది. ఎందుకంటే నువ్వు పడుతున్న ఆర్ద్రత కారణంగా. చాలా అద్భుతమైన విషయం. మొట్ట మొదటిసారి మాస్టారు జర్మనీలో రైలులో వెళ్తుంటే, 'అసలు అర్థం ఇంత వుంది. ఇలా చూసుకో' అని చెప్పారు. పరతత్త్వమే అన్నిటికీ గురువు. అందుకే శివుడే గురువంటారు. అంతర్యామి, అంతటా వ్యాపించినటు వంటివాడూ, అందరి కన్నా పెద్దవాడు. ఆయనయే త్రిమూర్త్యాత్మకంగా వస్తూంటాడు. అంటే త్రిమూర్తులూ, ఆ పైన వుండే పరతత్వం నాలుగూ కలిపి నీ గురు రూపంలో నీ వద్దకు వచ్చింది. మరెక్కడా వెతుక్కోనక్కరలేదు. Four in one అది. ఆ నాలుగింటినీ నువ్విక్కడే పొందవచ్చు. వాటికోసం అక్కడికీ ఇక్కడికీ వెళ్ళనక్కరలేదు. పండరీపురం వెళ్ళిరానా అని అడిగాడట ఓ భక్తుడు షిరిడీ సాయిబాబాని. పండరీపురంలో ఏముందో చూడగలిగితే, ఇక్కడా అదే వున్నది అని చూపించాడు బాబా. ఇంకో ఆయన గంగాస్నానం చేద్దామని చాల్రోజులుగా అనుకుంటున్నాను వెళ్తాను అన్నాట్ట. 'గంగాస్నానం చేస్తావా' అన్నాడు అంతే. ఆయన ఎడమ పాదం నుండి గంగ పుట్టుకు వచ్చింది. చేసుకో, అన్నాడు. ఒకాయన బీడీ కాల్చుకోడానికి అగ్ని కోసం

వెళ్తానన్నాడు. అక్కర్లేదురా అని ఇలా అంటే నిప్పు పుట్టిందండీ. అంటే గురువు నుండి సమస్తమూ వ్యక్తమవుతాయి. కేవలము సద్భక్తుణ్ణి అనుగ్రహించడానికి ముగ్గురూ, ఆ పైన పరబ్రహ్మ కలిపి నాలుగూ సద్గురువు రూపంలో వస్తూంటుంది. మనం ఆదరించి, అనుగ్రహింపబడి, ఆ మార్గంలో నడవగలిగితే ధన్యత. కనుక అటువంటి తత్త్వం 'హరి' గా దిగివస్తుంది. అందుకే హరినామం విపరీతంగా పవిత్రీకరణ చేస్తూంటుంది. 'ర' అనేది బీజాక్షరంగా సమస్తాన్నీ దహించే అగ్ని బీజం. 'హ' అనే శబ్దము పరతత్త్వము వ్యక్తం అయితే కనిపించే వెలుగు. పరతత్త్వం వ్యక్తం అయితే 'హ' గా వస్తుంది. కనుకనే 'హిరణ్యవర్ణాం' అని శ్రీసూక్తం మొదలవుతుంది. 'హ' అంటే అవ్యక్తం నుండి వ్యక్తం అయిన వెలుగు. దాన్నే 'అదితి' అంటారు. దాన్నే వెలుగని, సృష్టిలో దేవుడని అంటారు. అది ఈ 'ర' అనే శబ్దంతో, నీలో వుండే సమస్త పాపాలనీ క్షాళనం చేస్తుంది. అందుకే హరినామ సంకీర్తనం చాలా ఎక్కువగా ఇచ్చారు. ఇవన్నీ పేర్లు కావు. దేవుడికి 'హరి' అని పేరేమిటి? అని అంటాం అంటే తెలియక. ఇవన్నీ బీజాక్షరాలు, వాటిలో వుండే శక్తిని ఇలా నామాలుగా ఇచ్చారు. రుచులు రుచులుగా ఋషులు అందించారు. అందుకని కలిసంతారణ మంత్రంగా ఈ 'హరేరామ హరేకృష్ణ' మంత్రం కలియుగంలో ఇచ్చారు. ఈ నామం ఎక్కడ జరిగితే అక్కడ కల్మషాలు నశిస్తాయని. ముందు మనలో నశించాలి. మనలో మూడు లోకాలలో మనస్సు, ఇంద్రియములు, శరీరము వీటిలో వుండే కల్మషాలని ముందు హరింపచేయాలని కోరుకోవాలి.

'హరియించును పాతకములు అంబుజ నాభా' అన్నారుగా, కృష్ణ శతకంలో. మరీ ఇంత సులభంగా చెప్తే పండితులకి అందవు. బాగా గుద్దుకుంటే తప్ప వారికి భగవంతుడు అందినట్లు కనిపించదు. నిజానికి చాలా చిన్న విషయాలలోనే చాలా ఎక్కువ అద్భుతంగా, పండు వలిచి చేతిలో పెట్టినట్లుగా అందుతాయి. అందుకని ఈ 'హరిః' అనే నామం. చివరకు నీవే హరివి అని చెప్పడం లో సాక్షాత్తు సమస్త పాపాలను హరించేయడానికి దిగివచ్చిన వాడవు అని భీష్ముడు కృష్ణుణ్ణి చెప్తున్నాడు. ద్వాపర యుగంలో చాలా ధర్మగ్లాని, కృత యుగంలో ఎవరో ఒకరే చేశాడు. అందుకే సమస్తాన్నీ శుభ్రంగా కడిగి ముగ్గులు పెట్టేసి, ముందుకు కూడా పనికివచ్చే పనిచేశాడు, గురు పరంపర ఒకటి ఏర్పరిచి. అప్పటి వరకూ వున్నవారి నుద్ధరించాడు. వాఙ్మయాన్ని ఉద్ధరించాడు. ఎన్ని చేశాడు శ్రీకృష్ణుడు? మనకి తెల్సింది చాలా తక్కువ. ఒకటి అప్పటి కుండే అధర్మాన్ని నిర్మూలించి, ధర్మాన్ని స్థాపించాడు, అర్జునుడు ఇత్యాదుల ద్వారా. సమస్తమైన వేదవాఙ్మయాన్ని, వేదవ్యాసుని ద్వారా మళ్ళీ సంస్కరించాడు. అంతేకాకుండా ఆయనకి స్ఫూర్తి నిప్పించి ఆయన చేత భాగవత పురాణాన్నిప్పించాడు. అంతేకాదు అంతవరకు ఈ సంస్కృతిలో వుండే జ్ఞానాన్ని సంస్కరించి 18 సోపానాలుగా భగవద్గీత నిచ్చాడు. అంతవరకూ వున్న సజ్జనులకు ముక్తి పథాన్ని చూపించాడు. ఇదంతా కాకుండా ముందు కలియుగంలో మనుషులు ఇబ్బంది పడకుండా గురుపరంపరను ఏర్పరిచాడు. ఇన్ని పనులు చేసి వెళ్ళాడు. అందుకే శ్రీకృష్ణుణ్ణి చూసి భీష్ముడు నీవే హరివి అని చెప్తున్నాడు. 'ఎక్కడో లేడు హరి, ఇక్కడే వున్నాడు. అన్ని లోకాలలో వున్నవాడివి ఈ రూపంలో ఇక్కడ తిరుగుతున్నావు' అని చెప్పడానికి ఈ నామం.

అసలు నిజానికి భీష్ముడు వెళ్ళిపోవడానికి శ్రీకృష్ణుణ్ణే అనుమతి కోరతాడు. ఎందుకంటే అంతర్యామి యైన శ్రీకృష్ణుని లోనికి తాను మళ్ళీ ప్రవేశించడం కోసం, కనబడే కృష్ణుణ్ణి అనుమతి అడుగుతాడు. అది కారణం చేత కృష్ణుడు హస్తినాపురం నుండి బయల్దేరి వచ్చి ఆయన అంపశయ్య ప్రక్కన వుండి, బాగా తెలుసునని అనుకున్న వారందరికీ, మీకేమీ తెలియదని చెప్పించడానికి భీష్ముడి చేత అంతా చెప్పిస్తాడు. అసలు ప్రతి వాడికీ తనకేదో బాగా తెలుసనే బాధ వుంటుంది. అసలు తెలిసినవాడు తెలియనివాడుగా వుంటాడు. కొంచెం తెలిసినవాడు ఎక్కువ తెలిసినవాడుగా వుంటాడు. ఎక్కువ తెలిసే కొద్దీ మనకేమీ తెలియదని తెలుస్తుంది. భీష్ముడి కింత తెలుసని ఎవడికీ తెలియదు. అందుకనే భీష్ముడిచేత ధర్మరాజుకి అంత చెప్పించాడు. శాంతి, అనుశాసినిక పర్వాలు చదువుకుంటే, భీష్ముడి కుండే జ్ఞానం ఎంతో తెలుస్తుంది. ధర్మరాజుకి 'నీకేమీ తెలియదు కదా' అని చెప్పడానికి భీష్ముడిచేత చెప్పిస్తాడు. అంతేకాదు ఈయన గురించి కూడా ఎవరికీ సరిగ్గా తెలీదు కదా! ధర్మరాజు అడిగాడు అసలు 'ఇంత దైవమూ, ధర్మమూ వుంది కదా! ఏదో ఒక చిన్న సుళువు చెప్పకూడదా! సమస్తానికీ (ఒకటే మాత్ర వైకుంఠ యాత్ర లాంటిది) పరిష్కారం, సమస్త సమస్యలకీ పరిష్కారం ఏదో ఒకటి చెప్ప, చాలా వుంది వాఙ్మయం' అంటే ఈయన చెప్పాడు. అదీ విష్ణు సహస్రనామం! చెప్పి, ఇదంతా చెప్పేనే, వాడు ఎదురుగుండా వున్నాడు అని చెప్పాడు, కృష్ణుణ్ణి చూపిస్తూ. ఎంత అద్భుతమైన విషయం. కనుక ఇక్కడ 'హరి' అని చెప్పడంలో ఇంతకన్నా ఏం చెప్పగలను అని అక్కడకు ఓ round. ఆపేశాడన్నమాట! మళ్ళీ మొదలుపెడతాడు.

## 678, 679, 680, 681, 682 కామదేవః, కామపాలః, కామీ, కాంతః, కృతాగమః

కామదేవుడు అంటే మన్మథుడికి కూడా దైవం. 'కామపాలుడు' మన్మథుడ్ని పరిపాలించేవాడు. 'కామీ' కోరుకునే వాడు. 'కాంత' కోరబడేటటువంటిది. మన్మథుడు విష్ణుమూర్తి కుమారుడుగా పురాణాలు చెప్తాయి. అంటే విశ్వ చైతన్యము నుండి స్థూలమైన సృష్టి ఏర్పడినప్పుడు కోరిక ఏర్పడుతుంది. ఈ మన్మథుని కారణంగా, మన్మథతత్త్వం, అదీ భగవతత్త్వం వుండడం వల్లనే మంచిగానీ, చెడుగానీ కోరుకోవడం వుంటుంది. మన్మథుడు లేకపోతే మంచికూడా కోరలేం. 'కోరిక' అంటే దుష్టమూ, పాపమూ అని అనుకోకూడదు. అందుకే ఏది కోరాలో తెలిసి కోరుకోవాలి. కోరికలుండరాదు అని వుండకూడదు. కోరతగనిది కోరకూడదు, కోరతగినది కోరాలి. కోరదగినది కోరిన వాడు సృష్టి వైభవాన్ని అనుభూతి చెందుతాడు. కోరదగనిది కోరిన వాడు సృష్టిలో బంధింపబడతాడు. అన్ని కథలూ ఇలాగే వుంటాయి. రాముడు కథ, ధర్మరాజు కథ, నలుడి కథ , హరిశ్చంద్రుడి కథ , సమస్త భక్తుల కథలూ చూస్తే సరైన కోరికలు కోరుకోనప్పుడు కష్టాలు రావడం, సవ్యమైన కోరిక అయినప్పుడు భగవదనుభూతిలో వుండడం ఉంటుంది. జీవులకు అందింపబడిన దివ్యమైన ఉపకరణం కోరిక. జీవులకు మనస్సు, ఇంద్రియములు, శరీరము, బుద్ధి ఎలా అందింపబడ్డాయో అలాగే కోరిక కూడా అందించాడు. కోరిక లేకపోతే భగవంతుణ్ణి కూడా కోరలేం. భగవత్ సాన్నిధ్యం కోరాలనుకుంటే కోరిక ఉండాలి కదా! దేన్ని కోరుకోవడం వలన మనిషి కర్మబంధం నుండి విడివడి జీవిస్తాడో, దేన్ని కోరుకోవడం వల్ల బంధింపబడతాడో అనే జ్ఞానం ముఖ్యమైన జ్ఞానం. దానికే మహాత్ములు 'విచక్షణ ఉండాలి' అని చెప్తారు. ఏ విషయంలోనైనా సరే ఇది మనకు తగునా, తగదా అనేది ముఖ్యమైన అంశము. తగునా, తగదా అనేది మనకు తెగదు. లోపల కొన్నిటి మీద వాసనల కారణంగా ఇష్టం ఉంటుంది. అది తగదని లోపల నుండి బుద్ధి చెప్తున్నా సరే, మనం అటుపక్కకి బలీయంగా లాగబడుతుంటాం. లాగబడి అదే పని చేస్తూంటాం. 5 ఇంద్రియాల ద్వారా కూడా ఇది తినడం మంచిది కాదు అని తెలిసినా, బాగా రుచిగా ఉండడంతో తింటాం. అలాగే చూడకూడనివి, తినకూడనివి, మాట్లాడకూడనివి, ముట్టుకోకూడనివి చేస్తాం. అలాగే 5 ఇంద్రియాల ద్వారా filter ఎవరికుంటే వారికి బంధం వుండదు. ఈ filter లేనివారికి బంధం. అసలు భగవంతుని ఉద్దేశించిన కర్మ అంటే బంధింపనిది. అదీ 'దివ్యకర్మ.' మనది వ్యక్తిగత కర్మ, బంధించేది. కర్మ బంధించాలనే ఉద్దేశ్యంతో మనకివ్వలేదు భగవంతుడు. కామాన్నిచ్చాడు. మనస్సు, ఇంద్రియాలు, శరీరం ఇచ్చాడు. వీటి ద్వారా దివ్యానుభూతి ఎలా పొందవచ్చో తెలిపాడు. అలా హాయిగా నేను సృష్టించిన దానిలో జీవించమని కోరాడు. అది ఎక్కడ అతిక్రమించడం జరిగితే, అక్కడల్లా సృష్టిలో మనల్ని అది పట్టుకునే పద్ధతి పెట్టాడు. ఎప్పుడు అతిక్రమిస్తే అప్పుడు అదల్లా పట్టుకుంటుంది. ఒక్కోసారి

పట్టుకున్నట్టు తెలియదు. చాలా దూరం వెళ్ళాక తెలుస్తుంది. ఇహ ఇందులోనుండీ బయటకు రాలేం అని. కొన్ని కొన్ని సరదాగా మొదలు పెట్టినవి తర్వాత బయటకు రాలేనంత భయంకరంగా తయారౌతాయి కదా! మద్యపానం, ధూమపానం ఇలా సమస్తమైన వాసనలూ మనకి మొదలు పెట్టినప్పుడు అంత బలీయంగా ఉండవు. మొదట మనయందు అవి సహజమైన వాసనలుగా ఉండవు. కానీ క్రమశః మనం వాటిని పోషించడం చేత కొన్ని మనయందు స్థిరపడతాయి. స్థిరపడడం చేత కామం తీవ్రం అవుతుంది. తీవ్రతరమైన కామాన్నుండి బయట పడాలంటే కామానికి అధిదేవత అయిన భగవంతుడ్ని ప్రార్థించాలి. భాగవత మార్గంలో కామానికి ఒక దివ్యమైన ప్రయోజనం చెప్తారు. తీవ్రమైన కామము భగవంతుని యందు కలిగితే అది ముక్తికి దారి తీస్తుంది. ఎందుకంటే కామానికే పుట్టుక స్థానం ఆయన అయి ఉండడం చేత! ఈ కామం భగవంతుని మీదకి మరలించడం అనే అభ్యాసం కొత్తగా చేయడమే, భక్తి మార్గంలోకి మనుషులు రావడం. కొత్త మార్గంలోకి వస్తున్నాం. కొత్త అలవాటు బాగా రుచి కలిగి దానికి మనం ఎక్కువ సమయం ఇవ్వగలిగినప్పుడు కొన్ని పాత అలవాట్లు పడిపోతాయి. పాత అలవాట్లు పోవాలనుకుంటే పోవు. కొత్త అలవాట్లు నేర్చుకుంటే పాత అలవాట్లు కొన్ని పోతాయి. అట్లా సిగరెట్లు, తాగుడు, వ్యభిచారం మానేసినవారూ, అలా ఏది తనని నశింపచేస్తుందో ఆ అలవాట్లను మానేసినవారంతా ఈ విధమైన దైవము, కామదేవుడైన భగవత్ తత్త్వాన్ని ఆరాధన చేయడం వల్ల ఈ అలవాట్లను దూరం చేసుకోవచ్చు. పాండురంగ మహాత్మ్యం మనకి తెలుసు. ఎంతో స్త్రీ కాముకుడైన పుండరీకుడు, భగవంతుని యందు రుచి కలిగిన తర్వాత సమస్తమూ కలగా జారిపోయాయి. కామంతో కూడిన వాసనలు ఎన్ని ఉండేవి? దొంగతనం, వ్యభిచారం, తల్లి దండ్రులను అవమాన పరచడము, వెళ్ళగొట్టడం, ఋషులను అవమాన పరచడం ఒకటా ఎన్ని అవగుణాలుండేవీ? ఇన్ని చేసినవాడూ దీనియందు రుచి మరిగి ఆ మొత్తం నుండి ఒక్కసారి బయట పడిపోయాడు. కామానికి బలైపోతున్న మనబోటివాళ్ళం అంతా, ఈ కామం నుండి రక్షించూ, దివ్యమైన విషయములే కామించేటట్లుగా చూడు అనే ప్రార్థన చేసుకోవాలంటే, కామదేవుడిగా భగవంతుని ప్రార్థన చేయాలి. కామానికి దేవుడూ, కామాన్ని పరిపాలించేవాడూ 'కామపాలుడు'. మనలో కోరికగా వున్నది కూడా అతడే. 'కామీ' అతని యందు కామించే ఒక తత్త్వం ఉన్నది కాబట్టి అదే జీవులలో కూడా కామించే తత్త్వంగా ఉంటుంది. ముందు సంకల్పించే తత్త్వం వుంది కాబట్టీ మనకి కూడా సంకల్పములు వస్తూంటాయి. భగవంతుని సంకల్పంగానే భగవంతుని సృష్టి వచ్చింది. మన సంకల్పంగా మన సృష్టి వస్తూంటుంది. మనయందున్నవి అన్నీకూడా ఆయన యందున్నవే! ఆయనయందు లేనివి మనయందుండే అవకాశంలేదు. కాకపోతే మనం ఒక స్థితిలో వికృతి చెందుతాం. ఈ వికృతి చెందినపుడూ, అది మనకిచ్చే అనుభవం ద్వారా మళ్ళీ ప్రకృతిలోకి ఉద్ధరిపబడతాము. కోరకూడనిది కోరాం అనుకోండి. దాన్లోంచి మనకి కష్టం వస్తుంది కదా! వచ్చిన కష్టంలో నుండి మళ్ళీ ఇటువంటిది కోరకూడదు అన్న భావన వస్తుంది. అదే అమ్మవారు మాయలేడి కోరిన సందర్భంగా గోచరిస్తుంది. ఎవరు కోరకూడనిది కోరినా దాన్లోంచి మనకు వచ్చే కష్టములు, నష్టములు కారణం చేత

మళ్ళీ మనం ప్రకృతి సహజమైన కోరిక లోకి నియమింపబడతాం. కాకపోతే ఆ సమయం ఉందే, సహజత్వంలో నుండి అసహజత్వంలోకి పడిపోయినప్పుడు జీవుడు ఘర్షణలో జీవిస్తాడు. బాధలో జీవిస్తాడు. సుఖశాంతులుండవు. మనది ఆ వికృతమైన జీవితం. ఆ వికృతమైన జీవితంలో నుండి మళ్ళీ ప్రకృతి సిద్ధమైన జీవితంలోకి ప్రవేశించడానికి చేసే ప్రయత్నంలో భాగంగానే ఈ సాధన సంపత్తి మనకిచ్చారు. అన్నీ అణచిపెట్టుకోవడం కాదు మనం నేర్చుకోవలసినది. మనకి కొన్ని కొన్ని కోరికలను అణచిపెట్టే పద్ధతి కొన్ని విషయాలలో ఇచ్చారు. కానీ అణచిపెడితే చెప్పుకింద తేలులాగ ఉంటుంది. కాలు తీయగానే కుడుతుంది. మహాత్ములేం చెప్తారంటే దేన్నీ అణచవద్దూ, అలా అని విజృంభించి దాని మార్గంలో నువ్వు ప్రయాణము చేయక్కర్లేదు. ఈ భగవతత్త్వం మీద రుచి ఏర్పడడం చేత క్రమశః వానియందు మనకు శ్రద్ధ తగ్గి, తద్వారా మనం ఊర్ధ్వగతి చెందుతాం. లేక సహజమైన మార్గంలో జీవించే అవకాశం ఏర్పడుతుంది అని తెలుపుతారు. అందుకని కోరికలు మనలోంచి కలుగుతున్నప్పుడు, ఆ కోరికల రూపంలో భగవంతుడే ఉన్నాడని భావన చేయడమే 'కామీ'! 'కాంత' అంటే స్త్రీ అనే కాదు అర్థం, ఎక్కువ పురుషుడి చేత కోరబడేది అందుకూ ఆమెను కాంత అన్నారు. అసలు 'కాంత' అంటే దేనిని మనం కోరుతున్నామో అది 'కాంత'! ఒక పువ్వుని వాసన చూద్దామని నేను కోరుకుంటే అది కాంత అవుతుంది. నేను కామీ అవుతాను. కాబట్టి కోరబడే దాన్ని కోరేవాడు కోరుతున్నప్పుడు దాన్లోంచి వచ్చే ఫలితములు ఏమిటో చూసుకోమన్నారు. ఏది కోరడం వలన శాశ్వతమైన ఆనందం వస్తుందీ, ఏది కోరడం వలన దుఃఖం కలుగుతుంది అని. అప్పటికి తాత్కాలికంగా ఆనందం ఇచ్చి, తర్వాత దుఃఖం కలిగించేవి చాలా ఉంటాయి. తాత్కాలికంగా అంత పెద్ద ఆనందం కలిగించకపోయినా, క్రమశః శాశ్వతమైన ఆనందం ఇచ్చే కోరికలు కొన్ని ఉంటాయి. తాత్కాలికంగా ఆనందం ఇచ్చేవి కోరి నిర్వర్తించినట్లయితే, కోరికలు నిర్వర్తింపబడిన దగ్గర నుండీ ఓ రకమైన భయం ఉంటుంది లోపల. 'అమ్మో! ఇలా చేశాం, ఇది ఎవరికైనా తెలిస్తే' అనిపిస్తుంది. ఓ 10 వేల రూపాయల కట్ట ఎవరో మరచిపోయారు. తీసుకున్నాం. తీసుకున్నప్పుడు ఫర్వాలేదు అనిపిస్తుంది. అయితే దాన్తో ఏదో నగ చేయించాం. అది పెట్టుకున్నప్పుడల్లా ఏం గుర్తొస్తుందీ? దొంగ డబ్బుతో కొనుక్కున్నాం అని ప్రతి క్షణం గుర్తుకురాదూ? అదెవరిదో మనకి తెలిసిందంటే, వాడు కనబడ్డప్పుడల్లా మరీ మరీ గుర్తొస్తుంది. సత్యం చావదనడానికి ఇదే నిదర్శనం. ప్రపంచంలో ఎవరికీ తెలియదనుకున్నది నీకు తెలుసుకదా నువ్వు చేసిందీ. దాన్ని చూడగానే మనకి మనం చేసిన తప్పుడు పని గుర్తొస్తుంది. ఆ విధంగా లోపల నుండే సత్యం బాధపెడుతుంటుంది. వాడు కష్టంలో ఉన్నాడనుకోండి మరీ బాధ పెడుతూంటుంది. వాణ్ణి చూసినప్పుడల్లా చీమ కుట్టినట్లుంటుంది. ఆ తర్వాత నీ ఇంట్లో దొంగలు పడితే, ఆ పని చేశాం కాబట్టి ఈ రోజు దొంగలు పడ్డారనిపిస్తుంది. ఇలా తాత్కాలిక సుఖం ఇచ్చిందీ, దీర్ఘకాలం రకరకాలుగా బాధ పెడుతుంటుంది. అందుకని పరమ గురువులు 'నిజమైన సాధకులకి ఒకరికి తెలియ కూడని పని చేయడం అంటూ ఏమి ఉండదు' అని చెప్తారు. ఇది ఒకరికి తెలియడం వలన తనకు అవమానం, అపకీర్తి, అప్రతిష్ట

వస్తుందనే పనులేవీ సత్సాధకుడు చేయడు, చేయకూడదు. అలాంటి స్థిరత్వం నీ యందున్నదో లేదో చూసుకోమంటారు. ఉండదు. ఈ జాతికి రెండు రకాల శాపాలున్నాయి. మరి మనం జీవులుగా చాలా సనాతనులం కదా! కృతయుగంలో జీవులకి ఏ బాధా లేదు. త్రేతాయుగంలో జీవుడు నేర్చుకున్న వికృతచేష్ట ఏమిటయ్యా అంటే స్త్రీ, పురుషులకు ఒకరి మీద ఒకరికి వికృతపరమైన ఆకర్షణ. ధర్మపరమైన ఆకర్షణ కాదు. ఇవాల్టికి కూడా అది తేలలేదు. ఎందుకంటే ఆ యుగంలో అది అంత బాగా అలవాటు చేసుకున్నాం. అసలు కామం ఎందుకు పెట్టాడూ స్త్రీ పురుషులకీ అంటే, కేవలం సంతతి పొందడానికి, తద్వారా సృష్టి కార్యం నిర్వర్తించడం 'ప్రజాననం' అంటారు దాన్ని. అంటే సృష్టిలో జీవుల యొక్క సృష్టి జరగడం అనే అమరిక మనయందుంచీ భగవంతుడే జీవులకు శరీరాలు కల్పించి, సృష్టి చేస్తూంటాడు. కల్పిస్తుంటే సంతతి పొందడమే దీని యొక్క ఉద్దేశ్యము. మిగతా సమయాల్లో ఈ శక్తినంతా భగవద్విషయాలయందు లగ్నం చేసి దివ్యానుభూతి పొందడానికిచ్చారు. అది ideal, ఉత్తమాశయం! ఋషులట్లా జీవిస్తారు. తమ భార్యలకి సంతానం కలిగాక, భార్యాభర్తల మధ్య కేవలం స్నేహితుల సంబంధమే ఉంటుంది. భార్యాభర్తల సంబంధం ఉండదుట! పిల్లలు పెద్దవాళ్ళయినా ఇంకా భార్యాభర్తల సంబంధం ఉండడం కలియుగ ధర్మం అంటారు మాష్టారు. త్రేతాయుగం నుండీ మొత్తం మనుష్యజాతిలో ఒక వికృతమైన తత్త్వము 'అసహజమైన కామం' వచ్చింది. కామం అటే కోరిక. అందులో ముఖ్యమైన కోరిక స్త్రీ పురుషుల మధ్య ఉండే ఆకర్షణ. అందుకే త్రేతాయుగానికి తలమానికమైన కథ రామకథ. అసలు ఏకపత్నీవ్రతం అంటే ఏమిటో మర్చిపోయిన జాతికీ, తాను అత్యంత ఆకర్షణ కలిగి ఓజస్సూ, తేజస్సు కలిగి, సమస్తమైన కళ్యాణ గుణములు కలిగిన రాముడు ఎంతో మంది స్త్రీలు ఆయన్ని మోహించినా తాను జాతికి ఒక ప్రమాణం చూపించాలనే ఉద్దేశ్యం తో మొదట్లోనే ఏకపత్నీవ్రతుడిగా జీవిస్తాననిఒక నిర్ణయం తీసుకుంటాడు. తన తండ్రికి ముగ్గురు భార్యలు. ఆ రోజుల్లో రాజులకి ఎంత మంది భార్యలైనా ఉండవచ్చు. అలాగే బ్రాహ్మణులకీ చాలా మంది భార్యలున్నారు. ఎవరి ఓపిక కొద్దీ వారికుండేవారు. అటువంటి సమయంలో రాముడు ఈ నిర్ణయం తీసుకున్నాడు. జ్వాలాకూలుడు 2 వివరణలిచ్చాడు. ఈ జాతికి 2 పీడలు ఉన్నాయి. ఆ పీడలు వదిలించుకుంటేగానీ ఎవరూ ఉత్తమ మానవుడు కాలేడని. అందులో మొదటిది త్రేతాయుగం నుండి వస్తున్న పురుషుడికి స్త్రీ కాంక్ష. అదే రావణాసురుని పతనానికి కారణం అయ్యింది. రామాయణం అంతా రావణుని దుశ్చేష్ట మూలమైన కథగా ఉంటుంది. జీవులు అసహజమైన కామతృష్ణకి బలైపోయారు అని చెప్తుంది త్రేతాయుగం కథ. అందుకని రామావతార ముఖ్యోద్దేశ్యము ఏమంటే నియమము కలిగి ఉండు. అందుకనీ ఏకపత్నీ వ్రతము! కుశలవులు పుట్టాక, సీతాదేవి వారిని రామునకు అందించేసి వెళ్ళిపోతుంది. ఋషులు అలా జీవిస్తారు. సంతానం కలిగాక భార్యాభర్తల వలెకాక ఆత్మీయత కలిగిన స్నేహితులవలె జీవించడం ఒక ఉత్తమ ప్రమాణంగా చెప్తారు. అది త్రేతాయుగం కథ! మనకున్న తెలివిచేత, బలంచేత అవతల వాడిది వీలున్నంతగా దొంగిలించడం ద్వాపరయుగం కథ! ధుర్యోధనాదులూ, ధర్మపరంగా ధర్మరాజుదే అయినా రాజ్యం ముందు సగంచేసి, ఆ

సగం కూడా ఉండకుండా మాయాజూదం ద్వారా అది కూడా మింగేశారు. పోనీ 5 ఊళ్ళయినా ఇవ్వండి అంటే ఒక్క ఊరు కూడా ఇవ్వం పొమ్మన్నారు. ఇందులో 'తనది కానిది ఆశించడము' అనేది జాతి పతనానికి దారి తీసింది. మానవుడు ఇది బాగా నేర్చుకున్నాడు. తనది అయినా కాకపోయినా దాన్ని పొందాలి, అనుభవించాలి, వీలుంటే తన దగ్గరే ఉంచుకోవాలి. ఈ రెండూ జాతిని పీడిస్తున్నాయి. సత్సాధకుడు ఎప్పటికప్పుడు ఈ రెంటినీ వివరంగా తనలో చూసుకుని, వీటిలో ఏ విషయాలలో తాను బందీ అయ్యి ఉన్నాడో వాటి నుండి తన్ను తాను సంస్కరించుకోవాలి అని చెప్తాడు. సంస్కరించుకోవాలని తెలుసు, కానీ ఆ వాసనలూ మనకి తెలిసిన విషయం కన్నా బలంగా ఉంటాయి. చేయకూడనివి ఎన్ని మనం చేయడం లేదూ! చెయ్యవలసినవి ఎన్ని మనం మానేస్తున్నాం? మనకి తెలిసిన దానికీ, మనం ఆచరించేదానికీ బంగాళాఖాతం అంత అగాథం ఉన్నది. ఈ వ్యత్యాసం ఎలా అధిగమిస్తావూ? తెలిసినంత మాత్రాన అధిగమించగలవా? చేయాలని తెలిసినా దానికి బలమేదీ? రోజూ 3 గంటలకు లేచి 2 గంటలు స్నానం చేస్తే బావుంటుందని మనకు తెలుసనుకో, కానీ రోజూ 3 గంటలకు లేవగలమా? 45 ఏళ్ళ తర్వాత ఏక భుక్తం గా జీవిస్తే దేహం చాలా ఆరోగ్యం గా ఉంటుందంటారు. అలా ఉండగలమా? ఇలా చాలా ఉన్నాయి. వాక్కులు ఎలా వాడాలో ఉన్నాయి. అలా వాడగలమా? ఇవన్నీ తెలిసినా చేయలేని ఒక దుస్థితి మనలో ఉన్నది. దానికి ఏమి చేయాలి? అందుకని ఇలా చేసే వారి వద్దకు ముందు చేరమంటారు. వారితో చేరడంతో, వారితోపాటు వీడు చెయ్యడం తో వీడికి బలం వస్తుంది. మన దగ్గర వ్యాపారము చేద్దామంటే 50 పైసలుంది. ఒక రూపాయి కావాలి. మిగతా అర్థరూపాయి, ఉన్నవాడి వద్ద అప్పుచేసుకుని రూపాయితో వ్యాపారం చేసి, లాభాలు వచ్చాక ఆ అర్థరూపాయి ఇచ్చేశాం అనుకో. అప్పుడేమయ్యిందీ? అర్థరూపాయి గాడివి రూపాయిగాడివి అయ్యావు కదా! అంటే ఉన్నవాడి వద్ద అప్పు తెచ్చుకున్నావుకదా! అలాగే నీ వద్ద ఏఏ సద్గుణాలు కోరుకుంటున్నావో, ఏవి నీ వద్ద లేవో ఆ గుణములున్నవారి వద్దకు వెళ్ళి, మనం వారి సాన్నిధ్యంలో జీవించడం నేర్చుకోవాలి. దాని వలన బలం వస్తుంది. ఇంకో మార్గంలో బలం రాదు. మనకి ఎన్ని మంచి విషయాలు తెలిసినా, మనలోని వాసనలు వాటిని పక్కన పెట్టించేసి, చేయకూడని పనులు చేయించేస్తాయి. అలా చేయించేవాడికి సత్పురుష సాంగత్యము, సాన్నిధ్యము, సద్గ్రంథ పఠనము, స్తోత్ర పఠనము, సూక్త పఠనము  అందుకూ ఇస్తారు. మనంతట మనం బలం పట్టించుకోవడం కన్నా ఓ బలవంతుడి వద్ద ఉంటే బలం సులభంగా పడుతుంది. అదే మనకి పెద్దలు చెప్పే సత్సాంగత్యం. నీకే విషయములందు లోటు కనిపిస్తున్నదో ఆ విషయమునందు బలంగా ఉన్న వాడితో నీవు సాన్నిహిత్యం పెంచుకుని, వీలున్నన్ని సార్లు కోరి కలుస్తుంటే, వారిలో ఉండే ఆ తత్త్వం నీకు అబ్బుతుంది. ఆ తత్త్వానికి ఆయన నీకు గురువు. ఒక్కొక్క తత్త్వానికి ఒక్కోళ్ళు గురువు. అన్నీ ఒక్కళ్ళలో దొరికితే అదృష్టమే. అలా దొరకవు. కొంతమందిలో కొన్ని దొరుకుతాయి. ఎవరిలో ఏం దొరుకుతుందో దాన్ని చూసి బుద్ధిమంతుడైన వాడు సాధన చేస్తాడు. అందుకని మన చుట్టూ ఉండే వాళ్ళలో ఎవరిలో అద్భుతమైన గుణమున్నదో, ఆ గుణము

వాడిలో భగవంతుని యొక్క అస్తిత్వముగా గుర్తించమని భాగవత సాంప్రదాయం. అది గుర్తించి అంతవరకే తప్ప, మిగతా విషయములు అతనితో పెట్టుకోకూడదు. అన్ని విషయాలూ ఒకే మనిషితో పెట్టుకుంటే కొన్ని చికాకులు వస్తాయి. మంచి విషయాలు అందుకున్నా అందుకోకపోయినా, మిగతా విషయాలు సులభంగా అందుతాయి. మాష్టారు గారు తీరిక సమయాల్లో హాస్యానికి వారి గురించి, వీరి గురించి మాట్లాడేవారు. ఆయన తన కన్నా చిన్న వారి గురించి హాస్యం గా మాట్లాడేవారు. కానీ అది విన్న వాళ్ళు, తాము చాలా చిన్నవారైనా, తమకన్నా చాలా విషయాల్లో పెద్దవాళ్ళ గురించి అవే హాస్యపు మాటలు ఆడేవారు. అంటే ఏది సులభంగా నేర్చుకున్నారూ? మాష్టారుగారి వద్ద ఇంకా అద్భుతమైన విషయాలు కోకొల్లలు ఉన్నాయి. CVV గారు, MN గారు మర చెంబు కాఫీ తాగేవారని, నా బోటి వాడు 12 cups coffee తాగాడనుకోండి. ఎలా ఉంటుందీ? వాళ్ళనుండి కాఫీలు తాగడమూ, సిగరెట్లు కాల్చడమూనా మనం నేర్చుకోవలసినదీ? మరి వారికుండే ఇతర విషయాలో? అందుకని ఎవరి వద్ద ఏం నేర్చుకోవడానికి చేరావో అది నేర్చుకోవడము ముఖ్యం. ఒక్కొక్కళ్ళలో ఒక్కో దివ్యమైన, ఉత్తమమైన గుణం గోచరిస్తుంటుంది. మాష్టారుగారిలో 98 దివ్య గుణాలు ఉండి, ఈ రెండూ ఉంటే, ఈ రెండు పట్టుకుని ఆ 98 వదిలేశాం అనుకోండి. ఏమవుతుంది? వాసనలు త్వరగా అంటుకుంటాయి. అయస్కాంతం వద్దకి చేరితే ఇనుపముక్క అయస్కాంతం అవుతుంది. 'అయస్కాంతం వద్దకు వెళ్ళి అయస్కాంతం వంకరగా ఉంది అని ఎద్దేవా చేసే వాడికి అయస్కాంతీకరణ జరగదనీ' మాష్టారు రాశారు. గురువు వద్ద ఈ లోపాలున్నాయి, ఆ లోపాలున్నాయి అని చూసేవారికి అయస్కాంతీకరణ జరగదు, అని చెప్పారు. ఇట్లా మనకి మనుషులలో లోపాలు చూసే పద్దతీ ఉన్నదీ, ఆ గుణాలు చూసే పద్ధతీ ఉన్నది. సద్గుణాలనే గుర్తించి, వాటి కోసం వాళ్ళతో మనం కూడాలి. కొంతమందికి చక్కటి క్రమశిక్షణ ఉంటుంది. ఈ గుణం మనం ఇతని వద్ద నేర్చుకుందాం అనుకోవాలి. కొంతమందికి చక్కటి వాక్పటిమ ఉంటుంది. వాళ్ళు మాట్లాడుతుంటే మనం మాట్లాడేది అసలు భాషణం అనిపించదు. అంత చక్కగా, ప్రవాహంలాగా, పవిత్రమైన పదాలు ముత్యంలా ప్రవహిస్తూండేటట్లు మాట్లాడేవారి మాటలు వింటూ, మనం అలా మాట్లాడడం నేర్చుకోవాలి. అప్పలాచార్యులవారి భాష అలా ఉంటుంది. వారి భాష వింటే మనం మాట్లాడేది భాషనిపించదు. మనం చాలా ఘోరంగా మాట్లాడతాం. భాష, దాని పవిత్రత, దాని ప్రయోగమూ, పదముల యొక్క వినియోగమూ ఇవన్నీ బాగా తెలియాలంటే ఆయన మాటలు శ్రద్ధగా వినాలి. ఆయన మాటలలో ఎవరి గురించి దూషణ ఉండదు. అలా చాలా ఉన్నాయి నేర్చుకోవలసినవి. అలాగే శివానంద మూర్తిగారి వద్ద ఉన్న ప్రశాంతత మనం ఎక్కడా చూడలేం. ఎంత భయంకరమైన అలజడి చుట్టూ ఉన్నా ఆయనలో ప్రశాంతతకు లోటుండదు. శ్రద్ధకు లోటుండదు. ఎంత చిన్న విషయం అయినా పూర్ణమైన శ్రద్ధతో నిర్వర్తిస్తారు. ఇలా మనకి మహాత్ములలో చూడ్డం ఓ పద్ధతి. మామూలు మనుష్యుల్లో కూడా కొన్ని కొన్ని దివ్య గుణములు ఉంటాయి. అందుచేతనే వాళ్ళు కొన్ని విషయాల్లో చాలా బలంగా ఉంటారు. వారి వద్ద మనం నేర్చుకోవడానికి ప్రయత్నం చేయాలి. ఈ విధంగా సాంగత్యం చేయడం వలన

మనలో ఈ వాసనలని దాటడానికి వీలుపడుతుంది. ఇవన్నీ పూర్ణంగా ఉన్నవాడ్ని భగవంతుడిగా భావన చేస్తాం. ఏ వాసన లేకుండా పరిపూర్ణమైనతత్త్వం అక్కడ నిలబడి ఉన్నటువంటిది. అటువంటి వాడ్ని ప్రతినిత్యం మనం ప్రార్థన చేసుకుంటే అప్పుడు కూడా ఈ వాసనలు జారిపోతాయి భగవత్ సాన్నిధ్యం కేవలం భావన వల్ల కలుగుతుంది. ఆ సాన్నిధ్యాన్ని మనం బాగా పొందుతున్నంతసేపూ ఇందులో ఉండం. అంటే వాసనలలో ఉండే time తగ్గుతుందన్న మాట. అసలు మామూలుగా ఏమీ చేయని వాళ్ళం, కొంచెంసేపు స్తోత్రం, కొంచెంసేపు సద్గ్రంథ పఠనం, పూజా పునస్కారాలు కాసేపు, మరికాసేపు ప్రార్థన ఇలా రోజులో 3 గంటలు కేటాయించాం అనుకోండి. అప్పుడు రోజులో ఉండే 8 గంటల నిద్ర, 6 గంటల ఇతర కార్యక్రమాలు పోను మిగిలిన 10 గంటలలో మనకి 3 గంటలపాటు ఈ విధములైన కార్యక్రమాలలో ప్రవేశించడం చేత, దీనికి సంబంధించిన సువాసనలు/ వీటినే సంస్కారములని, అంటారు, వాటిని వాసనలంటారు--. ఈ సంస్కారములు పెరగడం మొదలు పెడతాయి. ఇవి బాగా పెరగడం మొదలు పెడితే వాటికి/ వాసనలకి ఇంట్లో చోటు బాగా తక్కువైపోతుంటుంది. ఎక్కువగా ఇంట్లో సద్గ్రంథ పఠనం చేస్తుంటే, India Today, ఆంధ్రపత్రిక, ప్రభ వీటికి చోటు తగ్గిపోతుంది. అలా చాలా వాటికి వాసనలు తగ్గి, వీటికి ప్రాముఖ్యం పెరిగి మనకు తెలియకుండానే మనలో బాగా మార్పులు జరుగుతుంటాయి. ఈ విధంగా మనం భగవంతుడ్ని ఆశ్రయించడం వల్ల కామ వాసనల నుండి ముక్తి చెందవచ్చు. కామాన్నుండి ముక్తి చెందనక్కరలేదు. ఎందుకంటే కామించడం అంటూ లేకపోతే సద్విషయాన్ని కామించడం కూడా ఉండదు. కామించడమనేది ఒక జిగురు పదార్థం లాంటిది. జిగురు పదార్థం లేకపోతే గోడకి ఏమీ అతికించలేం కదా! మామూలుగా సినిమా బొమ్మలు మన గోడకు అతికిస్తున్నాం అనుకోండి. దానికి జిగురు ఎంత అవసరం? మరి అదే దేవుడి పటాలు అతికించాలన్నా జిగురే అవసరం కదా! జిగురులో తప్పలేదు. ఆ జిగురు దేనికి వాడుతున్నామని తప్ప, జిగురుండకూడదంటూ, కామముండకూడదనుకునే వాడు దేవుడి యందు కూడా కోరిక లేకుండా ఉంటాడు. వాడు రెంటికీ చెడ్డ రేవడి అవుతాడు. తీవ్రమైన కోరిక భగవంతుని యందు కలగడమే తపస్సుకు మొదటి మెట్టు. మామూలుగా మనకి వైరాగ్యం పేర్న అవీ, ఇవీ అక్కర్లేదు అనుకునే వాడు దేవుడు కూడా అక్కర్లేదు అనుకుంటాడు. సద్విషయాలు కూడా అక్కర్లేదు అనుకుంటాడు. గుడికి వెళ్తేనేనా అనిపిస్తుంది. రామాయణం వింటేనేనా అనిపిస్తుంది. ఇటు వదిలేశాడు కనుక, అటు కూడా వదిలేస్తాడు. అందుకని కపిలుడు దేవహూతికి ఓ మంచి విషయం చెప్పాడు. 'కోరిక మాత్రం బలంగా ఉంచు, దాన్ని దేనిమీద వినియోగిస్తున్నావో అని జాగ్రత్తగా చూసుకో, అంతేకానీ మనస్సును చంపబోక, ఇంద్రియాలనూ, శరీరాన్నీ చంపవద్దు, అది తెలివి తక్కువ పని అని చెప్తారు యోగులు. కోరికలు మార్చి సద్విషయాలు కోరేటట్లుగా చూడూ, వాటిని నిర్వర్తించే వారి సాన్నిధ్యంలో జీవించడానికి ప్రయత్నం చెయ్యి. నువ్వు అటువంటి ప్రయత్నం త్రికరణ శుద్ధిగా చేస్తుంటే ఎవరి వద్దకూ వెళ్ళక్కర్లేదు' అంటాడు భాగవతంలో. నాయందీ వాసనలున్నాయీ, వీటివల్ల నేను దుఃఖపడుతున్నానూ, వీటి నుండి నేను బయటపడలేక పోతున్నానూ,

నువ్వే నాకు దారి చూపించాలి అని భగవంతుడ్ని బాగా ప్రార్థన చేస్తుంటే, నీ ప్రార్థనలోని తీవ్రతను బట్టి, నీకు ఏ విషయములందు విముక్తి కావాలో, ఉద్ధరింపు కావాలో ఆ విషయములందు గట్టి అయినవాడు నీ వద్దకు వస్తాడు. అలా ఉంది అమరిక. ముందు నీకు దానియందు తీవ్రమైన శ్రద్ధ కలగాలి. 'వీటి నుండి నేను బయటపడాలి, వీటితో నేనుండలేను. ఇలా నేను బతకలేను. కానీ నాకన్నా నా వాసనలు బలీయంగా ఉన్నాయి. వీటి నుండి బయట పడడం నా తరం కాదు'. మనందరి పరిస్థితీ అదే ! అప్పుడు భగవంతునికి తీవ్రమైన/ strong అర్జీ పెట్టుకోవాలి. 'బాబూ, నా వల్ల అయ్యే పని కాదు. నీవే నాకు తోడు వచ్చి చేసిపెట్టు. నీవే నన్ను దాటించగలవు. నీ సహాయం లేకుండా నా అంతట నేను దాటలేను అని, దాని యందు నీకు తీవ్రమైన ఆరాధన ఉండి, నాకిలాంటి సంస్కారం కల్పించు' అని కోరితే దానికి సంబంధించిన సాధన సంపత్తి, వనరులూ సృష్టిలో నుండి నీకు అందేటట్లుగా చేస్తాడు. దానికి సంబంధించిన వాడు నీకు తారసపడడం, అతడు మార్గం చూపించడం, అతడి సాన్నిధ్యం లో నువ్వు నేర్చుకోవడము తద్వారా నువ్వు సంస్కరింపబడడం ఇలా జరుగుతుంటుంది సృష్టిలో. అదే, గురువు నీ వద్దకు వస్తాడని చెప్పడంలో అర్థం. నీకు దేనియందాసక్తి ఎక్కువగా వుంటుందో దానికి సంబంధించిన వాళ్ళు నీ వద్ద చేరతారు. మంచిగానీ, చెడుగానీ ఏ school ల్లో నువ్వు చేరదామనుకుంటే ఆ School లో నీ తీవ్ర ప్రయత్నాన్ని బట్టీ, చోటులో ఆ తరంగాలు అలా అలా వెళ్ళిపోతాయి. మనం ఓంకారం బాగా చేసి, 'సత్పురుషుల సాంగత్యం నాకు కలిగించూ, సద్విషయములూ, సత్పురుషులూ, సత్సన్నివేశములు వీటియందే ఆసక్తి కలిగిన వారి పరిచయం కలిగించు'.

'నీ పాదకమల సేవయు, నీ పాదార్చకులు తోడి నెయ్యము' కదా!

మిగతా వాళ్ళు వస్తే మనకి రకరకాల కష్టాలు వస్తాయి. జీవితాల్లో కొంతమంది ప్రవేశిస్తే చాలా కష్టాలు వస్తూ వుంటాయి. నీవద్దకే ఎందుకు వచ్చాడూ నిన్ను కష్ట పెట్టేవాడూ? నీలో దానికి సంబంధించిన బీజం ఉన్నది. దానికి సంబంధించిన ఆశ, కోరికా ఉన్నాయి. అది నిన్ను ఆధారంగా చేసుకుని వాడు వస్తాడు. ఇవే కోరికలుగా పెట్టుకుంటే వీటికి సంబంధించిన వాళ్ళు వస్తారు. అందుకనే ' నీ పాద కమల సేవ, నీ పాదార్చకులతోడి నెయ్యము' ఈ రెండే కోరాలట భగవంతుడ్ని. పాదార్చకులతోడి సేవ ఉంటే పాదసేవ ఇంకా బాగా జరుగుతూ వుంటుంది. భగవంతుని పాదమే ఈ సృష్టి అంతా, సృష్టికి సేవ చేసుకుంటూ జీవించడమంటే లోకహితుడుగా జీవించుడం, లోకహితులుగా జీవించేవారి యొక్క సాంగత్యం కలగడం చేత అపారమైన నిరంతరమైన భూతదయ కలిగి వుంటావు. అంతములేని భూతదయట, నిజంగా ఆ పద్యం ఎంతో అర్థవంతంగా చదువుకోవాలి. నిజంగా కావాలా కోరుకో. మానవుడికి కావలసింది ఇప్పుడు పదవి, డబ్బు. డబ్బు అడగడంలో తప్పు లేదు. 'నన్ను సుఖపెట్టే ధనం కావాలి తప్ప, నన్ను దుఃఖపెట్టే ధనం వద్దు అని కోరుకో దేవుడ్ని ఏమైనా అడగవచ్చు, తప్పు లేదు. కాని ఏమి అడిగినా అవి మనల్ని సుఖపెట్టేవి కోరుకోవాలి. ఆయన మనకి సుఖమైనవే/కావలసినదే ఇస్తాడనే విశ్వాసం ఉంటే ఆయన సాన్నిధ్యం కోరుకోవడం చేయవచ్చు. కోరుకోక పోవడం ఎక్కువ తెలివి అంటారు. ఎందుకంటే మనం ఏం కోరుకోవాలో మనకి తెలియదు కాబట్టి, అలాగని

కోరుకోవడం తప్పలేదు. ధనం కావాలని కోరుకుని, అది వస్తే దాన్ని సరిగా వినియోగించి, దానికి స్వామిత్వం నిలుపుకోలేకపోతే దాని ద్వారా కష్టాలు వస్తాయి. కొంత మందికి ధనం వస్తే ఎక్కువ ఆపదలు రావచ్చు. అడ్డగోలగా ధనం సంపాదించి జైలు కెళ్ళిన వాళ్ళున్నారు. అడ్డగోలగా పదవులు నిర్వర్తించి జైలు కెళ్ళినవాళ్ళున్నారు. మనం సరిగ్గా నిర్వర్తించుకోలేకపోతే దాన్నుండి కష్టాలు రావచ్చు. అందుకని నీకు తెలియదు కనుక వాడికే అప్పచెప్పడం ఒక పద్ధతి. లేదూ ఈ కోరిక నాకు శ్రేయస్కరమైతేనే చేసిపెట్టు, లేకపోతే వద్దని చెప్పాలి. కోరిన కోరికలతో ఏ గొడవలు వస్తాయో, అని వాణ్ణి నువ్వే మాకు ఏది శ్రేయస్కరమో అవి ఇమ్మని అడగడం ఒక పద్ధతి. లేదూ కోరికలు కోరక. మాకు ఏది శ్రేయస్కరమో అది నువ్వే ఇచ్చెయ్యనడం ఒక పద్ధతి. అందుకే CVV గారేమన్నారంటే 'నీకేమి కోరిక ఉన్నా నాకు చెప్పెయ్యి, ఊళ్ళో వాడినేం అడగక్కర్లేదు. నేను రెండు రకాలుగా దాన్ని పరిపూర్తి గావిస్తాను. అది నీకు మంచిది అయితే అయ్యేట్లు చూస్తా. అది నీకు మంచిది కాదనుకో, అది నీ మనస్సులోంచి వెళ్ళిపోయేట్లు చూస్తాను'. రెండూ ఒకటే! సద్గురువు అదే చేస్తాడు. కోరిక కోరుకోండి తప్పలేదు, కానీ కోరుకున్నప్పుడు 'ఇది నాకు శ్రేయస్కరమైతే' అని కోరుకోవాలి. కాకపోతే కోరావు కదా అని ఇచ్చేస్తాడు శ్రేయస్కరం అయినా కాకపోయినా. మరి రావణుడు, భస్మాసురుడు, హిరణ్యకశిపుడు అలాగ కోరుకుంటే ఇచ్చేశాడు కదా! అందుకే కోరిన కోరిక మంచా, కాదా అనేది కూడా నీకే వదిలేస్తున్నా అని చెప్పడం. Spanish కథ ఒకటి ఉన్నది. నేను ముట్టుకున్నదల్లా బంగారం కావాలని ఒక భక్తుడు కోరుకున్నాడట. Midas touch అంటే అది. ఇంటికెళ్ళి ఆనందంగా పిల్లవాణ్ని కౌగిలించుకుంటే వాడు బంగారం అయిపోయాడు అంతే. పెళ్ళాం చెయ్యి ముట్టుకుంటే చెయ్యి బంగారం అయిపోయింది. అన్నం ముట్టుకుంటే అన్నం బంగారం అయిపోయిందట. ఏం లాభం? వాడికి బంగారం మీద ఉన్న ఆశ ఏమయ్యిందీ? ఆశ లావూ పీక సన్నంగా, కోరుకోకూడదు. 'నేను ఉన్న స్థితికి నేను ఇది అందుకోగలను అని నువ్వు అనుకుంటే ఇవ్వు అని కోరాలి అందుకు 'మనకి ఏది శ్రేయస్కరమో అది మనకు ఇస్తాడు' అనుకుంటే అసలు అడగడం మానెయ్యవచ్చునండి. నీ పాదకమల సేవ, నీ పాదార్చకులతోడి నెయ్యము, అపార భూతదయ మాత్రము ఆడగమన్నారు భాగవతంలో. మనకు 3 రకాల కామాలు ఉంటాయి.

1. ధనం 2. పలుకుబడి, గుర్తింపు 3. భార్యాపిల్లలు.

ఈ పిల్లలు పెద్దవాళ్ళయ్యి గొప్పవాళ్ళవ్వడం. ఇవి మనం అనుకున్నట్లుంటాయా? ఎవరెవరి కర్మబుట్టలు వారు పట్టుకు వస్తారు. వాడి బుట్టలోదే వాడికి వస్తుంది. 'ప్రేయస్సులు కాక శ్రేయస్సులు కోరుకోవాలి' అంటారు మాష్టారు. ప్రేయస్సులు అంటే ప్రియమైనవి. ప్రియమైనవి అన్నీ శ్రేయస్కరము కాకపోవచ్చు. కానీ శ్రేయమైనవన్నీ ప్రియమైనవి అయితే అదృష్టవంతులు. అందుకే ప్రేయస్సు కాక శ్రేయస్సు కోరుకోవడం. అది దైవాన్ని కోరుకోవచ్చు. ఎందుకంటే ఈ కోరికకే దైవం ఆయన. ఆయన నుండే వచ్చినాయి అసలు కోరికలు. ఆయన కోరుకుంటేనే ఈ సృష్టి, జీవులు వచ్చాయి. ఆయన కోరుకుని సృష్టించి ఆనందిస్తున్నాడట. మనల్ని కూడా అలాగే సృష్టించి, ఆనందించమన్నాడు. చక్కగా ఆడుకోమని తండ్రి బొమ్మలు తెచ్చి ఇస్తే

పిల్లలు పోట్లాడుకుంటే, తండ్రి పోట్లాడుకోమని ఇచ్చినట్లా! అలాగే ఈ సృష్టింపబడ్డ జీవులుకి అన్నీ ఇచ్చి ఆనందించమని, అనందించడానికి ఏం చేయాలో కూడ చెప్పాడు. అవి చేయనప్పుడు ఈ బాధలు వస్తాయి. బాధలు వచ్చినపుడు ఎవరయ్యా గతి, అంటే ఆయనే! ఒక్కసారి let us get back to the Original అని వెళ్ళి బండి line లో పెట్టుకుని, ఆయన అధారంగా అన్నీ నిర్వర్తించుకుంటూంటే మళ్ళీ అన్నీ సవ్యంగా జరుగుతుంటాయి. మనలో కలిగిన కోరిక కూడా ఆయనే అని భావన చేయడం 'కామీ' నామానికి సాధన! ఒక కోరిక వచ్చిందనుకోండి 'అమ్మా' ఇట్లా వచ్చావు. ఏమిటి దీని విషయం. భగవంతునితో కూడి ఉన్నప్పుడు మనకు అపకారం చేసే కోరికలు రావు. అందుకని 'నాలో కలిగే కోరిక నువ్వే' అనే భావన ఆ కోరిక తీర్చడం వల్ల, ఉత్తర మీమాంస, పూర్వ మీమాంస అని 2 పెద్దలు ఇచ్చి వున్నారు. ఓ పని చేసే ముందు ఆ పని గురించి వివరంగా ఆలోచించుకోవడం పూర్వ మీమాంస. చేసిన తర్వాత ఎలాంటి ఫలితాలు వస్తాయిూ ఉత్తర మీమాంస. ఫలితాలు బావుంటాయి. దీనివల్ల ఎవరికీ చెడులేదు. మనకి మంచి ఆనందం ఉంది, మంచి ఉంది. నిర్వర్తించుకోవచ్చు. ఉద్దేశ్యం లో ఏదన్నా కుత్సితం ఉందా, లేదా ఫలితాన్నాశించడంలో చిక్కులు ఉన్నాయా? ఈ విధంగా ఆలోచించుకుని కోరిక నిర్వర్తించుకోమని చెప్తారు. కోరబడేది కూడ భగవంతుడే అని చెప్తున్నారు ఈనామంలో. నీవు దేన్ని కోరుతున్నావో అది కూడా భగవంతుడే అనుకో. కోరికా నువ్వే, కోరబడే వస్తువూ నువ్వే. ఈ విధంగా వుంటే శాస్త్ర ప్రకారం సమస్తాన్ని నిర్వర్తించే ఒక స్థితి సాధకుడికి కలుగుతుంది. అదీ 'కృతాగమః'. ఆగమము అంటే శాస్త్రములను సాంప్రదాయపరంగా ఇవ్వడం. సమస్తమైన సృష్టి శాస్త్రాన్ని, జీవన విధానాన్ని సాంప్రదాయంగా ఇచ్చారు ఋషులు. దానికొక Intellectual ideation ఇవ్వలేదు గాని, ఇట్లా ఉండండి, హాయిగా ఉంటారని ఇచ్చారు. ఋషులు ఇచ్చిన జీవన విధానం అలాంటిది. అందులో సమస్తమైన శాస్త్రం ఉన్నది. నీకు తెలియనక్కర్లేదు. భగవంతుడు కృతాగముడు అని చెప్పడంలో ఉద్దేశ్యం ఏమంటే సృష్టి అంతా ఆ విధంగా తయారు చేసి ఉంచాడు. సశాస్త్రీయంగా చేసి ఉంచాడు గనుక కృతాగముడు. ఆగమముల ప్రకారం నిర్వర్తిచుకునే వాడు కూడా కృతాగముడే. అంటే కోరికను ఎలా కోరాలో తెలిసి ఉండాలి. భాగవతములో భగవంతుడు దర్శనమిచ్చినపుడు భక్తులేం కోరారో జాగ్రత్తగా చూడండి. కోరడం వల్ల కొంతమందికి ఎట్లా ఉన్నదీ? కోరేముందే సద్భక్తుడు 'అంతా నువ్వే' అంటాడు. తనలో కోరిక కూడా వాడు కలిగిస్తే కోరతాడు. కోరికూడా పతనం చెందని భక్తులు భాగవతంలో కనిపిస్తారు. కోరి ఇబ్బందిపడ్డ భక్తులూ ఉన్నారు. అసలు నేను కోరనంటే కోరనూ అన్న భక్తులూ ఉన్నారు. 3 రకాల భక్తులు ఉన్నారు. అలా శ్రేయస్సు కోరినవారు, ప్రేయస్సు కోరిన వారు, అసలేమీ కోరనివారు ఇలా కనిపిస్తారు. అందరినీ ఏ విధంగా ఉద్ధరించాడో గోచరిస్తుంది. కోరిక భక్తుడికి లేకపోయినా, వాడికి శ్రేయస్సు కలగాలనే ఉద్దేశ్యం తనకు కలిగితే, భగవంతుడే ఆ రకమైన కోరిక పుట్టిస్తాడు. కుచేలునికి ఏ కోరికలూ లేవు. పిలిచి కోరిక పుట్టించి, అది ఇచ్చి, ముక్తుణ్ణి చేశాడు. తనే కోరికగా కూడా పుట్టగలడు. 'ఫలానా చోట సత్పురుషుడున్నాడుట వెళ్ళి కలుద్దాం' అనే కోరిక మనలో కలిగినదనుకోండి. అది

భగవంతుడి యొక్క 'కామీ' నామం. 'రోజు భగవద్గీత చదువుకోవచ్చు కదా' అని మనకు అనిపించిందనుకోండి, ఆ కోరిక మనలో కల్పించిన వాడు దైవం. 'ఊరికే చదవడం కాదు. Notes రాసుకో' అని లోపల నుండి అనిపిస్తే అది దైవం. ఇలా పెంచుకోమూ? ఎందుకలా పెంచుకుంటూ పోతారూ? లోపలున్న వాడు అలా పెంచుతూపోతాడు భక్తిలో పడేసరికి. ఎందుకంటే నీ రజస్సును అటూ ఇటూ పోనీకుండా వీటి మీద పోయేట్లు చూస్తుంటాడు. అక్కడ కోరిక ఎవరు? తాను కోరే వాడిగానూ, తాను కోరుతున్నదిగానూ కూడా వాడే. అందుకని కోరబడేది, కోరుకునేట్లు చేసేది కూడా అతడే. కృష్ణుడ్ని ఎంతమంది కోరారూ? విపరీతంగా కోరారు. ఈయన కోరబడ్డ వాడయ్యాడు. అంటే 'కాంత' అన్నమాట. అసలు ఏమన్నా కోరాలంటే అదేకదా మరి కోరాల్సిందీ. అన్నిటికన్నా అత్యుత్తమంగా కోరదగ్గది భాగవత్తత్త్వం. దాన్ని కోరిన వాళ్ళు చాలామంది. సద్భక్తులందరికి భగవంతుడే కాంత! వారికి వేరే ఏ కోరికా లేదు ఆయన తప్ప. కోరబడే వస్తువూ ఆయనే, తనని కోరాలనే స్ఫూర్తి కూడా ఆయనే! లేకపోతే కోరిక ఆయనేంటి? అంటాం. మనం సహజంగా ప్రకృతిలో ఉంటూ దివ్యత్వాన్ని కోరుకుంటాం వికృతి చెందక. ఎందుకంటే మనం అసలు అక్కడ నుండి వచ్చినవాళ్ళం కాబట్టి. ధర్మబద్ధంగా కోరుకోవడం ప్రకృతికి సంబంధించినవి. అధర్మం గా కోరుకునేవి వికృతికి సంబంధించినది. దానివల్ల ఇబ్బంది పడుతుంటాము. అందుకని కామదేవుడు, కామపాలుడు, కామీ, కాంత ఈ తత్త్వం అంతా సరిగ్గా నిర్వర్తించుకుంటే, సంప్రదాయం ప్రకారం సమస్తాన్ని చక్కగా నిర్వర్తించి సిద్ధి పొందుతాడు. భగవంతుడు సృష్టిని ఆ విధంగా నిర్వర్తించి, దానికి స్వామిత్వం వహించి ఉన్నాడు. దానిచేత బంధింపబడి లేడు.

## 683, 684 అనిర్దేశ్యవపుః, విష్ణుః

వపుః అంటే రూపం/ శరీరం అని అర్థం. అనిర్దేశ్యమైన రూపం కలిగినవాడు/ నిర్దేశ్యమైన రూపం లేనివాడని. అంటే ఇట్లా ఉంటాడు దేముడు అని చెప్పడానికి లేదు. ఎలాగయినా ఉంటాడు. ఈ నామం బాగా ధ్యానం చేస్తే ప్రపంచంలో మతం ఉండదండీ. దేవునికో రూపం పెట్టి కదా కొట్టుకుంటున్నాం. విశ్వరూపంలో అన్ని రూపాలు, ఈ రూపమే అని నిర్దేశించడానికి లేదు. నువ్వు ఒక రూపాన్ని ధ్యానం చేసినా, సమస్త రూపాలలోనూ వాడిని దర్శించడం అనేది నేర్చుకో. నేర్చుకోకపోతే కొన్నింటియందు ఆసక్తి, కొన్నింటియందు నిరసనా ఉంటుంది. ఎంత నిరసన ఉంటే అంత మనం భగవతత్త్వానికి దూరం అవుతాం. యోగానంద అనే సత్సాధకుడు సిద్ధుడయ్యే లోపల ఒక గురువు గారిని కలుసుకుందామని బయల్దేరుతాడు, ఆయన ద్వారా హిమాలయాల్లో ఎక్కడ తపస్సు చేసుకుంటే దైవ సాన్నిధ్యం దొరుకుతుందో తెలుసుకుందామని. దారిలో ఓ శివాలయం కనిపిస్తుంది. అందరూ ఆ శివాలయానికి వెడుతుంటారు. ఆ గ్రామం వారిని ఏంటీ ఇక్కడ ఇంతమంది అంటే, ఈరోజు చాలా ముఖ్యమైన రోజు, మేమంతా అందుకే శివదర్శనానికి వెళ్తున్నాం అని చెప్తారు. గుడివైపు చూస్తే, లోపలుండేది రాయే కదా అనుకుంటాడు. మనం Living God గురువు కదా అనుకుంటాం, అనుకుంటాడు. మనకి అదొక రోగం మనకి. గురువుని పట్టుకోగానే దేవాలయాలన్నీ చిన్నవిగా కన్పిస్తాయి. తిరపతి, శ్రీశైలం, ఇలాంటి వాటికేమీ వెళ్ళనక్కరలేదు, ఎక్కడికీ వెళ్ళనక్కరలేదు అని అనుకుంటూ ఉంటాం. వెళ్ళనక్కరలేదు అనుకోకూడదూ, అవకాశం ఉంటే వెళ్ళాలి. వెళ్ళనక్కరలేదని బుద్ధి ఉంటే పొగరు. అది ఎందుకు వస్తుందంటే ఒక రూపం మీద ఎక్కువ మోజు పెట్టుకుని మిగతా వాటిని కాదనడం వలన వస్తుంది. ఆయనున్నాడు కదా, మిగతావి మనకెందుకని. మరి ఆ మిగతావి ఆయన కాదా? ఈ యోగానంద శివుడ్ని చూడకుండా వెళ్ళిపోతే, ఈయనకు దొరకాల్సిన గురువుగారు 3 రోజులూ, 3 రాత్రులూ అయినా దొరక్క నానా గడ్డి కరుస్తాడీయన. చిట్టచివరకు దొరకడం కాదు, ఆయనే వచ్చి ఎదురుగా నిలబడతాడు. యోగానంద ఆయన్ని ఫలానా ఆయన ఎక్కడున్నారని అడిగితే, ఎందుకంటాడు? ఆయనతో మాట్లాడాలంటే నేనే ఆయన్ని అంటాడు. ఏం కావాలీ అంటాడు. హిమాలయాల్లో మనం ఎక్కడ ధ్యానం చేస్తే దైవం దొరుకుతాడని అడుగుతాడు. 3 రోజులు బాగా బాధపడ్డావూ, ఎందుకంటే నీలో శుద్ధి తక్కువ, అందుకే కలవలేక పోయావు. ఆ దేవాలయంలో ఉన్నది రాయనుకుని చూడలేదు కదా నువ్వు అంటాడు. అంతకు ముందొక ప్రశ్న వేస్తాడు 'భగవంతుడెక్కడున్నాడు?' అని. అంటే 'సర్వత్రా' అంటాడు యోగానంద. అంటే మరి సర్వత్రా వున్న భగవంతుడు అక్కడ శివాలయంలో లింగం రూపంలో లేడా అనడుగుతాడు. ఈయనకిహ వంటి మీద వాత పెట్టినట్లవుతుంది. సర్వత్రా వున్న భగవంతుడు కాశీలోని నీ గురువు వద్ద లేడా? హిమాలయాలలోనే ఉన్నాడా? సర్వత్రా వున్నాడని చెప్పి హిమాలయాలకి వెళ్ళి తపస్సు చేస్తానంటావు, బుద్ధి ఉందా'

అంటాడు. అన్ని చోట్లా చూడ్డం అనేది రావాలనేది ఈ నామంలో వున్నది. అందుకే సహస్రనామము 'విశ్వం విష్ణుః' అనే కదా మొదలు అవుతుంది. విశ్వమే విష్ణువయినప్పుడు దేవుడ్ని ఒక రూపానికి పరిమితం చేయవద్దు అని చెప్తున్నాడు. అందులో మన హిందువులలో దేవుళ్ళ రూపాలు కోకొల్లలు. ఒక్కోరు ఒక్కొక్క దేవతా రూపాన్ని ఆరాధన చేస్తారు. ఒక రూపంలోకి పిలిచి చేసుకోవచ్చు, తప్పులేదు. కానీ 'నీవనుకున్న రూపమే' అని నిర్దేశించక! కరాఖండీగా తేల్చేసి ఇదొక్కటే అంటే మరి ఇతర రూపాలో? ఇది ఒకటే, మిగిలినవి కాదూ అంటే God కన్నా Non-God రూపాలే ఎక్కువన్నమాట కదా? అప్పుడు దైవం ఎక్కువా, వాళ్ళెక్కువా? అందుకే భక్తుడికి వాడు కోరిన రూపంలో దర్శనం జరగదు. ఎందుకంటే వాడికా రోగం కుదరాలి కదా! ఓ రూపంలో ధ్యానం చేస్తుంటే ఇంకో రూపంలో చివరకు కనిపిస్తాడు. త్యాగరాజు విగ్రహాలే దేవుడనుకుంటూ, అవి పోతే రాముడికి కోపం వచ్చిందని, ఆ బాధలో బోలెడు కీర్తనలు రాసాడు. ఇంటిని, పెళ్ళాన్ని కూడా వదిలేసి తిరుగుతాడు. విగ్రహాలు పోతే పెళ్ళాం ఏం చేసిందండీ? ఆవిడ్ని వదిలేసి తిరగడానికి. ఆమె ఇంట్లో అమ్మవారి పూజలు చేసుకుంటూ ఉంటుంది. అసలు ఈ వెర్రి భక్తులకు స్థిరత్వం కలిగిన భార్యలుంటారు. తిరగలిలో తిరగని రాయి వాళ్ళు. ఇలా తిరిగీ తిరిగితే అక్కడ ఆమెకాభక్తి పరాకాష్ఠ చెందుతుంది. అప్పుడు వాళ్ళే వృద్ధ దంపతుల వలె ఈయనకి ఒక చోట కనిపించీ 'ఏంటిలా తిరుగుతున్నావు' అని కోప్పడితే, 'రాముడి విగ్రహాలు పోయాయి' అంటాడు. 'నీ రాముడెక్కడున్నాడూ?' 'అంతటా ఉన్నాడు' 'మరి అంతటా ఉన్న రాముడు విగ్రహాలలోనే ఉన్నాడా? ఇంకెక్కడా లేడా? విగ్రహం పోతే రాముడు పోయినట్లా? బుద్ధిలేదూ' అని తిడతారు. సాధనలో మనకి తెలియకుండానే కొన్ని పరిమితులూ, వ్యామోహాలూ ఏర్పడిపోతాయి. ఆ విగ్రహం ఉంటేనే నేను పూజ చేస్తానంటే ఎట్లా? నువ్వు రాముడికి పూజ చేస్తావా, విగ్రహానికా? ఆయన రాముడి విగ్రహాలు పోయాయని అంటే అంతర్యామిలో ప్రవేశించే వరకూ ఈ తిప్పలు తప్పవు. అంతర్యామిలో ఉండేవాడు అన్ని పూజలకీ సిద్ధమే. శ్రద్ధగా దాన్నుండి మతంతో కూడా సంబంధం లేకుండా భగవత్తత్త్వాన్ని అందుకుంటాడు. మతం ఏంటి అసలు? Muslim అయినా దేవుడ్ని ఉద్దేశించి చేస్తున్నాడు కదా! Christians prayer మనకు disturbance అని అనుకుంటే ఎలా? సత్సాధకుడికి మతపరంగా తేడా ఉండరాదు. నిజానికి అసలు మనకి మతం ఏముంది? అందుకే అవ్యక్తమైన తత్త్వం అని తెలియడానికి 'అనిర్దేశ్యవపుః విష్ణుః' ఎందుకన్నారు విష్ణువనీ? వ్యాపనం చెందే ప్రజ్ఞ విష్ణువు. వేదం లో విష్ణు అనే పేరు ఎందుకు పెట్టారంటే సమస్తమూ వ్యాపనం చెందీ ఎరుక కలిగి ఉంటాడు. మిగతా దేవతలు స్థానికంగా ఉంటారు. మన శరీరమంతా మనం ఎలా వ్యాపనం చెంది వున్నామో, మొత్తం సృష్టి అంతా అలా వ్యాపనం చెంది ఉన్నాడు విష్ణువు. అందుకనీ ఆయనకి ఎక్కడ ఎవరికి కష్టం కలిగినా వెంటనే తెలుస్తుంది. చిటికెన వేలు మీద దోమ కుట్టినా, ఈగ వాలినా ఏమీ అనిపించదూ? చిటికెనవ్రేలే కదా అనుకుంటామా? ముక్కు మీద వాలితేనే నేను పట్టించుకుంటాను అనేమీ లేదు కదా! వీపైనా, తలైనా, ముక్కయినా ఎక్కడైనా ఏ దోమైనా, చీమైనా, ఈగైనా వెంటనే మనకి తెలుస్తుంది కదా! అలా సమస్తాన్నీ వ్యాపించి ఉన్న తత్త్వాన్ని విష్ణుః

అన్నారు. అంతటా వ్యాపించిన ప్రజ్ఞ ఏ రూపంలోనైనా నీకు గోచరిస్తుంది. అందుకనే వేదాలు ఎత్తుకు పోయాడు అని బాధపడుతుంటే చేప రూపంలో వస్తాడు. అంతేకానీ చేపరూపంలోనే రావాలనేమి లేదు కదా! సృష్టి నిర్మాణం చేద్దాం అనుకుంటే దానికొక భూమిక, పీఠం దొరకడం లేదనుకుంటే తాబేలు రూపంలో వచ్చాడు. తాబేలు రూపంలోనే ఎందుకు? రాయి రూపంలో కూడా ఉండవచ్చు. వరాహరూపములో వచ్చి భూమిని ఉద్ధరించాడు. ఇందులో ఆయనది ఏ రూపం? అదేదో అర్థంకాని నరసింహ రూపంలో కూడా వచ్చాడు. వాడెవడో చాలా వింతగా కోరాడు. చావకుండా వరమీయమంటే అలా వీల్లేదన్నాడు బ్రహ్మ. అందుకని Peculiar గా కోరాడు వరం. పగలు చావకూడదు, రాత్రి చావకూడదు, ఇంటి లోపల చావకూడదు, బయట చావకూడదు, పంచభూతాల వల్ల చావకూడదు, చెట్ల వల్ల, మనిషి వల్ల, జంతువు వల్ల చావకూడదు. ఇలా కోరాడు. ఎన్ని కోలికలైనా కోరు. నువ్వు నిర్ణయం చేయలేనన్ని రూపాలు తీసుకోగలడు ఆయన. అందుకని ఆయన వరాహ నరసింహుడు. ఆయన్ని 'మనిషి' అనడానికి వీలు లేదు. జంతువనడానికి వీలులేదు. ఆయుధంకాని గోళ్ళతో, పగలూ రాత్రీ కాని సంధ్యవేళ, ఇల్లు వాకిలీ కాని గుమ్మం మీద చంపాడు. సమస్తమూ వ్యాపించి వుండడం చేతా, ఈ స్తంభంలో వున్నాడా అంటే అప్పటికప్పుడు అందులోంచి వచ్చేసాడు. అదే మనకి గజేంద్ర మోక్షంలో చెప్పారు:-

'విశ్వమయత లేమి వినియు నూరకయుండి, రంబుజాసనాదు లడ్డపడక,
విశ్వమయుండు విభుండు విష్ణుండు జిష్ణుండు, భక్తియుతన కడ్డపడం దలంచె

He is the one who notices first. Why? Because he is permeating the whole Creation. 14 భువనాలు వ్యాపించి వున్న ఎరుక అది. అది విష్ణువు. అలాంటి వాడికి ఇదీ రూపం అంటే ఎలా? అందుకని రూపం నిర్దేశించబోక. నువ్వేదయినా మంగళాత్మక రూపం ప్రార్థన/ ఆరాధన చేసుకున్నా కూడా, అన్ని రూపాలలోనూ వాడిని అంగీకరించు. సామాన్యంగా మనకు సాయం, మనం కోరని రూపం నుండి, కోరని source నుండీ వస్తూంటుంది. మనం ఓ పక్క కోరుతుంటే ఇంకో పక్క నుండి వస్తూంటుంది. అదే షిరిడి సాయిబాబా కుక్క రూపంలో భోజనానికి వస్తే, ఆయన్ని పిలిచిన వాడు కొట్టి పంపించాడు. ఎవరికీ తను కోరిన రూపంలో భగవంతుడు కనిపించడు. ఎందుకంటే పరిమితత్వం దాటాలని. త్యాగరాజు పరిమితత్వం దాటాక, 'రాముడు ఆత్మారాముడు కదా, విశ్వాత్మ చైతన్యం కదా, విగ్రహాల కోసం ఇంత వెర్రి పడ్డానేంటి' అనే భావన బాగా స్థిరపడేసరికి మళ్ళీ విగ్రహాలు దొరుకుతాయి, ఇప్పుడేం చేస్తాడో చూద్దామని. ముందు విగ్రహాలే రాముడనుకుంటే కొంత కథ జరిగింది. విగ్రహాలే కాదూ, రాముడు అంతా వ్యాపించి ఉన్నాడనుకునేసరికి విగ్రహాలు దొరికాయి. అప్పుడు విగ్రహాలు రాముడు కాదనుకోవడానికి వీలులేదు కదా! 'విగ్రహాలు కూడా' అనుకుంటాడు. అతడికి ఆ పరిమితత్వం పోవడానికే విగ్రహాలు పోవడం, దొరకడం జరుగుతుంది. దేవాలయంలోనే కాదు దేవుడు అంతటా వ్యాపించి ఉన్నాడు అని వింటే, అంతా చూసిన వాడికి దేవాలయంలో కూడా ఉన్నాడని తెలిసి ఉండాలి. అంతేగానీ దేవాలయంలో లేడనుకోరాదు.. మాష్టారుగారి తండ్రి

అనంతాచార్యులవారు మహా పండితులూ, జ్ఞాని, యోగి. ఆయన్ని చూడ్డానికి బాపట్లకి ఎవరో ఆర్యసమాజం వారొచ్చారట. ఆయన్తో అంతర్యామి, భగవంతుడు, పరతత్త్వం అంతటా వ్యాపించి ఉంటాడు, ఇలా అన్నీ చాలా మట్లాడారు. జ్ఞానులకి రూపంలో చూడడం కొంచెం చిరాకు. రూపాలు ఒప్పుకోరు. అందుకే అవతార పురుషులు వచ్చినా ఒప్పుకోలేదు. అంతా అయ్యాక మాష్టారు గార్ని పిలిచి, 'ఒరేయ్! వీళ్ళకి బాపట్ల చూపించరా' అని చెప్పారట తండ్రిగారు. వీళ్ళెక్కడో Bengal నుండి వచ్చారు. ఊరు చూపిస్తూ, బాపట్లలో భావనారాయణ స్వామి గుడి వద్దకు వెళ్ళాక, ఇది ఫలాన గుడి అని చెప్పారట మాష్టారు. 'లోపలికి వెళ్దామా' అన్నారట. 'అక్కర్లేదు' అన్నారుట. 'ఏం' అంటే 'అంతటా ఉన్నాడు కదా లోపలికి వెళ్ళడం ఎందుకన్నారట' ఈయనింకా చిన్న పిల్లవాడట అప్పటికి. 'మరి అంతటా ఉన్న వాడు గుళ్ళో కూడా ఉంటాడుగా' అన్నారట! అంతా ఉన్నాడనుకుంటూ గుడి లోపలికి వెళ్ళకపోవడం పొగరు కాదూ? అదే సత్యన్నారాయణ స్వామివ్రత కథలో మనకి కనిపిస్తుంది. ఆ రాజుగారు గొల్లలు పూజ చేసి ప్రసాదము ఇస్తే, సరి, వీళ్ళకి పూజ, ప్రసాదం కూడానూ అని అనుకుని వచ్చేస్తాడుగా. ఏం ఎందుకు చేయకూడదూ? భగవతత్త్వాన్ని నువ్వెక్కడా నిర్లక్ష్యం చేయకూడదు. నువ్వు లేవనుకోవడానికి, నువ్వు చూసిన పద్ధతిలోనే, నువ్వు చేసిన పద్ధతిలోనే ఉంటాడనడానికి వీలులేదు. అలాగ మాష్టరు గారు అంతటా ఉంటాడన్న దేవుడు గుళ్ళో ఉండడా అని అడిగారుట. అదీ మరి ఆయన ధీశక్తి! అందుకని శంఖారావంలో భక్తియోగంలో రాశారు. ముందు ఒక రూపానికి కట్టుబడిపోయి మిగతావన్నీ నిరాకరించినవాడు, రూపానికి అతీతమైన తత్త్వం కొంత అవగాహన కాగానే అంతటా ఉన్నాడనీ, ఎదురుగుండా కనిపిస్తే అశ్రద్ధ చేస్తాడని. అందుకని అంతటా ఉన్నవాడు ఇలాగ కూడా ఉంటాడు కాబట్టి చాలా శ్రద్ధగా, ఓర్పుగా వెతుకుతూ, చూసుకుంటూ ఉండవచ్చుట. ఎక్కడనుండయినా కనిపించవచ్చు, ఎక్కడనుండయినా ఆయన మాట్లాడవచ్చు. ఏ రూపం నుండయినా మాట్లాడవచ్చు. అవే బోలెడు కథలు. ఏ రూపం లో అయినా భగవంతుడు ఉంటాడని తెలియకపోతే గుడ్డివాడివవుతావు. ఏ రూపం లో అయినా మాట్లాడవచ్చు. వినకపోతే చెవిటి వాడవవుతావు.

## 685, 686 వీరః, అనంతః

వీరః అంటే సాటిలేని వాడు, ఎదురు లేనివాడు అని అర్థం. అనంతుడు, అంతం లేనివాడు. అంతం దేనికి ఉంటుంది. త్రిగుణాల నుండి పుట్టిన వాడికి అంతం ఉంటుంది. త్రిగుణాలకి అవతల ఉన్న చైతన్యానికి అనంతమే. అంతం లేదు. త్రిగుణములతో ఏర్పడడం చేత పుట్టినట్లు, పెరిగినట్లు, పోయినట్లు ఉంటుంది. అంటే ఈ మూడు కూడా త్రిగుణములకు అతీతమయిన చైతన్యం ఆధారంగా జరుగుతూంటాయి. సినిమా వెండితెర మీద పడుతుంది. సినిమా మొదలవుతుంది, climax కి వెళ్తుంది, అంతం అవుతుంది. కానీ వెండితెర ఎప్పుడూ ఉంటుంది. దానిమీద అనంతంగా సినిమాలు వేస్తుంటారు. వెండితెర ఎటువంటిదో మనం అనుకున్న శుద్ధ చైతన్యం అలాంటిది, లేక అమ్మవారు అటువంటిది. ఆ అమ్మవారినే విష్ణువు అంటాం. సృష్టిలో వెలుగుగా ఉంటుంది. సృష్టికతీతంగా, అవ్యక్తంగా, అనిర్వచనీయంగా, అప్రతర్క్యంగా ఉంటుంది. సృష్టిలోకి రాగానే అది వెలుగుగా మారుతుంది. ఆ వెలుగు ఆధారంగా బోలెడు బొమ్మలు వస్తూంటాయి, పోతూంటాయి. బొమ్మలకు అంతం ఉంది తప్ప బొమ్మలు దేనిమీద పడుతున్నాయో దానికంతం లేదు. దానినే మనం గాయత్రి అని ధ్యానం చేస్తున్నాం. మనలో కూడా మనం ఉన్నాం అన్న ఎరుక ఆ వెలుగే. ఉదయం మనం నిద్రలోంచి లేచి చైతన్యవంతులం అవుతున్నాం కదా! చైతన్యవంతులం అవడంచేత దానిమీద త్రిగుణాత్మకంగా ఆలోచనలు వచ్చి, పోతూంటాయి. ఒక ఆలోచన వస్తుంది అది రజస్సు. దాన్ని నిర్వర్తిస్తాం. ఆ ఆలోచనకి తమస్సు కారణం చేత ఒక ముగింపు వుంటుంది. ఏ ఆలోచనకి అయినా ఓ పుట్టుకా, ఓ పెరుగుదలా, ఓ తరుగుదలా ఉంటుంది. ఏ ఆలోచన అయినా ఈత్రిభుజంలో, ఈ త్రిగుణాత్మకమయిన దానిలో తిరగాల్సిందే. లేచి పళ్ళుతోంకోవాలి కదా అనుకున్నాం అనుకోండి, ఆ భావం, తోముకోవడం, పూర్తవడం అంతటితో అయ్యిందా, ఈ పూర్తవడం ఇంకోదానితో మొదలు అవుతుంది, ఇలా ఏదో ఒక భావం మొదలు అవ్వడం చెయ్యడం, పూర్తవ్వడం ఇలా రోజంతా జరుగుతూనే ఉంటుంది. వీటన్నిటికీ భూమిక/Platform/Dias/పునాది ఒకటి ఉండబట్టే ఇవన్నీ జరుగుతున్నాయి కదా బొమ్మలు బొమ్మలుగా ఇవన్నీ వేటిమీద జరుగుతున్నాయో దాన్ని గాయత్రి అంటున్నాం. త్రిగుణములకు అతీతంగా ఉండే శుద్ధ చైతన్యాన్ని ప్రార్థన చేసుకుంటే తద్వారా స్వస్వరూపం తెలుస్తుందని పెద్దలు ఆ విధంగా ఇచ్చారు. పరాశక్తి అన్నారు. ఎందుకంటే ఇచ్ఛా, జ్ఞాన, క్రియా శక్తులు. ఇచ్ఛా అంటే ఓ సంకల్పం రావడం, జ్ఞానం అంటే ఎలా నిర్వర్తించాలో దాన్ని తెలుసుకోవడం, క్రియ అంటే దాన్ని నిర్వర్తించుకోవడం. ఇలా జరుగుతూ ఉంటుందే, ఇది ఏది ఆధారంగా జరుగుతోందో ఆ వెండితెరకు అంతం లేదు. అది అనంతం. సృష్టి అయిపోయాక కూడా అది ఉంటుంది, అవ్యక్తంలో ఓ బిందురూపంలో ఉంటుంది. అదీ వెంకటేశ్వర స్వామి వారి హృదయంలో అమ్మవారిగా చూపిస్తారు. అతడు అనంతుడు. అనంతుడి లోంచి వచ్చిన మనం కూడ అనంతులమే. ఆయనలో ఏమున్నాయో అవన్నీ మనలో

ఉన్నాయి. అది తెలిసే మన పెద్దలు 'అహం బ్రహ్మాస్మి' అన్నారు. 'నేనే బ్రహ్మను'! బయట చోటుంది. గదిలో చోటుంది. గదిలో చోటులాంటి వాళ్ళం మనం. బయట చోటులాంటి వాడు ఆయన. గదిలో చోటుకి, బయట చోటుకి తేడాలేదు. పరిమితత్త్వం ఉన్నట్లుగా ఉంటుంది. అనంత నామం బాగా సాధన చేసుకుంటే భావంలో పట్టు పోతుంది. ప్రతి భావమూ త్రిగుణాత్మకమే! Thought is triangular. ఎటువంటి భావమైనా Triangular. ఆ భావం దేని ఆధారంగా చిందులేస్తుందీ, నువ్వు చైతన్య స్వరూపుడుగా ఉండడం వల్ల, నువ్వు ఆధారంగా ఆ భావం పెంపొందుతుంది. నువ్వే లేకపోతే ఆ భావం ఏముంది? నువ్వు నిద్రలో ఉంటే భావం లేదుగా! అవ్యక్తంగా ఉన్నప్పుడు భావం లేదుగా! నువ్వు ఎప్పుడూ ఉన్నావు. నువ్వు ఆధారంగా భావములు త్రిగుణాత్మకంగా వచ్చిపోతూ ఉంటాయి. పీడించే భావాలూ, ఆకర్షించే భావాలు వీటికి basis మాష్టారి మాటల్లో 'the background consciousness'. అంతర్యామి అంటారు. నీ నుండి నీ భావాలు త్రిగుణాత్మకంగా వస్తుంటే, వాటిని నిర్వర్తిస్తూ వాటిల్లో నువ్వు ఇరుక్కుపోతుంటావు. వెండి తెర ఇరుక్కుపోదు. మనం ఇరుక్కుపోతాం. తెలిసిన వాడు కూడా ఇది భావమయ ప్రపంచం, ఇది సత్యం కాదు అని, ఇది మారుతూంటుంది అని తాను వెండితెరగా ఉంటాడు. అలాటి వాడు శాశ్వతుడుగా ఉంటాడు. వాడూ అమృతత్త్వ స్థితిలో ఉన్నవాడు. దివ్యమైన స్థితిలో ఉన్నవాడు. ఎంత అద్భుతమైన భావన అయినా అది భావమే! దానికి పునాదిగా/ basis గా ఉన్నది తనే అని తెలిసినవాడు తనలో వచ్చే భావాలు తన మీదపడే సినిమాలుగా చూస్తాడు. సినిమా ఏ విధంగా వెండి తెరను అంటుకోదో, ఏ భావమూ ఇతడ్ని అంటుకోదు. అంతర్యామియే మిగిలితే అంతర్యామియే భార్యగా, పిల్లలుగా, బంధువులుగా, స్నేహితులుగా, శత్రువులుగా కనిపించడం, ఇలా ఉంటుంది. అంతర్యామినే చూస్తుంటే అంతా సినిమా కథలా ఉంటుంది. అంతర్యామిని చూడక సినిమాలోకి దిగితే కొంత పట్టుకుంటుంది. అనంతుడు శాశ్వతుడు, అతని నుండి ఇంత వచ్చింది. ఎన్ని గోళాలూ, ఎంత కథ? ఇంత కథలోనూ ఆయనెక్కడ దొరక్కుండానే ఉన్నాడు. అలాగే కృష్ణుడూనూ. ఎంత కథ నడిపించాడూ? రాముడు నడిపించిన కథ కన్నా కృష్ణుడు పెద్ద కథ నడిపించాడు. అవతారాలన్నీ events మాత్రమే రామావతారం వరకు. అంతకన్నా ఎక్కువ నడిపించింది కృష్ణుడు. ఇంత నడిపించినా ఎక్కడా, దేనికీ అంటుకున్నది లేదు ఆయనకి. చాలా కష్టమయిన విషయం. ఇది కేవలం పూర్ణపురుషులకి మాత్రమే సాధ్యమైన విషయం మిగతా వారికి కాదు. అంత మనం కాకపోయినా వీలైనంత వరకు మన భావాల నుండి బయట పడడానికి ఒక మార్గమున్నది. 'నేను శుద్ధచైతన్య స్వరూపుడను, నాలో కలిగిన ఈ భావన తాత్కాలికం. ఎల్లకాలమూ ఉండదు. ఏదో ఒక రోజున మారుతుంది. పుట్టిన సమస్యకల్లా ఓ పరిష్కారం ఉంటూంది' అనుకోవాలి. సమస్యలు పుట్టినప్పుడుఏడవడం, పెరిగినప్పుడు బాధపడడం కాక, కేవలం చూస్తూండడం యోగులు చేస్తూంటారు. ఈయన 'యోగేశ్వరుడు' కాబట్టి ఈయన్ని 'అనంతుడు' అని పిలిచారు. అనంతమైన సృష్టి నీ ఆధారంగా ఏర్పడింది, నీవు దేనికీ సంబంధం లేకుండ ఉండగలవు. అలా నిర్వర్తించి చూపించాడు కృష్ణుడు.

## 687 ధనంజయః

ఈ నామం అర్జునునికి కూడా చెప్తారు. సృష్టిలో అన్నింటికి మించిన ధనం ఏమయ్యా అంటే భక్తి ధనం. కనుక దాని చేత జయించబడతాడూ అనీ, దానిని కలిగి ఉన్నావాడని దీని అర్థం. అర్జునుడు ధనంజయుడు అవ్వడానికి కారణం ఏమంటే, ఆతనికి సర్వము నందు, దైవమునందు వున్న పరిపూర్ణమైన బద్ధత, ఆసక్తి. ధనం చేత భగవంతుడ్ని మెప్పించ లేరు. త్యాగం చేత కూడా మెప్పించలేరు. ఏ గుణం చేత కూడా మెప్పించలేరు. అతనికి సమర్పణ చెందడం ద్వారా మాత్రమే మెప్పించగలరు. అతన్ని మించిన ధనం లేదని తెలిసిన వాడే ధనంజయుడు. అంతర్యామి తత్త్వానికి ఆ విధంగా సమర్పణ చెందిన వాడి ధనం వేరు. మిగతా ధనాలు వేరు. అందుకని ధనమును జయించిన వాడని ఒక అర్థం. భక్తి ధనంచే జయింపబడువాడని ఒక అర్థం. భక్తులంతా ధనుంజయులే! వారు అన్నిటికీ మించిన ధనాన్ని పొంది ఉన్నారు. వారి అవసరాన్ని బట్టి వారికి మనం అనుకునే ధనం వస్తూ ఉంటుంది. వశిష్టుడి 'శబల' అనే కామధేనువు ఆధారంగా ఎంత వస్తూంటూందీ? అది చూచి విశ్వామిత్రుడు అది కావాలనుకుంటాడు, అది అక్కడ లేదూ, అసలు ఈయనలో ఉన్నదీ, అది దాని ప్రతీకగా మాత్రమే నిలబడి ఉంది. దాన్ని పట్టుకుపోతానంటాడు. దాన్ని పట్టుకెళ్తే ఉత్త ఆవు అయిపోతుంది నీ ఇల్లు చేరి. దాన్నుండే వశిష్టుడు కథంతా నడిపిస్తాడు. లేకపోతే నన్ను పట్టుకుపోతాడేమోనని. అలా పట్టుకెళ్ళలేని ధనం ఇది. రుక్మిణి యొక్క ధనం ఏమిటి సత్యభామతో compare చేస్తే? కుచేలుడి ధనం చూడండి! వీరి ధనం ఎవరూ పొందగలిగినది కాదు. ఈ ధనానికి అంతూ లేదు. అర్జునుని ధనం కూడా అదే. అతని చేతిలో సమస్తమూ పెంపొందింది. ఎందుకంటే భగవంతునియందు తను ఉండడం చేత, తన నుండి సృష్టి సంపద పెంపొందుతూ ఉంటుంది. అందుకనే అర్జునుడికి కూడా ధనంజయుడనే పేరున్నది. 'ధనంజయుడి రూపంలో కూడా నువ్వే ఉన్నావ్' అన్నది కూడా భీష్మడి యొక్క భావన కావచ్చు. అర్జునుడి రూపంలో కూడా పని చేసింది కృష్ణుడే అని. జరాసంధుడ్ని చంపినపుడు, ధుర్యోధనుని కొట్టినప్పుడు భీముని రూపంలో అప్పుడప్పుడు పని చేశాడు. అర్జునుడిలో ఎక్కువ ప్రతిబింబించాడు, ప్రతిస్పందించాడు. మన వరకు సాధన పరంగా భక్తి ధనం కోరుకున్నవాడు అదృష్టవంతుడు. ఆ ధనం చేత ఆతడు సులభుడు. ఇతర ధనం చేత మనం ఆయన్ని మెప్పించలేం. కృష్ణ తులాభారం కథ దానికి చక్కని ఉపమానం. మొత్తం బంగారంతో కొనేసుకుందాం అనుకుంది సత్యభామ. కృష్ణుడ్ని యజ్ఞయాగాదుల చేత, త్యాగం చేత దేవుడ్ని కొనుక్కుందాం అనుకుంటారు. దేవుడ్ని కొనడం కాదు, దేవుడికి అమ్ముడు పోవాలి. నువ్వు దేవుడుకు అమ్ముడుపోతే దేవుడు నీకమ్ముడుపోతాడు. ఇది అసలు రహస్యం. దేవుడు ఎవరికి దొరుకుతాడు అంటే ఎవరు ఆయనకు తనను తాను అమ్ముకుంటారో అప్పుడు ఆయన 'నిన్ను నువ్వు నాకు అమ్ముకున్నావు కాబట్టి నేను నన్ను నీకు అమ్ముకుంటున్నాను' అంటాడు. అప్పటి నుండి ఆ భక్తుడి చుట్టూ కాచి ఉంటాడు. నిలబడమంటే నిలబడతాడు. ఆదుకుందామని వచ్చిన కృష్ణుడు,

పుండరీకుడు 'అమ్మానాన్నల సేవ చేసుకు వస్తానుండు' అంటే అలా నిలబడి పోయాడట. అదీ పండరీపురం. అంతటి వాడు వస్తే వీడు ఆగమనడం, వాడు ఆగడం అది ఆయనకి సరదా!  ఒంగోమంటే ఒంగుంటాడు. కూర్చోమంటే కూర్చుంటాడు. వీడు తన భక్తి చేత తనను కట్టేసుకున్నాడని వాడు ఏం చెయ్యమంటే అది చేస్తూంటాడు. భగవంతుడు మిగతా వాళ్ళకి దొరికినట్లుగా ఉంటాడు కానీ దొరకడు. భక్తులకి మాత్రం పూర్తిగా దొరికిపోతాడు. అదీ ఈ ధనం! ఆ ధనం చేత జయింపబడేవాడూ, ఆ ధనాన్ని ఇచ్చేవాడూ కూడా వాడే.

## 688, 689, 690, 691 బ్రహ్మణ్యః, బ్రహ్మకృత్, బ్రహ్మా, బ్రహ్మ

బ్రహ్మ శబ్దానికి సంబంధించినటువంటి శ్లోకం ఇది. ఇందులో బ్రహ్మ కనిపిస్తాడు, బ్రహ్మమూ కనిపిస్తాడు. మన వాఙ్మయములో బ్రహ్మము అంటే నిరాకారమైన, అవ్యక్తమైన, అనిర్వచనీయమైన తత్త్వాన్ని 'బ్రహ్మము' అని పిలుస్తారు. అతను సృష్టికి వెలుపలా లోపలా ఉండే దేవుడు. అతని నుంచి వ్యక్తమైనటువంటివాడే చతుర్ముఖ బ్రహ్మ. చతుర్ముఖ బ్రహ్మ ఎవరి నుండో వ్యక్తం అయ్యాడో, అతనెట్లా ఉంటాడో ఎవరికీ తెలియదు. అతనెట్లా ఉంటాడో చూద్దామని బ్రహ్మ కూడా చాలా ప్రయత్నం చేసి, తనయందు తన వలే ఉన్నాడు తప్ప, మొత్తం తెలియటం అనేది వీలుపడదు అనే భావం చేత, తనయందు తన వలె గోచరిస్తున్న ఆ తత్త్వాన్ని అనుసరించి సృష్టి నిర్మాణం చేస్తాడు. అందుకని 'బ్రహ్మము' అని చెప్పినప్పుడు సృష్టికర్త అయిన బ్రహ్మ ఎవరి నుండి ఉద్భవించాడో ఆ తత్త్వం! బ్రహ్మ అంటే చతుర్ముఖ బ్రహ్మ. వీళ్ళిద్దరి గురించి ఇక్కడ ఉన్నదన్నమాట. బ్రహ్మమూ భగవత్తత్త్వమే, బ్రహ్మగా వ్యక్తమైన వాడు కూడా భగవత్తత్త్వమే. అందుకని వీళ్ళిద్దరి ఆ బ్రహ్మత్వాన్ని పొందినటువంటివాళ్ళు కూడా బ్రహ్మలే. ఎందుకంటే బ్రహ్మ తన యందు బ్రహ్మమును కలిగి ఉన్నాడు. బ్రహ్మము ఆధారంగా బ్రహ్మ ఏర్పడ్డాడు. బ్రహ్మము ఇట్లా ఉంటుందని చెప్పడానికేం లేదు. దానికి పేరు లేదు. దానికి రూపం లేదు. దానికి లక్షణం లేదు. దాన్ని నిర్వచించడానికి వీల్లేదు. దాని గురించి తర్కించడానికి వీలులేదు. తర్కించాలంటే అందులోంచి బయటకు వచ్చి ఉండాలి. అందులోకి వెళ్ళిపోతే 'అది' అయిపోవడం వల్ల అదేమిటో తెలియదు. అందులోంచి బయటికొస్తే మొత్తంలోంచి ఒకడుగా బయటికొచ్చిన వాడికి మొత్తం తెలియదు. అందుకని తనయందు తనవలె ఉన్నది అని తెలుస్తుంది. బ్రహ్మ దీని గురించి చేసిన విచికిత్స అంతా మనకు భాగవతం ద్వితీయ స్కంధంలో బాగా ఇచ్చారు మాస్టరు గారు. అది మనం చదువుకుంటే చక్కగా అవగాహన అవుతుంది. మనకి అవగాహన అయ్యే పద్ధతిలోనే మాస్టరు గారు ఇచ్చారు కాబట్టి దానికి ప్రయత్నం చేయండి. తానంటూ ఒకడున్నాడని తెలిసిన తర్వాత తానెక్కడ నుంచి వచ్చాడో తెలియడానికి ప్రయత్నం చేస్తాడు బ్రహ్మగారు. మనం కూడా అంతే ప్రతి ఉదయమూ బృహ్మణము చేయబడ్డాం. ఎక్కడనుంచి లేచాం? మనకి తెలియదుగా! మొత్తంలోంచి ఎక్కడి నుంచి మనం లేచామో మనకు తెలియదు. నిద్ర లేవడం అనేది మనం చాలా కాకతాళీయంగా తీసుకుంటున్నాం. బ్రహ్మము నుంచి బ్రహ్మ ఎట్లా ఉద్భవించాడో, మనం ప్రతి ఉదయం అట్లా ఉద్భవిస్తూ వుంటాం. ప్రతి రాత్రి నిద్రలో లయిమయిపోతూ ఉంటాం. ఎక్కడికి వెళ్తున్నాం నిద్రలో? ఎక్కడ నుంచి వస్తున్నాం నిద్రలోంచి? ఈ రహస్యం మనకి తెలియడం కోసమే రకరకాల సాధనలు యోగపరంగా చేస్తూ వుంటారు బ్రహ్మ కూడా ఆ విధంగానే వ్యక్తం అవగానే తానున్నానని తెలుస్తుంది. మనకి మనం ఉన్నామని తెలుస్తుంది. తానిట్లా ఎక్కడ నుండి మేల్కాంచాడో చూడాలని ప్రయత్నం చేశాడు. అదే మనం కూడా చేయాలి. అసలు తనెవరనే ప్రశ్న పుట్టింది. మనక్కూడా ఆ ప్రశ్న పుట్టాలి. తనెందుకు, ఎక్కడ

నుండి మేల్కొంచాడు? అనే దాని మీద మనసు లగ్నం చేసేశాడు. ఆ తరువాత ఏం చేయాలి అనే విషయం మీద మనసు లగ్నం చేశాడు. మొదటి రెండు ప్రశ్నలకి సమాధానం దొరకలేదు కానీ, మూడవ ప్రశ్నకు సమాధానం దొరికింది. ఏం చేయాలి అంటే తపస్సు చెయ్యి అని. తద్వారా మొదటి రెండు ప్రశ్నలకు సమాధానం దొరుకుతుందని. అలా మనం కూడా రోజూ వేసుకోవచ్చు. మనమూ బ్రహ్మలమే ఒకరకంగా. మన యందు బ్రహ్మము ఉండడం ఉన్నది. బ్రహ్మము ఉండడం చేత బృహ్మణము చేయబడుతున్నాం. ఇక్కడ బ్రహ్మణ్యో మొదటి నామము. బ్రహ్మణ్యో అంటే 'బ్రహ్మను కోరిన వాడు' అని అర్థం. ఆయన కోరడం చేత ఈయన ఏర్పడ్డాడు. ఆయన కోరకపోతే ఈయన ఏర్పడడు. తన నుండి ఒక బ్రహ్మ ఉత్పత్తి అవ్వాలి అని కోరుకున్నాడు. బ్రహ్మ ఏర్పడ్డాడు. ఎందుకు కోరాడు అంటే సృష్టి చేయడానికి కోరాడు. అతడిని ఒకడ్ని పట్టుకుని అతడి ఆధారంగా సృష్టి చేద్దామని. మనం కూడా లేచిన తర్వాత మన సృష్టికి మనం కోరతాం. ఆ పని చేద్దాం ఈ పని చేద్దాం అని అంటూ మనలోంచి బృహ్మణం జరిగిన తర్వాత అది ఆధారంగా పనిచేస్తూ ఉంటాం. సింహాచలం వెళ్దాం అనిపించిందనుకోండి అదొక బృహ్మణం. అంటే దాన్ని నిర్వర్తించాలి కదా! ఎవడి నుంచి వచ్చిందో వాడే దాంట్లోకి దూరి నిర్వర్తించుకుంటాడు. అందుకని బ్రహ్మణ్యో అన్నప్పుడు బ్రహ్మను కోరిన వాడు. ఎందుకోసం? సృష్టి కోసం. బ్రహ్మకృత్-కోరితే సరిపోయిందా? బ్రహ్మని తయారుచేశాడు. బ్రహ్మణ్య అంటే బ్రహ్మను కోరినటువంటివాడు. బ్రహ్మ ఎవరూ? అతడే! అందుకని బ్రహ్మ! అతడే బ్రహ్మ! బ్రహ్మ వేరే ఎక్కడి నుంచి వస్తాడు? అతడు కాకుండా రావడానికి వీల్లేదు. అతడే స్థితి మార్పు చెందాడు. మనకి ఎప్పుడూ చెప్పకునే ఉదాహరణ సముద్రమే అలగా స్థితి మార్పు చెందింది అంటాంగా! అట్లాగే బ్రహ్మము బ్రహ్మగా స్థితి మార్పు చెందాడు. అంత మాత్రం చేత బ్రహ్మ-బ్రహ్మము కాకపోలేదు. మూల పదార్థం బ్రహ్మ! గోధుమపిండి బ్రహ్మము అయితే అందులోంచి ఏర్పడినటువంటి పూరి బ్రహ్మగారు. పూరి రాదుగా గోధుమపిండి లేకపోతే. కాబట్టి పూరి గోధుమపిండేనా? గోధుమ పిండే స్థితి మార్పు చెందింది. కాబట్టి స్థితి మార్పు చెందినటువంటి బ్రహ్మమే-బ్రహ్మ అని చెప్తున్నారు. బ్రహ్మము నాలుగవ నామంగా వస్తుంది శ్లోకంలో. ఛందోబద్ధంగా పెట్టడానికి నాలుగవ నామంగా బ్రహ్మణ్యో, బ్రహ్మకృత్, బ్రహ్మ, బ్రహ్మ అంటారు మళ్ళీ. ఆ బ్రహ్మమో- బ్రహ్మము. ఆ బ్రహ్మము ఏం చేశాడంటే ఒక బ్రహ్మను కోరాడు. ఒక బ్రహ్మను తయారు చేశాడు. బ్రహ్మగా తానే తయారయ్యాడు. మనలో ఈ పనెప్పుడూ జరుగుతూ ఉంటుంది. ప్రతినిత్యం, లేవకముందు, మనం లేచినా లేవకపోయినా మనలో ఉన్నటువంటి తత్త్వం ఉందే అది బ్రహ్మము. అది ఒకటే అందరిలోనూ. 'బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే' అని పాడుకుంటాం కదా! అదొకటే అందరిలోనూ. లేచేసరికి బ్రహ్మలు లేచారు. ఓహో ఎంతమంది లేస్తారో! విశాఖపట్నంలోనే ఆరు లక్షల మంది బ్రహ్మలు లేస్తారు పొద్దున్నే. ఎవరి సృష్టి వాడిది. కానీ సృష్టి చేసినటువంటి బ్రహ్మ, బ్రహ్మముతో అనుసంధానము చెంది చేస్తాడు. కాబట్టి బ్రహ్మకి బ్రహ్మము యొక్క అనుభూతి అనుస్యూతంగా ఉంటుంది. మనం కూడా ఆ విధంగా చేసుకోవాలి. కాకపోతే మనదైన ఒక సృష్టి ఏర్పడుతుంది. దానికి కూడా ఆధారం అతనే అయినప్పటికీ కూడా

అందులోంచి వచ్చే చిక్కులు మనవి అవుతాయి. బ్రహ్మగారు- బ్రహ్మము నుండి బయటికి వచ్చిన తర్వాత ఏం చెయ్యాలి అంటే సృష్టి చేయమని తెలిసింది తపస్సు చేస్తే. సృష్టి చేయమని బ్రహ్మము నుంచి వినిపించినది కాబట్టి ఎలా చేయాలో ఆ జ్ఞానం కూడా బ్రహ్మము దగ్గర నుండే పొంది, తదనుగుణంగా ఆయన సృష్టి చేసుకుంటూ వెళ్ళాడు. కాబట్టి సృష్టిలో ఆయన సంసారం పెంచుకోలా. మనం కూడా రోజూ లేచిన తర్వాత అట్లాగే ఎక్కడి నుంచి నిద్ర లేచామో ఆ బ్రహ్మము గారిని 'నాయనా ఇవాళ ఎందుకు నిద్ర లేపావు? నీదైన కార్యం నేను చేసేట్టుగా చూడమని కోరాలి. నీకోసం నేను నిద్ర లేవడంగా చూడు. నీకోసం నేను పనిచేయడంగా చూడు. నీకొరకే నేను జీవిస్తుండేట్లుగా చూడు. నీ అనుభూతి నాకు దక్కేట్లుగా చూడు' అని కోరుకోవాలి. ఏమిటేమిటో కోరుకుంటాం దైవపరంగా కూడా. అవ్యక్తంలోంచి వ్యక్తం అయిన తర్వాత బ్రహ్మ ఏం కోరాడో అది బాగా క్షుణ్ణంగా పరిశీలించుకుని అదే మనం కూడా కోరడం శ్రేయస్కరం. ఎందుకంటే బ్రహ్మ ఏ విధంగా అవ్యక్తం నుండి వ్యక్తంలోకి వచ్చాడో మనం కూడా ప్రతిరోజూ అట్లా వస్తూ ఉంటాం. దానివల్ల ఏం జరుగుతుందంటే మనం దారి తప్పకుండా ఉండడానికి అవకాశాలు ఉంటాయి. కాబట్టి బ్రహ్మమే కోరడం చేత, బ్రహ్మను తయారు చేసుకుని బ్రహ్మగా ఏర్పడ్డాడు అని చెప్పడం ఒక పాదం శ్లోకంలో. బ్రహ్మణ్యో-బ్రహ్మను కోరుట-కోరిన వాడు. మనల్ని కోరాడు దేవుడు. అందుకే తయారు చేసుకున్నాడు. మనం కోరటంలా పిల్లల్ని? కోరామా? కోరకుండానే నాకేం తెలియదు సార్ అంటే తంతారు. అబ్బెబ్బే నాకేం తెలియదంటే ఒప్పుకోరు. నువ్వు కోరడం చేత వచ్చారు కదా! అట్లా బ్రహ్మము కోరడం చేత బ్రహ్మ వచ్చాడు. బ్రహ్మము కోరడం చేతే ప్రతి జీవుడు వచ్చాడు. కోరబడినటువంటివాడు, ఎవరు కోరినవాడని, 'ఏమీ నీ కోరిక' అని కోరి ప్రవర్తించినటువంటి వాడు బ్రహ్మ. చూడండి అల్లావుద్దీన్ అద్భుతదీపం సృష్టి చేసిన వాడిని 'నరుడా ఏమి నీ కోరిక' అని అడుగుతాడు. కదా! ఎందుకంటే సృష్టించినవాడు అక్కడ నరుడు. అంతేగానీ సృష్టించంగానే వాడి దారిన వాడు పనులు చేసుకుంటుంటే? మనకి తేడా పడేది అక్కడ. ఏదో మనదయింది అక్కడ ఉన్నట్టుగా చేస్తూ ఉంటాం. బ్రహ్మ అట్లా చేయలేదు. అట్లా ఏర్పడేటువంటి బ్రహ్మ కూడా వాడే. కాబట్టి బ్రహ్మము- బ్రహ్మగానూ, బ్రహ్మను తయారు చేసినవాడుగానూ, బ్రహ్మమును కోరినవాడుగానూ ఉన్నాడు అని చెప్పడానికి ఈ నాలుగు నామాలు. బ్రహ్మణ్యః-అంటే బ్రహ్మను కోరిన వాడు, బ్రహ్మకృత్-బ్రహ్మను తయారుచేసినటువంటి వాడు, బ్రహ్మ-బ్రహ్మగా ఉన్నటువంటి వాడు ఎవరయ్యా అంటే 'బ్రహ్మ' బ్రహ్మము అని చెప్తారు. తరువాతి నామం బ్రహ్మవివర్ధనః.

## 692 బ్రహ్మవివర్ధనః

బ్రహ్మమును గూర్చి తెలిపేటి వాడివి కూడా నువ్వే అని చెప్తున్నాడు. బ్రహ్మమును గురించి వివరణం చేసే వాళ్ళు ఉంటారే వాళ్ళందరూ అతడే. ఆ రూపాల్లో వచ్చి జీవులు మరచిపోకుండా దాన్ని వివరించుకుంటూ ఉంటాడు. ఉపనిషత్తులన్నీ అట్లాగే తెప్పించాడు. వేదాలన్నీ అట్లాగే తెప్పించాడు. పురాణాలన్నీ అట్లాగే పట్టుకొచ్చాడు. ఎందుకు పట్టుకొచ్చాడంటే మళ్ళీ తిరుగుదారి జీవులకి తెలియాలి కదా అనే అపారమైన కరుణతో! వెళ్ళడమే తెలుసు తప్ప తిరిగి రావడం తెలియకుండా అయిపోతారేమో, పాడైపోతారేమో తనలోంచి పుట్టుకొచ్చిన వాళ్ళందరూ అని, వాళ్ళందరికీ దారి ఉండాలని చెప్పి బ్రహ్మవర్ధనుడుగా తానే దిగి వచ్చాడు. ఎంతోమంది వచ్చారు. వారినే మనం గురువులుగా పూజించుకుంటూ ఉంటాం. మహాత్ములుగా పూజించుకుంటూ ఉంటాం ఎందుకని? వాళ్ళు బ్రహ్మమును గూర్చి వివరిస్తారు గనక. బ్రహ్మమును గూర్చి వివరించేవాడే 'సద్గురువు' అని చెప్తారు. ఏదో ఒక నామానికి, ఒక రూపానికి తన దగ్గర విద్యను అభ్యసించడానికి వచ్చిన వాళ్ళని బద్ధం చేసేటి వాడు సద్గురువు అవడు. అసలీ మొత్తానికీ ఎవరు ఆధారమో అతడి వైపు దారి చూపించే వాడే సద్గురువు అవుతాడు. అటువంటి సద్గురువు రూపంలో ఉన్నది కూడా అతడే! బ్రహ్మమే! అందుకని బ్రహ్మవివర్ధనః - బ్రహ్మమును వివరించుకునేటువంటి వాడివి కూడా నీవే!

## 693 బ్రహ్మవిత్

బ్రహ్మమును తెలిసినవాడు. బ్రహ్మాన్ని వివరించేవాడే అతడైనపుడు బ్రహ్మమును తెలిసినవాడు కూడా అతడే అయి ఉండాలి. తెలియకపోతే ఎట్లా వివరిస్తాడు! అందుకని బ్రహ్మవిత్ అంటే బ్రహ్మము తెలిసినటువంటి వాళ్ళు బ్రహ్మవేత్తలు. బ్రహ్మవిత్ పదమే బ్రహ్మవేత్త అయ్యింది. బ్రహ్మవేత్తల రూపం లో ఉన్నది కూడా బ్రహ్మమే! అందుకని బ్రహ్మవేత్త కనిపిస్తే సాక్షాత్తు పరమాత్మే అక్కడ ఈ రూపంలో నిలిచి ఉన్నాడని నమస్కారం చేసుకునే సాంప్రదాయం మనది. బ్రహ్మమును గురించి వివరించిన వాడిని భగవంతుడిగా దర్శనం చేయడం, బ్రహ్మమును గురించి వివరించినా, వివరించక పోయినా బ్రహ్మజ్ఞానం కలిగినటువంటి వాడిని భగవంతునిగా ఆరాధన చేసుకోవడం, వాళ్ళందరి రూపాలలో ఈయనే ఉన్నాడని మనకి చెప్తున్నాడు భీష్ముడు.

## 694 బ్రాహ్మణః

బ్రాహ్మణులు అంటే బ్రహ్మమునందు నిరంతరమూ జీవించేవాళ్ళు. అదీ బ్రాహ్మణ శబ్దానికి అర్థం. బ్రహ్మము ఆధారంగా బ్రహ్మములోనే తన సమస్త జీవితాన్ని నిర్వర్తించుకుంటూ ఉంటాడు. ఇంక మిగతా ఆధారాలు పెట్టుకోడు. ఏసుక్రీస్తు అంతటివాడు ఈ మాట అన్నాడు. కాబట్టి బ్రాహ్మణుడనుకోవాలి. 'మనం అతని యందు పుట్టాం, అతని యందు పెరుగుతున్నాం, అతని యందు జీవిస్తున్నాం, అతనియందు తిరుగుతున్నాం. అసలు మనం ఉండడం అంటే అతనుండడమే!' అంటాడు. ఇంక ఇంతకన్నా ఏం చెప్పాలి? We live, we move, we have our being in Him అని చెప్తాడు. అతనినే The Father అని చెప్పాడు English లో. English లో మాట్లాడలా ఏసుక్రీస్తు తెలుసా? ఏ భాషలో మాట్లాడాడు? సంస్కృతంలోనా? Hebrew భాషలో మాట్లాడాడు. 'అతడే నేనుగా ఉన్నాను. అతడియందే నేను జీవిస్తున్నాను. అతడి కొరకే జీవిస్తున్నాను. అతడి యందే చరిస్తున్నాను' ఇట్లా బ్రహ్మ గురించి పరిపూర్ణముగా అవగాహన అయిన వాళ్ళు మాత్రమే చెప్పగలరు. అందుకని బ్రాహ్మణః-బ్రహ్మమునందు నిరంతరము జీవించేవాడు. వాళ్ళు బ్రాహ్మణులు. అలా జీవించే వాళ్ళ నుండి పుట్టుకొచ్చిన వాళ్ళు మళ్ళీ అట్లా జీవిస్తేనే బ్రాహ్మణులు. అందుకని మనకి పెద్దలు చెప్పిన బ్రాహ్మణత్వం వేరు, కులంగా ఏర్పడ్డ బ్రాహ్మణత్వం వేరు. కాకపోతే అందులోంచి పుట్టిన వాడు అట్లా ఉండడానికి అవకాశం ఎక్కువ ఉంటుంది. అలా ఉన్నాడో లేడో దాన్నిబట్టే వాడు బ్రాహ్మణుడు అవుతాడు. లేకపోతే కేవలము బ్రాహ్మణాకృతి అవుతాడు. రూపముచేత బ్రాహ్మణుడు తప్ప స్వభావముచేత బ్రాహ్మణుడు కాడు. బ్రహ్మమునందు జీవిస్తూ బ్రాహ్మణుడుగా కులంచేత గుర్తింపు కానటువంటి వారు చాలామంది ఉన్నారు. అందుకనే మహాభారతంలో వేదవ్యాసుడు ఈ ప్రశ్నకు చక్కగా సమాధానం చెప్పించేశాడు నహుష ప్రశ్నలలో. 'కులం చేత బ్రాహ్మణుడు కాకపోయినా ఒక జీవుడు ఎప్పుడూ బ్రహ్మమునందే జీవిస్తే, అతడిని బ్రాహ్మణుడిగా గుర్తిస్తావా? గుర్తించవా' అని ప్రశ్న. అంటే ధర్మరాజు 'బ్రాహ్మణుడే స్వభావంచేత ' అని చెప్తాడు. దానికి మనకి భగవద్గీతలో గుణము, కర్మము దీని చేత ఈ నాలుగు వర్ణాలు యొక్క విభాగమున్నది తప్ప మరియొక పద్ధతిగా లేదు అని చెప్పాడు. అంటే వాడి గుణం ఏమిటి? వాడు చేసేటువంటి కర్మ ఏమిటి? బ్రాహ్మణుడుట వ్యాపారం చేస్తున్నాడుట అంటే వైశ్యుడు అని అర్థం అంతే. క్షత్రియుడుట పరతత్త్వంతో బాగా అనుసంధానం చేసి, వందల సంవత్సరాలు తపస్సు చేస్తున్నాడట అంటే బ్రాహ్మణుడు అని అర్థము. దేవాపి ఆ విధంగా బ్రాహ్మణుడయ్యాడు క్షత్రియవంశంలో పుట్టి. విశ్వామిత్రుడు ఆ విధంగా బ్రాహ్మణుడయ్యాడు. అందుకని ఇవి water-tight compartments కావు గుణం చేత అవుతుంది అని చెప్పారు. అందరి శ్రేయస్సు కోసము జీవించేటువంటి వాడు లోకహితుడైతే బ్రాహ్మణుడు అవుతాడు. వ్యాపారం చేస్తున్నాడు-అదొకటి, తనలో సహజంగానే రక్షణ గుణం బాగా ఉందిట-తద్వారా క్షత్రియుడు. ఇతరులకు పని చేసిపెట్టేటువంటి స్వభావం ఉందిట, స్వంతంగా ఏమీ

సృజనాత్మక శక్తి లేదు, ఎవరైనా పని అప్పజెప్తే చెప్పిన పని చెప్పినట్టుగా చేస్తారుట- వాళ్ళు నాలుగు. ఇలా నాలుగు వర్ణాలు చెప్పారు. సృజనాత్మకశక్తి లేని వాళ్ళందరూ అంతే. ఈ విధంగా మనకి విభాగం ఉంది కాబట్టి ఇక్కడ బ్రాహ్మణః-అంటే బ్రహ్మ నందు జీవిస్తున్న వాడివి నీవే. షిరిడి సాయిబాబా తురకవాడైయుండవచ్చు, ఆయన సూఫీ మార్గానికి చెందిన వాడని కొంతమంది అంటారు. ఎవరైతే ఏమీ? ఆయన నేర్పింది బ్రహ్మతత్త్వమే! ఆయన జీవించింది బ్రహ్మంలోనే! కాబట్టి బ్రహ్మమే! భగవత్తత్త్వమే! ప్రపంచంలో మనకి ఇంకా బ్రాహ్మణులు గోచరిస్తారు. Pythagoras అనే ఒక గురువుగారు బ్రాహ్మణుడే. అలా చాలామంది భగవతత్త్వాన్ని తెలిసి దానియందే జీవిస్తున్న వాళ్ళు ఉంటారు. వాళ్ళు గోచరించినప్పుడు ఇక్కడ దైవము ఈ విధంగా గోచరిస్తున్నాడని మనం భావన చేసుకోవడం సాధన పరంగా సత్యం. అలా కనబడుతున్న వాళ్ళంతా నీవే అని చెప్తున్నారు. అందుకనే శ్రీకృష్ణుడంతటివాడు బ్రహ్మవేత్తలు వస్తే, బ్రహ్మవివర్ధనులు వస్తే, బ్రాహ్మణులు వస్తే వాళ్ళకి పాదనమస్కారం చేసేవాడు. ఎందుకనీ? బ్రహ్మమే కాబట్టి! అలా కాకుండా అహంకారంగా ఉండే బ్రాహ్మణులు వస్తే నమస్కారం చేయలా. అందరికీ నమస్కారం చేయలేదు. బ్రహ్మము తెలిసినవాడికి నమస్కారం చేశాడు.

## 695 బ్రహ్మీ

బ్రహ్మీ అంటే తన పుత్రుడిగా బ్రహ్మమును పొందినవాడు. బ్రహ్మ అంటే బ్రహ్మ కలిగిన వాడని. బ్రహ్మ తన కుమారుడుగా కలిగినటువంటి వాడిని బ్రాహ్మీ అంటారు. బ్రాహ్మీముహూర్తం అంటామే దాని అర్థం ఏమిటయ్యా అంటే ఆ సమయంలో మనం బ్రహ్మత్వాన్ని పొందవచ్చు. అందిస్తుంది అది. బ్రాహ్మీ అంటే బ్రహ్మను అందించేటువంటిది. అంటే ఏవిధంగా మనం జీవిస్తే బావుంటుందో దానికి సంబంధించినటువంటి తలపులు మనయందు బృహ్మణత్వం చెందుతాయి.

## 696 బ్రహ్మజ్ఞః

బ్రహ్మము తానే అని తెలిసినవాడు. 'అహం బ్రహ్మాస్మి' అంటారు మనవాళ్ళు. తానే బ్రహ్మము అని తెలిసినటువంటి వాడు. అంటే బ్రహ్మను వివరించేవాళ్ళు, బ్రహ్మ తెలిసినటువంటివాళ్ళు, బ్రహ్మములో జీవించేటువంటి వాళ్ళు, బ్రహ్మను పొందినవాళ్ళు, తానే బ్రహ్మ అని తెలిసి నటువంటివాళ్ళు. తానే బ్రహ్మ అని తెలిసినటువంటి వాడు ఎట్లా ఉంటాడంటే ఇంక ఏ మెరమెర ఉండదు. ఏ ఆరాటం ఉండదు. తన గురించి ఒకళ్ళకి తెలియాలని కూడా ఉండదు. తను లేడుగా! వాడే ఉన్నాడు. వాడు అందరిలోనూ ఉన్నాడు. వాడే చెప్పకుంటాడు అందరికీ. నువ్వెవరివి? చెప్పడానికి అన్నట్టుగా ఉంటుంది. నిన్ను చెప్పమంటే చెప్పు. లేకపోతే అట్లా ఉండు. వీలున్నంతవరకూ తెలియకుండా ఉండు. ఒక పొర వేసుకుని గూఢంగా ఉండు. అందుకని బ్రహ్మజ్ఞుడిని తెలుసుకోవడం అంత సులభం కాదు. బ్రహ్మజ్ఞుడనేటువంటి బాగా పేరు పొందిన వాళ్ళ కన్నా ఎక్కువగా, తెలిసినటువంటి వాళ్ళు జాతికి తెలియకయే ఉంటారు. వాళ్ళు బ్రహ్మలో ఉండడం తప్ప ఇంకొకటి పెట్టుకోరు.

# 697 బ్రాహ్మణప్రియః

బ్రాహ్మణులచే ప్రేమించబడేవాడు. బ్రాహ్మణులను ప్రేమించేటువంటి వాడు. అది సంస్కృతం యొక్క అద్భుతం. బ్రాహ్మణప్రియ అంటే బ్రాహ్మణులను ఆయన ప్రేమిస్తాడట. బ్రాహ్మణులు ఆయన్ని ప్రేమిస్తారు. నీలో ఆ బ్రహ్మమును దర్శనం చేయడం అంటే, నిన్ను నువ్వు ఎలా ఉన్నావో, బాగా దానిమీద మనసు పెడుతూ, అసలు ఉండడం అంటే ఏమిటి? నేనున్నాను అనేది కూడా ఒక భావమే కదా! నేనున్నాను అనే భావం కూడా కరిగిపోయి నువ్వుంటే అప్పుడు బ్రహ్మము ఉండడం అంటే ఏమిటో తెలుస్తుంది. బ్రహ్మము ఉండి అందులో నేనున్నాను అని తెలిసి ఉంటే దేవుడు-జీవుడు ఉంటారు. ఈ నేను- అది ఆధారంగా ఉంది కాబట్టి, ఉన్నది అదే- నేనుగా ఉంది. 'అదే నేనుగా ఉంది అదే నేనుగా ఉంది' అని అనుకోవటమే 'సోహం'. అందుకని 'సోహం' మంత్రం బ్రహ్మజ్ఞానానికి దారి. 'సః అహం అస్మి' అతడే నేనుగా ఉన్నాను. అతడే నేనుగా ఉన్నాను. అతడే సమస్తముగా ఉన్నది. సమస్తముగా ఉన్న అతడే నాయందు నేనుగా ఉన్నాడు. నేను లేను ఉన్నది 'ఆయనే'. నేను ఉన్నాను అనుకుంటూ ఇన్ని పనులు చేస్తున్నాను. నిజానికి ఉన్నది 'ఆయన'. ఇట్లా దానిమీద భావన చేసుకుంటూ చేసుకుంటూ అట్లా కళ్ళు మూసుకుని మంచం మీద పడుకున్నామనుకోండి, ఇంకా నిద్ర పట్టలేదనుకోండి, నేనున్నాను అని భావన తప్ప మిగతా భావములేవీ లేవనుకోండి, ఈ నేను ఉన్నాను అనే భావం 'అల'. అసలు ఉండడం అనేటువంటిది 'సముద్రం'. ఈ అల ఆ సముద్రంలో కలిసిపోయిందనుకోండి, అప్పుడాభావం కూడా కరిగిపోతుంది. ఏదీ? ఉండడమే ఉంటుంది తప్ప నేనున్నాను అనేటువంటి భావం ఉండదు. చాలా అద్భుతంగా మాస్టరు గారు ఇచ్చారు. సాధన చేసుకోవచ్చు. ఏడవ అధ్యాయంలో ఇచ్చారు. నేనున్నాను అనే భావన ఆధారంగా ఇహ మిగతా భావాలన్నీ మనం అల్లుకుంటున్నాం. నేనున్నాను కాబట్టి నా ఇల్లు, నా పెళ్ళాం, నా పిల్లలు, నా ఉద్యోగం, నా డబ్బు ఇవన్నీ నేనున్నాను అనే ఒక మూలసూత్రం మీద ఆధారపడి నిర్మాణం చేసినవి. పునాదిరాయి. అసలు ఆ రాయి తీసేస్తే, ఉన్నది అతడే అని తెలిసినపుడు, ఏ భావం ఆధారంగా మిగతావన్నీ నిర్మాణం చేశామో అదంతా అదృశ్యమైపోతుంది. అదృశ్యమైపోయి ఉండడమే ఉంటుంది తప్ప భావన ఉండదు అంటారు. ఉండడమే తప్ప భావన లేని స్థితి 'సమాధి'! ఉండి అతడే ఉన్నాడు, నేనుగా కూడా అతడే ఉన్నాడు, ఇంకేమీ లేదు అని తెలిసినటువంటి స్థితి 'ధ్యానం'! నేనున్నాను-అతడు నేనుగా ఉన్నాను అని అతడూ, నేను గా ఉన్న స్థితిలో 'ధారణ' ఉంటుంది ఇహ అక్కడ నుండి దేవుడు గురించి మనకి ఎంత అద్భుతమైన రకరకాల భావాలు జరుగుతున్నా అవన్నీ కూడా భావాలే. అందుకని తాను ఉండడంచేత ఈ సమస్తమైన సంపద తనకి ఏర్పడి ఉన్నది. కాబట్టి తాను తానుగా ఉండి సమస్తాన్ని దమించి ఉన్నవాడు ధనంజయుడు అంటారు. అన్నీ పోయినా తానుంటాడు కాబట్టి తాను స్వామిత్వం వహించి తనకున్నది తనది అనేది అంతా, తనది అనే మొత్తం మీద తనకి సామిత్వం ఉంటే అతడు ధనంజయుడు. ఇప్పుడు మనం ధ్యానంలో

చేసిందేమిటయ్యా అంటే నేనంటే నా పేరు కాదు. నేనంటే నా స్థితిగతులు కావు. నేనంటే ఏ దేశం వాడు, ఏ కులం వాడు ఇవేవీ కాదు. నేను జీవుడిగా దేవుని యొక్క ప్రతీకను. ప్రతిబింబమును. దైవము సమస్తము. సమస్తముతో నేను అనుసంధానం చెందుతున్నాను అనేది భావన చేయడం 'ధ్యానం' అవుతుంది. ఈ విధంగా ధ్యానం చేసుకుంటూ ఉంటే భ్రమరకీటక న్యాయంగా, ఓ పెద్ద వెలుగు ఓ చిన్న కన్నం లోంచి మన మీద పడుతూ ఉంటే అక్కడ మనం కూర్చునుంటే, ఈ చీకటి కొట్టులో కూర్చున్న వాళ్ళం ఆ వెలుగు గొట్టం ఆధారంగా అందులో కలిసి పోవడం అనేది ఓ పద్ధతి, ఓ ధ్యాన మార్గం. అలా చేసుకుంటే అందులో మనం మిళితం అయినప్పుడు మనకి ఇవన్నీ అనుభూతిపరంగా తెలుసుకోవడానికి అవకాశం ఎక్కువ ఏర్పడుతుంది. అంతవరకూ గ్రంథపరంగా తెలుస్తూ ఉంటుంది. అందుకని తెలిసినటువంటి వాళ్ళంటే ఆయనకిష్టం. 'బ్రాహ్మణప్రియః' వాళ్ళకి కూడా ఆయనే ఇష్టం. ఇంకేదీ ఇష్టం కాదు. బ్రహ్మము తప్ప మిగతా విషయములయందు ఎక్కువ రుచి లేనివారు అంటే బ్రహ్మముతో 'గురించి' రుచి ఉన్నది. ఆ రుచికి మించిన రుచి ఇంకేం లేదు. అదే రుచి. బ్రాహ్మణులు ఆ విధంగా ఆయన యందు ప్రేమ కలిగి ఉంటారుట. ఆయన అటువంటి వాళ్ళ యందు అంత ప్రీతి కలిగి ఉంటాడుట. అదీ బ్రాహ్మణప్రియ అనేటి నామానికి అర్థం. ఇదీ ఈ శ్లోకం. ఇందులో మన్ని బ్రహ్మలుగా మనం పాత్రపోషణ చేసుకోవచ్చు. మనం ఇట్లా ఉండడానికి, మనం నిద్రలేవడానికి, మనం నిద్రపోవడానికి, మనం తిన్నది అరగడానికి, మనం చూద్దాం అనుకుంటే మనలోంచి చూసే శక్తిగా పనిచేయించడానికి, వెళ్ళడానికి, స్పర్శజ్ఞానం కలగడానికి, వాసన కలగడానికి, ఆలోచన కలగడానికి, అన్నిటికీ ఒకటి ఆధారంగా ఉంది. అది మనలోనే ఉన్న 'బ్రహ్మం'! అది ఆధారంగా మనం 'బృహ్మణం' చేస్తున్నాం. అది లేకపోతే ఈ బృహ్మణం చేయడానికి ఏం లేదు. అది ఉంది. దానిమీద మనం లేచాం. అక్కడ నుండి పుట్టిన వాళ్ళం. అందుకని మనం అతని కుమారులని చెప్తారు. ఈ లేచిన వాడు ఇహ బయటికి పరిగెత్తే లోపల ఈ లోపలికెళ్ళిపోతే సరిపోతుంది. 'బ్రహ్మకుమారి'లు అట్లాగే పెట్టుకున్నారు. ఆ విధంగా మనం అంతా కూడా ఆ బ్రహ్మము యొక్క సంతతే! క్రీస్తు మతస్తులు దైవకుమారుడన్నారు. మనవాళ్ళు బ్రాహ్మణులు అన్నారు. పేర్లు వేరు తప్ప స్థితి అదే. ఒకటే స్థితి. ఏమిటయ్యా స్థితి అంటే ఆ తత్త్వము నుండి మేల్కాంచిన వాళ్ళం, దానికి సంబంధించిన వాళ్ళం, అది ఆధారంగా బయటికి చూస్తున్నాం. బయటికి చూస్తే పశువు అవుతాడట. భలే రాశారు మాస్టారు పురజనోపాఖ్యానంలో. పశువంటే అర్థం ఇచ్చారు. పశువు అనేది ఎవరయ్యా అంటే లోపల నుండి బయటికి చూస్తూ ఉంటాడుట. మనం అంతా అదేగా చేస్తాం. రోడ్డుమీద ఏం వుంది? అక్కడేం ఉంది? ఇక్కడేం ఉంది? అన్నీ బయటికి చూసేది పశువే. 'పశ్యతి' అనే శబ్దం నుండి పుట్టుకొచ్చింది పశువు. బంధింపబడి ఉన్నది అనే ఇంకో భావం ఉన్నది. కాబట్టి లోపల నుండి బయటికి చూసేదల్లా పశువే, అన్నారు. మరి మనం మానవులం/నరులం ఎప్పుడవుతామంటే, లోపలికి చూడ్డం తెలుసుకుని లోపల చూడగలిగితే! అంతవరకు పశువుగా ఉంటాం. ఇదే లోపలికి చూసి లోపలే మనకి, అసలు మనం ఉండడానికి ఆధారంగా ఉండేది దర్శనం చేశాం అనుకోండి అప్పుడు

బ్రాహ్మణులమవుతాము. అదే మొత్తంగా ఉందని తెలుస్తుంది. అదే అంతా అని తెలుస్తుంది. అదే అంతా నడిపిస్తోందని తెలుస్తుంది. నిన్ను కూడా అదే నడిపిస్తోంది. నిన్ను ఎందుకు నడిపిస్తుందో నీకు తెలిసి అట్లా నడుస్తూ ఉంటావు అంతే. వాళ్ళు భూమిసురులు, భూసురులు. భూమి మీద దేవతలు అని చెప్పారు. అంటే భూమి మీద తిరుగుతున్న దైవము. దీనికి మార్గం 'సోహం' మంత్రం, ఉచ్ఛ్వాస నిశ్వాసాలు అందుకుని లోపలికి పోవడం, స్పందనాన్ని పట్టుకోవడం, అక్కడ నుండి సూక్ష్మ స్పందనంలోకి వెళ్ళడం, ఆ సూక్ష్మస్పందనం పట్టుకుని అట్లా ఊర్ధ్వముఖంగా ఆజ్ఞలోకి వెళ్ళడం, అక్కడ ధారణ జరగడం, అక్కడ నుండి నేను ఈ సమస్తాన్నీ ధరించి ఉన్నానని తెలుస్తుంది. అప్పుడు ఇది లేకపోయినా నేనున్నానని తెలుస్తుంది. ఈ నేనుకి పెద్దనేను ఒకడున్నాడని తెలుస్తుంది. ఆ పెద్ద నేనుకి పోయి దీన్ని అంటిపెట్టుకున్న వాళ్ళం ఇది వదిలేసి, దాన్ని అంటిపెట్టుకుని ఉంటాం. అది ఆధారంగా మనం జీవిస్తున్నాం తప్ప ఇది ఆధారంగా జీవించి ఉండట్లేదని తెలుస్తుంది link పైన ఉంటుంది. కింద కాదు. Uprooted అంటాం. Uprooted అంటే అర్థం ఏమిటంటే పైన ఉంది root. Root భూమి లో downrooted కాకుండా uprooted అన్నమాట. ఇంకో అర్థం uprooted అంటే కింద నుంచి పీకారని. అది కూడా జరుగుతుంది. కింద లేడుగా వీడు. పైనుండి కిందకు ఉంటాడు. కింద నుండి పైకి ఉండడు. వాళ్ళే 'వాలఖిల్యులు'. వాళ్ళనలా భూమిమీదకి సూర్యకిరణాల ద్వారా పంపిస్తున్నా సరే వాళ్ళటే చూస్తూ కూర్చుంటారుట. తలకాయలు కిందకుంటాయి కాళ్ళు పైకుంటాయి. ఎందుకంటే అటు చూడాలని వాళ్ళు దిగొస్తున్నా కూడా. చూడండి వెంకటేశ్వరస్వామి గుడిలోకి వెళ్తుంటే వాడు పో పో పో అని తోసేస్తుంటే వెనక్కి తిరిగి వెళ్ళేప్పుడు నడ్డి చూపించకుండా మనం ఏం చేస్తాం అంటే అట్లా వెనక్కి నడుస్తూ ఉంటాం దేవుడిని చూస్తూ. అట్లా దిగివచ్చారట సూర్యలోకాలలోంచి భూలోకం వరకు వాలఖిల్యులు. అందుకని తలకిందులుగా వేళ్ళాడుతుంటారట చెట్ల మీద. ఎందుకంటే ఇట్లా వేళ్ళాడుతూ అట్లా చూస్తూ ఉంటారు దాన్ని. మనం అట్నుంచి ఇటు వేళ్ళాడుతుంటే భూమి కనిపిస్తుంది. వారికి భూమితో సంబంధం లేదు. ఎంతసేపూ అటే సంబంధం. బ్రాహ్మణుడికి కూడా పంచభూతాలతో సంబంధం లేదు. వీటన్నిటికీ పుట్టుక స్థానం అయినదానితో సంబంధం. అట్నించి ఇటు ఉంటాడు. అందుకని మనం చూసేదంతా అతడికి తలకిందులుగా కనిపిస్తుంది. అతడు చెప్పేదంతా మనకి తలకిందులుగా ఉంటుంది. ఏంటి బాపనాయన ఇట్లా చెప్తున్నాడు అనుకుంటాం. ఎందుకంటే మనది తలకిందులు. కానీ మనకిది అలవాటు పడిపోయి ఇదే correct అనుకుంటున్నాం. అతడికి మనం చూసేదంతా తలకిందులుగా ఉంటుంది. శీర్షాసనం వేసిన వాడు మనకి తలకిందులుగా నిలబడ్డాడు అనిపిస్తుంది. తలమీద నిలబడ్డాడు కదా! శీర్షాసనం వేసిన వాళ్ళకి మిగతా వాళ్ళందరూ కూడా ఏమిటో తలకిందులుగా ఉన్నట్టు ఉంటుంది. అట్లా ఆత్మతత్త్వంలో ఇమిడి ఈ స్థూలమైనతత్త్వం లోకి దిగి వచ్చే వాళ్ళకి, మన ఆలోచనలన్నీ తల్లకిందులుగా ఉంటాయి. అందుకని ఇవన్నీ మళ్ళీ reverse చేయాలి inversions అంటారు. మన ఆలోచనలన్నీ కూడా దిగుడు ఆలోచనలుగా ఉంటాయి. ఎగుడు ఆలోచనలు కావు. వాడివన్నీ ఎగుడు

ఆలోచనలుగా ఉంటాయి. అందుకని మనది తలకిందులు చేసుకుంటే ఎగుడౌతుందని. అది నేర్పడానికి వస్తూ ఉంటారు వాళ్ళు. వేళ్ళాడేసి ఉంచారు. అలాగే మనకి భారతంలో కూడా కథ ఉంది. తలకిందులుగా కట్టేసి తపస్సు చేసుకోమంటారు. మన వరకు మామూలుగా ఉండి ఈ ఉచ్ఛ్వాసనిశ్వాసలు పట్టుకుని ఆ లోపలికెళ్ళి, వాడిని ఆధారంగా చేసుకుని లోపల, సుషుమ్నలో వెలుగు స్తంభం ఉన్నది. దాన్ని ఆధారం చేసుకుంటే తలకిందులు కాస్తా reverse చేశారుట. శరీరం ఆధారం అనుకోకూడదు. అది ఆధారం అనుకోవాలి. మనం ఉండడానికి ఆధారం అది తప్ప ఇది కాదు. అది తెలిసినవాడు ఇటు వాటికి అది లేకపోతే ఎట్లా బతుకుతాం, ఇది లేకపోతే ఎట్లా బతుకుతాం అనుకోడు. ఎందుకంటే అసలు ఉండాల్సింది ఉంది కదా! అది ఉంది కాబట్టి మనకి తక్కువేమిటి అనుకుంటాడు. 'తక్కువేమి మనకూ రాముడు పక్కనుండు వరకు'. పక్కనేం? లోపలే ఉన్నాడు కదా! అందుకని అటు బాగా మొగ్గితే ఈ బ్రహ్మత్వం వైపు నడవడానికి వీలు పడుతుంది. బ్రహ్మత్వం వైపు నడిచిన వాడికి ఇహ సృష్టి సమస్యలేం ఉండవు. దానికి అనుసంధానం చెంది జీవిస్తూ ఉంటాడు. అది ఈ శ్లోకం యొక్క ముఖ్య భావం. ఇందులో మనకి ముఖ్యంగా ఉండే వాళ్ళు ఇద్దరు. బ్రహ్మము, బ్రహ్మ. బ్రహ్మము-అనిర్వచనీయమైనది. బ్రహ్మ-అందులోంచి వ్యక్తమైన తత్త్వం. అందులోంచి సృష్టి వ్యక్తమయ్యింది. అలాగే మనం కూడా అనిర్వచనీయమైన తత్త్వంలోంచి వ్యక్తమై మనదంటూ ఓ సృష్టి చేస్తున్నాం. మన సృష్టి కూడా ఆ సృష్టితో అనుసంధానం చెంది ఉంటే అది కర్మ అవుతుందిట. కర్మకి మనం వాడే అర్థం తలకిందులవుతుంది. కర్మ అంటే అర్థం ఏమిటయ్యా అంటే బంధిపబడకుండా చేసే కార్యంట. అది చేస్తుంటే తద్వారా బంధనాలు రావుట. ఇప్పుడు మనం కర్మ అనే పదానికి రకరకాలుగా అర్థాలు చెప్పుకుంటున్నాం. కాబట్టి బంధింపబడకుండా చేసే కర్మను దివ్యకర్మ అనడం మొదలుపెట్టాం. అసలు కర్మే దివ్యం అంటారు. ఎందుకంటే కర్మలు నిర్వర్తిస్తుంటే బంధనాలు రావుట. కర్మ ఎలా నిర్వర్తించుకోవాలో తెలియకుండా నిర్వర్తించుకోవడం వల్ల బంధనాలు వస్తూ ఉంటాయి. బంధింప పడకుండా కర్మలు ఎట్లా నిర్వర్తించుకోవాలో చెప్పడానికి 'కర్మయోగం' అనే అధ్యాయంలో కృష్ణుడు వివరంగా చెప్పాడు. అట్లా ఉంటే బంధింపబడకుండా ఉంటారు. ఎట్లా ఉండాలని చెప్పాడు? అసలు ముందు నీకోసం పనిచేయడం మానేయమని చెప్పాడు. కర్మలు రెండు రకాలు అబ్బాయ్. యజ్ఞార్థము, స్వంతమని-స్వార్థము అని. ఇతరుల మంచి కొరకు, ఇతరుల కొరకు, అంటే ఇంట్లో ఇంటావిడ పొద్దున్నే కాఫీ పెడుతుంటే అందరి కోసమని ఉంటుంది కదా! అట్లా ఏది చేసినా అందరి కోసమే నిజానికి సృష్టిలో. మనకోసం చొక్కా కొనుక్కున్నాం అనుకున్నా, పత్తి పండించిన వాడికి, దానిని నేతనేసిన వాడికి, దాన్ని గుడ్డగా తయారు చేసిన వాడికి, దాని చొక్కాలా తయారు చేసిన వాడికి, అందరికీ కలిపే డబ్బులు ఇస్తాం మనం మన చొక్కా ఖరీదులో. కాబట్టి ఇంతమందికి దీనివల్ల ఉపకారం జరుగుతుందన్న భావన ఉంటే నువ్వు చేసింది యజ్ఞార్థం అవుతుంది. నాకోసం నేను చొక్కా కొనుక్కుంటున్నాననుకుంటే అదే స్వార్థం అవుతుంది. అదీ కర్మ. నువ్వు స్వార్థంగా చేసుకున్నా ప్రకృతి నీద్వారా యజ్ఞార్థంగానే చేయిస్తోంది. అంటే మనం బాలభాను

విద్యాలయం మురళీనగర్ లో ఎక్కడో కొండ దగ్గర పెట్టుకుంటే, మన కోసం పెట్టుకున్నామనుకున్నా చుట్టుపక్కల land value పెరిగిపోయింది. School వచ్చింది కదా! ఇక్కడ మనం School పెడితే ఇక్కడ ఉండే వాళ్ళకి విలువలు పెరుగుతాయి అనే భావన ఉంటే యజ్ఞార్థం అవుతుంది. మనం చేసే దాంట్లో పదిమందికి ఎంత మంచి జరుగుతున్నదో చూస్తూ, దాని యందు ఆసక్తి పెంచుకుంటూ మనయందుకన్నా, వ్యాపారం చేసేటువంటివాడు కూడా లక్షలు పెట్టి చేసినా అందరి కోసం చేయడమే పాపం. వేలాది workers కి జీతాలు, bonus లు, gratuity లు, provident fund లు, ESI లు ఇటువంటివన్నీ కట్టాలి వాడు. ఆపైన యంత్రాలు కొనుక్కోవడానికి యంత్రాలు తయారు చేసిన వాళ్ళకివ్వాలి. Factory పెట్టడానికి ఎక్కడో భూమి తీసుకోవాలి. కట్టడానికి ఇటుక వాడికి డబ్బులివ్వాలి. సిమెంటు తయారు చేసే వాడికి డబ్బులివ్వాలి. కట్టే వాడికి డబ్బులివ్వాలి. ఎంతమందికి ఎన్ని డబ్బులిస్తే ముందు factory వచ్చింది? తనకోసమే అనుకుంటాడు పాపం! అనుకుని చేస్తాడు తప్ప నిజానికి ఇచ్చింది, ఎంతమందికి ఇచ్చాడో చూస్తే లక్షలాది మందికి ఇస్తాడు. ఆ తరువాత దాన్ని మొదలుపెట్టి మనం run చేస్తూ ఉన్నప్పుడు వందలాదిమందికి జీతాలివ్వాలి. ఎన్నో రకాలుగా taxes కట్టాలి. ఆ పన్ను, ఈ పన్ను రకరకాల పన్నులు. ఇవన్నీ అయిన తర్వాత చివరికి మిగిలిన దాంట్లో ఇంకొక పెద్ద ముక్క cake ఆదాయపు పన్ను, ఆ పన్ను కూడా పోయిన తర్వాత మిగిలింది ఇంటికి పట్టుకొస్తే ఇంట్లో పచారీ కొట్టువాడికి, ఆ కొట్టువాడికి, ఈ కొట్టువాడికి, ఇంటద్దెవాడికి, electricity కి, telephone వాడు అందరూ పట్టుకు పోయేవాళ్ళే. చివరికి వీడి నోట్లోకి ఎంత వెళ్ళింది? నువ్వు కోటి రూపాయలు సంపాయిస్తున్నా నిజానికి నీనోట్లోకి వెళ్ళింది రెండు పూటలా తిన్నదే కదా! లేకపోతే మూడు పూటలా తిన్నాం అనుకో tiffin తో కలిపి. ఇంతేనా వెళ్ళింది? మిగతాదేదీ నీ దగ్గరికి వెళ్ళలా. నీ పిల్లల రూపంలో పట్టుకుపోయింది కూడా, పట్టుకు పోయే వాళ్ళు కూడా ఇదివరకు నువ్వు బాకీ పడ్డవాళ్ళే. దొంగలు, ఋణస్తులు చెప్పారు కదా! చుట్టాలు-దొంగలు, సుతులు-ఋణస్తులు అని. పాత బాకీ తీర్చుకోవడానికి వాళ్ళు వస్తారు. ఇట్లా అందరికీ పెట్టి, ఎంతో ఆప్యాయంగా అప్పు తీర్చడానికి ఇంటావిడకి 5000 రూపాయలు చీర కొనుక్కుని సంతోషిస్తున్నావేమో పిచ్చివాడా బాకీరా అంటోంది శాస్త్రం. అసలు ఇంతమందికి ఇన్ని చేసి నీ నోట్లోకి ఏం పోయింది? నావల్ల ఇంతమందికి మంచి జరుగుతుందన్న భావన ఉందనుకో అది నిజమైన profit. అయ్యో నేను ఇంతమందికి చేస్తే గాని రాలేదే, ఈ నోట్లోకి ఈ ముద్ద రావాలంటే ఇంతమందికి చేయాలా అని ఏడుస్తే? ఇంటావిడ ఎంతమందికి చేస్తే ఆవిడ నోట్లో ముద్ద పెట్టుకుంటుంది? నా పాటికి నేను వండుకుని నేను తిని నా నోట్లో నేను పెట్టుకోవచ్చు కదా! వీళ్ళందరికీ ఎందుకు చేయాలనుకుంటే? అనుకున్నా కూరలవాళ్ళకి డబ్బులు ఇవ్వాలి. పచారీ వాడికి డబ్బులు ఇవ్వాలి, గ్యాస్ వాళ్ళకి డబ్బులు ఇవ్వాలి ఎంతమందికి ఇస్తే ఏంటండీ? మన దగ్గరకొచ్చే లోపల ప్రకృతి వందలాదిమందికి డొక్క చింపి, నడుం వంచి, మెడలు వంచి ఇప్పిస్తుంది. నీ భావనలో తేడా తప్ప నువ్వు చేస్తున్నది యజ్ఞార్థకర్మే! అదీ కర్మయోగంలో ఉన్న ఒక రహస్యం. 'జరుగుతున్నది యజ్ఞార్థకర్మే రా, నీ బుద్ధిలో

వంకర చేత, స్వార్థం అని అనుకోవడం చేత, అసంతృప్తి చెందుతున్నావు. నువ్వు యజ్ఞార్థం అనుకున్నా, స్వార్థం అనుకున్నా ప్రకృతి మాత్రం నీచేత యజ్ఞార్థకర్మే చేయిస్తోంది'. మనం ఎంతో మురిసి బంగారం కి డబ్బులు పోగేసి ఉంగరం కొనుక్కున్నామనుకున్నా కూడా ఎంతోమందికి అందులో payment జరిగిపోయింది. నీ వ్యామోహం! అది ఎక్కువ ధర పెట్టేశామని ఏడుస్తూ ఉంటాం. ఎక్కువ ధర పెడితే పెట్టాం పదిమంది తిన్నారు కదా! ఒక పావలా వంకాయలు తక్కువ చేసి బేరం కొనుక్కున్నామని సంతోషించేదానికన్నా ఓ పావలా ఎక్కువ ఇస్తే ఆ ఇంట, ఆ కూరగాయలు అమ్ముకునే వాళ్ళ ఇంట్లో కాస్త బాగా భోంచేస్తారనుకున్నాం అనుకోండి, ఇక్కడ వాళ్ళకన్నా తెలివి మనకి ఎక్కువ కాబట్టి బేరం చేసి తీసుకుని, అవతల పాతికవేలు పోగొట్టుకుంటూ ఉంటారు. కదా! ఏం జరిగిందీ? నీ పిచ్చి తెలివి అమాయకుల మీద వాడితే నీ కన్నా పెద్ద తెలివైనవాడు నీ దగ్గర బొత్తులు బొత్తులు పట్టుకుపోతూ ఉంటారు. ఏమిటా తెలివి? అందుకని జరిగిందల్లా యజ్ఞార్థం గా కానీ అని చెప్తారు ముందు. యజ్ఞార్థమయితే ఇతరుల కొరకే. అసలు నువ్వు జీవించడం అంటే ఇతరుల కొరకే. ఆ మధ్య ఇంకో పెద్దాయన చెప్పారు. మీ దగ్గర విద్య ఉందన్నా మీకోసం కాదండి ఇంకోడి కోసమనే. మంచి జ్యోతిష్యశాస్త్రం తెలిసినవారుట అంటే మాకు చెప్పండి సార్ అని వస్తారు అంతేగా! మాకు చెప్తారా అనో, నేర్పిస్తారా అనో వస్తారు. భాష్యం తెలుసుటా అంటే మాకు చెప్తారా అని వస్తారు. నీకోసమా అది? నా దగ్గర మంచి విద్య ఉంది, బాగా డబ్బు చేసుకోవడానికి అంటే, అది నేర్పండి అని వస్తారు. ఇంకో రహస్యం ఏంటంటే సృష్టిలో నీ దగ్గర ఏది ఉంచినా అది ఇంకోళ్ళ కోసం ఉంచుతుందిట సృష్టి. నీ దగ్గర డబ్బు చేరిందనుకో, అక్కడికే వస్తాయి కదా చీమలు. ఎక్కడ బెల్లం ఉంటే అక్కడికి వస్తాయి కదా చీమలు. బెల్లం లేని చోటుకి, ఉప్పున్న చోటికి పోవు కదా! నీదనుకుంటున్నావా? నీ దగ్గరికి చేరింది ఇంకోళ్ళ కోసం చేరుతుందిట. అన్నీనూ. శరీరం నీదనుకోబోక, ఇతరులకు చాకిరీ చేయడానికి ఇచ్చాడది. ఇట్లా సమస్తం నీ దగ్గర ఉంచబడిందల్లా ఇంకోళ్ళ కోసం నీ దగ్గర ఉంచబడింది అని తెలిసినటువంటివాడు తెలివైనవాడుటండి! తృప్తి ఉంటుంది. అందుకని ఈ విధంగా భావన చేసుకుంటూ యజ్ఞార్థం జీవించటం మొదలుపెడితే అది భగవంతుడు చెప్పిన కర్మ! అలాకాకుండా జీవించే వాళ్ళకి కొన్ని సూత్రాలిచ్చారు. ఏమిటయ్యా అంటే ఫలితాలు ఆశించక, చేసే దానిలో కుత్సితం పెట్టుకోబోక. ఈ రెండూ పెట్టుకున్నావంటే, కుత్సితంతో మొదలు పెట్టడం కర్మకి ముందే వంకర. ఫలితాలు ఆశించడం మళ్ళీ వంకర. రెండు వంకరలతో నిన్ను మెలేసేస్తుంది అది. నిన్ను మెలేసేస్తుంది అంతే తప్ప దానికేం తేడా ఉండదు. అందుకనే

'కర్మణ్యేవ అధికారస్తే మా ఫలేషు కదాచన మాకర్మ ఫలహేతుర్భూః'

ఇవన్నీ ఎవరికయ్యా అంటే యజ్ఞార్థకర్మ కాకుండా ఏదో చేద్దాం అనుకునే వాళ్ళకు. ఎందుకిది చెప్తున్నారంటే కర్మ సహజంగా దివ్యమైనది. అది నీకు దివ్యం అవుతుందో లేదో నీబట్టి ఉంటుంది అంతే! మనం ఖర్మ ఖర్మ అంటామే ఒత్తిపెట్టి అసలు ఆ పదం లేదు. ఒత్తెందుకు పెట్టామంటే మనం ఒత్తుకుంటున్నాము కాబట్టి కర్మతో. వ్యక్తిగత కర్మ అన్నారు. దానికి మళ్ళీ అందులో ప్రారబ్ధకర్మ, సంచితం, ఆగామి ఇటువంటివన్నీ

రకరకాలు మనం తెలియక చేసుకునేవి. బ్రహ్మ ఏవిధంగా కర్మ నిర్వర్తించాడో, నువ్వు కూడా అట్లా నిర్వర్తించు. బ్రహ్మని సృష్టి చేయవయ్యా అంటే అమ్మో! చాలా పెద్ద పని కదండీ, అన్నాట్ట. అట్లా అయితే మళ్ళీ తపస్సు చేయమన్నాడుట. తపస్సు చేస్తే అసలు సృష్టి అంతా తయారుగానే ఉందిట. ఊరికే డబ్బా మూత ఇతడు. అంటే మూత తెరిచేస్తే అది బయటికొచ్చేస్తుంది. ఎంతో అద్భుతమైన విషయం. మనం కూడా చేయాలి, చేయాలి. అమ్మో! ఇంత చేయాలా అంత చేయాలా అనుకుంటాం కదా! ఏం చేయక్కర్లా. నువ్వు వాడియందు నిలబడితే మొత్తం అంతా వాడు నడిపించేసుకుంటాడు. మనం చేయాలి గామోసు అనుకుంటే మనం మూత సరిగ్గా తెరవం. అందుకని మనకి బాధ మిగిలిపోతూ ఉంటుంది. ఒక్కసారి ఈ సందర్భంగా మళ్ళీ ద్వితీయ అధ్యాయంలో బ్రహ్మకి, నారాయణుడికి జరిగిన సమ్యక్ వాదము/ సంవాదం చదువుకుంటే బావుంటుంది. చాలా విషయాలు తెలుస్తాయి. మనం కూడా బ్రహ్మలమే కాబట్టి బ్రహ్మమునందు మనం చేరవచ్చు. అది ఎక్కడో లేదు. మన లోపలే ఉంది. మనలాగా ఉంది

## 698 మహాక్రమః

మహత్తరమైన క్రమముగా భగవంతుడ్ని దర్శనం చేయడం. ఎక్కడ క్రమం వుంటే అక్కడ భగవంతుడున్నట్లు భావన చేయాలి. ఎక్కడ క్రమం లేదో అక్కడ భగవంతుని యొక్క ఈ కళ్యాణగుణం అవతరించి లేదని తెలుస్తుంది. క్రమము లేనిచోట వృద్ధిలేదు. క్రమము వున్నచోట వృద్ధి వున్నది. మొత్తం సృష్టి అంతా కూడా ఒక మహత్తరమైన క్రమములో నిర్మాణం చేయబడ్డది. భగవంతుడు తన్ను తానే ఆ విధంగా నిర్మాణం చేసుకున్నాడు. ఏడులోకాలుగా సత్యలోకము, తపోలోకము, జనోలోకము, మహర్లోకము, సువర్లోకము, భువర్లోకము, భూలోకము ఇలా తన్నుతానే యిన్ని లోకాలుగా ఏర్పాటు చేసుకున్నాడు. ఇందులో తానే దేవతలుగా, ఆదిత్యుడుగా, రుద్రుడుగా, వసువులుగా, అశ్వినీ దేవతలుగా తన్ను తాను వండుకొని నిర్మాణం చేసుకున్నాడు. గోళాలుగా, జీవులుగా తానే యేర్పడ్డాడు. ఈ జీవుల వృద్ధి, హానులకు ఒక క్రమం వున్నది. గోళముల యొక్క వృద్ధి, హానులకు ఒక క్రమం వున్నది. సమస్తమూ ఒక క్రమం ప్రకారం అవతరించి, ఓ క్రమం ప్రకారం మళ్ళీ అంతరించి అంతర్యామిలో భాగంగా లయం అయిపోతూ వుంటుంది. సృష్టి, స్థితి, లయాలకి ఓ చక్కని క్రమం వున్నది. ఈ క్రమం త్రిగుణాత్మకంగా నిర్వర్తించబడుతూ వుంటుంది. క్రమం తప్పకుండా కార్యక్రమాలు నిర్వర్తించే వారికి ఈ భగవదనుభూతి చక్కటి వృద్ధిని యేర్పాటుచేస్తుంది. అలాకానప్పుడు యేర్పాటుచేయదు. క్రమం వున్నదా, లేదా అని ఎవరికివారు దర్శనం చేసుకుంటూవుండాలి. మన యొక్క పుట్టుక, నడక మొదలైన వాటిని శనిగ్రహం క్రమపరుస్తూ వుంటాడు. శనిదేవతయే వెంకటేశ్వరస్వామియై శనివారంనాడు పూజలు అందుకుంటూ మనలో ఈ క్రమాన్ని స్థిరపరచడానికి ప్రయత్నం చేస్తాడు. ఈ క్రమం నేర్చుకోవడం అనేది సప్తకిరణములలో ఏడవదిగా యిచ్చారు. 7th ray అన్నమాట. అంటే systematized functioning is Ritualisation. ఏదో ఒక పద్ధతిలో గానుగెద్దులా గానుగ చుట్టూ యధాలాపంగా తిరుగుతున్నట్టు కాకుండా యేదైనా ఒక క్రతువు లాగ చేయడం, జీవితాన్ని ఒక క్రతువుగా నిర్వర్తించుకోవడం. సమస్తమునందూ క్రమమును దర్శనం చేయాలి. మామిడిచెట్టు పెరగడం లో ఒక క్రమం వున్నది. పూతపూయడంలో, పండు పండడంలో, యెండిపోవడంలో కూడా ఒక క్రమం వున్నది. చీమ నుండి బ్రహ్మవరకూ సమస్తమునందూ ఒక క్రమంవున్నది. నిజానికి చీమవద్ద మనం నేర్చుకోవలసిన క్రమశిక్షణ చాలావున్నది. కలిసి చక్కగా పని చేయడం, క్రమంగా బారులు తీర్చి వెళ్ళడం యిలాంటివి. ఇలా ప్రతి దానిలోనూ క్రమాన్ని చూడటం మొదలుపెడితే భగవంతుడు యెంత అద్భుతం గా ఈ సృష్టిలో నిబిడీకృతమై వున్నాడా అని ఆనందంతోబాటు అత్యాశ్చర్యం కలుగుతుంది. అందుకని మనం చేసుకొనే పనులు కూడా అలాగే క్రమం తప్పకుండా వుండేట్లు చేసుకోవాలి. క్రమం తప్పకుండా వుండేవాడికి సృష్టి బంధనం వుండదు. క్రమం తప్పినవారిని సృష్టి బంధిస్తూ వుంటుంది. చేయవలసిన పని, చేయవలసిన పద్ధతిలో చేస్తే, దాన్నుండి వచ్చే అనుభూతి తప్ప మరొక బంధనం వుండదు. చేయవలసిన పని

చేయవలసిన పద్ధతిలో చేయనప్పుడు బంధనాలు వస్తాయి. ఇది చిన్న విషయం నుండి, పెద్ద విషయం వరకు సత్యం. ఇది మన శరీరపోషణలోనూ, విద్యాభ్యాస విషయంలోనూ, ఆరోగ్యమును కాపాడుకొనడంలోనూ, భావములయందునూ, చేతలయందునూ, కుటుంబపోషణయందూ, వృత్తివ్యాపారాల యందూ, సంఘంలో మనం వ్యవహరించే పద్ధతి యందూ సత్యమే! అన్ని విషయాల్లోనూ ఒక పద్ధతి వున్నది. ఆ పద్ధతిని తనకు తానుగా తెలుసుకోవడం ఒక పద్ధతి. పెద్దల వద్ద తెలుసుకోవడం యింకొక పద్ధతి. గ్రంథముల ద్వారా తెలుసుకోవడం మరియొక పద్ధతి శ్రీరాముడు రామాయణంలో యెలా ప్రవర్తించాడు, ఏ విధంగా భారతంలో ధర్మరాజు ప్రవర్తించాడో, నలుడు, హరిశ్చంద్రుడు ఎలా ప్రవర్తించారో పరిశీలించండి. తెలుస్తుంది. అలా మహాత్ముల నడవడి పరిశీలించి చూస్తే తెలుస్తుంది. ఈ గ్రంథములలో లేదా అంతకన్నా సులువు పద్ధతి తెలిసినవారివద్ద, అంటే తమ ఆచరణలో చూపుతున్న వారివద్ద నుండి తెలుసుకోడానికి అవకాశం వున్నది. ఉదాహరణ మనకు ఎదురుగా ఉన్నప్పుడు, ఓ వ్యక్తిని చూసి ఆచరించడం సులభం. ఆ విధంగా క్రమాన్ని నేర్చుకుని ముందుకు వెళ్లడానికి ప్రయత్నిస్తే బంధనాల నుండి బయట పడటానికి అవకాశం వస్తుంది. అలా కానప్పుడు బంధిస్తూంటుంది. కలియుగంలో మానవుడికి ఓర్పు తక్కువ, ఫలితములయందు ఆశ యెక్కువ. వేచివుండడం చాలా కష్టంగా వుంటుంది. సాధనలో మొదట చెప్పేది శ్రద్ధ, సబూరి. శ్రద్ధగా క్రమం తప్పకుండా చేయవలసింది చేస్తూండడం, సబూరి అంటే ఓర్పుతో వేచివుండటం. చేయవలసినది చేసి, నీకు రావలసిన విషయములయందు ఓర్పువహించాలి. రావడం నీచేతిలో లేదు. భగవంతుని అనుగ్రహం మీద ఆధారపడి వుంది కాబట్టి, అది కాలం రూపంలో నీకు అందిస్తారు కాబట్టి నీవంతు కర్తవ్యాన్ని నువ్వు నిర్వర్తిస్తూ, ఫలితములయందు యెక్కువ ఉత్సాహపడకుండా, వేచివుండటం నేర్చుకుంటే, ఈ 'మహాక్రమః' నామం ద్వారా చాలా అభివృద్ధి సాధించవచ్చు. ఏ సద్గురువైనా తనవద్ద చేరిన సత్సాధకులకు ముందు యిచ్చేది క్రమం. క్రమం లేని జీవితానికి ఆధ్యాత్మిక అభివృద్ధి వుండే అవకాశంలేదు. అంతేకాదు ఇహలోకంలో కూడా కావలసిన విజయాలు సాధించాలంటే ఒక క్రమం కావాలి. వ్యాపారం చేయాలంటే ఒక క్రమం వుండాలి, ఉద్యోగం చేయడానికి ఓపద్ధతి వుండాలి. సంఘంలో జీవించడానికి ఓపద్ధతి వుండాలి. పద్ధతిగా జీవించకపోతే యేమీ వుండదు. ఎప్పుడు పద్ధతి అవలంభించలేదో అప్పుడు సాధన యందు కొరత బాగా కనిపిస్తుంది. సాధన పెరుగుతున్నకొద్దీ శ్రద్ధ పెరుగుతున్నదనీ, క్రమము పెరుగుతున్నదని, యమము పెరుగుతున్నదని అర్థం. యమము అంటే తనను తాను నియమించుకోవడం. అంటే self regulataion. ఇతరులచేత నియమింపబడుట వేరు, తనను తాను నియమించుకోవడం వేరు. ఎవరో చూస్తారని మంచిగా వుండడం వేరు, మనకి మనం మంచిగా వుండడం వేరు. ఎవరూ చూడకపోతే కొన్ని పనులు చేస్తాం అనుకోండీ, అంటే యమము లేదని అర్థం. ఎవరన్నా చూస్తే అది చెయ్యవు కదా! యమము లేనివారికి క్రమము తప్పడం వుంటుంది. క్రమం తప్పడం వలన యిబ్బందులు పడుతూంటాం. ఇది కొంచెం చేదుమందు. కానీ త్వరగా స్వస్థత చేకూరుస్తుంది. ఆరోగ్యాన్ని కలిగిస్తుంది. అందుకనే Master CVV గారు 'నా వద్ద

సాధన చేద్దాం అనుకున్నవాడికి procedure చాలా ముఖ్యం అని చెప్పారు. చేయవలసిన పని, చేయవలసిన పద్ధతిలో తప్ప ఇంకో పద్ధతిలో చేయడానికి వీలు లేదు. చేస్తే వెంటనే shock కొడుతుంది' అని చెప్పారు. అందుకని 'ఓర్పు వహించి, ఒక క్రమమైన పద్ధతిలో జీవించడానికి సంసిద్ధులైతేనే నావద్దకు చేరండి' అని Master CVV గారు Saturn courses సందర్భంగా వివరించడం జరిగింది. ఇదే విషయం మనకి Spiritual Astrology అనే పుస్తకంలో మాస్టరుగారు శనిదేవత అనుగ్రహం ఏ విధంగా పొందాలి, శని ఏ విధంగా బంధిస్తాడూ, శని ఏ విధంగా ఉత్తీర్ణత యిస్తాడూ, శని ఏ విధంగా ఉద్ధరిస్తాడు, శని తత్త్వం ఏమిటీ యివన్నీ చాలా చక్కగా వివరించారు. శనితత్త్వం క్రమం! భగవంతుడే ఈ 'క్రమం' రూపంలో వున్నాడని భావన చేయాలి. సూర్యోదయమూ, సూర్యాస్తమయమూ, ఉత్తరాయన దక్షిణాయనాలూ, పౌర్ణమి, అమావాస్యలూ అన్నీ క్రమంగా జరుగుతున్నాయికదా! ఇంత సృష్టిలో యింత క్రమం వుంటే మనం యెందుకు ఈ క్రమాన్ని అందుకోకూడదూ? సృష్టిలో సమస్త జీవరాశులూ క్రమాన్ని తప్పకుండా పాటిస్తూంటాయి. కారణం వాటికి స్వతంత్ర బుద్ధి యివ్వలేదు. భగవంతుడు జీవుడికి స్వతంత్రబుద్ధి వేడుక పడి యిచ్చాడు. స్వంత కొడుకని సర్వాధికారాలు యిస్తే వాడు మనం అనుకున్నట్లు వుండకపోవచ్చు కదా! స్వంత కొడుకు ఎలాగో మొత్తం సృష్టిలో మానవుడు భగవంతునికి అంత సన్నిహితుడు. అంత ప్రేమపాత్రుడు. అందుకే ఈ మానవ శరీరం లభించడం అనేది చాలా అదృష్టం, అవకాశం అని చెప్తారు. భగవంతుడు విశేషించి, ప్రేమించి, కరుణించి, అనురాగంతో తన బుద్ధిని మనయందు ప్రవేశపెట్టి వుంచాడు. మనం ఆ బుద్ధిని వినియోగించుకొని ప్రవర్తించాలి. అందుకే గాయత్రీ మంత్రం. 'బుద్ధి ప్రచోదనం చేయి నాయనా' రోజూ మర్చిపోతూంటాం అని. 'ధియః, యోన: ప్రచోదయాత్' అని కోరుతూ వుండాలి. అలా నిర్వర్తించుకుంటూ క్రమం తప్పని జీవితం కావాలి. మనకి యీ రోజు 10వేలు వస్తే బావుంటుందనిపిస్తుంది కానీ, 10వేలు రావడానికి ఏమి చేయాలో అది చేయడం మాత్రమూ యిష్టం వుండదు. అవి వాడివద్ద వచ్చాయని బాధపడకుండా, వాడు చేసే కృషి మనం కూడా చేస్తే మనకూ వస్తాయి. కాకపోతే పొందవలసినది పక్కనపెట్టి, చేయవలసినది చేస్తే, పొందవలసినది కాలమే తెచ్చి అందిస్తుంది. అందుకని ఈ నామం మనకి ' నీవు చేయవలసిన కర్తవ్యం నిర్వర్తిస్తూండు, ఫలితమును మాత్రము ఆశించకు. చేయవలసినవి చేస్తే ఫలితములు వాటంతట అవే వస్తాయి.' అని భగవద్గీత చెప్తుంది. ఫలితముల మీద కాక నీవు చేయవలసి కర్తవ్యములపై నిమగ్నుడవై ఉండాలి. మనం ప్రయత్నాలు చేయక ఏదో మంత్రమో, తంత్రమో, గురువునో పట్టుకుని దాటేద్దాం అనుకుంటాం. దాటేయటానికి సృష్టిలో ఏరకమైన వీలూ లేదు. నీకు తాత్కాలికంగా ఉపశమనం కలిగించవచ్చు తప్ప, నీవు దాటడానికి యేం చేయాలో అది చేయాల్సిందే. అది చేయించడానికి నీవు చేసే పూజలూ, స్తోత్రాలూ స్ఫూర్తినివ్వాలి. రోజూ 12 సార్లు విష్ణుసహస్రనామం చదివి, చదువుకోకుండా పరీక్ష రాస్తాను అంటే? అది కాదు పద్ధతి. పరీక్షయేదో అది చదువుకుని, దానికి కావలసిన స్ఫూర్తీ, వికాసమూ ఇవ్వమని భగవంతుని ప్రార్థించాలి. ప్రార్థన స్ఫూర్తి పొందడానికి. స్ఫూర్తి ఆధారంగా కర్తవ్యం నిర్వర్తించాలి.

మనకి చిన్నప్పటి నుండీ కర్తవ్యం కూడా నిర్వర్తించాలి అని చెప్పక దేవుడ్ని ప్రార్థిస్తే అన్నీ వచ్చేస్తాయి అని చెప్తారు. దేవుడ్ని ప్రార్థిస్తే ఏమి చేయాలో నీకు తెలుస్తుంది. అది నువ్వు చేస్తూ వుండాలి. ఏం చెయ్యాలో మనకి మనకుగా తెలియడానికి ఓ diary పెట్టుకోమన్నారు. ప్రతిరోజూ Master CVV అని తలచుకుని కళ్ళు మూసుకుంటే, మనకి అంతర్ముఖంగా బోధ వస్తుంది. 'నీ లోతట్టుల నుండి నీకు కావలసినవన్నీ యెప్పటికప్పుడు నేనే అందచేస్తూంటాను', అని చెప్పారు. అలా అందచేసినవీ, మనం చేయవలసినవీ మనకి ప్రార్థనలో వచ్చినవి రోజూ రాసుకోవాలి. లేకపోతే మర్చిపోతాం. రాసుకుని మనం నిర్వర్తించాలి. ఆ విధంగా నిర్వర్తిస్తూంటే క్రమంలోకి ప్రవేశించడం ఏర్పడుతుంది. క్రమంలోకి ప్రవేశిస్తే జీవితంలో అభివృద్ధికి అవకాశం వుంటుంది. కాలక్రమేణ అన్నీ అందుతాయి. కాలక్రమేణ అందేవాటికోసం ఎదురుచూడకుండా, కాలం మనకి నిర్దేశించిన కర్తవ్యాలను నిర్వర్తిస్తూండాలి. ఒక పూలమొక్క నుండి ఓ పువ్వు రావాలంటే కొన్ని లక్షల రకాల రసాయనిక మార్పులు జరిగి ఓ పువ్వు బయటికి వస్తుంది. ఎంతటి క్రమమండీ? ఈరోజు ముసల్లాళమవుదాం అనుకున్నా అవలేం. పడుచువాళ్ళమవుదాం అనుకున్నా అవలేం. ముసలివాళ్ళు పడుచువాళ్ళు కాలేరు, పడుచువాళ్ళు ముసలివారు కాలేరు. అంత క్రమం! అంతా కాలం చేతిలో వున్నది. అలా ఓర్పు నేర్పుతుంది 'మహాక్రమ' నామం. ప్రతివాడికీ ఒక time table వుంటుంది. ఆ time table ప్రకారం జరుగుతూంటుంది. మనమేమో ఆ time table కన్నా ముందుగా అవ్వాలని అనుకోవడం వల్ల late అయిందనుకుంటాం. మనకి మనసులో ఒక పని ఓ time కి అవ్వాలనే భావన వుండడం వల్ల, ఆ భావన ప్రకారం అది కాక పోవడం వల్ల late అయ్యిందంటాం తప్పా late ఏదీ? ఆలస్యం నీ భావనలో ఉన్నది తప్పా, కాలం లో లేదు. అందుకని భగవంతుడి నుండి అందినది ఆలస్యం అనుకోవద్దు. ఎప్పుడందితే అదే సకాలం. అందిన time సరైన time. ఏది, ఎప్పుడు, ఎట్లా జరగాలో అదల్లా జరుగుతూంటుందండీ. ముందుగా జరగాలి, వెనగ్గా జరగాలి అనేవి మనలో కలిగే అజ్ఞానపు పొరాల్లోంచి వచ్చే భావాలు. ఎప్పుడు, ఎక్కడ, ఏది జరిగినా అది అప్పుడు, అక్కడ, అదలా జరగాల్సిందే! అప్పుడు అదలా జరగడంలో నుండి మనం నేర్చుకోవల్సిందేముందో అది మనం నేర్చుకుంటూ ఉండాలి. Late, early అనే మన మాటలు మన అజ్ఞానాన్ని సూచిస్తాయి. పరీక్షిన్మహారాజు ముందుగా వెళ్ళిపోయాడని చెప్పగలమా? శ్రీకృష్ణుడు ముందుగా వెళ్ళిపోయాడని చెప్పగలమా? 32 సంవత్సరాలకే శంకరాచార్యుల వారు వెళ్లిపోయారని, వెళ్ళిపోయారంటే నీవిక్కడ పడివున్నావు కనక నీకు తొందర. 33 ఏళ్ళకే క్రీస్తు వెళ్ళిపోయాడు. 54 ఏళ్ళకే CVV గారు వెళ్ళిపోయారు. 58 ఏళ్ళకే మాస్టరుగారు వెళ్ళిపోయారు. మాస్టరుగారు యింకొన్నాళ్ళు వుంటే బావుండేదంటే, నీకు కాలం కన్నా ఎక్కువ తెలుసా? ఏది ఎట్లా జరగడం వల్ల శుభమో అదలా జరుగుతూంటుంది. జరిగిందల్లా శుభం అని 'సంక్షేప్త' నామములో తెలుసుకున్నాం కదా! కనుక మహాక్రమ నామాన్ని ఆరాధించేవారు క్రమం తప్పకుండా తమ కర్తవ్యాన్ని తాము నిర్వర్తించుకొని వుండడమే తప్ప ఇహ వేటిమీదా శ్రద్ధ వుంచనక్కరలేదు. తన పని తాను చేసుకోడమే. 'సత్య కామ జాబాలి' అనే కుర్ర

వాడి కథ వున్నది. ఆ పిల్లవాడు 5ఏళ్ళ వయసులో ఒక సద్గురువు వద్దకు వెళ్ళి విద్యాబోధ చేయమని అడుగుతాడు. అప్పుడాయన నీ తల్లితండ్రులెవరు? అని అడుగుతాడు. అతనికి తల్లెవరో తెలుసు, తండ్రెవరో తెలియదు. తెలియక కనుక్కొని వస్తానని యింటికి వెళ్తాడు. తల్లిని అడిగితే తెలియదంటుంది. అదే విషయం నీ గురువుగారికి చెప్పమంటుంది కుమారుడ్ని. తండ్రి తెలియదంటే మన భాషలో ఎంత భయంకరం గా నిర్వచించుకుంటాం? ఎంత అవమానం గా ఉంటుందీ? అందరు విద్యార్థులూ కూర్చున్న సమయంలో ఆ పిల్లవాడు గురువుగారి వద్దకు వస్తాడు. గురువుగారు అడిగితే, తల్లి చెప్పిందే తూ.చా. తప్పకుండా చెప్తాడు, తెలియదని. అప్పుడందరూ నవ్వుతారు. కానీ సద్గురువు నవ్వక, ఆనందిస్తాడు. ఉన్నది వున్నట్లు ధైర్యముగా చెప్పగలిగినవాడూ, సత్యమునుచ్చరించుటకు ఏ మాత్రమూ సందేహమూ, సదిగ్ధమూ, అనుమానమూ లేనటువంటి వాడూను అని. 5ఏళ్ళ కుర్రాడు యితరులు తనని అవమానిస్తారని తెలిసి కూడా సత్యాన్ని సత్యంగా పలికాడు. తల్లి చెప్తుంది తండ్రిపేరు తెలియదు గానీ సత్యకాముడని చెప్తుంది. తల్లి పేరు జాబాలి. అదీ ఆయన పేరు. 'సత్యకామ జాబాలి' గురువు అంగీకరించి నాలుగు ఆవులనిచ్చి, ఈ నాలుగు ఆవులనీ శ్రద్ధగా పెంచుకుని వెయ్యి ఆవులైనాక నన్ను వచ్చి కలవమంటాడు. ఎప్పటికయ్యేనండీ? మనం అయితే ఇదేదీ అయ్యేపనికాదు వస్తాం అంటాం. వాడు అరణ్యంలోకి ఆవులని తీసుకెళ్ళి సంరక్షణ చేసుకుంటూ వుంటాడు. వాటి సంరక్షణలో శ్రద్ధ, వాటియందు భక్తి, వాటిని పోషించడానికి ప్రకృతిలోకి తీసుకువెళ్ళడం, అక్కడ పంచభూతాలయొక్క అవగాహన, ఈ గోవుల పెంపకం లో తాను సృష్టితో చెందే అనుసంధానం నుండి యెంతో విద్య నేర్చుకుంటాడు గోవుల పెంపకం లో. నేర్చుకునే శ్రద్ధలో ఆవులు యెన్ని పెరుగుతున్నాయనేది కూడా మర్చిపోతాడు. మనం శ్రద్ధ అంటే ఆవులెప్పుడు పెరుగుతాయా అని చూస్తూంటాం. ఇవన్నీ పెట్టుకోడు. గురువుగారు చెప్పింది ఆవుల్ని పెంచమని. పెంచుతాడు. ఎంత శ్రద్ధగా పెంచుతాడంటే పరిపూర్ణంగా అందులో జీవిస్తాడు. వాటిని మేపడంలో అలా పచ్చిక బయళ్ళకి తీసుకెళ్ళి అవి మేస్తున్నప్పుడు, ప్రకృతిని దర్శిస్తూంటాడు. తద్వారా ప్రకృతి నుండి సమస్తమైన జ్ఞానం తనకు అబ్బుతూవుంటుంది. ఆశ్చర్యపోతూవుంటాడు. వేయి ఆవులైనాక వాయుదేవుడు ప్రత్యక్షమై 'వేయి ఆవులైపోయినాయిరా, గురువు వద్దకు వెళ్ళమని' చెప్తాడు. అంతవరకూ మనవాడికి తెలీదసలు. అప్పుడు వెనక్కి గురువు వద్దకు ఆవులతో వెళ్తే, గురువు ఆశ్చర్యపోతాడు. శిష్యులు కూడా ఆశ్చర్యపోతారు. ఈ ఆవులని పెంచడంలో నీకు కలిగిన అనుభూతి గురువు చెప్పమంటాడు. సమస్తమైన విజ్ఞానాన్నీ చెప్తాడు. చెప్తే యిన్నేళ్ళుగా ఆయన సాన్నిధ్యంలో పెరిగిన శిష్యులు నోరుతెరిచి చూస్తూంటారు. తెల్లబోతారు వీడికింత విద్య యెలా వచ్చిందీ? ఈ గురువుగారి వద్ద వుండటంకన్నా, మనం కూడా ఆవులను తోలుకుంటే బావుండేదని అనుకుంటారు. అప్పుడా గురువు అడుగుతాడు ఈ జ్ఞానం నీకెలా అబ్బిందని. శిష్యుడు 'మీ వల్లే అబ్బింది' అంటాడు. అక్కడ కూర్చున్న శిష్యులకి విద్యుద్ఘాతం గట్టిగా తగిలినట్టవుతుంది. మరో Shock కొట్టి మళ్ళీ తెల్ల బోతారు. 'ఈయన నన్ను దూరంగా పంపారు కానీ అహర్నిశలు ఈయనే నన్ను కాపాడాడు. ఈయనే గోవుల్నెలా పెంచాలో నేర్పారు

అంతర్ముఖంగా. అలాగే ప్రకృతిలోని పంచభూతాలతోనూ సత్సంబంధం ఏర్పరచి వాటి ద్వారా ధ్యానాన్ని నాకు నేర్పాడు. సూర్యచంద్రుల నుండి ఆకాశం, నీరు, పృథ్వీ, అగ్ని అన్నిటి నుండి ఈయనయే సంధిగా, ముఖద్వారంగా నిలబడి, సంధానకర్తగా వుండి సమస్త విద్యలూ నేర్పాడు. ఈలోగా ఆవులు పెరిగిపోయినాయి.' అని చెప్తాడు. మహాక్రమమో అంటే అలా వుంటుంది. ఏం చేయాలి? ఇచ్చినపని చేస్తూ పెరగడమే తప్ప, పక్క వాడికి మనకన్నా మంచిపని ఇచ్చారు మనకి చెత్తపని ఇచ్చారు గురువుగారు అని అనుకున్నవాడు పెరగడు. మహాభారతంలో కూడా మొదట్లోనే ఓ కథ వున్నది. తన శిష్యులలో ఒకడ్ని సమిధలు తెమ్మంటాడు. ఇంకొకడ్ని పొలం దున్నమంటాడు. ఇంకొకడ్ని ఓ రాజువి మకర కుండలాలు తెమ్మని పంపుతాడు. ఎవడికి ఏ పని చెప్తే మళ్ళీ ఇంకో పని చెప్పే వరకూ ఆ పని చేస్తూండటమే. పొలం దున్నే వాడు పొలం పని చేస్తూంటే చెరువు కట్ట గండి తెగి ఎంతమన్నేసినా ఆగకపోతే, ఆ గండి పడ్డచోట తానే అడ్డుగా పడుకుంటాడు. వరదలు తగ్గే వరకూ, అన్ని రోజులూ తనే అడ్డుగా పడుకుని వుంటాడు. శిష్యుడు ఎంతకీ ఇంటికి రాకపోతే గురువు వెతుక్కుంటూ వస్తాడు. వీడు మట్టికీ మట్టికీ మధ్యగా అడ్డుకట్టగా పడుకుని వున్నాడు. ఏంట్రా' అంటే నీళ్ళు పొలంలోకి వచ్చేయకుండా ఇలా పడుకున్నా' అంటాడు. 'అదేంట్రా' అంటే 'మరి మీరు చెప్పినపని ఇదే కదా' అంటాడు. Master గారు కూడా మనందరికీ చెప్తూండేవారు.' చెప్పింది చెప్పినట్లు చేసేవాళ్ళు కావాలి పరమగురువులకి. అంతే కానీ తనిష్టం వచ్చింది చేసే వాళ్ళు అక్కరలేదు. చెప్పింది చెప్పినట్లు చేయగలవా' అని అడిగేవారు. అలా చేయలేకపోతే మార్గంలో వుండే అవకాశం లేదు. ఒక సారి చెప్తారు, రెండవసారి గుర్తు చేస్తారు మూడవసారి కూడా గుర్తు చేస్తారు. అప్పటికీ చేయకపోతే వదిలేస్తారు. ఏది ఎవరికి చెప్పినా అంతే! సూచనప్రాయంగా చెప్పడమే తప్ప అధికార పూరితంగా Order గా వుండదు. సలహాగా, సూచనగానే వుంటుంది. అది చేసుకోవాలి. మర్చిపోతాం. కొన్నాళ్లు పోయాక మళ్లీ ఏం చేయాలి గురువుగారూ, అంటే మళ్ళి ఆయన అదే చెప్తారు. ఇన్ని వేలమందిలోనూ ఎవరికి ఏం చెప్పారో ఆయనకి బాగా గుర్తుంటుంది. అందుకే మళ్ళీ అదే చెప్తారు. మళ్ళీ మరచిపోతాం. మళ్ళీ కొన్నాళ్ళు తిప్పలు పడీ పడీ మళ్ళి గురువుగారు దగ్గర చేరుతాం ఏం చేయాలని. మళ్ళీ అదే ఇస్తారు. ఎందుకంటే వాడి జీవలక్షణానికి అదే సరిపోతుంది గనక. అందులో వాడు శ్రద్ధా, ఓర్పు వహించి వున్నట్లయితేనే తరువాతి తరగతులు. లేకపోతే లేవు. అందుకని ఎవరికి ఏది అప్పచెప్పబడుతుందో అది వారు శ్రద్ధా భక్తులతో నిర్వర్తించడమే. అందులోనే శ్రద్ధా భక్తులతో నిర్వర్తించనివాడికి అంతకన్నా పెద్ద బాధ్యత ఎలా అప్పచెప్పగలడు? ఎవరికి ఏపని అప్పచెప్పబడ్డదో అది వారు క్రమం తప్పక శ్రద్ధతో నిర్వర్తిస్తుంటే, దాంట్లోంచి జీవుడు పెరుగుతాడు. పెరిగిన జీవుడికి పెద్ద బాధ్యత అప్పచెప్తారు. ఈ విధంగా బాధ్యతలు పెరుగుతాయి కానీ ఇంకేం చేయటంవల్లా పెరగవు. చేతగానివాడికి బాధ్యతలెక్కువ ఇస్తే ఏమవుతుంది? పాడవుతుంది పని. ఇవన్నీ మహాక్రమ నామంలో అవగాహన చేసుకోవాలి.

## 6211 మహాకర్మ

మొత్తం సృష్టి అంతా దివ్యమైన కర్మ. జరుగుతూంటుంది. అందులో భాగంగా మనకర్మ కూడా ఏర్పరచుకుంటూంటాం. మనది కథలో పిట్ట కథ లాంటిది. పిట్ట కథ అసలు కథలో చేరాల్సిందే. మనం ఏంచేస్తున్నాం అంటే అసలు కథలోంచి పిట్టకథ ఒకటి తయారు చేసుకుని, అందులోనే మనం కొట్టుకుపోతున్నాం. నేను ఈ విష్ణునామాల వివరణ చెప్తూ పిట్టకథలు వరసగా చెప్పేస్తూ ఉన్నాననుకో, అసలు వివరణలు వదిలి మీరు ఇవి చెప్తున్నారేమిటి అని అడగరూ? ఈ పిట్టకథ ఎప్పుడవుతుందండీ అని అడగరూ? అలాగే మొత్తం కథలోంచి దిగివచ్చిన జీవుడు తన కథ ఒకటి మొదలు పెడతాడు. అదీ పిట్టకథ. కనుక వీడి కథ వీడే తేల్చుకుని మళ్ళీ  అసలు కథలోకి చేరాలి. అందుకే కృష్ణుడు భగవద్గీతలో 'నా జన్మమూ, నా కర్మమూ రెండూ దివ్యమైనవే' అని చెప్తాడు. తను పుట్టడం సృష్టి క్రమంలో భాగంగా, కర్మలో భాగంగా పుట్టాడు. దివ్యకర్మలో భాగంగా, మహాకర్మలో భాగంగా దేవతలు కోరితే పుట్టినవాడు కదా. వచ్చిన తరువాత వేరే పనులు చేస్తూంటే? చేయడు. ఏం చేసినా దానికి సంబంధించిందే చేస్తాడు. అందులో భాగంగానే జరుగుతూంటుంది. వేరేగా జరగదు. అంత జగత్తుకే తండ్రి అయినటువంటి వాడి తల్లీ తండ్రీ అయిన దేవకి, వసుదేవులు ఆ విధంగా బాధపడడం ఏమిటండీ ? ఎందుకంటే అది మహాకర్మలో భాగము. ఎవరెవరు, ఏఏ జీవుడు ఏ ఏ పిట్ట కథలు చేసుకు వచ్చాడో, ఆ పిట్ట కథలు పూర్తి చేసిపెట్టాలి కదా. అలాగే తనకు అత్యంత ప్రియుడు, చిన్నతనం నుండి తన వద్ద పెరిగినవాడు, సమస్త విద్యలూ తన వద్ద నేర్చుకున్నవాడు తన ప్రియమైన మేనల్లుడు అభిమన్యుడి సంగతి ఏం చేశాడండీ? కృష్ణుడెవరినీ దగ్గర కూర్చోపెట్టుకుని విద్యలూ, అస్త్ర శస్త్ర విద్యలూ, ఆ విద్యలూ, ఈ విద్యలూ ఏం నేర్పలేదు. ఒక్క అభిమన్యుడికే నేర్పుకున్నాడు. మేనల్లుడు. మరి వాడు ఏ విధంగా వెళ్లిపోయాడు? మనమైతే మనకత్యంత ప్రియమైన మేనల్లుడ్ని అలా వెళ్ళనిస్తామా? మనకుండే సమస్త శక్తులనీ వాడమూ? అతడు పదహారు సంవత్సరాలుకంటే భూమిమీద వుండకూడదు. అంతకుముందే శివుడి వద్ద ఆ ఒప్పందం చేసుకుని తెచ్చుకుంటాడు కృష్ణుడు. సోమతత్త్వంలోంచి దిగివచ్చినవాడు అభిమన్యుడు. సామాన్యుడు కాదు. అంతకంటే భూమిమీద వుండకూడదు కనుకే వాడు వెళ్ళిపోవాలి. ఎప్పుడు, ఎక్కడ, ఏది నిర్వర్తించినా శ్రీకృష్ణుడు మహాకర్మలో భాగంగానే నిర్వర్తించాడు. తాను మహాకర్మయే! ఇంత మందిని పొట్టన పెట్టుకున్నాడని అందరూ తిట్టినా, ఒప్పకోకుండా మీకేం తెలియదని అందర్నీ లాగేశాడు కదా. ఏ అవతారమూ ఇంత పొట్టన పెట్టుకోలేదు. ధర్మ సంస్థాపన పేర ఇంతమందిని పొట్టన పెట్టుకున్నాడు. అదేంటంటే 'అందరూ నా పొట్టలోని వారే కదా, అందులో నుండి వచ్చిన వాళ్ళు అందులోకే వెళ్తారు. మళ్ళీ అందులో నుండే బయటికి వస్తారు. మీరేం కంగారు పడవద్దు. మీకు అర్థం కాదు. నాకు తెలుసు' అని వాళ్ళ ప్రాణాలన్నీ లాగేశాడు. దివ్యకర్మా, వ్యక్తిగత కర్మా అని రెండు వున్నాయి. వ్యక్తిగత కర్మని మన వారు నానుడిలో 'ఖర్మ' అన్నారు. అసలు

పదం 'కర్మ' అంటే చేయబడునది. సృష్టి మొత్తం చేయబడినదే. దేనికోసం? దివ్యానుభూతికోసం. తన అనుభూతికోసం, జీవుల అనుభూతికోసం. ఒక క్రీడగా నిర్మాణం చేయబడ్డది. ఆడుకుంటూంటే పోట్లాటలు రావచ్చు. పోట్లాటలు వస్తాయని సంకల్పించి ఎవరూ ఆట మొదలు పెట్టరు కదా! పిల్లలు పాడవ్వాలని పెద్దలు సంపదనందించరు. సంపద వల్ల పిల్లలు పాడైతే అది తల్లి తండ్రుల తప్పా? చాలామంది అంటారు 'అలా సంపద ఇవ్వడం వల్లనే వాడలా పాడైపోయినాడని' పాడైపోవాలని ఆశీర్వదించి తల్లిదండ్రులు సంపదనిస్తారా? అలాగే జీవులు దుఃఖించాలని భగవంతుడు ఇవన్నీ నిర్మాణం చేస్తాడా? సంతోషంగా వుంటారని సంకల్పించి చేస్తాడు. మరి దుఃఖం ఎక్కడనుండి వస్తోందండీ? క్రమం తప్పడం వలన! క్రమంతో కూడిన కర్మ అయితే అనుభూతి మనది. పంపించేటప్పుడే చెప్పి పంపాడు మరచిపోకని. పిల్లాడ్ని U.S. పంపినపుడు ప్రతివారం phone చేయరా, అని చెప్తారు. కొన్నాళ్ళు చేస్తాడు. అక్కడ ఇంకో వ్యవహారం, ఓ పిట్టకథ మొదలయ్యేవరకు. పిట్టకథలు మొదలైతే ఇక phones రావు. ఏదో పిట్టకథంటే భయపడనక్కరలేదు. ఏదో హడావుడిలో phone చేయలేదంటాడు. తరువాత ఆ హడావుడి ఏమిటో మనకి తెలుస్తుంది. గట్టిగా మనం మాట్లాడితే వాడేమన్నా మమల్ని తెంచేసుకుంటాడేమో అని ముక్కుతూ, మూలుగుతూ వాడితో బతికేస్తూంటాం. ఏదో ఓ రోజు వాడికి సద్బుద్ధి రాదా అని wait చేస్తూంటారు తల్లిదండ్రులు. అలాగే ఈ క్రమం నుండి వేరు పడ్డ జీవులు మళ్ళీ క్రమంలోకి తిరిగి రావాలని తాపత్రయపడతాడట ఆ భగవంతుడు. ఎందుకంటే తన సంతతే కదా! అందుకే వారు తిరిగి రావాలని వేగులని పంపిస్తాడు. వారే గురువులు! గురువుల ద్వారా దారితప్పిన జీవులని తిరిగి దారిలోకి రప్పించడానికి ప్రయత్నం చేస్తాడు. అందుకని మహాకర్మా ఏమిటయ్యా అంటే సృష్టిలో భగవంతుడు ధర్మం రూపంలో ఎలా వున్నాడో అవగాహన చేసుకుని, ఆ ధర్మాల ప్రకారం నిర్వర్తించుకోవడం. మానవుడికి ఓ ధర్మం వుంది. అది మానవధర్మం! ఈ మానవధర్మాన్ని మనం అవలంబించాలి. మనం మానవ ధర్మాలని తప్ప మిగితా ధర్మాలని అవలంబించడానికి ప్రయత్నిస్తుంటాం. మనిషి సముద్రంలో చేపకన్నా బాగా ఈదగలడు. ఆకాశంలో పక్షి కన్నా బాగా ఎగరగలడు. అక్కర్లేకుండా మిగిలిన గోళాలకి ప్రయాణం చేస్తూండడం, ఇవన్నీ చేస్తాడు. కానీ మనిషి మనిషి లాగ వుండడు. మనిషి వుంటే పక్షిలాగానో, జంతువులాగానో వుండడానికి ప్రయత్నం చేస్తున్నాడు తప్ప, తనలాగా తనుండడం లేదు. తనలాగా తనుంటే, తనకి తన వైభవమూ తెలుస్తుంది, సృష్టి వైభవమూ తెలుస్తుంది. ఏర్పరచిన ఈ మొత్తం సృష్టిలో మహాకర్మననుసరించి తనవంతు కర్తవ్యం చేసుకుంటూండాలి. 'తనని తాను తెలుసుకోవడం' మానవ ధర్మం. మానవుడిగా శరీరం మాత్రమే వుండి పశుప్రవృత్తి కలిగిన వాడు వ్యక్తిగత కర్మలను అనుభూతి చెందుతూంటాడు. తనను తాను తెలుసుకోవడానికి చాలా జన్మలు పట్టవచ్చు. చాలా ఒపికగా అనుభూతినిచ్చి, తద్వారా అనుభవం కలిగించి, ఆ అనుభవంలోంచి మంచి చెడ్డలు తెలుసుకునేట్లు చేసి, అందులోంచి మంచిని అవలంబించేట్లుగా తీసుకొచ్చి, ఆ తరువాత మంచినవలంబించి తద్వారా ధర్మంలోకి ప్రవేశించేవరకూ కూడా కథ

నడుస్తూంటుంది. ఈ మొత్తం కథ అంతా క్రమం ప్రకారం, దివ్య కర్మలో భాగంగా జరుగుతుంది. పిల్లలు ఆటకోసం వస్తువులు తెస్తే పోట్లాడుకోవడం సహజం. పోట్లాడుకోవడం కోసం బొమ్మలు పిల్లకివ్వం. పోట్లాడుకుంటారు కూడా అని మాత్రం తెలిసి వుంటుంది. అట్లాగే భగవంతునికి కూడా తెలుస్తుంది, జీవులు పక్కదారిలో పడతారని. ప్రక్కదారి పట్టినా ఫరవాలేదు, తన దగ్గర మళ్ళీ వాడ్ని దారిలోకి తెచ్చుకునే ఉపాయాలున్నాయి. అందుకని మార్గం తప్పడం కథలో పిట్ట కథ. ఈ పిట్టకథని కూడా కథలో భాగంగా చేర్చుకుంటుంటాడు. ఈ విధంగా కర్మ నడుస్తూంటుంది. ఈ కర్మకి మనల్నే కర్తలుగా నిర్ణయం చేశారు. ఆయన నుండి వచ్చిన కర్మ మీద ఆయనకు స్వామిత్వం వున్నది. మనకీ మనం చేసే కర్మల మీద స్వామిత్వం వుండాలి. స్వామిత్వం వుండడం అంటే మన అదుపూ, ఆజ్ఞా లేకుండా వెళ్ళిపోవడం కాదు. మనం నియమించిన నియతిలో అవి నిలబడి వుండాలి. మనం ధర్మంలో నిలబడి నిర్వర్తిస్తే అలా వుండడానికి వీలుంటుంది. లేకపోతే నిలబడదు. అందుకే ధర్మరాజు ధర్మమునందు తను నిలబడి వుండడం వలన ధైర్యం కలిగివుంటాడు. ఎట్టిపరిస్థితిలోనూ అవతల వైపు ఎంత దివ్యాస్త్ర సంపత్తి, దైవము యొక్క వరములూ కలిగి వున్న వారున్నా కూడా తను నశింపడనే ధైర్యం తాను ధర్మంలో నిలబడడం వలననే ధర్మరాజుకు వచ్చింది. అలాగే హరిశ్చంద్రుడికీనూ. ఎట్టి పరిస్థితిలోనూ ధర్మం దాటకుండా నిలబడి జీవించేవాడు దేనికీ భయపడనక్కరలేదు. ఒకవేళ తన నుండి కొన్ని తప్పులు జరిగినా తనకు రక్షణ వుంటుంది. ఎందుకంటే పశ్చాత్తాపం వుంటుంది కాబట్టీ, మళ్ళీ తనని తాను సరిదిద్దుకుంటాడు కాబట్టీ, తనకు రక్షణ వుండి, ఆ రక్షణలో తానుండి, సమస్తాన్నీ నిర్వర్తించుకుంటూ వెళ్తూంటాడు. జరుగుతున్నదల్లా మహాకర్మలో భాగంగా తీసుకుంటాడు. కొంతమంది అనుకూలంగా వుంటారు, కొంతమంది ప్రతికూలంగా, కొంతమంది తటస్థంగా వుంటారు. నీకు అన్యాయం జరుగుతోంది, నీ స్నేహితుడు నీకన్యాయం చేస్తున్నవాడికి కూడా స్నేహితుడే. ధర్మం నీప్రక్కన, అధర్మం అటుపక్కన వున్నది. నీ స్నేహితుడైతే నీతోపాటూ ధర్మంలో చేరాలి. నీకు శత్రువైనవాడు తనకు కూడా శత్రువుగా భావించడం స్నేహధర్మం. అది రాముని కథలో మనకు కనుపిస్తుంది. మిత్రుని శత్రువు తనకూ శత్రువే. తన మిత్రుడు అధర్మంలో సంచరిస్తే అతన్ని సరిదిద్దాలి. మిత్రుడు ధర్మాత్ముడై, అతనితో శత్రుత్వం వహించినవాడు అధర్మాత్ముడైతే తనకీ శత్రువే. అందుకే సుగ్రీవుడితో అగ్నిసాక్షిగా మైత్రి చేసుకున్నపుడు 'నీకు వాలి శత్రువు కనుక నాకూ ఈరోజు నుండీ వాలి శత్రువే' అన్నాడు రాముడు. వాలి రాముడ్ని అడుగుతాడు 'నీకు నాకు శత్రుత్వం లేదుకదా! నన్నెందుకు వధించావు' అని. అంటే 'నేను ధర్మానికి ప్రతీకను, అది కారణంగా సుగ్రీవుడు నాకు మిత్రుడయ్యాడు. మిత్రుడి శత్రువు నాకూ శత్రువే. కాబట్టి నిన్ను వధించాను' అని చెప్తాడు. ఎంతమందిమి అలా వుండగలం? చాలా మందిమి ఇది అన్యాయం, ఇది న్యాయం అని తెలిసినా తటస్థంగా వుండిపోతాం. అన్యాయం కొంచెం బలంగా వుండి, న్యాయం కొంచెం బలహీనంగా వున్నట్లు కనిపిస్తే ఇంత స్నేహితుడూ తటస్థంగా వుండిపోతాడు. అందుకే మనకు జీవితంలో తటస్థంగా వుండేవాళ్ళు యెక్కువ కనిపిస్తారు. మిత్రులూ, శత్రువులూ కూడా కనిపిస్తారు.

వీరందరి రూపంలో నువ్వు పొందే అనుభవం వున్నదే అది మహాకర్మలో భాగం. కొంతమంది నుండి ఆనందం లభిస్తుంది, మరి కొంతమందినుండి సరాసరి దుఃఖం లభిస్తుంది. కొంతమంది తటస్థవైఖరి మనకి ఆశ్చర్యం కలిగిస్తుంది. ధర్మరాజుకి సభలో భీష్మ, విదుర, ద్రోణుల యొక్క తటస్థ వైఖరి చాలా ఆశ్చర్యం కలిగించింది. వీళ్ళంతా తటస్థంగా వుండిపోతారని అనుకోలేదు. కృష్ణుని మైత్రి ఎలావున్నది? దుర్యోధనాదులు శత్రుత్వం ఎలావున్నది? ఇన్నిటియందూ ధర్మరాజు యొక్క భావన ఎట్లావున్నది? సమస్తమూ ఒక మహాకర్మలో భాగంగా జరుగుతూంటే, అందులో తానూ ఒక భాగంగా గుర్తించి, తను మాత్రం ధర్మం తప్పకుండా నిలబడి వుండిపోతాడు. అది చాలా కష్టం. తన వంతు కర్తవ్యాన్ని మాత్రమే నిర్వర్తిస్తూ, ఇహ మిగతా జరిగేదంతా కూడా ఓర్పుతో భరించి వుండడం అనేది అందరికీ వీలు పడే విషయం కాదు. ఎవరికి వీలుపడుతుందందయ్యా అంటే మహాకర్మా అనే నామం అవగాహన బాగా వుంటే వీలవుతుంది. రాముడలా మహాకర్మలో భాగంగానే వుండి అరణ్యవాసాన్ని అంగీకరిస్తాడు. మనకి ధర్మరాజు, రాముడు ప్రతీ దానికీ ఉదాహరణలే. వచ్చిన కష్టాలన్నీ మహాకర్మలో భాగాలేననీ, వాటికి కారకులైనవారు నిమిత్తమాత్రులే అని అనుకుంటారే తప్ప, వారిమీద శాశ్వతమైన ద్వేషం పెంచుకోరు. మనకి రావలసినదే మన వద్దకు వస్తుంది. మనది కానిది మంచికానీ, చెడుకానీ రావు. మంచి వచ్చిందంటే అంతకుముందు చేసినదేదో అనుగ్రహ రూపంలో వచ్చింది. చెడు వచ్చిందంటే అంతకు ముందు చేయకూడనిదేదో చేయడంవలన ఈ రోజు మనకి శిక్షణ యిచ్చి పరిపక్వత కలిగించడానికి వస్తుంది. అందుకని చెడువచ్చినా, మంచివచ్చినా భగవంతుని యొక్క మహాకర్మ నామాన్ని ఆరాధన చేసుకుంటూ, అంగీకరించడం ఎవరు చేస్తారో, వారికి జీవితంలో ఇక పోరాటం వుండదూ, ఆరాటం వుండదు! నేను చేయాల్సినది చేస్తాను. నాకు వచ్చేది వస్తుంది, రానిది రాదు. 'ఒంటినిండా నూనె పూసుకుని పుట్టెడు నువ్వుల్లో దొర్లినా అంటినదే అంటుతుంది. అంటనిది అంటదనే' సామెత మనకు వుండనే వుంది కదా! కొంతమందికి ఎక్కువ గింజలు అంటుతాయి. కొంతమందికి తక్కువ గింజలు అంటుతాయి. అందరికీ సమానంగా అంటవు. అంటే చేసినవే నీవద్దకు వస్తూంటాయి. ప్రస్తుతం నువ్వు నిర్వర్తించవలసినదే నిర్వర్తించడం, వచ్చే వాటికి వడి పట్టడమే. ఈ విధంగా భగవంతుని యొక్క శిక్షణము, అనుభూతి, అనుగ్రహము పొందడం తను పొందే కర్మలో చేసుకోవడం మహాకర్మలో భాగం. మనం అన్నీ మంచిగా వుండాలని చెసుకుంటే కొన్ని మంచిగా తయారవ్వవు. ఇంకో రకంగా తయారౌతాయి. శుభమా అని కొడుక్కి పెళ్ళి చేస్తే కోడలు మన నుండి కొడుకును వేరుచేస్తుంది. కొడుకును నీనుండి వేరుచేసే కోడలు నీకెందుకు దొరికిందీ? శుభమా అని కూతురి పెళ్ళి చేస్తే, మాస్టారు చెప్పినట్లు దశమగ్రహం అయ్యి మనల్ని పీడించాడనుకోండి. పీడించే అల్లుడు నీకే ఎందుకు దొరికాడు? చాలా మంది వ్యాపారాలు చేస్తే లాభాలు వచ్చినాయి. అదే వ్యాపారం మనం చేస్తే మనకి నష్టం వచ్చింది. మాస్టరుగారి దగ్గఱకు ఒకాయన వచ్చి 'అందరూ వ్యాపారాలు చేశారు, లాభాలు వచ్చినాయి. నాకు మాత్రం నష్టం వచ్చింద'న్నాడు. ' నీకే ఎందుకు నష్టం వచ్చిందో యింటికెళ్ళి ఒక్కసారి వెనక్కి తిరిగి నువ్వే చూసుకో' అని పంపేసి 'మనది

కానిది మన వద్దకు వస్తుందా మంచైనా, చెడైనా' అన్నారు. ఆయన ఎంత ఉన్నతమైన భావంలో వుండకపోతే అది చెప్పగలుగుతారండీ? ఒకరి విషయంలో నేనొక ప్రణాళిక చేసి ఇస్తే, ఇలా అయితే అద్భుతంగా నడిచిపోతుంది అతని జీవితం అని. 'ప్రణాళికను విని నేను చాలా సంతోషించానోయ్. వాడది అందుకుంటాడో లేదో అనేది నీచేతిలో, నాచేతిలో లేదు. వాడి చేతిలో వున్నది. ప్రయత్నం చెయ్యి'. అన్నారు మాస్టారు. ఎంత నిర్లిప్తత! ప్రణాళిక బావున్నా, మనకది బాగుండక పోవచ్చు. మనకి బావుంటుందనుకుంటే ప్రణాళిక ఎలాంటిదైనా అందులోంచి బాగే వస్తుంది. 'అదృష్టం' అంటే 'కనబడనిది' అని. కనబడనిది అంటే ఇది వరకు చేసిన మంచి, చెడు అలా వేలాడుతూంటుంది. అది వస్తూ వుంటుంది. వచ్చేది ఎవరి ద్వారా వస్తుందో వారియందు ద్వేషం పెంచుకోకుండా, మనదే మన వద్దకు ఏదో ఒక వాహిక ద్వారా వచ్చింది. మనది కానిది రాదు. ఈ అవగాహన కావాలంటే ఈ నామం బాగా ఒకటికి పదిసార్లు నెమరువేసుకోవాలి. ఒక్కోసారి మన పై అధికారి మంచివాడు కాకపోవచ్చు, మనకి మంచి వూరుకి transfer కాకపోవచ్చు. 'ఏంటండీ' అంటే? అంతే అని అంగీకరించితే సగం కష్టాలు తగ్గిపోతాయండీ. Accepance is 50% of accomplishment అంటారు. What is the next fifty? What we should do in this situation? ఆ సన్నివేశంలో మనదైన ప్రయత్నం చేయాలి. ఊరికే వచ్చిందల్లా అంగీకరించడం కాదు. వచ్చింది, అంగీకరిస్తూ, దానియందు మన కర్తవ్యాన్ని నిర్వర్తించాలి, నిస్పృహ చెందకుండా. ఇది కావాలంటే ఈ నామం యొక్క అవగాహన కావాలి. ఇందులో భాగంగానే జీవితంలో బాగా కష్టపడ్డ మహాత్ముల జీవితాల కథలు చదువుకోవాలి. తెలిసి తెలిసీ ఏసుక్రీస్తు ఏ విధంగా జీవితం నిర్వర్తించాడు. శిష్యుడు రాగానే తెలుసు, ఇతడే ultimate గా నన్ను అప్పగిస్తాడని. 12 మంది ఎప్పుడూ ఆయన చుట్టూ తిరుగుతూండే వారు. అందులో ఒకడు ఖచ్చితంగా తనను తీసుకువెళ్ళి అప్పజెప్తాడని తెలుసు. తన నిర్యాణానికి, తన అంత్యక్రియలకీ వాడే కారణం అని తెలుసు. వాడే వచ్చి చేరాడు. ఇంట్లో పాము వచ్చి చేరిందండి. చాలా అవగాహన కావాలి. తన మొత్తం ప్రణాళికలో వీడొక భాగం అనుకున్నాడాయన. అందుకనే 12 మంది చేరి 'Last Supper' చేస్తుంటే, 'ఇంకో మూడు రోజుల్లో వారికి దొరికి పోతాను' అంటాడు. 'నువ్వెలా దొరుకుతావు, నువ్వు మహత్తరమైన వ్యక్తివి కదా! నిన్ను వారు పట్టుకోగలరా?' అంటారు. 'అది దైవ నిర్ణయం' అంటాడు. 'ఎట్లా నిర్వర్తింపబడుతుంది?' అంటే 'మీలో ఒకరు పట్టిస్తారు' అని ఎవరు పట్టిస్తారో వాడి కళ్ళల్లోకి చూస్తాడు. వాడు సగం చచ్చి పోతాడు. 'మాలో ఒకరు నిన్ను యెలా పట్టిస్తారు, పట్టించినా మేము విడిపించుకుంటాము' అంటాడు వాళ్ళల్లో ఒకడు. 'నువ్వు నన్ను రక్షించుకోలేవు, అంతే కాదు మూడు సార్లు నన్ను నువ్వు నిరాకరిస్తావు' అంటాడు. తరాత ఆ శిష్యుడే తన ప్రాణం కోసం భయపడి క్రీస్తు యెవరో తెలియదని మూడుసార్లు చెప్తాడు. అన్నీ తెలిసి తెలిసీ కూడా అంగీకరించాడుటా అంటే యెంత తెలిసినవాడై వుండాలి. ఇంతే కాదు 'నన్ను శిలువ వేశాక, నేను మరణించాక అదే దేహంలోకి నేను వచ్చి కనిపిస్తాను' అంటాడు. ఒక దివ్య ప్రణాళిక జరుగుతూవుంటే, అందులో తనవంతు కర్తవ్యం నిర్వర్తించేవాడు, తన

దగ్గఱికి వచ్చింది మంచైనా, చెడైనా ఆ ప్రణాళికలో భాగంగానే తీసుకుంటాడు. మాస్టరుగారు మోతుగూడెం నుండి అనారోగ్యంతో యింటికి వచ్చినపుడు ఒకటి చెప్పారు. 'మోతుగూడెం తీసుకెళ్లినవారిని తిట్టిపోయకండి. మోతుగూడెం నేను వెళ్ళడానికి వారు నిమిత్తకారణం. అక్కడ దోమకుట్టడం నిమిత్తకారణం. నిమిత్తాన్ని దూషించవద్దు. దానివెనకాల వుండే క్రమం, కర్మం దాన్ని అవగాహన చేసుకోండి'. అందుకే ధర్మరాజు దూషించడు. రాముడు దూషించడు. లక్ష్మణుడు దూషిస్తే లక్ష్మణుడికి బుద్ధి చెప్తాడు. ఎవర్నీ దూషించడు. తన పని చేసుకుంటాడంతే. రావణుడ్ని దూషించడు. ఒకటికి రెండుసార్లు మంచి చెప్తాడు. వినలేదు. కొట్టేస్తాడు. కొట్టాక ద్వేషం లేదు. ఇవన్నీ ఎక్కడ నుండి వస్తాయి? దివ్యప్రణాళికలో భాగంగా మనం వున్నాం. అంతా మహాత్ములు గనుక అలాగ వున్నారు అనుకోకండి. మనం కూడా అలా తీసుకుని జీవించడానికి ప్రయత్నం చేయాలి. కొంతమంది నిష్కారణంగా తిట్టిపోస్తారు, కొంతమంది నిష్కారణంగా అపకారం చేస్తారు. కొంతమంది వలన నష్టం కలుగుతుంది. అప్పుడు మాష్టారు అడిగిన ప్రశ్న గుర్తుకు రావాలి. 'నిన్నే యెందుకు తిట్టాడు వాడు. నీకే యెందుకు అపకారం జరిగిందీ? నీకే నష్టం యెందుకు వచ్చింది? వాడు అందరికీ నష్టం కలిగించాడా? నీకొక్కడికే నష్టం కలిగించాడా? నీకు మాత్రమే నష్టం యెందుకు కలిగించాలి? వాడి ద్వారానే అనేది వదిలేసి నీది నీవద్దకు వచ్చింది పాతదేదో clear అయిపోయిందనుకో'. అన్నారు మాస్టారు. వాళ్ళు యెవరో మనల్ని విపరీతంగా తిట్టి పోయాలనుకోండీ, మనకుండే కర్మ పరిపాకం బట్టి, ఇంట్లో ఇంటావిడా అదే చేసిందనుకోండీ పూర్తయిపోయిందిగా సులభంగా. Office లో subordinate అందరి ముందూ నానా మాటలూ అనే కార్యక్రమం వుందనుకోండి. ఇంట్లో మీ కుర్రవాడు యెదురు తిరిగి యేదో మాట అన్నాడనుకోండి. ఇది గుట్టుగా జరిగిపోయింది కదా! అదేమో రచ్చేపోయింది. అంటే కాలం ప్రకారం అలా కర్మఫలాలు వస్తూంటాయి. ఎవరిద్వారా వచ్చినా ఇస్తున్నవాడొకడే. ఇచ్చేవాడ్ని యముడంటాం మన భాషలో. యముడు కూడా వాడి స్వరూపమే. అతడికి accounts రాసిపెట్టే వాడొకడుంటాడు. అతడే చిత్ర గుప్తుడు. అతడి కింద ఒక పెద్ద accounting dept. అందరి లెక్కలూ రాస్తూంటారు. లెక్కల ప్రకారం కాలం రూపంలో అందించేస్తుంటారు. లెక్కకట్టి యిచ్చేయడం అన్నమాట. ఇచ్చేది పుచ్చుకోవడమే, ఇష్టం వున్నా లేకపోయినా అనే అవగాహన వుంటే భగవంతునికి సమర్పణగా అందుకోవడమే. అందుకుంటాను కానీ నిందా నష్టం, నిలబడే బలం మాత్రం నువ్వే యివ్వు. నీలో నేనుంటే నీ బలమే నా బలం. అది కారణం చేత యెంతదైనా దాటవచ్చు. సముద్రమంత దానిని బాలపరం గా దాటేస్తాం. అందుకని కర్మల విషయంలో మనం క్రుంగిపోకుండా, తేలి వుండాలంటే సమస్తమూ భగవంతుడిస్తున్నాడని ఒడి పట్టి వుండాలండీ, ఏమిచ్చినా కష్టమిచ్చినా, సుఖమిచ్చినా! ఇది చెప్పకోవడానికి చాలా బావుంటుంది. జరుగుతున్నప్పుడు చాలా కష్టంగా వుంటుంది. జరుగుతున్నప్పుడు యిది గుర్తు వస్తే అదృష్టం. జరుగుతున్నప్పడు యిది గుర్తుకు రావడం సాధన. కష్టం వచ్చినపుడు ఎప్పడో ఏదో చేశాం, యిప్పడు వచ్చింది. ఇప్పడైనా సవ్యంగా నిర్వర్తిద్దాం, అనుకుంటే ఇబ్బంది వుండదు. అంతేగానీ

వాడ్నీ, వీడ్నీ సాధించీ, వీడిచుట్టూ, వాడి చుట్టూ తిరిగీ, నాకే యెందుకీ కష్టం రావాలీ, నేనింత మంచివాడ్ని కదా, ఇలాంటివి పనికిరావు. మంచివాడివైతే నీకే యెందుకు వచ్చిందీ? నువ్విప్పుడు మంచివాడివి, అప్పుడో? చెట్టు చాటు నుండి వాలిని కొట్టడం గుర్తు వచ్చిందట కృష్ణుడికి బాణం కాలిలో తగిలినప్పుడు చిట్ట చివరలో. చూడండి యెంత తమాషాగా ఉంటుందో!. Account clear అయిపోయిందండీ. Over draft ఏదో ఓరోజు clear చేసుకోవాలి కదా! తన కాలి బొటనవేలికి ఓ కుర్రాడు చెట్టుచాటునుండి ఒక బాణం వేసి కొడితే, కృష్ణుడికి తాను వాలిని చెట్టుచాటున నిలచి బాణంతో కొట్టడం అన్న దృశ్యం గుర్తు వచ్చిందట ఓక్షణం. నవ్వుకున్నాడు, ఆయన కనక! 'తండ్రీ వీరేం చేయుచున్నారో వీరికి తెలియదు, వీరిని కోపింపక క్షమించు', అన్నాడు క్రీస్తు. మనం అలా అనగలమా? నాశనం అయిపోతే బావుణ్ణు అని అనమా! నిజంగా కష్టంలో వున్నప్పుడు మనలో వచ్చే భావాలుంటాయే అవి మన సాధనకి litmus test. ఒక మహాత్ముడి దగ్గరకు వెళ్ళి మన కష్టం చెప్పుకుంటే యెంత వూరట కలుగుతుందీ! 'మనది కానిది మన వద్దకు రాదులే, నీకెందుకూ దాటి వెళ్ళిపోతుంది. నీవు భగవంతుడిలో వుండు' అని చెప్తే ఎంత ఉపశమనం కలుగుతుంది. తెలిసిన వాడు ఉపశమనం కలిగించి, కర్తవ్యోన్ముఖులను చేస్తాడు.

# ౭౦౦ మహాతేజాః

మహా తేజస్సు. మిణుగురు పురుగులో వుండే వెలుగు అదే. అగ్గిపుల్ల గీస్తే వచ్చే వెలుగూ అదే అని గుర్తుపెట్టుకుంటామా! ఏదో యాంత్రికంగా వెలిగించేస్తాం. అగ్గిపుల్లలో వెలుగు కన్నా దీపం వెలగడంలోనూ, దాని వెలుగు లోనూ మనకి interest. అగిపుల్లలో వెలుగు లేకపోతే దీపానికి వెలుగు ఎట్లా వచ్చింది? అగ్గిపుల్లలో అంతర్లీనంగా వున్నది, బహిర్గతమైనది కదా! అది మనకు దీపపు వెలుగుగా వచ్చింది. మిణుగురు పురుగులో, అగ్గిపుల్లలో, దీపం వెలుగులో, చంద్రునిలో, సూర్యునిలో, ఆకాశంలోంచి వచ్చే వెలుగులో అదే తేజస్సు, కాంతి. ఎక్కడ ఎవరి కన్నుల లో వెలుగు వచ్చినా అదే! మహా తేజస్సు! కొంతమంది ముఖం చాలా కాంతిగా వుంటుంది. అంటే అదే వెలుగుతున్నదన్నమాట. బాగా తోమిన వెండి గ్లాసు యిక్కడ పెడితే, భలే మెరుస్తున్నది. మెరుగు పెట్టించారా అంటాం. మెరుగు పెట్టడం ఏమిటి, మెరుగు వున్నా దానిని మనం తోమక కనబడటం లేదు తప్ప, లేని మెరుపు వస్తుందా? వెండికి సహజమైన మెరుపు వుంటేనే కదా తోమితే వచ్చింది? అలాగే బంగారం కూడా ఏదో చేయడం వల్ల అది మెరుస్తోంది. అలాగే జీవుడు కూడా! మెరుపు సమస్తంలో అంతర్లీనంగా వున్నది. కొన్ని చోట్ల బహిర్గతంగా వున్నది. అంతర్ముఖంగా, బహిర్ముఖంగా వున్నదీ వెలుగే! చెట్టుకొమ్మను చూస్తే వెలుగు అంతర్లీనంగా వున్నదని గుర్తొస్తుందా! అదే పైన ఆకాశంలో చంద్రుడ్ని చూస్తే అహా! ఎంత బావున్నాడు చంద్రుడు అనిపిస్తుంది. మహాతేజస్సు ఎలా ఉంటుందయ్యా అంటే కొంత కప్పబడి, కొంత వ్యక్తమై వున్నది. అలా వుండడం వలనే మనకి తెలుస్తున్నది. అలాకాకుండా మొత్తం అంతా ఒకే వెలుగుగా వుందనుకోండి నడిచినప్పుడు ఒకళ్ళకి ఒకళ్ళు తట్టుకుని పడిపోతాం. ఏదీ కనబడదు. రకరకాల రంగులు లేకుండా, అంతా పాల వెలుగైతే మనమే ఒకళ్ళకి ఒకళ్ళము కనిపించం. అందుకని వెలుగుని కొంత మరుగుగాను, కొంత కనిపించేట్లుగాను అమర్చారు. అన్నిట్లోనూ వెలుగున్నది. అది ఎంత వెలుగంటే మహాతేజస్సు, ఊహించలేం. ఎందుకంటే నువ్వు కూడా అందులోంచి వచ్చావు. నువ్వు అందులోకి వెళ్లిపోతే నువ్వుండవు దాన్ని తెలుసుకోవడం కోసం. నువ్వు అదయిపోతావు. అదై పోయినపుడు తెలుసుకోవడానికి ఏం లేదు కానీ బయటికి వచ్చినప్పుడు మిణుకు మిణుకు మంటూ నువ్వుంటావు. ఆ తేజస్సు ముందు నువ్వు చాలా చిన్నవాడివి. ఆ తేజస్సు అపరిమితం అని చెప్పడానికి, ఆ తేజస్సే సమస్తమూ రూపుకట్టుకుని వుందని చెప్పడానికి, సమస్తమునూ తేజస్సుగా దర్శనం చేసే సాధన ఇవ్వడానికి ఈ నామం. ఒకే వెలుగు ఇన్ని రూపాలలో వుందని గుర్తుపెట్టుకోవాలని కదా అనుకుంటాం. కానీ మనలో వుండే అపవిత్రతవల్ల, అజ్ఞానం వల్ల అలా అనుకోము. అది తీసేసుకోవడానికి ఈ నామం నుండి మళ్లీ గుర్తు చేసుకుంటూంటాం.

## 701 మహోరగః

అంటే పెద్దపాము. వైకుంఠపాళిలో పెద్ద పాము ఎంతవారినైనా మింగేస్తుంది పరమపదానికి వెళ్ళేవరకు. వ్యక్తిగత స్వభావం వున్నంతవరకు పడిపోవడానికి అవకాశం వున్నది అని వైకుంఠపాళి చెప్తుంది. వ్యక్తిగత స్వభావం దాటినవాడు పరమ పదంలో వుంటాడు. వీడికిక కిందపడడం వుండదు. ఈ పామునే అనంతుడని, ఆదిశేషుడని, చుట్టలు చుట్టలుగా వుండే దానిమీద పడుకుంటాడనీ మనకి సంకేతపరంగా యిచ్చారు. 'అనంతదర్శనం' మాస్టారు భాగవతం లో ఇచ్చారు. దాని మనం చదవమేమొ అని వేరే చిన్న పుస్తకం కూడా అచ్చువేసి ఇచ్చారు. కాలము ఏ విధంగా మహోరగం గా మహా సమస్తాన్నీ వ్యక్తం చేసి, సిద్ధిపొందించి మళ్ళీ తనలోకి తీసుకుంటుందో, ఇన్ని పొరలలోనూ యెంత కథ దాగి వున్నదో, దాగి వున్న కథ ఏ విధంగా వ్యక్తం అవుతూ వుంటుందో, మళ్ళీ మడతలలోకి వెళ్ళి పోతూంటుందో...! ఎంత పెద్ద కష్టమైనా ఓ 4,5 ఏళ్ళు అయ్యేసరికి మర్చిపోతాం. మహత్తరమైన కష్టం అనుకో, అది వచ్చినపుడు గుండె పగిలేట్టుగా వుంటుంది. కష్టం లో వున్నప్పుడు అంత గుండె పగిలేట్లుగా వుండదు. ఎందుకంటే దాన్ని ఎదుర్కోవడానికి కావలసిన స్ఫూర్తి లోపల నుండి వచ్చి ఏదో దాంతో కుస్తీ పడుతూంటాం. 4, 5 ఏళ్ళు అయిపోయింది. కలలాగా వుంటుంది. గుర్తుకూడా వుండదు. కాలంలో అటువంటి మహత్యం వున్నది. బ్రహ్మాండమైన సత్కారం నిన్న జరిగిందనుకోండి. చేసినవారికి గుర్తుండదు మర్నాడు. చేసుకున్నవాడికి వుంటే ఓ 2 రోజులుంటుంది. తరువాత వాడికీ గుర్తుండదు. మడతల్లోకి వెళ్ళిపోతూంటుంది. అవే మడతల్లోంచి ఒక్కోసారి మనం వూహించనివి వస్తూంటాయి, అకస్మాత్తుగా. కక్కయినా, కళ్యాణమైనా అంటారుగా! అయిపోయిన తర్వాత కొన్ని రోజులకి మర్చిపోవూ? ఏదో యింట్లో మనిషి పోతారుట అనే వార్త మనకి భయంకరంగా వుంటుంది. మనం పోతాడు అనుకున్నప్పుడు వాడు పోడు. ఫరవాలేదు అనుకున్నప్పుడు పోతాడు. 'Death always knocks at your door by surprise' అని వాక్యం వున్నది. మాస్టారు ఏకాదశి నాడు పోతారని చాలా హడావుడి, గోల అయ్యా ఇంక కిందన పెట్టేద్దాం అనుకుంటే ఆయన recover అయిపోయారు మన భాషలో. ఇహ పర్వాలేదని అందరూ విశ్రాంతి తీసుకుంటుంటే ఆయన వెళ్ళిపోయారు. మరణిస్తున్న ఒక జీవి వద్ద అప్రమత్తంగా వుండే మరొక జీవి కూర్చుంటే మరణం దగ్గరకు రాదుట. అదొక రహస్యం. అందుకని ప్రక్కన కూర్చున్న జీవికి నిద్రో, మత్తో, మరుపనో కలిగించి పట్టుకుపోతారు. ప్రక్కన కూర్చున్న ఒక జీవి అప్రమత్తం గా ఉన్నంతసేపూ జీవిని తీసుకు వెళ్ళలేరుట. అందుకని అక్కడే వున్న ఆ జీవికి మత్తో, నిద్రో ఏదో ఒకటి పెట్టి తీసుకుపోతారుట. అక్కడే ఉన్నా కొంచెం alert గా లేకపోతే పట్టుకుపోతారుట. ఇలాంటివి కొన్ని అనుభవం మీద చెప్పిన విషయాలు. మహా ఉరగం చేసేదేమంటే యెంతటి విపత్తునైనా మరపింపచేస్తుంది. ఎంత వైభవాన్నయినా మరపింపచేస్తుంది. ఎంత అకస్మాత్తుగా బయటికి తెస్తుందో, అంత సున్నితంగానూ

మళ్ళీ మడతల్లోకి తీసుకు పోతుంది. కాలం మడతల్లోకి అసత్యాన్నంతా హరించేస్తుంది. సత్యాన్ని మాత్రమే నిలుపుతుంది. కొంతమంది చాలా గొప్పగా బతికి, యెన్నో వైభవమైన కార్యాలు జరిపించుకుని, సకల గుణాభిరాముడిగా కీర్తి పొంది, ప్రపంచంలో రకరకాల సత్కారాలు పొంది, ఇలా రకరకాలుగా manage చేశాడనుకోండి, వెళ్ళిపోయాక వారు చేసిన వాటిన్నన్నింటినీ కాలం బయటికి తీసుకొస్తుంది. కాలం అసత్యాన్ని హరించేసి, సత్యాన్ని పెంపొందిస్తుంది. అకస్మాత్తుగా మడతల్లోంచి కొత్తకొత్త విషయాలు బయటకు పట్టుకొస్తూంటుంది. చాలా విషయాలు మంచిగానీ, చెడుగానీ ఊహించనివి జరుగుతూవుంటాయి. ఊహించినవి జరగవు. అవి మడతల్లోంచి విచ్చుకుంటూ వస్తాయి. మళ్ళీ మడిచేస్తుంది. నిన్న మడిచేసింది, రేపు మడతలో వున్నది, ఇవాళ తెరిచి వుంచింది. ఇవాళంతా అనడానికి కూడా వీలులేదు. 'ఇప్పుడే' ప్రస్తుతం తెరిచి వుంటుంది. భవిష్యత్తు మూసివుంది. భూతం కూడా మూసివుంది. ఎప్పటికప్పుడు అలా ప్రస్తుతాన్ని తెరిచివుంచి మిగిలినవి మూసివుంచేది మహత్తరమైన కాలం. అనంతమైన గర్భంలో వున్నాయి. రాబోయేవి, అయిపోయినవీ, అయిపోయినవాటిలో సత్యాన్ని వెలికి తీసుకు వస్తుంది కాలక్రమేణ. అసత్యాన్ని పెంపొందించి భూమిమీద స్థాపించినా పట్టేసి తీసుకెళ్ళిపోతుంది. ఎలా వుంటుందంటే 500 ఎళ్ళ క్రితం ఉండీ భగవంతునిమీద పాటలు పాడిన అన్నమాచార్యులవారిని బయటకు తీసుకు వస్తుంది. అదే సమయంలో ఎంతో వైభవంతోనూ, కీర్తి ప్రతిష్టలతోనూ, బతికిన వాడిని కాలగర్భంలోకి లాగేస్తుంది. అన్నమాచార్యుల వారు బతికిన సమయంలో ఆయనకన్నా చాలా వైభవంగా సమకాలికం గా బతికినవారు చాలా మంది ఉండి వుండవచ్చు. వారి గురించిన చరిత్ర ఏమీ వుండదు. అది మింగేస్తుంది. ఇది బయట పెడుతుంది. సత్యాన్ని మాత్రమే నిలుపుతుంది. ఏసుక్రీస్తు చరిత్ర ఎవరికి తెలుసు? 300 ఏళ్ళ తరువాత బయట పడ్డది. ఎవరూ రాయలేదు. సమకాలికులు కూడా రాయలేదు. అయ్యో నేనింత చేశానే ఎవరూ రాయలేదే, అని క్రీస్తు బాధ పడలేదు కాబట్టి కాలమే బాధపడి రాసేసింది. అందుకని తన గురించి తను Autobiography రాసుకునేవాడు చాలా దుర్బలుడు అని మహాత్ములు చెప్తారు. నీగురించి నీవు రాసుకోవడం ఎందుకు? రాసుకుంటే నీగురించి నువ్వు గొప్పగా రాసుకుంటావు. తర్వాత కాలక్రమంలో అవన్నీ శుద్ధతప్పులూ, అబద్ధాలు అని తెలుస్తాయి. నీలో సత్యం వుంటే కాలం నిలుపుతుంది. నీలో సత్యం లేకపోతే కాలం తీసేస్తుంది. అందుకే మహాత్ములు తమ గురించి తాము రాసుకున్నది లేదు. రాముడు రాసుకోలేదు. కృష్ణుడు రాసుకోలేదు. ఋషులు ఎవ్వరూ తమ గురించి రాసుకోలేదు. తన గురించి తను రాసేది పూర్ణజ్ఞానం లేనివాడే. తానెవరని తన గురించి రాస్తున్నాడు? అతడే తను కదా! తన చరిత్ర కళ్యాణప్రదంగా భూమి మీద నిలవాలంటే అది భగవంతుడు చూసుకుంటాడు. నీ చరిత్ర అంత కళ్యాణప్రదం కాదేమో నీకు తెలీదు కదా! ఎవరి చరిత్ర కాలం బయటికి తెస్తుంది, ఎవరి చరిత్ర మరుగుకి తీసుకు వెళ్తుంది మనం చెప్పలేం. చెప్పడానికి ఒకే ఒక కొలబద్ద వున్నది. అది సత్యం! ఉదాహరణకి 30ఏళ్ళ తరువాత అప్పలాచార్యులవారి ద్వారా మానాన్నగారి చరిత్ర బయటికి వచ్చింది.

మనం రాసుకోవడం కాదు. ఎక్కడ సత్యం వుంటే దానిని వ్యక్తం చేస్తూ, అసత్యాన్ని తన గర్భంలోకి తీసుకు పోతుంది కాలం. ముందు తెలియనివ్వదు. పాతది మరిచేలా చేస్తుంది. ఇంత కష్టం మనమే పడ్డామా అనిపిస్తుంది కష్టం అయిపోయాక. కష్టంలో వున్నంతసేపూ వొళ్ళు తెలియకుండా పని చేస్తాం. పెళ్ళి చేసినా అంతే, గురుపూజలు వచ్చినా అంతే. కొంతమంది వొళ్ళు విరుచుకుని చేస్తారు. వాళ్ళకి అప్పుడే గురుపూజలు అయిపోయాయా, ఒక కలలాగా అయిపోయిందనిపిస్తుంది. వాళ్ళు అందులో వున్నప్పుడు పూర్తి అప్రమత్తతతో జీవించి కర్తవ్యాలు నిర్వర్తిస్తుంటారు కాబట్టి కష్టం తెలియకుండా అయిపోతుంది. అందుకని కష్టం గురించిన భావనే ఎక్కువ కష్టం. కష్టంలో వున్నప్పుడు దానియందు మనం నిమగ్నులమై వుండి మన వంతు కర్తవ్యం నిర్వర్తిస్తుంటాం కాబట్టి అంత కష్టంగా అనిపించదు. ఇవన్నీ కాలం చేసే కొన్ని అద్భుతాలు. అందుకని కాలము గురించి అవగాహన చేసుకోలేము అంటారు. 'కాలము విచిత్రము, దుస్తరము ఎట్టివారికైనా' దుస్తరము అంటే దాటి వెళ్ళలేరని, అన్నాడు భీష్ముడు. కనుక కాలమునకు లోబడి కర్తవ్యము నిర్వర్తించుకోవడమే!

★★★★★★

# విష్ణు సహస్రనామ పారాయణ ప్రాశస్త్యము

మానవుడు తన్ను తాను పవిత్రీకరించుకుని భగవత్ అనుభూతిని పొందుటకు 'భగవంతుని యొక్క నామములను సర్వదా కొనియాడుచుండుట' అను ఒక సులభమైన మార్గమును, మనకి భగవంతుడైన శ్రీకృష్ణుడు భీష్ముని ద్వారా ఇచ్చుట జరిగినది. కలియుగములో అతి సులభమైన పద్ధతిలో భగవంతుని అనుభూతి పొందుటకు అవకాశము ఎక్కువగా వున్నదని తెలియుచున్నది. ధ్యానములు, యోగములు, తంత్రములు, మంత్రములు - ఇవన్నీ చేయగలిగిన శక్తి సామర్ధ్యములు కలియుగములో మానవునికి ఉండకపోవడమే కాక, కొంత అలసత్వం, కొంత మంద బుద్ధి దానికి తోడవుట వలన, స్తోత్రాదుల తో భగవంతుని యొక్క నామములను ఎక్కువగా స్మరణము చేసుకొనుట ద్వారా, సులభముగా తన్ను తాను పవిత్రీకరించుకుని, భగవంతుని యందు నిలబడుటకు అవకాశము ఏర్పడగలదని శ్రీకృష్ణుడు ఉద్ధవునకు చెప్పుట జరిగినది.

ఆ మార్గములోనే మనకి వేదవ్యాస మహర్షి, శంకరాచార్యులవారు, ఇతర ఋషులు, రకరకములైన స్తోత్రములు యిచ్చి వున్నారు. అవి ఎంత చేసుకుంటూ ఉంటే, అంత మనయందు, మన పరిసరముల యందు వాతావరణము పరిశుద్ధి చెందుట జరుగుతుంది. ఎంత ఎక్కువగా వీలుంటే అంత ఎక్కువగా, సామూహికముగా భగవంతుని నామ పారాయణము చేసుకొనుట ఆయన మనకి ఇచ్చిన అతి ముఖ్యమైన సందేశములలో ఒకటి. దాన్ని అనుసరించి విష్ణు సహస్రనామములను కొనియాడుతూ, అవగాహన చేసుకొనుచూ, ఆ మార్గాన భగవంతుని యందు జీవించుటకు భక్తి శ్రద్ధలతో ప్రయత్నము చేయవలెను. భగవంతుని ఈ మార్గములో అనుభూతి చెందుటకు శ్రద్ధ, ఓర్పు బాగా అవసరము. ఓర్పు కలిగినకొద్దీ శ్రద్ధ పెరుగుతూ ఉండుట జరుగును. శ్రద్ద పెరిగినకొద్ది ఓర్పు పెరుగుతూ వుండును. ఒకదానిని ఒకటి ఇలా పెంచుకొనుచూ మనము మనని పవిత్రీకరించుకొనుచూ, కాలము యొక్క ఇబ్బందులకు గురి కాకుండా భగవంతుని యొక్క రక్షణలో జీవించుటకు అవకాశము కల్పించుకోవడము అవసరము.

-కంభంపాటి పార్వతీ కుమార్